వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

వన పర్వం - 2



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

9435

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

వన పర్వం - 2

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894 827781
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

వన పర్వం - 2

ప్రథమ ముద్రణ : వికృతి ఉగాది (మార్చి) 2010

18 సంపుటాల వెల : రూ. 720/-

C 27454

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A.C.No. 96355
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

అమ్మానాన్నలు : **కరెడ్ల గోపాలకృష్ణమూర్తి, కమలమ్మ**

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలతో....

వెంకట సీతారామశాస్త్రి, సుందరశర్మ, శ్రీనివాస్

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్మిల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.

కీ॥శే॥ పరుచూరు నాగేశ్వరరావు గారు

వారి జ్ఞాపకార్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు వెంకటమోహన్ బాబా

వెంకటరామ సురేష్

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి జ్ఞాపకార్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు శ్రీనివాస్, సత్యనారాయణ (చినబాబు)

భవాని, విశాలాక్షి

ఎందరో మహానుభావులు

వన పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, డాక్టర్ రేమెళ్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, డాక్టర్ నిట్టల సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి, డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ, డాక్టర్ ఆకొండి విశ్వనాథం, శ్రీ జన్నాభట్ల వీరేశ్వర శాస్త్రి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంతా తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వంతానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో

సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు తక్కువ వెలలో అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకుంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా। తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా। సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా। ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.		శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది. ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణమని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులు ప్రతినిధులనుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ

ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమ్మతవీరులను కూడా చూపించారు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యధాతధంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యధాతధంగా అవగా అధికపాఠాలతో సహా ఇచ్చాం అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
159.	ఆర్ష్టిషేణుడు యుధిష్ఠిరునకు ఉపదేశము చేయుట. (32)*	19
160.	పాండవులు ఆర్ష్టిషేణుని ఆశ్రమమున వసించుట – మణిమంతుని వధ. (77)	21
161.	యుధిష్ఠిరుడు గంధమాదనమున కుబేరుని దర్శించుట. (63)	24
162.	కుబేరుడు పాండవులకు ఉపదేశము చేయుట. (38)	27
163.	ధౌమ్యుడు ధర్మజునకు బ్రహ్మాదుల స్థానములను చూపుట. (42)	29
164.	అర్జునుడు పాండవుల కడకు వచ్చుట. (20)	32
	10. నివాతకవచ యుద్ధ పర్వము - 11	
165.	అర్జునుడు గంధమాదన పర్వతమున సోదరులను కలియుట. (14+$\frac{1}{2}$)	33
166.	ఇంద్రుడు పాండవులను అనునయించి స్వర్గమున కేగుట. (17+1)	34
167.	పాశుపతాస్త్ర ప్రాప్తిని గురించి అర్జునుడు వివరించుట. (57)	35
168.	స్వర్గమున అర్జునుని అస్త్రవిద్యాభ్యాసము. (86)	38
169.	అర్జునుడు నివాతకవచులతో యుద్ధము ప్రారంభించుట. (24)	42
170.	అర్జునుడు నివాతకవచులతో యుద్ధమొనర్చుట. (29)	43
171.	దానవుల మాయా యుద్ధము. (30)	45
172.	అర్జునుడు నివాతకవచులను సంహరించుట. (35)	46
173.	అర్జునుడు పౌలోమ కాలకేయులను సంహరించుట. (75+2$\frac{1}{2}$)	48
174.	అర్జునుని యాత్రా వృత్తాంతము విని ధర్మరాజు అభినందించుట. (17)	52
175.	అర్జునుని దివ్యాస్త్రప్రదర్శనమును నారదుడు నివారించుట. (25)	53
	11. ఆజగర పర్వము - 6	
176.	పాండవులు గంధమాదనమునకు వెడలుట. (23)	54

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
177.	గంధమాదనము నుండి పాండవులు బదరికాశ్రమము ద్వారా ద్వైతవనము చేరుట. (24)	56
178.	అజగరము భీముని పట్టుకొనుట. (33)	58
179.	సర్పరూపుడయిన నహుషునితో భీముడు సంభాషించుట. (54)	60
180.	ధర్మరాజు నహుషుని ప్రశ్నలకు సమాధానములొసంగుట. (38)	63
181.	నహుషుని శాపవిముక్తి. (49+2)	65
	12. మార్కండేయ సమాస్యాపర్వము - 51	
182.	పాండవులు ద్వైతవనము నుండి కామ్యకవనము చేరుట. (18)	68
183.	సత్యాకృష్ణులు, నారదమార్కండేయులు కామ్యకవనము చేరుట. (95)	69
184.	మార్కండేయుడు విప్రమాహాత్మ్యమును చెప్పుట. (23+1 $\frac{1}{2}$)	75
185.	అత్రిముని, పృథుమహారాజుల ప్రశంస. (37)	76
186.	తార్క్ష్య సరస్వతీ సంవాదము. (30)	78
187.	వైవస్వతమనువు చరిత్రము. (58)	81
188.	కలి ప్రభావము - మార్కండేయుడు వటపత్రశాయిని దర్శించుట. (143+1)	83
189.	వటపత్రశాయి మార్కండేయునకు తన్ను గురించి తెలుపుట. (59)	91
190.	కలి యుగలక్షణములు - కల్క్యవతారము. (97+ $\frac{1}{2}$)	94
191.	కల్కి కృతయుగమును స్థాపించుట. మార్కండేయుడు ధర్మరాజుకు చేసిన ఉపదేశము. (35)	99
192.	శల,దలుల చరిత్ర; వామదేవ మాహాత్మ్యము. (72)	100
193.	ఇంద్ర బక సంవాదము. (37)	105
194.	రాజమహిమ విషయమై శిబి సుహోత్రుల ప్రశంస. (8)	107
195.	యయాతి గోదానము చేయుట. (6)	108
196.	సేదుకవృషదర్భుల చరిత్రము. (13)	109
197.	ఇంద్రాగ్నులు శిబిని పరీక్షించుట. (28)	109

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
198.	నారదుడు శిబి మాహాత్మ్యమును చెప్పుట. (27)	111
199.	ఇంద్రద్యుమ్నుని వృత్తాంతము. (18)	114
200.	దానము, శ్రాద్ధము, అతిథిసత్కారము వాక్శుద్ధి గాయత్రీజపము - మొదలగు వాని వర్ణనము. (129)	116
201.	ధుంధుమారోపాఖ్యానము. (34)	124
202.	బృహదశ్వుని ద్వారా ధుంధుని వధించవలెనని ఉత్తంకుడు భావించుట. (31)	125
203.	విష్ణువు మధుకైటభులను వధించుట. (35)	127
204.	కువళాశ్వుడు ధుంధుని సంహరించుట. (45)	129
205.	పతివ్రతా మహత్త్వము. (24)	131
206.	కౌశిక పతివ్రతా సంభాషణము - బ్రాహ్మణ ధర్మ వర్ణనము. (48+$\frac{1}{2}$)	133
207.	కౌశిక ధర్మవ్యాధుల సంవాదము. (99+1$\frac{1}{2}$)	136
208.	హింసాహింసల నిర్ణయము. (29)	142
209.	ధర్మసూక్ష్మత, పరబ్రహ్మప్రాప్త్యుపాయము. (56)	144
210.	సత్సంగత్యము - బ్రహ్మవిద్యావర్ణనము. (21)	148
211.	పంచమహాభూతాల గుణములు - ఇంద్రియ నిగ్రహము. (27)	150
212.	త్రిగుణస్వరూపము - వాని ఫలము. (12)	151
213.	ప్రాణవాయుస్థితి - పరమాత్మ సాక్షాత్కారము. (40+3$\frac{1}{2}$)	152
214.	మాతాపితృసేవ - ఫలితము. (28)	156
215.	ధర్మవ్యాధుని పూర్వజన్మ వృత్తాంతము. (31)	157
216.	కౌశికుని స్వగృహగమనము. (37)	159
217.	బృహస్పతి అగ్ని పుత్రుడగుట-జననము. (21)	161
218.	అంగిరసుని వంశ వర్ణనము. (8)	163
219.	బృహస్పతి సంతాన వర్ణనము. (25)	163

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
220.	పాంచజన్యాగ్ని జననము – సంతతి. (20)	165
221.	తపుడు – భానువుల సంతతి వర్ణనము. (31)	167
222.	సహుడు అను అగ్ని జలప్రవేశము; అధర్వాంగిరసుని వలన అగ్ని ప్రకటితమగుట. (32)	169
223.	ఇంద్రుడు కేశిదానవుని నుండి దేవసేనను విడిపించుట. (15+2 ½)	172
224.	దేవసేనతో ఇంద్రుడు బ్రహ్మసన్నిధికి, బ్రహ్మర్షుల సన్నిధికి వెళ్ళుట; అగ్ని కాముక వృత్తాంతము. (42)	173
225.	కుమారస్వామి జననము, క్రౌంచ పర్వత ఖండనము. (39+ ½)	175
226.	స్కందునికి జాతకర్మాదులు – అగ్నిదేవాదుల రక్షణము. (29)	178
227.	ఓడిపోయి శరణు కోరిన ఇంద్రాదులకు స్కందుని అభయప్రదానము. (18)	180
228.	కుమారస్వామి అనుయాయుల వర్ణన. (15)	181
229.	స్కందుని దేవసేనాపతిత్వము – దేవసేనతో వివాహము. (52)	182
230.	కృత్తికలకు నక్షత్ర మండలస్థానప్రాప్తి; కష్టప్రద గ్రహములు. (59)	185
231.	స్కందుడు స్వాహాదేవిని గౌరవించుట, శివదేవగణసహిత స్కందుని భద్రవటగమనము. (113+ ½)	189
232.	స్కందుని ప్రసిద్ధనామములను జెప్పుట, ఆయన స్తుతి. (21)	196
	13. ద్రౌపదీ సత్యభామా సంవాద పర్వము - 3	
233.	ద్రౌపదీ సత్యభామా సంవాదము. (61+1)	197
234.	భర్తను అనుకూలుని చేసికొను ఉపాయము. (12)	201
235.	శ్రీకృష్ణగమనము. (18)	202
	14. ఘోషయాత్రా పర్వము - 22	
236.	పాండవులను గురించి విని ధృతరాష్ట్రుడు చింతించుట. (31)	203
237.	పాండవుల దగ్గరకు వెళ్లుమని కర్ణశకునులు దుర్యోధనుని ప్రోత్సహించుట. (23+1 ½)	205

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
238.	ఘోషయాత్రానుమతికై దుర్యోధనుడు ధృతరాష్ట్రునికడ కేగుట. (24)	207
239.	ధృతరాష్ట్రుని అనుమతితో దుర్యోధనుడు బయలుదేరుట. (29)	208
240.	గంధర్వ దుర్యోధనసేనా సంవాదము. (31+$\frac{1}{2}$)	210
241.	కౌరవులు గంధర్వులతో యుద్ధము చేయుట, కర్ణుని పరాజయము. (32+$\frac{1}{2}$)	211
242.	గంధర్వులు దుర్యోధనాదులను అపహరించుట. (22)	213
243.	దుర్యోధనుని విడిపించుటకు భీమసేనుని ఆదేశించుట - అర్జునుడు ప్రతిజ్ఞ చేయుట. (22+15$\frac{1}{2}$)	214
244.	పాండవగంధర్వ సంగ్రామము. (22)	216
245.	పాండవుల చేతిలో గంధర్వులు ఓడిపోవుట. (30)	217
246.	దుర్యోధనుడు విడుదల అగుట. (27+1)	219
247.	దుర్యోధనుడు విశ్రమించుట. (16)	221
248.	దుర్యోధనుడు తన పరాజయమును వివరించుట. (16+$\frac{1}{2}$)	221
249.	దుర్యోధన ప్రాయోపవేశము. (41+$\frac{1}{2}$)	222
250.	దుర్యోధనుని ప్రాయోపవేశ విరమణకై విఫలయత్నము. (13+$\frac{1}{2}$)	224
251.	శకుని దుర్యోధనుని అనునయించుట దుర్యోధనుడు రసాతలమునకు కొనిపోబడుట. (30)	225
252.	దానవప్రబోధము - కర్ణుని పట్టుదలతో దుర్యోధనుడు దీక్ష విరమించుట.(52+1$\frac{1}{2}$)	227
253.	కర్ణ దిగ్విజయము. (29)	230
254.	కర్ణదిగ్విజయము - హాస్తినలో సత్కారము. (36)	231
255.	దుర్యోధనుని వైష్ణవయాగసమారంభము. (25+1)	233
256.	దుర్యోధన వైష్ణవయాగ పరిసమాప్తి. (27)	234
257.	అర్జునసంహారమునకై కర్ణప్రతిజ్ఞ - ధర్మజుని చింత. (28+$\frac{1}{2}$)	236
	15. మృగ స్వప్నోద్భవ పర్వము - 1	
258.	పాండవులు కామ్యకవనమునకు వెడలుట. (17)	237

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	16. వ్రీహి ద్రౌణిక పర్వము - 3	
259.	వ్యాసమహర్షి పాండవులకు దానమహిమను చెప్పుట. (35+$\frac{1}{2}$)	238
260.	దుర్వాసుడు ముద్గలుని దాననిష్ఠను పరీక్షించుట. (36+$\frac{1}{2}$)	240
261.	ముద్గలుడు స్వర్గలోకమును నిరాకరించుట - వ్యాసుడు యుధిష్ఠిరుని ఓదార్చి వెడలుట. (51)	243
	17. ద్రౌపదీహరణ పర్వము - 10	
262.	దుర్యోధనుడు దుర్వాసుని యుధిష్ఠిరుని కడకు పంపుట. (28)	246
263.	శ్రీకృష్ణుడు పాండవులను దుర్వాసుని బారినుండి రక్షించుట. (49)	248
264.	జయద్రథుడు ద్రౌపదిని మోహించి కోటికాస్యుని ఆమెకడకు పంపుట. (17)	250
265.	కోటికాస్యుడు ద్రౌపదికి తన్ను పరిచయము చేసికొని ఆమెను గూర్చి అడుగుట. (14)	251
266.	ద్రౌపది కోటికాస్యునకు సమాధానమిచ్చుట. (9)	252
267.	ద్రౌపదీ జయద్రథుల సంవాదము. (20+4)	253
268.	జయద్రథుడు ద్రౌపదిని బలవంతముగా ఎత్తికొనిపోవుట. (28)	255
269.	పాండవులు మరలివచ్చి ద్రౌపదీహరణమును గూర్చి విని జయద్రథుని వెన్నంటుట. (28)	257
270.	ద్రౌపది పాండవుల పరాక్రమమును జయద్రథునికి చెప్పుట. (21)	259
271.	జయద్రథుడు ద్రౌపదిని విడిచి పారిపోవుట - భీమార్జునులు అతనిని వెన్నంటుట. (60)	261
	18. జయద్రథవిమోక్షణ పర్వము - 1	
272.	యుధిష్ఠిరుడు జయద్రథుని విడిపించుట - అతడు తపముచేసి శివుని వలన వరము పొందుట. (81+$\frac{1}{2}$)	264
	19. రామోపాఖ్యాన పర్వము - 20	
273.	యుధిష్ఠిరుడు తన దురవస్థకు దురపిల్లుచు మార్కండేయుని ప్రశ్నించుట. (12)	269

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
274.	శ్రీరామాదుల జననము - కుబేరోత్పత్తి. (17)	270
275.	రావణకుంభకర్ణాదుల ఉత్పత్తి - కుబేరుడు రావణునకు శాపమునిచ్చుట. (40)	271
276.	బ్రహ్మ ఆజ్ఞానుసారముగా దేవతలు ఋక్షవానరులయందు పుట్టుట. (16)	274
277.	రాముని వనవాసము - రాముడు ఖరదూషణులను సంహరించుట. (56+ ½)	275
278.	మారీచ వధ - సీతాపహరణము. (43)	278
279.	రావణుడు జటాయువుకు అగ్నిసంస్కారమును చేయుట - కబంధునికి శాపవిముక్తి. (48)	280
280.	రామసుగ్రీవులమైత్రి - వాలివధ - లంకలో సీతను త్రిజట ఓదార్చుట. (74)	283
281.	సీతారావణ సంవాదము. (31)	288
282.	సీతాన్వేషణము - హనుమంతుడు లంకకు వెళ్లి తిరిగివచ్చుట. (71+ ½)	289
283.	అంగదుని రాయబారము. (54)	293
284.	అంగదరాయబారము - ఘోరసంగ్రామము. (41)	297
285.	రామరావణ సైనికుల ద్వంద్వయుద్ధము. (15)	299
286.	రాముడు కుంభకర్ణుని యుద్ధమునకు పంపుట. (29)	300
287.	కుంభకర్ణుడు, వజ్రవేగప్రమాధులు చనిపోవుట. (29+ ½)	302
288.	ఇంద్రజిత్తు మాయాయుద్ధము చేయుట - రామలక్ష్మణులు మూర్ఛిల్లుట. (26)	304
289.	ఇంద్రజిత్తు చనిపోవుట. (33)	305
290.	రామరావణుల యుద్ధము - రావణ వధ. (33)	307
291.	శ్రీరామ పట్టాభిషేకము. (70)	309
292.	మార్కండేయుడు యుధిష్ఠిరుని ఓదార్చుట. (14)	313
	20. పతివ్రతామాహాత్మ్య పర్వము - 7	
293.	సావిత్రి జననము - వరాన్వేషణము. (41+ ½)	314
294.	సత్యవంతుని వివాహమాడవలెనని సావిత్రి నిశ్చయించుట. (33)	316
295.	సావిత్రీ సత్యవంతుల పరిణయము. (23)	318

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
296.	అత్తమామల అనుమతితో సావిత్రి సత్యవంతునితో కలిసి వనమున కేగుట. (33)	319
297.	సావిత్రీ యమ సంవాదము ; సత్యవంతుడు మరల బ్రతుకుట. (111+1)	321
298.	సావిత్రీ సత్యవంతులు ఆశ్రమమునకు వచ్చుట. (44)	328
299.	ద్యుమత్సేన రాజ్యాభిషేకము. (17)	330
	21. కుండలాహరణ పర్వము - 11	
300.	సూర్యుడు కర్ణునకు స్వప్నములో సాక్షాత్కరించుట. (39)	331
301.	కుండలముల దానము చేయవలదని సూర్యుడు ప్రబోధించుట. (18)	333
302.	దేవేంద్రునినుండి శక్తిని గ్రహించి కవచ కుండలముల నిచ్చుటకు కర్ణుడు అంగీకరించుట. (21+4)	334
303.	కుంతిభోజుని ఇంటికి దుర్వాసుడు వచ్చుట. తత్సేవకై పృథను నియోగించుట. (29)	336
304.	కుంతి బ్రాహ్మణునకు పరిచర్యలు చేయుట. (20)	337
305.	సేవాసంతుష్టుడైన బ్రహ్మర్షి పృథకు మంత్రము నుపదేశించుట. (23)	338
306.	కుంతి సూర్యుని ఆవాహన చేయుట - కుంతీ సూర్యసంవాదము. (28)	340
307.	కుంతి గర్భవతి అగుట. (28)	341
308.	కర్ణపరిత్యాగము. (27)	343
309.	కర్ణుడు రాధేయుడుగా ఎదుగుట; కర్ణుని దగ్గరకు దేవేంద్రుడు వచ్చుట. (25+$\frac{1}{2}$)	344
310.	ఇంద్రుడు శక్తినిచ్చి కర్ణుని కవచకుండలముల గైకొనుట. (42+1$\frac{1}{2}$)	345
	22. అరణేయ పర్వము - 5	
311.	బ్రాహ్మణుని అరణిమంథనకాష్ఠాలకై పాండవులు మృగము వెంటబడుట. (21)	348
312.	నీటిని తెచ్చుటకయి వెళ్ళిన పాండవులు నలుగురు మూర్ఛిల్లుట. (45+$\frac{1}{2}$)	349
313.	యక్షప్రశ్నలు : యుధిష్ఠిర సమాధానాలు. (133+1)	352
314.	నలుగురిని బ్రతికించి యక్షుడు ధర్మరాజుకు వరమిచ్చుట. (29)	361
315.	ధౌమ్యోపదేశము : అజ్ఞాతవాస సమాలోచనము. (31)	363

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
వన పర్వం - 2

159. ఆర్ష్టిషేణుడు యుధిష్ఠిరునకు ఉపదేశము చేయుట.

తపస్సుచేత పాపాలు దహించుకుపోయిన ఆ రాజర్షిని సమీపించి, సంతోషంతో యుధిష్ఠిరుడు పేరు చెప్పుకొని, తలవంచి, నమస్కరించాడు. తరువాత ద్రౌపది, భీముడు, తపస్సు లయిన నకులసహదేవులు తలలు వంచి రాజర్షి చుట్టూ చేరారు. అలాగే పాండవుల పురోహితుడైన ధౌమ్యుడు నియమపరుడైన ఆ ఋషిని సంప్రదాయబద్ధంగా సమీపించాడు. ధర్మమెరిగిన ఆ ముని దివ్యదృష్టితో కురుశ్రేష్ఠులైన పాండవులను గుర్తించి, కూర్చుండు డన్నాడు. గొప్ప తపస్వియైన ఆ రాజర్షి సోదరులతో కూర్చున్న ధర్మరాజును పూజించి కుశల మడిగాడు. 'అసత్యంలో నీ మనసు తగుల్కొనుటలేదు కదా! ధర్మమందే ప్రవర్తిస్తున్నావా? ధర్మరాజా! తల్లిదండ్రులసేవకు లోపం కలుగుటలేదు కదా! నీ గురువులు, వృద్ధులూ, వైద్యులూ గౌరవించబడుతున్నారా? పాపపుపనులందు నీకు ఆసక్తి కలుగుట లేదుకదా! కురుశ్రేష్ఠా! **ఉపకారానికి ప్రత్యుపకారం చేయుట, అపకారాన్ని ఉపేక్షించుట ఇవి ఎరిగినవాడవే కదా!** నిన్ను నీవు పొగడుకొనుట లేదుకదా! సజ్జనులు తగినవిధంగా నీచే గౌరవించబడి ఆనందిస్తున్నారా! అడవులలో నున్నప్పటికీ ధర్మాన్నే అనుసరిస్తున్నావు కదా! కుంతీకుమారా! నీ ప్రవర్తనలచేత ధౌమ్యుడు బాధపడుట లేదు కదా! దానం, ధర్మం, తపస్సు, శుచిత్వం, ఋజుప్రవర్తన, ఓర్పు ఈ విషయాల్లో తాతలు, తండ్రులనుండి సంక్రమించిన పద్ధతినే అనుసరిస్తున్నావుగదా. ధర్మరాజా! రాజర్షుల మార్గంలోనే సాగుతున్నావు గదా! పితృలోకమందున్న పితృదేవతలు తమతమ వంశంలోని కుమారులు, మనుమల పుట్టుకకు వారి చెడుపనివల్ల మనమేం పొందాల్సి ఉంటుందో? అని దుఃఖిస్తారు. వారి మంచి పనివల్ల మనకేం మంచి లభిస్తుందో అని సంతోషిస్తారు. ధర్మరాజా! **తండ్రి, తల్లి, అగ్ని, గురువు (ఐదవదైన) తాను ఎవరిచే పూజింపబడతారో వాడు**

ఇహపరలోకాలు రెంటినీ జయించినవా డౌతాడు.'*

యుధిష్ఠిరుడు అంటున్నాడు - 'భగవన్! ఆర్యా! ధర్మనిర్ణయమేదో దానినే మీరు నన్నడిగారు. శక్తికి తగ్గట్లు, న్యాయాన్ననుసరించి, శాస్త్రోక్తంగానే ఆచరిస్తున్నాను.' ఆర్ష్టిషేణుడు చెపుతున్నాడు - 'పర్వదినాల సంధికాలంలో నీటినే గ్రహిస్తూ, గాలినే భుజించే ఋషులు ఈ శ్రేష్ఠమైన పర్వతాన్ని సేవిస్తున్నారు. రాజా! కింపురుషులవలె ఒకరినొకరు అనుసరిస్తూ ప్రేయసీప్రియులు కొండపైభాగాల్లో కనబడుతున్నారు. ధర్మరాజా! నిర్మల వస్త్రాలు, పట్టువస్త్రాలు ధరించే గంధర్వులు, అప్సరసల సమూహాలూ ఎన్నో కనబడుతున్నాయి. విద్యాధరుల సమూహాలు కూడ పూలమాలలను ధరించి చూడముచ్చటగా నున్నారు. పెద్దపాముల సమూహాలు, సుపర్ణజాతిపక్షులు, మొదలైనవి కనబడుతున్నాయి. పర్వదినా సంధికాలంలో ఈ కొండమీద ఢక్కా, గోముఖ, శంఖ, మృదంగములధ్వని వినబడుతోంది. భరతవంశశ్రేష్ఠులారా! ఇక్కడే ఉండి దానినంతా వినండి. అక్కడికి వెళ్ళాలనే భావం ఎలాగైనా మీకు తగదు. భరతపుంగవులారా! ఇంతకన్న ముందుకు వెళ్లటం కుదరదు. అది దేవతల విహారభూమి. అది మానవులు వెళ్ళలేని చోటు.

ధర్మరాజా! ఏ కొంచెం చాపల్యంతోనైనా ఆ పనిచేసే మానవుని ఇక్కడ ప్రాణు లన్నీ ద్వేషిస్తాయి. రాక్షసులూ కొడతారు. యుధిష్ఠిరా! ఈ కైలాసశిఖరాన్ని దాటితే పరమసిద్ధులైన దేవర్షుల మార్గం కనబడుతుంది. కుంతీకుమారా! ఇక్కడ చాపల్యంతో వెళ్ళేవానిని, ఈ ప్రాంతం దాటివెళ్ళేవానిని రాక్షసులు ఇనుపశూలాలతో పొడిచి చంపుతారు. పర్వకాలసంధి సమయాలలో ఇక్కడ అప్సరసలతో కూడి, వైభవంతో మానవునిఎక్కి కదిలే కుబేరుడు కనబడుతుంటాడు. శిఖరంమీద చక్కగా కూర్చుని, యక్ష,రాక్షసుల అధిపతియైన కుబేరుని ఉదయించే సూర్యుని లాగా ప్రాణులన్నీ చూస్తున్నాయి. ఈ కొండ పైభాగం దేవ, దానవ, సిద్ధులకు అలాగే కుబేరునికి క్రీడామైదానం. నాయనా! పర్వకాలసంధిసమయాలలో ఈ గంధమాదనపర్వతం మీద కుబేరుని ఉపాసించే తుంబురుని సామగానధ్వని వినబడుతుంది. యుధిష్ఠిరా! ఈవిధంగా చిత్రమైన అద్భుత దృశ్యాలను ఎన్నో ఇక్కడ పర్వకాలసంధిసమయాల్లో ప్రాణులంతా చూస్తున్నారు. పాండవశ్రేష్ఠులారా! అర్జునుడు కనబడేవరకు మునులు తినే రసవంతాలైన పండ్లను తింటూ నివసించండి. నాయనా! ఇక్కడకు చేరుకొన్నవారు ఏ

* పితా మాతా తథైవాగ్నిః గురురాత్మా చ పంచమః।
యస్యైతే పూజితాః పార్థ తస్య లోకావుభౌ జితౌ ॥ 14

విధమైన చాపల్యానికి లోనుకారాదు. కోరుకొన్న విధంగా ఇక్కడ ఉంటూ, శ్రద్ధగా విహరించు. తరువాత శస్త్రాలతో జయించిన భూమిని పాలిస్తావు.'

160. పాండవులు అర్ష్టిషేణుని ఆశ్రమమున వసించుట - మణిమంతుని వధ.

ఆ ఆర్ష్టిషేణుడు తమ మేలుకోరి చెప్పినది విని పాండవులు అలాగే చేశారు. పాండవులు మునుల కాహారమైన రసపూర్ణాలైన తియ్యని, శుచియైన పండ్లను తింటూ హిమాలయంమీద నివసించారు. అలా నివసిస్తూ లోమశమహర్షి చెప్పే ఎన్నోవిధాలైన వాక్యాలను వింటూ గడుపుతున్నవారికి అయిదో యేడు గడిచింది. 'ప్రభూ! నా అవసరమున్న వేళ వస్తాను' - అంటూ ఘటోత్కచుడు రాక్షసులందరితో కలిసి ముందే వెళ్ళిపోయాడు. ఆర్ష్టిషేణాశ్రమంలో ఉంటూ అద్భుత దృశ్యాలను చూస్తున్న ఆ మహాత్ములకు చాలా మాసాలు గడిచాయి. అక్కడ విహరిస్తూ ఆనందిస్తున్న పాండవుల పట్ల ప్రీతితో మహాత్ములైన మునులు, చారణులు ప్రవర్తించేవారు. పరిశుద్ధమైన మనసులు, నియమాలు కల వారు పాండవులను చూశారు. పాండవులు వారితో దివ్యకథాగోష్ఠి చేసేవారు. కొన్నిరోజులు గడిచిన తరువాత ఒకపెద్దనీళ్ళ మడుగులో ఉన్న బుద్ధిమంతు డనే పెద్దపామును గరుత్మంతుడు చటుక్కున పట్టుకొన్నాడు. అపుడు ఆ కొండ కంపించింది. పెద్దపెద్ద చెట్లు నేలకూలాయి. అక్కడి ప్రాణులూ, పాండవులూ అంతా ఆ అద్భుతాన్ని చూశారు. తరువాత ఆ కొండపైభాగం నుండి పవిత్రాలు, పరిమళయుక్తాలైన పూలసమూహాలను పాండవుల వైపు వాయుదేవుడు మోసుకొచ్చాడు. స్నేహితులతో కూడిన పాండవులు, ద్రౌపది అక్కడ ఐదురంగుల దివ్యపుష్పాలను చూశారు. ద్రౌపది సమయం చూసి, పర్వతంమీద ఒంటరిగా సుఖంగా కూర్చున్న భీమసేనునితో ఇలా అంది. పర్వతం నుండి గరుత్మంతుని రెక్కల గాలిచేత ఐదురంగుల పూలు రాలుతున్నాయి. ఆశ్చర్యానది ఒడ్డున ఖాండవవనంలో ప్రాణులంతా చూస్తుండగా మహాత్ముడు, సత్యసంధుడూ అయిన నీ సోదరుడు గంధర్వులను, ఉరగులను, రాక్షసులను, ఇంద్రుని అడ్డుకొన్నాడు. భయంకరులైన మాయావులు చంపబడ్డారు. గాండివధనుస్సు దక్కింది. నీవు ఇంద్రునితో సమానమైన పరాక్రమం కలవాడవు. నీ తేజస్సు, భుజబలమూ గొప్పవి. అవి ఇతరులు ఓర్చుకో లేనివి. ఎదుర్కో లేనివి. భీమసేనా! నీ బాహుబలవేగం చేత బెదిరిన రాక్షసులంతా ఈ పర్వతాన్ని వదలి పదిదిక్కులకూ పోదురుగాక. తరువాత ఎన్నో పూలవరుసలను ధరించి, శివస్వరూపమూ, ఉత్తమమూ అయిన ఈ కొండపైశిఖరాన్ని భయం, మోహం విడిచి నీ స్నేహితులు చూచుదురుగాక! భీమా! ఎప్పటినుండో నేనిలా మనసు పడుతున్నాను. నీ

బాహుబలంచే రక్షించబడుతూ నేను కొండశిఖరాన్ని చూడాలని ఉంది.'

మంచి ఎద్దు కొరడా దెబ్బను సహించలేనట్లు ద్రౌపది ఆక్షేపణను ఆ భీమసేనుడు సహించ లేకపోయాడు. భీముడు సింహం వంటి నడక గలవాడు. సుందరుడు, ఉదారుడు, బంగారపు కాంతి గలవాడు, అభిమానవంతుడు, బలవంతుడు, గర్వంకలవాడు, గౌరవం కోరేవాడు, శూరుడు. ఎఱ్ఱనికన్నులు, విశాలమైన మూపురం, మదించిన ఏనుగువంటి పరాక్రమమూ సింహం కోరలవంటి దంతాలు కల్గి శాలవృక్షంవలె పొడవైనవాడు. గొప్ప హృదయం కలవాడు, అతని అవయవాలన్నీ అందమైనవి. శంఖము వంటి మెడ పొడవైన భుజాలుకల వాడు, బంగారు విల్లు, కత్తి, బాణాలను స్పృశించాడు. భీముడు మదించిన సింహంవలె, మదధారలుకారే గజరాజు వలె భయం, మోహం తొలగి కొండపైకి దూకాడు. వింటిని, బాణాలను ధరించివచ్చే అతనిని మృగరాజులా, మదించిన ఏనుగులా ప్రాణులంతా చూశారు. భీముడు ద్రౌపదికి సంతోషం పెంచుతూ, గద తీసికొని, ఆ పర్వతరాజాన్ని చేరుకొన్నాడు. వాయుకుమారుడైన భీముని ఎన్నటికీ బాధ గాని, పిరికితనం గాని, దిగులు కాని అసూయ గాని దరిచేరవు. ఎత్తుపల్లాలతో, భయంకరంగా కనిపిస్తూ, ఎన్నో తాడిచెట్లంత ఎత్తై, ఒకేదారిగల పర్వతశిఖరాన్ని మహాబలుడైన భీముడు ఎక్కాడు. కిన్నర, మహోనాగ, ముని, గంధర్వ, రాక్షసులను సంతోషపరుస్తూ మహాబలుడైన ఆ భీముడు పర్వతంపైభాగాన్ని చేరుకొన్నాడు. బంగారంతో స్ఫటికాలతో నిర్మించిన భవనాలతో నిండిన కుబేర నివాసస్థానాన్ని భీముడు చూశాడు. అది బంగారుప్రాకారంతో చుట్టబడి, అన్ని రత్నాలకాంతులూ గలిగి ఉన్నది. అన్నిరకాల తోటలు గలిగియున్నది. కొండకన్న ఎత్తైన మేడల సమూహంతో ప్రకాశిస్తోంది. ద్వారాలు, గోపురాలు, బురుజులు, పతాకాలతో శోభిల్లుతున్నది. ఎక్కడ చూసినా నాట్యంచేస్తున్న విలాసవతులతో, గాలికి రెపరెపలాడే పతాకాలతో అలంకరించబడి యున్నది. వంకర తిరిగిన బాహువుతో వింటికొనను బిగించి, ధనరాజైన కుబేరుని పట్టణం వంక భీముడు ఖేదంతో చూశాడు. అక్కడ అన్నిప్రాణులను సంతోషపరుస్తూ గంధమాదనపర్వతం నుండి పుట్టిన గాలి సుఖంగా సువాసనాభరితమై వీచింది. అక్కడిచెట్లు ఎన్నో రకాలుగా ఉన్నాయి. చాలా రంగులతో ప్రకాశిస్తున్నాయి. అనేక విధాలైన పూలగుత్తులను కలిగి ఉన్నాయి. ఊహకందనంత శోభను కలిగి ఉన్నాయి. భీముడు రత్నాల సమూహంతో పొదగబడిన, పూలవరుసలతో అలంకరించబడిన రాక్షసరాజు నివాసాన్ని చూశాడు.

గదను, కత్తిని, వింటిని పట్టుకొని జీవితం కూడా త్యజించేటంత సాహసంతో మహాబాహువైన భీమసేనుడు కొండలా నిశ్చలంగా నిలబడ్డాడు. వెంటనే శత్రువులకు

గగుర్పాటు కలిగేటట్లు శంఖాన్ని పూరించాడు. అల్లెత్రాటి శబ్దంతో ప్రాణులన్నీ మూర్ఛపోయేటట్లు చేశాడు. మిక్కిలి గగుర్పాటును పొందిన యక్షులు, రాక్షసులు, గంధర్వులు భీముని వద్ద నుండి వచ్చిన ఆ శబ్దం వైపు పరుగుతీశారు. యక్షరాక్షసులచేతులలో గదలు, ఇనుపకట్ల గుదియ, పెద్దకత్తి, శూలం, శక్తి, గండ్రగొడ్డలి పరశ్వధాలు మెరిశాయి. తరువాత అతనికీ, వారికీ మధ్య యుద్ధం జరిగింది. మాయావులైన వారు శూలం, శక్తి, గండ్రగొడ్డళ్ళను ప్రయోగించారు. భీముడు భయంకరమైన వేగంకల బల్లెములతో వాటిని ఛేదించాడు. మహాబలుడైన భీముడు భూమిమీద, ఆకాశంమీద ఉండి గర్జనలు చేస్తున్న ఆ రాక్షసులశరీరాల్ని బాణాలతో చీల్చాడు. గద, గుదియలు పట్టుకున్న రాక్షసుల శరీరం నుండీ వెలువడే రక్తపుజడివాన మహాబలుడైన భీముని తడిపేసింది. ఆ ప్రదేశంలో అన్నిప్రక్కలా రాక్షసుల శరీరాలనుండి రక్తధారలు స్రవించాయి. భీముడు బలంగా విడిచిన ఆయుధాలతో యక్షులు, రాక్షసుల శరీరాలు, తలలు తెగిపోయాయి. మబ్బులగుంపు సూర్యుణ్ణిలాగా రాక్షసులు భీముణ్ణి కప్పివేశారు - ఆ దృశ్యం ప్రాణులన్నీ చూశాయి. భీముడు శత్రుసంహారం చెయ్యగల బాణాలతో, సూర్యుడు కిరణాలతో కొట్టినట్లుగా అందరినీ అంతటా కొట్టాడు. అన్నిప్రక్కలనుండి బెదిరిస్తూ, భయంకరంగా గర్జిస్తున్న రాక్షసులంతా భీమసేనుడిలో ఎలాంటి తడబాటును చూడలేదు. అవయవాలన్నీ వికృతంగా ఉన్న యక్షులు భీమసేన భయంతో అటు ఇటు ఆయుధాల్ని వెదజల్లుతూ ఆర్తనాదం చేశారు. ధనుస్సు దాల్చిన భీముడికి బెదిరి వారంతా గద, శూలం, కత్తి, శక్తి, గొడ్డళ్ళను విడచి దక్షిణంవైపు పారిపోయారు.

అక్కడ శూలం, గదలను చేతపట్టుకుని విశాలమైన, భుజాలుగల మణిమంతుడనే కుబేరమిత్రుడైన రాక్షసు డున్నాడు. అతడు తన అధికారాన్ని పొరుషాన్ని చూపాడు. వెనుదిరిగిన వాళ్ళను చూసి నవ్వుతున్నట్లు ఇలా అన్నాడు. యుద్ధంలో ఒక్కమనిషిచేత చాలామంది ఓడించబడ్డారు. కుబేరుని నివాసానికి వెళ్ళి మీరు ఆ ధనరాజుతో ఏం చెప్తారు?' ఆ రాక్షసుడిలా వారందరితో అని, మళ్ళేటట్లు చేశాడు. శక్తి, శూలం, గదలను చేతబట్టి భీముడివైపు పరుగుతీశాడు. మదధారలు కారుతున్న గజరాజులా వేగంగా వచ్చిపడుతున్న అతణ్ణి భీమసేనుడు వత్సదంతాలనే మూడుబాణాలతో ఒకప్రక్క బాగా కొట్టాడు. బాగా కోపించిన మణిమంతుడు కూడ పెద్దగద తీసుకొని, గొప్పబలం సమీకరించుకొని, భీమసేనుడి పై విసిరాడు. మెరుపులా ఘోరంగా ఆకాశంలోనే ఆ పెద్దగదను రాతి ఒరిపిడితో పదునైన బాణాలతో భీమసేనుడు కొట్టాడు. గదను చేరుకొన్న ఆ బాణాలన్నీ విరిగాయి. వేగం కలవే అయినా ఆ గదా వేగాన్ని తట్టుకోలేక పోయాయి.

భీముడు గదాయుద్ధ సమాచారాన్ని తెలుసుకొని శత్రువుయొక్క ఆ దెబ్బ తగలకుండా చూశాడు. అంతలోనే తెలివైన ఆ రాక్షసుడు చాలా ఘోరమై, బంగారు పిడి కల ఇనుపశక్తిని విసిరాడు. మంటలతో భయంకరమైన ఆ గద భయంకర శబ్దం చేస్తూ భీముడి కుడిభుజాన్ని చీల్చుకొని వెంటనే నేలకూలింది. పెద్దధనుస్సు, అమితపరాక్రమమూ గల భీముడు బాగా గాయపడ్డాడు. కోపంతో అలజడిగా ఉన్న కళ్లతో గదను తీసుకొన్నాడు. శత్రుభయంకరమై, శత్రునాశకమై, బంగారు కట్టుతోఉన్న ఇనుప గదను భీముడు చేతబట్టి నిలిచాడు. వేగంగా మహాబలుడైన మణిమంతుడివైపు పరుగుతీశాడు. మణిమంతుడు కూడ కాంతులు చిమ్మే పెద్దశూలాన్ని తీసుకుని గర్జిస్తూ చాలా వేగంగా భీమసేనుడిపైకి వదిలాడు. గదాయుద్ధంలో విశారదుడైన భీముడు గద అంచుతో శూలాన్ని విరగగొట్టి గరుత్మంతుడు పామును వెంటాడినట్లు అతనిని చంపటానికి పరుగుతీశాడు. గదను వేగంగా త్రిప్పుతూ ఆకాశంలోకి ఎగిరాడు. భీముడు యుద్ధరంగం ముంగిట గర్జించి విసిరాడు. వాయువేగంతో వస్తున్న ఆ గద ఇంద్రుడు వజ్రాయుధాన్ని విడిచినట్లుంది. ఆ గద రాక్షసుని చంపి, నేలకూల్చి, కృత్యలాగా పడిపోయింది. భీమసేనుడు పడగొట్టిన ఆ రాక్షసుని - సింహం పడగొట్టిన ఎద్దులా ప్రాణులన్నీ చూశాయి. చచ్చి నేలకూలిన ఆ రాక్షసుణ్ణి చూసి, చావక మిగిలిన రాక్షసులు భయంకరంగా దీనస్వరం చేస్తూ తూర్పువైపు మళ్ళారు.

161. యుధిష్ఠిరుడు గంధమాదనమున కుబేరుని దర్శించుట.

అనేకవిధాలైన శబ్దాలతో కొండగుహా మార్మ్రోగటం విని ధర్మరాజు, నకులసహదేవులిద్దరూ -ధౌమ్యమహర్షి, ద్రౌపది, బ్రాహ్మణులందరూ స్నేహితులూ - వీరందరికీ భీముని కానక మనసు చెడిపోయింది. మహారథు లంతా అప్పుడు ద్రౌపదిని ఆర్ష్టిషేణుడివద్ద ఉంచి, ఆయుధాలతో కొండ ఎక్కారు. మహారథులైన ధర్మజాదులు కొండ అంచుకు చేరి భీముణ్ణి చూశారు. భీమసేనుడి చేత పడగొట్టబడినట్టున్న వారిని చూశారు - వారంతా పెద్దశరీరాలు, ప్రాణాలు పోగొట్టుకొన్నవాళ్ళు, గొప్పబలపరాక్రమాలున్న వాళ్ళు, రాక్షసులు. యుద్ధంలో రాక్షసు లందర్నీ చంపిన ఇంద్రుడిలా మహాభుజుడై గద, కత్తి, ధనుస్సులను ధరించిన ఆ భీముడు శోభాయమానంగా ఉన్నాడు. మహారథులైన ఆ పాండవులు తరువాత సోదరుని చూసి, కౌగలించుకొని అక్కడ ఉత్తమమైన చోటును చేరుకొని కూర్చున్నారు. మహాత్ములు, దేవశ్రేష్ఠులు అయిన లోకపాలకులతో స్వర్గం శోభించినట్లు గొప్ప విలుకాండ్రయిన ఆ నలుగురితో ఆ కొండశిఖరం శోభించింది. కుబేరుడిభవనాన్ని, నేలగూలిన రాక్షసుల్ని చూసి ధర్మరాజు తమ్ముడితో ఇలా అన్నాడు.

"సాహసం చేతనో, మోహంచేతనో భీమా! పాపం చేశావు. వీరా! మునిలా ఉన్న నీకు అకారణంగా ఇలా చంపటం తగదు. రాజద్రోహం చెయ్యకూడదని ధర్మవేత్త లంటారు. భీమసేనా! నీవు ఈ దేవతాద్రోహం చేశావు. అర్థ,ధర్మాలు విడిచి పాపకార్యంలో మనసుపడేవాడు తప్పకుండా పాపపుపనులకు ఫలాన్ననుభవిస్తాడు. నాకు ప్రియం చెయ్యాలనుకొంటే మళ్ళీ ఇలాంటి పని చెయ్యకు." అర్థతత్వం తెలుసుకోగల ధర్మరాజు ధర్మం నుండి జారని సోదరుడితో ఇలా అని- ఆ విషయాన్నే తలచుకొంటూ ఊరకొన్నాడు. తరువాత భీమసేనుడిచేతిలో చావగా మిగిలిన రాక్షసులు అంతా కలిసి కుబేరుడి భవనాన్ని చేరుకొన్నారు. చాలావేగం కల వారు త్వరగా కుబేరుడి నివాసానికి చేరుకొని - భీమసేనుడి భయంతో భయంకరంగా ఆర్తనాదం చేశారు. శస్త్రాలను, ఆయుధాలను విడచారు. అలసిపోయారు. వారికవచాలు రక్తంతో తడిసిపోయాయి. వెదజల్లబడినట్లున్న వెంట్రుకలతో యక్షులు రాజుతో ఇలా అన్నారు. "దేవా! గద, ఇనుపకట్లగుదియ, పెద్దకత్తి, చిల్లకోల, ఈటెలతో యుద్ధం చెయ్యగల ఈ నీ ముందుండే రాక్షసులంతా చంపబడ్డారు. ధనేశ్వరా! ఒకమానవుడిచేత కొండ అంతా మర్దించబడింది. క్రోధవశు లనే రాక్షసరాజులు మర్దింపబడ్డారు. యక్షులలో శ్రేష్ఠులైనవారు, యుద్ధంలో ఉత్సాహం, ప్రాణాలు కోల్పోయారు. అతడిదయవల్ల మేము విడువబడ్డాం. నీ స్నేహితుడైన మణిమంతుడు చంపబడ్డాడు. ఈపని ఒకమానవుని వల్ల జరిగింది. తరువాత ఏంచెయ్యాలో చెయ్యి"(అన్నారు.) యక్షగణాలన్నింటికీ ప్రభువైన ఆ కుబేరు డది విని బాగా కోపించాడు. కోపంతో ఎరుపెక్కిన కళ్ళతో "ఎలా"? అని అడిగాడు. రెండవ తప్పు చేశాడు భీముడని విని ధనేశ్వరుడూ, కోపగించాడు. రథం సిద్ధం చెయ్యమన్నాడు.

అటుపిమ్మట దట్టమైన మబ్బుల్లా ఉండి కొండశిఖరంవలె ఎత్తైన రథానికి బంగారుదండలతోనున్న గంధర్వదేశపు గుర్రాలను అమర్చారు. అవి అన్ని మంచి గుణాలు కలిగిఉన్నాయి. వాటికళ్ళు విశాలంగా ఉన్నాయి. మేలుజాతి గుర్రాలు. తేజస్సు, బలం కలవి, అనేక రకాలైన రత్నాలతో అలంకరించబడ్డాయి. వేగంగా వెళ్ళే ఆ గుర్రాలు రథానికి అమర్చబడి ప్రకాశిస్తున్నాయి. విజయానికి సంకేతా లయిన సకిలింతలతో ఒకదానినొకటి ప్రేరేపిస్తున్నాయి. రాజరాజుగా పేర్కొనబడే కుబేరుడు ఆ రథాన్నెక్కి గొప్పకాంతితో దేవగంధర్వులచే స్తోత్రం చెయ్యబడుతూ వెళ్ళాడు. యక్షులంతా ధనాధీశుడైన ఆ మహాత్ముని అనుసరించారు. సుమారు వెయ్యిమంది యక్షుల కళ్ళు ఎర్రగా బంగారంలా మెరుస్తున్నాయి. శరీరాలు పెద్దవి. గొప్పబలం కలవారు. వారి వద్ద ఆయుధాలున్నాయి. పెద్దకత్తుల్ని పట్టుకొన్నారు. ఎంతో వేగంగా ఆకాశంలో తేలుతూ ఆకాశాన్ని లాగుతున్నారా

అన్నట్లు గంధమాదనపర్వతానికి వచ్చారు. ధనరాజు రక్షించే గుర్రాలపెద్దగుంపును, యక్షరాక్షస గణాలు చుట్టూ ఉన్న కుబేరుని గగుర్పాటుతో పాండవులు చూశారు. అప్పుడు కుబేరుడు కూడ మహారథులై ధనుస్సులు ఎక్కుపెట్టి, కత్తులు పట్టి ఉన్న పాండుకుమారులను చూసి దేవకార్యం చెయ్యదలచి మనసులో సంతోషించాడు. కుబేరుని ముందు పెట్టుకొని వేగంగా పయనించే పక్షుల్లా యక్షులంతా కొండశిఖరాన్ని చేరి పాండవుల సమీపంలో నిలచారు. యక్షులు, గంధర్వులు పాండవుల విషయంలో ప్రసన్నమైన మనసుగల కుబేరుని గమనించి నిలచారు. ధర్మవేత్తయైన ధర్మరాజు, నకులుడు, సహదేవుడు, తమను దోమలుగా తలచుకొంటూ కుబేరుడి చుట్టూ చేరి, అందరూ చేతులు జోడించారు. ఆ కుబేరుడు విశ్వకర్మచే నిర్మించబడ్డ శోభాయమానమైన పుష్పకమనబడే శ్రేష్ఠమైన ఆసనాన్ని అధిష్ఠించాడు. దాని నిర్మాణకౌశలం విచిత్రమైనది. గొప్పశరీరాలు, చక్కని చెవులు, చాలా వేగమూ గల యక్షులు, రాక్షసులు వేలల్లో అతడి చుట్టూ కూర్చున్నారు. దేవతలు ఇంద్రుని చుట్టినట్లు వందల సంఖ్యలో గంధర్వుల, అప్సరసల గుంపులు ఆయన చుట్టూ నిలచారు. శుభాన్ని చేకూర్చే బంగారు దండను తలపై అలంకరించుకొన్న భీమసేనుడు త్రాడు, కత్తి, ధనుస్సులను చేతబట్టి ధనరాజైన కుబేరుని చూశాడు. రాక్షసులవల్ల గాయపడికూడ, ఆ దశలో కుబేరుని చూస్తున్నప్పుడు కూడ భీమసేనుడికి ఎలాంటి బడలిక కలుగలేదు. కుబేరుడు వాడి బాణాలతో యుద్ధానికి సిద్ధంగా ఉన్న భీముడిని చూసి ధర్మరాజుతో అన్నాడు.

"కుంతీకుమారా! ప్రాణులన్నీ నిన్ను ప్రాణిహితపరుడ వని తెలుసుకొన్నాయి. నీవు సోదరులతో కలిసి భయంలేకుండా ఈ కొండశిఖరంలో నివసించు. పాండవా! భీమసేనుడి విషయంలో కోపగించకు. పూర్వమే వీళ్ళు మృత్యువు చేత చంపబడ్డారు. నీ తమ్ముడు నిమిత్తమాత్రుడు. నీ తమ్ముడు చేసిన ఈ దుస్సాహసానికి సిగ్గు చెందకు. యక్షరాక్షసుల వినాశనాన్ని దేవతలు ముందే చూశారు. భరతవంశశ్రేష్ఠా ! భీమసేనుడి విషయంలో నాకు కోపంలేదు. ప్రసన్నుడ నయ్యాను. భీమసేనుడి పనికి ఇంతకుముందే నాకు సంతోషం కలిగింది." ఇలా రాజుతో పలికి భీమసేనుడితో "కురుశ్రేష్ఠా! ఇదంతా నా మనసులో లేదు భీమా ! ద్రౌపదికోసం నన్ను, దేవతల్ని లెక్కచెయ్యకుండా నీ బాహుబలంతో యక్షరాక్షసుల్ని నశింపచేసే సాహసమేదైతే చేశావో దానికి నేను నీపట్ల ప్రీతిచెందాను. వృకోదరా! నేటితో ఘోరమైన శాపం నుండి విముక్తుడ నయ్యాను. ఒక అపరాధం వల్ల నేను పూర్వం కోపగించిన అగస్త్యునిచేత శపించబడ్డాను. దానికి పరిహారంగా ఇది జరిగింది. పాండవా! పూర్వమే నాకీ కష్టం కనబడింది. ఇందులో నీ అపరాధమెంత మాత్రమూ లేదు." యుధిష్ఠిరుడడిగాడు - "భగవన్! మహాత్ముడైన అగస్త్యుడిచేత ఎలా శపించబడ్డావు?

ప్రభూ! నీ శాపానికి కారణం నేను వినా లనుకొంటున్నాను. బుద్ధిమంతుడైన ఆ అగస్త్యుడి కోపానికి నీ సైన్యమూ, అనుయాయులతో ఆనాడే నీవు తగలబెట్టబడలేదు. ఇది నాకు ఆశ్చర్యంగా ఉంది."

ధనేశ్వరుడు చెప్పాడు. "రాజా! కుశవతి అనే ప్రదేశంలో దేవతలకు సమాలోచన కార్యక్రమం జరిగింది. వారి కోరికను మన్నించి నేను మూడువందల మహాపద్మ (యక్షులతో) నిధులతో వెళ్ళాను. భయంకరమైన ఆకారాలతో, అనేకవిధాలైన ఆయుధాలను ధరించిన యక్షుల మార్గంలో నేను ఋషిశ్రేష్ఠుడైన అగస్త్యుని చూశాను. అనేక పక్షులసమూహాలతో పూసిన చెట్లతో అలరారే యమునానది ఒడ్డున చేరి కఠినమైన తపస్సు చేస్తున్నాడు అగస్త్యుడు. వ్రేల్చబడిన అగ్నిలా వెలుగొందుతున్న కాంతిముద్ద అతడు. సూర్యుడికెదురుగా చేతులెత్తి నిలుచున్న అతణ్ణి చూస్తూనే... శ్రీమంతుడు, రాక్షసరాజు, నాస్నేహితుడు అయిన మణిమంతుడు, మూర్ఖత్వం, అజ్ఞానం, గర్వం, మోహం – వీటి చేత ఆకాశంలో ఉండి ఆ మహర్షి తలపై ఉమ్మివేశాడు. ఆ మహర్షి కోపగించి, పదిదిక్కులూ తగులబెడుతున్నట్లుండి నాతో ఇలా అన్నాడు. 'ధనేశ్వరా! నీవు చూస్తుండగానే నీమిత్రుడైన దుష్టబుద్ధి నన్నవమానించి తిరస్కారాన్ని ప్రదర్శించాడు. కాబట్టి ఈ సైన్యా లన్నింటితో మానవుడి నుండి చావును పొందుతాడు. నీవు కూడా చంపబడ్డ ఈ సైన్యాలవల్ల మనసు వికలమై ఆ మానవుని చూసి పాపవిముక్తుడ వవుతావు. నీ ఆజ్ఞను పాలించే ఈ సైన్యాల పుత్రపౌత్రబలగాలకు ఈ ఘోరమైన శాపం తగులదు.' ఆ ఋషిశ్రేష్ఠుడివల్ల నాడు ఈశాపం నేను పొందాను. మహారాజా! నీ సోదరుడు భీముడిచేత శాపంనుండి విడుదలయ్యాను."

162. కుబేరుడు పాండవులకు ఉపదేశము చేయుట.

కుబేరుడు చెపుతున్నాడు – "యుధిష్ఠిరా! **ధైర్యము, సమర్థత, దేశం, కాలం, పరాక్రమం; ఈ ఐదు లోకంలో కార్యసిద్ధికి కారణాలు.** కృతయుగమానవులు ధైర్యవంతులు, తమతమ పనిలో సమర్థులు, పరాక్రమం చూపటం తెలిసినవారుగా ఉండేవారు. **ధైర్యం కల్గి దేశకాలాల నెరిగి, అన్నిధర్మాలను ఎలా ఆచరించాలో తెల్సిన క్షత్రియుడు చాలాకాలం భూమిని పాలిస్తాడు.** కుంతీకుమారులారా! వీరుడా! ఏ మానవుడు అన్నిపనులందు ఇలా నడుచుకొంటాడో అతడికీ లోకంలో కీర్తి కలుగుతుంది. శరీరాన్ని విడిచిన తరువాత ఉత్తమగతిని పొందుతాడు. దేశకాలాల నెరిగి ఇంద్రుడు వసువులతో కలిసి పరాక్రమంచూపి, వృత్రుని చంపి, స్వర్గంలో రాజ్యాన్ని పొందాడు.

కోపానికిమాత్రం లోనై తన పతనాన్ని గుర్తించని పాపాత్ముడు పాపబుద్ధితో పాపాన్నే అనుసరిస్తాడు. పనులను వేరుచేసి తెలుసుకోలేనివాడు, సమయం గుర్తించలేనివాడు, చాలా మందబుద్ధి(మొద్దు), చెయ్యతగినపనుల విశిష్టత నెరుగనివాడు, ఈ లోకంలోను, పరలోకంలోను నశిస్తాడు. వ్యర్థమైన ప్రవర్తనతో ప్రయత్నించేవాడు, తగనిపనిలో తగుల్కొనే, చెడుప్రవర్తనగల దుర్బుద్ధులు ఈ లోకంలోను, పరలోకంలోను నశిస్తారు. అన్నిరకాలసామర్థ్యాలకు ఎగబడేవారికి తప్పక పాపం కలుగుతుంది. పురుషశ్రేష్ఠా! ధర్మం తెలియనివాడు, బలగర్వితుడు, బుద్ధివికాసంలేనివాడు, కోపి, భయంలేనివాడు ఈ భీమసేనుడు. ఇతనిని అదుపుచెయ్యి. మళ్ళీ రాజర్షి అయిన ఆర్ష్టిషేణుడి ఆశ్రమాన్ని చేరుకుని నీవు అక్కడ మొదటిదైన కృష్ణపక్షంలో శోకభయాల్లేకుండా నివసించు. రాజా! మహాబాహూ! బ్రాహ్మణశ్రేష్ఠులతో కూడియున్న నిన్ను అలకాపట్టణవాసులైన యక్షులు, గంధర్వులు, కిన్నరులతో, ఈ కొండపై ఉండేవారంతా నా ఆజ్ఞచేత కాపాడుతారు. ధర్మాత్ములలో శ్రేష్ఠుడవైన రాజా! భీముడు దుస్సాహసంతో ఇక్కడకు చేరాడు. అది గమనించి చక్కగా ఇతనిని వారించు(అడ్డుకో).

రాజా! ఇకమీదట ఈ ఆటవికులు మిమ్మల్ని చూస్తారు. ఎల్లవేళలా సమీపంలో ఉంటారు. రక్షిస్తారు. అలాగే పురుషశ్రేష్ఠులైన నా సేవకులు రుచికరాలైన ఆహారపానీయాలను మీకు తెస్తారు. నాయనా! ఇంద్రుడికి అర్జునుడు లాగా, వాయుదేవుడికి భీముడిలాగా, యమధర్మరాజుకు నీవు - యోగబలంతో పుట్టిన కన్నకొడుకువు. అశ్వినీదేవతలతో సమానులైన ఈ కవల లిద్దరు వారికుమారులు. యుధిష్ఠిరా! మీరంతా కాపాడదగినవారు. నాకు కూడా అలాంటివారే. ప్రయోజనస్వరూపాన్నెరిగి మసలుకోవటం తెల్సినవాడు, అన్నిధర్మాల ఆచరణను ఎరిగిన భీముని తమ్ముడైన అర్జునుడు స్వర్గంలో కుశలంగా ఉన్నాడు. నాయనా! ఈ లోకంలో ఏవి స్వర్గసంబంధమైన గొప్ప సంపదలుగా తలచబడుతున్నాయో అవన్నీ పుట్టినప్పటినుండి అర్జునుడిలో ఉన్నాయి. బలం, అమితతేజస్సుగల అర్జునుడియందు మనోనిగ్రహం, దానం, బలం, బుద్ధి, సిగ్గు, ధైర్యం, కాంతికూడ ఉన్నాయి. పాండవా! **అర్జునుడు మోహంతో నిందించతగిన పని చెయ్యడు. మానవులు అర్జునుని అబద్ధమాడివట్లు ఎన్నడూ చెప్పుకోరు.** (లేరని భావం) భరతవంశీయుడా! కురువంశీయుల కీర్తిని పెంచే అతడు ఇంద్రుడి భవనంలో దేవతలు, పితృదేవతలు, గంధర్వులచేత గౌరవించబడి అస్త్రాలను అభ్యసిస్తున్నాడు. పార్థా! ధర్మంచేత రాజు లందరినీ వశుల్ని చేసుకొన్న, నీ తండ్రికి తాత శాంతనుడు గొప్పపరాక్రమం గల రాజు. అతడు వంశప్రతిష్ఠాకారకుడైన అర్జునుడితో స్వర్గంలో చాలా ప్రీతిని పొందుతున్నాడు. మహాతపస్వియైన

ఆ శాంతనుడు పితరులను, దేవతలను, ఋషులను, బ్రాహ్మణులను పూజించి యమునానదివద్ద ఏడు గొప్ప మేధయాగాలను చేశాడు. రాజా! రాజాధిరాజై, స్వర్గాన్ని జయించి, ఇంద్రలోకంలో ఉన్న నీ తాత శాంతనుడు నీ కుశల మడుగుతున్నాడు." కుబేరుడు చెప్పిన ఈ మాటలు విన్న తరువాత పాండవులు చాలా సంతోషించారు. భరతవంశశ్రేష్ఠుడైన భీముడు శక్తి, గద, కత్తి, ధనుస్సులను క్రిందపెట్టి అనుకూలంగా కుబేరుడికి నమస్కరించాడు. రక్షణకోరిన ఆ భీముడితో రక్షకుడయిన కుబేరుడు "శత్రువులకు గౌరవభంగాన్ని, స్నేహితులకు ఆనందవృద్ధిని కలుగచేసేవాడివి కమ్ము" అన్నాడు. భరతవంశోత్తములారా! అందమైన మీ నివాసాల్లో నివసించండి. యక్షులు మీరు కోరుకొన్న వాటికి అడ్డు తగలరు. అర్జునుడు అస్త్రవిద్యను పొంది, స్వయంగా ఇంద్రుడు పంపగా వచ్చి, మిమ్మల్ని తొందరలో కలుస్తాడు.

ఇలా ఉత్తమకర్మ డయిన యుధిష్ఠిరుడికి చెప్పి యక్షరాజు కుబేరుడు పర్వతశ్రేష్ఠ మయిన కైలాసానికి బయలుదేరాడు. రంగురంగుల తివాసీలు పరచబడి, అనేకరత్నాలతో అలంకరించబడిన వాహనాలలో వేలకొలది యక్షరాక్షసులు అతనిని అనుసరించారు. ఐరావతం వెళ్ళే ఇంద్రుడి పట్టణమార్గంలో లాగా కుబేరుడి భవనంవైపు సాగే మేలుజాతి గుర్రాల చప్పుడు ఎగిరే పక్షుల చప్పుడులా ఉంది. మేఘాలను లాగుతున్నాయా ! అన్నట్లు గాలిని త్రాగుతున్నాయా ! అన్నట్లు ఆ కుబేరుని గుర్రాలు వెంటనే ఆకాశానికి ఎగిరాయి. కుబేరుడి ఆజ్ఞవల్ల కొండపైన ప్రాణాలు విడచిన రాక్షసుల శరీరాలు తొలగించబడ్డాయి. బుద్ధిమంతుడైన అగస్త్యునిచేత వారికి శాప మెంతవరకో నిర్ణయించబడింది. వారంతా యుద్ధంలో చంపబడ్డారు. అప్పుడు వారికి శాపం తొలగిపోయింది. మహాత్ములైన పాండవులూ, ఆ రాత్రి తమనివాసాల్లో రాక్షసు లందరి పూజలందుకొంటూ ఆందోళన లేకుండా సుఖంగా గడిపారు.

163. ధౌమ్యుడు ధర్మజునకు బ్రహ్మాదుల స్థానములను చూపుట.

తరువాత సూర్యోదయకాలంలో అనుష్ఠానాన్ని ముగించుకొని ధౌమ్యుడు ఆర్ష్టిషేణుడితో కలిసి పాండవుల వద్దకు వచ్చాడు. వారందరూ ఆర్ష్టిషేణ, ధౌమ్యులపాదాలకు నమస్కరించి, చేతులు జోడించి ఆ బ్రాహ్మణులను పూజించారు. అపుడు ధౌమ్యమహర్షి యుధిష్ఠిరుని కుడిచేయి పట్టుకుని తూర్పుదిక్కువైపు చూస్తూ ఇలా అన్నాడు. "మహారాజా! పర్వతాలకు రాజైన ఈ మందరపర్వతం సముద్రం దాకా గల భూమి నావరించి ఉన్నది. పాండవా! కొండలు అడవిమధ్య భూములు, అడవులతో శోభిల్లే ఈ దిక్కును ఇంద్రకుబేరులు

రక్షిస్తున్నారు. నాయనా! అన్ని ధర్మాలను ఎరిగిన, మేధావులైన ఋషులు ఈ చోటును ఇంద్ర,కుబేరుల నివాస మంటారు. ఇక్కడ ఉదయించే సూర్యుని ప్రజలు, ధర్మజ్ఞులయిన ఋషులు, సిద్ధులు, సాధ్యులు, దేవతలు ఉపాసిస్తున్నారు. ప్రాణు లందరినీ నియమించే యమధర్మరాజు మరణించిన ప్రాణులమార్గమైన ఈ దక్షిణ దిక్కున ఉన్నాడు. సంయమన మనబడే యముని భవనం పవిత్రమైనది. చూడటానికెంతో అద్భుత మైనది. సర్వసమృద్ధ మయినది. మేధావులు ఈ పర్వతరాజ్యాన్ని అస్తాచల మంటారు. ఇక్కడికి చేరి సూర్యుడు సత్యంచేత ప్రతిష్ఠితుడౌతాడు. ఈ పర్వతరాజం మీద, జలంతో నిండిన సముద్రంలోను నివసిస్తూ రాజైన వరుణుడు ప్రాణులను కాపాడుతున్నాడు. మహాభాగా! శక్తిమంతమూ, శుభకరమూ, బ్రహ్మవేత్తలకు ఆశ్రయమూ అయిన ఈ మేరుపర్వతం ఉత్తరదిక్కును ప్రకాశింపచేస్తున్నది. దానియందే బ్రహ్మదేవుని సభ ఉంది. ప్రాణుల కాత్మయైన బ్రహ్మ కదిలే ప్రాణులను, కదలని ప్రాణులనూ అన్నింటినీ ఇక్కడనుండి సృష్టిస్తున్నాడు. దక్షుడు ఏడవవాడుగాగల బ్రహ్మమానసపుత్రులకు కూడ ఈ మహామేరుపర్వతం కుశలమూ, సుఖమూ కలిగించే చోటు. నాయనా! వసిష్ఠుడు మొదలైన దేవర్షు లేడుగురు ఎల్లప్పుడూ ఇక్కడ ప్రజాపతిలో లీనమౌతారు. మళ్ళీ ఉదయిస్తారు. **ఉత్తమమైన మేరుపర్వతశిఖరాన్ని చూడు. అది రజోగుణం కలుగని చోటు. అక్కడ ఆత్మతృప్తి కల దేవతలతో కలసి బ్రహ్మ నివసిస్తాడు.**

ప్రాణుల న్నింటికి, ప్రకృతికి శాశ్వతమైన కారణం; మొదలు, తుదిలేనివాడు, పరమప్రభువు అయిన దేవుని నారాయణు డంటారు. అతడి ఉత్తమమైన స్థానం బ్రహ్మలోకంకంటే ఆవల ప్రకాశిస్తోంది. వెలుగులన్నింటి సమూహం, శుభస్వరూపం, దేవతలకు కూడ కానరానిది. సూర్యుడు, అగ్నులకంటె అధికమైన తేజస్సు గల ఆ స్థానం పరమాత్మ విష్ణువుది, రాజా! స్వయంగా ప్రకాశించే ఆ చోటు దేవదానవులకు కానరాదు. నాయనా! తూర్పున మేరుపర్వతం మీద జీవులందరకు ప్రభువు, అన్నిటికీ కారణమూ, తనకు తానుగా పుట్టిన నారాయణుని సన్నిధి ఎంతో ప్రకాశిస్తోంది. చక్కని తేజస్సుతో ప్రకాశించే నారాయణుడు అన్ని ప్రాణులను ప్రకాశింపచేస్తున్నాడు. జ్ఞానులైన యతులు(సన్యాసులు)తప్ప ఈ మార్గాన్ని బ్రహ్మర్షులే చేరుకోలేరు. మహర్షులెలా చేరుకొంటారు? పాండవా! సూర్యచంద్రాదిజ్యోతులన్ని ఆ మహాజ్యోతి రూపుడైన నారాయణుని ముందు ప్రకాశించవు. సాక్షాత్తు మన భావానికి కూడ అందని పరమాత్మ అక్కడ ప్రకాశిస్తూంటాడు. భక్తివల్ల యతులు అక్కడ పాపాలను హరించే నారాయణుని చేరుకొంటారు. **భారతా! గొప్ప తపస్సుకలవారు, పుణ్యకర్మలచే పవిత్రులైనవారు, యోగసిద్ధులు,**

మహాత్ములు, అజ్ఞానం, మోహం తొలగినవారు అక్కడకు చేరుకొని మరల తిరిగి ఈ లోకానికి రారు. తానుగా ఏర్పడిన మహాత్ముడు, దేవదేవుడు, శాశ్వతుడు అయిన నారాయణునిలో లీనమౌతారు. యుధిష్ఠిరా! తిరుగులేని శాశ్వతమైన ఈ స్థానం ఎల్లప్పుడూ ఈశ్వరనివాసం. ఇక్కడ నుండి నమస్కరించు. కురునందనా! సూర్యచంద్రులు ప్రతిదినమూ నిశ్చలమైన ఈ మేరువుకు ప్రదక్షిణం చేస్తుంటారు. మహారాజా! నక్షత్రాలన్నీ కూడ పర్వతరాజైన మేరువును మొత్తం విడువక ప్రదక్షిణం చేస్తాయి.

వెలుగులన్నింటిని తనవైపులాగుకొని, చీకటిని పారద్రోలే సూర్యభగవానుడు కూడ ఈ మేరువుకు ప్రదక్షిణం చేస్తున్నాడు. తరువాత అస్తమించిన సూర్యుడు సంధ్యాకాలం తరువాత ఉత్తరదిక్కును పొందుతాడు. పాండవా! సూర్యభగవానుడు మేరువును అనుసరిస్తూ మళ్ళీ ప్రాణికోటి కంతకూ మేలుకోరి తూర్పునకు మళ్ళుతాడు. అలాగే చంద్రభగవానుడు నక్షత్రాలతో కలసి మేరుపుకు ప్రదక్షిణం చేస్తాడు. పర్వదినాల సంధికాలంలో వేర్వేరు మాసాలను విడగొడతాడు. ఈవిధంగా సోమరితనం లేకుండా ఈ మహామేరువును దాటుకుని ప్రాణుల న్నింటిని తలుచుకొంటూ మళ్ళీ మందరపర్వతంవైపు వెళతాడు. అలాగే చీకట్లను పారద్రోలే సూర్యభగవానుడు తనకిరణాలతో ఈ జగత్తును పాలిస్తూ, బాధలేని ఈ మార్గంలో తిరుగుతూ ఉంటాడు. చల్లదనం సృష్టించదలచి దక్షిణదిక్కును చేరుకొంటాడు. వానివల్ల ప్రాణులన్నీ శీతకాల ప్రభావాన్ని పొందుతాయి. ఆ సూర్యుడు దక్షిణాయనము నుండి మరలి తన తేజస్సుతో కదిలీ, కదలని ప్రాణుల తేజస్సులను గ్రహిస్తాడు. ఆ కారణంచేత చెమట, అలసట, కునికిపాట్లు, దిగులు మానవులకు కలుగుతాయి. ప్రాణు లెల్లప్పుడూ మాటిమాటికి నిద్రపోతూంటారు. ఈ విధంగా అంతరిక్షమార్గాన్ని ఆవరించి సూర్యభగవానుడు ప్రజల పుష్టిని కోరుతూ మళ్ళీ వర్షాన్ని సృష్టిస్తాడు. చాలాగొప్ప తేజస్వీఅయిన సూర్యుడు వర్షం, గాలి, తాపం అనే ముఖాలతో కదిలే,కదలని జీవరాశులకు పుష్టినిస్తూ మళ్ళీ తన స్థానానికి చేరుకొంటాడు. కుంతీకుమారా! ఇలా సూర్యభగవానుడు ఏమరుపాటు లేకుండా ప్రాణులన్నింటిని ఆకర్షించడం, పోషించడం చేస్తూ, తిరుగుతూ కాలచక్రాన్ని త్రిప్పుతున్నాడు. పాండవా! ఈ సూర్యగమనం నిరంతరం సాగుతుంది. ఆగదు. ఇతడు ప్రాణులనుండి తేజస్సును గ్రహించి మళ్ళీ వర్షరూపంలో ఇస్తాడు. భరతవంశీయుడా! ప్రభువైన సూర్యుడు ప్రాణు లన్నింటి ఆయుర్దాయమూ, కర్మలను విడగొట్టుతూ రాత్రి-పగలు, కలా-కాష్ఠ వంటి కాలాన్ని ఎప్పుడూ కల్పిస్తుంటాడు."

164. అర్జునుడు పాండవుల కడకు వచ్చుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు – శ్రేష్ఠమైన ఆ పర్వతంమీద నివసిస్తూ, ఉత్తమమైన నియమం పాటిస్తూ అర్జునుని చూడాలనే కాంక్షగల మహాత్ములైన పాండవుల మనసుల్లో ఎంతో ప్రేమ, ఆనందమూ కలిగాయి. పరాక్రమవంతులు, ఎంతో పరిశుద్ధమైన కోర్కెలుగల కాంతిమంతులు, సత్యం ధైర్యం ప్రధానంగాగల వారిపట్ల ప్రేమతో గంధర్వులు మహర్షులు సమూహాలుగా వస్తున్నారు. పూచినచెట్లుగల ఉత్తమమైన పర్వతం చేరిన ఆ మహారథులకు స్వర్గాన్ని చేరిన మరుద్గణాలకు వలె మనసెంతో ప్రసన్నమైంది. గొప్పపర్వతశిఖరాలు, చరియలు నెమళ్ల ధ్వనులతో హంసలధ్వనులతో మ్రోగుతున్నాయి. పూలతో వ్యాపించాయి. వాటిని చూస్తూ పాండవులు ఎంతో సంతోషాన్ని పొంది, అక్కడ నివసించసాగారు. ఆ ఉత్తమమైన పర్వతంమీద స్వయంగా కుబేరుడిచే నిర్మించబడిన సరస్సులను చూశారు. వాటిప్రవాహం, ఒడ్డు నాచుతో కప్పబడినాయి. వాటిని ధూమ్రవర్ణపు ముక్కు, కాళ్ళు గల హంసలు, కన్నె లేళ్ళు, హంసలు సేవిస్తున్నాయి. తామరలతో నిండి ఉన్నాయి. కుబేరుని క్రీడాప్రాంగణాలవలె అన్ని హంగులూ కల విచిత్ర మాలలచే అలంకరింపబడటం చేత శోభను సంతరించుకొని, మణులు పొదగబడి మనోరంజకంగా ఉన్న క్రీడామైదానాలను పాండవులు చూశారు. నిరంతరం తపోనిష్ఠులయి తిరుగుతున్న ఆ పాండవులు చాలా రంగులతో, సువాసనలతో నున్న చెట్లు, మేఘాలగుంపులతోను నిండిన ఆ పర్వతశిఖరం యొక్క వైభవాన్ని ఊహించలేకపోయారు. ఆ పర్వతం కాంతిచేత, ఓషధులప్రభావం చేత ఏర్పడ్డ ప్రకాశం వల్ల రాత్రింబవళ్ళను వేరు చెయ్యలేని స్థితి ఏర్పడింది. పురుషసింహాలైన ఆ వీరులు అక్కడనుండి చరాచరజీవకోటిని పోషించే అమితతేజస్సుగల అగ్నికి ఆశ్రయమైన సూర్యుని ఉదయాస్తమయాలను చక్కగా చూసేవారు.

వీరులైన వా రక్కడినుండి చీకటిరాకపోకలను, చీకట్లను పారద్రోలే సూర్యుని ఉదయాస్తమయాలను, సూర్యకిరణ సమూహాలతో నిండిన దిక్కులు, మూల లన్నింటిని చూస్తూ ధర్మమే ప్రధానంగా, పవిత్రమైన ఆచరణంతో అనుష్ఠానంతో సత్యమైన ఆచరణగల ఆ అర్జునుని రాకకు ఎదురు చూస్తున్నారు. ఇక్కడకు చేరుకున్న మనకు తొందరలో అస్త్రవిద్యను సిద్ధింపచేసుకొని వస్తున్న అర్జునుడి దర్శనం చేత సంతోషం కలగాలి అని శుభాకాంక్షలను వ్యక్తం చేసుకొంటూ ఆ కుంతీ కుమారులు తపో యోగ సాధనలో నిమగ్న మయ్యారు. ఆ కొండమీద విచిత్రాలను, అడవులను చూసి అర్జునుని తరచూ తలచుకొంటున్న వాళ్ళకు ఒక్కరాత్రి, పగలూ సంవత్సరంతో సమాన మయ్యాయి. ధౌమ్యుడి అనుమతితో మహాత్ములైన ఆ అర్జునుడు జడలను ధరించి తపస్సుకై వెళ్ళినప్పటి

నుండి వారి మనసులో సంతోషం లేదు. ఇక అతడిపైనే మనసంతా పెట్టుకొన్న వాళ్ళకు సుఖ మెక్కడిది? గజరాజురీవితో నడిచే ఆ అర్జునుడు తన అన్న యుధిష్ఠిరుడి ఆజ్ఞవల్ల కామ్యకవనం నుండి బయలుదేరిన నాటినుండి వారు శోకపీడితు లయ్యారు. భారతా! అస్త్రాలను పొందగోరి ఇంద్రుడిని సమీపించిన అర్జునుని గూర్చి అలానే ఆలోచిస్తున్న పాండవులకు ఆ పర్వతంమీద అతికష్టంతో ఒకనెల గడిచింది. ఇంద్రుడి భవనంలో ఐదేళ్ళుండి ఇంద్రునివల్ల ఆగ్నేయం, వారుణం, సౌమ్యం, వాయువ్యం, వైష్ణవం, ఐంద్రం, పాశుపతం, బ్రాహ్మం, పారమేష్ఠ్యం, యమ, బ్రహ్మ, సూర్య, త్వష్ట, కుబేరులకు చెందిన అన్ని దివ్యాస్త్రాలను పొంది ఇంద్రునికి నమస్కరించి, ప్రదక్షిణం చేసి, ఆయన అనుమతి పొంది, అర్జునుడు ఎంతో ప్రసన్నతో గంధమాదన పర్వతానికి వచ్చాడు.

165. అర్జునుడు గంధమాదన పర్వతమున సోదరులను కలియుట.

గుర్రాలతో కూడిన ఇంద్రరథం మెరుపుకాంతితో ఒక్కసారిగా కనబడింది. అర్జునుని తలుచుకొంటున్నవాళ్ళకు దాన్ని చూసి ఎంతో సంతోషం కలిగింది. మాతలి నడుపుతున్న ఆ రథం ఒక్కసారిగా ఆకాశాన్ని వెలుగుతో ప్రకాశింపచేస్తూ, మబ్బులమధ్యలో ఉన్న గొప్పతోకచుక్కలా, పొగలేని అగ్నిజ్వాలలా ప్రకాశించింది. దివ్యమైన కాంతితో వెలిగిపోతూ, ఇంద్రుడితో సమానమైన ప్రభావంతో అర్జునుడు కిరీటం పూలదండలు, ఆభరణాలతో ప్రకాశిస్తూ ఆ రథంమీద పర్వతాన్ని చేరుకొన్నాడు. అర్జునుడు ఆ పర్వతాన్ని చేరుకొని ఆ ఇంద్రరథంమీద నుండి దిగి ధౌమ్యుడికి, తరువాత ధర్మరాజుకు, భీముడికి, పాదాభివందనం చేశాడు. నకులసహ దేవులు అర్జునునకు నమస్కరించారు. అర్జునుడు ద్రౌపదిని కలిసి ఆమె నోదార్చి సోదరుడైన యుధిష్ఠిరుని చెంత వినయంగా నిలచాడు. అమితమైన ఘనత సంతరించుకొన్న అర్జునుని కలిసిన వాళ్ళకు చాలా సంతోషం కలిగింది. కిరీటధారియైన అతడు కూడా వాళ్ళను చూసి ఆనందించాడు. యుధిష్ఠిరుని ప్రశంసించసాగాడు.

ఇంద్రుడు ఎక్కి, దైత్యుల ఏడు యూథాలను, చంపిన ఇంద్రుని రథం దగ్గరకు వెళ్లి పాండవులు ప్రదక్షిణం చేశారు. చాలా సంతోషంగా ఉన్న ఆ పాండవులు మాతలికి, ఇంద్రుడితో సమానమైన రీతిలో సత్కారం చేశారు. తగినవిధంగా దేవత లందరి క్షేమసమాచారాన్ని అడిగారు. కుమారులకు తండ్రి బోధించినట్లు బోధించి, ఆ పాండవులను అభినందించి, మాతలి మళ్ళీ సాటిలేని కాంతిగల ఆ రథంమీద స్వర్గలోకాధిపతి వద్దకు వెళ్ళాడు. మాతలి వెళ్ళగానే ఇంద్రునికుమారుడు, మానవరాజశ్రేష్ఠుడు, మహోత్ముడు, స్వయంగా వేయికన్నుల వానివలె తోచేవాడు, శ్రీమంతుడు, ప్రియుడు అయిన అర్జునుడు

తన శరీరం నుండి తీసి ఇంద్రుడిచ్చిన, ఎంతో వెలగల, చక్కని ఆకారంతో, సూర్యునివలె మెరిసే ఆభరణాలను (శు)సుతసోముని తల్లి, తనకు ప్రియురాలూ అయిన ద్రౌపదికి ఇచ్చాడు. తరువాత ఆ కురువంశశ్రేష్ఠులు, సూర్యాగ్నులతో సమానమైన కాంతిగల బ్రాహ్మణశ్రేష్ఠుల మధ్య కూర్చుని జరిగిందంతా ఉన్నది ఉన్నట్లు చెప్పాడు. ఇంద్రుడివల్ల, వాయుదేవునివల్ల, సాక్షాత్తు శివునివల్ల అస్త్రాలు పొందానని చెప్పసాగాడు. అలాగే నా సత్ప్రవర్తనచేత, ఏకాగ్రతచేత ఇంద్రుడితో సహా దేవతలు నాపట్ల సంతోషించారు. అని పరిశుద్ధమైన ఆచరణ కల్గి అర్జునుడు క్లుప్తంగా వారికి తాను స్వర్గంలో ఉన్న తీరును వివరించి, నకులసహదేవులతో కలిసి నిశ్చింతంగా ఆ ఆశ్రమంలో నిద్రించాడు.

166. ఇంద్రుడు పాండవులను అనునయించి స్వర్గమున కేగుట.

రాత్రి గడిచిన తరువాత ఉదయకాలంలో సోదరు లందరితో కలిసి ధనంజయుడు (అర్జునుడు) ధర్మరాజుకు నమస్కరించాడు. ఇంతలోనే అంతరిక్షంలో స్వర్గవాసులు మ్రోగించిన అన్నివాద్యాల ధ్వని వినపడింది. అంతటా రథచక్రాలచప్పుడు, గంటలమోత, ఏనుగులు, జంతువులు, పక్షులు చేసిన ధ్వనులూ వేరుగా వినబడ్డాయి.

(పాండవులు ప్రసన్నతతో ఆ ధ్వని వచ్చేవైపు చూస్తూ ఆకాశమార్గాన దేవతలతో కలసి వస్తున్న ఇంద్రుని చూశారు.)

సూర్యుని లాంటి విమానాలమీద గంధర్వ అప్సరసలసమూహాలు దేవేంద్రుడికి నాలుగుప్రక్కలా అనుసరిస్తూ వస్తున్నారు. బంగారం తాపడం చేసిన రథానికి గుర్రాలు పూన్చి ఉన్నాయి. ఆ రథం చక్కని కాంతితో మేఘగర్జన చేస్తోంది. ఆ రథం నుండి ఇంద్రుడు దిగాడు. ధర్మరాజు తమ్ముళ్లతో కలిసి ఇంద్రుని సమీపించాడు. యజ్ఞాలలో దక్షిణఎక్కువగా ఇచ్చే ధర్మరాజు ఇంద్రుని ఆయనకు తగినట్లుగా శాస్త్రోక్తంగా ఎదురేగి పూజించాడు.

తేజోవంతుడైన అర్జునుడు ఇంద్రుడికి ప్రణామంచేసి ఆ దేవరాజుకు దగ్గరగా సేవకుడిలా వినయంగా నిలబడ్డాడు. గొప్పతేజస్సుకల ధర్మరాజు దేవరాజుకు దగ్గరగా జడలతో, తపస్సుచేత పాపరహితుడై, వినయంగా నిలుచున్న అర్జునుని చూసి చాలా సంతోషాన్ని పొందాడు. దేవరాజును పూజిస్తూ ఎంతో ప్రీతిని పొందాడు. సంతోషంతో మునిగిన, ఉదార హృదయుడైన ఆ రాజుతో ఇంద్రుడు "రాజా! కుంతీకుమారా! నీవీ భూమిని పాలిస్తావు. మళ్ళీ శుభాన్ని చేకూర్చే కామ్యకవనంలో గల ఆశ్రమానికి వెళ్ళు రాజా! ఏకాగ్రత కల అర్జునుడు నా వల్ల అస్త్రాలను పొందాడు. నాకు ప్రీతిని కలిగించాడు.

ముల్లోకాలవాళ్ళూ ఇతణ్ణి జయించలేరు." ధర్మరాజుకు ఇలా చెప్తూ మహర్షులు స్తోత్రాలు చేస్తూంటే సంతోషించి, దేవేంద్రుడు స్వర్గానికి వెళ్ళాడు. కుబేరుని నివాసంలో ఉన్న పాండవులకు ఇంద్రునితో ఏర్పడ్డ ఈ కలయికను సంవత్సరకాలం బ్రహ్మచారిగా నియమంగా దీక్షతో చదివేవాడు బాధల్లేకుండా జీవిస్తాడు. నూరేళ్ళూ సుఖంగా ఉంటాడు.

167. పాశుపతాస్త్ర ప్రాప్తిని గురించి అర్జునుడు వివరించుట.

వచ్చినత్రోవనే ఇంద్రుడు వెళ్ళగా అర్జునుడు సోదరులతో, ద్రౌపదితో కలిసి ధర్మరాజును పూజించాడు. నమస్కరిస్తున్న అర్జునుడి తలపై మూర్కొని ధర్మరాజు చాలా సంతోషాన్ని పొంది, గద్గదస్వరంతో ఇలా అన్నాడు. "అర్జునా! నీకు స్వర్గంలో కాల మెలా గడిచింది? ఎలా అస్త్రాలు పొందావు? దేవరాజైన ఇంద్రుని ఎలా సంతోషపెట్టావు? పాండవా! అస్త్రాలను చక్కగా గ్రహించావా? సంతోషించిన ఇంద్రుడూ, శివుడూ నీకు అస్త్రాల నిచ్చారా? ఇంద్రుడూ, భగవానుడైన శివుడూ నీకెలా కనబడ్డారు? అస్త్రాలను ఎలా సంపాదించావు? నీవెలా ఆరాధించావు? భగవానుడైన ఇంద్రుడు నీవల్ల సంతోషించా నన్నాడే, అతనికెలా నీవు ప్రియమైన పనిచేశావు? మహాదేవుడైన శివుడు, దేవరాజైన ఇంద్రుడు సంతోషించిన తీరు విపులంగా వినా లనుకొంటున్నాను. "అర్జునా! ఇంద్రుడికి చేసిన ప్రియమైన పనేమిటో మొత్తమంతా నాకు చెప్పు." అర్జునుడు చెప్తున్నాడు - "మహారాజా! నే నే ప్రకారంగా ఇంద్రుని, శంకరుని దర్శించానో విను. రాజా! నీవు చెప్పిన విద్యనభ్యసించి నీ ఆదేశంతో తపస్సు చెయ్యటానికి అడవికి బయలుదేరాను. కామ్యకవనం నుండి భృగుతుంగం చేరుకుని తపస్సు చేస్తూనే ఒకరాత్రి గడిపి వెళుతూ దోవలో ఒక బ్రాహ్మణుని చూశాను. "ఎక్కడికి వెళ్తున్నావో నాకు చెప్పు" అని అతడు నన్నడిగాడు. అతనికంతా ఉన్నది ఉన్నట్లు చెప్పాను. నానుండి నిజాన్ని విని ఆ బ్రాహ్మణుడు నన్ను గౌరవించాడు. రాజా! నామీద ప్రేమ చూపాడు. తరువాత ప్రీతితో నాతో "భారతా! తపస్సు చెయ్యి. తపస్సు చేస్తూ త్వరలోనే దేవదేవుని నీవు దర్శించగలుగుతావు" అని అన్నాడు. తరువాత నే నతని మాట ప్రకారం హిమాలయ పర్వతాన్నెక్కి ఒకనెలరోజులు దుంపలు, పళ్ళు తింటూ తపస్సు చేశాను. నీళ్ళు త్రాగుతూ తపస్సు చేసే నాకు రెండో నెల గడిచింది. తరువాత మూడవనెలలో ఆహారాన్ని తీసుకోనేలేదు. నాలుగవ నెలలో చేతులు పైకెత్తి, తపస్సు చేశాను. అప్పుడు నాకు ప్రాణం పోకపోవడం అద్భుతమనిపించింది. ఐదవనెలలో మొదటి రోజు గడవగానే పందిలా ఉన్న ఒక ప్రాణి నాదగ్గరకు వచ్చింది. ముట్టెతో నేలను త్రవ్వుతూ, పాదాలతో రాస్తూ, మాటిమాటికి పాట్టతో నేలపై దొర్లుతూ, నేలను ఊడుస్తూ

ఉంది. అప్పుడు దానివెంట కిరాతవేషాన్ని ధరించిన ఒకడు విల్లు, బాణాలు, కత్తి పట్టుకుని, స్త్రీతో కలిసి నాదగ్గరకు వచ్చాడు. నేను వింటిని, అమ్ములపొదులను తీసుకొని ఒక బాణంతో గగుర్పాటు కలిగించే ఆ ప్రాణిని కొట్టాను. అదేసమయంలో కిరాతుడు తన వింటిని గట్టిగా లాగి నామనస్సు వణికించేటట్లు దానిని గట్టిగా కొట్టాడు. 'ముందుగా నే గ్రహించిన దాన్ని వేట కట్టుబాటును విడిచి నీ వెందుకు కొట్టా' వని అతడు నన్నడిగాడు. పెద్దశరీరం గల ఆ విలుకాడు "ఇదుగో ఈ వాడి బాణాలతో నీ గర్వాన్ని అణగగొడ్తాను. కదలకు" అని నాతో అన్నాడు. అపుడు అతడు కొండపై వాన కురిసినట్లు పెద్ద బాణాలతో నన్ను కప్పేశాడు. అతనిని నేను కూడా గొప్ప బాణవర్షంతో కప్పేశాను. వజ్రాయుధపు దెబ్బలతో కొండను కొట్టినట్లు మంటలు క్రక్కే బాణాలతో అతనిని నేను గాయపరచాను.

అప్పుడు అతని ఆ ఆకారం వందలు వేలుగా అయ్యింది. అతని ఆ శరీరాలను నేను బాణాలతో కొట్టాను. ఆ శరీరాలు మళ్ళీ ఒకటిగా అయి కనబడ్డాయి. మళ్ళీ నేను వాటిని గాయపరచాను. రాజా! పెద్ద తలకాయ అణువంత అయింది. అణువు పెద్దదయింది. మళ్ళీ పెద్ద ఆకారం అణువంత తలతో ఒకటిగా అయింది. నన్ను యుద్ధంలో అతడు ఎదుర్కొన్నాడు. యుద్ధంలో అతడిని బాణాలతో అణచలేక వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాను. కాని అతడిని చంపలేకపోయాను. అది అద్భుత మనిపించింది. ఆ అస్త్రం విఫలమైనందుకు నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. రాజా! మళ్ళీ నేను విశేషంగా ప్రయత్నించి గొప్ప అస్త్రసమూహాన్ని, యుద్ధంలో ఆ ప్రాణిపై గుప్పించాను. రుద్రుడి అవతారమై స్థూణాకర్ణుడు దేవతగా గల అస్త్రాన్ని, ఆకాశాన్ని కప్పేసి, మీద కురికే వర్షాస్త్రాన్ని, శలభాస్త్రాన్ని, రాళ్ళుకుమ్మరించే అశ్మవర్షాస్త్రాన్ని ఊతంగా చేసుకొని అతనిపై పడ్డాను. రాజా! ఆ నా అస్త్రాలన్నింటిని అతడు మింగేశాడు. వాటినన్నిటిని మ్రింగగానే నేను బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాను. మండేబాణాలతో ఆ అస్త్రం అంతటా పాకింది. నా మహాస్త్రంతో ప్రేరణపొంది ఆ బ్రహ్మాస్త్రం చాలా వేగంతో పెరుగుతూ ఉంది. నేను ప్రయోగించిన అస్త్రం యొక్క తేజస్సుతో లోకులంతా తాపానికి లోనయ్యారు. క్షణంలో దిక్కులు, ఆకాశం అంతటా మంటలు చెలరేగాయి. గొప్ప తేజస్సుకలిగిన అతనిచే ఆ అస్త్రం కూడ క్షణంలోనే పల్లార్చబడింది. రాజా! బ్రహ్మాస్త్రం నశించే సరికి నాకు చాలా భయం కలిగింది.

నేను విల్లు అమ్ములపొదులను తీసుకొని వెంటనే ఆ ప్రాణిని కొట్టాను. ఆ అస్త్రాలన్నింటిని కూడా ఆ ప్రాణి తినేసింది. అస్త్రాలన్నీ నశించాయి. ఆయుధాలన్నీ మ్రింగబడ్డాయి. అప్పుడు నాకూ, ఆ ప్రాణికీ ముష్టి యుద్ధం జరిగింది. ఆ ప్రాణిని

పిడికిళ్ళతో పొడిచి, గుద్దులతో ఎదుర్కొనే ప్రయత్నం చేశాను. కాని చేష్టలుడిగి నేలమీద పడ్డాను. తరువాత ఆ ప్రాణి నేను చూస్తూండగానే పెద్దగా నవ్వి స్త్రీలతో కలిసి అక్కడే అంతర్ధానమయింది. రాజా! ఆ భగవంతు డిలా చేసి కిరాతవేషాన్ని వదలి మరొక రూపాన్ని పొందాడు. దేవతలకు ప్రభువైన ఆ మహేశ్వరుడు దివ్యమూ, అద్భుతమూ అయిన వస్త్రాన్ని ధరించి దివ్యమైన స్వరూపంతో అక్కడ నిలిచాడు. తరువాత సాక్షాత్తు భగవంతుడైన శివుడు పాముని, పినాక మనే ధనుస్సును ధరించి, పార్వతితోడుగా ఉండగా అనేక రూపాలతో కనిపించాడు. యుద్ధరంగంలో అలాగే ఎదురుగా ఉన్న నాదగ్గరకు వచ్చి, శూలం పట్టుకొన్న ఆ శివుడు 'సంతోషించాను' అన్నాడు. తరువాత ఆ వింటిని, తరగని బాణాలు గల ఆ రెండు అమ్ములపొదులను తీసుకొని ఆ భగవంతుడు వాటిని నాకే ఇచ్చి 'ధరించు' అన్నాడు. 'కుంతీకుమారా! నీ పట్ల సంతోషించాను. నీ కేంచెయ్యమంటావో అడుగు. నీ మనసులో ఉన్నది చెప్పు. (శరీరంతో) అమరత్వం మినహా నీ మనసులో ఉన్నదేదో అడుగు. దాన్ని నేను తీరుస్తాను.' (అన్నాడు). తరువాత అస్త్రాలపైనే మోజుగల నేను చేతులు జోడించి, మనసులో శంకరునికి ప్రణామం చేసి 'భగవన్! నాపట్ల ప్రసన్నుడవయితే ఇది నేను కోరుకున్న వరం' అన్నాను. "దేవతల దగ్గరున్న అస్త్రాలగురించి తెలుసుకోవాల" నుకొంటున్నాను. అన్నాను. దానికి భగవంతుడైన త్రినేత్రుడు నాతో 'ఇవ్వబోతున్నా' నన్నాడు.

"పాండవా! నాదైన రౌద్రాస్త్రం నిన్ను చేరుకొంటుంది" అంటూ ఆ దేవుడు నాపై ప్రీతితో గొప్పదైన పాశుపతాస్త్రం ఇచ్చాడు. సనాతనమైన ఆ అస్త్రాన్ని నాకిచ్చి ఆ మహాదేవుడు ఏమైనప్పటికీ మానవులపై దీన్ని ప్రయోగించకూడ దన్నాడు. "తక్కువశక్తిగల వారిపై ప్రయోగిస్తే ప్రపంచాన్ని తగులబెడుతుంది. ధనంజయా! తన కన్న బలవంతుడిచేత పీడింపబడుతున్నప్పుడు మాత్రమే ప్రయోగించాలి. శత్రువుయొక్క అస్త్రాలను విఫలం చెయ్యటానికి తప్పకుండా ప్రయోగించవచ్చు." ఈవిధంగా శివుడు ప్రసన్ను డయినందున, ఎదురులేని అన్ని అస్త్రాలను ఎదుర్కోగల దివ్యమైన, ఆ పాశుపతాస్త్రం ఆకారం దాల్చి నా ప్రక్కన నిలిచింది. అది శత్రువుల్ని చెల్లాచెదరు చేస్తుంది. శత్రువు సేనల్ని ఊచకోత కోస్తుంది. దాన్ని పొందటమెంతో కష్టం. దేవదానవరాక్షసులెవరి కైనా దాని వేగం తట్టుకోవటం సాధ్యంకాదు. ఆయన అనుమతితో నేనక్కడే కూర్చున్నాను. నేను చూస్తూండగానే ఆ దేవుడక్కడే అంతర్ధానమయ్యాడు."

168. స్వర్గమున అర్జునుని అస్త్రవిద్యాభ్యాసము.

అర్జునుడు చెపుతున్నాడు. "దేవదేవుడు, మహాత్ముడూ అయిన త్రినేత్రుని అనుగ్రహంతో తరువాత ఆ రాత్రి అక్కడ గడిపాను. తెల్లవారగానే ప్రొద్దున ఆచరించవలసిన పనులను చేసి వెనుక చూసిన ఆ బ్రాహ్మణోత్తముని చూశాను. భగవంతు డైన మహాదేవుని కలిశానని జరిగినదంతా నేనతడికి నివేదించాను. ప్రసన్నుడైన ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు నాతో 'వేరెవ్వరికి జరగనివిధంగా నీవు మహాదేవుణ్ణి చూశా'వని నాతో అన్నాడు. 'యముడు మొదలైన లోకపాలకులతో కలిసి ఉన్న దేవేంద్రుని చూడబోతున్నావు. అతడు నీకు అస్త్రాలనిస్తాడు.' ఇలా అంటూ సూర్యుడితో సమానమైన తేజస్సుగల ఆ బ్రాహ్మణుడు మాటిమాటికి నన్ను హత్తుకుంటూ వెళ్ళిపోయాడు. తరువాత ఆ రోజు మధ్యాహ్నం ఈ లోకానికి క్రొత్తదనాన్నిస్తూన్నట్లు పవిత్రమైన గాలి వీస్తోంది. హిమాలయపర్వతం క్రిందిభాగాన, సువాసనలు వెదజల్లే దివ్యమైన క్రొత్తపూలవాన కురుస్తోంది. చుట్టూ మనస్సు నాకట్టుకునే దివ్యవాద్యాలఘోష. ఇంద్రుడి స్తోత్రాలు వినబడసాగాయి. అక్కడ అంతటా ఆ దేవదేవుడైన ఇంద్రుడి ఎదుట అప్సరసల, గంధర్వుల సమూహాలు గానం చేయసాగాయి. మహేంద్రుడి అనుచరులు, ఆయన భవనంలో నివసించే దేవతల గుంపులు అక్కడికి దివ్యవిమానాలమీద చేరుకొన్నారు. అప్పుడు దేవత లందరితో కలిసి, శచీదేవి తోడురాగా, అలంకరించబడిన, పచ్చనిగుర్రాలు పూన్చబడిన రథాలపై ఇంద్రుడు అక్కడికి వచ్చాడు. రాజా! ఇంతలోనే చాలా ఐశ్వర్యంతో కూడిన నరవాహనుడైన కుబేరుడు నాకు దర్శన మిచ్చాడు. దక్షిణదిక్కున యముని చూశాను. తమతమ స్థానాలలో ఉన్న వరుణునీ, దేవరాజు ఇంద్రునీ చూశాను.

వారు నన్నోదార్చి 'అర్జునా! ఇక్కడకు చేరిన లోకపాలకులమైన మమ్మల్ని చూడు దేవకార్యం సిద్ధింపచెయ్యటానికి శంకరుని చూడగలిగావు. నాలుగు ప్రక్కలా ఉన్న మానుండి కూడా నీవు అస్త్రాలను స్వీకరించు' అన్నారు. నేను ఏకాగ్రతతో ఆ దేవతాశ్రేష్ఠులకు ప్రణామం చేసి యథావిధిగా గొప్పవైన ఆ అస్త్రాలను స్వీకరించాను. భారతా! అస్త్రాలను స్వీకరించిన తరువాత దేవతలు నాకు వెళ్ళేందుకు అనుమతి నిచ్చారు. తరువాత దేవతలంతా వచ్చినత్రోవనే వెళ్ళిపోయారు. దేవరాజు ఇంద్రుడు కూడ ఎంతో ప్రకాశిస్తూన్న రథాన్నెక్కి, 'అర్జునా! నీవు స్వర్గానికి వెళ్ళవలసి ఉంది భరతశ్రేష్ఠా! ధనంజయా! ఇక్కడికి రావటానికి ముందే నీ గురించి నాకు తెలుసు. ఆటు తరువాతనే నేను నిన్ను చూస్తున్నాను. పాండవా! వెనుక చాలా సార్లు నీవు పవిత్రజలాల్లో స్నానం చేశావు. ఈ శరీరంతోనే స్వర్గానికి వెళ్ళే అధికారాన్ని పొందావు. మళ్ళీ ఉత్తమమైన రీతిలో తపస్సు చెయ్యాల్సి ఉంది. స్వర్గానికి తప్పక నీవు వెళ్ళాలి. నా ఆదేశం వల్ల మాతలి నిన్ను స్వర్గానికి చేరుస్తాడు.

పాండవశ్రేష్ఠా! ఇక్కడ ఉండి చాలా కష్టమైన తపస్సు చేసినందువల్ల నీవు దేవతలకు, మహాత్ములైన మునులకు తెలుసు' అన్నాడు. తరువాత నేను 'దేవరాజా! నాకు ప్రసన్నుడ వగుమని, నిన్ను అస్త్రాలకోసం ఆచార్యుడుగా వరిస్తున్నా' నని ఇంద్రుడితో అన్నాను.

ఇంద్రుడు చెపుతున్నాడు - 'నాయనా! పాండవా! అస్త్రాలజ్ఞానం పొందిన నీవు క్రూరమైన పనులు చేసేవాడి వౌతావు. అందువల్ల దేనికై అస్త్రాలను పొందాలనుకొంటున్నావో ఆ కోర్కె నెరవేరుగాక! తరువాత నేను 'శత్రువులు ప్రయోగించిన అస్త్రాలను వమ్ముచెయ్యటానికే తప్ప దివ్యాస్త్రాలను మానవులపై ప్రయోగించను' అన్నాను. దేవరాజా! ఆ దివ్యాస్త్రాలను నాకు ప్రసాదించు. అస్త్రాలవల్ల జయించబడే లోకాలను తరువాత పొందాలనుకొంటున్నాను.' అన్నాను. ఇంద్రుడు "ధనంజయా! నిన్ను పరీక్షించటానికి ఈమాటలు పలికాను. నాకుమారుడవైన నీకు ఇలా మాట్లాడటం తగినదే. నా భవనానికి వెళ్ళి అస్త్ర లన్నింటినీ నేర్చుకో. వాయువు, అగ్ని, వసువులు, మరుద్గణాలతో కూడిన వరుణుడు, సాధ్యులు, బ్రహ్మ, గంధర్వులు, ఉరగులు, రాక్షసులు, విష్ణువు, నిర్ఋతిలకు, ఆలాగే నాకు, సంబంధించిన అన్ని అస్త్రాలను నేర్చుకో" అని, నాతో అంటూ ఇంద్రు డక్కడే అంతర్ధానమయ్యాడు. తరువాత గుర్రాలను పూన్చిన ఇంద్రరథం సమీపించింది. రాజా! దివ్యమూ, మాయామయమూ, పవిత్రమూ అయిన ఆ రథం మాతలి అదుపులో ఉంది. లోకపాలకులు వెళ్ళిపోయిన తరువాత మాతలి "మహతేజస్వీ! దేవరాజైన ఇంద్రుడు నిన్ను చూడాలనుకొంటున్నాడు' సిద్ధం కమ్ము. ఆయనను కలుసుకొని కృతార్థుడివికా ! ఇప్పుడు తప్పక చెయ్యదగిన పనిచెయ్యి. పుణ్యంవల్ల లభించే లోకాలను చూడు. ఈ శరీరంతోనే స్వర్గానికి వెళ్ళు. దేవరాజైన ఇంద్రుడు నిన్ను చూడాలనుకొంటున్నాడు' అని మాతలి చెప్పగా నేను హిమాలయపర్వతం నుండి అనుమతి పొంది, ఆ ఉత్తమమైన రథానికి ప్రదక్షిణం చేసి, ఎక్కాను.

మాతలి సారథ్యంలో నేర్పరి. మనస్సు, వాయువులతో సమానమైన వేగంతో గుర్రాల నతడు తోలుతున్నాడు. రాజా! మాతలి అలా రథాన్ని పోనిస్తూ స్థిరంగా కూర్చున్న నావంక చూశాడు. ఆశ్చర్యచకితుడై ఇలా అన్నాడు. 'నాకీ రోజు ఇది చాలా విచిత్రంగా అద్భుతంగా తోస్తోంది. ఈదివ్యరథంమీద కూర్చున్న నీవు ఆ చోటు నుండి ఎంతమాత్రమూ కదలలేదు. భరతశ్రేష్ఠా! గుర్రాలు మొదట ఎగిరేటప్పుడు దేవరాజైన ఇంద్రుడు కూడా కదలటం నేనెప్పుడూ చూస్తూంటాను. కాని నీవు మాత్రం రథం కదులుతున్నా ఇక్కడే కదలకుండా ఉన్నావు. నీదంతా ఇంద్రుని మించిపోయిం దంటూ అంతరిక్షంలోకి ప్రవేశించి మాతలి దేవతల నివాసాలను, విమానాలను నాకు చూపసాగాడు. తరువాత గుర్రాలు

పూన్చబడిన ఆ రథం అక్కడినుండి పైకి వెళ్ళసాగింది. ఋషులు, దేవతలూ ఆ రథాన్ని పూజిస్తున్నారు. తరువాత తమ కోర్కె బట్టి వెళ్ళుతున్న దేవర్షుల లోకాలను చూశాను. అంతులేని తేజస్సుగల గంధర్వుల, అప్సరసల ప్రభావాన్ని; నందనం మొదలైన దేవతల ఉద్యానవనాలను, తోటలను మాతలి చకచకా నాకు చూపించసాగాడు. తరువాత అడిగిన పండ్లనిచ్చే చెట్లు, రత్నాలతో బాగా అలంకరించబడిన అమరావతీ పట్టణాన్ని, ఇంద్రుడి భవనాన్ని చూశాను. సూర్య డక్కడ తాపాన్నీయడు. చలి, ఎండా లేవు. అలసట లేదు. రాజా! అక్కడ దుమ్ములేదు. రజోగుణం బాధించదు. ముసలితనపు బాధలేదు. అక్కడ మనోవేదన, దీనత, బలహీనతా కనబడవు. దేవతలకు విచారం లేదు. దేవతలు మొదలైన వారికక్కడ కోపం, పేరాశ లేవు. స్వర్గంలో నివసించే ప్రాణులు ఎల్లప్పుడూ సంతోషాన్నే కలిగి ఉన్నారు. అక్కడ చెట్లు ఆకుపచ్చని ఆకులతో ఎప్పుడూ పూలతో, పండ్లతో నిండి ఉన్నాయి. వేలకొలది సౌగంధిక పద్మాలతో కూడిన అనేక సరోవరా లున్నాయి. అక్కడ గాలి చల్లగా, సువాసనలను వెదజల్లుతూ, స్వచ్ఛంగా నూతనోత్తేజాన్నిస్తూ వీస్తుంది. నేల రత్నాలన్నిటితో విచిత్రంగా, పూలతో అలంకరించబడి ఉంటుంది. అనేక జంతువులు, పక్షులూ మనోహరంగా మధురంగా ధ్వనులు చేస్తూంటాయి. అక్కడ చాలామంది ఆకాశంలో విమానాల మీద వెళుతూ కనబడతారు. తరువాత వసువుల్ని, రుద్రుల్ని, సాధ్యుల్ని, మరుద్గణాలను, ఆదిత్యుల్ని, అశ్వినుల్ని చూశాను. వారిందరినీ పూజించాను. వారంతా నన్ను పరాక్రమం, కీర్తి, తేజస్సు, బలం, అస్త్రాలు, యుద్ధంలో విజయమూ కలగాలని దీవించారు.

దేవతలు గంధర్వులచేత ఆరాధింపబడే ఆ నగరాన్ని ప్రవేశించి, దేవరాజైన దేవేంద్రుడి చెంత చేతులు జోడించి, నిలచాను. దాతలలో శ్రేష్ఠుడైన ఇంద్రుడు సంతోషించి, నాకు తన సింహాసనంలో సగ మిచ్చాడు. ఇంద్రుడు ఎంతో ఆదరంతో నా అవయవాలను తాకాడు. అక్కడ నేను దేవతలు, గంధర్వులతో కలిసి అస్త్రవిద్య నేర్చుకొంటూ అస్త్రాలకోసం ఉన్నాను. గంధర్వరాజు విశ్వావసు కుమారుడైన చిత్రసేనుడు నాకు స్నేహితు డయ్యాడు. రాజా! నాకతడు సంగీత విద్యనంతా నేర్పాడు. నేనక్కడ ఇంద్రభవనంలో ఎంతో ఆదరించబడి, అస్త్రాలను నేర్చుకొంటూ కోరిందల్లా పొందుతూ సుఖంగా నివసించాను. గానాన్ని పుష్కలమైన దేవవాద్యాల ధ్వనులను వింటూ, నాట్యమాడే అప్సరసలను చూస్తూ గడిపాను. ఈ సౌకర్యాలను, సుఖాలను తిరస్కరించకుండా, వాటి నిజరూపాన్ని గ్రహించి, చివరకవి సారం లేని వని చక్కగా తెలుసుకొని నేను ఎక్కువ అస్త్రవిద్య అభ్యసించడంలోనే నిమగ్నమయ్యాను. దానివల్ల ప్రభువైన ఇంద్రుడు నాకోరికను గుర్తించి సంతోషించాడు.

రాజా! అలా ఉంటున్న నాకు స్వర్గంలో కాలం గడుస్తూ ఉంది. నా అస్త్రవిద్యలో నైపుణ్యం వల్లను నమ్మదగిన స్థితి వల్లనూ ఇంద్రు డొకనాడు తన రెండుచేతులతో నాతలపై తాకి ఇలా అన్నాడు. 'నీ వీక దేవతా సమూహాలవల్ల కూడ యుద్ధంలో జయించ రానివాడ వయ్యావు. మానవలోకంలో తమపైనే అదుపులేని మానవులచేత ఎలా జయించబడతావు? నీవు యుద్ధంలో మితంలేని శక్తికలవాడివి. ఎదిరింప శక్యం కాని వాడివి. సాటిలేనివాడివి. దేవాసురు లెవరిచేత కూడ జయించబడవు.' ఇంకా ఆ దేవుడు గగుర్పాటుతో మళ్ళీ ఇలా అన్నాడు.

'వీరుడా! అస్త్ర యుద్ధంలో నీకెవ్వడూ సమానుడు కాలేడు. కురుశ్రేష్ఠా! నీవెప్పుడూ జాగరూకుడివి. సమర్థుడివి. ఇంద్రియాలను జయించినవాడివి. సత్యాన్నే పలుకుతావు. బ్రాహ్మణభక్తి కలవాడివి. అస్త్రవేత్తవు. శూరుడివి. ఐదువిధులలో పదిహేను అస్త్రాలను నీవు సంపాదించావు. పార్థా! నీకు సమానుడే లేడు. ధనంజయా! ప్రయోగం, ఉపసంహారం, ఆవృత్తి, ప్రాయశ్చిత్తం, ప్రతిఘాతాలను పూర్తిగా నీవు తెలుసుకొన్నావు. కాబట్టి అర్జునా! గురుదక్షిణ సమర్పించే సమయం ఆసన్నమైంది. నీ వది చెయ్యటానికి ప్రతిజ్ఞ చెయ్యి. అప్పుడా గొప్పపనిని నీకు చెప్తాను.' అప్పుడు నేను దేవరాజుతో 'చెయ్యటానికి సాధ్యం కానిదైనా చేసినట్లే అనుకో' అన్నాను. ఆ ఇంద్రుడు నవ్వుతూ నాతో ఇలా అన్నాడు. "నీకిప్పుడు మూడులోకాల్లోనూ సాధ్యంకాని దేదీలేదు. నివాతకవచు లనబడే దానవులు నాకు శత్రువులు. వాళ్లు సముద్రగర్భంలో వెళ్ళటానికి వీలుకానిచోట ఉంటున్నారు. వారి సంఖ్య మూడుకోట్లుగా చెప్పబడుతోంది. వారందరి ఆకారం, బలం, తేజస్సు ఒకేరకంగా ఉంటాయి. కుంతీకుమారా! వారినక్కడ చంపు. దానివల్ల నీవు గురుదక్షిణ చెల్లించిన ట్లౌతుంది" అని గొప్ప కాంతులీనే దివ్యమైన రథాన్ని నాకిచ్చాడు. దానికి నెమలిఈకల వంటి రోమాలు కల గుర్రాలు పూన్చబడ్డాయి. మాతలి అందులో ఉన్నాడు. ఈ ఉత్తమమైన కిరీటాన్ని నా తలకు అమర్చాడు. నా ఆకారానికి తగినట్లు నాశరీరానికి ఆభరణాల నిచ్చాడు. ఉత్తమమైన రూపం, స్పర్శగల ఈ భేదించలేని కవచాన్నిచ్చాడు. తెగని ఈ అల్లెత్రాటిని గాండీవానికి సమకూర్చాడు. పూర్వం దేవరాజు విరోచనుని కుమారుడైన బలిని జయించటాని కుపయోగించిన ఆరథం మీద నే నప్పుడు బయలుదేరాను. మహారాజా! ఆ రథ ధ్వనివల్ల ఆసక్తితో దేవతలంతా దేవరా జనుకొని నాదగ్గరకు వచ్చారు. నన్ను చూశాక 'అర్జునా! ఏం చెయ్యబోతున్నా'వని అడిగారు. వారితో 'మహానుభావులారా! నేను యుద్ధం చెయ్యబోతున్నాను. నివాతకవచుల్ని వధించటానికి వెళ్తున్నానని తెలుసుకోండి' అని ఉన్నది ఉన్నట్లు చెప్పాను. నాకు శుభం పలకమన్నాను. రాజా! ఆ దేవతలప్పుడు

ప్రసన్నులై దేవరాజు ఇంద్రుడిని స్తుతించినట్లు నన్ను ప్రశస్త వాక్కులతో సంతోషపెట్టారు. ఇంద్రుడు యుద్ధంలో ఈ రథంతోనే శంబరుణ్ణి, నముచిని, బలుడిని, వృత్రుడిని, ప్రహ్లాద నరకుల్ని జయించాడు. అనేక వేల లక్షల కోట్ల రాక్షసుల్ని యుద్ధంలో ఇంద్రుడు ఈ రథంతోనే జయించాడు. కుంతీకుమారా! ఇంద్రుడు. పూర్వం చేసినట్లుగా నీవు కూడా ఈ రథంతో యుద్ధంలో పరాక్రమం చూపి నివాతకవచులను జయిస్తావు. ఇది శ్రేష్ఠమైన శంఖం, దీనవల్ల దానవుల్ని జయించగలుగుతావు. మహాత్ముడైన ఇంద్రుడు కూడ దీనివల్ల లోకాల్ని. జయించాడు. జయంకోసం దీన్ని గ్రహించాను. ఈ శంఖం దేవతలచేత ఇవ్వబడింది కాబట్టి దీని పేరు దేవదత్తం. శంఖాన్ని గ్రహించి దేవతలచేత స్తుతించబడుతూ శంఖం, కవచం, బాణాలు ధనుస్సు పట్టుకుని, యుద్ధం చెయ్యాలనే కోరికతో భయంకరమైన ఆ దానవుల నివాసానికి బయలుదేరాను."

169. అర్జునుడు నివాతకవచులతో యుద్ధము ప్రారంభించుట.

అర్జునుడు చెపుతున్నాడు – "తరువాత నేను త్రోవలో అక్కడక్కడా మహర్షులచేత స్తుతింపబడుతూ సాగి భయంకరమైన సముద్రాల్ని చూశాను. వాటిలో అలలు నురుగుతో ఉన్నాయి. చెల్లాచెదరుగా, కలిసికట్టుగా నాట్యమాడే పర్వతాల్లాగా చెలరేగుతూ దుముకుతూ కనబడసాగాయి. చుట్టూ తిరిగే ఆకాశంలోని విమానాల్లాగా అక్కడ రత్నాలతో నిండిన పడవలు ప్రకాశిస్తున్నాయి. తిమింగిలాలు, తాబేళ్ళు, తిమితిమింగలాలు, మొసళ్ళు అక్కడ నీళ్ళలో మునిగిన కొండల్లాగా కనబడసాగాయి. అంతటా వేలకొలది శంఖాలు నీళ్ళలో ఉన్నాయి. రాత్రిపూట విస్తరించిన మబ్బుతునకలచే చుట్టబడ్డ నక్షత్రాలలాగా రత్నరాశులక్కడ తేలుతూ కనబడుతున్నాయి. భయంకరంగా గాలి గర్జిస్తోంది. అది అద్భుతంలా ఉంది. చాలా వేగం కల ఉత్తమమైన ఆ సముద్రాన్ని చూసి దానికి దగ్గరలో దానవులతో నిండిన ఆ దైత్యుల పట్టణాన్ని చూశాను. రథాన్ని నడపడంలో నేర్పరి అయిన మాతలి వెంటనే అక్కడే భూమ్మీద దింపి ఆ రథాన్ని జాగ్రత్తగా అదుపుచేస్తూ పోనిచ్చాడు. ఆ రథం చప్పుడుతో బెదరగొడుతూ ఆ పట్టణంవైపు దౌడుతీశాడు. ఆకాశంలో మేఘగర్జనలాంటి ఆ రథం చప్పుడు విని దానవులు నన్ను దేవరాజుగా తలచి కలవరం చెందారు. అందరూ తత్తరపాటుతో బాణాలను ధనుస్సులను పట్టుకొన్నారు. అలాగే కత్తి, శూలం, గొడ్డలి, గద, రోకళ్ళను పట్టుకొన్నారు. తరువాత బెదిరిపోయిన మనస్సులతో దానవులు రక్షణ కల్పించి తలుపులు మూసేశారు. పట్టణానికి బయట ఒక్కడూ కనపడటంలేదు.

దేవదత్తశంఖాన్ని తీసుకుని చాలాసంతోషంతో నేను మెల్లగా పూరించాను. ఆ

శబ్దం స్వర్గాన్ని తాకి ప్రతిధ్వనించింది. దానికి పెద్దపెద్ద ప్రాణులు కూడా భయాన్ని పొంది ఇటు – అటూ దాక్కున్నాయి. పిమ్మట నివాతకవచులందరూ చక్కగా అలంకరించుకొని, అనేక విధాలైన తొడుగులను తొడుగుకొని, విచిత్రా ఆయుధాలను చేతపట్టారు. చేతుల్లో ఇనుపశూలాలతో, గదలతో, రోకళ్ళతో, బడిసెలతో, కత్తులతో, రథచక్రాలతో, ఫిరంగులతో, తూటాలతో, అనేకవిధాలకత్తులతో వేలసంఖ్యలో దైత్యులు నగరం బయటకు వచ్చారు. మాతలి ఎన్నోరకాలుగా ఆలోచించి ఎత్తుపల్లాలు లేనిచోట తగిన మార్గాలలో ఆ గుర్రాలను పోనిచ్చాడు. అలా పోనివ్వటంవల్ల, చక్కగా శిక్షణ పొంది, వేగంగా వెళ్ళే ఆ గుర్రాలవేగం వల్ల అప్పుడు నేను ఏమీ చూడలేకపోయాను. అది నాకెంతో అద్భుత మనిపించింది. ఆ దానవు లక్కడ చాలా రోతపుట్టించే స్వరం, రూపం గల వాద్యా లన్నింటిని వేలకొలదిగా వాయించారు. ఆ శబ్దంవల్ల సముద్రంలో కొండల్లా ఉన్న చేపలు ఒక్కసారిగా ప్రాణాలు పోగా వందలు, వేలసంఖ్యలో పైకి తేలాయి. చాలావేగంతో వందలు వేలసంఖ్యలో వాడిగా బాణాలను వదులుతూ దానవులు నామీదకు వచ్చారు. వారికీ, మధ్య జరిగిన ఆ నాకూ ఆ యుద్ధం చాలాభయంకరమైనది, గుక్కతిప్పుకో లేనిదీ. అది నివాతకవచుల ముగింపుకే దారి తీసింది. దేవర్షులు ఇతరులైన మహర్షులు, బ్రహ్మర్షులు, సిద్ధులు ఆ యుద్ధాన్ని తిలకించటానికి వచ్చారు. తారకామయ యుద్ధంలో ఇంద్రుని స్తుతించినట్లు నా జయాన్ని కోరుతున్న ఆ మునులు నన్ను తగిన మధురమైన మాటలతో పొగడారు."

170. అర్జునుడు నివాతకవచులతో యుద్ధమొనర్చుట.

అర్జునుడు చెపుతున్నాడు – "భారతా! తరువాత నివాతకవచులందరూ కలిసికట్టుగా ఆయుధాలు తీసుకుని యుద్ధభూమిలో వేగంగా నామీద పడ్డారు. ఆ మహారథులు రథమార్గాన్ని కప్పి, భయంకరంగా అరుస్తూ, అన్నిప్రక్కలనుండి, నామీద బాణాలవాన కురిపించారు. మరికొందరు గొప్ప పరాక్రమవంతులైన దానవులు శూలాల్ని, బడిసెల్ని పట్టుకొని నాపై విసిరారు. వారిచేత నిరంతరం సృష్టించబడే ఆ శూలవర్షం నారథంపై పడుతోంది. దానికి తోడు గదలు, శక్తి ఆయుధాలు దెబ్బతీస్తున్నాయి. పదునైన శస్త్రాలు ఆయుధాలుగా గల్గి, నేర్పరులై, భయంకరులై, నల్లనిఆకారాలు గల మరికొందరు నివాతకవచులు యుద్ధంలో నాపైపు పరుగుతీశారు. యుద్ధంలో నేను వాళ్ళల్లో ఒక్కొక్కడిని గాండీవ ధనుస్సుతో సూటిగా వేగంగల పదేసి బాణాలతో కొట్టాను. వాళ్ళపై నేను విడిచిన బాణాలతో వారంతా పరారయ్యారు. అప్పుడు మాతలి వెంటనే రథ – అశ్వాలను వేగంగా తోలాడు. వాయువేగంగల ఆ గుర్రాలు అక్కడ అనేక విధాలుగా పరుగెడుతూ

పోతున్నాయి. మాతలిచే అదుపు చెయ్యబడుతూ దితికుమారులైన ఆ రాక్షసుల్ని చిలికేశాయి. విశాలమైన ఆ రథానికి పదివేల గుర్రాలు పూన్చబడ్డాయి. మాతలి అదుపులో ఉండటంచేత కొద్దిసంఖ్య కలిగినట్లు శాంతంగా కదులుతున్నాయి. ఆ గుర్రాల పాదాలక్రింద నలిగిపోవటంచేత, రథచక్రాల చప్పుడు చేత, నా బాణాలతాకిడిచేత ఆ రాక్షసులు వందలకొలదిగా చనిపోయారు. అక్కడ కొంతమంది ధనుస్సు, బాణాలు చేతిలో పట్టుకుని ప్రాణాలు పోగొట్టుకున్నారు. వారి సారథులూ చనిపోయారు. ఆ పరిస్థితిలో గుర్రాలు వారినీడ్చుకొని వెళ్లుతున్నాయి.

అనేక శస్త్రాలతో దెబ్బతీస్తూ వారంతా దిక్కుల్ని, మూలల్ని కప్పేస్తూ నన్ను కొట్టసాగారు. దానివల్ల నామనసు కలత చెందింది. మాతలియొక్క అద్భుతమైన శక్తిని నేనపుడు గమనించాను. అతడు సాటిలేని వేగంగల గుర్రాల్ని అలవోకగా అదుపుచేశాడు. అప్పుడు నేను యుద్ధభూమిలో సాయుధాలైన వందలుగా, వేలుగా ఉన్న ఆ రాక్షసుల్ని చురుకుగా తాకే అనేక అస్త్రాలతో చెల్లా చెదరు చేశాను. ఇలా అన్నివిధాలుగా ప్రయత్నించి ఆ యుద్ధభూమిలో తగిన ప్రతాపం ప్రదర్శించే నాపట్ల మాతలి ప్రీతి చెందాడు. అప్పుడు వారిలో కొందరు ఆ గుర్రాలవల్ల, ఆ రథం క్రింద చనిపోయారు. అలాగే ఇతరులు యుద్ధభూమిని విడిచిపోయారు. యుద్ధభూమిలో మాతో పోటీపడుతున్నట్లుగా నివాతకవచులు నన్ను బాణాల భారీవర్షాలతో ఆడ్డుకొన్నారు. అప్పుడు నేను వేగంగా తాకే అనేక బాణాలను బ్రహ్మాస్త్రంతో అభిమంత్రించి వదిలాను. దానివల్ల వెంటనే వందలు, వేలుగా రాక్షసులు సంహరించబడ్డారు. అలా బాధించబడి ఆ దానవులు కోపంతో కలిసికట్టుగా బాణాలు, శూలాలూ, కత్తులూ వర్షంలా నాపై ప్రయోగించి బాధించారు. అప్పుడు నేను ప్రచండమైన తేజస్సుగల, శ్రేష్ఠమైన దేవరాజుకు ఇష్టమైన మాధవ మనే అస్త్రాన్ని ఆశ్రయించాను. ఆ అస్త్ర ప్రభావంతో వారు వదిలిన వేలకొలది కత్తులు, త్రిశూలాలు, తోమరాలను వందల ముక్కలుగా చేశాను. వారి ఆయుధాల నన్నింటిని ముక్కలు చేసిన తరువాత నేను వారిన్ని కూడా కోపంతో పదిపది బాణాలతో గాయపరిచాను.

యుద్ధభూమిలో అప్పుడు గాండీవం నుండి తుమ్మెదల వరుసల్లా పెద్దపెద్ద బాణాలు వెలువడుతున్నాయి. మాతలి దాన్ని మెచ్చుకొన్నాడు. నన్ను బలంగా తాకుతున్న ఆ దానవుల బాణాలను నేను నా బాణాలతో వమ్ము చేశాను. అలా చంపబడుతున్న ఆ నివాతకవచులు మళ్ళీ శ్రేష్ఠమైన బాణాలతో చుట్టూ నన్ను ముట్టడించారు. నేనప్పుడు అస్త్రాలను నశింపచేసే అస్త్రాలతో వారి బాణాల వేగాన్ని అదుపుచేసి, మంటలు క్రక్కుతూ, వేగంగా వెళ్ళే శ్రేష్ఠ బాణాలతో వేలరాక్షసుల్ని గాయపరచాను. పిమ్మట వర్షాకాలంలో వాననీటిని జాలువార్చే కొండశిఖరాలలాగ తెగిన వారి అవయవాలు రక్తాన్ని ధారలుగా

ప్రవిస్తున్నాయి. వేగంగా, సూటిగా వెళ్తూ, ఇంద్రుడి వజ్రాయుధంలా తాకే, నాబాణాలతో చంపబడుతున్న ఆ దానవులు భయంతో కలతచెందారు. వారి శరీరాలు ముక్కల య్యాయి. ఆయుధాలూ, ఉత్సాహమూ క్షీణించాయి. అప్పుడు నివాతకవచులు నాతో మాయా యుద్ధానికి దిగారు."

171. దానవుల మాయా యుద్ధము.

"నాచుట్టూ భారీగా రాళ్ళవర్షం మొదలైంది. కొండలతో సమానమైన రాళ్ళు పడుతున్నాయి. అది నన్ను ఎంతో బాధించింది. ఆ యుద్ధంలో నేను మహేంద్రాస్త్రం అభిమంత్రించి, వేగంగల వజ్రాయుధంలాంటి బాణాలవరుసతో ఆ రాళ్ళవానను పొడిపొడి చేశాను. రాళ్ళవాన నుగ్గుచేయబడుతుంటే మంటపుట్టింది. రాతిముక్క లక్కడ నిప్పురవ్వల్లాగా పడ్డాయి. రాళ్ళవాన శాంతించింది పాములాంటి ధారలతో నాకు దగ్గరగా చాలాపెద్ద నీటివర్షం మొదలైంది. ఆకాశం నుండి జారే ప్రచండమైన శక్తిగల వేల కొద్దీ ధారలు ఆకాశన్నంతా అలాగే దిక్కుల్ని, మూలల్ని కూడా కమ్మేశాయి. ధారలు కురియటంచేత, గాలి తాకిడిచేత, రాక్షసుల గర్జనచేత ఏమీ తెలియటం (తోచటం) లేదు. స్వర్గం నుండి భూమిదాకా కలుపుకొని అన్నిప్రక్కలా ఎప్పుడూ భూమిపైన కురుస్తున్న ఆ ధారలు నన్నక్కడ మోహంలో పడేశాయి. ఆ సందర్భంలో ఇంద్రు డుపదేశించిన దివ్యమైన విశోషణాస్త్రాన్ని ప్రయోగించాను. దానితో ఆ నీరు ఎండిపోయింది. నేను రాళ్ళ వర్షాన్ని నశింపచేసి, జలవర్షాన్ని ఎండిపోయేటట్లు చెయ్యగానే దానవులు మాయామయమైన నిప్పును, గాలిని వదలసాగారు. అప్పుడు నేనా మంటలన్నింటినీ వారుణాస్త్రంతో చల్లార్చాను. గొప్పదైన శైలాస్త్రంతో వాయువు వేగాన్ని అడ్డుకున్నాను. ఆ మాయ త్రిప్పి కొట్టగానే, యుద్ధోన్మాదంతో, ఆ దానవులు ఒకేసారి ఎన్నోరకాల మాయలను ప్రయోగించారు. అప్పుడు ఎంతో భారీగా, గగుర్పాటు కలిగించే భయంకరమైన అస్త్రాలు, నిప్పులు, గాలి, రాళ్ళ వాన మొదలైంది. ఆ మాయామయమైన వర్షం యుద్ధంలో నన్ను బాధించసాగింది. అటుపిమ్మట, అన్నిప్రక్కలా భయంకరమైన చిమ్మచీకటి ఆవరించింది. ఘోరమైన చీకటి లోకమంతా ఆవరించగానే గుర్రాలు యుద్ధానికి విముఖత చూపాయి. మాతలి కూడ జారిపోయాడు. అతని చేతినుండి గుర్రాలను కట్టిన త్రాళ్ళు, చెర్నాకోల నేలమీద పడిపోయాయి. భయంతో నన్ననేకసార్లు 'భరతశ్రేష్ఠా! అర్జునా! ఎక్కడున్నా'వని పిలిచాడు. అతడలా తెలివి తప్పితే నాకు చాలా భయం వేసింది. తెలివి తప్పిన ఆ మాతలి ఎంతో బెదిరిపోయిన నాతో ఇలా అన్నాడు. 'కుంతీకుమారా! పూర్వం అమృతంకోసం దేవాసురులమధ్య గొప్పయుద్ధం

జరిగింది. దాన్ని నేను చూశాను. శంబరుణ్ణి చంపటానికి గొప్పభయంకరమైన యుద్ధం జరిగింది. అక్కడ కూడ నేను దేవరాజైన ఇంద్రుడికి సారథ్యం చేశాను. అలాగే వృత్రుణ్ణి చంపే సమయంలో నేను గుర్రాలను కట్టడి చేశాను. విరోచనుడి కుమారుడైన బలి చేసిన గొప్ప భయంకరమైన యుద్ధాన్నీ చూశాను. చాలా ఘోరమైన ఈ యుద్ధాల్లో నేను పాల్గొన్నాను. పాండవా! ఇలా ముందెన్నడూ తెలివిని కోల్పోలేదు. తప్పకుండా ఇది సృష్టికర్త ప్రజలను చంపదలిచి చేసినదై ఉంటుంది. ఇలాంటి యుద్ధం ప్రపంచ ప్రళయసమయంలో తప్ప మరెప్పుడూ జరగదు.'

అతని ఆ మాట విని, నన్ను నేను అదుపుచేసుకొని, నేను ఆ దానవుల గొప్ప మాయాబలాన్ని అడ్డుకొంటూ భయంతో ఉన్న మాతలితో 'నాభుజబలాన్ని అస్త్రాలయొక్క గాండివ ధనుస్సు యొక్క ప్రభావాన్ని చూడు' 'సూతా! నేనీరోజు భయంకరమైన వీరమాయను, ఈ చిమ్మ చీకటిని నా అస్త్రమాయతో నశింపచేస్తాను. భయపడకు. నిలకడగా ఉండు' అన్నాను. రాజా! ఈ విధంగా చెప్పి, దేవతల మేలుకై అన్ని ప్రాణులనూ మోహింపచేసే నా అస్త్రమాయను సృష్టించాను. ఆ మాయలను నివారిస్తూ మితంలేని తేజస్సు గలిగిన ఆ రాక్షసోత్తములు మళ్ళీ అనేక మాయలను కల్పించారు. ఒకప్పుడు వెలుగు ఏర్పడుతోంది. మరొకప్పుడు చీకటి క్రమ్మేస్తోంది. లోకమంతా కనబడకుండా పోతోంది. ఒకప్పుడు నీళ్ళలో మునిగిపోతోంది. వెలుగు వచ్చినప్పుడు మాతలి గుర్రాలను అదుపుచేస్తూ గగుర్పాటు కలిగించే యుద్ధంలో ఆ రథంమీద ముందుకు పోసాగాడు. అప్పుడు భయంకరులైన నివాతకవచులు నామీద విరుచుకుపడ్డారు. అవకాశం చేజిక్కించుకుని నేను వాళ్లను యమలోకానికి పంపాను. నివాతకవచుల్ని అంతమొందించటానికి అలా యుద్ధం జరుగుతుండగా, మాయతో కప్పబడిన ఆ రాక్షసులను వెంటనే చూడలేకపోయాను."

172. అర్జునుడు నివాతకవచులను సంహరించుట.

అర్జునుడు చెపుతున్నాడు – "ఆ దానవులు మాయచేత కనబడకుండా యుద్ధం చెయ్యసాగారు. నేను కూడా కనబడని అస్త్రబలంతో వారితో యుద్ధం చెయ్యసాగాను. చక్కగా అస్త్రాలచే అభిమంత్రించబడి గాండీవం నుండి విడువబడ్డ బాణాలు వా రెక్కడెక్కడుంటే అక్కడక్కడికివెళ్ళి వాళ్ళ తలలను తెగగొట్టాయి. నాచేత యుద్ధంలో చంపబడుతున్న నివాతకవచులు మాయను ఉపసంహరించి, వెంటనే తమనగరంలో ప్రవేశించారు. దైత్యులు పారిపోగా, వెలుగువచ్చి అక్కడ వందలు వేలుగా చనిపోయిన దానవులను చూశాను. అక్కడ వాళ్ళ శస్త్రాలు, ఆభరణాలు, శరీరాలు, కవచాలు వందలుగా ముక్కలయి

కనబడుతున్నాయి. గుర్రాలకు అడుగు తీసి, అడుగువెయ్యటానికి చోటు లేకపోయింది. అప్పుడు అంతరిక్షంలో వెళ్ళే ఆ గుర్రాలు ఒక్క దూకు దూకి ఆకాశంలో నిలచాయి. నివాతకవచులు కనబడకుండా ఆక్రమించి ఆకాశాన్ని మాత్రం కప్పేసి రాళ్ళు కురిపించసాగారు. కొంతమంది భయంకరులైన దానవులు భూమిలోపల ఉండి గుర్రాల కాళ్లను, రథచక్రాలను పట్టుకొన్నారు. యుద్ధం చేస్తున్నప్పుడు నా పచ్చని గుర్రాలను, రథాన్ని కదలకుండా చేసి, అన్నిప్రక్కలా కొండలతో రథంతోపాటు నన్ను గాయపరచారు. క్రిందపడ్డ కొండలు పేరుకుపోతున్నాయి. వేరేవి పైన వచ్చి పడుతున్నాయి. అప్పుడు మేమున్న ఆ చోటు గుహలా తయారైంది. పర్వతాలతో నేను కప్పబడుతున్నాను. నా గుర్రాలను పట్టుకొన్నారు. నేనెంతో బాధను పొందాను. మాతలి ఆ పరిస్థితిని గుర్తించాడు. భయానికి లోనైన నన్ను గుర్తించి 'అర్జునా! నీవు భయపడకు. వజ్రాస్త్రాన్ని ప్రయోగించు' అన్నాడు. నేనప్పుడు అతని మాటలు విని దేవరాజుకు ఇష్టమైన, భయంకరమైన వజ్రాస్త్రాన్ని ప్రయోగించాను. కదలనిచోటున నిలబడి, గాండీవధనుస్సును వజ్రాస్త్రంతో అభిమంత్రించి, వజ్రం(పిడుగు)లా తాకే పదునైన ఇనుపబాణాలను వదిలాను. తరువాత వజ్రాస్త్రాన్ని అభిమంత్రించి వదిలిన ఆ బాణాలు వజ్రాల్లాగా అయి ఆ మాయ లన్నింటినీ, ఆ నివాతకవచులనూ చొచ్చుకుపోయాయి. పిడుగుపాటు వేగంతో కొట్టబడ్డ ఆ పర్వతాల్లాంటి దానవులు ఒకరినొకరు కౌగలించుకొని, నేలమీద పడిపోయారు. భూమిలోపల ఉండి రథం గుర్రాలను పట్టుకొన్నదానవుల లోకి చొచ్చుకుపోయి, బాణాలు వారిని యమలోకానికి పంపాయి. పర్వతాల్లాగా ఉన్న నివాతకవచులను చంపి ఇటూ అటూ విసరబడటం చేత ఆ చోటు వెదజల్లబడ్డ పర్వతాలతో కప్పబడ్డట్టుంది. గుర్రాలకు గాని, రథానికి గాని, మాతలికి గాని, నాకు గాని ఎలాంటి హాని జరిగినట్లు కనబడలేదు. అది అద్భుతంలా ఉంది.

మాతలి నవ్వుతూ 'అర్జునా! నీలో కనబడుతున్న ఈ పరాక్రమం దేవతల్లో కూడా లేదు' అని నాతో అన్నాడు. ఆ రాక్షససమూహాలు చంపబడగానే వారి భార్య లందరూ ఆ నగరంలో శరత్కాలంలో బెగ్గురుపక్షుల్లా ఏడ్చారు. తరువాత మాతలితో కలిసి రథం చప్పుడుతో నివాతకవచుల స్త్రీలను బెదరగొడుతూ ఆ దైత్యనగరానికి వెళ్ళాను. నెమళ్ళలాగా అందంగా ఉన్న ఆ పదివేల గుర్రాలను, సూర్యుడిలా ఉన్న ఆ రథాన్ని చూసి స్త్రీలు గుంపులుగా పరుగెత్తారు. భయకంపితులై పారిపోయే ఆ దానవ స్త్రీల ఆభరణాల శబ్దం అప్పుడు కొండలమీద రాళ్ళుపడుతుంటే చప్పు డౌతున్నట్లుంది. భయపడి పారిపోయే ఆ దైత్యస్త్రీలు అనేక రత్నాలతో విచిత్రంగా ఉన్న, బంగారు మయమైన తమ భవనాల్లో ప్రవేశించారు. దేవతలనగరం కన్న శ్రేష్ఠమై, అద్భుతమైన ఆకారంతో ఉన్న ఉత్తమమైన

ఆ నగరాన్ని చూసి తరువాత నేను మాతలి నడిగాను. 'ఇలాంటి నగరంలో ఎందువల్ల దేవతలు నివసించటం లేదు? ఇంద్రుడి పట్టణం కన్న ఇది శ్రేష్ఠమైనదిగా తోస్తోంది.'

మాతలి చెపుతున్నాడు - 'కుంతీకుమారా! పూర్వమీపట్టణం మన దేవరాజు అధికారంలోనే ఉండేది. తరువాత నివాతకవచులచేత ఇక్కడి నుండి దేవతలు తొలగించబడ్డారు. నివాతకవచులు గొప్ప తీవ్రమైన తపస్సుచేసి, బ్రహ్మను మెప్పించి తాము నివసించటానికి ఈ నగరాన్నీ, యుద్ధంలో దేవతల వల్ల భయం లేకుండా ఉండాలని కోరారు. అప్పుడు ఇంద్రుడు భగవంతుడైన బ్రహ్మతో 'భగవంతుడా! మామేలు కోసం వీరిని హతమార్చండి' అని వేడుకొన్నాడు. అప్పుడు 'దైవనిర్ణయమిది. నీవు మరియొక శరీరంతో వీరిని అంతమొందిస్తా' వని భగవంతుడైన బ్రహ్మ చెప్పాడు. అందువల్ల వీళ్ళను చంపటానికి ఇంద్రుడు నీకు అస్త్రాల నిచ్చాడు. నీచేత చంపబడ్డ వీళ్ళు దేవతలవల్ల చావరు. భారతా! అందువల్ల కాలంయొక్క మార్పు చేత వీళ్ళను చంపేందుకే నీవిక్కడకు వచ్చావు. అలా చేశావు. దానవుల వినాశం కోసం ఉత్తమమూ, శ్రేష్ఠమూ అయిన అస్త్రబలాన్ని ఇంద్రుడు నీకు కలిగించాడు.' అర్జునుడు చెపుతున్నాడు ఆ దానవుల్ని చంపిన తరువాత ఆ నగరాన్ని శాంతింపజేసి మాతలితో కలిసి తిరిగి ఆ దేవలోకానికి వెళ్ళాను.

173. అర్జునుడు పౌలోమ కాలకేయులను సంహరించుట.

'తరువాత నేను తిరిగి వస్తున్నప్పుడు' అగ్ని సూర్యులకాంతితో, దివ్యమైన పెద్ద పట్టణాన్ని చూశాను. అది కామగమనం కలది. తియ్యగా కూస్తున్న పక్షులతో అనేక విధాలైన రత్నమయమైన చెట్లున్నాయి. అక్కడ ఎప్పుడూ సంతోషం వీడని పౌలోమ, కాలకంజులనే రాక్షసులు నివసిస్తున్నారు. ఆ నగరం గోపురాలతో ఎత్తైనభవనాలతో, నాలుగు ప్రక్కలా ద్వారాలుండి శత్రువులు ప్రవేశించలేనిది. రత్నాలమయము దివ్యమూ అయిన ఆ నగరం చూడటానికి అద్భుతంలా ఉంది. అన్ని రత్నాలతో నిండిన పూలు, పండ్లతో కూడిన చెట్లతో నిండి ఉంది. మనోహరమైన పక్షులతో కూడి ఉంది. పూలదండలు దాల్చిన వారితో నిండి ఆ నగరం సదా సంతోషంగా ఉంటుంది. శూలాలు, ఋష్టులు, రోకళ్లు, ధనుస్సులు ఈటెలు ధరించినవారితో నిండిఉంది. రాజా! అద్భుతంగా కనబడే ఆ రాక్షసుల పట్టణాన్ని చూసి నేను ఈ అద్భుతమేమిటని మాతలినడిగాను. మాతలి చెపుతున్నాడు - దైత్యవంశానికి చెందిన పులోమ, కాలక - ఇద్దరూ వేయి దివ్యసంవత్సరాలు గొప్ప తపస్సు చేశారు. తపస్సు ముగిసినప్పుడు వారిద్దరికీ బ్రహ్మ వరమిచ్చాడు. వారిద్దరూ తమ కుమారులకు దుఃఖం కలుగకూడదని వరం పొందారు. రాజేంద్రా! దేవతలు,

రాక్షసులు, పాములచే చావులేకుండానూ, కాంతితో ఆకాశంలో తిరిగే చాలా అందమైన పట్టణాన్నీ కోరారు. వారు కోరుకొన్న ఆ విమాననగరం అన్నిరత్నాలూ కలది. దేవతలు, మహర్షులు, యక్షులు, గంధర్వులు, పన్నగులు, అసురులు, ధ్వంసం చెయ్యలేరు. బ్రహ్మ కాలకేయులకోసం నిర్మించిన ఆ నగరం అన్నికోర్కెలను తీర్చే గుణాలు కలది. శోకం, రోగం అక్కడ ఉండవు. దేవతలు లేని ఈ దివ్యమైన ఆకాశనగరంలో పౌలోములు, దానవులైన కాలకంజులు నివసిస్తున్నారు. ఈ నగరం హిరణ్యపురంగా పిలువబడుతోంది. దీన్ని మహాసురులైన కాలకేయులు, పౌలోములు రక్షిస్తూంటారు. రాజా! వారందరూ దేవతలచేత చంపబడరు. ఎంతో సంతోషంగా ఉంటున్నారు. రాజేంద్రా! వారు దుఃఖమూ, ఆసక్తి లేకుండా ఉంటారు. బ్రహ్మ వీరికి మనుష్యుడివల్ల చావును నిశ్చయించాడు. కుంతీకుమారా! బలవంతులై, ఎదురింపలేని ఈ కాలకంజుల్ని కూడా యుద్ధంలో వజ్రాస్త్రంతో వెంటనే నాశనం చెయ్యి.

అర్జును డంటున్నాడు. దేవాసురులు జయించలేని, ఆహిరణ్యపురం గురించి తెలుసుకొని సంతోషించాను. త్వరగా ఈ పట్టణానికి తీసుకువెళ్ళమని మాతలితో అన్నాను. నేను ఇంద్రశత్రువుల్ని అస్త్రాలతో క్షీణింపచెయ్యవద్దా? దేవతల్ని ద్వేషించే పాపులు నాకు ఎలాగైనా సరే చంపదగినవారే కదా? అప్పుడు మాతలి గుర్రాలు పూన్చిన ఆ దివ్య రథంమీద నన్ను వెంటనే హిరణ్యపురం తీసుకెళ్ళాడు. విచిత్రమైన ఆభరణాలు, వస్త్రాలు ధరించిన ఆ దైత్యులు నన్ను గమనించి కవచాలు తొడుక్కుని రథాలమీద చాలావేగంగా వచ్చి నామీద విరుచుకుపడ్డారు. ప్రచండమైన పరాక్రమం గల ఆ దానవరాజులు నన్ను నాలీకాలు, బాణాలు, బల్లెములు, శక్తులు, కర్రలు, తోమరాలతో కొట్టసాగారు. రాజా! నేను విద్యాబలంతో ఆ బాణవర్షాన్ని పెద్దబాణవర్షంతో త్రిప్పికొట్టాను. యుద్ధభూమిలో విభిన్న రథమార్గాల్లో తిరుగుతూ వారందర్నీ మోహపెట్టాను. వారంతా దిక్కుతోచక ఒకరినొకరు దానవుల్ని నేలకూలుస్తున్నారు. ఇలా దిక్కుతోచక ఒకరినొకరు ఢీకొంటున్న వారివందల తలలను మంటలు క్రక్కుతున్న బాణాలతో త్రుంచేశాను. చంపబడుతున్న ఆ దైత్యులు మళ్ళీ ఆ నగరాన్ని చేరుకొని రాక్షసమాయను ప్రయోగించి నగరంతో సహా ఆకాశంలోకి ఎగిరారు. అప్పుడు నేను బాణాలవాన కురిపించి దైత్యుల మార్గాన్ని కప్పేసి వారికదలికను కట్టడి చేశాను. సూర్యకాంతిగల దివ్యమైన ఆ పట్టణం కోరినచోటుకు ఆకాశంలో వెళుతుంది. దానిని వరంగా పొందటం చేత దైత్యులు సుఖంగా ఆకాశంలో దాన్ని అంటిపెట్టుకోగలిగారు. ఆ పట్టణం భూమిలోపలికి చొచ్చుకొనిపోతుంది. మళ్ళీ పైకి ఎగురుతుంది. అడ్డంగా వెళుతుంది. వేగంగా నీళ్ళలో మునుగుతుంది. అమరావతి

వలె గొప్పదైన ఆ పట్టణం స్వేచ్ఛగా వెళుతుంది. అనేక విధాలైన అస్త్రాలతో నేను దాన్ని అడ్డుకొన్నాను. పురుషశ్రేష్ఠా! దివ్యమైన అస్త్రాలతో అభిమంత్రించి వదిలిన బాణసమూహంతో రాక్షసుల్ని ఆ పట్టణాన్ని ముక్కలు ముక్కలు చెయ్యసాగాను. నేను వదిలిన సూటి ఇనుపబాణాలచేత బాగా దెబ్బతిన్న ఆ అసురులనగరం ఛిన్నాభిన్నమై నేలకొరిగింది.

రాజా! పిడుగుపాటుతో సమానమైన వేగంగల నా ఇనుపబాణాలచేత వారు చంపబడుతూ ఉన్నారు. మృత్యువు తరుముతూంటే అన్నిప్రక్కలకు పరుగుతీస్తున్నారు. వెంటనే మాతలి ఆకాశంలోకైకి లేచి, సూర్యకాంతిని పోలిన రథాన్ని వారి ఎదుట ఒక్కఉదుటున నిలపబోతున్నట్లు నేలపై దింపాడు. యుద్ధం చెయ్యాలని రగులుతున్నవారు అరవైవేల రథాలతో నన్ను చుట్టుముట్టారు. గ్రద్దముక్కుల అమరిక చేత పదునైన బాణాలతో వారిని నేను గాయపరచసాగాను. కాని వాళ్ళు సముద్రపు కెరటాల్లాగా యుద్ధం చెయ్యటానికి నావైపు వస్తున్నారు. దానిని బట్టి మానవపద్ధతుల్లో వీరిని జయించటం కుదర దనుకొని నేను వరుసగా దివ్యాస్త్రాలను ప్రయోగించాను. తరువాత రథాన్నధిరోహించి విచిత్రంగా యుద్ధంచేస్తున్న వేలదానవులు మెల్లమెల్లగా నాదివ్యమైన అస్త్రాలను అడ్డుకోసాగారు. మహాబలులైన ఆ దానవులు రథాలను వివిధరీతుల్లో పోనిస్తూ వందలు, వేలసంఖ్యలో యుద్ధంలో కనబడ్డారు. విచిత్రాలైన కిరీటాలను అమర్చుకొన్నారు. విచిత్రాలైన తొడుగులను జెండాలను కలిగి ఉన్నారు. వారి ఆభరణాలు విచిత్రంగా ఉన్నాయి. అలా ఉన్న వారంతా నామనస్సు నానందపరుస్తూ ఉన్నారు. దివ్యాస్త్రాలతో అభిమంత్రించి నేను యుద్ధంలో బాణాలవాన కురిపించి కూడ వారిని బాధించలేకపోయాను. కాని వారు మాత్రం నన్ను పీడించసాగారు. అస్త్రాలపరిజ్ఞానంతో యుద్ధంలో నేర్పరులయిన అనేక దానవులచేత పీడించబడుతూ యుద్ధంలో బాధపడ్డాను. నాకు చాలా భయం వేసింది. తరువాత యుద్ధభూమిలో నేను ఏకాగ్రతతో దేవదేవుడూ మహాత్ముడూ అయిన రుద్రునికి నమస్కరించి ప్రాణులన్నింటికి శుభం కలగాలని పలికి, గొప్పదైన పాశుపతాస్త్రాన్ని తలచుకొన్నాను. దానిని రౌద్రాస్త్రమని కూడా అంటారు. అది శత్రువులందర్నీ నశింపచేస్తుంది. ఆ దివ్యమైన పాశుపతాస్త్రం ప్రపంచవాసు లందరిచేత నమస్కరించదగినది. ఆ పాశుపతాస్త్రాన్ని ప్రయోగిస్తూ ఒక దివ్యపురుషుణ్ణి చూశాను. ఆయనకు మూడుతలలు, తొమ్మిదికళ్ళు, మూడు ముఖాలు, ఆరుభుజాలూ ఉన్నాయి.

నాలుకలను చాచుతున్న పెద్దపెద్దపాములే ఆయనకు వస్త్రంగా ఉన్నాయి. భక్తులననుగ్రహించే ఆ దేవుడు పామునే యజ్ఞోపవీతంగా ధరించాడు. ఆయన దర్శనం చేత నాభయమంతా తొలగిపోయింది. మళ్ళీ నేను భయంకరమూ, సనాతనమూ అయిన

ఆ పాశుపతాస్త్రాన్ని గాండీవధనుస్సుకు అమర్చి అమితతేజస్సుగల శివుని చూచి, నమస్కరించి, ఆ దానవేంద్రుల్ని నశింపచెయ్యటానికి విడిచిపెట్టాను. వెంటనే దానినుండి వేల ఆకారాలు పుట్టుకొచ్చాయి.

లేళ్ళు, సింహాలు, పులులు, ఎలుగుబంట్లు, దున్నపోతులు, పాములు, ఆవులు, శరభమృగాలు, ఏనుగులు, కోతి గుంపులు, ఎద్దులు, పందులు అలాగే పిల్లులు, తోడేళ్ళు, ప్రేతరూపాలు, భురుండాలు, రాబందులు, గ్రద్దలు, చమరీమృగాలు, దేవతలు, ఋషులు, గంధర్వులు, పిశాచాలు, యక్షులు, రాక్షసులు, గుహ్యకులు, నైర్ఋతులు, చేపలు, ఏనుగు ముఖాలవారు, గుడ్లగూబలు, చేపల్లాగా, గుర్రాలలాగా ఉన్న వ్యక్తులు ఆ యుద్ధంలో పుట్టుకొచ్చారు. వారందరిచేతిలో అనేక శస్త్రాలు, అస్త్రాలూ ఉన్నాయి. అలాగే గదలు, ఈటెలు(కట్టెలు) ధరించిన రాక్షసులూ ఏర్పడ్డారు. వీరితోపాటు అనేక ఇతర రూపాలు ధరించినవారితో జగమంతా నిండిపోయింది. ఆ పాశుపతాస్త్రాన్ని విడిచినంతనే మూడుతలలవారు, నాలుగుకోరలవారు, నాలుగుముఖాలవారు, నాలుగుభుజాలవారు అనేక ఆకారాలు దాల్చి వెలువడ్డారు. వాళ్ళు మాంసం, మేదస్సు, వస, ఎముకలు కలిగి ఉన్నారు. వారందరిచేత చావుదెబ్బలు తిని దానవులు నశించారు. అప్పుడు సూర్యాగ్నులతో సమానమైన తేజస్సుగల, వజ్రాయుధం, పిడుగుల్లా వెలుగొందే శత్రునాశకములైన లోహపు బాణాలతో దానవులందర్నీ రెండుఘడియల్లో చంపేశాను. గాండీవం విడిచిన అస్త్రాలతో నుజ్జునుజ్జై ప్రాణాలు పోగొట్టుకొని ఆకాశం నుండి నేలపై పడ్డారు. ఇది చూసి నేను మళ్ళీ త్రిపురాలను నశింపచేసిన శంకరభగవానుడికి ప్రణామం చేశాను. దివ్యమైన ఆభరణాలను అలంకరించుకున్న దానవులు అలా రౌద్రాస్త్రంతో నుజ్జునుజ్జవటం విని దేవేంద్రుడి సారథియైన మాతలి చాలా సంతోషించాడు. దేవతలకు కూడా సాధ్యంకాని తట్టుకోలేని నా పనిని చూసి మాతలి నన్ను చాలా ప్రశంసించాడు. చేతులు జోడించి ప్రీతితో "దేవాసురులకు సాధ్యంకాని పని చేశా"వన్నాడు. హిరణ్యపురాన్ని ధ్వంసం చేసిన ధనంజయా! ఇలా యుద్ధంచెయ్యటానికి దేవరాజు ఇంద్రుడు కూడా చాలడు. తప్పక నీపట్ల ఇంద్రుడెంతో ప్రసన్నుడౌతాడు. వీరుడా! దేవాసురులు ధ్వంసం చెయ్యలేని, ఈ పట్టణం నీ పరాక్రమంతో తపోబలంతో ధ్వంసమయింది. దానవులు చంపబడ్డారు. పెడబొబ్బలు పెడుతూ, జుట్టువిరబోసుకుని బాధతో ఆడులేళ్ళవలె దుఃఖంతో వారిస్త్రీలంతా నగరం బయటకు వచ్చారు. కొడుకులు, తండ్రులు, సోదరులకోసం ఏడుస్తూ నేలమీద పడ్డారు. భర్తలను కోల్పోయి దీనమైన గొంతుకలతో ఏడుస్తూ, పెడబొబ్బలు పెడుతూ ధరించిన పూలు, ఆభరణాలు జారిపోగా రొమ్ములు బాదుకొంటున్నారు.

A.C.No. 96350

ఆ దానవుల పట్టణం శోకంలో నిండిపోయింది. శోభను కోల్పోయింది. దుఃఖం దీనత అంతటా వ్యాపించాయి. ఆ నగరవాసులు, ప్రభువులు చంపబడ్డారు. పాడుబడింది. గంధర్వనగరం పేరులోనే మిగిలిపోయింది. ఏనుగు చంపబడ్డ నీటిమడుగులా ఎండినచెట్లున్న అడవిలా ఆ పట్టణం కనబడుతోంది. కర్తవ్యాన్ని ముగించి మనసంతా సంతోషంతో నిండిన నన్ను మాతలి వెంటనే యుద్ధరంగం నుండి దేవరాజు భవనానికి తీసుకొని వచ్చాడు. నివాత కవచుల్ని చంపి, హిరణ్యపురాన్ని విడిచి తరువాత నేను ఇంద్రుణ్ణి సమీపించాను. నేను చేసిన ఆ పనిని ఉన్నది ఉన్నట్లు చాలా వివరంగా మాతలి దేవేంద్రుడికి వినిపించాడు. హిరణ్యపురాన్ని ధ్వంసం చెయ్యడం, రాక్షసుల మాయలను చిత్తుచెయ్యడం, శక్తిమంతులైన నివాతకవచుల్ని యుద్ధంలో చంపటం విని భగవంతుడైన ఇంద్రుడు ప్రీతిచెందాడు. మరుత్తులతో కూడి శ్రీమంతుడైన ఇంద్రుడు **బాగుబాగు** అని నన్నభినందించి ప్రేమతో కౌగలించుకొని చిరునవ్వుతో నా తల వాసన చూశాడు. తరువాత దేవరాజైన ఇంద్రుడు నన్ను మాటిమాటికి ఊరడిస్తూ దేవతలతో కలిసి – 'నీవు యుద్ధంలో దేవాసురులకు సాధ్యం కానిపని చేశా' వని మధురంగా పలికాడు. ధనంజయా! నా గొప్పశత్రువులైన దానవుల్ని చంపి గురుదక్షిణ చెల్లించావు. ఇలాగే యుద్ధంలో ఎప్పుడూ స్థిరంగా ఉండు. వివేకంతో అస్త్రాలను ప్రయోగించు. యుద్ధంలో నీవు దేవదానవ రాక్షసులకు అసాధ్యుడవు. యక్ష అసుర గంధర్వులకు పక్షిసమూహాలకు పాములకు ఎదుర్కొన లేనివాడవు. ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు నీ బాహుబలంచేత జయించిన భూమిని పరిపాలిస్తాడు.

174. అర్జునుని యాత్రా వృత్తాంతము విని ధర్మరాజు అభినందించుట.

అర్జునుడు చెపుతున్నాడు – ఒకనాడు బాణాలచే గాయాలై నమ్మదగిన నన్ను పట్టుకొని దేవరాజు ఇలా అన్నాడు. భారతా! దివ్యాస్త్రాలన్నీ నీ దగ్గరున్నాయి. భూమిమీద ఏమానవుడూ నిన్ను ఓడించలేడు. కుమారా! యుద్ధంలో నీకు భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, రాజులతో కూడిన శకుని పదహారవవంతు కూడా చేయరు. ఇంద్రుడు నాశరీరాన్ని కాపాడే, భేదించబడని ఈ దివ్యమైన కవచాన్నీ, బంగారుమాలనూ ఇచ్చాడు. మళ్ళీ ఎంతోధ్వని చెయ్యగల ఈ దేవదత్త మనబడే శంఖాన్నిచ్చాడు. ఇంద్రుడు తనకు తానుగా ఈ దివ్యమైన కిరీటాన్ని నాకు అమర్చాడు. తరువాత ఇంద్రుడు నాకు దివ్య వస్త్రాలను, దివ్యాభరణాలను ఇచ్చాడు. ఇవి మనోహరాలు విశాలమైనవి. రాజా! ఇలా గౌరవాన్ని పొందుతూ పవిత్రమైన ఇంద్రభవనంలో గంధర్వుల పిల్లలతో కలిసి సుఖంగా

గడిపాను. తరువాత దేవతలతో కలసియున్న ఇంద్రుడు ప్రీతితో అర్జునా! నీ సోదరులు నిన్ను తలుచుకొంటున్నారు. నీవు వెళ్ళవలసిన సమయమాసన్నమైంది" అన్నాడు. ఈవిధంగా జూదంవల్ల ఏర్పడ్డ దోషం తలుచుకొంటున్న నాకు ఇంద్రుడి భవనంలో ఐదేళ్ళు గడిచాయి. తరువాత గంధమాదనపర్వతపాదమైన ఈ పర్వతంమీద సోదరులతో కలిసి ఉన్న నిన్ను చూశాను. యుధిష్ఠిరుడు అన్నాడు – ధనంజయా! అదృష్టం వల్ల నీవు అస్త్రాలను పొందావు. అదృష్టంవల్ల దేవతలకు ప్రభువైన ఇంద్రుణ్ణి ఆరాధించగలిగావు. భగవంతుడైన శివుని పార్వతితో సహా సాక్షాత్కరింపచేసుకున్నావు. నీయుద్ధంతో ఆ శివుని మెప్పించావు. అదృష్టంవల్ల లోకపాలకుల్ని నీవు కలిశావు. ప్రగతిని సాధించాం. అదృష్టంవల్ల తిరిగివచ్చావు. ఈనాడు పట్టణాల వరుసతో విరాజిల్లే భూమినంతా జయించబడినట్లు ధృతరాష్ట్రునికొడుకులందరినీ అదుపులోకి తెచ్చుకొన్నట్లు అనుకొంటున్నాను. భారతా! ఆ దివ్యాస్త్రాలను చూడా లనుకొంటున్నాను. చాలాపరాక్రమంగల ఆ నివాతకవచులు వాటితోనే గదా చంపబడ్డారు.' అర్జునుడు చెపుతున్నాడు. 'నేను నివాతకవచులను కూల్చిన ఆ దివ్యాస్త్రా లన్నింటినీ రేపుప్రొద్దున నీవు చూడగలవు.' ఇలా అర్జునుడు తన రాక గూర్చి తెలిపి సోదరులందరితో ఆ రాత్రి అక్కడ గడిపాడు.

175. అర్జునుని దివ్యాస్త్రప్రదర్శనమును నారదుడు నివారించుట.

యుధిష్ఠిరుడు ఆ రాత్రి గడువగానే లేచి సోదరులతో కలిసి అవసరమైన దైనందిన కార్యక్రమాలను ముగించాడు. తరువాత యుధిష్ఠిరుడు సోదరులకు ఆనందాన్ని చేకూర్చే అర్జునుడితో నీవు ఏ అస్త్రాలతో దానవుల్ని జయించావో వాటిని చూపించు అని ప్రేరేపించాడు. అర్జునుడు దేవతలిచ్చిన ఆ దివ్యాస్త్రాలను చూపించసాగాడు. యథావిధిగా స్నానాదులుచేసి శుచియై శివుడికి, ఇంద్రుడికీ నమస్కరించాడు. కొండ కూర్చునే చోటుగాను, కొండకిరుప్రక్కలూ రథచక్రాలుగా, చక్కని వెదుళ్ళే త్రివేణు (కూర్చునేచోటును రథచక్రాలను కలిపేసాధనం)గా మట్టిరథాన్నెక్కి. శోభించే అర్జునుడు మెరిసే దివ్యమైన కవచం తొడుగుకొన్నాడు. ఆ కుంతీకుమారుడు గాండీవధనుస్సును, దేవదత్తమనబడే శంఖాన్ని తీసుకుని శోభిల్లుతూ ఆ దివ్యాస్త్రాలను చూపించసాగాడు. ఆ దివ్యాస్త్రాలు ప్రయోగించబడుతూ ఉంటే అర్జునుని పాదాలచేత అదమబడిన భూమి చెట్లతో కలిసి కంపించసాగింది. నదులూ, సముద్రమూ కల్లోలం చెందాయి. కొండలు బ్రద్దలౌతున్నాయి. గాలివీచటం లేదు. సూర్యుడు ప్రకాశించటం లేదు. అగ్ని(నిప్పు) మండటం లేదు. ద్విజులకు వేదాలు స్ఫురించటం లేదు. భూమిలోపలి భాగంలోని ప్రాణులు బాధింపబడుతూ పైకిలేచి అర్జునుని వారించాయి. ఆ ప్రాణులన్నీ

వికృతమైనముఖాలతో వణుకుతూ చేతులు జోడించి ఆ అస్త్రాల వల్ల తగులబడుతూ అర్జునుని యాచించాయి. తరువాత బ్రహ్మర్షులు, సిద్ధులు, మహర్షులు, కదిలేప్రాణులన్నీ సమీపించాయి. శ్రేష్ఠులైన దేవర్షులు, దేవతలు, యక్షులు, గంధర్వులు, పక్షులు, ఆకాశంలో తిరిగే ప్రాణులన్నీ సమీపించాయి.

తరువాత అక్కడికి బ్రహ్మ, లోకపాలకులందరూ, గణాలతో కలిసి భగవంతుడైన మహాదేవుడు(శివుడు) చేరుకొన్నారు. తరువాత వాయుదేవుడు అన్ని ప్రక్కలనుండి అర్జునుడిపై పరిమళం వెదజల్లే విచిత్రాలైన పూలవాన కురిపించాడు. రాజా! దేవతలచేత ప్రేరేపించబడి గంధర్వులు అనేకరకాల గాధలను గానం చేశారు. అప్సరసలసమూహాలు గుంపులుగా చేరి నాట్యం చేశారు. రాజా! అలాంటి ఆ సమయంలో దేవతలప్రేరణతో నారదుడు వచ్చి అర్జునుడు వినదగిన మాటలను చెప్పాడు. అర్జునా! అర్జునా! దివ్యములైన అస్త్రాలను ప్రయోగించకు, వీటిని గురిలేకుండా ఎక్కడపడితే అక్కడ ఎన్నటికీ ప్రయోగించకూడదు. గురి ఉన్నా తనకే సంకటపరిస్థితి లేకుండా ఎప్పటికీ ప్రయోగించకూడదు. అస్త్రాలను తగిన కారణంలేకుండా తగనిచోట ప్రయోగించటం చాలాదోషం అన్నాడు. ధనంజయా! శాస్త్రప్రకారం వీటిని కాపాడితే అవి బలంగా ఉంటాయి. సుఖాన్నిస్తాయనటంలో సందేహం లేదు. పాండవా! వీటిని కాపాడుకొనకపోతే మూడులోకాల్ని నాశనం చేస్తాయి. ఎప్పుడూ ఇలా చెయ్యకు. ధర్మరాజా! శత్రువుల్ని అణచటానికి అర్జునుడు యుద్ధంలో వీటిని ప్రయోగించినపుడు నీవు చూడవచ్చు అన్నాడు. వైశంపాయనుడు చెపుతున్నాడు - తరువాత అర్జునుని వారించి అక్కడికి వచ్చిన దేవతలందరూ, ఇతరులు కూడా వచ్చిన త్రోవనే వెళ్ళిపోయారు. పాండవులు ద్రౌపదితో కలిసి ఆ వనంలోనే సంతోషంగా నివసించసాగారు.

176. పాండవులు గంధమాదనమునకు వెడలుట.

జనమేజయు డడుగుతున్నాడు. రధికోత్తముడైన అర్జునుడు ఇంద్రుడిభవనం నుండి అస్త్రాలను నేర్చి తిరిగిరాగా, శూరుడైన అర్జునుడితో పాండవు లేం చేశారు? వైశంపాయనుడు చెపుతున్నాడు. వీరులైన ఆ రాజులు ఆ అడవుల్లోనే అందమైన ఆ పర్వతశ్రేష్ఠమందే, ఇంద్రుడితో సమానుడైన అర్జునుడితో కలిసి కుబేరుడి క్రీడాప్రాంగణంలో విహరించారు. సాటిలేని ఆ కుబేరుడి భవనాలను, చెట్లక్రింద ఆటలను చూస్తూ ధనుస్సును, కిరీటాన్ని ధరించిన అర్జునుడు అస్త్రాలను అభ్యసిస్తూ అనేకవిధాల సంచరించేవాడు. రాజకుమారులైన పాండవులు రాజాధిరాజైన కుబేరుడి దయవల్ల అక్కడ నివసించే అవకాశం పొందారు. అక్కడనుండి వారు ఇతరప్రాణుల ఐశ్వర్య సుఖాలను కోరటం లేదు. వారికి ఆ సమయం

సుఖంగా గడిచింది. వారు అర్జునుడితో కలిసి అక్కడ నాలుగు సంవత్సరాలు ఉన్నారు. అది వారికి ఒక్కరాత్రిలా గడిచింది. అంతకు మునుపు ఆరేళ్ళున్నారు. ఇలా అడవుల్లో ఉన్న పాండవులకు ఆ పదిసంవత్సరాలూ ఆనందంగా గడిచిపోయాయి. తరువాత ఒకనాడు అర్జునుడు, వీరులు, ఇంద్రసమానులైన కవలలు నకులసహదేవులు ఏకాంతంలో రాజైన యుధిష్ఠిరుడి దగ్గర కూర్చొని యుండగా, భీముడు మేలును, సంతోషాన్ని కలిగించే విధంగా పలికాడు. కురురాజా! నీప్రతిజ్ఞను నిజం చెయ్యాలనే కోరికతో అలాగే ప్రీతికలిగించాలని మేము అడవులను విడిచి అనుచరులతో సహా దుర్యోధనుని చంపటానికి వెళ్ళలేదు. సుఖాలకు తగిన వాళ్ళమైన మనం దుర్యోధనుడి చేత మన సుఖాలను పోగొట్టుకొని ఇప్పుడు పదకొండవ సంవత్సరం గడుపుతున్నాం. అధమమైన బుద్ధి, స్వభావమూ గల వాణ్ణి తారుమారు చేసి అజ్ఞాతవాసాన్ని సుఖంగా గడుపుదాం.

రాజా! నీ ఆదేశం వల్ల జంకులేకుండా అభిమానాన్ని విడిచిపెట్టి అడవుల్లో తిరుగుతున్నాం. దగ్గరగా ఉండి వారికి మనమక్కడే ఉన్నట్లు నమ్మించి వెతికేటట్లు చేసి దూరప్రదేశాలకు వెళ్తే వారు మన ఉనికిని తెలుసుకోలేరు. అక్కడ చాటుగా సంవత్సరం గడిపి తేలికగా నరాధముడైన ఆ దుర్యోధనుని పెకలిద్దాం. రాజా! అనుచరులతో కూడిన నీచుడైన దుర్యోధనుడు నాటితే పూసి, ఫలించిన వైరవృక్షాన్ని పీకేసి దానినుండి బయటపడి, అప్పుడు భూమిని నివాసంగా పొందు. మహారాజా! ధర్మరాజా! స్వర్గంలాంటి ఈ చోట తిరుగుతున్న మనకు శోకాన్ని విడిచిపెట్టటం కుదురుతుంది. అలా కాకపోతే భారతా! చరాచర జగత్తులో పవిత్రమైన నీ కీర్తి నశించిపోతుంది. కురువంశశ్రేష్ఠుల గొప్పరాజ్యాన్ని పొందితే మంచి పనులు చెయ్యగల అవకాశాన్ని పొందుతాం. మహారాజా! కుబేరుడి వల్ల పొందుతున్న ఈ గౌరవం నీకెప్పుడూ లభిస్తుంది. శత్రువులను చంపటానికి తప్పులు చేసినవారిని అణచటానికి నిర్ణయం తీసుకో. రాజా! స్వయంగా ఇంద్రుడైనా, నిన్నెదుర్కొని నీభయంకరమైన తేజస్సును సహించలేడు. నీ పనిని సఫలం చెయ్యటానికి ప్రయత్నిస్తున్న ఆ గరుడధ్వజుడైన కృష్ణుడు, శినిమునిమమమడైన సాత్యకి ఎప్పుడైనా దేవతలతోనైనా సరే యుద్ధం చెయ్యటానికి శ్రమ అనుకోరు. రాజశ్రేష్ఠా! సాటిలేని బలంగల అర్జునుడు, అలాగే నేనూ సిద్ధంగా ఉన్నాం.

రాజశ్రేష్ఠా! యాదవులతో కలిసి కృష్ణుడెలా నీ పనిని సఫలం చెయ్యటానికి పూనుకొన్నాడో, అలాగే నేనూ అస్త్రాలను ప్రయోగించే నేర్పుగల వీరులైన ఈ కవలలూ సిద్ధంగా ఉన్నాం. నీకు ధనలాభం, అధికారసిద్ధి మా ప్రధానలక్ష్యాలు. కాబట్టి మేము శత్రువుల నెదుర్కొని శత్రుత్వాన్ని అణచివేస్తాం.

తరువాత ధర్మార్థాల నెరిగి, ఉత్తమమమైన ఓజస్సు, నిష్కల్మషమైన బుద్ధిగల ధర్మరాజు వారి అభిప్రాయాన్ని తెలుసుకుని కుబేరుడి నివాసమైన ఆ గంధమాదన పర్వతానికి ప్రదక్షిణం చేశాడు. అక్కడి భవనాలు, నదులు, సరస్సులు, రాక్షసులందరి అనుమతిపొంది, వచ్చిన మార్గం వంకచూస్తూ మళ్ళీ ఆ పర్వతం వైపు చూస్తూ శ్రేష్ఠమైన ఆ పర్వతరాజు నిలా ప్రార్థించాడు. పర్వతరాజా! శత్రువులను జయించి, రాజ్యాన్ని పొంది, స్నేహితులతో కలిసి నా కర్తవ్యాలను నెరవేర్చి, తిరిగి మళ్ళీ మనసును అదుపుచేసుకొని తపస్సు చెయ్యటానికి నిన్ను దర్శిస్తాను అని బయలుదేర తలచాడు. తన సోదరులందరితో, బ్రాహ్మణులతో కలిసి ధర్మరాజు ఆ మార్గం గుండా దిగసాగాడు. ఆ కొండమీదనుండి జాలువారే జలపాతాల వద్ద ఘటోత్కచుడు, తన గణాలతో కలిసి వీరిని మోస్తూ దాటించాడు. ప్రీతిగల తండ్రి, కొడుకుల కుపదేశించినట్లుగా బయలుదేరిన వారందరికీ ఆ లోమశమహర్షి ఉపదేశించి, సంతోషంతో చాలా పవిత్రమైన దేవతల నివాసానికి వెళ్ళిపోయాడు. రాజర్షి ఆర్ష్టిషేణుడు వారికి అలా ఉపదేశించాడు – మానవశ్రేష్ఠులైన కుంతీకుమారులు పవిత్రజలాలను, అందమైన తపోవనాలను, ఇంకా పెద్ద సరస్సులనూ చూస్తూ ముందుకు సాగారు.

177. గంధమాదనము నుండి పాండవులు బదరికాశ్రమము ద్వారా ద్వైతవనము చేరుట.

జలపాతాలు, దిగ్గజాలు, కిన్నరులు, పక్షులతో కూడి సుఖనివాసానికి చోటైన పర్వతాన్ని విడిచిపెడుతున్న భరతవంశశ్రేష్ఠులైన ఆ పాండవులకు సంతోషంగా లేదు. తరువాత మళ్ళీ భరతవంశశ్రేష్ఠులైన ఆ పాండవులకు కుబేరుడి మనసు నాకట్టుకొనే, తెల్లని మేఘాలతో ప్రకాశించే కైలాసాన్ని చూసేసరికి చాలా సంతోషం కలిగింది. ధనుస్సులను, కత్తులను ధరించిన వీరులూ, నరశ్రేష్ఠులూ అయిన పాండవులు ఎత్తైన పర్వతశిఖరాలను, సింహాలగుంపులను, పర్వతాలలోని నదులను దాటేందుకు ఏర్పరచబడిన వంతెనల వరుసలను, అనేక జలపాతాలను, అక్కడక్కడా పల్లపుభూములను చూస్తూ..... అలాగే జంతువులు, పక్షులు, ఏనుగులు తిరుగాడే పెద్దఅడవులను చూస్తూ, అపాయాల శంక లేకుండా ముందుకు సాగారు. మానవశ్రేష్ఠులైన పాండవులకు అందమైన అడవులు, నదీతీరాలు, సరస్సుల తీరాలు, కొండలలోని గుహలు రాత్రింబవళ్ళూ వారికి నివాసయోగ్యా లయ్యాయి. వారు చేరుకోలేని చోటులందు చాలాసార్లు గడిపి, ఊహకందని ఆకారం గల కైలాసపర్వతాన్ని దాటి ఎంతో మనోహరమై శ్రేష్ఠమైన వృషపర్వుని ఆశ్రమాన్ని చేరుకున్నారు. వారు రాజర్షి

వృషపర్వుని కలుసుకుని అతనిచేత పూజింపబడి శోకమోహాలకు దూరమయ్యారు. గంధమాదనపర్వతంమీద వారు నివసించినతీరును ఉన్నది ఉన్నట్లు విపులంగా చెప్పారు. దేవతలు, మహర్షులచేత సేవించబడే ఆ వృషపర్వుని పవిత్రమైన ఆశ్రమంలో ఆ వీరులు ఒకరాత్రి సుఖంగా గడిపి, తిరిగి విశాలా పట్టణంలోని బదరికాశ్రమానికి సుఖనివాసం కోసం చేరుకొన్నారు.

తరువాత అక్కడ నారాయణుని క్షేత్రాన్ని చేరుకొని, ఆ మహానుభావులందరూ శోకరహితులై; దేవతలు, సిద్ధులు సేవించే కుబేరుడికి ప్రియమైన కొలను చూస్తూ గడిపారు. రాజకుమారులు కొలను చూసి బాధలు మరచారు. పాపరహితులైన బ్రహ్మర్షులు నందనవనాన్ని చేరుకొన్నట్లు సంచరిస్తూ పాండవులు ఆనందించారు. మానవవీరులైన ఆ పాండవులందరూ బదరికాశ్రమంలో సుఖంగా ఒకనెలరోజులు గడిపి తరువాత క్రమంగా వచ్చిన మార్గాన కిరాతరాజైన సుబాహుని దేశానికి బయలుదేరారు. చీన, తుషార, దరద దేశాలనన్నిటినీ, కుళిందుని సారవంతమైన భూములనూ దాటి, పాండవులు దుర్గమమైన హిమవత్పర్వతం దాటి, సుబాహుని పురాన్ని చూశారు. తన దేశానికి వచ్చిన రాజకుమారులు, మనుమలు గురించి విని ప్రీతితో ఆ రాజు కురుశ్రేష్ఠులను అభినందిస్తూ ఎదురుగా వెళ్ళాడు. సుబాహుని కలుసుకుని వారంతా విశోకుడు మొదలైన రథసారథుల్నీ, ఇంద్రసేనుడు మొదలైన పరిచారకుల్నీ, ముందు నడిచే సేవకుల్నీ, వంటవారినీ కలిశారు. వారక్కడ ఒక రాత్రి సుఖంగా గడిపి సారథులందర్నీ, రథాలనూ తీసుకుని అనుచరులతో కలిసియున్న ఘటోత్కచుని విడిచిపెట్టి, యమునానది పుట్టిన పర్వతానికి బయలుదేరారు. జలపాతాలతో కూడిన ఆ కొండకు మంచు ఉత్తరీయంలా ఉంది. ఉదయించే సూర్యకిరణాలు పడటంతో లేత ఎరుపు, తెలుపు రంగులు తలపాగావలె ఉన్నాయి. ఆ కొండపై ఉన్న విశాఖయూపాన్ని చేరుకొని ఆ పురుషశ్రేష్ఠ లక్కడ నివసించారు. చైత్రరథవనంలా ఉన్న ఆ విశాలమైన అడవిలో పందులు మొదలైన జంతువులు, పక్షులు నివసిస్తున్నాయి. క్రూరజంతువులను వేటాడటమే ప్రధానమైన పనిగా ఒక సంవత్సరం వారక్కడ అడవిలో సుఖంగా సంచరించారు.

అక్కడ ఒకనాడు భీముడు ఒక కొండగుహలో మృత్యుభయంకరమై, బలిష్ఠమై ఆకలిగొన్న ఒక పామును సమీపించాడు. దానిని చూచి విషాదమోహాలకు లోనయ్యాడు. అపుడు ధర్మాత్ములలో శ్రేష్ఠుడు, అంతులేని తేజస్సుగల యుధిష్ఠిరుడు భీమునికి దీవి(ఊతం)లా అయ్యాడు. పామునే ఒళ్ళంతా చుట్టబడ్డ అతనిని విడిపించాడు. పాండవులు పన్నెండవ సంవత్సరం సమీపిస్తుండగా అడవిలో ఆనందంగా గడపటానికే ఉత్సాహపడుతున్నారు. తపస్సుతో కూడియున్న పాండవులు చైత్రరథంలా ప్రకాశించే

ఆ అడవి నుండి బయలుదేరి, ధనుర్వేదం మీదే ఎప్పుడూ ఆసక్తి కలిగి, మరుభూమి(ఎడారి) ప్రక్కన సరస్వతీనదీతీరాన్ని చేరి, నివసించాలని ద్వైతవనానికి చెందిన సరస్సు వద్దకు వెళ్ళారు. తపస్సు, ఇంద్రియనిగ్రహం, సదాచారం, సమాధులతో కూడి, దర్భలు, జలపాత్రలు, వస్త్రాలు, రాతిపలకలు సామగ్రిగా కల ఆ ప్రదేశవాసులు ద్వైతవనంలో ప్రవేశించిన పాండవుల్ని చూసి సమీపించారు. జువ్వి, జిల్లేడు, రోహీతక, మద్ది, రేగు, చండ్ర, దిరిసెన, మారేడు, ఇంగుదీ(ఇప్ప), పీలు, జమ్మి, కరీర చెట్లు ఆ సరస్వతీ నదీ తీరాన ఉన్నాయి. యక్షులు, గంధర్వులు, మహర్షుల మనసులను ఆకట్టుకొనే దేవనివాసంలా ఉన్న ఆ సరస్వతీనదీతీరంలో ప్రీతితో తిరుగుతూ ఆ రాజకుమారులు సుఖంగా నివసించసాగారు.

178. అజగరము భీముని పట్టుకొనుట.

జనమేజయుడు అడుగుతున్నాడు.

'మునీ! పదివేల ఏనుగుల బలమూ, భయంకరమైన పరాక్రమమూ కల భీముడు ఆ పాములవల్ల తీవ్రభయాన్ని ఎలా పొందాడు? పులస్త్యమహర్షి కుమారుడైన కుబేరుని గర్వంతో యుద్ధానికి పిల్చినవాడు, కుబేరుడి సరస్సువద్ద యుద్ధంచేసి యక్షులు, రాక్షసుల్ని చంపిన భీముడు భయాన్ని పొందడు. ఆపదలో చిక్కుకొన్నా డంటున్నావు. ఈ విషయం నేను వినాలనుకొంటున్నాను. నాకు చాలా ఆసక్తిగా ఉంది.' వైశంపాయనుడు చెపుతున్నాడు - 'రాజా! రాజర్షి వృషపర్వుని ఆశ్రమం నుండి వచ్చి, ధనుస్సులు దాల్చి ఆ పాండవులు ఎన్నో ఆశ్చర్యాలతో నిండిన ఆ అడవిలో ఉంటున్నారు. ఒరలో కత్తి, చేతిలో ధనుస్సుతో భీముడు దేవతలూ గంధర్వులూ సేవించే అందమైన ఆ అడవిని చూసి అందులో యథేచ్ఛగా విహరిస్తున్నాడు. అతడు దేవర్షులూ సిద్ధులూ తిరిగే, అప్సరసల సమూహాలు సేవించే పవిత్ర హిమవత్పర్వత ప్రాంతాలను చూశాడు. అక్కడక్కడా చకోర, ఉపచక్ర, జీవజీవక, కోకిల, భృంగరాజపక్షులు కూస్తున్నాయి. ఆ ప్రాంతాలలో చెట్లు అన్నికాలాల్లో పూలూ, పండ్లూ ఇస్తాయి. మంచు పడటంచేత అవి సుకుమారంగా ఉంటాయి. ఎంతో నీడ గలవి, మనసులకు కళ్ళకూ ఆనందాన్ని ఇస్తూంటాయి. వైడూర్యమణులవంటి రంగుతో, మంచులా స్వచ్ఛంగా ఉన్న వేలహంసలు, కారండవపక్షులూ గల కొండలలోని నదులను అతడు ఆసక్తితో చూడసాగాడు. ఎర్రచందనవృక్షాలతో కలిసిపోయిన, సురపొన్నలు, నల్లచందనాలతో దేవదారు అడవులు మేఘాల వలల వలే ఉన్నాయి.

భీముడు బల్లపరుపుగా ఉన్న మరు(ఎడారి)భూములందు వేటకోసం పరుగెడుతూ మామూలు బాణాలతో జంతువుల్ని గాయపరుస్తూ తిరిగాడు. భీమసేనుడు

చాలాబలవంతుడుగా ప్రసిద్ధుడు. అతనికి వందల ఏనుగుల శక్తి ఉంది. ఆ అడవిలో తనబలంతో పెద్దపెద్ద సింహాలను చంపుతున్నాడు. దీర్ఘభుజాలు, భయంకరమైన పరాక్రమమూ గల ఆ భీముడు అక్కడ కూడా జంతువుల్ని, పందుల్ని, దున్నపోతుల్ని చంపుతున్నాడు. గొప్పబలంగల ఆ భీముడు వందల మదపుటేనుగుల బలం కలవాడు, ఒక్క ఉదుటున వందమంది మనుష్యుల్ని అడ్డుకోగలడు. సింహాలు, శార్దూలాలకంటే పరాక్రమంగలవాడు. ఆ అడవిలో వేగంగా చెట్లను పెకలించి విరగ్గొట్టాడు. మైదానప్రాంతాల్ని, అడవుల్ని తనగర్జనలతో మారుమ్రోగింపచేస్తున్నాడు. పర్వతశిఖరాలను చదునుచేస్తూ, చెట్లను పీకి విసిరేస్తూ, జంకులేకుండా తనగర్జనతో భూమండలాన్ని నింపి మారుమ్రోగింపచేస్తున్నాడు. భయంలేని భీముడు మాటిమాటికీ, చప్పుడుచేస్తూ, చరుస్తూ, చప్పట్లుకొడుతూ, మ్రోగిస్తూ వేగంగా ఎగిరిపడుతున్నాడు. భీముడికి బలగర్వం చాలాకాలంనుండి ఉంది. ఆ భీమునిసింహనాదానికి శక్తిగల గజరాజులు ఎంతో బలంగల సింహాలు భయంతో తామున్న గుహలను విడిచి పారిపోతున్నాయి. నిర్భయంగా జంతువులను వేటాడుతూ చాలా ఘోరమైన ఆ అడవిలో ఒకచోట పరిగెడుతూ, ఒకచోట నిలుస్తూ మరోచోట కూర్చుంటూ సాగాడు. మనుష్యులలో పెద్దపులిలాంటి బలం గల ఆ భీమసేనుడు ఆటవికుడిలా ఆ అడవిలో కాలినడకన సాగుతున్నాడు. ఎంతోశక్తి, పరాక్రమంగల అతడు ఆ పెద్ద అడవిలో అద్భుతంగా గర్జిస్తూ ప్రాణు లన్నింటిని బెదరగొడుతూ ప్రవేశించాడు.

భీముడి గర్జనలకు భయపడి గుహలలో ఉన్న పాములు వేగంగా కదిలిపోతున్నాయి. మెల్లగా భీముడు వాటివెంట వెళ్ళాడు. తరువాత దేవతాశ్రేష్ఠులకాంతి, గొప్పబలమూ గల భీమసేనుడు తనశరీరంతో గుహను చుట్టినంత పెద్దశరీరంతో గగుర్పాటు కలిగించే గిరిదుర్గంలో ఉన్న పామును చూశాడు. పర్వతంలా విశాలమైన పెద్దశరీరం, చాలా బలం కలిగి ఉంది. చిత్రంగా ఉన్న అవయవాలతో దానిశరీరం విచిత్రంగా ఉంది. దాని కాంతి పసుపుపచ్చగా ఉంది. నాలుగుకోరలున్న గుహలాంటి నోటితో ప్రకాశిస్తోంది. నిప్పులుక్రక్కే ఎర్రటి కళ్ళున్నాయి. మాటిమాటికీ రెండు కోరలను నాకుతోంది. ప్రళయకాలంలోని యముడిలా ఉంది. ప్రాణులన్నింటిని బెదరగొట్టుతోంది. బయటకు వదిలే గాలి చప్పుడుతో విసిరిపారేస్తున్నట్లుంది. మనుష్యుల్ని పట్టుకొనే, చాలాకోపంతో ఉన్న ఆ పాము ఒక్క ఉదుటున వచ్చి ఆ భీముడి రెండు భుజాలను గట్టిగా చుట్టేసింది. అప్పుడు ఆ పాముచే చుట్టబడిన భీమసేనుడు వెంటనే తెలివితప్పాడు. ఆ పాముకున్న వరబలంవల్ల అలా జరిగింది. పదివేల ఏనుగులబలం గల ఆ భీమసేనుడి భుజబలంతో ఇతరులు ఎవ్వరూ సాటిరారు. తేజోవంతుడైన ఆ భీము డలా పాముచే పట్టుకొనబడి మెల్లగా తేరుకుని

కూడా, దాన్ని వదిలించుకోవటం చేతకాని వాడయ్యాడు. పదివేల ఏనుగుల ప్రాణశక్తి, సింహంలాంటి మూపురమూ, గొప్ప భుజాలూ, కలిగి కూడా ఆ పాముకున్న వరప్రభావం చేత మోహితు డయ్యాడు. దాని పట్టువల్ల తన బుద్ధిబలాన్ని పోగొట్టుకున్నాడు. తనను విడిపించుకోవటానికి ఆతడెంతో తీవ్రంగా ప్రయత్నించాడు. కాని ఆ పామును త్రిప్పికొట్టటానికి ఆ వీరుడికెంత మాత్రమూ సాధ్యంకాలేదు.

179. సర్పరూపుడయిన నహుషునితో భీముడు సంభాషించుట.

అలా ఆ భీమసేనుడు పాముకి చిక్కాడు. చాలా అద్భుతమైన ఆ పాముయొక్క గొప్పశక్తిని గురించి ఆలోచించసాగాడు. 'సర్పశ్రేష్ఠమా! స్వేచ్ఛగా చెప్పు. నీవెవడవు? నాతో ఏం చేస్తావు?' అని పామునడిగాడు. 'నేను పాండురాజుకుమారుడిని. ధర్మరాజు తరువాతి వాడిని. భీమసేనుడిని. పదివేల ఏనుగులతో సమానమైన బలం కలవాడిని. నీకు ఎలా వశమయ్యాను? సింహాలు, పులులు, దున్నపోతులు మదించిన ఏనుగులు వందలుగా వచ్చి యుద్ధంలో నాచేత చంపబడ్డాయి. సర్పశ్రేష్ఠా! ఎంతోబలంగల రాక్షసులు, పిశాచాలు, పాములు నా భుజాల వేగాన్ని ఓర్చుకోవటానికి చాలరు. ప్రయత్నిస్తూ కూడా నీ వశమయ్యాను - నీ విద్యాబలమా? లేదా నీకున్న వరప్రభావమా? మానవులకు పరాక్రమ మన్నది వట్టి బూటకమని నాఅభిప్రాయం. ఎందుకంటే సర్పమా! ఇలా నా గొప్పబలాన్ని నీవు అణగద్రొక్కావు.' వీరుడైన భీము డిలా అంటూండగా ఆ పాము తన పెద్దపడగతో అతనిని పట్టుకుని అతని చుట్టూ చుట్టివేసింది. గొప్పబాహువులు గల అతనిని గట్టిగా పట్టుకొని ఉన్న ఆ పాము బలిసిన అతని భుజాలను వదలి ఇలా అంది. 'చాలాకాలం నుండి ఆకలిగొన్న అదృష్టంవల్ల నేడు నీవు దేవతలచేత ఆహారంగా ఇవ్వబడ్డావు. **శరీరం కలవాళ్ళకు ప్రాణాలు ప్రియమైనవి గదా!** శ్రేష్ఠుడా! నేనెలా ఈ పాము ఆకారాన్ని పొందానో ఆ విషయాన్ని నీకిప్పుడు తప్పకుండా చెప్పాలి. విను.

నేను బుద్ధిమంతులైన మహాత్ములకోపం వల్ల ఈదశను పొందాను. శాపవిముక్తిని పొందగోరి ఆ విషయాన్నంతా నీకు చెపుతున్నాను. నేను నహుషుడనే రాజర్షిని. తప్పక నీచేవిన పడే ఉంటాను. నీ పూర్వీకులకు ముందువాడిని. ఆయువు యొక్క వంశం కొనసాగేందుకు పుత్రుడ నయిన వాడిని. అటువంటి నేను బ్రాహ్మణుల నవమానించి అగస్త్యుని శాపం వల్ల ఇలాంటి స్థితిని పొందాను. నాదౌర్భాగ్యమెలా ఉందో చూడు. నీవు చంపతగనివాడవు. నావంశంలో పుట్టినవాడివి. చూడముచ్చటగా ఉన్నావు. విధివిధానమెలా ఉందో చూడు. నిన్ను నేడు నాఆహారంగా ఉపయోగించుకోబోతున్నాను. మానవోత్తమా!

రోజయొక్క ఆరవభాగంలో అది ఏనుగైనా, దున్నపోతైనా, ఎలాగైనా నాకు చిక్కితే నానుండి విడువబడదు. కౌరవశ్రేష్ఠుడా! నీవు కేవలం జంతువుల్లో చేరిన పాముకు చిక్కలేదు. నాకిది వరమిచ్చినట్లుంది. నేను ఇంద్రసింహాసనం నుండి పతనమై, వేగంగా శ్రేష్ఠమైన విమానం నుండి పడిపోతూ పూజ్యుడు, మునిశ్రేష్ఠుడైన అగస్త్యుని శాపవిమోచనం చెయ్యమని అడిగాను. తేజోవంతుడైన ఆ ముని కరుణచే కరిగి 'రాజా! కొంతకాలమైన తరువాత నీకు విముక్తి లభిస్తుందని నాతో అన్నాడు. తరువాత భూమిమీద పడిపోయాను. జ్ఞాపకశక్తి నన్ను విడిచిపెట్టలేదు. చాలాకాలం క్రింద జరిగినదైనా జరిగిందంతా నాకు గుర్తుంది. నీవడిగిన ప్రశ్నలకు విడమరిచి సమాధానాలు చెప్పేవాడు శాపంనుండి నిన్ను విడిపిస్తాడని ఆ ఋషి నాకు చెప్పాడు. రాజా! బలమైన ప్రాణియైనా, నీకన్న అధికు డెవడైనా సరే నీచేత పట్టుకోబడ్డవాడికి వెంటనే ధైర్యం నశిస్తుంది.' అని నాపట్ల సహృదయతకలిగిన ఆ దయామయుల ఆ మాటలను కూడ నేను విన్నాను. అటు తరువాత ఆ బ్రహ్మర్షులు అంతర్ధాన మయ్యారు. అలా ఎంతో చెడ్డపనిచేసిన నేను అపవిత్రమైన ఈ నరకంలో ఉన్నాను. ఈ పాము జన్మను పొంది విడుదలయ్యే సమయం కోసం ఎదురుచూస్తున్నాను. భీమసేను డా పాముతో 'సర్పమా! నీమీద నాకు కోపం లేదు. నన్ను నేను నిందించుకోవటమూ లేదు' అన్నాడు.

కారణమేమంటే మానవుడు సుఖాన్ని పొందటంలో, దుఃఖాన్ని పోగొట్టుకోవడంలో సమర్థుడౌతాడు, అసమర్థుడౌతాడు. కాని అందువల్ల ఎట్టిపరిస్థితిలోను మనసును క్రుంగదీసుకోకూడదు. మానవప్రయత్నంతో దైవాన్ని ఎవడు మోసగించగలుగుతాడు? దైవమే శ్రేష్ఠమైనదని నేను తలుస్తాను. పురుషప్రయత్నం వ్యర్థమైనది. భుజబలంపై ఆధారపడ్డ నాకు దైవం దెబ్బతీయటం వల్ల ఇప్పుడిక్కడ అకారణంగా ఈగతి పట్టింది. చూడు. కాని నేడు రాజ్యం కోల్పోయి అడవులపాలైన సోదరులగురించి బాధపడ్డట్లుగా నా చావు గురించి బాధపడటం లేదు. యక్షులు రాక్షసులతో నిండిన ఈహిమాలయం చేరటానికి కష్టమైన ప్రాంతం, కలవరంతో నన్ను వెతుకుతూ వాళ్ళు లోయలో పడిపోతారు. అటుపిమ్మట నేను మరణించానని విని రాజ్యం పొందటానికి చెయ్యాల్సిన ప్రయత్నాన్ని కట్టి పెట్టేస్తారు. స్వభావంచేత ధర్మాత్ములైన వారు రాజ్యలోభం గల నావల్ల బాధించబడుతున్నారు. లేదా బుద్ధిమంతుడైన అర్జునుడు విషాదం చెందడు. అన్ని అస్త్రాలు తెలిసినవాడు, దేవతలు, గంధర్వులు, రాక్షసులు అతనిని ఓడించలేరు. గొప్పబాహువులూ, ఎంతోగొప్పబలమూ కల ఆ అర్జునుడు తేలికగా దేవరాజైన ఇంద్రుని కూడా ఆయన

స్థానం నుండి తొలగించగల సమర్థుడు. ఇక జూదరి, ద్రోహి, దాంభికుడై మోహానికిలోనైన ధృతరాష్ట్రునిడికుమారుడు దుర్యోధను డెంత? ఎల్లవేళలా శత్రువులకన్న మేము పైచేయిగా ఉండా లనుకొనే దీనురాలైన మా అమ్మగురించి బాధపడుతున్నాను. సర్పమా! నేను మరణిస్తే దిక్కులేనిదైన నాతల్లికి నామీద పెట్టుకున్న ఆశలెలా సఫలమౌతాయి? పెద్దల ననుసరించే కవలలు ఎల్లప్పుడూ తమ పౌరుషం పట్ల అభిమానం కల నకులసహదేవులు నాభుజబలం వల్ల కాపాడబడుతున్నారు. నా వినాశంచేత పూర్తిగా శక్తిహీనులై, బలపరాక్రమాలు పోగొట్టుకొని నిరుత్సాహాలవుతారని నాఅభిప్రాయం. ఇలా ఎన్నో రకాలుగా భీముడు విలపించాడు. పాము పడగలలో ఇరుక్కుని కదలలేక పోయాడు.

కుంతీకుమారుడైన యుధిష్ఠిరుడు భయంకరాలైన అపశకునాలను బట్టి ఇష్టం కానివి చూడవలసివస్తుందని చింతిస్తూ మనసులో కలతచెందాడు. అతని ఆశ్రమానికి దక్షిణదిక్కునందు మంటలు చెలరేగాయి. భయపడి అక్కడున్న నక్క దారుణంగా అశుభాన్ని సూచిస్తూ, ఆర్తనాదం చెయ్యసాగింది. ఒకరెక్క, ఒకకన్ను, ఒకపాదంతో భయంకరంగా కనబడే మలినంగా ఉన్న తీతువుపిట్ట సూర్యుని వైపురక్తం క్రక్కుతూ కనబడింది. అప్పుడు కంకరవాన కురిపించే కఠినమైన, ప్రచండవాయువు వీచింది. జంతువులు పక్షులకూతలన్నీ దక్షిణంవైపు వినబడుతున్నాయి. వెనుకవైపు నల్లకాకి 'వెళ్ళు వెళ్ళు' అని అరుస్తోంది. అలాగే అతని కుడిభుజం మాటిమాటికీ అదురుతోంది. అతనిగుండె, ఎడమపాదమూ మండుతున్నాయి. ఇష్టంకానిది జరుగబోతోందని సూచించే మార్పు ఎడమకంటిలో ఏర్పడింది. భారతా! మేధావి అయిన ధర్మరాజు చాలాభయాన్ని శంకించి, ద్రౌపదిని 'భీముడెక్కడ?' అని అడిగాడు. భీముడు వెళ్ళి చాలాసేపైందని ద్రౌపది అతనికి చెప్పింది. వెంటనే ధర్మరాజు ధౌమ్యుడితో కలిసి బయలుదేరాడు. అర్జునుడితో ద్రౌపదిని రక్షించమని చెప్పాడు. నకులసహదేవులతో బ్రాహ్మణులను రక్షించమని చెప్పి వెళ్లాడు. శక్తిమంతుడైన ధర్మరాజు ఆ ఆశ్రమం నుండే భీమసేనుడి పాదాలగుర్తులను చూస్తూ భీముడిని ఆ అడవిలో వెదుకసాగాడు. అతడు తూర్పుదిక్కును చేరి పెద్దఏనుగుల గుంపులను, భీముడిపాదాల గుర్తులున్న నేలనూ చూశాడు. తరువాత నేలకూలిన వేల జంతువులను, వందల సింహాలను చూసి భీమసేనుడు వెళ్ళిన త్రోవనే రాజు అడవిలో ప్రవేశించాడు. వాయువేగంగల వీరుడైన భీముడు వేటాడటానికి పరుగెడుతుండగా, అతని తొడలకు తగిలి ముక్కలై మార్గంలో పడ్డచెట్లు కనబడ్డాయి. అత డప్పుడా గుర్తులను బట్టి వెళ్ళి పెనుగాలులతో కూడి, ఆకులు లేని చెట్లతో నిండి, ఎడారియై,

నీరులేని, ముళ్ళచెట్లతో నిండి, రాళ్లు, పెంకులు, మొక్కలతో, చేరుకోలేని, ఎత్తుపల్లాలుగా ఉన్న కొండగుహలో పాముకు చిక్కి చేష్టలుడిగిన మనిషిని చూశాడు.

180. ధర్మరాజు నహుషుని ప్రశ్నలకు సమాధానములొసంగుట.

బుద్ధిమంతుడైన యుధిష్ఠిరుడు పాముపడగచే చుట్టబడిన తన సోదరుడి దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు. 'కుంతీకుమారా! నీవెలా ఈ ఆపదలో చిక్కుకొన్నావు? పర్వతమంత పొడవు వెడల్పులతో ఉన్న ఈ సర్పశ్రేష్ఠ మెవరు?' అన్న ధర్మరాజును చూసి, ఆ భీముడు తానెలా ఆ పాముకు చిక్కుకున్నాడో ఆ విషయమంతా చెప్పసాగాడు. భీముడు చెపుతున్నాడు - 'ఆర్యా! ఇతడు గాలిని భక్షించే పామురూపంలో ఉన్న గొప్ప శక్తిమంతుడైన నహుషుడనబడే రాజర్షి. నన్ను ఆహారంగా గ్రహించాడు.' యుధిష్ఠిరుడు చెపుతున్నాడు. 'ఈ చిరంజీవి నా తమ్ముడు. అంతులేని పరాక్రమంగల ఈ నా సోదరుని విడిచిపెట్టండి. మీ ఆకలిని పోగొట్టే వేరే ఆహారాన్ని మేము మీకిస్తాం.' పాము చెపుతున్నది - 'ఈ రాజకుమారుడు నానోటి దగ్గరకు వచ్చి ఆహారమయ్యాడు. వెళ్ళు. ఇక్కడ ఉండరాదు. రేపు నీవైనా నాకు ఆహారం కావచ్చు. నా దగ్గరకు వచ్చినవాడు నాకు ఆహారమౌతాడు. ఇది నానియమం. నాయనా! నీవు కూడా నా దగ్గరకు వచ్చావు. చాలాకాలానికి ఈ నీ తమ్ముడు నాకు ఆహార మయ్యాడు. నేనితనిని విడువను. అంతేకాదు. వేరేవానిని కోరను.' యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు - 'సర్పమా! యుధిష్ఠిరుడు నిన్నడగుతున్నాడు. నిజమైన మాట చెప్పు. నీవు దేవుడివా? దైత్యుడివా? లేక భుజంగమా! భీమసేనుడినెందుకు ఆహారంగా గ్రహించావు? భుజంగమా! నీకు ఏం తెచ్చిస్తే, లేదా ఏం తెలిపితే ప్రీతి కలుగుతుంది. ఎలాంటి ఆహారాన్నివ్వను. నీవెలా వీనిని విడిచిపెడతావు?'

పాము చెపుతోంది - 'అనఘా! నేను నీకు పూర్వికుడనైన నహుషుడనే రాజును. చంద్రుడినుండి ఐదోవాడైన ఆయువు కుమారుడను. యాగాలు ఆచరించటం, తపస్సు, వేదాధ్యయనం, ఇంద్రియనిగ్రహం, పరాక్రమం-వీని వల్ల నేను ముల్లోకాలపై ఆధిపత్యాన్ని పొందాను. ఆ ఐశ్వర్యాన్ని పొందిన నాకు అప్పుడు గర్వం కలిగింది. వేయిమంది బ్రాహ్మణులచేత నాపల్లకిని మోయించాను.

మహారాజా! తరువాత ఐశ్వర్యగర్వంతో మత్తెక్కిన నేను బ్రాహ్మణులనవమానించి అగస్త్యుడి శాపంవల్ల ఈ దశకు చేరుకొన్నాను. పాండవా! మహాత్ముడైన ఆ అగస్త్యుడి అనుగ్రహం వల్లే జ్ఞాపకశక్తి నేటివరకు నన్ను వీడలేదు. ఈ నీ తమ్ముడు రోజాయొక్క ఆరోభాగంలో నాకాహారమయ్యాడు. నేనితనిని విడువను. వేరేదీ కూడ కోరను. నేనడిగిన

ప్రశ్నలకిప్పుడు సమాధానాలు చెప్పినట్లయితే, అటు తరువాత నీతమ్ముడైన భీముని విడిచిపెడతాను. యుధిష్ఠిరు డడుగుతున్నాడు. 'భుజంగమా! నీ ఇష్టం వచ్చినట్లు అడుగు. నీకు ప్రీతి కలిగించటానికి సమర్థుడనయితే నీ మాటలకు బదులిస్తాను. బ్రాహ్మణుడు ఈ తన జన్మలో తెలియవలసినదానిని నీవెరుగుదువో లేదో విని, తరువాత నీ మాటలకు బదులిస్తాను.' పాము అడుగుతోంది. రాజా! చెప్పు. బ్రాహ్మణుడెవడు? యుధిష్ఠిరా! తెలియదగినదేది? నీమాటలతో చాలా బుద్ధిమంతుడివిగా నిన్ను ఊహిస్తున్నాం.' యుధిష్ఠిరుడు చెపుతున్నాడు. 'నాగేంద్రా! ఎవడియందు సత్యం, దానగుణం, ఓర్పు, సత్ప్రవర్తన, అక్రూరత, తపస్సు, దయ కనబడతాయో అతడు బ్రాహ్మణుడుగా చెప్పబడుతున్నాడు. సర్పమా! తెలియదగినది పరబ్రహ్మమే. అది సుఖదుఃఖాల కతీతమైనది. దాన్ని చేరుకొంటే (తెలుసుకుంటే) శోకాన్ని అధిగమిస్తారు. నీవేం చెప్పాలనుకొంటున్నావు?' సర్పం చెపుతోంది - యుధిష్ఠిరా! నాలుగువర్ణాల వారికి సత్యం, వేదం - భూతాలు - మేలు చేకూర్చేవే. శూద్రులయందు కూడ సత్యం, దానగుణం, కోపంలేకపోవడం, క్రూరస్వభావం లేకపోవడం, హింసాగుణం లేకపోవడం దయ ఉన్నాయి. రాజా! సుఖదుఃఖాలకతీతమైనది ఇక్కడ తెలియదగిన తత్త్వంగా నీవు చెప్పావు. ఆ రెండూలేని మరొక వస్తువున్నట్లు నేను గుర్తించటంలేదు.

యుధిష్ఠిరుడు చెపుతున్నాడు - 'శూద్రుడియందు పైన చెప్పిన సత్యం మొదలైనవి ఉండి బ్రాహ్మణునిలో లేనిచో ఆ శూద్రుడు శూద్రుడుకాడు. ఆ బ్రాహ్మణుడు బ్రాహ్మణుడు కాడు. సర్పమా! **సత్యాదులు ఎవనియందుండునో అతడు బ్రాహ్మణుడు. ఎవని యందాగుణములు లేవో అతనిని శూద్రుడనవలెను.** సుఖదుఃఖాలు లేని వేరేతత్త్వమే లేదని, అందువలనే తెలియదగినది లేదని నీచేత చెప్పబడినది. సర్పమా! సుఖదుఃఖాలు లేని తత్త్వము లేదు అని గదా అభిప్రాయం. శీతోష్ణముల మధ్య చల్లదనం - వెచ్చదనాల మధ్య ఉష్ణముండదు. శీతత ఉండదు. అలాగే సుఖదుఃఖాలకు అతీతమైన (సుఖాదుఃఖాలు లేని) స్థానమొకటి ఉన్నదని నా అభిప్రాయం. సర్పమా! నీవేమనుకొనుచున్నావు?' పాము చెపుతోంది - 'రాజా! ప్రవర్తనచేతనే బ్రాహ్మణుని నిర్ధారించవలెననీ నీ అభిప్రాయమైతే చిరంజీవీ! నీవు పేర్కొన్న ప్రకారం ప్రవర్తించనంతవరకు జాతి వ్యర్థమగును.' యుధిష్ఠిరుడు చెపుతున్నాడు - 'బుద్ధిమంతుడా! మనుష్యులలో అన్నివర్ణాలమధ్య సాంకర్యంవల్ల జాతిని నిర్ధారించటం కష్టమని నాఅభిప్రాయం. మానవులందరూ అన్నిజాతుల స్త్రీలందు సంతానాన్ని పుట్టించుచున్నారు. మనుష్యులకు మాట, దాంపత్యం, పుట్టుక, చావు సమానముగా ఉంటాయి. జాతినిర్ణయించలేని దైనందున "యజ్ఞము చేయుచున్నవారం" అని వేదం జాతిని చెప్పక అందరికీ సాధారణముగా చెప్పుట ఆర్థప్రమాణం. కాబట్టి ప్రవర్తన ప్రధానమని తత్త్వవేత్తలు

ఇష్టపడతారు. శిశువుకు బొడ్డుకోయక ముందు 'జాతకర్మ' అను సంస్కారం చేయబడుతుంది. ఆ సమయంలో ఆ శిశువు తల్లి సావిత్రి అని, తండ్రి ఆచార్యుడని చెప్పబడతారు. జాతిగురించి సంశయం కలిగినప్పుడు స్వాయంభువమనువు "సంస్కారం చేసి వేదాధ్యయనం చేయించనంతవరకు శూద్రుడని" చెప్పాడు. వేదం చెప్పిన ప్రకారం సంస్కరించి వేదాధ్యయనాదులు చేయించినా బ్రాహ్మణాదివర్ణాల వారియందు ఆశించిన సత్ప్రవర్తన లేనిచో నాగేంద్రా! వారి విషయమున వర్ణసాంకర్యం బలంగా ఉందని నిర్ణయించబడింది. ఇప్పుడు ఎవరిలో వేదోక్తసంస్కారముతో పాటు సత్ప్రవర్తన చోటు చేసుకుంటున్నాయో అతడు బ్రాహ్మణుడని నేనింతకుమునుపే చెప్పాను.' పాము చెపుతోంది. 'యుధిష్ఠిరా! తెలియవలసినది ఏదో తెలిసిన నీ మాటలు విన్నాను. నేనెలా నీసోదరుడైన భీముని తినగలను?'

181. నహుషుని శాపవిముక్తి.

యుధిష్ఠిరుడు చెపుతున్నాడు – నీవు వేదవేదాంగాల హద్దునెరిగినవాడవు. లోకంలో అలాంటివాడివని పేరొందినవాడవు. ఏపనిచెయ్యటంవల్ల నీకు అన్నిటికన్న ఉత్తమమైన స్థితి కలుగుతుందో చెప్పు.' పాము చెపుతోంది – 'భారతా! తగినవాడికి దానం చెయ్యటం, ప్రియమైన మాటలు పలకటం, నిజం పలకటం, అహింసయందే ఆసక్తుడవటం వల్ల స్వర్గానికి చేరుకొంటాడని నా అభిప్రాయం.' యుధిష్ఠిరు డడుగుతున్నాడు. సర్పమా! దానం, సత్యం – వీటిలో ఏది బరువైనది? అహింస, ప్రియంగా మాటలాడుట – వీటిలో బరువేది, తేలికైనదేదో చెప్పవలసినది.' అజగరం చెపుతోంది – 'దానం, సత్యం, తత్త్వం, అహింస, ప్రియభాషణం వీటి గురులాఘవములు (హెచ్చు తగ్గులు) పనియొక్క ప్రాధాన్యతను బట్టి చూడబడతాయి. రాజేంద్రా! ఒకదానంకన్న సత్యమే గొప్పదౌతుంది. సత్యవాక్యం కన్న ఒకదానం గొప్పదౌతుంది. మహారాజా! ఇలాగే ప్రియమైన మాటలకంటే అహింసకు గౌరవమెక్కువ. అహింసకన్న ప్రియసంభాషణం గొప్పదిగా కనబడుతుంది. రాజా! ఈవిధంగా గౌరవలాఘవముల నిర్ణయం పనినిబట్టి జరుగుతుంది. నీవింకా దేనిని అడగదలచావో అడుగు. సాధ్యమైనంతవరకు సమాధానమిస్తాను.' యుధిష్ఠిరుడడుగుతున్నాడు. 'సర్పమా! మానవుడికి స్వర్గమెలా కలుగుతుంది? చేసే కర్మలకు (పనులకు) తప్పకుండా కలిగే ఫలాన్నెలా చూడగలుగుతాం? శరీరాభిమానం లేని (సిద్ధుడికి) వ్యక్తి ఎలా మసలుతాడు? ఈవిషయాలను నాకు చక్కగా చెప్పు.' పాము చెపుతోంది. 'రాజా! తానాచరించిన కర్మలకు మూడుగతులు చూపబడ్డాయి. మనిషిగాపుట్టటం, స్వర్గంలో నివసించటం, పశుపక్ష్యాదులలో

పుట్టటం అనేవి ఆ మూడు. సోమరితనం, ప్రమాదం లేకుండా అహింసను పాటిస్తూ దానంమొదలైన మంచిపనుల కారణంగా మనుష్యలోకం నుండి స్వర్గాన్ని పొందుతాడు. రాజేంద్రా! పైనపేర్కొన్న దానికి వ్యతిరేకంగా ప్రవర్తించినకారణంగా మనిషి ఔతాడు. నాయనా! ఇంకా ఎంతో విపరీతంగా ప్రవర్తిస్తే పశుపక్ష్యాదుల జన్మ కలుగుతోంది. కామం, క్రోధం, హింస, లోభాలతో కూడిన వాడు మనుష్యత్వం నుండి భ్రష్టుడై(పతనమై) పశుపక్ష్యాలందు పుడతాడు. మానవజన్మ పొందటానికి పశుపక్ష్యాది జన్మల నుండి ఉద్ధరించబడటం జరుగుతుంది. ఆవు, గుర్రం మొదలయిన జన్మలనుండి దేవత్వం సిద్ధించటం కూడా కనబడుతోంది. నాయనా! ఆయా పనుల నాచరించటంచేత జీవుడు ఈ మూడుగతులలోను తిరుగుతాడు. తానాచరించిన కర్మకు ఫలం కోరే అభిమానం గల జీవుడు పరవశుడై మాటిమాటికీ పుడతాడు. తప్పనిసరిగా సుఖదుఃఖాల ననుభవిస్తాడు. కర్మఫలం మీద ఆసక్తిలేని ప్రజలకు వ్యవస్థను కల్పించాలనే భావనగల ద్విజుడు తన ఆత్మను నిత్యమైన పరమాత్మయందు సంలగ్నం చేస్తాడు.

యుధిష్ఠిరు డడుగుతున్నాడు – సర్పమా! శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు ఆధార మేదో ప్రసన్నుడవై ఉన్నది ఉన్నట్లు చెప్పు. బుద్ధిమంతుడా! మనసెందుకు (శబ్ద, స్పర్శ, రూప,రస,గంధాలనే) విషయాలను ఒకేసారి గ్రహించదు. ఇంతవరకు అడిగిన విషయాలన్నింటినీ చెప్పవలసినది.' పాము చెపుతోంది – 'చిరంజీవీ! ఆత్మ అనబడే ద్రవ్యం స్థూల, సూక్ష్మ కారణ శరీరాలను ఆశ్రయించి, ఇంద్రియములతో కూడి విధి(కర్మ)ననుసరించి సుఖదుఃఖాల ననుభవిస్తుంది. భరతశ్రేష్ఠా! ఆత్మసుఖ దుఃఖరూపమైన భోగాన్ని అనుభవించుటకు ఆధారమైన శరీరంలో, దానికి జ్ఞానం, బుద్ధి, మనస్సు సాధనాలని నేను చెపుతున్న విషయాన్ని గ్రహించుము. నాయనా! శబ్ద, స్పర్శ, రూప, రస,గంధాలనే ఐదు విషయాలకు ఆధారాలైన పంచభూతాలచే నిర్మించబడ్డ శరీరంలో ఉన్న జీవాత్మ; ఈ శరీరంలో ఉన్న మనస్సుద్వారా వరుసగా ఈ ఐదు విషయాలను అనుభవిస్తాడు. మానవశ్రేష్ఠా! విషయాల ననుభవించేటప్పుడు ఈ జీవాత్మ మనస్సు ఒకవిషయంమీదే లగ్నమవటంచేత ఒకేసారి అనేక విషయాలను గ్రహించటం కుదరదు. పురుషశ్రేష్ఠా! ఆ ఆత్మ కనుబొమల మధ్య నుండి ఉత్తమం, అధమం అయిన బుద్ధిని అనేకరకాలైన ద్రవ్యాలవైపు ప్రేరేపిస్తుంది. విద్వాంసులు బుద్ధి పనిచేసిన తరువాతనే అనుభవాన్ని చూస్తున్నారు. రాజశ్రేష్ఠా! ఇదే క్షేత్రంలో(శరీరంలో) ఉన్న ఆత్మను ప్రకాశింపచేసే విధానం.' యుధిష్ఠిరుడడుగుతున్నాడు – 'నాకు మనస్సు, బుద్ధి వీని ఉత్తమలక్షణాలను చెప్పు. అధ్యాత్మశాస్త్ర(వేదాంతశాస్త్ర) విద్వాంసులకిది తెలుసుకోవటం ముఖ్యకర్తవ్యంగా

చెపుతారు.' పాము చెపుతోంది - 'నాయనా! ఆత్మకు భోగమోక్షాలను సంపాదించటమే బుద్ధి యొక్క పని. ఆత్మనాశ్రయించే బుద్ధి విషయాలవైపు వెళుతుంది. అందువల్ల బుద్ధి ఆత్మ ననుసరిస్తుందని తలచబడుతోంది. బుద్ధియొక్క గుణాన్నిబట్టి మనస్సు గుణాన్ని పొందుతుంది. పనిమొదలైనప్పుడే బుద్ధివ్యక్తమౌతుంది. మనస్సెప్పుడూ వ్యక్తమౌతూనే ఉంటుంది. నాయనా! మనస్సు, బుద్ధి వీనికి గల ఈ తేడాయే వాటిని వేరుచేస్తోంది. నీవుకూడా ఈ విషయాన్ని బాగాతెలిసినవాడవు. నీవే మనుకొంటున్నావు?'

యుధిష్ఠిరుడు చెపుతున్నాడు - 'బుద్ధిమంతులలో శ్రేష్ఠుడా! ఈ నీబుద్ధి చాలా ఉత్తమమైనది. ఆహా! నీవు తెలియవలసిన దానిని తెలుసుకొన్నావు. కాని నన్నెందుకు అడుగుతున్నావు? అన్నీ తెలిసినవాడివి. స్వర్గంలో ఉండేవాడివి. చాలా అద్భుతమైన పనులు చేసినవాడివి. బ్రాహ్మణుల నవమానించాలనే మోహం నిన్నెలా చేరుకొంది? ఇది నాకు చాలాపెద్ద సందేహం. పాము చెపుతోంది - **'సంపద చాలాతెలివైనవాడైనా, శూరుడైనా పరే మానవుని మోహంలో పడేస్తుంది.** సుఖవిలాసాల్లో మునిగిన ప్రతివాడూ మోహపడతాడని నా అభిప్రాయం. యుధిష్ఠిరా ! ఇలా నేను ఐశ్వర్యంవల్ల మోహం చెంది మదోన్మత్తుడనై పతనమయ్యాను. పతనమైన తరువాత తెలుసుకొన్నాను. కాబట్టి నిన్నిప్పుడు మేల్కొలుపుతున్నాను. మహారాజా! నీవు నాకోసం చెయ్యాల్సింది చేశావు. సజ్జనుడవైన నీతో సంభాషణం చేసిన నాకు ఎంతో కష్టాన్నిచ్చిన శాపం తొలగిపోయింది. పూర్వం నేను స్వర్గంలో దివ్యమైన విమానం మీద తిరుగుతూ అభిమానంచేత ఒళ్ళు తెలియక ఇతరునెవరినీ గుర్తించేవాడిని కాను. బ్రహ్మర్షులు, దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, పాములు, ముల్లోకవాసులందరూ నాకు పన్నులు చెల్లించేవారు. రాజా! కంటితో ఏప్రాణిని చూశానో ఆ ప్రాణియొక్క తేజస్సును వెంటనే హరించే బలం నాకంటికుండేది. వేలమంది బ్రహ్మర్షులు నాపల్లకిని మోసేవారు. రాజా! ఆ నా చెడు ప్రవర్తన స్వర్గరాజ్యలక్ష్మి నుండి కూలద్రోసింది. స్వర్గంలో అగస్త్యమహాముని నాపల్లకి మోస్తుండగా పాదంతో తాకాను. దానివల్ల నీవు పామువైపొమ్మని అగస్త్యుడిచేత శపించబడ్డాను. అందువల్ల రాజచిహ్నాలన్నీ లోపించి ఆ శ్రేష్ఠమైన విమానం నుండి జారిపడ్డాను. పామునై తలక్రిందులుగా పడుతూ నన్ను గుర్తించాను. శాపం తొలగుతుందనుకొని ఆ బ్రహ్మర్షిని నేను యాచించాను. భగవంతుడా! ప్రమాదంవల్ల వివేకం కోల్పోయిన నన్ను క్షమించు అన్నాను. తరువాత పడిపోతున్న నాపై దయ కలిగి అతడిలా అన్నాడు.

యుధిష్ఠిరుడైన ధర్మరాజు నిన్ను శాపవిముక్తుని చేస్తాడు. నీ అభిమానం, ఘోరమైన పాపంయొక్క ఫలం క్షీణించగానే పుణ్యఫలాన్ని పొందుతావు. రాజా! ఆయన బ్రహ్మజ్ఞానం,

బ్రాహ్మణాత్వాన్ని చూసి నాకు ఆశ్చర్యం కలిగింది. అందుకే మొదట ఈ విషయం గూర్చే ప్రశ్నించాను. **సత్యం, ఇంద్రియ నిగ్రహం, తపస్సు, దానం, అహింస, ధర్మపరాయణత్వం - ఈ మంచి గుణాలెప్పుడూ మానవునికి సిద్ధిని చేకూరుస్తాయి. జాతి, కులం సిద్ధినివ్వవు.** మహాబలుడైన ఈ నీ తమ్ముడు భీముడిక పూర్తిగా క్షేమాన్ని పొందాడు. మహారాజా! నీకు శుభమగుగాక! నేనిప్పుడు మళ్ళీ స్వర్గానికి వెళతాను. పురుషసింహమా! ధర్మజా! శుభకరమైన నీరాకచేత ఈ పుణ్యకాలం సమీపించింది. ఈ కారణంగా నీవు నాకోసమెంతో గొప్పపని చేశావు. అలా అంటూ ఆ నహుషమహారాజు పాముశరీరాన్ని విడిచి, దివ్యశరీరాన్ని పొందాడు. ఆ సమయంలోనే స్వేచ్ఛగా తిరిగే ఉత్తమమైన విమానం అక్కడ దిగింది. దానినెక్కి ఆయన స్వర్గానికి వెళ్ళిపోయాడు. శ్రీమంతుడు యుధిష్ఠిరుడు కూడ తమ్ముడైన భీమునితో కలసి, ధౌమ్యునితో ఆశ్రమానికి తిరిగివచ్చాడు. ధర్మరాజు తరువాత అక్కడకు చేరుకున్న బ్రాహ్మణులందరికీ ఉన్నదిఉన్నట్లు జరిగినదంతా చెప్పసాగాడు. అతని సోదరులు ముగ్గురూ, ఆ బ్రాహ్మణు లందరూ, ద్రౌపదీ ఆ విషయాన్నంతా విని ఎంతో సిగ్గుపడ్డారు. పాండవుల మేలుకోరి ఆ బ్రాహ్మణశ్రేష్ఠులందరూ భీముడిని, అతని సాహసాన్ని నిందిస్తూ ఇలా చెయ్యవద్దన్నారు. భయంనుండి విడివడిన మహాబలుడైన భీముడిని చూసి, పాండవులు సంతోషంతో తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. భయాన్ని విడిచిపెట్టారు.

182. పాండవులు ద్వైతవనము నుండి కామ్యకవనము చేరుట.

పాండవులు ద్వైతవనంలో నివసిస్తున్న సమయంలో గ్రీష్మాన్ని అంతరింపజేసి, సర్వప్రాణులకు సుఖప్రదమయిన వానకాలం వచ్చింది. అప్పుడు కారుమబ్బులు పెద్దగా ఉరుముతూ ఆకాశాన్నీ, దిక్కులనూ కప్పి వేస్తూ రేబవళ్ళు నిరంతరాయంగా వర్షించాయి. వందలు వేలుగా ఉన్న ఆ మబ్బులు వర్షాకాలపు గుడారాల్లా కనిపిస్తున్నాయి. అవి సూర్యకాంతులను నిరోధిస్తూ మెఱుపుల నిర్మలకాంతులను ధరించి ఉన్నాయి. నేలంతా గడ్డి మొలిచింది. మదించిన అడవిదోమలు, పాములు తిరుగాడ సాగాయి. నీట తడిసిన భూమి ప్రశాంతంగా సర్వమనోరంజకంగా ఉంది. మిట్టపల్లాలు తెలియకుండా నేలకూ, నదులకూ తేడా తెలియకుండా నేలనంతా నీరు ఆవరించింది. వర్షాకాలపు నదులు పరవళ్ళు త్రొక్కే నీటితో బాణాలవలె మహావేగంతో అల్లకల్లోలంగా ప్రవహిస్తూ అడవులను శోభిల్లజేస్తున్నాయి. వర్షంలో తడిసి అరుస్తున్న వరాహాలు, మృగాలు, పక్షుల వివిధ ధ్వనులు అడవుల్లో వినిపిస్తున్నాయి. మదించిన చాతకపక్షులు, నెమళ్ళు, మగకోయిలల సమూహాలతో

కలిసి ఎగిరెగిరిపడుతున్నాయి. పొగరెక్కిన కప్పలు కూడా అటూ ఇటూ ఎగిరిపడుతున్నాయి. పాండవులు ఇంకా మరుప్రదేశంలోనే సంచరిస్తున్నారు. పైన చెప్పినట్లు వివిధరూపాలతో, మేఘగర్జనలతో ప్రతిధ్వనించిన వర్షర్తువు శుభప్రదమై గడిచిపోయింది.

ఆపై ఆనందహేతువైన శరదృతువు సంక్రమించింది. క్రౌంచపక్షులు, హంసలు అంతటా సంచరింపసాగాయి. అడవులలో కొండ చరియలపై గడ్డీగాదం బాగా పెరిగాయి. నదుల జలం నిర్మలమయింది. ఆకాశం నిర్మలమై నక్షత్రాలు కాంతివంతాలయ్యాయి. జంతువులు, పక్షులతో నిండిన ఆ శరత్తు మహానుభావులయిన పాండవులకు మంగళకరమైంది. రాత్రులు ధూళి లేకుండా నిర్మలంగా ఉన్నాయి. మేఘాలవలె చల్లగా ఉన్నాయి. గ్రహనక్షత్ర సమూహాలతో, చంద్రునితో వెలుగొందసాగాయి. చల్లని నీటితో నిండి, శుభప్రదంగా ఉన్న నదులు, చెరువులు కలువలతో, తామరలతో అలంకరింపబడి ఉండటాన్ని (పాండవులు) చూశారు. పయనిస్తున్న పాండవులు పవిత్రతీర్థాలు గల సరస్వతీ నదిని చూచి, ఆనందించారు. ఆ నదీతీరాలు ఆకాశంవలె నిర్మలంగా ఉన్నాయి. ఆ రెండు తీరాలలో పేము తీగలు ఏపుగా పెరిగి ఉన్నాయి. వీరులయిన ఆ పాండవులు పవిత్ర నిర్మలజలంతో నిండుగా ఉన్న ఆ సరస్వతీనదిని చూచి ఆనందించారు. పాండవులు అక్కడ ఉన్నప్పుడే పర్వసంధిలో పవిత్ర మయిన కార్తీకమాసంలో శరత్పూర్ణిమ వచ్చింది. భరతశ్రేష్ఠ లయిన ఆ పాండవులు పుణ్యాత్ములై, సత్త్వసంపన్న లయిన తాపసులతో కలిసి ఆ ఉత్తమయోగాన్ని సఫలం చేసికొన్నారు. కృష్ణపక్షం ప్రారంభం కాగానే పాండవులు ధౌమ్యునితో, సూతులతో, పురోహితులతో కలిసి కామ్యకవనం వైపు పయనించారు.

183. సత్యాకృష్ణులు, నారదమార్కండేయులు కామ్యకవనము చేరుట.

పాండవులు కామ్యకవనాన్ని చేరి మునిజనుల ఆతిథ్యాన్ని స్వీకరించి, ద్రౌపదితో కలిసి నివసిస్తున్నారు. విశ్వాసపాత్రులైన ఆ పాండుకుమారులు అక్కడ నివసిస్తున్న సమయంలో చాలామంది బ్రాహ్మణులు వారి చుట్టూ చేరారు. వారిలో ఒక బ్రాహ్మణుడు శ్రీకృష్ణుడు అక్కడకు రాబోతున్నాడని చెప్పాడు. 'కురువంశశ్రేష్ఠులారా! మీరు ఇక్కడకు వచ్చినట్లు శ్రీకృష్ణునకు తెలుసు. ఆయ నెప్పుడూ మీ శ్రేయస్సును గురించియే ఆలోచిస్తూ మిమ్ములను చూడగోరుతుంటాడు. మహాతపస్వి, స్వాధ్యాయ తపస్సులమీదనే ఆసక్తి గలవాడు. చిరంజీవి అయిన మార్కండేయమహర్షి కూడా త్వరలోనే మిమ్ములను కలుస్తాడు.' ఆ బ్రాహ్మణుడు అలా అంటుండగానే కేశవుడు కనిపించాడు. రథికశ్రేష్ఠుడైన ఆ హరి శైబ్యసుగ్రీవాలనే గుర్రాలు పూన్చిన రథంపై సత్యభామతో కూడి, శచీదేవితో కూడిన ఇంద్రునివలె

కురుసత్తములైన పాండవులను చూడాలని వచ్చాడు. ధీమంతుడైన శ్రీకృష్ణుడు రథంనుండి దిగి ధర్మరాజుకు, భీమునకు యథావిధిగా నమస్కరించి, ఆనందించాడు. శ్రీకృష్ణుడు ధౌమ్యుని అర్చించాడు. నకులసహదేవుల అభివాదాలు స్వీకరించాడు. అర్జునుని కౌగిలించుకొన్నాడు. ద్రౌపదిని ఓదార్చాడు. చాలాకాలం తర్వాత కనిపించిన వీరుని, తనకిష్టుడైన అర్జునుని చూచి శ్రీకృష్ణుడు పదేపదే కౌగిలించుకొన్నాడు. కృష్ణుని పట్టమహిషి అయిన సత్యభామకూడా ద్రౌపదిని కౌగిలించుకొన్నది. పాండవు లందరూ భార్యాపురోహితులతో కలిసి కృష్ణుని పూజించి ఆయనచుట్టూ చేరారు. ధనంజయునితో కూడిన సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడు కార్తికేయునితో కూడిన సాక్షాత్తు పరమేశ్వరునివలె శోభిల్లాడు. అర్జునుడు అరణ్యవాసంలోని సర్వవృత్తాంతాన్ని యథాతథంగా శ్రీకృష్ణునకు చెప్పి సుభద్రాభిమన్యుల క్షేమాన్ని అడిగాడు. మధుసూదనుడు అర్జునుని, ద్రౌపదిని, పురోహితుని సత్కరించి, అందరితో కలిసి కూర్చొని యుధిష్ఠిరుని ప్రశంసిస్తూ ఇలా అన్నాడు.

పాండుకుమారా! రాజ్యలాభం కన్న ధర్మమే గొప్పది. ధర్మసాధనకు తపస్సే మార్గం. నీవు సత్యంగా, నిజాయితీగా ధర్మాన్ని పాటిస్తున్నావు. అందువలన ఇహపరలోకాలను గెలువగలుతున్నావు. బ్రహ్మచర్యాదివ్రతపాలన చేస్తూ ముందు వేదాధ్యయనం చేశావు. ఆపై ధనుర్వేదం మొత్తాన్ని చక్కగా అభ్యసించావు. క్షాత్రధర్మంతో ధనం సంపాదించి, ప్రాచీన క్రతువుల నన్నింటినీ నిర్వహించావు. నీకు గ్రామ్యధర్మాలపై ఆసక్తిలేదు. కామదృష్టితో ఏ పనీ చేయవు. అర్థంమీది ఆసక్తితో ధర్మాన్ని వీడవు. ఆ ప్రభావం వలననే నీవు **ధర్మరాజువు.** రాజా! రాజ్యాన్ని, సంపదను, భోగాలను పొంది కూడా నీవు సత్యం, తపస్సు, శ్రద్ధ, బుద్ధి, క్షమ, ధైర్యం ఈ సద్గుణాలను ప్రేమిస్తున్నావు. పాండుకుమారా! కురుజాంగల దేశంలోని జనసమూహం జూదసభలో నిస్సహాయ అయిన ద్రౌపదిని చూచి, ఆమెతో అధర్మంగా మాటాడినప్పుడు కూడా దానిని నీవు సహించావు. మరొకడు అటువంటిది సహించలేడు. త్వరలోనే నీ కోరికలన్నీ తీరి, ప్రజలను చక్కగా పరిపాలించగలుగుతావు. సందేహం లేదు. అరణ్యవాసరూపమైన నీ ప్రతిజ్ఞ ముగిసినవెంటనే కౌరవులను దండించటానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. ధౌమ్యుని, భీమును, ధర్మరాజును, నకులసహదేవులను, ద్రౌపదిని చూచి శ్రీకృష్ణుడు "మీపుణ్యంవలన, అదృష్టం వలన అర్జునుడు అస్త్రవిద్యలో పారంగతుడై ఆనందంగా తిరిగివచ్చాడు" అన్నాడు.

మిత్రపరివృతుడైన కృష్ణుడు యాజ్ఞసేని అయిన ద్రౌపదితో ఇలా అన్నాడు – 'అర్జునుని పొంది నీ మనోరథాలను సఫలం చేసికొన్నావు. ఇది అదృష్టఫలం. ద్రౌపదీ! నీ బిడ్డలు మంచివారు. ధనుర్వేద విశారదులు. వారు సజ్జనుల మధ్య నిలిచి సత్పురుషుల

మార్గాన్ని అనుసరించి ప్రవర్తిస్తున్నారు. ద్రౌపదీ! నీ తండ్రీ, నీ సోదరులూ రాజ్యాన్నీ, రాజ్యభోగాలనూ ఎరగా చూపి, పిలిచినా నీ పిల్లలు తమ తాతదగ్గర కానీ, మేనమామలదగ్గర గానీ ఉండటానికి ఇష్టపడలేదు. ద్రౌపదీ! ధనుర్విద్యాసక్తు లయిన నీ కుమారులు ఆనర్తదేశానికి క్షేమంగా చేరి, ద్వారకలో నివసిస్తున్నారు. వారు అక్కడ నుండి దేవలోకానికి వెళ్ళటానికి కూడా ఇష్టపడటం లేదు. నీవు కానీ, పూజ్యురాలు కుంతి కానీ ఏవిధంగా బుద్ధులు చెప్పి పిల్లలను పెంచగలరో అదేవిధంగా సుభద్రకూడా ఏమరుపాటు లేకుండా వారిని పెంచుతోంది. ద్రౌపదీ! రుక్మిణికొడుకు ప్రద్యుమ్నుడు అనిరుద్ధునికి, అభిమన్యునికి, సునీథునకు, భానువునకు విద్య నేర్పి సంరక్షించినట్లు నీ కొడుకులకు కూడా శిక్షకుడు, సంరక్షకుడు అయ్యాడు. అభిమన్యుడు శూరు లయిన నీ కుమారులకు గద, కత్తి, డాలులను ప్రయోగించటంలో, వివిధాస్త్రవిద్యలలో అవిశ్రాంతంగా తీర్చిదిద్దుతున్నాడు. రథాన్ని, గుర్రాలను నడపటంలో శిక్షణ నిస్తున్నాడు. రుక్మిణికొడుకు ప్రద్యుమ్నుడు కూడా నీ కుమారులకు శిక్షణనిచ్చి వివిధ శస్త్రాలను విధిపూర్వకంగా ఇచ్చాడు. నీ కొడుకులూ, అభిమన్యుడూ ప్రదర్శిస్తున్న పరాక్రమాలను చూచి ఆనందిస్తున్నాడు. యాజ్ఞసేనీ! నీ కుమారులు నగర విహారానికి బయలుదేరినప్పుడు ఒక్కొక్కరి వెంట రథాలు, పల్లకీలు, ఏనుగులు వెళ్తున్నాయి.'

అప్పుడు కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'రాజా! దశార్హ, కుకుర, అంధక వీరులు నీ ఆదేశాలను పాటిస్తూ నీవు ఉండమన్న చోట ఉండటానికి సిద్ధంగా ఉన్నారు. రాజా! బలరాముని నేతృత్వంలోని గోపసేన ఆశ్వికులతో కూడిన అశ్వాలు, రథాలు, ఏనుగులు, పదాతులతో సహా సదా సన్నద్ధమై నీకోస మున్నది. ఆ యోధుల ధనుర్వేగం వాయువేగంతో సమానం. పాండునందనా! పాపాత్ములలో శ్రేష్ఠుడైన ధృతరాష్ట్రకుమారుని బంధుమిత్రులతో సహా నరకాసురుని శాల్వుని నడిపించిన బాటలోనే నడిపించు. మహారాజా! సభలో నీవు చేసిన ప్రతిజ్ఞను నీవు పాటించు. నీవు ఆదేశిస్తే యదువీరులు నీ శత్రువుల నందరినీ సంహరిస్తారు. హస్తినాపురం నీరాకకై నిరీక్షిస్తుంది. నీవు క్రోధాన్నీ, దైన్యాన్నీ వీడి నీ ఇష్టం వచ్చినచోట వసించు. ఆ తరువాత శోకరహితుడవై ప్రసిద్ధమూ, శ్రేష్ఠమూ అయిన హస్తినాపురికి చేరుకో!' అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుని అభిప్రాయాన్ని విని, గ్రహించి బహుధా ప్రశంసించి చేతులు జోడించి, ఇలా అన్నాడు. 'కేశవా! పాండవులకు నీవే గతి. కుంతీపుత్రులకు నీవే శరణు. ఈ విషయంలో సంశయం లేదు. సమయం వచ్చినప్పుడు ఇప్పుడు చెప్పిన పని అంతా నీవు చేసి చూపిస్తావు. దానిలో కూడా సందేహం లేదు. చేసిన ప్రతిజ్ఞ ననుసరించి పండ్రెండు సంవత్సరాల కాలం నిర్జనవనాల్లో గడిపి, యథావిధిగా అజ్ఞాత వాసాన్ని కూడా పూర్తిచేసి మేమంతా నీ అధీనంలో నిలుస్తాం.

కేశవా! పాండవులు సత్యవంతులన్న నీ అభిప్రాయాన్ని స్థిరంగా నిలవనీ! దానధర్మాలతో, పరిజనులతో, పత్నులతో, బాంధవులతో కలిసి కౌంతేయులు ఎప్పుడూ నీ అధీనంలోని వారే.'

శ్రీకృష్ణధర్మజులు ఈరీతిగా మాటాడుకొంటున్న సమయంలోనే మహాతపస్వి, తపోవృద్ధుడైన మార్కండేయమహర్షి అక్కడకు వచ్చారు. ఆయన చిరంజీవి. ధర్మస్వరూపుడు అజరుడు, అమరుడు. రూపౌదార్యసంపన్నుడు. వృద్ధుడైనా కూడా ఇరువది అయిదు సంవత్సరాల యువకుడుగా కనిపిస్తున్నవాడు. వేలసంవత్సరాల వయస్సు గల ఆ మార్కండేయుడు రాగా పాండవులు, శ్రీకృష్ణుడు, బ్రాహ్మణు లందరూ ఆయనను అర్చించారు. పూజలందుకొని విశ్వసనీయుడైన ఆ మహర్షి ఆసీనుడ అయ్యాడు. అపుడు పాండవుల, బ్రాహ్మణుల అనుమతితో శ్రీకృష్ణుడు ఆయనతో ఇలా అన్నాడు. 'మార్కండేయా! ఇక్కడ చేరిన బ్రాహ్మణులు, పాండవులు, ద్రౌపది, సత్యభామ, నేను తమ మాటలు వినాలనుకొంటున్నాము. ప్రాచీనరాజులకు, స్త్రీలకు, మునులకు సంబంధించిన చరిత్రను, కథలను, సనాతన సదాచారాలను మాకు చెప్పండి.' వారు అక్కడ కూర్చొని ఉండగానే దేవర్షి, పరిశుద్ధ మనస్కుడైన నారదుడు కూడా పాండవులను చూడాలని అక్కడకు వచ్చాడు. పాండవాదులంతా ఆ మహాత్ముని(నారదుని) కూడా శాస్త్రోక్తరీతిలో అర్ఘ్యపాద్యాలతో సత్కరించారు. అప్పుడు నారదమహర్షి వారంతా కథాశ్రవణ కుతూహలంతో ఉన్నారని తెలిసి మార్కండేయముని కథాకథనాన్ని ఆమోదించాడు. సనాతనుడు, కాలజ్ఞుడు అయిన శ్రీకృష్ణుడు నవ్వుతూ "బ్రహ్మర్షీ! పాండవులకు మీరు చెప్పదలచినది చెప్పండి" అని మార్కండేయునితో అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విని మహాతపస్వి అయిన మార్కండేయుడు "ఏకాగ్రచిత్తులు కండి. చెప్పవలసింది చాలా ఉంది" అని పలికాడు. ఆ మాట విని, పాండవులు ఆ బ్రాహ్మణులతో సహా మధ్యందిన మార్తాండుని చూస్తున్నట్లు ఆ మార్కండేయమహర్షిని చూస్తూ మిన్నకున్నారు.

మార్కండేయుడు చెప్పబోవటాన్ని గమనించి యుధిష్ఠిరుడు ఆ మునిని కథాప్రారంభానికి ప్రోత్సహిస్తూ ఇలా అన్నాడు. 'తమరు దేవతలు, దైత్యులు, మహర్షులు, రాజర్షులు... ఈ అందరి చరిత్రలు తెలిసిన పురాతనులు. ఎప్పటినుండో మిమ్ము చూడాలనీ, సేవించాలనీ కోరుకొంటున్నాం. ఈ శ్రీకృష్ణుడు కూడా మమ్ము చూడాలని వచ్చాడు. సుఖాలకు దూరమైన నన్ను, దుర్మార్గులై కూడా సమృద్ధిని పొందుతున్న ధార్తరాష్ట్రులను చూచి నేను ఆలోచిస్తుంటాను. మంచిపనికైనా చెడ్డపనికైనా కర్త పురుషుడే. దాని ఫలాన్ని తాను అనుభవిస్తాడే కాని పరమాత్మ కర్త కాడు. బ్రహ్మజ్ఞానీ! సుఖదుఃఖకారణా లయిన

కర్మలపై మనుషుల బుద్ధి ఎందుకు చిక్కుకొంటోంది? ఫలితం ఈ లోకంలోనే కలుగుతుందా? పరలోకంలోనా? ద్విజోత్తమా! ప్రాణి దేహాన్ని విడిచిన తరువాత శుభాశుభకర్మలు ప్రాణిని ఎలా చేరుతాయి? ఇహపర లోకాలలో కర్మఫలాలతో జీవునకు సంయోగ మెలా జరుగుతుంది? కర్మఫలాలు ఈ లోకంలోనే సమకూరుతాయా? లేదా పరలోకంలోనా? ప్రాణి మరణించిన తరువాత ఆ ప్రాణికర్మలు ఎక్కడుంటాయి.'

మార్కండేయుడిలా అన్నాడు. 'వాగ్మీ! ఈ నీ ప్రశ్నలు అన్నీ యుక్తియుక్తాలే. తెలియవలసినదంతా తెలిసినవాడవు నీవు. కేవలం లోకమర్యాద కోసం నన్ను అడుగుతున్నావు.ఈ లోకంలో కానీ, పరలోకంలో కాని ప్రాణి సుఖదుఃఖాలను అనుభవించే విషయాన్ని నీకు చెపుతాను. సావధానుడవై విను. తొలుత ప్రజాపతి బ్రహ్మ జన్మించాడు. ప్రాణులకోసం నిర్మలపవిత్ర శరీరాలను సృష్టించాడు. వాటితోపాటు ధర్మతంత్రాలను ప్రకటించాడు. కురుశ్రేష్ఠా! ప్రాచీన మానవులు మంచివ్రతాలు చేసేవారు. సత్యవాదులు. వారి సంకల్పాలు వ్యర్థమయ్యేవి కావు. వారంతా పుణ్యాత్ములు, బ్రహ్మస్వరూపులూనూ. నాటివారందరూ స్వచ్ఛందంగా ప్రయాణించగలవారు. స్వచ్ఛందమరణం గలవారు. బాధలూ, భయాలూ, ఉపద్రవాలూ లేనివారు. సిద్ధసంకల్పులు. మహనీయులయిన మునులను దేవతలను వారు చూడగలిగేవారు. సర్వధర్మాలు వారికి తెలిసినవే. వారు నిగ్రహం కలవారూ, మాత్సర్యం లేనివారూను. వేయిసంవత్సరాలు జీవించేవారు. వేలకొద్ది పుత్రులను పొందేవారు. కొంతకాలం తర్వాత భూలోక వాసులంతా కామక్రోధాలకు లొంగి, లోభమోహవశులై మాయలతోనూ, సాకులతోనూ జీవిస్తూ శరీరాన్ని విడిచేవారు. అశుభకర్మల నాచరిస్తూ పాపాత్ములై సంసారజీవితంలో మరలమరల పరితపిస్తూ జీవించేవారు. వారి యాగాలు, వారి సంకల్పాలు, వారి జ్ఞానం అంతా వ్యర్థమయ్యాయి. బుద్ధిహీనులై అన్నింటిని సంశయిస్తూ కష్టపెట్టేవా రయ్యారు. సాధారణంగా అశుభకర్మలచేతనే గుర్తింపబడుతూ వంశభ్రష్టులు, వ్యాధిపీడితులు, దుర్మార్గులు, ప్రతాపహీనులు అయ్యారు. పాపులై, దారుణమైన పనులు చేసినందువల్ల ఆల్పాయుష్కులవుతారు. అన్నికోరికలపై పెత్తనం చేస్తూ నాస్తికులుగానూ, మనోభేదం కలవారుగానూ తయారవుతారు. కుంతీనందనా! మరణానంతరం జీవునిగతి తానుచేసిన కర్మల ననుసరించి ఉంటుంది. అయితే జ్ఞానికయినా అజ్ఞానికయినా తాను చేసిన కర్మలు ఎక్కడ నిలిచి ఉంటాయి? జీవుడు ఎక్కడ నిలిచి పాపపుణ్యాల ఫలితాలను అనుభవిస్తాడు? ఇది నీ ప్రశ్న. దానికి సమాధానమిస్తాను. విను.

మానవుడు శుభాశుభ కర్మలను దైవనిర్మితమయిన అంతఃకరణంలో ప్రోగుచేసి నిలుపుకొంటాడు. ఆయువు తీరినంతనే నశ్వర మయిన ఈ శరీరాన్ని వీడి, వెంటనే

మరొక శరీరంలో ప్రవేశిస్తాడు. ఈమధ్యలో క్షణకాలం కూడా వ్యవధి ఉండదు. ఆ నూతనశరీరంలో తాను ముందు చేసిన కర్మ నీడలా వెంటాడుతూ తగిన సమయంలో ఫలిస్తుంది. ఈ విధంగా జీవుడు సుఖదుఃఖాలను అనుభవించవలసి వస్తుంది. యమునికి లోబడిన ఈ జీవుడు శుభాశుభకర్మల వలన కలిగిన సుఖ దుఃఖాలను నివారింపజాలడు. ఇది జ్ఞానులదర్శనం. యుధిష్ఠిరా! ఈ స్వర్గనరకాత్మకమైన గతి తత్త్వజ్ఞాన శూన్యులకు సంబంధించినది. జ్ఞానులు పొందే ఉత్తమగతులను కూడా చెపుతాను. జ్ఞానులు తపస్సులు, సర్వశాస్త్రాధ్యయన తత్పరులు, స్థిరవ్రతులు, సత్యపరాయణులు, గురుసేవయందు ఆసక్తి గలవారు, సుశీలురు, సత్త్వసంపన్నులు, సహనశీలురు, జితేంద్రియులు, తేజోమయులై ఉంటారు. వారు పరిశుద్ధజన్మను పొంది శుభలక్షణాలతో శోభిల్లుతారు. వారు జితేంద్రియులు కాబట్టి తమను తాము అదుపుచేసికొనగలరు. సాత్వికులు కాబట్టి రోగపీడ కలుగదు. దుఃఖాన్నీ, భయాన్నీ వీడినవారు. ఉపద్రవాలు ఉండవు. వారు గర్భస్థులయినా, గర్భం నుండి జారుతున్నా, జన్మించినా జ్ఞానదృష్టితో ఆత్మానుభవాన్నీ, పరమాత్మానుభవాన్నీ పొందగలరు. లౌకిక శాస్త్రజ్ఞానద్రష్టలు, మహాత్ములు అయిన మహర్షులు ఈ కర్మభూమికి వచ్చి మరల దేవలోకానికి వెళ్తుంటారు. రాజా! **మనుజుల కర్మఫలంలో కొంత ప్రారబ్ధం వలన, కొంత అప్రయత్నంగా, మరికొంత తమ కర్మల వలన లభిస్తుంది.** నీవు మరొకరీతిగా ఆలోచించవలదు. యుధిష్ఠిరా! ఈ లోకంలో నేను పరమశ్రేయస్సుగా భావించే విషయంలో ఒక ఉదాహరణ చెపుతాను విను.

కొందరు ఇహలోకంలో సుఖపడతారు, పరలోకంలో సుఖముండదు. కొందరు ఇహలోకంలో దుఃఖించినా పరలోకాన సుఖపడతారు. కొందరు ఇహపరలోకాలలో సుఖిస్తారు. కొందరు ఇహపరాలలో కూడా సుఖాలను పొందలేరు. శత్రుసూదనా! ధనవంతులై శరీరమంతా అలంకరించుకొని ఇహలోకంలో శారీరక సుఖాసక్తులై భోగాల ననుభవించినవారికి పరలోకంలో సుఖ ముండదు. యోగులై, తపోదీక్షితులై, స్వాధ్యాయతత్పరులై, అహింసావాదులై, జితేంద్రియులయిన వారికి ఇహలోకంలో సుఖముండదు కాని వారు పరలోకంలో సుఖిస్తారు. ధర్మాన్ని పాటిస్తూ, ధర్మమార్గంలో ధనాన్ని సంపాదించి, తగిన సమయంలో పెండ్లాడి, యాగాదుల ననుష్ఠించినవారు ఇహపరాలలో సుఖిస్తారు. విద్యకై కానీ, తపస్సుకై కానీ, దాతృత్వానికై కానీ, ధర్మబద్ధసంతానానికై కానీ ప్రయత్నించని వారు సుఖాలను కానీ భోగాలను కానీ అనుభవించరు. వారికి ఇహపరాలు రెండూ దక్కవు. మీరంతా ధీరులూ, శూరులు. దివ్యతేజస్సు గలవారు. దృఢశరీరులు. దేవతాకార్యసిద్ధికై దివ్యలోకాలనుండి భూమి కవతరించినవారు. చక్కగా అధ్యయనం చేసినవారు. శూరులు, తపస్సులు, జితేంద్రియులు,

సదాచారవ్యవహారాలు కల మీరు ఉత్తమకర్మలతో దేవతలను, ఋషులను, పితరులను అందరినీ తృప్తిపరచి, మీకర్మల ఫలితంగా పుణ్యాత్ముల నివాసస్థాన మయిన స్వర్గానికి చేరతారు. కౌరవనాథా! సంశయించవద్దు. ఇప్పటి నీ దుఃఖం భవిష్యత్సుఖ కారణమే.

184. మార్కండేయుడు విప్రమాహాత్మ్యమును చెప్పుట.

పాండుకుమారులు మహనీయుడైన మార్కండేయునితో "బ్రాహ్మణోత్తముల మాహాత్మ్యాన్ని వినగోరుతున్నాం. చెప్పండి" అని పలికారు. వారు అలా అడగగానే మార్కండేయుడు ఇలా అన్నాడు. హైహయవంశకరుడు, శత్రుసంహారకుడు, యువకుడు, అందగాడు అయిన బలి వేటకు వెళ్ళాడు. గడ్డి, లతలు దట్టంగా ఉన్న అరణ్యంలో సంచరిస్తూ బలి ఆ సమీపంలో ఒక మునిని చూచాడు. ఆయన మృగచర్మాన్ని కప్పుకొని ఉన్నాడు. ఆ మునిని మృగంగా భావించి బలి ఆయనను సంహరించాడు. తెలియక తాను చేసిన తప్పును గ్రహించి దుఃఖంతో మూర్ఛిల్లాడు. బలి తెప్పరిల్లుకొని ప్రసిద్ధనరపాలు రయిన హైహయుల దగ్గరకు వెళ్ళి, జరిగిన దానిని యథాతథంగా వారికి చెప్పాడు. నాయనా! కందమూలాలు తినే ఆ ముని మరణాన్ని విని, చూచి ఆ హైహయులు దీనమనస్కు లయ్యారు. వారంతా చనిపోయిన ఆ ముని ఎవరికుమారుడో తెలిసికోవాలని విచారిస్తూ వెంటనే కశ్యపసుతుడైన అరిష్టనేమి ఆశ్రమానికి వెళ్ళారు.

నియతవ్రతుడు, మహాత్ముడూ అయిన ఆ మునికి నమస్కరించి వారంతా నిలిచారు. ఆ ముని వారికి ఆతిథ్యాన్ని అందించాడు. "మునీ! మేము నీ సత్కారానికి తగిన వారం కాము. మేము ఒకచెడ్డ పని చేశాం. ఒక బ్రాహ్మణుని హత్య చేశాం" అని వారు ఆ మునితో పలికారు. అది విని ఆమహర్షి "మీరు బ్రాహ్మణుని ఎలా చంపారు? ఆయనెక్కడ? చెప్పండి. అందరూ కలిసి నా తపోబలాన్ని చూడగలరు" అని వారితో అన్నాడు. వారు జరిగినదంతా యథాతథంగా ఆ మునికి చెప్పి ఆయనను హత్యాస్థలానికి తీసికొని పోయారు. అయితే అక్కడ ఆ బ్రాహ్మణుని శవం కనిపించలేదు. వారు సిగ్గుపడి ఆ శవానికై వెదుకసాగారు. వారికది కలలా ఉంది. వారు చైతన్యాన్ని కోల్పోయారు. అప్పుడు అరిష్టనేమి "మీరు చెప్పిన బ్రాహ్మణుడు నాకొడుకే అయి ఉండవచ్చు. రాజులారా! అతడు గొప్ప తపోబలం గలవాడు" అని వారితో అన్నాడు. రాజా! మరల బ్రతికిన ఆ మునిని చూచి వారు పరమాశ్చర్యానికి లోనయ్యారు. 'ఇది చాలా ఆశ్చర్యకర'మని అరిష్టనేమితో అన్నారు. "మరణించిన ఇతనిని ఎలా కొనిరాగలిగారు? తిరిగి ఎలా బ్రతికాడు? ఇదంతా తపోబలమేనా? ఇదంతా వినాలనుకొంటున్నాము. వినదగినదయితే చెప్పండి" అని వారు

ఆడిగారు. అరిష్టనేమి వారితో ఇలా అన్నాడు. 'రాజులారా! మాకు మరణం లేదు. మాకు మరణమెందుకు లేదో చెప్తాను. వినండి. మేము పవిత్రమైన ఆచారం కలవారం. మాకు అశ్రద్ధ లేదు. సంధ్యోపాసన తత్పరులం. పవిత్రమైన అన్నమే తింటాం. పవిత్రమార్గంలోనే ధనాన్ని సంపాదిస్తాం. బ్రహ్మచర్యాన్ని స్వీకరించి పాటిస్తాం. మాకు సత్యమే తెలుసు. అసత్యంవైపు మనసు కూడా పోదు. స్వధర్మాన్ని ఆచరిస్తాం. అందుకే మాకు మృత్యుభయం లేదు. బ్రాహ్మణుల మంచితనాన్ని గురించే మాటాడుతాం. వారి చెడును ప్రస్తావించం. అందుకే మాకు మృత్యుభయంలేదు. అతిథులను అన్నపానాలతో ఆదరిస్తాం. సేవకులకు కడుపునిండా అన్నం పెడతాం. మిగిలిన దానినే మేము తింటాం. కాబట్టి మాకు మృత్యుభయం లేదు. మేము శాంతులం. జితేంద్రియులం. సహనశీలులం. తీర్థదానాలు చేసేవారం. పుణ్యదేశాలలో నివసిస్తాం. కాబట్టి మాకు మృత్యుభయం లేదు. మేము తేజోమూర్తులు నివసించే చోట నివసిస్తాం. అందువలన మాకు మృత్యుభయం లేదు. మీకు లేశమాత్రంగా ఇదంతా చెప్పాను. మీరంతా కలిసి వెళ్ళండి. హత్యాపాపాన్ని గురించి భయపడవద్దు.' అలాగే అని చెప్పి వారంతా ఆ మహామునిని పూజించి ఆనందంగా స్వదేశానికి వెళ్ళిపోయారు.

185. అత్రిముని, పృథుమహారాజుల ప్రశంస.

మార్కండేయుడిలా అన్నాడు. 'బ్రాహ్మణుల మాహాత్మ్యాన్ని ఇంకా చెపుతాను. విను. వైన్యుడనే రాజర్షి అశ్వమేధయాగానికి దీక్షపూనాడు. అత్రిమహర్షి ధనంకోసం వైన్యునిదగ్గరకు వెళ్ళా లనుకొన్నాడని విన్నాను. కానీ అత్రి తన ధర్మవ్యక్తిత్వాన్ని బయలుపరచుకొనవలసి వస్తుందన్న భావంతో డబ్బుకోసం వెళ్ళలేదు. ఆయన బాగా ఆలోచించి, అరణ్యాలలోనికి వెళ్ళాలనే నిశ్చయించుకొని భార్యాపుత్రులను పిలిచి, వారితో ఇలా అన్నాడు. 'అరణ్యాలలో నివసిస్తూ నిరుపద్రవమైన ధర్మఫలాన్ని ఎంతో పొందవచ్చు. కాబట్టి గ్రామజీవనం కన్న ఎన్నోరెట్లు గొప్పదైన అరణ్యజీవనం మీదికి వెంటనే మీరు మనస్సును మళ్ళించాలి.' అత్రిభార్య యజ్ఞయాగాది ధర్మం మీదనే దృష్టి గలదై భర్తతో ఇలా అన్నది – 'మహానుభావుడైన వైన్యుని దగ్గరకు పోయి ఎక్కువధనాన్ని అడగండి. విప్రర్షీ! యాగం చేస్తున్న వైన్యుడు మీరు అడగగానే ధనాన్ని ఇస్తాడు. ఆ ధనరాశిని తీసికొనివచ్చి మీరు పోషించవలసిన ఈ కుమారులకు పంచి ఇచ్చి, ఆ తర్వాత స్వేచ్ఛగా అరణ్యాలకు వెళ్ళండి. ధర్మవేత్తలయిన మహాత్ములు దీనినే పరమధర్మమంటారు.' అత్రి ఇలా అన్నాడు. 'కళ్యాణీ! వైన్యుడు ధర్మార్థాలపై ఆసక్తిగలవాడనీ, సత్యవ్రతనిష్ఠుడనీ మహాత్ముడైన గౌతముడు చెప్పగా విన్నాను. అయితే అక్కడున్న విప్రులంతా నన్ను

ద్వేషించేవారు. ఇది కూడా నాకు గౌతముడే చెప్పాడు. అందువల్ల నేను ఆ ప్రయత్నం చేయటం లేదు. నేను అక్కడకు పోయి ధర్మకామార్థాలతో కూడిన మంచి మాటలను చెప్పినా వారు అపార్థాలు కల్పించి నా మాట నిరర్థకమనే అంటారు. అయిననూ ధీమంతురాలా! నీమాట నాకు నచ్చింది. నేను వెళతాను. వైన్యుడు నాకు గోవులను గొప్పధనరాశులను ఇవ్వగలడు.' ఈ విధంగా చెప్పి మహాతపస్వి అయిన అత్రి వెంటనే వైన్యుని యజ్ఞశాలకు పోయి కళ్యాణమయ వాక్యాలతో ఆయనను స్తుతించి ఆదరపూర్వకంగా ఇలా అన్నాడు.

'రాజా! భూలోకంలో నీవే తొలిరాజువు. నీవు ధన్యుడవు. ఐశ్వర్య సంపన్నుడవు. మునులంతా నిన్నే స్తుతిస్తున్నారు. నిన్ను మించిన ధర్మవేత్తలేడు.' మహాతపస్వి అయిన గౌతముడు కోపంతో ఇలా అన్నాడు. అత్రీ! మరొకసారి ఇలా అనవద్దు. నీ బుద్ధి సావధానంగా లేదు. ఇక్కడ మా ప్రథమ ప్రజాపతిగా ఇంద్రుడే ఉన్నాడు.' రాజేంద్రా! అప్పుడు అత్రికూడా గౌతమునితో ఇలా అన్నాడు. 'ఈ పృథువే ప్రజాపతి. ఈ ప్రజాపతియే ఇంద్రసమానుడు. నీవే వ్యామోహంలో పడి ఉన్నావు. నీ బుద్ధియే సరిగా లేదు.' గౌతముడిలా అన్నాడు. 'నాకు మోహం లేదు. ఎరుక కలిగియే ఉన్నాను. నీవే మోహంలో పడ్డావు. రాజదర్శనం కోసం జనులసమక్షంలో రాజును ప్రశంసిస్తున్నావు. నీకు పరమధర్మమూ తెలియదు. ధర్మప్రయోజనమూ తెలియదు. నీవు బాలుడవు, మూఢుడవు కూడా. వయస్సు చేత మాత్రమే వృద్ధుడవు.' మహర్షుల ముందు నిలిచి ఈ విధంగా గొడవపడుతున్న ఆ ఇద్దరినీ చూచి ఆంతకు ముందే యజ్ఞనిర్వహణకై వరింపబడిన ఋత్విక్కులు ఇలా అనసాగారు "వీరిలా గొడవ పడుతున్నారేమిటి? వైన్యుని యజ్ఞశాలలోనికి వీరిరువురిని ఎవరు అనుమతించారు? పెద్దపెద్దగా మాటాడుతూ గొడవపడుతున్న వీరిక్కడెందుకున్నారు?' అపుడు సర్వధర్మవేత్త, పరమధర్మస్వరూపుడూ అయిన కాశ్యపుడు "వీరిరువురు ఏదోవిషయంలో భేదాభిప్రాయాలతో ఉన్నారు. దాని నిర్ణయం కోసమే వచ్చినట్లున్నారు" అన్నాడు. అప్పుడు గౌతముడు సదస్యులైన మునివర్యులతో ఇలా అన్నాడు. 'ద్విజశ్రేష్ఠులారా! మా ప్రశ్నను వినండి. అత్రి పృథువును విధాత అన్నాడు. ఆ విషయంలోనే మాకు సందేహం, వివాదం కూడా.' అది వినగానే మహాత్ములయిన మునులు సంశయనివృత్తికై ధర్మవేత్త అయిన సనత్కుమారుని దగ్గరకు వెళ్ళారు. మహాతపస్వి అయిన సనత్కుమారుడు వారి మాటను యథాతథంగా విని, వారికి ఇలా సమాధానమిచ్చాడు.

'బ్రాహ్మధర్మం క్షాత్రధర్మంతో, క్షాత్రధర్మం బ్రాహ్మధర్మంతో కలిస్తే నిప్పూ గాలీ కలిసి వనాలను దహించినట్లు శత్రువులను దహించగలవు. రాజే ధర్మమని ప్రసిద్ధి. రాజే ప్రజాపతి. ఇంద్రుడు, శుక్రుడు, బ్రహ్మ, బృహస్పతి అందరూ రాజే. రాజే ప్రజాపతి,

విరాట్టు, సమ్రాట్టు, క్షత్రియుడు, భూపతి, నృపుడు - మొదలైన శబ్దాలతో స్తుతింపబడతాడు. ఆయననందరూ పూజిస్తారు. పురాయోని, యుధాజిత్తు, అభియుడు, ముదితుడు, భవుడు, స్వర్ణేత, సహజిత్తు, బభ్రువు - ఇవన్నీ రాజుకు పేర్లే. రాజే సత్యానికి కారణం. రాజే ప్రాచీన చరిత్ర తెలిసినవాడు. రాజే సత్యధర్మప్రవర్తకుడు. మహర్షులు అధర్మంవలన భయపడి బ్రాహ్మబలాన్ని క్షత్రియులలో నిక్షేపించారు. దేవలోకంలోని దేవతలలో సూర్యుడు తన తేజస్సుతో చీకటిని పారద్రోలినట్లు భూలోకంలో రాజు అధర్మాన్ని పారద్రోలుతాడు. కాబట్టి శాస్త్రప్రమాణాల ననుసరించి రాజే ప్రధానుడు. రాజే విధాత అని పలికిన వాని వాదమే శ్రేష్ఠం.'

మార్కండేయుడిలా అన్నాడు - 'ఏదో ఒక పక్షం గెలిచి వివాదం సమసిపోగా ఆనందించిన మహనీయుడు, పృథువు అంతకుముందు తనను స్తుతించిన అత్రితో ఇలా అన్నాడు. 'బ్రహ్మర్షీ! ఇంతకుముందు నన్ను(రాజును) జ్యేష్ఠునిగా, శ్రేష్ఠునిగా సర్వదేవసమానునిగా ప్రకటించావు. కాబట్టి నీకు వివిధధనాలను మిక్కిలిగా ఇస్తాను. సుందరవస్త్రాభరణాలు ధరించిన యువతులను వేలకొలదిగ నీకు దాసులుగా ఇస్తాను. బ్రహ్మర్షీ! పదికోట్ల బంగారు నాణాలు, పదిబారువుల బంగారం నీకిస్తాను. నీవు సర్వజ్ఞుడ వని నేను భావిస్తున్నాను.' తేజస్వి, మహాతపస్వి అయిన అత్రిమహర్షి ఆ రాజసత్కారాన్ని పొంది, న్యాయబద్ధంగా లభించిన ఆ ధనాన్నంతా తీసికొని ఇంటికి వెళ్ళిపోయాడు. అత్రి ఆనందంతో తన కుమారులకు ధనాన్ని ఇచ్చి నియతాత్ముడై తపస్సుపై మనస్సు నుంచి అరణ్యాలకు వెళ్ళిపోయాడు.

186. తార్క్ష్య సరస్వతీ సంవాదము.

మార్కండేయుడిలా అన్నాడు. 'శత్రుపురంజయా! వీరా! ఈ విషయాన్ని గురించియే ధీమంతుడైన తార్క్ష్యుడు అడుగగా సరస్వతి చెప్పిన సమాధానాన్ని విను.' తార్క్ష్యుడిలా అడిగాడు. 'కళ్యాణీ! ఇహలోకంలో పురుషునకేది శ్రేయస్సు? స్వధర్మభ్రష్టత లేకుండా ఎలా ప్రవర్తించాలి? సుందరీ! నాకు చెప్పు. పాటిస్తాను. స్వధర్మం నుండి జారకుండా నిలుస్తాను. సుభగా! ఎప్పుడు ఏ విధంగా అగ్నిహవనం చేయాలి? ఎలా పూజించాలి? ఏ పనిచేస్తే ధర్మం నశించకుండా ఉంటుంది? ఇదంతా నాకు చెప్పు. దానితో నేను రజోగుణహీనుడనై లోకాల్లో సంచరిస్తాను.' మార్కండేయుడిలా అన్నాడు. 'ప్రేమపూర్వకంగా అలా అడుగగా సరస్వతి ఉత్తమబుద్ధి గల ఆ విప్రుని శుశ్రూషను గుర్తించి ధర్మబద్ధమూ, హితకరమూ అయిన వాక్యాన్ని తార్క్ష్యునకు ఇలా చెప్పింది.

'అప్రమత్తుడై, పవిత్రుడై, నిత్యాధ్యయనశీలుడై అర్చిరాదిమార్గాల ద్వారా చేరదగిన పరబ్రహ్మను తెలిసికొన్నవాడు దేవలోకం నుండి బ్రహ్మలోకాన్ని పొంది దేవతలతో ప్రేమబంధాన్ని ఏర్పరచుకొంటాడు. అక్కడ చిన్న చిన్న సరోవరా లుంటాయి. అవి అందమైనవి, విశాలమైనవి, శోకంలేనివి, చక్కగా పుష్పించినవి, పవిత్రమైనవి. వాటిలో బురద ఉండదు. చేపలకు అవి వాసయోగ్యాలు. బంగారుతామరలతో నిండినవి. అక్కడక్కడ చక్కని స్నానఘట్టా లుంటాయి. ఆ సరస్సుల తీరాలలో విడివిడిగా అప్సరసలతో కూడి ఆనందిస్తున్న పుణ్యాత్ము లుంటారు. ఆ అప్సరసలు పవిత్రచందనాలతో, ఆభరణాలతో అలంకరింపబడి బంగారువన్నెతో ప్రకాశిస్తూంటారు. గోదానం చేసినవారు ఉత్తమలోకాలను పొందుతారు. ఎద్దులను దానం చేసినవారు సూర్యలోకాన్ని పొందుతారు. వస్త్రదానం చేసినవాడు చంద్రలోకాన్ని చేరుతాడు. సువర్ణదానం చేసినవాడు అమరుడు కాగలడు. మంచివన్నె కలిగి, తేలికగా పాలిచ్చే స్వభావం గలిగి, మంచి దూడలను ఇస్తూ పారిపోకుండా నిలిచే స్వభావం గల ఆవులను దానం చేసినవాడు ఆ ఆవుల శరీరంపై గల రోమాలసంఖ్యతో సమానమైన సంవత్సరాలు దేవలోకంలో ఉంటాడు. సత్త్వభావం గలిగి, పాలం దున్నగలిగి, అనంతశక్తి గలిగి, బండి లాగగలిగిన బలిష్ఠమైన కోడెదూడను దానం చేసినవాడు ఆవుదానం చేసిన వానికన్న పదిరెట్లు పుణ్యలోకాలను పొందుతాడు. పాలు పితకడానికి కంచుగిన్నెను, వస్త్రాలను, తరువాత అయ్యే మేత ఖర్చును కలిపి కపిలగోవును దానం చేస్తే ఆ ఆవు ఆ గుణాలతో కామధేనువుగా మారి పరలోకంలో దాతను చేరుతుంది. ఆవుకు ఎన్ని వెంట్రుకలుంటాయో అన్ని సంవత్సరాలు గోదానం చేసినవాడు దాని ఫలాన్ని అనుభవిస్తాడు. అంతేకాక పరలోకంలో గోదాత కొడుకులను, మనుమలను, వంశాన్ని ఏడుతరాల వరకు తరింపజేస్తుంది. అందమైన బంగారు కొమ్ములు, పాలు పితకటానికి కంచుపాత్ర, ధనం, వస్త్రాలు, దక్షిణలతో పాటు మచ్చల ఆవును బ్రాహ్మణునకు దానమిచ్చినవాడు తేలికగా వసులోకాలను చేరగలుగుతాడు. తన కర్మల వలన అంతశ్శత్రువులచే నిరోధింపబడి గాఢాంధకారం గల నరకంలో పడబోయే వానిని కూడా, మహాసముద్రంలో అనుకూల వాయువుగల నౌకలాగా గోదానం పరలోకంలో తరింపజేస్తుంది. బ్రాహ్మవివాహ విధితో దానయోగ్య అయిన కన్యను దానం చేసినవాడు, బ్రాహ్మణునకు భూదానం చేసినవాడు, శాస్త్రోక్తంగా వివిధదానాలు చేసినవాడు ఇంద్రలోకాన్ని పొందుతాడు. తార్క్ష్య! సత్ప్రవర్తన గలవాడై, నియమపూర్వకంగా ఏడుసంవత్సరాలు అగ్నిలో హవ్యాన్ని ఆహుతి చేసినవాడు తన సత్కర్మల ఫలితంగా తనతో పాటు గతించిన ఏడుతరాల పితరులను, రాబోయే ఏడు తరాలను కూడా పవిత్రం చేస్తాడు.'

తార్క్ష్యుడిలా అన్నాడు. 'దివ్యసుందరీ! అగ్నిహోత్రం యొక్క ప్రాచీన నియమ మేమిటో అడుగుతున్నాను. చెప్పు. నీవు ఉపదేశిస్తే నేను అగ్నిహోత్రవ్రతం యొక్క ప్రాచీననియమాన్ని తెలిసికొంటాను.' సరస్వతి ఇలా అన్నది. 'అపరిశుభ్రుడు, చేతులు శుభ్రం చేసికొననివాడు, వేద జ్ఞానశూన్యుడు, అపండితుడు, అగ్నిలో వ్రేల్చరాదు. దేవతలు ఇతరుల మనస్సులను తెలుసుకొన గోరుతారు. పవిత్రతను కోరేవారు. శ్రద్ధలేనివారి హవిస్సులను గ్రహించరు. వేదవేత్త కాని వానిని హవిర్దానంలో నియంత్రించకూడదు. అటువంటివాని ఆహుతి నిరర్థకం. తార్క్ష్య! అశ్రోత్రియుడు దేవతలకు అపరిచితుని క్రింద లెక్క, కాబట్టి అటువంటివాడు అగ్నిహోత్రానికి అర్హుడు కాడు. తపస్సుతో కృశించి, సత్యవ్రతులై, శ్రద్ధాళువులై, శేషహోమద్రవ్యాన్ని భుజించేవారు పరిమళభరితమైన గోలోకానికి వెళ్ళి అక్కడ సత్యస్వరూపుడైన పరమాత్మను సందర్శిస్తారు.' తార్క్ష్యుడిలా అన్నాడు. 'దివ్యసుందరీ! సౌభాగ్యవతీ! నీవు పరమాత్మస్వరూపవు. పరలోకవిషయంలో, కర్మఫల విషయంలో ప్రసరించే బుద్ధిస్వరూపవు. ప్రజ్ఞాదేవివి. అయినా అడుగుతున్నాను. వాస్తవంగా నీ రూపమేది?' సరస్వతి ఇలా అన్నది. 'బ్రహ్మర్షుల సందేహాలను తీర్చటానికి అగ్నిహోత్రం నుండి వచ్చిన దానను నేను. నీ సంయోగంతో నేను సత్యవచనాలను యథాతథంగా చెప్పగలిగినాను. మనోగతశ్రద్ధయే నా స్వరూపం.' తార్క్ష్యుడిలా అన్నాడు. 'సౌభాగ్యవతీ! నీ వంటి స్త్రీ మరొకతె లేదు. లక్ష్మివలె మిక్కిలి ప్రకాశిస్తున్నావు. అనంతకాంతి కల దివ్యరూపం నీది. దివ్యప్రజ్ఞను కూడా నీవు ధరిస్తున్నావు.' సరస్వతి ఇలా అన్నది. 'నరశ్రేష్ఠా! పండితా! యజ్ఞంలో సంకలనం చేయబడే శ్రేష్ఠమైన ఉపాసనలతో నాకు వృద్ధీ, తృప్తీ కలుగుతాయి. వాటివలననే నాకు ఆకృతి సిద్ధిస్తుంది. పండితా! యాగసమయంలో వినియోగింపబడే వృక్షసంబంధ వస్తువులు, (సమిధలు మొదలగునవి) లోహసంబంధ వస్తువుల చేత (సువర్ణము మొ) పృథివీ సంబంధ వస్తువులు (ధాన్యాదులు) స్వర్గఫలమూ, యాగంలోని ఉపాసన చేత ఆత్మజ్ఞానం కలుగునని గ్రహించుం.

తార్క్ష్యుడిలా అన్నాడు. 'దేనిని పరమకళ్యాణ రూపంగా భావించి మునులు విశ్వాసంతో జితేంద్రియులవుతున్నారో, ధీరులు దేనిలో ప్రవేశించగలుగుతున్నారో ఆ శోకహీనమైన పరమమోక్షాన్ని నాకు తెలుపుము. సాంఖ్యులు యోగులు గ్రహించిన ఆ పురాతన మోక్షస్వరూపం నాకు తెలియదు.' సరస్వతి ఇలా అన్నది. 'స్వాధ్యాయ తత్పరులై, తపోధనులై వ్రతపుణ్యయోగాలతో ప్రసిద్ధమూ, పురాతనమూ అయిన పరాత్పర స్థానాన్ని పొందిన వేదవేత్తలు వీతశోకులై ముక్తులవుతున్నారు. ఆ పరబ్రహ్మలో పుణ్యగంధం గల ఒక వేతసవృక్షం సహస్రశాఖలతో విపులమై ప్రకాశిస్తోంది. దాని మూలం నుండి నదులు

పుడుతున్నాయి. ఆ నదులు పవిత్రమైనవి. వాటి జలం తేనెవలె తీయనిది. కానీ ఆ మహానదులు అరిసెలవలె చిల్లులు కలవి. మాంసంవలె హింసతో కూడినవి. పాయసం వలె బురదగా ఉండేవి. ఇసుక రేణువులవలె దేనికవే ఉంటూ బ్రహ్మాండరూపమైన ఈ వృక్షశాఖలలో ప్రవహిస్తాయి. అగ్ని మొదలుగా గల దేవతలు, దేవేంద్రుడు, మరుత్తులు ఏ స్థానాన్ని పొందాలని శ్రేష్ఠయాగాలను ఆచరిస్తారో అదే నా పరమపదం.'

187. వైవస్వతమనువు చరిత్రము.

ఆ తరువాత యుధిష్ఠిరుడు "వైవస్వతమనువు చరితాన్ని చెప్పండి" అని మార్కండేయుని అడిగాడు. మార్కండేయుడిలా అన్నాడు. 'నరశార్దూలా! రాజా! సూర్యునకు మహాప్రతాపశాలియై, ప్రజాపతితో సమానమైన ఒక కొడుకుండేవాడు. ఆయన మహర్షి. ఆయనే వైవస్వతమనువు. తన ఓజస్సుతో, తేజస్సుతో, కాంతితో, తపస్సుతో తండ్రితాతలను మించిపోయా డాయన. ఆయన విశాల మయిన బదరికాశ్రమంలో చేతులు పైకెత్తి ఒంటికాలిపై నిలిచి పదివేల సంవత్సరాలు తలక్రిందులుగా నిలిచి, కనురెప్పలు వాల్చకుండా దృఢదీక్షతో ఘోరతపస్సు నాచరించాడు. ఒకసారి చీరిణీ నదీతీరంలో తడిసిన బట్టలతో, జటలతో తపస్సు చేస్తున్న ఆయన దగ్గరకు ఒక చేప వచ్చి ఇలా అన్నది. 'స్వామీ! సువ్రతా! నేను చిన్న చేపను. పెద్దచేపలవలన నాకు భయం కలుగుతోంది. నన్ను నీవు కాపాడాలి. పెద్దచేపలు ప్రత్యేకించి చిన్న చేపలను తింటుంటాయి. ఇది మా మత్స్యజాతిలో ఎప్పటినుండియో ఉన్న పద్ధతి. ఆ భయమనే మహాప్రవాహంలో బాగా మునిగిపోతున్న నన్ను నీవు రక్షించాలి. ఈ ఉపకారానికి ప్రత్యుపకారం నేను చేయగలను.' ఆ చేపమాట విని వైవస్వతమనువు దయామయుడై దానిని చేతితో పట్టుకొని నీటినుండి వెలుపలికి తీసి చంద్రకిరణాలవలె కాంతిమంతమైన ఆ చేపను కుండలో ఉంచాడు. వైవస్వతమనువు ఆదరణతో ఆ చేప అక్కడే పెరిగి పెద్దయింది. మనువు దానిని పుత్రునివలె భావించాడు. చాలాకాలానికి ఆ చేప బాగా పెద్దదయింది. కుండలో ఉండలేకపోయింది.

ఆ చేప మనువును చూచి "స్వామీ! ఇంతకన్న మంచి చోటికి నన్ను చేర్చండి" అని మరలా అడిగింది. అప్పుడు పూజ్యుడైన వైవస్వతమనువు దానిని కుండలో నుండి పైకితీసి పెద్ద దిగుడు బావిదగ్గరకు తీసికొనిపోయాడు. మనువు ఆ చేపను ఆ దిగుడుబావిలో ఉంచాడు. అది చాలా సంవత్సరాలు ఆ దిగుడు బావిలో పెరిగింది. ఆ బావి రెండు యోజనాల పొడవు, ఒక యోజనం వెడల్పు గలది. ఆ చేపకు ఆ బావి చాలలేదు. ఆ చేప ఆ దిగుడుబావిలో కదలలేకపోయింది. మనువును చూచి మరలా ఇలా పలికింది.

'స్వామీ! నన్ను సముద్రుని ప్రియభార్య అయిన గంగానదికి తీసికొనిపో. నేనక్కడ నివసిస్తాను. లేకపోతే నీ ఇష్టం వచ్చిన చోటుకు తీసికొనిపో. నేను దోషదృష్టిని వీడి నీ ఆదేశం మేరకే ప్రవర్తించాలి. నీ కారణంగానే నేను బాగా వృద్ధి పొందానుగదా!' జితేంద్రియుడు అయిన మనువు ఆ మాట విని, ఆ చేపను గంగానది దగ్గరకు తీసికొని పోయి, స్వయంగా ఆ నదిలో విడిచాడు. ఆ చేప అక్కడ కొంతకాలం పెరిగింది. తరువాత మరలా మనువును చూచి ఇలా పలికింది. 'ప్రభూ! సూక్ష్మశరీరం పెద్దదైనందువలన గంగలో తిరుగలేకున్నాను. స్వామీ! వెంటనే నన్ను సముద్రానికి తీసికొనిపోయి అనుగ్రహించండి.' వైవస్వతమనువు గంగానదినుండి ఆ చేపను తీసి స్వయంగా సముద్రానికి కొనిపోయి అక్కడ విడిచాడు. ఆ చేప పెద్దదయినా మనువు తీసికొనిపోతున్న సమయంలో తేలికగా కొనిపోగలిగినట్లు అయింది. దాని స్పర్శ, దాని వాసన కూడా సుఖంగానే కనిపించాయి. మనువు దానిని సముద్రంలో విడవగానే అది నవ్వుతూ మనువుతో ఇలా అన్నది.

'స్వామీ! నన్ను ఏలోటు లేకుండా కాపాడావు. ఇప్పుడు నీవు చేయవలసిన పనిని చెపుతాను. విను. స్వామీ! స్థావరజంగమాత్మక మయిన ఈ భూమి అంతా త్వరలోనే నశించబోతోంది. ఈ లోకమంతా ఏకార్ణవ జలంలో లయించే ప్రక్షాళన సమయమాసన్న మైనది. కాబట్టి నిన్ను మేల్కొల్పుతూ నీకు హితకరమయిన మాటను చెప్తున్నాను. స్థావరజంగమాత్మకం - చరాచరాత్మకం - అయిన ఈ సమస్తవిశ్వానికీ పరమభయంకర సమయం ఆసన్న మయినది. నీకోసం ఒకగట్టి నావను తయారుచేయించి దానికొక త్రాడు కట్టి పంపుతాను. మహర్షీ! ప్రాణాలతో సహా నీవు దానినెక్కు. పూర్వం బ్రాహ్మణులు చెప్పిన బీజాలనన్నింటిని విడివిడిగా సమకూర్చుకొని ఆ నావపై ఎక్కించుకో. నావపై నిలిచి నాకోసం ఎదురుచూడు. తాపసా! నేను కొమ్ములు ధరించి నీ దగ్గరకు వస్తాను. వాటితో నన్ను గుర్తించవచ్చు. ఈ పనంతా నీవు చేయాలి. ఇక నేను వెళ్ళటానికి అనుమతించు. నా సహాయం లేకుండా ఆ జలరాశిని అతిక్రమించటం కుదరదు. స్వామీ! నా ఈ మాటను సందేహించవద్దు.' 'అలాగే చేస్తా'నని వైవస్వతమనువు ఆ చేపతో అన్నాడు. వారు పరస్పరం సెలవు తీసికొని ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు. ఆ తరువాత వైవస్వతమనువు చేప చెప్పిన రీతిగా సర్వబీజాలను తీసికొని, అందమైన నావను సమకూర్చుకొని, పెద్దపెద్ద అలలు గల సాగరంలో సంచరించసాగాడు.

మనువు ఆ మత్స్యాన్ని తలచుకొన్నాడు. ఆ చేప మనువు తలచుకొనటాన్ని గ్రహించి కొమ్ములు ధరించి వెంటనే వచ్చింది. తాను ముందు చెప్పినట్లు కొమ్ములు ధరించి వచ్చిన ఆ చేపను సముద్రంలో చూచి, మనువు దాని కొమ్ములకు త్రాడును

తగిలించాడు. ఆ చేప ఉన్నత పర్వతంలా ఉంది. మనువు ఆ చేప కొమ్ములకు త్రాడు బిగించగానే ఆ చేప మహావేగంతో లవణసముద్రంలో నావికులను దాటిస్తూ నావను లాగసాగింది. అప్పుడు ఆ సముద్రం అలలతో నాట్యం చేస్తున్నట్లుంది. నీటివేగంతో గర్జిస్తున్నట్లుంది. పరపురంజయా! ఆ మహాసముద్రంలోని పెనుగాలులవలన ఆ నౌక అటు ఇటు ఊగుతోంది. మత్తెక్కిన ఉన్మాదిని వలె ఘోషపెడుతోంది. నేల, దిక్కులు, మూలలూ ఏవీ తెలియలేదు. ఆకాశం, స్వర్గం మొత్తం జలమయమైంది. లోకమంతా ఆ విధంగా జలమయమైనప్పుడు సప్తర్షులు, మనువు, చేపమాత్రమే మునగలేదు. ఎన్నో సంవత్సరాలవరకు ఆ చేప ఆ నావను ఆ నీటిలో లాగుతూనే ఉంది. ఆ చేప నావను హిమవచ్ఛిఖరం దగ్గరకు లాగుకొని పోయింది. ఆపై చేప మెల్లగా నవ్వుతూ మహర్షులతో "వెంటనే హిమవచ్ఛిఖరానికి ఈ నావను కట్టండి. ఆలస్యం చేయవద్దు" అన్నది. వెంటనే వారు ఆ చేప మాటను విని హిమవచ్ఛిఖరానికి నావను కట్టారు. నాటినుండి ఈ హిమాలయశిఖరం "నౌకాబంధన'మన్న పేరుతో ప్రసిద్ధమైనది. యుధిష్ఠిరా! నేటికీ ఆ శిఖరం ఆ పేరుతో ప్రసిద్ధమై ఉంది. ఆ తరువాత ఆ మత్స్యదేవుడు మహర్షులతో ఇలా అన్నాడు. నేనే ప్రజాపతి అయిన బ్రహ్మను. నేను కానిది ఏదీ లేదు. మత్స్యరూపాన్ని ధరించి మిమ్ములనందరినీ ఈ భీకర పరిణామం .నుండి రక్షించాను. ఈ మనువు దేవాసుర మానుషరూపధారు లయిన సర్వప్రజలనూ, సర్వలోకాలనూ,చరాచరాత్మకమయిన సమస్తాన్నీ సృష్టించాలి. తీవ్రమయిన తపస్సుతో సృష్టికవసరమయిన' ప్రతిభ మనువుకు కలుగుతుంది. నా అనుగ్రహం కారణంగా ప్రజాసృష్టిలో మోహమేర్పడదు. ఆ విధంగా పలికి వెంటనే మత్స్యం అదృశ్యమయింది. వైవస్వతమనువు తానే ప్రజలను సృష్టించగోరాడు. కానీ కుదరలేదు. దానితో సృష్టి కార్యంకొరకు తీవ్రంగా తపస్సు చేశాడు. ఆ తపోబలంతో సృష్టికుపక్రమించాడు. వైవస్వతమనువు సమస్తప్రజలనూ యధాపూర్వంగా సృష్టించసాగాడు. ఇది మత్స్యపురాణం. మీకు వినిపించాను. సర్వపాపహర మయిన ఈ ఉపాఖ్యానాన్ని మీకు చెప్పాను. ఈ మనువృత్తాంతాన్ని పూర్తిగా నిత్యమూ విన్నవాడు సర్వార్థసిద్ధిని పొంది, సుఖించి, సర్వలోకాలకూ వెళ్ళగలుగుతాడు.

188. కలి ప్రభావము - మార్కండేయుడు వటపత్రశాయిని దర్శించుట.

ధర్మరాజు వినయంతో యశస్వి అయిన మార్కండేయుని మరలా ప్రశ్నించాడు. 'మహర్షీ! నీవు వేల వేలయుగాల లయాలను చూచావు. ఈలోకంలో నీవంటి ఆయుష్మంతుడు మరొకడు కనిపించడు. మహాత్ముడూ పరమేష్ఠి అయిన బ్రహ్మ తప్ప మరెవ్వడూ ఆయుస్సులో

నీకు సమానమైనవాడు లేడు. ఈవిశ్వంలో దేవతలూ, దానవులూ, అంతరిక్షం కూడా లేని ప్రలయవేళలో నీవు మాత్రమే బ్రహ్మసన్నిధిలో ఆయన నుపాసించగలవు. బ్రహ్మర్షీ! ప్రళయం ముగిసిన తర్వాత బ్రహ్మదేవుడు మేల్కొని, దిక్కుల నన్నింటిని మాత్రమే గాలి కలవానినిగా చేసి, నీటిని అటు ఇటూ చిమ్మి, చతుర్విధప్రాణులను యథాపూర్వకంగా మరల సృష్టించటాన్ని నీవు మాత్రమే చూడగలవు. నీవు సమస్తలోకాలకూ పితామహుడైన సాక్షాత్తు బ్రహ్మను తత్పరతతో ఏకాగ్రతతో ఆరాధించగలిగావు. నీవు ఎన్నోమార్లు సృష్టిప్రారంభాన్ని సందర్శించగలిగావు. ఘోరతపస్సుతో ప్రజాపతులను కూడా నీవు వశపరచుకొన్నావు. విశ్వస్రష్టలు, భవగత్స్వరూపులు అయిన మీరు పరబ్రహ్మ యొక్క నివాసస్థానమైన హృదయపద్మం తెరచి ఆంతరదృష్టితో ఎన్నో మారులు ఆ పరబ్రహ్మను చూశారు. అలాగే కామరూపుడైన చతుర్ముఖబ్రహ్మకు కారణమైన విష్ణు నాభి కమలాన్ని బహిర్దృష్టితో చూసిన మహాత్ములు మీరు. (వైరాగ్య యోగాలను రెండు దృష్టులతో వేరు వేరుగా ఇద్దరిని చూసినారని భావం) అందువలననే బ్రహ్మర్షీ! ఆ పరమేష్ఠి అనుగ్రహం వలన ప్రాణాంతకమయిన మృత్యువు కానీ, దేహాన్ని శిథిలం చేసే వార్ధక్యం కానీ నిన్ను తాకలేవు. మహాప్రలయకాలంలో సూర్యుడు, అగ్ని, వాయువు, చంద్రుడు, అంతరిక్షం, భూమీ ఏమీ మిగలని వేళలో లోకమంతా ఏకార్ణవమై స్థావరజంగమప్రాణులు, దేవాసురగణాలూ, మహానాగాలూ అన్నీ నశించిన వేళలో కమలంపై, కలువపై శయనించిన మహాత్ముడు, సర్వభూతేశుడు అయిన బ్రహ్మను నీవు ఒక్కడవే ఉపాసింపగలవు. ద్విజోత్తమా! గతంలో జరిగిన ఈ వృత్తాంతమంతా నీకు ప్రత్యక్షమే. కాబట్టి అన్నింటికి కారణమైన కాలాన్ని నిరూపించే ఆ కథను నీనుండి వినగోరుతున్నాను. ద్విజశ్రేష్ఠా! నీవు మాత్రమే అనేకపర్యాయాలు దానిని అనుభవించినవాడవు. సర్వలోకాలలో, సర్వకాలాలలో నీవెరుగనిది ఏదీ లేదు.'

మార్కండేయుడిలా అన్నాడు. 'స్వయంభువు, సనాతనుడు, శాశ్వతుడు, అవ్యయుడు, అవ్యక్తుడు, పరమసూక్ష్ముడు, నిర్గుణుడు, గుణ స్వరూపుడు అయిన పురాణపురుషునకు నమస్కరించి నీకు అంతా చెపుతాను. మన సన్నిధిలో పీతాంబరుడై ఉన్న పురుషోత్తముడు ఈ జనార్దనుడే సృష్టికి కారణం. ఈ ప్రభువే ప్రాణుల అంతర్యామి, ప్రాణిసృష్టికర్త, పవిత్రమూ, అచింత్యమూ, మహాశ్చర్యకరమూ అయిన తత్త్వం ఈయనయే. ఈయనకు మొదలు, తుది లేవు. భూతస్వరూపుడూ, విశ్వరూపుడూ, అవ్యయుడూ, అక్షయుడూ ఇతడే. అన్నింటికీ ఈయనయే కర్త కానీ తనకు ఎవరూ కర్తకాదు. పురుషార్థప్రాప్తిలో కూడా కారణ మీయనయే. ఈయన పరమపురుషుడు. వీనిని తెలుసుకొనిన వానిని వేదములు కూడా తెలుసుకొనలేవు. నరోత్తమా! ప్రళయకాలంలో సమస్తవిశ్వమూ నశించిన

తరువాత ఈయన ద్వారానే ఆశ్చర్యకరమైన జగమంతా మరల జనిస్తుంది. నాలుగువేల సంవత్సరాలు కృతయుగ మవుతుంది. అలాగే నాలుగువందల సంవత్సరాలు ఆయుగసంధి, మరోనాలుగు వందల సంవత్సరాలు దాని సంధ్యాంశం.(మొత్తం కృతయుగం 4800 సంవత్సరాలు) మూడువేల సంవత్సరాలు త్రేతాయుగం. త్రేతాయుగ సంధ్య మూడువందల సంవత్సరాలు. సంధ్యాంశం మూడువందల సంవత్సరాలు. (మొత్తం 3600 సంవత్సరాలు త్రేతాయుగం) అదేరీతిగా రెండువేలసంవత్సరాలు ద్వాపరయుగ పరిమాణం. దాని సంధ్య రెండువందల సంవత్సరాలు. సంధ్యాంశం రెండు వందల సంవత్సరాలు (మొత్తం ద్వాపరయుగపరిమాణం 2400 సంవత్సరాలు). ఆ తరువాత కలియుగం వేయిసంవత్సరాలు. దాని సంధ్య వంద సంవత్సరాలు. సంధ్యాంశం వంద సంవత్సరాలు. (మొత్తం కలియుగం 1200 సంవత్సరాలు). సంధ్య సంధ్యాంశాల ప్రమాణం సమానంగానే ఉంటుంది. కలియుగానంతరం మరల కృతయుగం ప్రారంభమవుతుంది. ఈ రీతిగా చతుర్యుగి పండ్రెండువేల సంవత్సరాలు నడుస్తుంది. ఇటువంటి చతుర్యుగాలు వేయి గడిస్తే బ్రహ్మకు ఒక రోజు అవుతుంది. ఆ బ్రహ్మదినం వరకే ఈ విశ్వం తిరుగుతుంది. ఆ పై నశిస్తుంది. దానినే ప్రళయ మంటారు పండితులు.

సహస్రయుగం సమాప్తమయ్యే ముందు కొద్దికాలం మిగిలి ఉన్నప్పుడు కలియుగాంతంలో ప్రజలందరూ దాదాపు అసత్యభాషణు లవుతారు. ఆ సమయంలో యజ్ఞ, దాన, వ్రతాలు ప్రత్యామ్నాయప్రధానాలై నామమాత్రంగా మిగిలిపోతాయి. ఆ యుగసమాప్తికాలంలో బ్రాహ్మణులు శూద్రకర్మలను ఆచరిస్తారు. క్షాత్రధర్మంతో కూడ శూద్రులు ధనార్జనపరు లవుతారు. నాయనా! కలియుగాంతంలో బ్రాహ్మణులు యజ్ఞస్వాధ్యాయాలనూ, దండాజినాలనూ వదలి సర్వభక్షకులై చరిస్తారు. బ్రాహ్మణులు జపాలను వీడితే శూద్రులు జపాసక్తు లవుతారు. లోకంలోని ఈ విపరీతప్రవర్తన ప్రళయానికి పూర్వరూపం. అప్పుడు మ్లేచ్ఛరాజు లెందరో పృథివీపాలకు లవుతారు. ఆ పాలకులు అందరూ వంచకులూ, పాపులూ, అసత్యవాదులై ఆంధ్ర, శక, పులింద, యవన, కాంబోజ, బాహ్లిక, శూర, ఆభీరదేశాలను పాలిస్తారు. క్షత్రియులూ, వైశ్యులు కూడా స్వధర్మాన్ని వీడి అన్యకర్మల నాశ్రయించి అల్పాయుష్కులూ, అల్పబలులూ, అల్పవీర్యులూ, అల్పపరాక్రములూ అవుతారు. మనుజుల బలం, శారీరక శక్తి తగ్గుతుంది. వారి మాటలలో కొంచమే సత్యముంటుంది. జనపదాలన్నీ జనశూన్య ప్రాయాలవుతాయి. దిక్కులన్నీ జంతువులతో, సర్పాలతో నిండిపోతాయి. యుగాంతమేర్పడినప్పుడు అందరూ నిరర్థకంగా బ్రహ్మను గురించి మాటాడుతారు. శూద్రులు బ్రాహ్మణులను ఏరా (ఒరే) అంటారు.

బ్రాహ్మణులు శూద్రులను తమరని సంబోధిస్తారు. యుగాంతవేళలో రకరకాల ప్రాణులు ఉద్భవిస్తాయి. పరిమళద్రవ్యాలు పరిమళహీనాలుగా నాసికలకు తోస్తాయి. రసవంతమయిన పదార్థాలు కూడా వెనుకటి వలె రుచించవు. యుగాంతంలో స్త్రీలు పొట్టివారుగా ఉంటారు. సంతానమెక్కువ. వారు శీలాచారాలను విడిచివేస్తారు. నోటినుండి బూతులనే పలుకుతారు. యుగాంతంలో జనపదాలలో అన్నాన్ని అమ్ముతారు. బ్రాహ్మణులు వేదాన్ని అమ్ముతారు. స్త్రీలు శీలాన్ని అమ్ముకొంటారు. గోవులు తక్కువపాల నిస్తాయి. చెట్లపై పూలు, పండ్లు కూడా తగ్గుతాయి. చెట్లపై కాకులే ఎక్కువవుతాయి. బ్రహ్మహత్య మొదలయిన పాపాలు చేస్తూ, అసత్యాలు పలికే ప్రభువులనుండి బ్రాహ్మణులు స్వీకరిస్తారు. బ్రాహ్మణులు లోభమోహాలకు గురియై, మిథ్యాచారమనే పతాకలను కప్పుకొని భిక్షకోసం దిక్కుల నన్నింటినీ(అందరినీ) పీడిస్తారు. గృహస్థులు పన్నుభారానికి భయపడి తప్పించుకొని తిరుగుతారు. బ్రాహ్మణులు మునివేషాల మాటున వ్యాపారాలు సాగిస్తారు. అప్పుడు నమ్మకం కలిగించటానికి గోళ్ళూ, గడ్డాలూ పెంచుకొంటారు. ధనలోభంతో బ్రహ్మచారులు కూడా ఆశ్రమాల్లో దంభాచారులై, మద్యపానం చేస్తూ గురుపత్నులతో సంగమిస్తారు. మాంసాన్ని, రక్తాన్నీ పెంపొందించే ఐహిక సుఖాలనే ప్రజలు కోరుకొంటారు. యుగాంతవేళలో ఆశ్రమా లన్నీ పాషండులతో నిండిపోతాయి. ఇతరుల ద్వారా లభించే భోజనాన్నే అందరూ గొప్పగా చెబుతారు.

ఇంద్రుడు కూడా సకాలంలో వర్షాలు కురిపించడు. అన్నిగింజలు సరిగా మొలకెత్తవు. జనులందరూ హింసను ఇష్టపడతారు. అపవిత్రులై మెలగుతారు. అధర్మఫలితం కూడా అప్పు డెక్కువగానే ఉంటుంది. ఆ సమయంలో ధర్మతత్పరుడు అల్పాయుష్కు డవుతాడు. ఎందుకంటే అప్పుడు ధర్మమంటూ ఏదీ ఉండదు. నరోత్తమా! జనులు దొంగతూకాలతో వస్తువులను అమ్ముతుంటారు. వర్తకులు కూడా రకరకాల మోసాలు చేస్తుంటారు. ధర్మాత్ములు వెనుకబడతారు. పాపాత్ములు వర్ధిల్లుతారు. **ధర్మం బలాన్ని కోలుపోతుంది. అధర్మం బలాన్ని పుంజుకొంటుంది. యుగాంతంలో ధర్మాత్ములు అల్పాయుష్కులూ, దరిద్రులూ అవుతారు.** ధర్మభ్రష్టులు, దీర్ఘాయుష్కులూ సమృద్ధులూ అవుతారు. యుగాంతవేళలో ధర్మభ్రష్టులు నగరవిహారాల్లో స్థావరాలు ఏర్పరచుకొని అధర్మోపాయాలతో వ్యవహారాలు నడుపుతుంటారు. రాజా ! కొద్దిగా డబ్బు సమకూరగానే సంపన్నులమై పోయినట్లు పొగరు పడతారు. విశ్వాసంతో తమ దగ్గర ఇతరులు దాచుకొన్న ధనాన్ని చాలామంది కాజేయాలని ప్రయత్నిస్తారు. పాపాత్ములై సిగ్గువిడిచి "మాదగ్గర నీదేమీ లేదు" అంటూ మోసగిస్తారు. మనుష్యులను తినే జంతువులు, పక్షులు నగరాలలోని

విహారస్థలాలలోనూ, దేవాలయాలలోనూ శయనిస్తాయి. స్త్రీలు ఏడెనిమిది సంవత్సరాల వయస్సులోనే గర్భాన్ని ధరిస్తారు. పది పండ్రెండు సంవత్సరాల వయస్సులోనే పురుషులకు పిల్లలు పుడతారు. పదహారు సంవత్సరాల వయస్సులోనే తలనెరుస్తుంది. మనుష్యుల ఆయుస్సు త్వరగా క్షీణిస్తుంది. ఆయువు మందగించి యువకులే వృద్ధస్వభావానికి లోనవుతారు. వృద్ధులు యువకుల వలె ప్రవర్తిస్తారు.

యుగాంతవేళలో విపరీతప్రవృత్తి గల స్త్రీలు యోగ్యులయిన తమ భర్తలను మోసగించి దుష్ప్రవర్తనలై సేవకులతోనూ, పశువులతోనూ వ్యభిచరిస్తారు. వీరపత్నులు కూడా పరపురుషులను ఆశ్రయిస్తారు. భర్త బ్రతికి ఉండగానే ఇతరులతో వ్యభిచరిస్తారు. ఈ రీతిగా ఆయుఃక్షీణానికి కారణమైన సహస్రయుగాంతంలో చివరిదశ ముగియగానే దీర్ఘకాలం అనావృష్టి ఏర్పడుతుంది. దానితో అల్పశక్తు లయిన ప్రాణులలో చాలాభాగం ఆకలితో అలమటించి, నశించిపోతుంది. ప్రజ్వరిల్లే కిరణాలుగల ఏడుగురు సూర్యులూ నదులలో, సముద్రాలలో ఉన్న నీటినంతా త్రాగేస్తారు. అప్పుడు తడిసిన, ఎండిన పుల్లలు, గడ్డీ మొత్తం భస్మమై కనిపిస్తుంది. ఆ తరువాత సంవర్తకమనే అగ్ని గాలితో కలిసి, అంతకుముందు సూర్యులు ఎండగట్టిన ఈ లోకంలో ప్రవేశిస్తుంది. సంవర్తకాగ్ని భూమిని చీల్చుకొని రసాతలంలో ప్రవేశించి దేవతలకూ, దానవులకూ, యక్షులకూ మహాభయాన్ని కలిగిస్తుంది. రాజా! నాగలోకాన్ని పూర్తిగా దహిస్తూ భూమికి అడుగున ఉన్న సమస్తాన్నీ క్షణకాలంలో అగ్ని నాశనం చేస్తాడు. అశుభకారణమైన ఆ గాలీ, ఆ సంవర్తకాగ్నీ కలసి అనేక వేల యోజనాల వరకు లోకాలను దహిస్తాయి. ఈవిధంగా వ్యాపించి మండిపడే సంవర్తకాగ్ని దేవ, అసుర, గంధర్వ, యక్ష, నాగ, రాక్షసులతో సహా సమస్తజగత్తును భస్మం చేస్తుంది.

ఆపై గగనతలంలో మహామేఘసమూహాలు అద్భుతంగా కనిపిస్తాయి. అవి విద్యున్మాలలతో విభాసిస్తూ ఏనుగుల గుంపులవలె ప్రకాశిస్తాయి. కొన్నిమేఘాలు నల్లకలువలవంటివి. కొన్ని తెల్లకలువలవంటివి. కొన్ని కేసరాల వంటివి. కొన్ని పసుపువలె పచ్చనివి. కొన్ని గోరోచనవర్ణం కలవి. కొన్ని కారండవపక్షుల వంటివి. కొన్ని తామరరేకుల వంటివి. కొన్ని ఇంగిలీకం వలె కనిపించేవి. కొన్ని గొప్పనగరాలవలె కన్పించేవి. కొన్ని ఏనుగుల గుంపులను పోలినవి. కొన్ని కాటుకవలె నల్లనివి. కొన్ని మొసళ్ళ ఆకారంలో ఉండేవి. ఆ మేఘాలు విద్యున్మాలలను అలంకరించుకొని ఎగసి వస్తాయి. భయంకరంగా ఉరుముతూ, భీకరరూపంతో ఆ మేఘాలన్నీ గగనతలమంతా వ్యాపిస్తాయి. ఆ మేఘాలు కురిసి పర్వతాలకూ, అరణ్యాలకూ, అగాధాలకూ నెలవయిన ఈ భూమి అంతా

జలప్రవాహంలో మునుగుతుంది. మొత్తం నీటితోనే నిండిపోతుంది. అప్పుడు ఉరుములతో భయంకరంగా ఉన్న ఆ మేఘాలు పరమేశ్వర ప్రేరణచే వెంటనే సమస్తాన్నీ జలమయం చేస్తాయి. కుంభవృష్టి కురిపిస్తూ భూమిని ముంచెత్తుతూ ఆ మేఘాలు దారుణంగా, భీకరంగా, అమంగళకరంగా ఉన్న ఆ అగ్నిని చల్లార్చుతాయి. ఆపై ఆ ప్రళయపయోధరాలు బ్రహ్మప్రేరణతో పండ్రెండు సంవత్సరాల పర్యంతం ధారావాహికంగా వర్షిస్తాయి. అప్పుడు సముద్రం తన హద్దులను అతిక్రమిస్తుంది. పర్వతాలు బ్రద్దలవుతాయి. భూమి నీట మునుగుతుంది. ఆకాశాన్ని కప్పి, వేగంగా అంతటా వ్యాపించిన ఆ మేఘాలు గాలితాకిడిచే ఛిన్నాభిన్నమై నశిస్తాయి. ఆ తరువాత ఆదిదేవుడు, పద్మాలయుడు అయిన బ్రహ్మదేవుడు ఆ భీకరమారుతాన్ని మ్రింగి, నిద్రిస్తాడు. రాజా! ఏకార్ణవజలంగా మారిన ఆ జగత్తులో స్థావర జంగమాలు నశించాయి. దేవాసురులు నశించారు. యక్షరాక్షసులు కనిపించలేదు. మనుష్యులు లేరు. జంతువులు లేవు. చెట్లు లేవు. అంతరిక్షం లేదు. అప్పుడు నేను ఒంటరిగా అటు ఇటూ తిరుగాడుతున్నాను. ఆ ఘోరమైన ఏకార్ణవజలంలో తిరుగుతున్న నాకు ప్రాణులేవీ కనిపించలేదు. దానితో కలతపడ్డాను.

అప్పుడు నేను జాగుచేయకుండా చాలాదూరం ఈదుతూ పోయాను. బాగా అలిసిపోయాను. అయితే నాకు ఆగటానికి ఆశ్రయం దొరకలేదు. ఒకదినాన ఆ జలసంచయంలో బాగా పెద్దగా ఉన్న ఒక మర్రిచెట్టును చూచాను. విశాలమైన ఆ మర్రిచెట్టు కొమ్మమీద దివ్యమైన పరుపు పరిచిన ఊయలలో కూర్చొని ఉన్న ఒక బాలుని చూచాను. కమలాలను కలువలను పోలిన వదనంతో, వికసించిన తామరరేకులవంటి కన్నులతో ఆ బాలుడు కనిపించాడు. రాజా! 'లోకమంతా నశిస్తే ఈ బాలుడిక్కడ ఎలా శయనించి ఉన్నా'?డని నాకు చాలా విస్మయం కలిగింది. నరాధిపా! నేను భూతవర్తమానభవిష్యత్తులు తెలిసినవాడను. అయినా తపోబలంతో ఆలోచించినా ఆ బాలుని గురించి తెలిసికొనలేకపోయాను. అవిసిపూలవంటి దేహకాంతితో, శ్రీవత్సలాంఛనంతో ఆ బాలుడు సాక్షాత్తు లక్ష్మికి నివాసస్థానంవలె కనిపించాడు. అప్పుడు కమలలోచనుడు, శ్రీవత్సధారి, కాంతిమంతుడు అయిన ఆ బాలుడు చెవులకింపుగూర్చుతూ నాతో ఇలా అన్నాడు. 'మార్కండేయా! నీవు అలిసి ఉన్నావు. విశ్రాంతిని కోరుతున్నావు. నాకు తెలుసు. నీ ఇష్టం వచ్చినంతసేపు ఇక్కడ కూర్చో. మునిసత్తమా! నిన్ను అనుగ్రహిస్తున్నాను. నాశరీరంలోనికి ప్రవేశించి కూర్చో. నీవసతికై అక్కడ ఏర్పాటు చేశాను.' ఆ బాలుడు ఆ విధంగా పలుకగానే నాకు జీవితం మీదా, మనుష్యత్వం మీదా ఎంతో విరక్తి కలిగింది. అప్పుడు ఆ బాలుడు వెంటనే నోరు తెరిచాడు. నేను నాకు తెలియకుండానే దైవికంగా

ఆ బాలుని నోట ప్రవేశించాను.

రాజా! నోట ప్రవేశించిన వెంటనే నేను ఆ బాలుని ఉదరంలోనికి వెళ్ళాను. అక్కడ రాష్ట్రాలు, నగరాలతో కూడిన సమస్తపృథివీ నాకు కనిపించింది. మహాత్ముడైన ఆ బాలుని కుక్షిలో తిరుగుతూ నేను గంగ, శతద్రువు, సీత, యమున కౌశికి, చర్మణ్వతి, వేత్రవతి, చంద్రభాగ, సరస్వతి, సింధువు, విపాశ, గోదావరి, వస్వోకసార, నలిని, నర్మద, తామ్రపర్ణి, వేణ, పుణ్యతోయ, శుభావహ, సువేణ, కృష్ణవేణ, ఇరామ, మహానది, వితస్త, కావేరి, శోణ, విశల్య, కింపున మొదలుగాగల నదులను, భూలోకంలో ఉన్న ఇతరనదులను చూచాను. ఆపై జల జంతుసమూహాలతో నిండి ఉన్న గొప్ప సముద్రాన్ని కూడా చూచాను. అది పయోనిధి, రత్నాలకు నిలయం కూడా. అక్కడ తేజస్సుతో వెలుగుతూ సూర్యాగ్నులవంటి కాంతి కలిగి చంద్రసూర్య విరాజితమైన గగనాన్ని చూచాను. అక్కడున్న భూమిని చూచాను. అది అడవులతో, పర్వతాలతో, ద్వీపాలతో, వందలనదులతో విరాజిల్లుతోంది. అక్కడి బ్రాహ్మణులు వివిధయాగాలను నిర్వహిస్తున్నారు. అన్ని వర్ణాలను అలరింపజేస్తూ క్షత్రియులు ప్రవర్తిస్తున్నారు. వైశ్యులు న్యాయమార్గంలో వ్యవసాయ వ్యాపారాలు చేస్తున్నారు. శూద్రులు ద్విజుల శుశ్రూషలో ఆసక్తులై ఉన్నారు. ఇదంతా చూస్తూ నేను ఆ మహాత్ముని ఉదరంలో పరిభ్రమిస్తూ హిమవంతునీ, హేమకూట పర్వతాన్నీ, నిషధగిరినీ, తెల్లని వెండి కొండనూ, గంధమాదనపర్వతాన్నీ, మందరగిరినీ, నీలగిరినీ, స్వర్ణమయమైన మేరుపర్వతాన్నీ, మహేంద్రగిరినీ, శ్రేష్ఠమైన వింధ్యపర్వతాన్నీ, మలయపర్వతాన్నీ, పారియాత్రపర్వతాన్నీ చూశాను. వీటితోపాటు మరెన్నో కొండలను ఆ బాలకుని కుక్షిలో చూశాను. అవన్నీ కూడా రత్నాలనలంకరించుకొని ఉన్నాయి. రాజా! సింహాలనూ, పులులనూ, పందులనూ కూడా అక్కడ చూశాను. భూమిపై నున్న సమస్తప్రాణులనూ ఆ బాలకుని ఉదరంలో చూస్తూ ఆ సమయంలో పరిభ్రమించాను.

ఆ బాలకుని కుక్షిలో ప్రవేశించి దిక్కులన్నీ తిరుగుతూ దేవేంద్రుడు మొదలుగా గల సమస్తదేవగణాలనూ నేను చూశాను. పండ్లనే ఆహారంగా తీసికొంటూ ఆ మహాత్ముని కుక్షిలో సంచరిస్తూ సాధ్యులను, రుద్రులను, ఆదిత్యులను, గుహ్యకులను, పితృదేవతలను, సర్పాలను, నాగులను, సుపర్ణులను, వసువులను, అశ్వినీదేవతలను, గంధర్వులను, అప్సరసలను, యక్షులనూ, మహర్షులను, దైత్యదానవ సమూహాలను, నాగులను, రాహువు మొదలయిన సింహికాపుత్రులను చూశాను. దేవతాశత్రువుల నందరినీ చూశాను. భూలోకంలో నేను చూసిన స్థావరజంగమాత్మకమైన సమస్తవిశ్వాన్ని నేను అక్కడ చూశాను. నూరుసంవత్సరాలకు పైగా ఆ బాలుని శరీరంలోనే ఉన్నాను. కానీ ఎప్పుడూ ఆ శరీరపు అంచులను నేను

చూడలేదు. రాజా! అదేపనిగా సంచరిస్తూ, ఆలోచిస్తూ ఎన్నో సంవత్సరాలు తిరిగినా ఆ శరీరానికి అంతాన్ని నేను చూడలేకపోయాను. అందువలన అప్పుడు వరేణ్యుడు, వరదుడు అయిన ఆ దేవునే మనసా, కర్మణా కూడా శాస్త్రోక్తరీతిలో శరణుకోరాను. వెంటనే వాయువేగంతో, తెరిచిన ఆ మహాత్ముని నోటినుండి వెలుపలికి వచ్చాను. ఆ మర్రిచెట్టు కొమ్మమీదనే శ్రీవత్సలాంఛనంతో, బాలవేషంతో, అమితతేజస్సుతో విశ్వాన్ని అంతా తనలో నింపుకొని కూర్చొని ఉన్న ఆ మహాత్ముని చూశాను. అప్పుడు శ్రీవత్సధారి, కాంతిమంతుడు, పీతాంబరుడు, తేజస్స్వరూపుడు అయిన ఆ బాలుడు సంతసించి నవ్వుతూ నాతో ఇలా అన్నాడు. 'మునివరా! మార్కండేయా! నాశరీరంలో ఉండి చక్కగా విశ్రాంతిని పొందావా? నాకు చెప్పు.'

ముహూర్తకాలంలో నాకు మరల క్రొత్తదృష్టి వచ్చింది. దానితో మాయనుండి వెలువడి నేను చైతన్యాన్ని పొందాను. నాయనా! మృదువుగా రక్తవర్ణంతో ప్రకాశిస్తున్న వ్రేళ్ళతో వెలుగొందుతూ బాగా ఎఱ్ఱగా ఉన్న ఆ బాలుని సుందరసుప్రతిష్ఠిత పాదాలను ప్రయత్నపూర్వకంగా నేను శిరసా వహించి నమస్కరించాను. అమితతేజోమూర్తియైన ఆయన అపరిమిత ప్రభావాన్ని గ్రహించి, వినయంతో చేతులు జోడించి, ప్రయత్నపూర్వకంగా సమీపించి, సర్వప్రాణి స్వరూపుడయిన ఆ దేవుని పుండరీకాక్షుని చూశాను. చేతులు జోడించి నమస్కరించి ఆయనతో ఇలా పలికాను. దేవా! నిన్నూ, ఉత్తమమైన నీ మాయనూ తెలియగోరుతున్నాను. స్వామీ! నీ నోటిద్వారా నీ శరీరంలోనికి ప్రవేశించిన నేను నీ ఉదరంలోనే సమస్తసంసార స్వరూపాన్నీ చూశాను. 'దేవా! దేవతలు, దానవులు, రాక్షసులు, యక్షులు, గంధర్వులు, నాగులు -స్థావరజంగమాత్మక మయిన జగత్తంతా నీశరీరంలోనే ఉన్నది. దేవా! నీ అనుగ్రహం వలననే నీ శరీరంలో నిరంతరంగా వేగంగా పరిభ్రమిస్తున్నా నాకు స్మృతి తొలగిపోలేదు. మహాప్రభూ! పుండరీకాక్షా! నేను కోరుకొనకపోయినా నీ ఇచ్ఛననుసరించి వెలుపలికి వచ్చాను. సర్వోన్నతుడవైన నిన్నుగురించి తెలియగోరుతున్నాను. సమస్తవిశ్వాన్నీ లోపలనిలుపుకొని కూడా సాక్షాత్తూ శిశురూపంలో ఇక్కడ ఎందుకున్నావు? దానిని చెప్పవలసినది. అనఘా! జగత్తంతా నీ శరీరంలో ఎందుకున్నది? అరిందమా! ఎంతకాలం నీవిక్కడే ఉండవలసి ఉన్నది? దేవేశా! పుండరీకాక్షా! బ్రాహ్మణుడను కాబట్టి జిజ్ఞాసవలన నీనుండి దీనిని యథాతథంగా వినగోరుతున్నాను. నేను చూచినదంతా ఊహకందని మహావిషయం.' నేనలా అనగానే వాగ్మి, దేవదేవుడు, కాంతిమంతుడు అయిన విష్ణువు నన్ను అనునయిస్తూ ఇలా అన్నాడు.

189. వటపత్రశాయి మార్కండేయునకు తన్ను గురించి తెలుపుట.

భగవానుడిలా అన్నాడు. 'బ్రాహ్మణా! దేవతలు సైతం నాగురించి యథాతథంగా తెలిసికొనలేరు. నీమీద ప్రేమతో ఈ జగత్తును ఎలా సృష్టిస్తున్నానో నీకు చెపుతాను. బ్రహ్మర్షీ! నీవు పితృభక్తి గలవాడవు. నన్ను శరణుకోరినవాడవు నీవు. గొప్పగా బ్రహ్మచర్యాన్ని పాలించినవాడవు. కాబట్టి నేను కనిపించినాను. గతంలో నేను నీళ్ళకు 'నారాः' అని పేరుపెట్టాను. ఆ నీళ్ళు నాకు నిత్య నివాసాలు. కాబట్టి నేను నారాయణుడను. ద్విజోత్తమా! నేను నారాయణుడను. అన్నింటి పుట్టుకకు కారకుడను. శాశ్వతుడను. నశించని వాడను. సర్వప్రాణులకూ సృష్టికర్తనూ, నాశకుడనూ నేనే. నేనే విష్ణువును, బ్రహ్మను, ఇంద్రుడను, కుబేరుడను, యముడను. ద్విజోత్తమా! నేనే శివుడను, సోముడను, కశ్యపప్రజాపతిని. నేనే ధాతను, విధాతను. నేనే యజ్ఞస్వరూపుడను. అగ్ని నాముఖం. భూమి నా పాదాలు. సూర్యచంద్రులు నా నేత్రాలు. ఆకాశమే నా తల. దిక్కులు నా చెవులు. నా స్వేదం నుండి పుట్టినవే నీళ్ళు. దిక్కులతో కూడిన ఆకాశమే నా శరీరం. గాలి నా మనస్సులో ఉంటుంది. నేను భూరిదక్షిణలతో వందలకొలది యాగాలను చేశాను. వేదవేత్తలు యజ్ఞశాలలో ఉన్న నన్నుగూర్చి యాగాలు చేస్తారు. భూపాలకులయిన క్షత్రియులు, వైశ్యులు కూడా స్వర్గాభిలాషతో నాగురించి యాగాలు చేస్తారు. మేరుమందరపర్వతాలతో అలంకరింపబడిన చతుస్సముద్రపర్యంతమైన ఈ భూమిని శేషుడనై నేనే మోస్తున్నాను. బ్రాహ్మణా! గతంలో నేను వరాహరూపాన్ని ధరించి నీటమునుగుతున్న భూమిని పరాక్రమంతో ఉద్ధరించాను. విద్వాంసుడా! నేనే బడబాగ్నినై నిత్యం జలాన్ని త్రాగుతూ, విడుస్తూ ఉంటాను. బ్రాహ్మణులు నా ముఖం. క్షత్రియులు నా భుజాలు. వైశ్యులు నా తొడలు. శూద్రులు నా పాదాలు. నా శక్తితో వీరంతా క్రమంగా పుట్టారు. ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వవేదం నానుండే పుడతాయి. నాలోనే లయిస్తాయి. శాంతిపరాయణులు, నియతేంద్రియులు, జిజ్ఞాసువులు, కామక్రోధద్వేషరహితులు, నిస్సంగులు, కల్మషరహితులు, సాత్వికులు, నిరహంకారులు నిత్యమూ అధ్యాత్మకోవిదులూ అయిన యతులు, బ్రాహ్మణులు ఎల్లప్పుడూ నాగురించియే ఆలోచిస్తూ నన్ను సేవిస్తారు.

ప్రళయకారణమైన సంవర్తకాగ్నిని నేనే. సంవర్తక సూర్యుడను, సంవర్తక వాయువును నేనే. ద్విజోత్తమా! ఆకాశంలో నక్షత్రాలవలె కనిపించేవన్నీ నారోమకూపాలు అని గ్రహించాలి. రత్ననిలయాలయిన సముద్రాలు, నాలుగు దిక్కులూ నాకు వస్త్రాలు, శయ్య, నివాస స్థానాలని తెలుసుకో. దేవతల కార్యసిద్ధికై నేనే వాటిని విభజించాను. సజ్జనశ్రేష్ఠా! కామం. క్రోధం, హర్షం, భయం, మోహం ఇవన్నీ నా రోమాలు అని గ్రహించు. బ్రాహ్మణా! ఏ

శుభకర్మలను ఆచరించి మానవులు శుభాలను పొందుతారో అవి – సత్యం, దానం, తీవ్రతపస్సు, ప్రాణులపై అహింసాస్వభావం – అన్నీ నా ద్వారా ఏర్పడినవే. నా శరీరంలో సంచరించేవే. ప్రాణులవిజ్ఞానానికై నేను ఆవిర్భవింపజేసినప్పుడే అవి పుడతాయి. స్వతంత్రంగా అవి ఏమీ చేయలేవు. **వేదాన్ని చక్కగా అధ్యయనం చేసి, శాంతస్వరూపులై, క్రోధాన్ని జయించి వివిధయాగాల ద్వారా నన్ను ఉపాసించిన బ్రాహ్మణులు నా సన్నిధికి చేరుతారు. లోభానికి ఎరయై, నీచులై, ఇంద్రియాధీనులై, మర్యాద తప్పి చెడ్డపనులు చేసేవారు నన్ను చేరలేరు. అట్టి మహోత్సాహాన్ని నేను. పుణ్యాత్ములు తేలికగా పొందగల యోగమార్గాన్ని నేను. మూఢులు ఆ మార్గాన్ని సమీపించటం కష్టం. ధర్మానికి గ్లాని కలిగి, అధర్మం ఎగిసిపడినప్పుడు నన్ను నేను ప్రకటించుకొంటాను.** హింసానురక్తులయిన దైత్యులను దేవతలు అణచటానికి అలవికానపుడూ, దారుణరాక్షసులు లోకంలో ఉద్భవించినప్పుడూ నేను మానుషదేహాన్ని ధరించి సత్పురుషుల ఇంట జన్మిస్తాను. దేవతలను, మనుష్యులను, గంధర్వులను, నాగులను, రాక్షసులను, స్థావరాలైన ప్రాణులను నా మాయతో నేనే సృష్టించి తగినవేళలో అన్నింటిని లయం చేసికొంటాను. మర్యాదాబంధం కారణంగా మానుషదేహంలో ప్రవేశిస్తాను. పనిచేసేవేళలో నేను ఊహకందని రూపాన్ని ధరిస్తాను.

కృతయుగంలో నేను శ్వేతవర్ణుడను. త్రేతాయుగంలో పీతవర్ణుడను. ద్వాపరయుగంలో రక్తవర్ణుడను. కలియుగంలో కృష్ణవర్ణుడను. కలియుగంలో మూడుభాగాలు అధర్మం ఉంటుంది. ప్రళయకాలం సమీపించినప్పుడు అతిదారుణమైన కాలరూపాన్ని ధరించి, నేను ఒక్కడనే స్థావరజంగమాత్మకమయిన మూడులోకాలను పూర్తిగా నశింపజేస్తాను. నేను మూడు లోకాలలో వ్యాపించిన వాడను. విశ్వరూపుడను. సర్వలోకాలకు సుఖాలను కల్పించేవాడను. ఉత్పత్తిహేతువును. సర్వవ్యాపిని, అనంతుడను. ఇంద్రియాలను నియంత్రించినవాడను. విక్రమశాలిని. బ్రాహ్మణా! కాలచక్రం రూపవిరహితం. సర్వప్రాణులనూ, నశింపజేసేదీ, సర్వలోకాలనూ ఉద్యుక్తులను చేసేదీ ఆ కాలచక్రమే. నేను ఒక్కడినే దానిని నడిపిస్తున్నాను. మునిశ్రేష్ఠా! ఈరీతిగా నా ఆత్మ సర్వప్రాణుల యందు చక్కగా నిక్షిప్తమై ఉంది. అయినా నన్నెవ్వరూ తెలియలేరు. బ్రాహ్మణా! సర్వలోకాలలో భక్తులు నన్ను సర్వవిధాలుగా ఆరాధిస్తున్నారు. నాదగ్గర నువ్వు ఏదైనా క్లేశాన్ని అనుభవించి ఉంటే అది భవిష్యత్తులో నీ సుఖానికి శ్రేయస్సుకు కారణమవుతుంది. అనఘా! నీవు లోకంలో చూస్తున్న స్థావరజంగమపదార్థాలన్నింటిలో భూతభావనాత్మక మయిన నా స్వరూపమే ప్రకటితమవుతుంది. సర్వలోకపితామహుడు నాశరీరంలో అర్ధభాగమే. బ్రహ్మర్షీ!

శంఖచక్రగదాధరుడ నైన నారాయణుడను నేనే. సహస్రయుగాంతవేళలో ప్రళయమున్నంతసేపు ప్రాణులను మోహనిద్రలో నుంచి నేను నిద్రిస్తాను. మునిశ్రేష్ఠా! నేను యథార్థంగా బాలుడను కాకపోయినా బ్రహ్మ మేల్కొనే వరకు బాలకరూపాన్ని ధరించి నేనిక్కడ శయనిస్తాను. విప్రశ్రేష్ఠా! విప్రగణపూజితా! నేను నీప్రవర్తనతో పదేపదే సంతుష్టుడనై బ్రహ్మరూపంతో నీకు వరమిచ్చాను. నీవు స్థావరజంగమాత్మకమైన సర్వజగత్తు ఏకార్ణవంగా మారటాన్ని చూచి కలతపడ్డావు. అది నేనెరిగి, నీకు మరల జగత్తును చూపించాను. నా ఉదరంలో ప్రవేశించి, లోపల సమస్తవిశ్వాన్నీ చూచి నీవు ఆశ్చర్యమగ్నుడవై చైతన్యాన్ని కోల్పోయావు. అందువలన బ్రహ్మర్షీ! నిన్ను నానోటి నుండి వెంటనే వెలుపలికి తెచ్చాను. సురాసురులు కూడా గ్రహించలేని నా స్వరూపాన్ని నీకు వివరించాను. మహాతపస్వీ, భగవంతుడు అయిన బ్రహ్మ మేల్కొనేదాకా నీవు ఇక్కడే శ్రద్ధావిశ్వాసాలతో సుఖంగా జీవించు. బ్రహ్మ మేల్కొన్న తర్వాత ఆయనలో లీనమై సమస్తప్రాణులను సృష్టిస్తాను. ఆకాశం, నేల, అగ్ని, వాయువు, నీరు – ఇంకా లోకంలో మిగిలిన సమస్త చరాచరాలను సృష్టిస్తాను.

మార్కండేయుడిలా అన్నాడు– 'నాయనా! ఆ విధంగా పలికి పరమాద్భుత స్వరూపుడైన ఆ బాలుడు మాయమయ్యాడు. వెంటనే వివిధ విచిత్రాలతో కూడిన ఈ ప్రజలను చూశాను. రాజా! యుగాంతవేళలో ఈ ఆశ్చర్యకర సంఘటనను నేను చూశాను. పురుషోత్తమా! నేను పూర్వం చూచిన ఆ భగవానుడు పుండరీకాక్షుడే నేడు నీకు బంధువైన జనార్దనుడు. కౌంతేయా! ఆయన వరమిచ్చి నందువలననే అదంతా నాకు గుర్తుంది. నా దీర్ఘాయుస్సు, స్వచ్ఛందమరణం కూడా ఆయన వరఫలమే. వృష్ణివంశస్థుడూ, మహాభుజుడు అయిన ఈ శ్రీకృష్ణుడు సర్వవ్యాపి, అచింత్యస్వరూపుడు, పురాణపురుషుడు, శ్రీహరి. నాకు బాలకుడుగా కనిపించిన వా డీ యనయే. ఈయనయే శ్రీవత్సలాంఛనుడు, గోవిందుడు, శాశ్వతుడు, విశ్వసృష్టిస్థితి సంహారకర్త, బ్రహ్మలకే బ్రహ్మ, ప్రభువు కూడా. ఆదిదేవుడు, జయశీలుడు, పీతాంబరుడు, వృష్ణివంశశ్రేష్ఠుడు అయిన ఈ పురాణపురుషుని చూచిన తరువాత ఇదంతా స్మృతికి వచ్చింది. సర్వప్రాణులకు తల్లి, తండ్రి ఈ మాధవుడే. కురువంశశ్రేష్ఠులారా! ఆశ్రయింపదగిన ఈయననే మీరు ఆశ్రయించండి.' మార్కండేయుడా రీతిగా చెప్పగా పాండవులు, పురుషశ్రేష్ఠులైన నకులసహదేవులు ద్రౌపది – అందరూ జనార్దనునికి నమస్కరించారు. పురుషోత్తమా! పూజార్హుడైన ఆ జనార్దనుడు కూడా వారిని యథావిధిగా సమాదరించి మధుర సాంత్వనవచనాలతో అనునయించాడు.

190. కలి యుగలక్షణములు - కల్క్యవతారము.

యుధిష్ఠిరుడు తన సామ్రాజ్యంలో ఇక ఉండబోవు లోకగతిని గూర్చి మరల మార్కండేయ మహర్షిని అడిగాడు. భృగువంశసంజాతా! నీద్వారా యుగాదిలోని ఉత్పత్తిసంహారాలను గూర్చిన ఆశ్చర్యకరవృత్తాంతాన్ని మేము విన్నాం. అయినా నాకింకా వినాలని కుతూహలంగా ఉంది. ఈ కలియుగంలో సర్వధర్మాలు కలతపడినప్పుడు మిగిలేది ఏమిటి? కలియుగాంతవేళలో మానవుల పరాక్రమం, ఆహారవిహారాలు ఎలా ఉంటాయి? ఆయుర్దాయ మెలా ఉంటుంది? వస్త్రాలంకారాలు ఎలా ఉంటాయి? కలియుగ మెంతమేర జరిగిన తర్వాత మరల కృతయుగ మేర్పడుతుంది? మహర్షీ! వివరంగా చెప్పు. నీ కథనం చాలా విచిత్రంగా ఉంది.

యుధిష్ఠిరుడలా అడుగగానే మహర్షిశ్రేష్ఠుడైన మార్కండేయుడు శ్రీకృష్ణునకు, పాండవులకు ఆహ్లాదాన్ని కల్గిస్తూ మరల ఇలా చెప్పాడు. భరతశ్రేష్ఠా! కలుషితమైన కలియుగం ఏర్పడిన తర్వాత సమస్తలోకాల వృత్తాంతాన్ని గురించి బాలముకుందుని అనుగ్రహంవలన నేను విన్నదీ, అనుభవించినదీ చెపుతాను. సావధానంగా విని గ్రహించు. కృతయుగం ఏర్పడినపుడు ధర్మం పూర్ణరూపంతో, నాలుగుపాదాలతో మనుష్యులలో ప్రతిష్ఠింపబడుతుంది. అప్పుడు లోభమోహాలకూ, కపటత్వానికి అవకాశం లేదు. త్రేతాయుగంలో అధర్మపాదంచేత దెబ్బతిని ధర్మం మూడుపాదాలతోనే ఉంటుంది. ద్వాపరంలో అధర్మం సగభాగాన్ని ఆక్రమించి ధర్మమిళితంగా ఉంటుంది. కలియుగం తామసయుగం. అధర్మం మూడు పాదాలతో లోకాల నాక్రమిస్తుంది. నాలుగవపాదంతో మాత్రమే ధర్మం మనుష్యులలో నిలుస్తుంది. మనుష్యుల ఆయుస్సు వీర్యం, బుద్ధి, బలం, తేజస్సు అన్నీ యుగయుగానికీ తగ్గుతుంటాయి. రాజులు, బ్రాహ్మణులు, వైశ్యులు, శూద్రులు అందరూ కపటత్వంతో ధర్మాన్ని ఆచరిస్తారు. ధర్మాన్ని ముసుగుగా వేసికొని, మనుష్యులు ఇతరులను మోసగిస్తారు. తమను తాము పండితుల మనుకొనేవారు సత్యాన్ని విడిచి ప్రవర్తిస్తారు. సత్యహానివలన వారి ఆయుస్సు క్షీణిస్తుంది. ఆయుస్సు క్షీణించినందువలన జీవనాన్ని నడపటానికి తగినవిద్యను వారు పొందలేరు. విద్యావిహీనులను, విజ్ఞానశూన్యులవడం వల్ల లోభంకూడా లోగొంటుంది. లోభక్రోధాలకు వశులైన మూఢమానవులు కామాసక్తు లవుతారు. పరస్పరవైరంతో ఒకరినొకరు చంపుకొనటానికి సిద్ధపడతారు. బ్రాహ్మణక్షత్రియవైశ్యులలో పరస్పరం వర్ణసంకరం జరుగుతుంది. అందరూ తపస్సును, సత్యాన్ని వీడి శూద్రసమాను లవుతారు. కడవారు మధ్యవారుగా, నడిమివారు కడవారుగా మారిపోతారు. సందేహం లేదు.

యుగాంతవేళలో లోక మీ విధంగానే ఉంటుంది. జనముతో చేసిన బట్టలు,

ధాన్యాలలో కొఱ్ఱలు శ్రేష్ఠంగా పరిగణన కెక్కుతాయి. యుగాంతవేళలో పురుషులకు భార్యలే మిత్రు లవుతారు. చేపలమాంసంతో చాలామంది జీవిస్తారు. గోసంపద నశించటంతో మేకలనుండి, గొఱ్ఱెలనుండి పాలు పిండుకొంటారు. నిత్యమూ ధర్మదీక్ష గలవారు కూడా కలియుగాంతంలో లోభానికి లోనవుతారు. యుగాంతవేళలో ఒకరినొకరు దోచుకొంటూ, ఒకరినొకరు హింసించుకొంటూ నాస్తికులై, జపహీనులై, దొంగలై బ్రతుకుతుంటారు. నదీతీరాలలో పారలతో త్రవ్వి ఓషధులబీజాలను నాటుతారు. అయితే యుగాంతవేళలో అవి కూడా తక్కువ ఫలితాన్నే ఇస్తాయి. నిత్యమూ దైవ పితృ కర్మలు చేసేవారు కూడా లోభవశులై దైవయజ్ఞ, శ్రాద్ధకర్మలలో ఒకరి ఇంట మరొకరు భుజిస్తారు. కలియుంగాంతంలో శ్రాద్ధక్రియల్లో పుత్రునికి తండ్రి భోక్త అవుతాడు. తండ్రికి పుత్రుడు భోక్త అవుతాడు. ఆ సమయంలో నిషిద్ధపదార్థాలు భోజనయోగ్యా లవుతాయి. బ్రాహ్మణులు వ్రతాచరణను మానటమే కాక వేదనింద కూడా చేస్తారు. హేతువాదానికి లొంగి యాగాలను, హోమాలను విడిచిపెడతారు. ఆ హేతువాదంతో నీచకర్మలపై సైతం మోజుపడతారు. లోతట్టు ప్రాంతాలలో కూడా వ్యవసాయం చేస్తారు. ఆవులను కూడా మూటలను మోయటానికి వినియోగిస్తారు. సంవత్సరంవయస్సు గల దూడలతో కూడా దున్నుతారు. కొడుకు తండ్రిని చంపినా, తండ్రి కొడుకును చంపినా ఏవిధమైన ఉద్వేగమూ ఉండదు.'ఆత్మకు ఏవీ అంటవు' అంటూ పెద్దపెద్ద మాటలు పలుకుతారు. అయినా వారిని ఎవ్వరూ ఏమీ అనరు. ప్రపంచమంతా మ్లేచ్ఛప్రాయ మవుతుంది. శుభకర్మలూ, యజ్ఞాలూ ఉండవు. నిరానందంగా, నిరుత్సవంగా సాగుతుంటుంది. జనులు సాధారణంగా దీనులయొక్క, నిస్సహాయుల యొక్క, విధవలయొక్క ధనాలను అపహరిస్తారు.

జనులు శారీరకంగా దుర్బలులు, పరాక్రమహీనులు, చేష్టారహితులు, లోభమోహాసక్తులు అవుతారు. అటువంటి వారి గురించియే మాట్లాడుకొంటూ, అటువంటి వారినుండి దానాలు పడతారు. మిథ్యాచారపరాయణులై దుర్మార్గులనుండి దానాలు తీసికొంటారు. పాండుకుమారా! పాపబుద్ధులయిన రాజులు ఒకరినొకరు యుద్ధానికి రెచ్చగొడుతూ ఒకరినొకరు చంపటానికి సిద్ధపడతారు. మూర్ఖులై తమను తాము పండితులనుగా భావిస్తారు. ఈరీతిగా యుగాంతవేళలో క్షత్రియులు కూడా లోకకంటకు లవుతారు. కలియుగాంతంలో ఆ రాజులు ప్రజలను రక్షించరు. లుబ్ధులై మానాహంకారాలతో గర్విస్తారు. ప్రజలను దండించటం మాత్రమే వారి కిష్టమవుతుంది. సజ్జనుల భార్యలను, సొమ్ములను సొంతం చేసికొని, వారు ఏడుస్తున్నా లెక్కచేయకుండా వాటిని అనుభవిస్తారు. యుగాంతవేళలో ఎవరూ కన్యలను యాచించరు. ఎవ్వరికీ కన్యల నివ్వరు. ఎవరికి వారు స్వయంగానే వరులను,

కన్యలను ఎన్నుకొంటారు. కలియుగాంతంలో రాజులు కూడా అసంతుష్టులూ, మూర్ఖులూ అయి సర్వోపాయాలను ఉపయోగించి పరులసొమ్ములు హరిస్తారు. ప్రపంచమంతా మ్లేచ్ఛప్రాయమవుతుంది. సందేహం లేదు. యుగాంతకాలంలో ఒకచేయి మరొకచేతిని దోచుకొంటుంది. లోకంలో తమను తామే పండితులమనుకొనే ప్రజలు సత్యాన్ని నాశనం చేస్తారు. వృద్ధులు పిల్లలవలె, పిల్లలు వృద్ధులవలె ప్రవర్తిస్తారు. యుగాంతవేళలో పిరికివాడు శూరుడ ననుకొంటాడు. శూరుడు పిరికితనంతో విషాదానికి లోనవుతాడు. ఎవ్వరినీ ఎవ్వరూ నమ్మరు. యుగాంతవేళలో సర్వజనులు లోభమోహాలకు లొంగి, అందరూ భక్ష్యాభక్ష్యవివేకాన్ని విడిచి ఆరగిస్తారు. అధర్మం వృద్ధిపొందుతుంది. ధర్మప్రవృత్తి కనిపించదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య విభాగాలు కనిపించవు. యుగాంతంలో అంతా ఒకే వర్ణంగా ఒకే జాతిగా ఉంటుంది.

యుగాంతంలో తండ్రి కొడుకును క్షమించలేడు. కొడుకు తండ్రిమాటను పాటించడు. భార్యలు పతిశుశ్రూష చేయరు. జనులు యవలు, గోధుమలు ఎక్కువగా పండే ప్రాంతాలకు వెళ్ళిపోతారు. యుగాంతకాలంలో స్త్రీపురుషులు ఇద్దరూ స్వేచ్ఛగా విహరిస్తుంటారు. ఒకరినొకరు సహించరు. ప్రపంచమంతా మ్లేచ్ఛప్రాయమవుతుంది. మానవులు శ్రాద్ధయజ్ఞకర్మలలో పితరులను, దేవతలను తృప్తిపరచరు. ఆ సమయంలో ఎవడూ ఎవడిమాటా వినడు. ఎవడూ ఎవడికీ గురువు కాదు. లోకమంతా అజ్ఞానాంధకారంతో నిండిపోతుంది. యుగాంతకాలంలో మానవుల పరమాయువు పదహారు సంవత్సరాలే. ఆ తర్వాత మరణించటమే. ఐదారు సంవత్సరాల వయస్సులో స్త్రీలు పిల్లలను కంటారు. ఏడెనిమిది సంవత్సరాల పురుషులు సంతానోత్పాదకులు అవుతారు. స్త్రీ తన భర్తతోనూ, పురుషుడు తన భార్యతోనూ తృప్తిచెందరు. దారిద్ర్యం పెరుగుతుంది. కపటసాధుత్వం వృద్ధినొందుతుంది. హింస ప్రబలుతుంది. ఎవ్వరూ ఎవ్వరికీ ఏమీ ఇవ్వరు. ఊళ్ళలో అన్న మమ్ముతారు. బ్రాహ్మణులు వేదాన్ని అమ్ముకొంటారు. స్త్రీలు వేశ్యావృత్తిని స్వీకరిస్తారు. రాబోయే యుగాంతవేళలో మనుష్యులు మ్లేచ్ఛాచారు లవుతారు. అన్నీ తింటారు. అన్ని పనులలో క్రూరత్వాన్ని ప్రదర్శిస్తారు. ఈ విషయంలో సందేహం లేదు. యుగాంతవేళలో డబ్బుమీది ఆశతో అమ్మకాలు కొనుగోళ్ళలో, అందరూ అందరినీ మోసగిస్తారు. వస్తుతత్త్వ మెరుగకుండానే కర్మల నాచరిస్తారు. అన్నింటికీ తామే ప్రమాణ మనుకొని తమ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తారు. ప్రజలంతా స్వాభావికంగానే క్రూరులుగా ఉంటారు. ఒకరినొకరు ఆడిపోసుకొంటారు.

తోటలను, చెట్లను నాశనం చేస్తారు. అందుకసలు బాధపడరు. ప్రాణులజీవితం

కూడా సంశయగ్రస్త మవుతుంది. నరు లందరూ ఆశపోతులవుతారు. బ్రాహ్మణుల సొమ్ము తింటూనే వారిని సంహరిస్తారు. శూద్రులచే పీడింపబడిన బ్రాహ్మణులు భయంతో హాహాకారాలు చేస్తూ, కాపాడేవాడు లేక లోకమంతా తిరుగుతుంటారు. నరులు పరుల జీవితాలను అంతం చేస్తూ క్రూరులై, రౌద్రులై, జీవహింసకులైనపుడు యుగాంతకాలం పూర్తిఅయినట్లే. బ్రాహ్మణులు భయంతో సంచరిస్తూ నదులనూ, పర్వతాలనూ, చొరరాని ప్రదేశాలను ఆశ్రయిస్తారు. బ్రాహ్మణులు దొంగలబాధతో కాకులవలె కావుకావుమంటూ తిరుగుతారు. దుష్టులైనపాలకులు వేసే పన్నులభారాన్ని భరించలేక ధైర్యాన్ని వీడి, శూద్రులకు సేవకులై చేయరాని పనులు చేస్తారు. దారుణమైన యుగాంతకాలస్థితి ఇది. శూద్రులు ధర్మబోధ చేస్తారు. బ్రాహ్మణులు వారిని సేవిస్తారు. వారి బోధలనే ప్రమాణమనే శ్రోతలు కూడా ఏర్పడుతారు. లోకవ్యవహారం ఉల్టా సీదాగా మారుతుంది. ఉచ్చనీచాలు తారుమారవుతాయి. దేవతలను కాదని ఎముకలగూళ్ళను (బౌద్ధాలయాలను) పూజిస్తారు జనులు. శూద్రులు ద్విజులను సేవించరు. మహర్షుల ఆశ్రమాలలో, బ్రాహ్మణుల ఇళ్ళలో, దేవాలయాలలో, యాగశాలల్లో నాగాలయాల్లో ఎముకలు కలిపిన గోడలే కనిపిస్తాయి. భూమిపై దేవమందిరశోభ ఉండదు. యుగధర్మాలు నశించిన యుగాంత లక్షణమిది. నరులు కోపిష్ఠులు, ధర్మహీనులు, మాంసభక్షకులు, సురాప్రియులు అయినప్పుడు యుగాంత మవుతుంది. రాజా! పూవులో పూవు, పండులో పండు కనిపిస్తే అది యుగసమాప్తి సూచన. యుగాంత వేళలో మేఘాలు అకాలంలో వర్షిస్తాయి. యుగాంతకాలంలో మనుష్యుల చేతలు అక్రమంగా ఉంటాయి. శూద్రులు బ్రాహ్మణులతో శత్రుత్వాన్ని పూనుతారు. కొద్దికాలంలోనే భూమిమొత్తం మ్లేచ్ఛులతో నిండిపోతుంది. పన్నులబాధతో విప్రులు పదిదిక్కులకూ పారిపోతారు. జానపదులంతా ఒకటిగానే కనిపిస్తారు. వెట్టిచాకిరితో, పన్నులబాధతో భయపడిన ప్రజలు ఆశ్రమాలకు వెళ్ళి, ఫలమూలాలు తింటూ జీవిస్తారు.

లోక మంతా ఇలా కలతపడుతుంది. ఏ మర్యాదలూ మిగలవు. శిష్యులు గురువుల మాట వినరు. పైపెచ్చు గురువులకు కీడు చేస్తారు. నిర్దయులయిన గురువులను శిష్యులు కూడా బెదిరిస్తారు. స్నేహాలూ, విద్యాలూ, బాంధవ్యాలూ అన్నీ డబ్బును బట్టి ఏర్పడుతాయి. యుగాంతవేళలో ప్రాణులేవీ మిగలవు. దిక్కులు మండిపోతాయి. నక్షత్రాల కాంతి లోపిస్తుంది. గ్రహాలు ప్రతికూలంగా నడుస్తాయి. గాలులు భీకరంగా కలతపెడతాయి. మహాభయాన్ని సూచిస్తూ మాటిమాటికి తోకచుక్కలు రాలుతాయి. సూర్యుడు మరో ఆరుగురు సూర్యులతో కలిసి తపింపజేస్తాడు. భయంకరధ్వనులు వినిపిస్తాయి. అన్నిదిక్కులలో మంటలు లేస్తాయి.

ఉదయాస్తమనవేళల్లో రాహువు సూర్యుని మ్రింగుతాడు. పూజ్యుడైన దేవేంద్రుడు అకాలంలో వర్షిస్తాడు. యుగాంతవేళలో గింజలు మొలకెత్తవు. స్త్రీలు ఎప్పుడూ క్రూరంగా, పరుషంగా మాటాడుతారు. ఏడుపే వారికి నచ్చుతుంది. స్త్రీలు భర్తల మాట వినరు. యుగాంతకాలంలో కొడుకులే తల్లిదండ్రులను చంపుతారు. భార్యలు కొడుకులతో కలిసి భర్తలను చంపుతారు. మహారాజా! అమావాస్య లేకపోయినా రాహువు సూర్యుని మ్రింగుతాడు. యుగాంతవేళలో అన్నిదిక్కుల్లో మంటలు లేస్తాయి. బాటసారులు యాచించినా నీరు కానీ, ఆహారం కానీ, వసతి కానీ దొరకదు. తిరస్కారానికి గురి అయిన వారు బాటమీదనే శయనిస్తారు. యుగాంతవేళలో కఠినంగా అరిచే కాకులు, ఏనుగులు, పక్షులు, జంతువులు క్రూరంగా అరుస్తాయి. ఆ సమయంలో నరులు మిత్రులను, బంధువులను, సేవకులను, కుటుంబసభ్యులను కూడా అకారణంగా పరిత్యజిస్తారు. జనులు తామున్న తావులను వీడి ఇతరదేశాలనూ, దిక్కులనూ, పట్టణాలనూ, నగరాలనూ ఆశ్రయిస్తారు. హా, తండ్రీ, హా, కుమారా! అంటూ దయనీయమయిన మాటలతో ఒకరినొకరు పిలుచుకొంటూ, ఏడుస్తూ భూమిపై సంచరిస్తారు. యుగాంతవేళలోని స్థితి ఇది.

ఆపై క్రమంగా లోకంలో జనులంతా అన్నిరకాల కష్టాలు పడుతుండగా మరల బ్రాహ్మణాది వర్ణాలు ఏర్పడి లోకం వర్ధిల్లుతుంది. దానికై అప్రయత్నంగా దైవం అనుకూలిస్తుంది. సూర్యుడు, చంద్రుడు, గురువు పుష్యనక్షత్రంలో ఒకేరాశిలో అడుగుపెడతారు. అప్పుడు కృతయుగం ప్రారంభమవుతుంది. సకాలంలో వానలు కురుస్తాయి. నక్షత్రాలు శుభాస్పదాలు అవుతాయి. గ్రహాలు ప్రదక్షిణభావంతో అనుకూలగతిని ఆశ్రయిస్తాయి. లోకమంతా క్షేమంగా, సుభిక్షంగా, ఆరోగ్యంగా ఉంటుంది. రాజా! యుగాంతవేళలో కాలప్రేరణచే సంభలగ్రామంలో, మంగళకరమైన బ్రాహ్మణగృహంలో విష్ణుయశుడు కల్కి పేరుతో ఒకమహాత్ముడు జన్మిస్తాడు. అతడు మహాపరాక్రమవంతుడు, బుద్ధిమంతుడు, సచ్ఛీలుడు, ప్రజలకు మేలుకూర్చేవాడు. సంకల్పమాత్రంచేతనే అన్ని ఆయుధాలు, వాహనాలు, యోధులు, శస్త్రాలు, కవచాలు అతనిని చేరుతాయి. అతడు ధర్మవిజేత, చక్రవర్తి అవుతాడు. ఉదారమతి, తేజస్సంపన్నుడు అయిన ఆ బ్రాహ్మణుడు దుఃఖభూయిష్ఠమైన ఈ లోకానికి ఆనందాన్ని కలిగిస్తాడు. కలియుగాన్ని అంతంచేయటమే అతని లక్ష్యం. అతడు కలియుగాన్ని అంతంచేసి సత్యయుగాన్ని ప్రవర్తింపజేస్తాడు. బ్రాహ్మణపరివృతుడై ఆ ద్విజుడు లోకమంతా తిరుగుతూ సమస్త మ్లేచ్ఛగణాలను సంహరిస్తాడు.

191. కల్కి కృతయుగమును స్థాపించుట. మార్కండేయుడు ధర్మరాజుకు చేసిన ఉపదేశము.

ఆ తరువాత చోరులను అందరినీ నశింపజేసి, అశ్వమేధమహాయాగం చేసి, ఈ భూమిని యథావిధిగా బ్రాహ్మణులకు దానం చేస్తాడు. పవిత్రకర్మలు చేసి పుణ్యయశస్సును పొంది, అతడు బ్రహ్మ నిర్దేశించిన శుభమర్యాదలను స్థాపించి రమణీయమైన వనంలో ప్రవేశిస్తాడు. లోకంలోని మనుష్య లందరూ అతని నడవడిని అనుసరిస్తారు. బ్రాహ్మణులు మ్లేచ్ఛులను నశింపజేసిన తరువాత కృతయుగంలో లోకం క్షేమంగా ఉంటుంది. ద్విజశ్రేష్ఠుడైన కల్కి చోరులను నశింపజేయటంలో ఆసక్తుడై సమస్తభూమండలంలో సంచరిస్తూ తాను జయించిన దేశాలలో కృష్ణాజినాలను, శక్తిత్రిశూలాలను, వివిధాయుధాలను నిలిపి బ్రాహ్మణులచే స్తుతింపబడుతూ, వారిని సత్కరిస్తూ లోకంలో తిరుగుతాడు. అమ్మా! కొడుకా! అని దీనంగా ఆక్రోశిస్తున్న దస్యులను అందరనూ ఘోరంగా సంహరిస్తాడు. అప్పుడు అధర్మం నశించి, ధర్మం వర్ధిల్లుతుంది. భారతా! కృతయుగం ప్రారంభం కాగానే జనులంతా దేవపితృకర్మలు చేస్తూ క్రియాశీలురు అవుతారు. కృతయుగంలో తోటలు, రచ్చమ్రానులు, చెరువులు, ధర్మశాలలు, పుష్కరిణులు, వివిధదేవాలయాలు తయారవుతాయి. వివిధయజ్ఞక్రియలు కొనసాగుతాయి. బ్రాహ్మణులు సాధుస్వభావు లవుతారు. మునులు తపోనిష్ఠ లవుతారు. పూర్వం పాషండులతో కలిసిఉన్న ఆశ్రమ ప్రజలు ఇపుడు ధర్మాసక్తు లౌతారు. వారి దుష్టసంస్కార బీజాలు దృఢ జ్ఞానంతో నశిస్తాయి.

అన్ని ఋతువులలో అన్నిపైరులు పెరుగుతాయి. ప్రజలందరూ దానవ్రతనియమాలలో ఆసక్తి చూపుతారు. విప్రు లంతా జపయజ్ఞాలపై ఆసక్తి చూపుతారు. ధర్మాన్ని ఇష్టపడుతూ ఆనందంగా జీవిస్తారు. రాజులు ఈ నేలను ధర్మబద్ధంగా పరిపాలిస్తారు. కృతయుగంలో వైశ్యులు వాణిజ్యంపై ఆసక్తి చూపుతారు. విప్రులు షట్‌కర్మల(అధ్యయన, ఆధ్యాపన, యజన, యాజన దాన, ప్రతిగ్రహాల)పై ఆసక్తులవుతారు. క్షత్రియులు పరాక్రమాసక్తులు కాగలరు.శూద్రులు మూడువర్ణాలను సేవించటంపై ఆసక్తిపడతారు. కృతయుగంలో ఇదే ధర్మం. త్రేతా, ద్వాపర, కలియుగాలలోని ధర్మస్థితిని నీకు వివరించి చెప్పాను. పాండుకుమారా! సర్వలోకానికి తెలిసిన యుగసంఖ్య కూడా నీకు తెలిసినది గదా! మహర్షులు ప్రస్తుతించిన వాయుపురాణాన్ని స్మరించి నేను గతించిన దానిని, జరుగబోయేదానిని కూడా పూర్తిగా చెప్పాను. అదేవిధంగా చిరంజీవినైన నేను అనేకపర్యాయాలు చూచి, అనుభవించిన నా సంసారమార్గాలను నీకు చెప్పాను. ధర్మసందేహాలు తొలగిపోవటానికి నీకు మరొకవిషయం చెపుతాను. సోదరులతో కలిసి, విని, గ్రహించు. నీవు ఎప్పుడూ ధర్మబద్ధుడవై ఉండాలి.

ధర్మాత్ముడే ఇహపరలోకాలలో సుఖంగా ఉండగలడు. అనఘా! నీకు చెప్పబోయే మంగళవచనాన్ని విను. నీవెప్పుడూ బ్రాహ్మణుని పరిభవించవద్దు. కోపించిన బ్రాహ్మణుడు ప్రతిజ్ఞతో మూడులోకాలను నశింపజేయగలడు. మార్కండేయుని మాటవిని కురుశ్రేష్ఠుడు, కాంతిమంతుడు, ధీమంతుడు అయిన ధర్మరాజు ఇలా అన్నాడు. 'మహర్షీ! ప్రజాసంరక్షణలో నేనే ధర్మంలో నిలవాలి? ఏ పద్ధతి ననుసరిస్తే నేను స్వధర్మం తప్పకుండా నిలువగలుగుతాను? మార్కండేయుడిలా అన్నాడు. **పర్వప్రాణులయందు దయగలవాడవై, హితుడవై, అమరక్తుడవై, అసూయలేనివాడవై, సత్యవాదివై, మృదుస్వభావుడవై, జితేంద్రియుడవై, ప్రజారక్షణయందు ఆసక్తిగలవాడవై ధర్మాన్ని అనుసరించు. అధర్మాన్ని వీడు. పితరులను, దేవతలను పూజించు. పొరపాటున ఏదైనా అన్యాయం జరిగితే బాగా దానంచేసి దానిని పోగొట్టుకో. అహంకారాన్ని ఆశ్రయించవద్దు. ఎప్పుడూ విన్ను నీవు పరాధీనుడ వమకో.** పృథివినంతా జయించి ఆనందిస్తూ సుఖంగా జీవించు. నీకు నేను ఉపదేశించిన ధర్మం గతంలోనూ భవిష్యత్తులో కూడా ఉండేదే. నాయనా! భూతభవిష్యత్తులలోనూ నశించకుండా ఉండేదిదే కాబట్టి నీకు వచ్చిన ఇప్పటి కష్టాలను మనస్సులో పెట్టుకొనవలదు. **కాలం బాధించినా బుద్ధిమంతులు మోహంలో పడరు. కాలమన్నది దేవతలమకూడా లోగొనగలది. కాలప్రేరణ వలన కూడా జనులు వ్యామోహంలో పడతారు.** అనఘా! నేను చెప్పిన విషయాలను నీవు సందేహించ నవసరం లేదు. ప్రసిద్ధికెక్కిన కురువంశంలో జన్మించావు. నా ఈ మాటను శంకిస్తే ధర్మలోపం కలుగుతుంది. కాబట్టి మనసా, వాచా, కర్మణా నామాటలను అనుసరించు.' యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'ద్విజశ్రేష్ఠా! నీవు చెప్పిన మాటలన్నీ చెవికింపుగా ఉన్నాయి. స్వామీ! మీమాటను పాటించే ప్రయత్నం చేస్తాను. విప్రోత్తమా! నాకు లోభం కానీ, భయం కానీ, మాత్సర్యం కానీ లేవు. మీ మాటను పాటిస్తాను.' రాజా! ధీమంతుడైన మార్కండేయుని మాటలను విని పాండవులు, శ్రీకృష్ణుడు, అక్కడ చేరిఉన్న బ్రహ్మర్షులు అందరూ ఆనందించారు. మార్కండేయుడు చెప్పిన శుభకథలను విని, పురాణజ్ఞానాన్ని పొంది అందరూ ఆశ్చర్యపడ్డారు.

192. శల,దలుల చరిత్ర; వామదేవ మాహాత్మ్యము.

"మరలా బ్రాహ్మణుల మహాభాగ్యాన్ని వివరించి చెప్పండి" అని యుధిష్ఠిరుడు మార్కండేయుని అడిగాడు. మార్కండేయు డిలా చెప్పాడు. 'బ్రాహ్మణుల అపూర్వచరితాన్ని ఇదిగో చెపుతున్నా వినండి. అయోధ్యానగరంలో ఇక్ష్వాకువంశశ్రేష్ఠుడైన పరీక్షిన్మహారాజు

ఉండేవాడు. ఒకసారి వేటకు వెళ్ళాడు. ఒంటరిగా గుర్రమెక్కి మృగం వెంటబడిన ఆ పరిక్షిత్తును ఆ మృగం చాలా దూరం లాక్కొనిపోయింది. మార్గంలో ఆయన అలసిపోయాడు. ఆకలిదప్పులు కలిగాయి. అప్పుడు ఒక ప్రాంతంలో నల్లగా, దట్టంగా ఉన్న వనప్రదేశాన్ని చూచాడు. అందులో ప్రవేశించాడు. ఆ వనఖండం మధ్యలో ఒక రమణీయ సరస్సును చూచి గుర్రంతోపాటు దానిలో దిగాడు. కొంత కుదుటపడి ఆ పరీక్షిత్తు కొన్ని తామరతూళ్ళను గుర్రం ముందు వేసి పుష్కరిణీతీరంలో విశ్రమించాడు. పడుకొన్న తర్వాత మధురగీతాన్ని విన్నాడు. విని "ఇక్కడ మనుష్యసంచారం లేదు. ఈ గానమెవరిదో" అని ఆలోచింపసాగాడు. ఆపై పూలుకోస్తూ పాటపాడుతున్న పరమరమణీయ కన్యను చూచాడు. అప్పుడు ఆమె రాజుకు దగ్గరలోనే తిరుగుతోంది. "నీవెవర్తెవు? ఎవరి కుమార్తెవు" అని రాజు ఆమెను అడిగాడు. 'నేను కన్యను' అని ఆమె బదులిచ్చింది. "నేను నిన్ను కోరుతున్నాను" అని రాజు ఆమెతో అన్నాడు. "ఒకమాట ఇస్తేనే నన్ను నీవు పొందగలవు. లేకపోతే లేదు" అని ఆ కన్య పలికింది. రాజు ఆ మాటను చెప్పమన్నాడు. "నాకెప్పుడూ నీటిని చూపించకూడదు" అని ఆమె అన్నది. రాజు దాని కంగీకరించి ఆమెను పెళ్ళాడాడు. పెండ్లిచేసికొన్న పరీక్షిత్‌రాజు పరమానందంగా ఆమెతో క్రీడించి, ఏకాంతంలో ఆమెను కలిసి మౌనంగా కూర్చొని ఉన్నాడు. రాజు అలా ఉండగానే ఆయనసేన అక్కడకు వచ్చింది. ఆసేన రాజు చుట్టూ చేరింది. రాజు బాగా సేదదీరి, తెరలుగల మేనాలో ఆమెతో కలిసి కూర్చొని, తన నగరానికి వెళ్లి, ఆమెతో కూడా ఏకాంతంగా ఉన్నాడు.

అక్కడ రాజు సన్నిహితంగా వచ్చినా ఎవరికీ దర్శనం కూడా దొరకలేదు. ఒకరోజు ప్రధానమంత్రి రాజుదగ్గరుండే ఆడవారినిలా అడిగాడు. "ఇక్కడ మీకేమి పని?" అప్పుడు ఆ స్త్రీలు ఇలా అన్నారు. "మాకిక్కడ ఒక అద్భుతమైన పని ఉన్నది. ఇక్కడకు నీళ్ళు లేకుండా చూడటం". అప్పుడు మంత్రి జలాశయాలు లేని ఉద్యానవనాన్ని ఏర్పాటు చేయించి అందమైన పెద్దపెద్ద చెట్లు దానిలో ఉండేలా చూశాడు. పూలు, పండ్లు, దుంపలు అక్కడ ఏర్పాటు చేశాడు. దాని మధ్యలో ఒక బావిని ముత్యాలజాలరులతో నిర్మింపజేశాడు. సుధాస్వచ్ఛమైన జలం దానిలో ఉన్నది. ఆ బావిని మూసి ఉంచాడు. ఆ తర్వాత రాజు దగ్గరకు పోయి ఇలా అన్నాడు. 'ఇది మంచి ఉద్యానవనం. దీనిలో చక్కగా విహరించండి.' రాజు మంత్రిమాట విని భార్యతో కలిసి ఆ వనంలో ప్రవేశించాడు. ఒకరోజు అందమైన ఆ తోటలో ఆమెతో విహరిస్తూ ఆకలి దప్పులతో బాగా అలసిపోయాడు. అతిముక్తలతలతో తయారుచేసిన మండపాన్ని చూశాడు. పరీక్షిత్తు భార్యతో సహా ఆ మండపంలోనికి ప్రవేశించి అమృతనిర్మల మయిన నీటితో నిండిన బావిని చూశాడు. దానిని చూచి

రాణితోపాటు దానితీరంలో నిలిచాడు. "జాగ్రత్తగా ఈ దిగుడుబావి నీటిలోనికి దిగు" అని ఆమెతో అన్నాడు. ఆమె ఆయన మాట విని నీటిలో మునిగింది. కానీ పైకిరాలేదు. రాజు ఆమెకై వెదకినా ఆమె కనిపించలేదు. బావిలోని నీటినంతా తోడించాడు. అక్కడొక బిలంలో ఒక కప్పను చూచి కోపంతో ఇలా ఆదేశించాడు. "ఎక్కడెక్కడి కప్పలను చంపండి. నా దర్శనం కోరేవారు చచ్చిన కప్పను కానుకగా తెచ్చి, నా దగ్గరికి రావాలి." రాజాదేశాన్ని అనుసరించి భీకరంగా మండూకవధ ప్రారంభమైంది. అన్ని దిక్కులలోని కప్పలకూ భయం కలిగింది. కప్పలన్నీ భయపడి మండూకరాజుతో జరిగినదంతా చెప్పాయి.

అప్పుడు మండూకరాజు తాపసవేషాన్ని ధరించి పరీక్షిత్తు దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. "రాజా! కోపం వద్దు. అనుగ్రహించు. ఏ తప్పు ఎరుగని కప్పలను చంపవద్దు. ఈ విషయమై రెండుశ్లోకాలు కూడా ఉన్నాయి. అచ్యుతా! కప్పలను చంపవద్దు. కోపాన్ని ఆపుకో. అవివేకంలో ప్రవర్తించే వారి ధనం నశిస్తుంది. ఈ కప్పలను చంపుతూ భార్యామూలకమైన కోపం విడవటం లేదు. ఈ అధర్మమిక చాలు. కప్పలను చంపితే లాభ మేమిటి?' రాణి కనిపించకుండా పోయిందని శోకిస్తున్న రాజు ఆ రీతిగా మాటాడుతున్న కప్పలరాజుతో ఇలా అన్నాడు. 'నేను క్షమించలేను. కప్పలను చంపి తీరుతాను. ఈ దుర్మార్గపు కప్పలే నారాణిని భక్షించాయి. కాబట్టి కప్పలు నాకు చంపదగినవే. పండితుడా! కప్పలను చంపకుండా నన్ను ఆపవద్దు.' ఆ మాటతో మనసు, ఇంద్రియాలు కలతపడగా ఆ మండూకపతి ఇలా అన్నాడు - 'మహారాజా! ప్రసన్నుడవు కమ్ము. నాపేరు ఆయువు. నేను మండూక రాజును. ఆమె నాకూతురు సుశోభన. నిన్ను వీడివెళ్ళటం ఆమె దుష్ప్రవర్తన. ఇంతకుముందు ఇలా రాజులను ఎందరినో మోసగించింది.' "నేను నీ కుమార్తెను కోరుతున్నాను. ఆమెను నాకివ్వు" అని పరీక్షిత్తు ఆయువుతో అన్నాడు. అప్పుడు ఆయువు ఆమెను పరీక్షిత్తున కప్పగించి 'రాజును సేవించు' అని ఆమెతో అన్నాడు. ఆమె చేసిన అపరాధాన్ని గుర్తుచేసికొని ఆమె నిలా శపించాడు- "నీవు రాజులనెందరినో మోసగించావు. నీ అసత్యప్రవర్తనవలన నీ పిల్లలు బ్రాహ్మణ విరోధు లవుతారు.' ఆమె శృంగారగుణాలకు కట్టుబడిన పరీక్షిత్తు ఆమెను పొంది త్రిలోకాధిపత్యాన్ని పొందినట్టు భావించాడు. ఆనందబాష్పాలు విడుస్తూ మండూకరాజుకు నమస్కరించి పూజించి హర్షగద్గదవచనంతో "అనుగ్రహింపబడితిని" అన్నాడు. మండూకరాజు తన కూతురిని విడిచి వచ్చినదారినే వెళ్లాడు. ఆ తర్వాత కొంతకాలానికి వారికి శలుడు, దలుడు, బలుడు అని ముగ్గురు కొడుకులు పుట్టారు. యుక్తవయస్సులో పరీక్షిత్తు జ్యేష్ఠుడైన శలుడికి పట్టాభిషేకం జరిపించి, తపస్సుపై మనస్సునుంచి, వనానికి వెళ్ళాడు.

ఆ తరువాత ఒకసారి శలుడు వేటకు పోయి, ఒక మృగాన్ని చూచి, రథమెక్కి దాన్ని అనుసరించాడు. త్వరగా రథాన్ని నడుపుమని సారథిని ఆదేశించాడు. అప్పుడు సూతుడు రాజుతో ఇలా అన్నాడు. 'పంతానికి పోవద్దు. ఆ మృగాన్ని నీవు పట్టుకొనలేవు. నీ రథానికి వామ్యశ్వాలుంటే మృగాన్ని పట్టుకొనవచ్చు. వెంటనే రాజు "వామ్యశ్వాలంటే ఏవో చెప్పు. లేకపోతే నిన్ను చంపివేస్తాను" అని సూతునితో అన్నాడు. రాజుమాటకు, వామదేవశాపానికీ భయపడిన సూతుడు మిన్నకున్నాడు. ఆ రాజుమరల కత్తినెత్తి "తొందరగా చెప్పు. లేకుంటే నిన్ను చంపివేస్తా" అని భయపెట్టాడు. రాజుచేష్టతో భయపడిన సూతుడు వామదేవుని గుర్రాలే వాములనీ, అవి మనోవేగం కలవనీ చెప్పాడు. సూతుడలా అనగానే వామదేవాశ్రమానికే రథాన్ని నడిపించమని సూతుడు ఆదేశించాడు. వామదేవాశ్రమానికి పోయి ఆ మునితో రాజు ఇలా అన్నాడు. "స్వామీ! నాబాణం దెబ్బతిని ఒకమృగం పారిపోయింది. వామ్యశ్వాలను నాకిచ్చి అనుగ్రహించండి" అన్నాడు. ఋషి "నీకు వామ్యశ్వాలను ఇస్తాను. పని ముగిసిన వెంటనే వాటిని నాదగ్గరకు చేర్చాలి" అన్నాడు ముని. పరీక్షిత్తు వామ్యశ్వాలను స్వీకరించి, ముని అనుమతి పొంది నిష్క్రమించాడు. వాములను పూన్చిన రథంపై మృగాల్ని అనుసరిస్తూ "ఈ మేలిగుర్రాలు బ్రాహ్మణులకు అనవసరం. వీటిని తిరిగి ఇవ్వకూడదు" అని సారథితో పలికి, మృగాన్ని పట్టుకొని, తన నగరానికి వెళ్ళి, ఆ గుర్రాలను అంతఃపురంలో కట్టిపెట్టాడు. అక్కడ వామదేవమహర్షి "యువకుడైన రాజకుమారుడు మేలిగుర్రాలను తీసికొనిపోయి విహరిస్తున్నాడు. తిరిగి తెచ్చి ఇవ్వలేదు. అయ్యో!" అని చింతించసాగాడు.

వామదేవుడలా మథనపడి నెల తర్వాత శిష్యుడితో ఇలా అన్నాడు. "ఆత్రేయా! వెళ్ళి పనిపూర్తి అయిఉంటే గురువుగారి గుర్రాలను తెచ్చి ఇవ్వండి" అని రాజుతో చెప్పు– "అతడు రాజుతో ఆ రీతిగానే చెప్పాడు. రాజు ఆ శిష్యునితో ఇలా అన్నాడు." ఈ వాహనాలు రాజులకు తగినవే కానీ బ్రాహ్మణులు ఇటువంటి రత్నాలను ఉంచుకొనకూడదు. అయినా బ్రాహ్మణులకు అశ్వాలతో పని ఏమిటి? ఇక వెళ్ళు." ఆత్రేయుడు వెళ్ళి గురువుగారికది చెప్పాడు. అప్రియమయిన ఆ మాట విని వామదేవుడు కోపంతో తానే రాజుదగ్గరకు పోయి అశ్వాల నిమ్మన్నాడు. కానీ పరీక్షిత్తు ఇవ్వలేదు. వామదేవుడిలా అన్నాడు. 'రాజా! నా వామ్యశ్వాలనిమ్ము. వీటితో నీ అవసరం తీరిపోయింది. నీవిప్పుడు బ్రాహ్మక్షాత్రాల విరోధాన్ని చూస్తున్నావు. ఘోరపాశాలతో వరుణుడు నిన్ను చంపకుండా చూచుకో.' రాజు ఇలా అన్నాడు. 'వామదేవా! ఇవిగో ఈ రెండు ఎద్దులు. మంచి స్వభావం గలవి. నియంత్రణ గలవి. ఇవి బ్రాహ్మణులకు తగిన వాహనాలు. వీటిని బండికి కట్టుకొని ఇష్టం వచ్చిన

చోటికి వెళ్ళు. వేదాలే మీ వంటివారి భారాన్ని మోస్తాయి.' వామదేవుడిలా అన్నాడు. 'రాజా! వేదాలన్నీ మావంటి బ్రాహ్మణుల భారాన్ని మోయటంలో అనుమానం లేదు. కానీ అది పరలోకంలో. ఈ లోకంలో మావంటివారికైనా, మరెవరికైనా అశ్వాలే వాహనాలు.' రాజు ఇలా అన్నాడు. 'అయితే నాలుగు గాడిదలను, లేదా వాయువేగం గల నాలుగు మనోహరమైన, శ్రేష్ఠములైన కంచరగాడిదలను నీకు వాహనంగా ఇస్తా. వాటితో నీవు ప్రయాణించు. ఈ వామ్యశ్వాలు మాత్రం నాకే. నీకివ్వను. తెలుసుకో.' వామదేవుడిలా అన్నాడు. 'రాజా! బ్రాహ్మణుల సొమ్మును దోచుకొని ఉపయోగించుకొనటం ఘోరకృత్యం. నా వామ్యశ్వాలను తిరిగి ఇవ్వకపోతే నేను నలుగురు రాక్షసులను నీపై ప్రయోగిస్తాను. ఘోరరూపులు, లోహశరీరులు, భయంకరులు అయిన వారు చేతిలో త్రిశూలాలను ధరించి, నిన్ను చంపి, నాలుగుముక్కలు చేసి, తలా ఒకముక్కా తీసికొనిపోతారు.' రాజు ఇలా అన్నాడు. 'వామదేవా! నీవు బ్రాహ్మణుడవు. కానీ మనస్సుతో, మాటతో, కర్మతో నన్ను చంపదలచుకొంటున్నావు. నేను నా సేవకులకు ఇది తెలిపితే శూలాలను, కత్తులను చేతబట్టి శిష్యసహితంగా నిన్ను చంపి పారవేస్తారు.' వామదేవుడిలా అన్నాడు. 'రాజా! నా వామ్యశ్వాలను తీసికొని తిరిగి ఇస్తానని మాటఇచ్చి ఉన్నావు. నీకు జీవించాలని ఆశ ఉంటే వెంటనే నా గుర్రాలను నా కివ్వు.' రాజు ఇలా అన్నాడు. 'వేట బ్రాహ్మణులకోసం పుట్టింది కాదు. నీవు అసత్యాలు చెప్తున్నావు. అయినా నిన్ను దండించటం లేదు. నేటినుండి తప్పు చేసినా నిన్ను క్షమిస్తాను. నీ ఆదేశాల నన్నింటినీ పాటిస్తాను.'

వామదేవుడిలా అన్నాడు. 'మనోవాక్కాయకర్మలలో దేనితో కూడా బ్రాహ్మణుల నెవ్వరూ అనుశాసించలేరు. **దీనివెరిగి కష్టపడి బ్రాహ్మణుల సేవించినవాడు ఆ సేవద్వారా శ్రేష్ఠుడై జీవిస్తాడు.**' వామదేవుడలా అనగానే ఘోరరూపం ధరించిన రాక్షసులు అక్కడ ప్రత్యక్షమయ్యారు. వారు శూలాలను చేతబట్టి రాజుపై దాడిచేశారు. అప్పుడు రాజిలా అన్నాడు. 'ఇక్ష్వాకువంశస్థులు, నా ఆదేశాన్ని అనుసరించే నా ప్రజలు అందరూ నన్ను వీడినా నేను వామదేవుని వామ్యశ్వాలను ఇవ్వను. ఇటువంటివారు ధర్మాత్ములు కారు.' రాజు ఇలా మాటాడుతుండగానే ఆ రాక్షసులు రాజును చంపివేశారు. ఆయన నేలగూలాడు. రాజు మరణించినట్లు విని ఇక్ష్వాకువంశస్థులు దలునకు రాజ్యాభిషేకం జరిపించారు. వామదేవుడు మరల రాజ్యానికి పోయి దలరాజుతో ఇలా అన్నాడు- "రాజా! బ్రాహ్మణుల వస్తువులను బ్రాహ్మణులకివ్వాలి. సర్వధర్మాలలోనూ ఇది కన్పిపిస్తుంది. నీవు అధర్మానికి భయపడేవాడవయితే వెంటనే నా వామ్యశ్వాలను నాకివ్వు". వామదేవుని మాట విని దలుడు, కోపంతో సూతునితో ఇలా అన్నాడు. 'విషదిగ్ధమైన అద్భుతబాణాన్ని

ఒకదాన్ని తీసికొనిరా! దానితో గాయపడి వామదేవుడు నేలపై పడాలి. కుక్కలు ఆయనను పీకుతుంటే దీనంగా ఆక్రోశించాలి.'

వామదేవుడిలా అన్నాడు. "రాజా! నీ రాణియందు నీకు పుట్టిన పదియేండ్ల కొడుకు శ్యేనజిత్తు ఉన్నాడు. నీవు నామాటమన్నించి నీ భయంకర బాణాలతో అతనిని వెంటనే చంపు." మార్కండేయుడిలా అన్నాడు. "వామదేవుడిలా అనగానే భీకరమయిన ఆ బాణం ధనుస్సునుండి వెలువడి అంతఃపురంలో ఉన్న రాజకుమారుని చంపింది." అది విని దలుడు ఇలా అన్నాడు. "ఇక్ష్వాకువంశస్థులారా! మీకిష్టమైన పనిచేస్తాను. ఈ విప్రుని ఇప్పుడు కొట్టి చంపుతాను. మరొకబాణాన్ని తీసుకొనిరండి. రాజులారా! నాపరాక్రమాన్ని ఇప్పుడు చూడండి." వామదేవుడిలా అన్నాడు. "రాజా! నన్ను చంపటానికి నీవు విషదిగ్ధమయిన భీకరబాణాన్ని సంధించబోతున్నావు. కానీ నీవు ఆ బాణాన్ని ఎక్కుపెట్టలేవు. శరవర్షాన్ని కురిపించనూ లేవు." రాజు ఇలా అన్నాడు. 'ఇక్ష్వాకులారా! చూడండి. నేను లొంగిపోయాను. బాణాన్ని విడువలేకున్నాను. ఇతనిని చంపాలనిపించటం లేదు. వామదేవుడు ఆయుష్మంతుడు. బ్రతుకుతాడు.' "రాజా! నీవు ఈ బాణంతో మహారాణిని చంపుము. అపుడు బ్రహ్మహత్యా పాపం నుండి బయటపడతావు" దలుడు ఆ విధంగా చేశాడు. అప్పుడు రాజకుమారి వామదేవునితో ఇలా అన్నది.

విప్రా! క్రూరస్వభావం గల ఈ నా భర్తకు నేను ప్రతిదినమూ తగినరీతిగా హితబోధ చేస్తాను. బ్రాహ్మణసేవకై వెదుకులాడుతుంటాను. కాబట్టి నేను పుణ్యలోకాలను పొందాలి. వామదేవు డిలా అన్నాడు. శుభేక్షణా! రాజకుమారీ! రాజవంశాన్ని నీవు రక్షించావు. సాటిలేని వరాన్ని కోరుకో! నేను ఇస్తాను. నీ వారినీ, విశాలమైన ఇక్ష్వాకురాజ్యాన్నీ పరిపాలించు. రాజకుమారి ఇలా అన్నది. "స్వామీ! వరాన్ని కోరుకొంటున్నాను. నా భర్త నేడే పాపవిముక్తుడు కావాలి. సపుత్రబాంధవంగా క్షేమంగా ఉండేటట్లు చూడు. విప్రోత్తమా! ఇదే నేను కోరే వరం." రాజకుమారి మాట విని వామదేవుడు 'తథాస్తు' అన్నాడు. రాజు ఆనందించాడు. నమస్కరించి, వామదేవునకు వామ్యశ్వాలను ఇచ్చాడు.

193. ఇంద్ర బక సంవాదము.

ఋషులు, బ్రాహ్మణులు, యుధిష్ఠిరుడు "బ్రాహ్మణా! బకమహర్షి ఏ కారణంగా దీర్ఘాయువు కాగలిగాడు" అని మార్కండేయమహర్షిని అడిగారు. మార్కండేయుడు వారందరితో ఇలా అన్నాడు. 'రాజా! బకమహర్షి మహాతపస్వీ, దీర్ఘాయువు. ఈవిషయంలో ఆలోచించవలసినదేదీ లేదు.' యుధిష్ఠిరుడు సోదరులతో కలిసి మార్కండేయుని మరల

ప్రశ్నించాడు. 'మహానుభావా! దలుని కొడుకు బకుడు మహాతపస్వి అనీ, చిరంజీవి అనీ, ఇంద్రునకు ప్రియమిత్రుడనీ వింటున్నాం. స్వామీ! ఇంద్రబకుల ఈ సాన్నిహిత్యం సుఖదుఃఖ మిశ్రితమైనదని విన్నాం. యథార్థంగా చెప్పండి. వినగోరుతున్నాం.' మార్కండేయుడిలా అన్నాడు. 'రాజా! దేవరాక్షసుల మధ్య ఒళ్ళు గగుర్పొడిచే యుద్ధం జరిగిన తర్వాత ఇంద్రుడు త్రిలోకాధిపతి అయ్యాడు. ఆయన పాలనలో మేఘం చక్కగా వర్షించేది. సర్వసంపదలు బాగా ఉండేవి. ప్రజలు రోగపీడ లేకుండా, ధర్మిష్ఠులై, ధర్మాన్నే ఆశ్రయించి ఉండేవారు. స్వధర్మపరాయణులైన ప్రజలంతా ఆనందంగా ఉండేవారు. ఆనందంగా ఉన్న ప్రజలను చూసి దేవ రాజయిన ఇంద్రుడు ఇంకా ఆనందించి, ఐరావతాన్ని అధిరోహించి, ప్రజాసందర్శనకై బయలుదేరాడు. విచిత్రాశ్రమాలనూ, వివిధ శుభనదులనూ, సమృద్ధనగరాలనూ, గ్రామాలనూ, జనపదాలనూ, ప్రజాపాలనలో సమర్థులై ధర్మపరాయణులై ఉన్న రాజులను, బావులనూ, చలివేంద్రాలనూ, బ్రహ్మచర్యాసక్తులైన ద్విజశ్రేష్ఠులు సేవిస్తున్న సరస్సులనూ చూస్తూ ఇంద్రుడు ఒకరమణీయ ప్రదేశంలో దిగాడు.

రాజా! అంద మయిన తూర్పుదిక్కులో సముద్రానికి దగ్గరగా రకరకాల చెట్లతో నిండి అందంగా, శుభకరంగా ఉన్న ఒక ఆశ్రమపదాన్ని చూశాడు. అది జంతువులకు, పక్షులకు ఆవాసమైనది. ఆ అందమయిన ఆశ్రమంలో దేవేంద్రుడు బకుని చూశాడు. దేవేంద్రుని చూచి బకుడు ఎంతో ఆనందించాడు. అర్ఘ్యపాద్యాలనిచ్చి, సుఖాసీనుని చేసి ఫలమూలాలతో అర్చించాడు. వరదుడు, బలసూదనుడు అయిన దేవేంద్రుడు సుఖంగా కూర్చొని బకుని ఇలా ప్రశ్నించాడు. 'అనఘా! మునీ! నీవు జన్మించి లక్షసంవత్సరాలు గడిచిపోయాయి. బ్రాహ్మణా ! చిరజీవులకు దుఃఖాన్ని కలిగించే విషయమేమిటో నాకు చెప్పు. బకుడు ఇలా అన్నాడు. **ఇష్టంలేని వారితో కలిసి ఉండటం, ఇష్టులతో వియోగం, చెడ్డవారితో చెలిమి - ఇది చిరజీవులకు దుఃఖం.** భార్యాపుత్రులు, దాయాదులు, మిత్రులు నశించిపోవటం, పరాధీనంగా బ్రతకటం చాలా కష్టం. ఇంతకన్న దుఃఖ మేముంటుంది? ధనహీనుడైన పురుషుని ఇతరులు పరాభవిస్తారు. మూడులోకాలలోనూ దీనిని మించిన కష్టం నాకు కనిపించలేదు. అకులీనుల అభివృద్ధి, కులీనుల వంశవినాశం, సంయోగం, వియోగం - ఇవన్నీ చిరజీవి చూడవలసి వస్తుంది. స్వామీ! దేవేంద్రా! అకులీనులు వృద్ధిచెందితే కులాల తారుమారు ఎలా అవుతుందో నీకు తెలియంది కాదు. దేవతలు, దానవులు, గంధర్వులు, మనుష్యులు, నాగులు, రాక్షసులు తారుమా రవుతుంటారు. ఇంతకన్నా దుఃఖ మేముంటుంది? నీచకులస్థులకు లోబడి కులీనులు బాధలు పడుతుంటారు. ధనవంతులు దరిద్రులను లోబరచుకొంటారు. ఇంతకన్న దుఃఖ మేముంటుంది? లోకంలో

ఈ విపరీతస్థితి బాగా కనిపిస్తుంది. బుద్ధిహీనులు ఆనందంగా ఉంటారు. పండితులు బాధలు పడతారు. మానవజాతి ఇలా ఎన్నోబాధలు పడటం చూడవలసి వస్తుంది.'

ఇంద్రుడిలా అన్నాడు. 'మహాభాగా! చిరజీవులకు సుఖ మేమిటో వివరంగా చెప్పు. బకుడు ఇలా అన్నాడు. **రోజులో ఎనిమిది లేక పండ్రెండవ భాగంలో తన ఇంటిలో వంట చేసికొంటూ, చెడ్డవారి శరణు కోరకుండా జీవించగలిగితే అంతకన్నా సుఖ మేముంటుంది?** రోజులు లెక్కపెట్టుకొనవలసిన అవసరం లేకుండా జీవించగలిగితే అంతకన్నా సుఖ మేముంటుంది? అటువంటి వారు తిండిపోతులు కారు. దేవేంద్రా! ఇతరుల మీద ఆధారపడకుండా స్వశక్తితో సంపాదించినదాన్ని ఇంట వండుకొని తినటం కన్న సుఖ మేముంటుంది? దైన్యం లేకుండా ఇంటిలో కాయలు, పండ్లు తినగలగటం గొప్ప. నిత్యమూ ఛీత్కారాలతో పరుల ఇంట మృష్టాన్న మయినా మంచిదికాదు. అందుకే సజ్జనులు పరుల ఇంట జీవనాన్ని గడపటాన్ని ఎప్పుడూ వ్యతిరేకిస్తారు. పరాన్నానికై ఆశపడేవాడు నెత్తురు త్రాగే కుక్కలాంటివాడు. అటువంటి నిర్భాగ్యుని, కృపణుని తిండి.... ఛీఛీ... **అతిథులకు, ఇతరజీవులకు, పితరులకు పెట్టగా మిగిలిన అన్నాన్ని తినగలిగితే అంతకన్నా సుఖ మేముంటుంది?** దేవేంద్రా! ఈ యజ్ఞశేషాన్ని మించి పవిత్రమైన మృష్టాన్న మేముంటుంది? నిత్యమూ అతిథులకు పెట్టి, తాను తినేవాడు శుభఫలాలు పొందుతాడు. **అతిథులు ఎన్ని కబళాల అన్నపుముద్దలు తింటారో అన్నివేలగోవులను దానం చేసిన పుణ్యం ఆ అతిథేయునకు లభిస్తుంది.** యౌవనంలో తాను చేసిన పాపాలన్నీ నశిస్తాయి' కూడా. భోజనానంతరం బ్రాహ్మణులకు దక్షిణనిస్తూ విడిచిన నీరు వారి చేతిలో ఉండగా మరల దానవారితో దానిని తడిపితే పాపాలన్నీ క్షణంలో నశిస్తాయి. ఇవేకాక, ఇటువంటి శుభకథలను ఎన్నింటినో బకునిచే చెప్పించి, వీడ్కోలు తీసికొని దేవేంద్రుడు స్వర్గానికి వెళ్ళాడు.

194. రాజమహిమ విషయమై శిబి సుహోత్రుల ప్రశంస.

అప్పుడు పాండవులు మార్కండేయుని మరలా అడిగారు. "బ్రాహ్మణ మాహాత్మ్యాన్ని చెప్పారు. క్షత్రియుల మాహాత్మ్యాన్ని ఇప్పుడు వినాలనుకొంటున్నాము." "అయితే ఇప్పుడు క్షత్రియుల మాహాత్మ్యాన్ని చెపుతా వినండి" అని మార్కండేయమహర్షి వారితో అన్నాడు. 'కురువంశస్థులలో సుహోత్రుడనే రాజు... ఒకడు. ఆయన ఒకమారు మహర్షులను సందర్శించి మరలి వస్తూ తనకు దగ్గరగా రథంపై ఉన్న ఉశీనరపుత్రుని – శిబిని చూశాడు. ఒకరికొకరు ఎదురుపడగానే వయస్సు ననుసరించి పరస్పరం గౌరవించుకొన్నారు. కానీ గుణాలను

బట్టి ఇరువురూ సమాను లనుకొని ఎవ్వరూ తప్పుకొని దారి ఇవ్వలేదు. అప్పుడు అక్కడకు నారదుడు వచ్చాడు. "ఇద్దరూ దారినడ్డగించి నిలిచారేమిటి?" అని వారి నడిగాడు. వారు నారదునితో ఇలా అన్నారు. "స్వామీ! అదేమీ లేదు. తనకన్న విశిష్టునకు కానీ, శక్తిమంతునకు కానీ దారి ఇవ్వాలని ధర్మశాస్త్రనిర్ణయం. మేమిద్దరం స్నేహభావంతో కలిశాం. మాలో ఎవరు శ్రేష్ఠులో ఎవరు తక్కువ వారో తెలియలేదు". వారి మాటలు విని నారదుడు మూడు శ్లోకాలు చెప్పాడు. "కౌరవా! తనతో మృదువుగా మాటాడేవారితో క్రూరుడైనా మృదువుగా ఉంటాడు. క్రూరులతో క్రూరంగానే ఉంటాడు. సజ్జనుడు చెడ్డవారితో కూడా మంచిగా ఉంటాడు. ఇక మంచివారితో మంచిగా ఎందుకుండడు? ఉపకారికి వందరెట్లు ప్రత్యుపకారం చేయాలి. ఇది దేవతలకే పరిమితమన్న నిర్ణయం లేదు. శిబి నీకన్న మంచివాడు. **నీచుని దానంతో వశం చేసికోవాలి. అనృతభాషిని సత్యంతో లొంగదీయాలి. క్రూరుని ఓర్పుతో, చెడ్డవానిని మంచితనంతో గెలవాలి.** "మీరిద్దరూ ఉదారులే. మీ ఇద్దరిలో మరీ ఉదారుడైనవాడే తప్పుకోవాలి. అదే ఉదారతకు నిదర్శనం" అని చెప్పి నారదుడు మిన్నకున్నాడు. అదివిని సుహోత్రుడు శిబికి ప్రదక్షిణం చేసి, దారినిచ్చి, ఆ శిబిచేసిన సత్కార్యాలను ప్రశంసించి వెళ్ళిపోయాడు. ఈరీతిగా నారదమహర్షియే రాజైన శిబి యొక్క మాహాత్మ్యాన్ని వర్ణించాడు.

195. యయాతి గోదానము చేయుట.

మార్కండేయుడిలా అన్నాడు. క్షత్రియమాహాత్మ్యాన్ని తెలిపే మరొకకథ చెపుతాను వినండి. యయాతి అనే రాజుండేవాడు. ఒకనాడు పురజనులు చుట్టిఉండగా సింహాసనంపై కూర్చొని ఉన్నాడు. గురుదక్షిణ కోసం ఒకబ్రాహ్మణుడు అక్కడకు వచ్చి "రాజా! గురుదక్షిణకై యాచిస్తున్నాను. కానీ ముందు నాకు మాట ఇవ్వాలి" అన్నాడు. రాజు ఇలా అన్నాడు. 'స్వామీ! ఆ నియమ మేమిటో చెప్పండి.' బ్రాహ్మణుడిలా అన్నాడు. 'రాజా! లోకంలో ఎవరైనా యాచించేవారిని ద్వేషిస్తారు. కాబట్టి రాజా! మీరు నాకు నాకిష్టమైన దాని నెలా ఇవ్వగలరు?(ప్రీతితో ఇస్తే తీసుకొంటాను)' రాజు ఇలా అన్నాడు. 'నేను దానం చేసిన తర్వాత దానిని గూర్చి చర్చించను. సృష్టిలో లేనివస్తువును నీవు అడగవు. ఉన్నదానిని నేను తృప్తిగా ఇస్తాను. ఇవ్వగల వస్తువునిచ్చి నేను సుఖంగా ఉంటాను. అర్థియై వచ్చిన బ్రాహ్మణు డంటే నాకు ఇష్టం. నీకు వేయి కపిలగోవులను ఇస్తాను. యాచకులను నేను కోపించను. ఇచ్చిన దానిగురించి బాధపడను.' అనిచెప్పి రాజు బ్రాహ్మణునకు వేయి ఆవులను ఇచ్చాడు. బ్రాహ్మణుడు వేయి ఆవులను స్వీకరించాడు.

196. సేదుకవృషదర్భుల చరిత్రము.

'మార్కండేయా! క్షత్రియమాహాత్మ్యాన్ని గురించి ఇంకా చెప్పవలసినది' అని యుధిష్ఠిరుడు అడిగాడు. మార్కండేయుడిలా చెప్పాడు. 'మహారాజా! వృషదర్భుడు, సేదుకుడు అనే రాజులుండేవారు. వారు నీతిమార్గంలో నడిచేవారూ. అస్త్రవిద్యలోను, ఉపాస్త్రవిద్యలోను నేర్పరులు. వృషదర్భునకు చిన్ననాటినుండి కూడా బ్రాహ్మణులకు బంగారం తప్ప మరేమీ ఇవ్వకూడదని రహస్యవ్రతం. అది సేదుకునకు తెలుసు. ఒకమారు వేదాధ్యయన సంపన్నుడైన ఒక బ్రాహ్మణుడు సేదుకుని చెంతకు వచ్చి, దీవెనలిచ్చి గురుదక్షిణకై యాచించాడు. రాజా! నాకు వేయి గుర్రాల నివ్వండి. అని అడిగాడు. అప్పుడు సేదుకుడు "నీవు కోరిన గురుదక్షిణ నిచ్చే స్థాయి నాకు లేదు." నీవు వృషదర్భుని దగ్గరకు వెళ్ళు. ఆయన పరమధర్మజ్ఞుడు. బ్రాహ్మణా! ఆయనను యాచించు' అన్నాడు. అప్పుడు బ్రాహ్మణుడు వృషదర్భుని దగ్గరకుపోయి వేయిగుర్రాల నడిగాడు. ఆ రాజు బ్రాహ్మణుని కొరడాతో కొట్టించాడు. "ఏ తప్పు చేయని నన్నెందుకు కొట్టించావు"? అని బ్రాహ్మణుడు రాజునడిగాడు. అడుగుతూనే శపించబోయాడు. అప్పుడు రాజు ఇలా అన్నాడు. "బ్రాహ్మణా! నీవడిగినది ఇవ్వనంతమాత్రాన శపిస్తావా? ఇది బ్రాహ్మణులకు తగిన పనియేనా?" బ్రాహ్మణుడిలా అన్నాడు, 'రాజాధిరాజా! సేదుకుడు పంపగా భిక్షకై నీ దగ్గరకు వచ్చాను. ఆయన ఉపదేశంమేరకు నిన్ను నేను యాచించాను.' రాజు ఇలా అన్నాడు. 'ఈరోజు నాకు వచ్చిన ఆదాయాన్ని రేపుదయం నీకు ఇస్తాను. కొరడాతో కొట్టి వట్టిచేతులతో ఎలా పంపుతాను.' అని చెప్పి బ్రాహ్మణునకు ఒకనాటి ఆదాయాన్ని ఇచ్చాడు. అది వేయిగుర్రాల వెలకన్న ఎక్కువే.

197. ఇంద్రాగ్నులు శిబిని పరీక్షించుట.

దేవతలలో ఒకసారి ఇలా చర్చ జరిగింది. "భూలోకంలో ఉశీనరునికొడుకు శిబి గొప్పరాజు. ఆయనను పరీక్షిద్దాం." అలాగే అని అగ్ని ఇంద్రుడు బయలుదేరారు. అగ్ని పావురం రూపం ధరించి శిబి దగ్గరకు వచ్చాడు. ఇంద్రుడు డేగరూపం ధరించి మాంసానికై దాన్ని తరుముతూ వచ్చాడు. పావురం దివ్యాసనంలో కూర్చొని ఉన్న శిబి ఒడిలో వ్రాలింది. అపుడు పురోహితుడు రాజుతో ఇలా అన్నాడు – డేగను చూచి భయపడి ప్రాణాలను కాపాడుకోటానికి పావురం నీ దగ్గరకు ప్రాణభిక్షకై వచ్చింది. పావురం ఒడిలో వ్రాలటం అనర్థదాయక మనీ, మృత్యు ప్రద మనీ అంటారు. దాని శాంతికై ధనదానం చెయ్యండి.' అపుడు పావురం రాజుతో ఇలా అన్నది. డేగను చూచి భయపడి ప్రాణరక్షణకై నీదగ్గరకు

చేరాను. ప్రాణభిక్ష పెట్టు. నేను వాస్తవానికి మునిని. రూపాన్ని మార్చుకొన్నాను. నాప్రాణరూపుడ వయిన నిన్ను శరణుకోరాను. నేను స్వాధ్యాయంతో బక్కచిక్కిన బ్రహ్మచారిని. తపస్విని, జితేంద్రియుడను. ఆచార్యునకు ఎప్పుడూ ఎదురు చెప్పలేదు. ఈరీతిగా యోగ్యునిగా, అనఘునిగా నన్ను గ్రహించు. వేదాలు పలుకగలను. ఛందస్సులను విడగొట్టగలను. వేదాలలోని ప్రత్యక్షరాన్ని చదివాను. అటువంటి నన్ను ఆకలి తీరటానికి దానం చేయటం తగదు. నన్ను డేగకివ్వవద్దు. నేను పావురాన్ని కాను.' అప్పుడు డేగ రాజుతో ఇలా అన్నది. 'జీవుడు వేరువేరు ప్రాణులరూపాన్ని వేరువేరు జన్మలలో ధరిస్తుంటాడు. ఏదో జన్మలో నీవీ పావురానికి పుట్టి ఉంటావు. అందుకే దీనిని ఆదరించి నాభోజనానికి ఆటంకం కలిగించకు.'

రాజు ఇలా అన్నాడు. 'ఇంతకు ముందెప్పుడూ ఏ పక్షీ ఇంతచక్కగా డేగా పావురాలవలె మాటాడటం వినలేదు, చూడలేదు. వీరి స్వరూపాన్ని గ్రహించి న్యాయోచితంగా వ్యవహరించట మెలా? భయంతో తనను శరణుజొచ్చిన వానిని శత్రువుల కప్పగించిన వానిరాజ్యంలో సకాలంలో వర్షాలు కురియవు. నాటిన గింజలు మొలకెత్తవు. ఆ రాజు తనకు రక్షణకోరినవేళ రక్షణ దొరకదు. భయంతో తనను శరణుజొచ్చిన వానిని శత్రువులకప్పగించిన వానిసంతానం శైశవంలోనే మరణిస్తుంది. వాని పితరులకు పితృలోకంలో తావు దొరకదు. ఆ వ్యక్తి ఇచ్చిన హవిస్సులను దేవతలు గ్రహింపరు. భయంతో తనను శరణుజొచ్చిన వానిని శత్రువుల కప్పగించిన వాని అన్నం నిరర్థకం. మంచిమనస్సులేని అతడు త్వరగా స్వర్గలోకభ్రష్టు డవుతాడు. ఇంద్రాది దేవతలు అతనిని వజ్రంతో కొడతారు. శ్యేనమా! ఈ పావురానికి బదులు ఎద్దును అన్నంతో కలిపి వండి, నీకై మా వారు అందజేస్తారు. నీ కిష్టమైన చోట నీవుంటే శిబివంశస్థులు అక్కడకే మాంసాన్ని తెచ్చి అందిస్తారు.' డేగ ఇలా అన్నది. రాజా! నాకు ఎద్దుమాంస మక్కరలేదు. ఈ పావురం కన్న నాకే మాంసమూ ఎక్కువఅక్కరలేదు. దేవతలు నాకు నేడు దీనినే ఆహారం చేశారు. మరే పక్షులూ లేవు కాబట్టి దీనినే నాకిచ్చివేయి.' రాజు ఇలా అన్నాడు. 'ఋషభాన్ని కాని సర్వాంగ సంపూర్ణమైన గొడ్డుటావును కాని నీకోసం నావారే వెళ్ళి వెదకి తెచ్చి ఇస్తారు. భయంతో నాదగ్గరకు వచ్చిన పావురానికి బదులుగా దాన్ని తీసుకో. దీనిని హింసించవద్దు. ప్రాణాలనయినా ఇస్తాను కానీ దీనిని విడువను. డేగా! ఈ పావురం సౌమ్యమైనది. సౌమ్యుడా! ఈవిషయంలో నీవు బాధపడవద్దు. ఎట్టిస్థితిలోనూ కపోతాన్ని నేను నీకివ్వను. శ్యేనమా! నేను ఏపనివలన శిబివంశస్థులు నన్ను సాధువాదాలతో ప్రశంసిస్తారో, నీకు నచ్చుతుందో అది నాకు చెప్పుము. నీవు చెప్పినట్లు చేస్తాను.'

డేగ ఇలా అన్నది. 'రాజా! పావురానికి సమానంగా నీ కుడితొడ నుండి మాంసాన్ని తీసి ఇవ్వు. పావురాన్ని రక్షించినట్లు అవుతుంది. శిబివంశస్థులు నిన్ను ప్రశంసిస్తారు. నా కోరిక కూడా తీరుతుంది.' అప్పుడు శిబి తన కుడితొడనుండి మాంసపుముద్దను తీసి పావురంతో తూచాడు. పావురమే బరువుగా ఉంది. మరొకముద్దను తీశాడు. పావురమే బరువైంది. ఈవిధంగా శరీరంలోని సర్వాంగాలనుండీ మాంసాన్ని అంతా తీసి త్రాసులో పెట్టాడు. అయినా పావురమే బరువుగా ఉంది. అప్పుడు శిబి తానే త్రాసులో కూర్చున్నాడు. తానేమీ బాధపడలేదు. రాజు త్రాసులో కూర్చోగానే "పావురాన్ని రక్షించావు" అంటూ డేగ అదృశ్యమయింది. అప్పుడు రాజు ఇలా అడిగాడు. 'పావురమా! శిబివంశస్థులు నిన్ను పావురమనే భావిస్తున్నారు. పక్షీ! మరి ఆ డేగ ఎవరో చెప్పు. ఈశ్వరుడు తప్ప మరెవ్వరూ ఇటువంటి పనిచేయలేరు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి.' పావురమిలా అన్నది. ధూమకేతువునైన వైశ్వానరాగ్నిని నేను. శచీపతి, వజ్రధారి అయిన ఇంద్రుడే ఈ డేగ. సురథాకుమారా! నీవు గొప్పవాడవు. నీ గొప్పతనాన్ని గ్రహించటానికే మేమిలా వచ్చాం. రాజా! నాశరీరాన్ని విడిపించటానికి కత్తితో నీ శరీరాన్ని కోసి, మాంసాన్ని తీశావు. ఆ మచ్చ నీకు మంగళకర మవుతుంది. బంగారువన్నెతో మెరుస్తూ అందగిస్తూ, సుగంధాలు వెదజల్లుతుంది. నీ ఈ కుడిప్రక్కనుండి ఒక కొడుకు పుడతాడు. కీర్తిమంతుడై ఈ ప్రజలను పాలించి దేవర్షులకు ఆదరపాత్రుడు కాగలడు. కపోతరోముడని ఆ బాలునకు పేరు. రాజా! నీకు పుట్టబోయే ఆ కొడుకు - కపోతరోముడు - నీ తొడను చీల్చుకొని వస్తాడు కాబట్టి ఔద్భిదుడని వ్యవహరింపబడతాడు. అతడు ఆబోతువలె సౌష్ఠవంగలవాడై కీర్తితో ప్రకాశిస్తూ, శూరుడై, సౌరథులలో గొప్పవాడు కాగలడు.'

198. నారదుడు శిబి మాహాత్మ్యమును చెప్పుట.

క్షత్రియుల మాహాత్మ్యాన్ని ఇంకా చెప్పండి అని ధర్మరాజు మార్కండేయుని అడిగాడు. మార్కండేయుడిలా చెప్పాడు. 'విశ్వామిత్రుని కుమారుడైన అష్టకుడు అశ్వమేధయాగం చేస్తుంటే రాజులందరూ వచ్చారు. ప్రతర్దనుడు, వసుమనుడు, ఉశీనరనందనుడు శిబి, అష్టకుని సోదరులు. యాగం ముగిసిన తర్వాత అష్టకుని రథంపై బయలుదేరాడు. వారు అప్పుడు నారదుని రాకను గమనించి "రథాన్ని ఎక్కండి" అని నారదునితో అన్నారు. 'అలాగే' అని వారితో అని నారదుడు రథ మెక్కాడు. అప్పుడు వారిలో ఒకడు నారదునితో ఇలా అన్నాడు. "స్వామీ! మిమ్ములను ప్రసన్నులను చేసికొని కొద్దిగా అడగాలనుకొంటున్నాను. 'అడుగు' అన్నాడు నారదుడు. అతడిలా అన్నాడు "స్వామీ!

మేము దీర్ఘాయుష్కులం, సర్వగుణసంపన్నులం. ప్రసన్నులమైన మేము నలుగురం స్వర్గానికి వెళ్ళదలచాం. అయితే అక్కడనుండి ఎవరు ముందుగా తిరిగి రావలసి ఉంటుంది"?. అష్టకుడు ముందు వెనుదిరుగుతాడు. అని నారదు డన్నాడు. "ఎందుకని ?" అడిగాడు. నారదు డిలా అన్నాడు - "నేనొకప్పుడు అష్టకుని ఇంటిలో ఉన్నాను. ఒకసారి నన్ను రథంపై ఎక్కించుకొని తిరుగుతున్నాడు అష్టకుడు. అప్పుడు వివిధ వర్ణాలతో ఉన్న వేలవేలగోవులను నేను చూచాను. "ఎవరివీ గోవు ? లని అతనినడిగాను. "ఇవన్నీ నేను దానం చేసినవే" అన్నాడు అష్టకుడు. "తాను చేసిన దానాన్ని తానే చెప్పుకొన్నాడు.' "అష్టకుడు 'సరే మిగిలిన ముగ్గురులో ఎవరు ముందు రావలసి ఉంటుంది" అని మరల అడిగాడు. "ప్రతర్దనుడు" అని నారదుడు బదులిచ్చాడు. "కారణం"? వారు అడిగారు. "నారదుడు ఇలా అన్నాడు - "నేను ఒకప్పుడు ప్రతర్దనుని ఇంటనున్నాను. ప్రతర్దనుడు నన్ను రథంపై త్రిప్పుతున్నాడు. అప్పుడు ఒక బ్రాహ్మణుడు వచ్చి "నాకు ఒక గుర్రాన్ని ఇవ్వండి" అని యాచించాడు ప్రతర్దనుని. "మరలి వచ్చి ఇస్తాను" అన్నాడు ప్రతర్దనుడు. "వెంటనే ఇవ్వండి" అన్నాడు బ్రాహ్మణుడు. "సరే" అంటూ రథానికి దక్షిణం వైపు ఉన్న గుర్రాన్ని విడిపించి బ్రాహ్మణున కిచ్చాడు. ఆపై గుర్రాన్ని యాచిస్తూ మరొకబ్రాహ్మణుడు వచ్చాడు. ఇంతకుముందువలె రథానికి ఎడమవైపునున్న గుర్రాన్ని విప్పి బ్రాహ్మణున కిచ్చాడు. తదుపరి గుర్రాన్ని యాచిస్తూ మరొక బ్రాహ్మణుడు వచ్చాడు. ఆయన కూడా వెంటనే కావాలన్నాడు. ప్రతర్దనుడు ఎడమవైపు భారాన్ని మోస్తున్న గుర్రాన్ని విప్పి ఇచ్చాడు. ఆయన వెళ్లిపోయాడు. మరల ఇంకొక బ్రాహ్మణుడు గుర్రానికై యాచించాడు. "త్వరగా గమ్యాన్ని చేరినతర్వాత ఇస్తాను" అన్నాడు ప్రతర్దనుడు. వెంటనే కావా లన్నాడు బ్రాహ్మణుడు. వెంటనే ఆ బ్రాహ్మణునకు నాలుగవ గుర్రాన్ని ఇచ్చి రథభారాన్ని తానుమోస్తూ "బ్రాహ్మణులకు యుక్తాయుక్త వివేకం ఉండదు" అన్నాడు. బ్రాహ్మణులకు దానం చేసివారికై కోపగించాడు. ఆ విధంగా మాటాడాడు. కాబట్టి ముందుగా వెనుదిరగవలసి ఉంటుంది." "మేమిద్దరమే మిగిలి ఉంటే మాలో ఎవరు ముందుగా మరలిరావాలి" అని అడిగారు వారు.

"వసుమనుడు రావలసి ఉంటుంది" అన్నాడు నారదుడు. "కారణ మేమిటి?" వారు అడిగారు. అప్పుడు నారదు డిలా అన్నాడు. నేను లోకసంచారం చేస్తూ వసుమనుని ఇంటికి వచ్చాను. ఆ రోజు అక్కడ స్వస్తివాచనం జరుగుతోంది. పుష్పరథం కోసం నేను అక్కడకు వెళ్ళాను. బ్రాహ్మణులు స్వస్తివచనం ముగించగానే వారికి పుష్పరథాన్ని చూపించారు. నేను ఆ రథాన్ని ప్రశంసించాను. "దీనిని ప్రశంసించారు కాబట్టి ఈ రథం మీదే" అన్నాడు రాజు. నేను మరొకసారి ఆయన దగ్గరకు వెళ్ళాను. అప్పుడు కూడా పుష్పరథం

కోసం వెళ్ళాను. "స్వామీ! ఈ రథంమీదే" అని రాజు ఆదరంతో చెప్పాడు. నేను మరల మూడవసారి వెళ్ళి స్వస్తివచనాన్ని చక్కగా జరిపించాను. రాజు రథాన్ని బ్రాహ్మణులకు చూపిస్తూ నన్ను చూచి "మీరు స్వస్తివాచనాన్ని చక్కగా జరిపించారు" అన్నాడు (కానీ రథాన్ని ఇవ్వలేదు). ఈ ద్రోహవచనం కారణంగా వసుమనుడే దిగవలసి వస్తుంది.

"మీ ఇద్దరిలో ఒక్కరే వెళ్ళవలసివస్తే ఎవరు దిగాలి" అని మరల అడిగారు. నారదుడు ఇలా అన్నాడు. "శిబి వెళతాడు. నేను దిగిపోతాను" అన్నాడు నారదుడు. వారు కారణమడగగా నారదుడు ఇలా చెప్పాడు. 'నేను శిబితో సమానుడను కాను. ఒకసారి ఒక బ్రాహ్మణుడు అన్నార్థియై శిబి దగ్గరకు వచ్చాడు. "అన్నం కావాలి" అన్నాడు. "ఏం చేయాలో ఆదేశించండి" అన్నాడు శిబి. బ్రాహ్మణుడిలా అన్నాడు. "నీ కుమారుని బృహద్గర్భుని చంపు. వానిని వండు. నాకోసం నిరీక్షించు." అప్పుడు శిబి కుమారుని చంపి, సంస్కారం జరిపించి, వంట చేయించి, పాత్రలలో పెట్టించి, వాటిని తలపై పెట్టుకొని బ్రాహ్మణునికై వెదికాడు. రాజు అలా వెదుకుతుంటే ఎవరో "ఆ బ్రాహ్మణుడు కోపంతో నగరంలో ప్రవేశించి రాజగృహాన్ని, కోశాగారాన్నీ, ఆయుధాగారాన్నీ, అంతఃపురాన్నీ, అశ్వశాలను, గజశాలను తగులబెడుతున్నా"డని చెప్పారు. అది విని కూడా శిబిముఖంలో ఏ మార్పూలేకుండా నగరంలోనికి ప్రవేశించి "స్వామీ! అన్నం సిద్ధమైంది" అని బ్రాహ్మణునితో అన్నాడు. బ్రాహ్మణుడు ఏమీ పలుకలేదు. ఆశ్చర్యంతో తలవాల్చి నిలిచాడు. "స్వామీ! భుజించండి" అని బ్రాహ్మణుని బ్రతిమిలాడాడు రాజు. రెండు క్షణాల తరువాత పైకి చూచి బ్రాహ్మణుడు శిబితో ఇలా అన్నాడు. "నీవే దీనిని తిను" శిబి 'అలాగే' అని మనస్సులో ఏమీ పెట్టుకోకుండా ఆయనను అర్చించి గిన్నె తీసుకొని, భుజింప నారంభించాడు. అప్పుడు బ్రాహ్మణుడు ఆయన చేయి పట్టుకొన్నాడు. ఇలా అన్నాడు., "నీవు కోపాన్ని జయించావు. బ్రాహ్మణుల కివ్వరానిదంటూ నీదగ్గర ఏదీలేదు" అలా అంటూ శిబిని ఆదరించాడు. రాజు అలా తలపైకెత్తగానే కుమారుడెదురుగా నిలిచి కనిపించాడు. దేవకుమారునివలె పుణ్యగంధాలతో, ఆభరణాలతో అలంకరింపబడి ఉన్నాడు. బ్రాహ్మణుడు సమస్తాన్నీ యథాపూర్వకంగా చేసి మాయమయ్యాడు.

రాజును పరీక్షించటానికై బ్రహ్మయే బ్రాహ్మణరూపాన్ని ధరించి వచ్చాడు. బ్రాహ్మణుడు అదృశ్యం కాగానే "తెలిసి తెలిసి ఇంత సాహసమెందుకు చేశా"రని మంత్రులు శిబిని అడిగారు. శిబి ఇలా అన్నాడు. **నేను కీర్తికోసం కానీ, సంపదకోసం కానీ, భోగాశతో కానీ దానాలనివ్వటం లేదు.** పాపాత్ములు ఈ బాటలో నడవలేరు. అందుకనే ఇదంతా చేస్తున్నాను. సత్పురుషులు నిత్యమూ నడిచేదే ఉత్తమమార్గం. కాబట్టి నా బుద్ధి సన్మార్గాన్నే

అనుసరిస్తుంది. ఇది శిబి వంశీయుల గొప్పతనం. అందుకే యథాతథంగా ఎరిగి అనుసరిస్తున్నాను.'

199. ఇంద్రద్యుమ్నుని వృత్తాంతము.

ఋషులు ,పాండవులు మార్కండేయుని ఇలా అడిగారు - 'నీకన్నా ముందు పుట్టి ఉన్న వారెవరైనా ఉన్నారా?' ఆయన వారితో ఇలా అన్నాడు - ఇంద్రద్యుమ్నుడనే రాజర్షి ఉన్నాడు. ఒకప్పుడు పుణ్యం నశించి, "నీకీర్తి ముగిసింది" అని స్వర్గం నుండి గెంటివేయబడ్డాడు. ఆయన నాదగ్గరకు వచ్చి "నీవు నన్ను గుర్తించగలవా" అని అడిగాడు. నేను ఆయనతో ఇలా అన్నాను - "మేము పుణ్యంకోసం, జపతపాదులతో వ్యగ్రులమై ఉంటాం. చెట్లనీడలలో ఉంటూ ఎక్కడా స్థిరంగా నిలువం. ఒక్కొక్క గ్రామంలో ఒక్కొక్క రాత్రి నివసిస్తాం. మా పనులనే మేము మరచిపోతుంటాం. శరీరాన్ని కృశింపజేస్తున్నందువల్ల మా అనుష్ఠానాలనే మేము ప్రారంభించలేకపోతుంటాము. నిన్నెక్కడ గుర్తించుకొనగలం" అలా అనగానే రాజర్షియైన ఇంద్రద్యుమ్నుడు మరల ఇలా అడిగాడు- 'నీకన్న ముందు పుట్టిన వారెవరయినా ఉన్నారా?' అతనితో మరల ఇలా చెప్పాను. హిమాలయపర్వతంపై ప్రావారకర్ణుడనే పేరుగల గుడ్లగూబ నివసిస్తోంది. అది నాకన్నముందు పుట్టినది. దానికి నీవు తెలిసి ఉండవచ్చు. ఇక్కడనుండి చాలాదూరం వెళితే హిమాలయం వస్తుంది. అక్కడ అది నివసిస్తోంది. 'అప్పుడు ఇంద్రద్యుమ్నుడు అశ్వరూపాన్ని ధరించి అక్కడకు నన్ను తీసికొనిపోయాడు. "నీకు నేను తెలుసా?" అని రాజు ఆ గ్రుడ్లగూబను అడిగాడు. అది కొంతసేపు ఆలోచించి "నిన్ను నేనెరుగను" అని. చెప్పింది. ఆ రాజర్షి మరల గుడ్లగూబను ఇలా అడిగాడు. "నీకన్న ముందుపుట్టిన చిరంజీవి ఎవరైనా ఉన్నారా?" అపుడు గుడ్లగూబ" ఉన్నది. ఇంద్రద్యుమ్నమనే సరస్సు ఉన్నది. అక్కడ నాడీజంఘుడు అనే పేరుగల కొంగ నివసిస్తోంది. నాకన్న ముందు పుట్టిన దది. వెళ్లి దానినడుగు" అన్నది. అపుడు ఇంద్రద్యుమ్నుడు నన్నూ, గుడ్లగూబనూ కూడా వెంటబెట్టుకొని నాడీజంఘుడు నివసించే సరస్సు దగ్గరకు వెళ్ళాడు. "ఈ ఇంద్రద్యుమ్నరాజును నీవెరుగుదువా" అని మేము దాన్ని అడిగాము. అది కొంతసేపు ఆలోచించి "ఇంద్రద్యుమ్నుని నేనెరుగను" అన్నది. "నీకన్నా ముందు పుట్టినవారెవరైనా ఉన్నారా?" అని మేము దానిని అడిగాము." 'ఈ సరస్సులోనే అకూపారమను పేరుగల తాబేలు ఉన్నది. అది నాకన్న ముందు పుట్టినది. ఏదోరీతిగా దానికి ఈ రాజు తెలిసి ఉండవచ్చు. వెళ్ళి ఆ అకూపారాన్ని అడగండి" అని నాడీజంఘుడు చెప్పాడు.

అప్పుడు ఆ కొంగ అకూపారమనే ఆ తాబేటితో "మా కవసరమయిన ఒక విషయాన్ని నిన్ను అడగాలని వచ్చాము. బయటకు రా" అన్నది. అది విని ఆ తాబేలు సరస్సు నుండి లేచి మేము నిలచియున్న ఒడ్డు దగ్గరకు వచ్చింది. రాగానే "నీవు ఇంద్రద్యుమ్న రాజును ఎరుగుదువా?" అని మేము దానిని అడిగాము. ఆ తాబేలు ముహూర్తకాలం చింతించి, కన్నులలో నీరు నింపుకొని, ఉద్విగ్నహృదయంతో వణుకుతూ చైతన్యాన్ని కోల్పోయినట్లు నిలిచి, చేతులు జోడించి "ఇతనిని నేనెరుగనా? ఇతడు వేయిసార్లు అగ్ని చితులయందు యూపస్తంభాలను ప్రతిష్ఠించాడు. ఇతడు యాగదక్షిణగా ఇచ్చిన గోవుల రాకపోకలవలన ఈ సరస్సు ఏర్పడింది. దానిలో నేను నివసిస్తున్నాను" అని పలికింది. తాబేలు చెప్పిన ఈ విషయమంతా వినగానే దేవలోకం నుండి దేవరథం వచ్చింది. "రాజా! నీవు స్వర్గానికి రావచ్చు. అక్కడ నీవు తగిన స్థానాన్ని పొందవచ్చు. నీవు కీర్తిశాలివి. నిశ్చింతగా స్వర్గంవైపు పయనించు" అన్న మాటకూడా వినిపించింది. ఈ విషయంలో ఈ శ్లోకాలు కనిపిస్తున్నాయి. **పుణ్యకర్మల శబ్దం భూలోక దేవలోకాలను తాకుతుంది. ఆ ధ్వని విన్పించినంతకాలం ఆ పురుషుడు స్వర్గనివాసి అవుతాడు. ఎవని అపకీర్తి లోకంలో ప్రస్తావనకు వస్తుంటుందో అతడు ఆ అపకీర్తిధ్వని వినిపించినంతకాలం అధోలోకాలలో పడి ఉంటాడు.* కాబట్టి నరుడు అనంత కీర్తి కోసం ఎప్పుడూ మంచిపనులనే చేస్తుండాలి. పాపబుద్ధిని విడనాడి ధర్మాన్ని ఆశ్రయించి ఉండాలి.** దేవదూత మాటవిని రాజు "ఈవృద్ధులను యథాస్థానంలో నిలిపేదాకా ఆగు" అని అన్నాడు. ఆ మాట పలికి రాజు నన్ను, ప్రావారకర్ణుడను పేరుగల ఆ గుడ్లగూబను తగినస్థానంలో నిలిపి, ఆ రథంలోనే పయనించి తనకు తగిన స్థానానికి చేరుకొన్నాడు. ఇదంతా చిరంజీవినైన నా అనుభవం లోనికి వచ్చిన సంగతి" అని మార్కండేయమహర్షి పాండవులతో అన్నాడు. పాండవులిలా అన్నారు. 'స్వర్గభ్రష్టుడైన ఇంద్రద్యుమ్న మహారాజును తన స్థానానికి పంపించి మంచి పని చేశారు తమరు.' అది విని మార్కండేయుడు ఇలా అన్నాడు. "దేవకీనందనుడైన ఈ కృష్ణుడు కూడా నరకంలో మునిగి ఉన్న నృగుని ఆ కష్టం నుండి ఉద్ధరించి మరల స్వర్గానికి పంపించాడు."

---

* భవంతి చాత్ర శ్లోకాः దివం స్పృశతి భూమిం చ శబ్దः పుణ్యస్య కర్మణः ।
యావత్ స శబ్దో భవతి తావత్ పురుష ఉచ్యతే ॥ 13
అకీర్తిः కీర్త్యతే లోకే యస్య భూతస్య కస్యచిత్ ।
స పతత్యధర్మాన్ లోకాన్ యావచ్ఛబ్దः ప్రకీర్త్యతే ॥ 14

200. దానము, శ్రాద్ధము, అతిథిసత్కారము, వాక్శుద్ధి, గాయత్రీజపము - మొదలగు వాని వర్ణనము.

మహానుభావుడైన మార్కండేయుని ద్వారా రాజర్షి అయిన ఇంద్రద్యుమ్నుడు మరల స్వర్గానికి వెళ్ళిన వృత్తాంతాన్ని విని, యుధిష్ఠిరమహారాజు మార్కండేయుని మరల ఇలా అడిగాడు. 'మహర్షీ! ఎటువంటి పరిస్థితులలో దానంచేసి మనుజుడు స్వర్గసుఖాలను పొందగలుగుతాడు? ఆ విషయాన్ని నాకు వివరించండి. మనుజుడు బాల్యావస్థలోకానీ, గృహస్థావస్థలో కానీ, యౌవనదశలోకానీ, వార్ధక్యంలో కానీ దానం చేస్తే ఎటువంటి ఫలితాన్ని పొందగలడు? అది నాకు చెప్పు.' మార్కండేయు డిలా అన్నాడు. 'జన్మలు నాలుగువిధాలుగా, దానాలు పదహారు రకాలుగా నిరర్థకా లవుతాయి. (1) పుత్రహీనుని జన్మ వ్యర్థం (2) ధర్మభ్రష్టుల జన్మ వ్యర్థం (3) ఇతరుల ఇంటనే తింటూ బ్రతికేవాడి జన్మ వ్యర్థం (4) తనకోసమే వండుకొంటూ ఇతరులకు పెట్టకుండా తినే వాని జన్మ వ్యర్థం. (1) ఆరూఢపతితునకు (సంన్యాసం నుండి మరల సంసారి అయినవాడు) ఇచ్చిన దానం వ్యర్థం. (2) అన్యాయార్జితమైన దానిని దానం చేయటం వ్యర్థం (3) భ్రష్టబ్రాహ్మణునకో (4) దొంగబ్రాహ్మణునకో ఇచ్చిన దానం వ్యర్థం (5) గురువునకు (6)అసత్యవాదికి (7) పాపాత్మునకు (8) కృతఘ్నునకు (9) గ్రామపురోహితునకు (10) వేదవిక్రేతకు (11) శూద్రునకు వివాహాదులు చేయించేవానికి (12) నీచ బ్రాహ్మణునకు (13) ప్రౌఢస్త్రీని పెండ్లాడిన బ్రాహ్మణునకు (14) స్త్రీలకు (15) పాములవానికి (16) సేవకులకు ఇచ్చిన దానం వ్యర్థం. ఈవిధంగా పదహారు రకాల దానాలు నిరర్థకాలు. (ఇవి దానాల లెక్కలోనికి రావు.) తమోగుణానికి లోనై భయంతోనో, క్రోధంతోనో దానం చేస్తే ఆ దానఫలాన్ని(దుఃఖాన్ని) మరుజన్మలో గర్భావస్థలో అనుభవిస్తాడు. బ్రాహ్మణులకు దానంచేసినవాడు ఆ ఫలితాన్ని తాను ఎదిగిన తర్వాత ఇష్టానుసారంగా అనుభవిస్తాడు. కాబట్టి రాజా! స్వర్గమార్గాన్ని జయింపదలచి సర్వావస్థలలోనూ బ్రాహ్మణులకు సర్వదానాలను ఇవ్వాలి.'

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'నాలుగు వర్ణాలవారి నుండి దానాలను స్వీకరిస్తున్న బ్రాహ్మణులు ఏ విశేషం కారణంగా తాము తరించి ఇతరులను తరింపజేయగలుగుతారు.' మార్కండేయుడిలా అన్నాడు. 'బ్రాహ్మణులు జపాలతో, మంత్రాలతో, హోమాలతో, స్వశాఖాధ్యయనాలతో వేదమయమయిన నావను తయారుచేసి తాము తరించి ఇతరులను తరింపజేస్తారు. బ్రాహ్మణులను తృప్తిపరిస్తే దేవతలు తృప్తిపడతారు. విప్రులమాట చేతనే స్వర్గలోకాన్ని కూడా పొందవచ్చు. పితరులను, దేవతలను పూజించటం ద్వారా

నీవు అనంతపుణ్యలోకాలను పొందగలవు. అనుమానం లేదు. శ్లేష్మాదులు శరీరాన్ని ఆవరించినా, చావు ముంచుకొస్తున్నా, చైతన్యాన్ని కోల్పోతున్నా పుణ్యస్వర్గలోకాన్ని చేరాలంటే బ్రాహ్మణులను పూజించాలి. శ్రాద్ధవేళలో ప్రయత్నించి ఉత్తమబ్రాహ్మణులనే నిమంత్రించాలి. దుష్టవర్ణంకల వానిని, పిప్పిగోళ్ళవానిని, కుష్ఠరోగిని, మాయావిని, కుండుని (మాతృవ్యభిచారం వలన పుట్టిన వానిని), గోళకుని (విధవా స్త్రీకి పుట్టినవానిని), వీపుపై అమ్ములపొది గలవానిని ప్రయత్నపూర్వకంగా పరిహరించాలి. శ్రాద్ధం దూషితమయితే అది అగ్ని ఇంధనాన్ని తగలబెట్టినట్టు యజమానిని దహిస్తుంది. మూగవాడు, గ్రుడ్డివాడు, చెవిటివాడు మొదలయినవారు శ్రాద్ధంలో పరిహరణీయులు అయినా వేదపండితులతో కలిపి వారిని నిమంత్రించవచ్చు. దానం స్వీకరించేవాడు తనను, దాతను కూడా తరింపజేయగల శక్తిగలవాడై ఉండాలి. అటువంటివారెవరో చెపుతా విను. సర్వశాస్త్రాలు తెలిసిన మనిషి తనను, దాతను కూడా తరింపజేయగల బ్రాహ్మణునకే దానమివ్వాలి. అతడే శక్తిమంతుడైన బ్రాహ్మణుడు.

కౌంతేయా! అతిథులకు భోజనంపెడితే అగ్నులు సంతసిస్తాయి. హవిస్సును ఆహుతి చేసినా, పూలు చల్లినా, గంధం పూసినా కూడా అగ్నులకు అంత ఆనందం కలుగదు. కాబట్టి నీవు **సర్వప్రయత్నాలతోనూ అతిథులకు అన్నం పెట్టాలి.** అతిథులకు పాదోదకాన్ని, పాదఘృతాన్ని, దీపాన్ని, అన్నాన్ని, నివాసస్థానాన్ని ఇచ్చిన వారు యముని సమీపించరు. దేవనిర్మాల్యాన్ని తొలగించటం, బ్రాహ్మణుల ఎంగిళ్ళు ఎత్తి శుభ్రపరచటం, వారిని గంధమాల్యాదులతో సత్కరించటం, సేవ చేయటం, కాళ్ళు ఒత్తటం - వీటిలో ఒక్కొక్కటీ గోదానం కన్నా గొప్పవి. కపిలగోవును దానంచేస్తే ముక్తి లభిస్తుంది. అనుమానం లేదు. కాబట్టి సాలంకృత అయిన కపిలగోవును బ్రాహ్మణునకు దాన మివ్వాలి. దానంపట్టే ద్విజుడు శ్రోత్రియుడు, దరిద్రుడు, గృహస్థుడు, నిత్యాగ్నిహోత్రి, ఆలుబిడ్డల నిరాదరణను సహించేవాడు, దాతకు ప్రత్యుపకారం చేయలేనివాడు అయిఉండాలి. ఇటువంటివారికి దానం చేయాలి కానీ సంపన్నులకు కాదు. ధనవంతులకు దానం చేస్తే దానివలన లాభ మేముంటుంది? ఒకగోవును ఒక్కరికే దానమివ్వాలి కానీ చాలామందికి కలిపి ఇవ్వకూడదు. అందరూ పంచుకోదలచి వారు ఆ గోవును అమ్మితే దాతయొక్క మూడుతరాలకు అది హాని చేస్తుంది. దాతను కానీ, దానం పట్టిన బ్రాహ్మణుని కానీ అది తరింపజేయదు. ఉత్తమవర్ణంగల పవిత్రబ్రాహ్మణునకు సువర్ణదానం చేస్తే దాతకు నిరంతరంగా శతసువర్ణదానఫలం లభిస్తుంది. బరువులు మోయగల బలిష్ఠమైన ఎద్దును దానం చేస్తే

దాత ఇబ్బందులను దాటి, స్వర్గలోకానికి కూడా వెళ్ళగలుగుతాడు. పండితు డయిన బ్రాహ్మణునకు భూదానమిస్తే దాత కోరిన భోగాలన్నీ ఆయన దరిజేరుతాయి.

దారిలో ఒళ్ళంతా నలిగి, కాళ్ళంతా దుమ్ము కొట్టుకొని అలసిపోయి అన్నదాతకై అన్వేషించే వారికి అన్నంపెట్టే వానిని చూపించినవానికి కూడా అన్నదానఫలం లభిస్తుంది. అన్నదాతతో సమానంగా అతడూ కీర్తింపబడతాడు. కాబట్టి నీవు **ఇతరదానాలను వదలిపెట్టి కేవలం అన్నదానం చేయి.** అన్నదానం వంటి విచిత్రదానం కానీ, పుణ్యదాయకమైన దానం కానీ లేదు. బ్రాహ్మణులకు చక్కగా వండిన అన్నాన్ని యథాశక్తిగా పెట్టినవాడు ఆ దానంతో బ్రహ్మలోకాన్ని చేరగల్గుతాడు. అన్నమే గొప్పది. దాని కన్న గొప్పది లేదు. అన్నమే బ్రహ్మ. అదియే సంవత్సరం. సంవత్సరమంటే యజ్ఞం. యజ్ఞంలో సమస్తమూ ఉంది. యజ్ఞం నుండి స్థావరజంగమరూపా లయిన సమస్త ప్రాణులూ జన్మిస్తాయి. కాబట్టి అన్నమే సర్వపదార్థాలలోనూ శ్రేష్ఠమని ప్రసిద్ధి. పెద్దపెద్ద చెరువులను, బావులను, దిగుడు బావులను త్రవ్వించినవారు, అన్నదానం చేసినవారు, మంచిగా మాటాడేవారు యమధర్మరాజు పేరు కూడా విననక్కరలేదు. ధాన్యాన్ని, కష్టపడి సంపాదించిన ధనాన్ని సత్ప్రభావంగల విప్రునకు దానం చేసిన వానిని చూచి భూదేవి ఆనందిస్తుంది. అతనికై ధనధారలను కురిపిస్తుంది. అన్నదాత ముందుగా, ఆపై సత్యవాది, ఆ తరువాత అడగకపోయినా దానం చేసేవాడు – ఈ ముగ్గురు పుణ్యాత్ములతో సమంగా స్వర్గలోకానికి వెళతారు.

యుధిష్ఠిరుడు కుతూహలంతో తమ్ములతో కలిసి మహాత్ముడైన మార్కండేయుని మరలా ఇలా అడిగాడు. 'మహర్షీ! మానవలోకం నుండి యమలోకానికి ఎంత దూరం? ఆ దారి ఎటువంటిది? ఎంతది? ఏ ఉపాయంతో మనుష్యులు ఆ మార్గం దాటుతారు? నాకు చెప్పండి.' మార్కండేయుడిలా అన్నాడు. 'రాజా! నీవడిగిన ప్రశ్న అతిరహస్యం, పవిత్రం, ధర్మసమ్మతం, మహర్షులు ప్రశంసించే దీనిని వివరిస్తాను. విను. మానవలోకం నుండి యమలోకం ఎనభైయారువేల యోజనాల దూరంలో ఉన్నది. ఆ దారిలో నీరులేని ఆకాశం మాత్రమే ఉంటుంది. అది భయంకరమైనది, దుర్గమం కూడా. ప్రయాణంలో అలసిపోయిన వారు మార్గమధ్యంలో విశ్రమించటానికి చెట్లనీడ కానీ నీరు కానీ, నిలయం కానీ అక్కడ దొరకవు. యమధర్మరాజు ఆదేశం మేరకు యమదూతలు పురుషులను, స్త్రీలను, లోకంలోని ఇతరజీవులను బలవంతంగా ఆ దారిన కొనిపోతారు. బ్రాహ్మణులకు వివిధజాతులకు చెందిన గుర్రాలు మొదలగు వానిని దానంచేసినవారు ఆ బాటలో ఆ వాహనాలపై వెళతారు. గొడుగులు దానం చేసినవారు ఆ గొడుగులతోనే ఎండను కాచుకొంటూ వెళతారు. అన్నదాతలు తృప్తిగా వెళతారు. అన్నదానం చేయనివారు తృప్తి

లేకుండా వెళతారు. వస్త్రదాతలు వస్త్రాలతో, వస్త్రదానం చేయనివారు వస్త్రాలు లేకుండా వెళతారు. స్వర్ణదానం చేసినవారు చక్కని అలంకారాలతో వెళతారు. భూదానం చేసినవారు సర్వకామాలతో తృప్తిజెందుతూ సుఖంగా వెళతారు. సస్యదానం చేసినవారు ఏ కష్టాలు లేకుండా వెళతారు. గృహదానం చేసినవారు విమానాలలో మరీ సుఖంగా వెళతారు. జలదానం చేసినవారు దప్పికలేకుండా ప్రసన్నమనస్కులై వెళతారు. దీపదానం చేసినవారు ఆ బాటను ప్రకాశింపజేస్తూ సుఖంగా వెళతారు.

గోదానం చేసినవారు సర్వపాపవిముక్తులై సుఖంగా వెళతారు. నెలంతా ఉపవాసం చేసినవారు హంసలు మోసే విమానంలో వెళతారు. ఆరురోజులు ఉపవాసం చేసినవారు నెమళ్ళు మోసే విమానంలో వెళతారు. పాండవా! ఏకభుక్తంతో మధ్యలో ఏమీ తినకుండా మూడురాత్రులు గడిపినవాడు అనామయలోకాలకు వెళతాడు. జలదానఫలితం దివ్యమైనది. ప్రేతలోకంలో సుఖాన్ని కల్గించగలది. జలదానం చేసినవారికై పుష్పోదక అనే నది అక్కడ ఉంటుంది. అమృతోపమైన చల్లని నీటిని అక్కడ వారు త్రాగుతారు. మహారాజా! చెడ్డపనులు చేసినవారికి ఆ నదీజలం మలినంగా ఉంటుంది. ఈరీతిగా ఆ నది అన్ని కోరికలూ తీరుస్తుంది. కాబట్టి రాజేంద్రా! నీవు కూడా ఇటువంటి బ్రాహ్మణులను యథావిధిగా పూజించు. **మార్గంలో ఒళ్ళుహూనమై, దుమ్ముకొట్టుకొని, అన్నదాతకోసమై అన్వేషిస్తూ ఆశగా ఇంటికి వచ్చినవానిని ఆదరపూర్వకంగా పూజించు. అతడు అతిథి. అందువలననే బ్రాహ్మణుడు(బ్రాహ్మణసమానుడు). అటువంటి అతిథి వెళ్ళిన ఇంటికి, ఇంద్రునితో సహా దేవతలందరూ వెళతారు. అతనిని పూజిస్తే వారంతా ఆనందిస్తారు.** నిరాకరిస్తే వారంతా నిరాశతో వెళతారు. కాబట్టి రాజేంద్రా! అటువంటి అతిథిని నీవు కూడా యథావిధిగా పూజించు. నీకీ విషయాన్ని వందలసార్లు చెప్పాను. ఇంకా ఏమి వినాలనుకొంటున్నావు.'

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'స్వామీ! తమరు వివరించే పుణ్యప్రదమైన ధర్మచర్చను వినాలని నాకు ఇంకా ఇంకా అనిపిస్తోంది.' మార్కండేయుడిలా అన్నాడు. 'రాజా! నేను ధర్మసంబద్ధమైన విషయాలను ఇంకా చెప్తాను. అవి ఎల్లప్పుడూ సర్వపాపాలను హరింపగలవి. సావధానుడవై విను. జ్యేష్ఠపుష్కరతీర్థంలో కపిలగోవును దానం చేస్తే వచ్చే ఫలితం బ్రాహ్మణుల కాళ్ళు కడగటంవలన కూడా వస్తుంది. బ్రాహ్మణుల పాదోదకంతో భూమి తడిసి ఉన్నంతకాలం పితృదేవతలు తామరాకులతో నీటిని త్రాగుతారు. బ్రాహ్మణుని స్వాగతిస్తే అగ్ని తృప్తిపడతాడు. ఆసన మిస్తే ఇంద్రుడు తృప్తిపడతాడు. కాళ్ళు కడిగితే పితరులు, భోజనంపెడితే ప్రజాపతి తృప్తిపడతారు. ఆవు ఈనే సమయంలో దూడకాళ్ళు, తలమాత్రమే కనిపిస్తున్న వేళలో

పవిత్రభావంతో ప్రయత్నపూర్వకంగా ఆ ఆవును దానమివ్వాలి. **ఆవు గర్భం నుండి బయటపడుతున్న దూడ ఆకాశంలోనే కనిపిస్తున్నంతసేపు, ఆవు ఈనటం పూర్తికానంతవరకు ఆ ఆవు భూదేవితో సమానం.** ధర్మరాజా! అటువంటి ఆవును దానంచేస్తే ఆ ఆవు రోమాలు, ఆ దూడ రోమాలు ఎన్ని ఉంటాయో అన్నివేల యుగాలు ఆ దాత స్వర్గంలో నిలుస్తాడు. బంగారునాసిక, వెండిగిట్టలు కూర్చి, సర్వరత్నాలతో అలంకరించి, నువ్వులతో ఆచ్ఛాదించి, కపిలగోవును దానం చేసినవాడు, ఆ దానాన్ని స్వీకరించి మరల మరొక సత్పురుషునకు దానం చేసినవాడు సర్వోన్నతఫలితాలను అనుభవిస్తారు. అటువంటి గోవును దానంచేసినవాడు సముద్రాలు, గుహలు, పర్వతాలు, అడవులు, తోటలతో సహా నాల్గుదిక్కుల మధ్యనున్న భూమిని దానం చేసినట్లే. సందేహం లేదు.

చేతులను మోకాళ్ళ లోపలనే ఉంచి, ఒకచేతినే కంచానికి తగిలిస్తూ మౌనంగా భోజనం చేసేవాడు తనను ఇతరులను కూడ తరింపజేయగలడు. సురాపానం చేయనివాడు, ఇతరులు వ్రేలెత్తి చూపుట కవకాశమివ్వనివాడు, నిత్యమూ సంహితాపారాన్ని చక్కగా జపించేవాడు ఇతరుల నెప్పుడూ తరింపజేయగలడు. హవ్యకవ్యాల(యజ్ఞ శ్రాద్ధాల)లోని సమస్తపదార్థాలను స్వీకరించటానికి శ్రోత్రియుడు అర్హుడు. సశ్రోత్రియున కర్పించినది జ్వలించే అగ్నికి ఆహుతిచేసిన దానితో సమానం. చక్కగా ఫలిస్తుంది. బ్రాహ్మణులకు క్రోధమే ఆయుధం. వారు శస్త్రాలతో యుద్ధం చేయరు. దేవేంద్రుడు వజ్రంతో రాక్షసులను సంహరించినట్లు బ్రాహ్మణులు క్రోధంతోనే దోషిని నశింపజేయగలరు. అనఘా! ధర్మయుక్తమయిన విషయమంతా నీకు చెప్పాను. ఇది విని నైమిశారణ్యవాసులయిన మునులు ఆనందించారు. రాజా! ఈ కథను విని మానవులు శోకభయాల నుండి, క్రోధాలనుండి బయటపడి పాపవిముక్తులై మోక్షాన్ని పొందుతారు.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'ధార్మికశ్రేష్ఠా! మహాజ్ఞానీ! బ్రాహ్మణుని సదా పవిత్రుని చేయగల శౌచం ఏది? వినాలనుకొంటున్నాను.' మార్కండేయుడిలా అన్నాడు. 'వాక్కులలో శౌచం, కర్మలలో శౌచం, జలశౌచం - ఈ మూడు శౌచాలు గల విప్రుడు స్వర్గాన్ని పొందగలడు. సందేహం లేదు. ఉదయమూ, సాయంకాలమూ కూడా వేదమాత, పవిత్రదేవి అయిన గాయిత్రిని జపిస్తూ సంధ్యావందన మాచరించిన బ్రాహ్మణుడు ఆ దేవిచే పవిత్రీకృతుడై పాపాలను పోగొట్టుకొంటాడు. అటువంటివాడు సాగరపర్యంతమైన భూమిని దానం పట్టినా కష్టాలపాలు కాడు. అటువంటివానికి సూర్యాదిగ్రహాలలో ఏవైనా ప్రతికూలంగా ఉన్నా కూడా అవి సౌమ్యంగా, సుఖకరంగా, శుభకరంగా మారుతాయి. భీకరులు, మాంసభక్షకులు,

ఘోరరూపులు, మహాకాయులు అయిన రాక్షసులు కూడా గాయత్రీ జపపరాయణుడైన బ్రాహ్మణునిపై పడలేరు. సంధ్యోపాసనచేసే ద్విజులు మండే అగ్నివంటివారు. వారు అధ్యాపన చేసినా, యాగాలు చేయించినా, పరుల నుండి దానాలు స్వీకరించినా దోషం లేదు. బ్రాహ్మణులు వేదాన్ని బాగా చదివినా, చదవకపోయినా, సంస్కారవంతు లయినా, సంస్కారహీను లయినా వారిని పరాభవించరాదు. వారు నివురుకప్పిన నిప్పువంటి వారు. జ్వలించే అగ్ని శ్మశానంలో అయినా· దోషరహిత మయినట్లు బ్రాహ్మణుడు పండితు డయినా, అపండితు డయినా గొప్పదేవతతో సమానం. గొప్పప్రాకారాలు, పురద్వారాలు, వివిధభవనాలూ ఉన్నా బ్రాహ్మణోత్తములు లేని నగరాలు శోభించవు. రాజా! వేదవేత్తలు, సదాచారులు, జ్ఞానులు, తపస్వులు అయిన బ్రాహ్మణులు ఎక్కడుంటే అదే నగరం. కౌంతేయా! అది పల్లె అయినా, అరణ్య మయినా బహువేదవేత్త లయిన బ్రాహ్మణు లుంటే అదే నగరం, అదే తీర్థం.

రక్షకుడైన రాజును, తపస్వి అయిన బ్రాహ్మణుని పమిూపించి, అర్చించినవాడు వెంటనే పాపాలనుండి విముక్తి నందుతాడు.* పుణ్యతీర్థాలలో స్నానం చేయటం, పవిత్రమంత్రాలను పరించటం, సజ్జనులతో సంభాషించటం – ఇవి సత్కర్మలని పండితు లంటారు. సజ్జనసమాగమంచేత పవిత్రమయిన వాక్కులతో పలికిన సుభాషిత మనే జలంతో తాము పవిత్రులయినట్లు సజ్జనులు ఎప్పుడూ భావిస్తుంటారు. త్రిదండధారణం, మౌనం, జటాభారం, శిరోముండనం, వల్కలాజినధారణం, వ్రతాచరణం, పవిత్రస్నానం, అగ్నిహోత్రం, వనవాసం, శరీరాన్ని శుష్కింపజేయటం – మనస్సు నిర్మలంగా లేకపోతే ఇవన్నీ దండగ. కన్ను మొదలయిన ఆరు ఇంద్రియాల విషయాలను వాటిలో శుద్ధి లేకపోయినా అనుభవించటం తెలికే. వాటిని విడిచిపెట్టడం మాత్రం శుద్ధిలేనిదే జరగదు. అది దుష్కరం. ఇంద్రియాలను స్వేచ్ఛగా ప్రవర్తింపజేసే మనస్సును వశపరచుకోవటం కూడా దుస్సాధ్యం. మనోవాక్కర్మలచేత పాపాలు చేయనివారే మహాత్ములు, వారే తపస్వులు. అంతేకానీ శరీరాన్ని శుష్కింపజేయటం తపస్సు కాదు. శరీరాన్ని పవిత్రీకరించుకొని, పాపకర్మలు మానినా దాయాదులపై దయలేకపోతే ఆ క్రూరతత్వం అతని తపస్సును నాశనం చేస్తుంది. భోజనం మానటమే తపస్సు కాదు. **ఎప్పుడూ ఇంటిలోనే ఉన్నా, పవిత్రభావంతో, సద్గుణాలతో, యావజ్జీవమూ భూతదయతో ఉంటే అతడే ముని. పాపవిముక్తి కూడా అతనికే కలుగుతుంది.**

---

* రక్షితారం చ రాజానం బ్రాహ్మణం చ తపస్వినమ్ ।
అభిగమ్యాభివూజ్యాథ పద్యః పాపాత్ ప్రముచ్యతే ॥ 93

భోజనం మానినంతమాత్రాన పాపప్రక్షాళనం జరుగదు. భోజనం మానితే రక్తమాంసాలుగల శరీరం మాత్రమే క్షీణిస్తుంది. శాస్త్రవిహితం కాని కర్మలను ఆచరించటం వలన క్లేశమే కానీ పాపం నశించదు. అగ్నిహోత్రాదులు కూడా శ్రద్ధలేనివాని పాపాలను దహింపజేయలేవు. పుణ్యంవలననే ఉత్తమగతులు పొందగలరు. ఉపవాసాలు కూడా పవిత్రభావనతోనే శుద్ధి కారణాలు అవుతాయి. కందమూలఫలాలు తిన్నంతమాత్రాన, మౌనాన్ని పూనినంత మాత్రాన, గాలిని ఆహారంగా తీసికొనినంతమాత్రాన, సన్యాసం స్వీకరించినంతమాత్రాన, ఇల్లువిడిచి వెళ్ళినంత మాత్రాన, జడలు ధరించినంతమాత్రాన, వ్రతంకోసం నేలపై పరుండినంతమాత్రాన, రోజూ ఉపవాసమున్నంతమాత్రాన, నిత్యాగ్నిహోత్రం చేసినంతమాత్రాన, గంగాది తీర్థములలో దేహత్యాగం చేసినంతమాత్రాన, నేలపైనే పండుకొన్నంతమాత్రాన, పవిత్రత కలుగదు. తత్త్వజ్ఞానం వలన కానీ, సత్కర్మలవలన కానీ జరామరణాలు, వ్యాధులు నశిస్తాయి. ఉత్తమగతులు సిద్ధిస్తాయి. నిప్పులో కాలిన గింజలు మొలకెత్తనట్లు జ్ఞానదగ్ధాలైన కర్మలు మరలా ఆత్మను అంటవు. ఆత్మ విడిచిన తర్వాత శరీరం కట్టె, గోడలవంటిది. మహాసాగరంలో పుట్టిన నురగలాగా నశించిపోతుంది. సందేహం లేదు. శ్లోకంతో కానీ, శ్లోకార్ధంతో కానీ సమస్తప్రాణుల హృదయాలలో శయనించి ఉన్న పరమాత్మను తెలిసినవానికి సర్వశాస్త్రాధ్యయన ప్రయోజనం పూర్తి అయినట్లే.

కొందరు 'తత్త్వమ్' అన్న రెండక్షరాలతోనే పరమాత్మజ్ఞానాన్ని పొందుతారు. మరికొందరు పదాలతో, శ్లోకాలతో గూడిన వందలు వేలు శాస్త్రాంతరాలు చదివి పరమాత్మను గ్రహిస్తారు. **ఏది ఏమైనా జ్ఞానమే మోక్షలక్షణం.** సంశయగ్రస్తునకు ఇహపరలోకాలూ రెండూ ఉండవని జ్ఞాను లయిన పెద్దలు చెపుతుంటారు. **జ్ఞానమే మోక్షలక్షణమని పెద్దలమాట.** వేదార్థం గ్రహించి, వేదాలప్రయోజనాన్ని చక్కగా తెలిసినవాడు దావాగ్నిని చూసి మానవుడు దూరంగా పోయినట్లు వేదాలనుండి దూరంగా వెళతాడు.

ప్రణవస్వరూపు డయిన పరమాత్మతత్త్వాన్ని యుక్తిపూర్వకంగా తెలిసికొనాలంటే శుష్కతర్కాన్ని వీడి శ్రుతి, స్మృతులను ఆశ్రయించాలి. వాటిని ఆశ్రయించకపోయినా, సాధనసంపత్తి లేకపోయినా తత్త్వనిర్ణయం కుదరదు. పరమాత్మతత్త్వజ్ఞానాన్ని వేదాలద్వారానే గ్రహించాలి. పరమాత్మ వేదస్వరూపుడు. వేదం ఆయన శరీరం. పరమాత్మను పొందించటంలో వేదమే హేతువు. పరమాత్మ వేదవేద్యం కాబట్టి జీవాత్మ స్వయంగా దానిని గ్రహించలేడు. దేవతల ఆయుస్సు, కర్మలఫలితం మొదలయిన విషయాలను వేదాలు నిర్దేశిస్తాయి. వాటి ననుసరించియే జీవులప్రభావం ప్రతియుగంలోనూ ఫలిస్తుంటుంది. కాబట్టి మనిషి

ఇంద్రియాలశుద్ధిద్వారా విషయభోగాలను పరిత్యజించాలి. ఇంద్రియనిరోధం వలన ఏర్పడిన భోగరాహిత్యం దివ్య మైనది. **తపస్సుచే స్వర్గప్రాప్తి, దానంచేత భోగం, జ్ఞానం ద్వారా మోక్షం, తీర్థస్నానంతో పాపనాశనమూ కలుగుతాయి.***

మార్కండేయుడు ఆ రీతిగా చెప్పగానే మహాయశస్వి అయిన యుధిష్ఠిరుడు "స్వామీ! దానం చేయటంలో ఉత్తమమూ, ప్రధానమూ అయిన విధి ఏమిటో తెలియగోరుతున్నాను" అన్నాడు. మార్కండేయు డిలా అన్నాడు. 'యుధిష్ఠిరా! దానధర్మాన్ని గురించి నీవు వినగోరుతున్నావు. అది గౌరవాస్పదం కాబట్టి నాకు కూడా ఇష్టమయిన విషయమే. శ్రుతిస్మృతులు వివరించిన దానరహస్యాలను విను. గజచ్ఛాయాపర్వదినాన, రావిఆకుల గాలితగిలే తావున పెట్టిన శ్రాద్ధం లక్షకల్పాలవరకు నశించదు. తాను జీవించటానికి వండుకొన్న అన్నం దానం ఇస్తే స్వర్గలోకానికి వెళతాడు. ఆశ్రయాన్ని వెతుకుతున్నవానికి వాసస్థానాన్ని ఇస్తే సర్వయజ్ఞాలు చేసిన ఫలం సిద్ధిస్తుంది. ప్రతిస్రోతం(పూర్వదిక్కుకు ప్రవహిస్తున్న ప్రవాహం వెనుదిరిగి పశ్చిమంగా ప్రవహిస్తే అది ప్రతిస్రోతం)లో ఉత్తమాశ్వాలను దానం చేస్తే అది అక్షయపుణ్యప్రద మవుతుంది. అన్నానికై తిరుగుతున్న అతిథిరూపు డైన ఇంద్రుని భోజనంతో తృప్తిపరిస్తే అది కూడా అక్షయపుణ్యప్రద మవుతుంది. గ్రహణసమయంలో నదీ ప్రవాహం దగ్గర పెరుగు మొదలగుపదార్థాల దానం అక్షయపుణ్యప్రద మవుతుంది. మహాప్రవాహంలో స్నానం చేయటం కూడా నావ తరింపజేసినట్లు పాపాలనుండి విముక్తిని కలిగిస్తుంది. పర్వకాలంలో చేసిన దానం రెండురెట్లు, ఋతుప్రారంభ కాలంలో చేసినదానం పదిరెట్లు పుణ్యప్రదమవుతుంది. అయనకాలంలో, తులామేష సంక్రాంతులలో, మిథునకన్యాధనుర్మీన సంక్రాంతులలో చంద్రసూర్య గ్రహణకాలాల్లో చేసిన దానం అక్షయ మవుతుంది. ఋతుప్రారంభవేళలో ఇచ్చినదానం పదిరెట్లు, అయనారంభవేళలో ఇచ్చినదానం వందరెట్లు, గ్రహణవేళలో ఇచ్చినదానం వేయిరెట్లు, విషువద్వేళలో ఇచ్చిన దానం అక్షయంగా పుణ్యాన్ని ఇస్తాయి. రాజా! భూదానం చేయకుండా భూమిని పొందలేడు. వాహనదానం చేయనివాడు వాహనాన్ని పొందలేడు. బ్రాహ్మణులకు ఏయే పదార్థాలు దానం చేస్తాడో అవన్నీ మరుసటి జన్మలో పొందగలుగుతాడు. అగ్ని తొలిసంతానం బంగారం. భూమి విష్ణుపత్ని. ఆవులు సూర్యునిపుత్రికలు. కాబట్టి బంగారాన్ని, భూమిని, ఆవులను దానం చేసినవాడు మూడులోకాలనూ దానం చేసినట్లే. దానంకన్నా గొప్పదైన శాశ్వతపుణ్యం

---

* తపసా స్వర్గగమనం భోగో దానేన జాయతే ।
జ్ఞానేన మోక్షో విజ్ఞేయః తీర్థస్నానాదఘక్షయః ॥ 118

ఇంతకుముందు లేదు. ఇప్పుడూ లేదు. కాబట్టి బుద్ధిమంతులు దానాన్ని సర్వోత్కృష్టకర్మగా చెపుతుంటారు.*

201. ధుంధుమారోపాఖ్యానము.

మార్కండేయుడు ఇంద్రద్యుమ్నరాజర్షి మరల స్వర్గానికి వెళ్లిన వృత్తాంతాన్ని చెప్పగా విని, యుధిష్ఠిరుడు పాపరహితుడైన మార్కండేయుని ఇలా అడిగాడు. 'ధర్మజ్ఞా! దేవదానవరాక్షసులు, వివిధరాజవంశాలు, సనాతనఋషివంశాలు నీకు తెలిసినవే! ఈ లోకంలో నీవెరుగనిది ఏదీలేదు. మహర్షీ! మనుష్య, నాగ, రాక్షస, దేవ, గంధర్వ, యక్ష, కిన్నర, అప్సరల కథలన్నీ నీకు తెలుసు. ఈ విషయాన్ని యథాతథంగా నేను వినగోరుతున్నాను. ఇక్ష్వాకువంశప్రసిద్ధుడైన కువలాశ్వుడు ఓటమి నెరుగనివాడై కూడా ఏ వైపరీత్యంవలన ధుంధుమారు డయ్యాడు? ధీమంతుడైన కువలాశ్వుడు పేరు మార్చుకొనటానికి గల యథార్థకారణాన్ని తెలియగోరుతున్నాను.' యుధిష్ఠిరుడు ఇలా అడగగానే మార్కండేయమహర్షి ధుంధుమారోపాఖ్యానాన్ని ఇలా చెప్పాడు. 'యుధిష్ఠిరా! వినుము. ధర్మిష్ఠమైన ధుంధుమారోపాఖ్యానాన్ని వినిపిస్తాను. రాజా! ఇక్ష్వాకురాజైన కువలాశ్వమహారాజు ధుంధుమారుడైన విధానాన్ని చెపుతాను వినుము. భారతా! ఉత్తంకుడని ప్రసిద్ధముని ఉండేవాడు. రమ్యమైన మరుప్రదేశంలో ఆయన ఆశ్రమ ముండేది. శక్తిశాలి అయిన ఉత్తంకుడు విష్ణువును ఆరాధింపగోరి అనేక సంవత్సరాలు కఠినతపస్సు నాచరించాడు. ఆయనతపస్సుతో సంతోషించి విష్ణుభగవానుడు సాక్షాత్కరించాడు. ఆయనను చూడగానే ఆ ఋషి వినయంగా వివిధస్తోత్రాలతో ఆయనను సంతోషపెట్టాడు.

ఉత్తంకుడిలా అన్నాడు. 'స్వామీ! దేవరాక్షసమానవులతో సహా సమస్త ప్రజలను, స్థావరజంగమాత్మకాలైన ప్రాణులను నీవు సృష్టించావు. తేజస్వీ! బ్రహ్మను, వేదాలను, తెలియదగిన సమస్తపదార్థాలనూ నీవే సృష్టించావు. దేవా! ఆకాశమే నీ శిరస్సు. సూర్యచంద్రులే నీకళ్ళు. నిశ్వాసమే గాలి. తేజస్సు అగ్ని. అచ్యుతా! నీ బాహువులే సర్వదిక్కులూ. నీ ఉదరమే మహాసాగరం. నీ తొడలే పర్వతాలు. మధుసూదనా! నీ నాభియే ఆకాశం. నీ పాదాలే భూదేవి. నీ రోమాలే ఓషధులు. ఇంద్రుడు, సోముడు, అగ్ని, వరుణుడు, దేవతలు, అసురులు, నాగులు వినయంతో వివిధస్తోత్రాలతో నిన్ను సేవిస్తారు. భువనేశ్వరా! సర్వప్రాణులయందు నీవున్నావు. యోగులు, మహాతేజస్సులు అయిన మహర్షులు నిన్ను

* పరం హి దానాన్న బభూవ శాశ్వతం భవ్యం త్రిలోకే భవతే కుతః పునః।
తస్మాత్ ప్రధానం పరమం హి దానం వదంతి లోకేషు విశిష్టబుద్ధయః॥ 129

స్తుతిస్తారు. పురుషోత్తమా! నీవు ఆనందిస్తే జగత్తు సుఖంగా ఉంటుంది. నీవు కోపిస్తే మహాభయంకరంగా ఉంటుంది. భయాలను పోగొట్టగలవాడవు నీవొక్కడవే. దేవతలకు, మానవులకు, సమస్తజీవులకు సుఖాలను కల్పించువాడవు నీవే. మూడుపాదాలతో మూడులోకాలను ఆక్రమించినవాడవు నీవు. బలవంతు లయిన అసురులను నీవే నశింపజేశావు. నీ ఆక్రమణలచేతనే దేవతలు పరమశాంతిని పొందగలిగారు మహాతేజస్వీ! నీవు కోపిస్తే రాక్షసేంద్రులంతా ఓడిపోతారు. సర్వప్రాణులకు కర్తవు నీవే. వికర్తవు నీవే. నిన్ను ఆరాధించియే దేవతలందరూ సుఖాన్ని పెంపొందించుకొంటారు.'

మహాత్ముడైన ఉత్తంకునిచే ఈ విధంగా స్తుతింపబడిన విష్ణువు "నేను ప్రసన్నుడ నైనాను. వరాన్ని కోరుకో" అని ఉత్తంకునితో అన్నాడు. ఉత్తంకుడిలా అన్నాడు. 'నీవు సర్వజగత్తుకూ సృష్టికర్తవు, దివ్యుడవు, సనాతన పురుషుడవు, శ్రీహరివి. ఆటువంటి నిన్ను చూడగలగటమే గొప్పవరం. నాకిది చాలు.' విష్ణువు ఇలా అన్నాడు. 'నీ భక్తికీ, నీ ఆలోలుపత్వానికీ సంతసించాను. బ్రహ్మజ్ఞానీ! నీవు తప్పక నానుండి వరాన్ని పొందాలి.' ఈరీతిగా పూజ్యుడయిన విష్ణువు వరం కోరుకొమ్మని పట్టుపట్టగా ఉత్తంకుడు చేతులు జోడించి వరాన్ని కోరుకొన్నాడు. 'స్వామీ! పుండరీకాక్షా! నాపై ప్రసన్నత కలిగితే నాకు నిత్యమూ ధర్మంపై, సత్యంపై, దమంపై బుద్ధినిలిచేటట్లు వరమిమ్ము. ఈశ్వరా! నీ భజనయందే నాకు నిత్యం అభ్యాసం కలిగేటట్లు చూడు.' విష్ణుమూర్తి ఇలా అన్నాడు. 'నా అనుగ్రహం వలన నీవు కోరినదంతా నీకు లభిస్తుంది. యోగవిద్యకూడా నీ హృదయంలో ప్రతిభాసిస్తుంది. దానితో నీవు దేవతలకు, ముల్లోకాలకూ సంబంధించిన మహాకార్యాలను సాధించగలవు. ధుంధు వనే మహారాక్షసుడు లోకాలను నాశనం చేయాలని ఘోరతపస్సు చేస్తున్నాడు. అతనిని ఎవరు చంపుతారో చెపుతాను విను. నాయనా! ఇక్ష్వాకువంశంలో ఓటమి నెరుగని పరాక్రమవంతుడు బృహదశ్వుడను రాజు పుడతాడు. ఆయనకు కువలాశ్వు డనే కొడుకు జన్మిస్తాడు. అతడు పవిత్రుడు, జితేంద్రియుడు. ఆ రాజశ్రేష్ఠుడు నీ ఆదేశాన్ని అనుసరించి, నా యోగబలాన్ని ఆశ్రయించి, దుంధువును చంపి, ధుంధుమారుడవుతాడు.' ఉత్తంకునకు ఆమాట చెప్పి విష్ణువు అదృశ్యమయ్యాడు.

202. బృహదశ్వుని ద్వారా ధుంధుని వధించవలెనని ఉత్తంకుడు భావించుట.

మార్కండేయుడిలా అన్నాడు. రాజా! ఇక్ష్వాకువు మరణించిన తర్వాత ఆయన కొడుకు శశాదుడు భూపతి అయ్యాడు. పరమధర్మాత్ముడైన ఆ రాజు అయోధ్యలో ఉండేవాడు. శశాదునకు కకుత్స్థుడనే కొడుకు. అతడు పరాక్రమవంతుడు. అతని

కొడుకు అనేనుడు. అనేనుని కొడుకు పృథువు. పృథువుకొడుకు విష్వగశ్వుడు. ఆయన కొడుకు అద్రి. అద్రికొడుకు యువనాశ్వుడు. యువనాశ్వుని కొడుకు శ్రావుడు. శ్రావుని కొడుకు శ్రావస్తుకుడు. శ్రావస్తీపురిని నిర్మించిన దాయనయే. శ్రావస్తుకుని కొడుకు బృహదశ్వుడు. ఆయన మహాబలుడు. బృహదశ్వుని కొడుకు కువలాశ్వుడు. కువలాశ్వునకు ఇరవైయొక్కవేలమంది కొడుకులు. వారంతా విద్యావంతులు, బలవంతులు, ఎదిరింప వీలుకానివారు. కువలాశ్వుడు సద్గుణాలతో తండ్రిని మించిన తనయుడు. ఉత్తమధార్మికుడు అయిన కువలాశ్వునికి ఆయన తండ్రి బృహదశ్వుడు తగిన సమయంలో రాజ్యాభిషేకం చేయించాడు. శత్రుసంహర్త అయిన బృహదశ్వమహారాజు కుమారునకు రాజ్యాభిషేకం జరిపించి, తపస్సు చేయగోరి, వనాలకు వెళ్ళాడు. ఉత్తంకుడు బృహదశ్వరాజర్షి వనానికి బయలుదేరాడని విన్నాడు. మహాతేజస్వి అయినో ఉత్తంకుడు సకలాస్త్రవేత్తలలో శ్రేష్ఠుడైన బృహదశ్వుని సమీపించి, వనగమనాన్ని ఆపి, ఇలా అన్నాడు.

'రాజా! ప్రజారక్షణ నీ కర్తవ్యం. దానినే ప్రధానంగా నిర్వహించారు. నీ అనుగ్రహం వలననే మేము నిశ్చింతగా జీవించగలం. రాజా! మహాత్ముడ వయిన నీవు కాపాడుతుంటే భూమి నిర్భయంగా మనగలుగుతుంది. నీవు అరణ్యానికి వెళ్ళదగదు. ప్రజాపాలనలోనే గొప్పధర్మం ఇమిడి ఉంది. అరణ్యవాసంలో అంత ధర్మం కనిపించదు. నీ బుద్ధిని అటు మరల్చవద్దు. ప్రాచీన రాజర్షు లందరు ప్రజాపాలనయందే ధర్మాన్ని దర్శించినవారు. ఇటువంటి ధర్మం మరెక్కడా కనిపించదు. **రాజుకు ప్రజాసంరక్షణమే ధర్మం. కాబట్టి నీవు ప్రజలను కాపాడాలి.** రాజా! నేను ప్రశాంతంగా తపస్సు చేయలేకపోతున్నాను. నా ఆశ్రమసమీపంలో పూర్తిగా మరుప్రదేశంలో ఇసుకతో నిండిన సముద్ర మొక టున్నది. ఉజ్జాలక మని దానిపేరు. అది ఎన్నో యోజనాల పాడవు వెడల్పులు గలది. అక్కడ మహాబలపరాక్రమాలు గల దానవరాజు ఒక డున్నాడు. అతని పేరు ధుంధుడు. అతడు మధుకైటభుల పుత్రుడు. లోకాలనన్నింటినీ, దేవతలనూ నాశనం చేయాలని భీకరతపస్సు చేస్తున్నాడు. మహారాజా! ఆ రాక్షసుని చంపి నీవు వనవాసానికి వెళ్ళవచ్చు. రాజా! సర్వలోక పితామహుని నుండి వరాన్నిపొంది ఆ రాక్షసుడు దేవతలకు, దైత్యులకు, రాక్షసులకు, నాగులకు, యక్షులకు, గంధర్వులకు కూడా చంపరాని వాడయ్యాడు. అతనిని చంపు. నీకు శుభం కలుగుతుంది. ఇంతకన్న మరొక ఆలోచన చేయవద్దు. దీనివలన చిరస్థాయి అయిన ఘనకీర్తిని పొందగలవు.

ఇసుక క్రింద నిద్రిస్తూ క్రూరతపస్సు చేస్తున్న ఆ రాక్షసుడు సంవత్సరానికి ఒకసారి గాలి పీల్చుకొంటాడు. అతడు గాలి పీల్చుకొనే సమయంలో పర్వతాలతో,

వనాలతో, కాననాలతో సహా భూమి కంపిస్తుంది. దుమ్ము లేస్తుంది. ఎగిసిన ఆ దుమ్ము సూర్యుని మార్గాన్ని కూడా నిరోధిస్తుంది. ఏడురోజుల వరకు భూమి కంపిస్తుంది. నిప్పురవ్వలు, మంటలు, పొగలతో మహాభయంకర పరిస్థితి ఏర్పడుతుంది. రాజా! ఆ కారణంగా నేను అక్కడ నా ఆశ్రమంలో ఉండలేకపోతున్నాను. లోకహితాన్ని కోరి ఆ రాక్షసుని నాశనంచేయి. ఆ రాక్షసుడు నశిస్తే లోకాలు సుఖంగా ఉంటాయి. అతనిని చంపటానికి నీవే సమర్థుడవని నా అభిప్రాయం. విష్ణుమూర్తి తన తేజస్సుతో నీ తేజస్సును వృద్ధి చేయగలడు. గతంలో విష్ణుమూర్తి "ఆ క్రూరరాక్షసుని చంపదలచిన వీరుడైన మహారాజులో నా వైష్ణవ తేజస్సు ప్రవేశిస్తుంది" అని నాకు వరమిచ్చాడు. నీవు ఆ దుస్సహవైష్ణవతేజాన్ని ధరించి, రౌద్రపరాక్రముడైన ఆ రాక్షసుని సంహరించు. రాజా! మహాతేజస్వి అయిన ఆ ధుంధువును వంద సంవత్సరాలు పోరాడినా అల్పతేజస్సుతో సంహరించటం కష్టం.'

203. విష్ణువు మధుకైటభులను వధించుట.

ఉత్తంకుడు ఇలా అనగానే ఎదురులేని ఆ రాజర్షి చేతులు జోడించి, ఉత్తంకునితో ఇలా అన్నాడు. 'బ్రాహ్మణా! నీ రాక వ్యర్థం కారాదు. స్వామీ! ఇతడు నా కొడుకు. కువలాశ్వుడని పేరు. ధీరుడు, వేదవంతుడు, తిరుగులేని పరాక్రమశాలి. ప్రాకారాలవంటి బాహువులు గలవారు, శూరులు అయిన తన కుమారులందరితో కలిసి నీవుకోరిన ఈ ప్రియకార్యాన్ని పూర్తిచేస్తాడు. సందేహం లేదు. అస్త్రసన్యాసం చేసి ఉన్నాను. నన్ను ఇప్పుడు విడిచిపెట్టు.' అమితతేజస్వి అయిన ఉత్తంకుడు 'అలాగే కానీ' అని బృహదశ్వుని అనుమతించాడు. అప్పుడు రాజర్షి బృహదశ్వుడు తన కుమారుని ఉత్తంకునకు నివేదించి, ముని కార్యాన్ని పూర్తిచేయమని ఆదేశించి తపోవనానికి వెళ్ళిపోయాడు. యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు – తపోధనా! స్వామీ! మహాపరాక్రమశాలి అయిన ఆ రాక్షసు డెవడు? ఎవని కొడుకు? ఎవని మనుమడు? ఇదంతా తెలిసికోవా లనుకొంటున్నాను. ఇటువంటి బలశాలి అయిన దైత్యుని గురించి ఎప్పుడూ వినలేదు. స్వామీ! ఈ విషయమంతా యథాతథంగా తెలియగోరుతున్నాను.' మార్కండేయుడిలా అన్నాడు. 'మహాప్రాజ్ఞా! ఈ విషయాన్ని జరిగినది జరిగినట్లుగ విస్తరంగా చెపుతాను. విను. భరతర్షభా! లోకమంతా ఏకార్ణవంగా(జలమయంగా) మారినప్పుడు, స్థావరజంగమ ప్రాణులన్నీ నశించి పోయినపుడు జరిగిన సంగతి ఇది. లోకకర్తగా, సర్వసృష్టి కారణంగా, సనాతనుడుగా, అవ్యయుడుగా, సర్వలోకమహేశ్వరుడుగా మునులు, సిద్ధులు ప్రస్తుతించే విష్ణువు ఆ నీటిలో తన యోగశక్తితో ఆదిశేషుని పెద్దపడగపై శయనించి నిద్రించాడు. లోకకర్త, అయిన హరి ఆ పెద్ద నాగు

పాము పడగతో ఈ భూమిని ధరించాడు. నిద్రిస్తున్న ఆ దేవుని నాభినుండి సూర్యతేజస్సుగల దివ్యపద్మం వెలువడింది. దానిలో సూర్యుని తేజస్సుగల, పితామహుడు, బ్రహ్మ జన్మించాడు. ఆయన చతుర్వేదస్వరూపుడు. చతుర్మూర్తి, చతుర్ముఖుడు. మహాబలపరాక్రమశాలి. తన ప్రభావం వలన ఆయన ఎవరికీ లొంగనివాడు. ఆ తరువాత కొంతకాలానికి శక్తిసంపన్నులైన మధుకైటభరాక్షసులు శ్రీహరిని సందర్శించారు. ఆ విష్ణువు మహాకాంతిమంతుడు. దివ్యనాగభోగంపై శయనించి ఉన్నాడు. ఆ పాము పడగ కొన్ని యోజనాల పొడవు వెడల్పులు గలది. శ్రీహరి కిరీటాన్నీ, కౌస్తుభాన్నీ, పచ్చని పట్టుబట్టనూ ధరించి ఉన్నాడు. ఆ శ్రీహరి తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. ఆయన శరీరం వేయిమంది సూర్యులతో సమానంగా ఉన్నది. ఆయన దర్శనం అద్భుతం, నిరుపమానం.

తామరలవంటి కన్నులుగల పితామహుని పద్మంలో చూచి, మధుకైటభులు ఎంతో ఆశ్చర్యానికి గురి అయ్యారు. అమిత తేజస్వి అయిన ఆ బ్రహ్మను వారు భయపెట్టారు. వారు భయపెట్టగా మహాయశస్వి అయిన బ్రహ్మ తామరతూటిని కదిలించాడు. దానితో విష్ణువు మేల్కొన్నాడు. బలసంపన్నులైన మధుకైటభులను చూశాడు. వారిని చూచి విష్ణుమూర్తి "మహాబలులకు మీకు స్వాగతం. నాకు సంతోషంగా ఉంది. మీకు గొప్పవరాన్ని ఇస్తాను" అని వారితో అన్నాడు. మహారాజా! మహాబలం, మహాగర్వం గల వారు శ్రీహరిని చూసి నవ్వి, ఇద్దరూ ఒక్కటై ఆయనతో ఇలా అన్నారు. 'సురోత్తమా! నీవే మమ్ము వరం కోరుకో. వరమిస్తాం. నీకు మేము వరమిస్తాం. ఏమీ సంకోచించకుండా చెప్పు.' శ్రీభగవానుడిలా అన్నాడు. 'వీరులారా! వరాన్ని స్వీకరిస్తాను. నాకు కూడా వరం కావాలి. మీరు బలసంపన్నులు. మీకు సాటి ఎవడూ లేడు. మీరు నాచేతిలో మరణించండి. లోకహితం కోసం నేను ఈ వరాన్ని కోరుతున్నాను.'

మధుకైటభులు ఇలా అన్నారు. 'పురుషోత్తమా! మేమెప్పుడూ వినోదానికి కూడా అసత్యమాడలేదు. సత్యధర్మాసక్తులం మేము. మమ్ము చంపు. బలంలో, రూపంలో, పరాక్రమంలో, శాంతంలో, ధర్మంలో, తపస్సులో, దానంలో, శీలంలో, శక్తిలో, ఇంద్రియనిగ్రహంలో మాకు సాటి ఎవడూ లేడు. కేశవా! మాకు ఈ పెద్దచిక్కు వచ్చింది. నీ కోరికను తీర్చుకో. కాలాన్ని అతిక్రమించలేం గదా! దేవా! సురశ్రేష్ఠా! ప్రభూ! ఒక్కపని జరగాలని కోరుకొంటున్నాం. ఏ ఆవరణాలేని బహిరాకాశంలో మమ్ము చంపు. సులోచనా! నీకు మేము పుత్రులం కావాలి. మేము ఈ వరాన్ని కోరుతున్నాం. గ్రహించు. సురశ్రేష్ఠా! మేము చేసిన ప్రతిజ్ఞ అసత్యం కారాదు.' శ్రీభగవానుడిలా అన్నాడు. 'అలాగే. నేను ఆ రీతిగానే చేస్తా. అంతా మీరు ఆశించినట్టే జరుగుతుంది.' ఆపై విష్ణువు ఎంత ఆలోచించినా

ఇలపైకానీ, స్వర్గంలోకానీ అనావృతమయిన ఆకాశాన్ని చూడలేకపోయాడు. రాజా! అప్పుడు తన తొడలు అనావృతంగా ఉండటంచూచి మహాయశస్వి అయిన మధుసూదనుడు మధుకైటభుల తలలను తన తొడలపై నుంచి వాడి అయిన చక్రంతో వారిని నరికివేశాడు.

204. కువలాశ్వుడు ధుంధుని సంహరించుట.

మహారాజా! ఆ మధుకైటభుల కొడుకు ధుంధువు. అతడు తేజస్వి, మహాబల పరాక్రమసంపన్నుడు. అతడు ఘోరతపస్సు చేశాడు. చాలాకాలం ఒంటికాలిపై తపస్సు చేశాడు. నరాలు బయటకు కనిపించేంత చిక్కిపోయాడు. దానితో సంతసించిన బ్రహ్మ వరమిచ్చాడు. ఆ వరాన్ని ఇలా కోరాడు ధుంధువు. 'దేవతలు, దానవులు, యక్షులు, నాగులు, గంధర్వులు, అచ్చరలు - వీరెవ్వరి చేతిలోనూ నేను చావకూడదు. ఇదే నేను కోరే వరం.' "అలాగే జరుగుతుంది. వెళ్ళిరా" అన్నాడు బ్రహ్మ. బ్రహ్మ అలా పలుకగానే ధుంధువు ఆయన పాదాలకు శిరసా నమస్కరించి, వెళ్ళాడు. మహాశక్తి పరాక్రమాలు గల ఆ ధుంధువు వరాన్ని పొంది, పితృవధను తలచుకొంటూ వెంటనే విష్ణువు దగ్గరకు వెళ్ళాడు. అసహనశీలి అయిన ధుంధువు దేవతలను, గంధర్వులను జయించి విష్ణువును పదేపదే తీవ్రంగా బాధించాడు. ధుంధువు ఉజ్జాలకమని ప్రసిద్ధికెక్కిన ఇసుకసముద్రం దగ్గరకు వచ్చి, దుష్టాత్ముడై అందరినీ బాధించసాగాడు. తన శక్తినంతా వినియోగించి భూమిలోపల ఇసుకలో ఉండి ఉత్తంకాశ్రమాన్ని కలతపెట్టసాగాడు. భీమపరాక్రముడు అయిన ఆ ధుంధువు తపోబలాన్ని అడ్డుపెట్టుకొని ఉత్తంకుని ఆశ్రమానికి దగ్గరగా నిప్పులు క్రక్కుతూ లోకవినాశనం చేయటానికి శయనించి ఉన్నాడు.

అదేసమయంలో తనసేనతో, వాహనాలతో, కుమారులతో సహా కువలాశ్వమహారాజు ఉత్తంకబ్రాహ్మణునితో కలిసి బయలుదేరాడు. శత్రుమర్దనుడైన కువలాశ్వనరపతి బలశాలులయిన తన ఇరువదియొక్కవేల కుమారులతో కూడా ప్రయాణమయ్యాడు. అప్పుడు విష్ణువు ఉత్తంకుని అభ్యర్థనమేరకు, లోకహితాన్ని కోరి తన తేజస్సుతో కువలాశ్వునిలో ప్రవేశించాడు. కువలాశ్వుడు బయలుదేరగానే "శ్రీమంతుడైన ఈ కువలాశ్వుడు అవధ్యుడు. నేడు ధుంధువును చంపి 'ధుంధుమారు'డవుతాడు" అని స్వర్గంలో మహాకోలాహలధ్వని వినిపించింది. దేవతలు దివ్యపుష్పాలతో కువలాశ్వుని చుట్టూ చేరారు. దేవదుందుభులు కూడా ఎవ్వరు మ్రోయించకపోయినా తమంత తాము మ్రోగాయి. అతని ప్రయాణవేళలో గాలి చల్లగా వీచింది. భూమిపై దుమ్ము లేవకూడదని దేవేంద్రుడు వర్షాన్ని కురిపించాడు. మహాసురుడైన ధుంధువు ఉన్నచోటనే గగనతలంపై దేవతల విమానాలన్నీ నిలిచాయి.

ధుంధు, కువలాశ్వుల యుద్ధాన్ని చూచే కూతుహలంతో దేవగంధర్వులతో సహా మహర్షులంతా కనిపించారు.

నారాయణ తేజస్సుతో వృద్ధిచెందిన ఆ కువలాశ్వమహీపతి తన కుమారులతో కూడివెళ్ళి, వెంటనే నాలుగువైపులా ఇసుకసముద్రాన్ని త్రవ్వించాడు. కువలాశ్వుని కుమారులు ఆ ఇసుకకడలిలో ఏడురోజులు త్రవ్వి, మహాబలుడైన ధుంధువును చూచారు. ఇసుకక్రింది దాగిఉన్న అతని మహాకాయం భయంకరంగా ఉన్నది. సూర్యునివలె తేజస్సుతో ప్రజ్వలిస్తోంది. ప్రళయకాలాగ్ని వలె కాంతిమంతుడైన ఆ ధుంధువు పశ్చిమదిక్కు నాశ్రయించి నిద్రిస్తూ కనిపించాడు. కువలాశ్వుని కొడుకులు అన్నివైపులనుండి చుట్టుముట్టి ధుంధువుపై దాడిచేశారు. తీక్ష్ణబాణాలతో, గదలతో, ముసలాలతో, పట్టిశాలతో, పరిఘలతో, ప్రాసాలతో, మెరిసే వాడి కత్తులతో దెబ్బతిన్న మహాబలుడు ధుంధువు క్రోధంతో లేచాడు. ఆ కోపంలోనే వారు ప్రయోగించిన వివిధశస్త్రాలను మ్రింగివేశాడు. అప్పుడు తననోటి నుండి ప్రళయకాలాగ్నివలె నిప్పులు క్రక్కుతూ తన తేజస్సుతో రాజకుమారులనందరినీ దహించివేశాడు. పూర్వకాలంలో కపిలమహర్షి కోపించి సగరపుత్రుల నందరినీ క్షణంలో దహించినట్లు ధుంధువు కూడా కోపించి లోకాల నన్నింటినీ నశింపజేస్తున్నట్లు ముఖాగ్నితో కువలాశ్వపుత్రులను దహించాడు. తన కుమారులు అందరూ కోపాగ్నిలో తగులబడగా కువలాశ్వమహీపతి మరొక కుంభకర్ణునివలె నిదురలేచిన ఆ ధుంధువును సమీపించాడు. అతనిదేహం నుండి జలం ఎక్కువగా ప్రవహింపసాగింది. కాని కువలాశ్వుడు యోగి కాబట్టి యోగశక్తితో జలరూపమైన ఆ తేజస్సును త్రాగి, నీటితోనే అతని ముఖాగ్నిని శమింపజేశాడు. భీకరపరాక్రమంగల ఆ దైత్యుని బ్రహ్మాస్త్రంతో దహించివేశాడు. ఈ రీతిగా లోకకళ్యాణంకోసం కువలాశ్వుడు సురశత్రువు, శత్రుసంహర్త అయిన ఆ మహారాక్షసుని బ్రహ్మాస్త్రంతో దగ్ధం చేసి మరొక దేవేంద్రునివలె ప్రకాశించాడు. మహామనస్కుడైన కువలాశ్వమహారాజు ధుంధువును చంపినందువల్ల ధుంధుమారుడని ప్రసిద్ధికెక్కి, తిరుగులేని వాడయ్యాడు.

దేవతలూ, మహర్షులు అందరూ సంతోషించి కువలాశ్వుని వరం కోరుకొమ్మన్నారు. దానికి పరమానందపడిన కువలాశ్వుడు చేతులు జోడించి వినయంతో ఇలా అన్నాడు. 'బ్రాహ్మణశ్రేష్ఠులకు ధనాన్ని దాన మివ్వగలగాలి. శత్రువులకు అజేయుడను కావాలి. విష్ణువుతో చెలిమి ఉండాలి. ప్రాణులపై ద్రోహబుద్ధి కలుగరాదు. నిత్యమూ ధర్మాసక్తి ఉండాలి. అక్షయస్వర్గనివాసం సిద్ధించాలి' అన్నాడు. ఆనందించిన దేవతలు "తథాస్తు" అని రాజుతో అన్నారు. రాజా! ఆపై ఋషులు, గంధర్వులు, ధీమంతుడైన ఉత్తంకుడు

వివిధాశీర్వాదాల నిస్తూ రాజుతో సంభాషించారు. తరువాత దేవతలు, మునులు తమ తమ స్థానాలకు వెళ్ళారు. ఆ యుద్ధంలో కువలాశ్వుని కొడుకులు ముగ్గురు మాత్రమే మిగిలారు. వారు దృఢాశ్వుడు, కపిలాశ్వుడు, చంద్రాశ్వుడు. అపార తేజస్సులయిన ఇక్ష్వాకు మహారాజుల వంశపరంపర వారి వల్లనే వచ్చింది. ఇలా కువలాశ్వుని చేత ధుంధుడు చంపబడ్డాడు. మధుకైటభుల కొడుకయిన ధుంధుని చంపడంచేత కువలాశ్వుడు ధుంధుమారుడయ్యాడు. అప్పటినుండి అతడు ధుంధుమారుడని పిలువబడ్డాడు. అతని పనులను బట్టియే ఈ ఉపాఖ్యానం ధౌంధుమారోపాఖ్యానం అని పేరు కెక్కింది. నీ వడిగిన వృత్తాంతమంతా నీకు చెప్పాను. పుణ్యప్రదమై, విష్ణుకీర్తనంతో నిండిన ఈ కథను విన్న ధర్మాత్ముడు పుత్రవంతు డవుతాడు. పర్వసమయాల్లో విన్నవాడు ఆయువునూ, ఐశ్వర్యాన్నీ పొందుతాడు. అతనికి వ్యాధి భయం ఏ మాత్రమూ ఉండదు. దుఃఖస్పర్శ ఉండదు.

205. పతివ్రతా మహత్త్వము.

వైశంపాయనుడు అంటున్నాడు – భరతశ్రేష్ఠా! జనమేజయా! తరువాత ధర్మరాజు అర్థం చేసుకోవటానికే కష్టమైన ధర్మవిషయాన్ని గురించి మహాతేజస్వి అయిన మార్కండేయుని ప్రశ్నించాడు. 'మహాత్మా! సూక్ష్మమూ, ధర్మసమ్మతమూ, శ్రేష్ఠమూ, ఉత్తమమూ అయిన పతివ్రతా మాహాత్మ్యాన్ని మీరు చెపుతుంటే వినాలని నా కోరిక. బ్రహ్మర్షీ ! ఈ లోకంలో సూర్యుడు, చంద్రుడు, వాయువు, భూమి, అగ్ని, తండ్రి, తల్లి, గురువు, ప్రత్యక్షదైవాలుగా కన్పిస్తున్నారు. ఇంతేకాక ప్రతిష్ఠితమైన దేవతావిగ్రహాలు కూడా ప్రత్యక్షదేవతలలోని వారే. ఆ గురుజనులందరితోపాటు పతివ్రతలైన స్త్రీలుగూడా పూజింపదగినవారే గదా! ఆ పతివ్రతలు చేసే సేవ తదితర సేవలకంటె చాలా కష్టమైనదని నాకు అనిపిస్తున్నది. పుణ్యాత్మా! మాకు పతివ్రతా మాహాత్మ్యాన్ని చెప్పండి. ఇంద్రియాలను నిగ్రహించి మనస్సును వశం చేసుకొని భర్తను దైవంగా కొలిచే స్త్రీలు పవిత్ర చరిత్రలు. వారి సేవాభావమూ, త్యాగమూ కష్టసాధ్యాలని నేను అనుకొంటాను. పుత్రులకు తల్లిదండ్రుల సేవా, స్త్రీలకు పతిసేవా చాలా శ్రమసాధ్యాలు. స్త్రీలకు ఈ కఠోరధర్మాన్ని మించి ఇంకొక దుష్కరకార్యం నాకు తోచటం లేదు. ఎల్లప్పుడూ సమాజంలో ఆదరం పొందే మంచినడవడి గల స్త్రీలు చేసే మహత్కార్యం కష్టతరం. తల్లిదండ్రుల సేవ చేయటం కూడా సామాన్యం కాదు. పతివ్రతలూ, సత్యాన్ని చెప్పే స్త్రీలూ చాలా కఠినధర్మాన్నే ఆచరిస్తున్నారు. స్త్రీలు పదిమాసాలు కుక్షిలో గర్భం ధరించి, సరైన సమయంలో సంతానం కంటున్నారు. ఇంత పరమాశ్చర్య

కార్యాన్ని మించినది ఏమున్నది? ద్విజపుంగవా! నారీమణులు ప్రసవసమయంలో ప్రాణాపాయస్థితిని, సాటిలేని బాధను పొంది, చాలాకష్టపడి, పిల్లలను కంటారు. ఆ సంతానాన్ని ఎంతో మమకారంతో పెంచుతారు గదా ! ఆ పతివ్రతామతల్లులు క్రూరస్వభావం గల భర్త, అత్తమామల మధ్య ఉంటూ వారి సేవ చేస్తూ, వాళ్ళు ఎంత నీచంగా చూసినా సహిస్తూ ఎల్లప్పుడూ తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తుంటారు. ఇది అతికష్టమైన పని అని నా అభిప్రాయం.

ఇంతేకాక క్షత్రియ ధర్మాన్ని చక్కగా నిర్వర్తించటంలో గల తత్త్వాన్ని వివరించి చెప్పండి. విప్రవరా! క్రూరస్వభావులకు మహాత్ముల ధర్మం ఆచరించటం చాలాకష్టం. భృగువంశాలంకారా! అడిగేవారి ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పటంలోనూ, ఉత్తమనియమాలు పాటించటంలోనూ శ్రేష్ఠులైన మీరు నా ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పవలసిందిగా కోరుతున్నాను.'

మార్కండేయుడు చెపుతున్నాడు. 'భరతవంశశ్రేష్ఠా నీవు వేసిన ప్రశ్నలను వివరించి చెప్పటం చాలా కష్టమే. అయినా వీటికి సరైన సమాధానం చెపుతాను జాగ్రత్తగా విను. గౌరవించవలసిన వారిలో తల్లులే ముఖ్యులని కొందరూ, తండ్రులే ముఖ్యులని కొందరూ భావించారు. కాని తల్లి తనసంతానాన్ని పెంచి, పోషించి, పెద్ద చేస్తుంది. ఇది ఆమె చేసే పనులలో కఠినమైనది. తల్లిదండ్రులు తపస్సు, దేవపూజ, దేవతా నమస్కారం, శీతోష్ణాదులను సహించుట.... ఇంకా ఇతరమైన చాలా ఉపాయాల ననుసరించి సంతానం పొందాలని కోరుకొంటారు. ఈ విధంగా మహత్తరమైన కష్టాలను సహించి, దుర్లభుడైన పుత్రుని కంటారు. ఆ తరువాత పుట్టిన పిల్లవాడు ముందుముందు ఎలాంటివాడు అవుతాడో అని ఎప్పుడూ ఆలోచిస్తుంటారు. తల్లిదండ్రులు తమ పుత్రులకు లోకంలో ప్రసిద్ధి, కీర్తి, ఐశ్వర్యం, మంచిసంతానం, ధర్మబుద్ధి కలగాలని కోరుకొంటారు. ఆ తల్లిదండ్రుల ఆశను సఫలం చేసినవాడే సరైన ధర్మం తెలిసిన పుత్రుడ వుతాడు. తల్లిదండ్రులను ఎల్లప్పుడూ అన్నివిధాలా సంతోషపెట్టే పుత్రుడికి ఈ లోకంలోను, పరలోకంలోనూ శాశ్వతమైన కీర్తి, ధర్మమూ లభిస్తాయి. స్త్రీకి ఎలాంటి యజ్ఞాలు కాని, శ్రాద్ధాదులు గాని, ఉపవాసాదులు కాని చేయవలసిన పనిలేదు. పతిసేవ చక్కగా చేస్తే స్వర్గంవైన కూడా విజయం సాధిస్తుంది. ధర్మరాజా! ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పతివ్రతలకు నిశ్చితమైన ధర్మాన్ని వివరిస్తాను. శ్రద్ధగా విను.

206. కౌశిక పతివ్రతా సంభాషణము - బ్రాహ్మణ ధర్మ వర్ణనము.

పూర్వం కౌశికుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన వేదాధ్యయనసంపన్నుడు, తపోధనుడు, ముని, ధర్మశీలుడు. ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు ఆరు అంగాలు, ఉపనిషత్తులతో గూడిన వేదాలను అధ్యయనం చేసినవాడు. ఒకసారి ఆయన ఒక చెట్టు క్రింద కూర్చుని వేదపారాయణం చేస్తున్నాడు. ఆ సమయంలో ఆ చెట్టు మీద ఒక కొంగ కనపడకుండా ఉన్నది. అది ఆ బ్రాహ్మణునిమీద రెట్ట వేసింది. దాన్ని చూచి ఆ బ్రాహ్మణుడు కోపంతో మంచి చెడులు మరచాడు. తీవ్రకోపపరవశుడై ఆ కొంగను చూశాడు. ఆయన దానికి కీడు కలగాలని భావించటంతో అది నేల గూలింది. చైతన్యహీనమై, ప్రాణరహితమై పడిన దాన్ని చూసి ఆయన దయార్ద్రహృదయుడై తాను చేసిన చెడ్డపనికి పశ్చాత్తాపం చెందాడు. 'కోపానికి లొంగిపోయి చాలా అనుచితమైనపని చేశాను.' అని బాధపడ్డాడు. విద్వాంసుడైన ఆ బ్రాహ్మణుడు ఈ విధంగా చాలాసార్లు చింతించాడు. గ్రామంలో భిక్షాటనానికి బయలుదేరాడు. పవిత్రులు, ఉత్తమ వంశీయులైన వారి ఇండ్లలో భిక్షను అడుగుతూ అంతకుముందు కూడా తాను వెళ్ళివచ్చే ఒక ఇంటికి వెళ్ళి 'భిక్షాందేహి' అన్నాడు. ఆ ఇల్లాలు 'ఇదిగో వస్తున్నా ఉండు' అన్నది.

రాజా! ఆమె ఆ ఇంటి యజమానురాలు. అప్పుడు పాత్ర తోముతున్నది. అంతలో ఆమె భర్త త్వరగా ఇంట్లోకి వచ్చాడు. ఆయన బాగా ఆకలిగొని ఉన్నాడు. ఆ పతివ్రత బ్రాహ్మణుని విషయం వదలి, వినయంతో భర్తకు కాళ్ళు కడిగింది. ముఖం చేతులు కడిగించింది. కూర్చుండటానికి ఆసనం చూపింది. తరువాత మంచి రుచిగల భక్ష్యభోజ్యపదార్థాలను వడ్డించింది. యుధిష్ఠిరా! ప్రతిరోజూ ఆ పతివ్రత భర్త తినగా మిగిలిన వాటిని పవిత్రభావంతో భుజిస్తూ ఉంటుంది. ఆమె భర్తను దైవంగా భావించి, ఆయన ఇష్టానుసారం నడుచుకొంటుంది. పరపురుషుని ఎప్పుడూ మనస్సులోనైనా తలచేది కాదు. మనస్సుతో గాని, పనులతో గాని, మాటలతో గాని ఆయనను వ్యతిరేకించేది కాదు. అనన్యభావంతో భర్తకు సేవ చేయటంలో ఆసక్తి కలిగి ఉండేది. మంచి ఆచారవ్యవహారాలు గలది. పవిత్రురాలు, సమర్థురాలు. తమకుటుంబం మేలు కోరుతూ ఉండేది. ఆమె భర్తకు మేలు చేసే పనులనే ఆచరిస్తుండేది. దేవపూజలు, అతిధిసత్కారాలు, సేవకుల బాగోగులు చక్కగా నిర్వర్తించేది. అత్తమామలసేవలో మునిగి ఉండేది. మనస్సును, ఇంద్రియాలను అదుపులో పెట్టుకొనేది. భర్తసేవ చేస్తున్న పవిత్రదృష్టి గల ఆ పతివ్రతకు భిక్షకోసం ఎదురు చూస్తూ ఉన్న బ్రాహ్మణుడు గుర్తువచ్చాడు. యశస్విని అయిన ఆ పతివ్రత తనపొరపాటు గుర్తువచ్చి, సిగ్గుపడి, బ్రాహ్మణుని కోసం భిక్ష తీసుకొని, బయటికి

వచ్చింది. ఆమెను చూసి బ్రాహ్మణుడు 'వనితామణీ! ఇది ఏమి పని? ఇంత ఆలస్యం ఉంటే నన్ను "ఉండు" అని ఎందుకు చెప్పావు? వెంటనే ఎందుకు పొమ్మనలేదు?' అన్నాడు. కోపంతో బాగా తపించిపోతూ, తేజస్సుతో వెలుగుతున్న ఆ బ్రాహ్మణుని చూచి పతివ్రత శాంతంగా నచ్చచెబుతూ ఇలా అన్నది. 'విద్వాంసుడా! నా తప్పు క్షమించు. నాకు భర్తే దైవం. ఆయన ఆకలితో అలిసిపోయి ఇంటికి వచ్చాడు. నేను ఇప్పటిదాకా ఆయనసేవలో ఉన్నాను.' అప్పుడు బ్రాహ్మణుడు ఇలా అన్నాడు – 'ఏమిటీ! బ్రాహ్మణులు గొప్పవారు కాదా? నీవు భర్తనే గొప్పవానినిగా చేస్తున్నావా? గృహస్థ ధర్మంలో ఉండికూడా నీవు బ్రాహ్మణులను అవమానిస్తున్నావా? ఇంద్రుడు కూడా ఈ బ్రాహ్మణుల ఎదుట తలవంచుతాడు. అలాంటిది భూమి మీద ఉండే మానవుల విషయం వేరే చెప్పాలా? అహంకారిణీ ! ఇంతమాత్రం నీకు తెలియదా ? బ్రాహ్మణుల గొప్పతనాన్ని గురించి పెద్దలవలన వినలేదా? అగ్నివలె తేజోవంతులయిన బ్రాహ్మణులు భూమండలాన్నయినా భస్మం చేయగలరు.'

స్త్రీ ఇలా అన్నది – తపోధనా ! బ్రహ్మర్షీ ! కోపించకండి. మీ కోపదృష్టికి మాడిపోవటానికి నేనేమీ కొంగను కాను. దృఢ చిత్తులు, దైవ సమానులూ అయిన బ్రాహ్మణులను ఎప్పుడూ అవమానించను. నా తప్పును మన్నించండి. మేధావులైన బ్రాహ్మణుల తేజస్సును, గొప్పతనాన్ని ఎరుగుదును. ఒక మహర్షి కోపంతో సముద్రజలాన్ని ఉప్పు నీటితో త్రాగటానికి వీలులేకుండా చేశాడు. అలాగే తపస్సుచేత ప్రజ్వలిస్తూ పరమపవిత్రమైన అంతఃకరణం గల మునుల కోపాగ్ని ఇప్పటికీ దండకారణ్యంలో ఆరిపోకుండా మండుతూనే ఉన్నది. బ్రాహ్మణులను అవమానించటం వలననే వాతాపి అనే రాక్షసుడు అగస్త్యమహర్షి కుక్షిలో జీర్ణమయ్యాడు. బ్రాహ్మణుల ప్రభావాన్ని తెలియజేసే అనేకవృత్తాంతాలను వింటున్నాం. ఆ మహానుభావుల కోపమూ, అనుగ్రహమూ అధికమైనవే సుమా. పాపరహితా! నేను చేసిన తప్పును క్షమించు. ద్విజవరా! నాకు పతిసేవ చేత లభించే ధర్మమే చాలా ఇష్టమైనది. దేవతలందరికంటే పతియే నాకు పరదేవత. నేను అతిసాధారణంగానే పతి సేవారూప మయిన ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాను. ఈ భర్తృసేవ వలన ఎలాంటి ఫలం కలుగుతుందో చూడు. నీవు కోపంతో కొంగను మాడ్చివేసిన విషయం నాకు తెలిసింది గదా! బ్రాహ్మణశ్రేష్ఠా! **మానవులకు శరీరంలో ఉండే శత్రువు క్రోధం.**

కోపాన్ని, మోహాన్ని వదిలిపెట్టగలవాడిని దేవతలు బ్రాహ్మణు డని భావిస్తారు. ఈలోకంలో నిజం చెప్పేవాడిని, గురువును సంతోషపెట్టేవాడిని, ఇతరులు తనను హింసించినా వారిని మళ్ళీ తాను హింసించకుండా ఉండేవాడిని దేవతలు బ్రాహ్మణు డని భావిస్తారు.

ఇంద్రియాలను జయించినవాడు, ధర్మపరాయణుడు, వేదాధ్యయన తత్పరుడు, పవిత్రుడు, కామక్రోధాలను వశం చేసుకొన్నవాడు బ్రాహ్మణు డని దేవతలు తలుస్తారు. ధర్మాన్ని తెలిసినవాడు, అభిమానవంతుడు, సమస్త జగత్తును ఆత్మసమానంగా చూసేవాడు, అన్ని ధర్మాలయందు సమానమైన ఆసక్తిగలవాడు బ్రాహ్మణు డని దేవతలు భావిస్తారు. (వేదాన్ని) అభ్యసించేవాడు, చదివించేవాడు, యజ్ఞాన్ని చేసేవాడు, చేయించేవాడు, శక్తికొలది దానం చేసేవాడు బ్రాహ్మణుడని దేవతలు తలుస్తారు. బ్రహ్మచర్యాన్ని అనుసరించేవాడు, ఉదారుడు (దాత), వేదాన్ని చదివించేవాడు, ఎల్లప్పుడు సావధానుడై స్వాధ్యాయ మగ్నచిత్తుడు బ్రాహ్మణు డని దేవతలు అనుకొంటారు. బ్రాహ్మణుల సద్గుణాలను మాత్రమే ఇతరుల దగ్గర వివరించి చెప్పాలి. ఎప్పుడూ సత్యం పలికే వారి మనస్సు అబద్దాలు చెప్పటంలో ఆసక్తం కాదు. ద్విజోత్తమా! స్వాధ్యాయం, మనోనిగ్రహం, ఋజుప్రవర్తనం, ఇంద్రియనిగ్రహం బ్రాహ్మణునికి సనాతనధర్మ మని చెప్పారు. ధర్మం తెలిసినవారు **సత్యమూ, ఋజుస్వభావమూ సర్వోత్తమధర్మాలు** అని చెపుతారు. సనాతన ధర్మస్వరూపం తెలుసుకోవటం చాలాకష్టం. కాని అది సత్యమందు ప్రతిష్ఠితమై ఉన్నది. **వేదం ప్రమాణంగా ఉన్నదే ధర్మం** అని పెద్దల ఉపదేశం.

విప్రోత్తమా! అనేకరీతులుగా ఉండే ధర్మస్వరూపం చాలాసూక్ష్మంగా కనిపిస్తుంది. నీవూ ధర్మం బాగా తెలిసిన వాడివి. వేదాధ్యయనతత్పరుడవు, పవిత్రుడవు. మహాత్మా! నీకు యథార్థజ్ఞానం లేదని నేను అనుకొంటాను. నీకు పరమధర్మజ్ఞానం తెలియకపోతే మిథిలాపురంలో ఉండే ధర్మవ్యాధుని వద్దకు వెళ్ళి అడుగు. మిథిలలో ఒక వ్యాధుడు ఉన్నాడు. అతడు తల్లిదండ్రులకు సేవకుడు. నిజం చెపుతాడు. ఇంద్రియాలను జయించినవాడు. అతడు నీకు ధర్మాన్ని ఉపదేశిస్తాడు. బ్రాహ్మణోత్తమా! నీ ఇష్టానుసారం అక్కడికి వెళ్ళు. నీకు మేలు కలుగుగాక. నేను ఎక్కువగా మాట్లాడి ఉంటే దాన్ని అంతా క్షమించు. ధర్మజ్ఞులైన వారి దృష్టిలో స్త్రీలు దండించదగని వారు గదా! బ్రాహ్మణుడు "కల్యాణీ! నీకు మేలు కలుగుగాక. నాకు చాలా సంతోషమైంది. నాకోపం అంతా పోయింది. నీ నింద - దెప్పిపొడుపు మాటల్లో అనౌచిత్యం లేకపోవటమే కాదు. నాకు మేలు చేశాయి. నీకు శుభం కలుగుతుంది. ఇంక నేను వెళ్ళి నాపని సాధించుకుంటా. అమ్మా! ఇంత ఉత్తమ సదాచారం గల నీవు ధన్యురాలివి." అన్నాడు. కౌశికుడు ఆ సాధ్వి దగ్గర సెలవుతీసుకొని తనను తాను నిందించుకొంటూ తన నివాసానికి వెళ్ళాడు.

207. కౌశిక ధర్మవ్యాధుల సంవాదము.

పతివ్రత చెప్పినవిషయం అంతా ఆలోచించి, కౌశికుడు తనను తాను నిందించుకొంటూ తప్పు చేసినవాడిలాగా కన్పించాడు. తాను ఆచరించివలసిన ధర్మసూక్ష్మం ఎంత లోతైనదో బాగా ఆలోచించి 'తప్పకుండా ఆ పతివ్రత మాటల్లో నేను బాగా విశ్వాసం ఉంచి, మిథిలానగరానికి వెళతాను.' అని తనలో తాను అనుకొన్నాడు. 'అక్కడ పుణ్యాత్ముడు, ధర్మజ్ఞుడు అయిన వ్యాధుడు ఉన్నాడట. నేను ఆ తపోధనుని వద్దకు ధర్మవిషయం అడగటానికి ఈ రోజే వెళ్తాను.' ఆయన ఇలా మనస్సులో నిశ్చయించుకొని, కుతూహలంతో మిథిలాపురానికి బయలుదేరాడు. ఆ పతివ్రత చూడకుండానే కొంగ పడిపోయిన విషయం తెలుసుకోవటమే కాక ధర్మోపదేశం చేసింది. ఇందువల్ల ఆయనకు ఆమె మాటలమీద బాగా నమ్మకం కుదిరింది. ఆయన ఎన్నో అరణ్యాలను, పల్లెలను, పట్టణాలను దాటి జనకమహారాజుచేత సురక్షితమై, ధర్మమర్యాదతో నిండి, అనేక యజ్ఞాలతో అలంకృతమై, శుభప్రద మయిన మిథిలాపురం చేరాడు. ఆ నగరంలో కోటవాకిళ్ళు, పైన ఉండే ఇళ్ళు, దేవాలయాలు, మేడలు, లెక్కలేనన్ని ఉన్నాయి. దానికి పెద్ద అందమైన ప్రాకారం ఉన్నది. అనేకమైన సౌధాలు, పెద్ద దుకాణాలు ఉన్నవి. పెద్ద వీధులు తీర్చిదిద్దినట్లు ఉన్నాయి. అసంఖ్యాకమైన గుఱ్ఱాలు, రథాలు, ఏనుగులు ఉన్నాయి. వీరులు చాలామంది ఉన్నారు. ఆ పట్టణంలో జనులందరూ పుష్టిగా, సంతోషంగా ఉన్నారు. నిత్యమూ ఉత్సవాలు జరుగుతూ ఉంటాయి. అనేక ప్రవృత్తులతో కూడిన ఆ నగరంలో ప్రవేశించి ఆ బ్రాహ్మణుడు ఆ ప్రదేశాలన్నీ దాటివెళ్లాడు. ధర్మవ్యాధుని గురించి వాకబు చేశాడు. ఆ నగరంలో ఉన్న బ్రాహ్మణులు అతని నివాసాన్ని తెలియజేశారు. కౌశికుడు అక్కడికి వెళ్ళాడు. అప్పుడు మాంసదుకాణం మధ్యలో కూర్చుని పందిమాంసం, గొడ్డుమాంసం అమ్ముతూ తపస్విలాగా - పవిత్రునిగా ఉన్న వ్యాధుని చూశాడు. కొనేవాళ్ళు గుంపులుగా ఉండటంవల్ల ఆ బ్రాహ్మణుడు కొద్దిదూరంలో ఒంటరిగా నిలిచాడు. బ్రాహ్మణుడు రావటం తెలుసుకొని వ్యాధుడు తొట్రుపాటుతో లేచి ఒంటరిగా ఆయన ఉన్నచోటికి వేగంగా వచ్చాడు. వ్యాధుడన్నాడు - 'మహాత్మా! మీకు నానమస్కారాలు. స్వాగతం. నేనే ఆ వ్యాధుడను. మీకు మేలు కలుగుగాక. నేను ఏమిచేయాలో ఆజ్ఞాపించండి. 'మిథిలానగరానికి వెళ్ళు' అని ఆ పతివ్రత మీకు చెప్పింది. మీరు ఎందుకు వచ్చినదీ నాకు అంతా తెలుసు.' వ్యాధుని ఆ మాటలు విని బ్రాహ్మణుడు చాలా ఆశ్చర్యపడినాడు. ఇది రెండవ ఆశ్చర్యకరవిషయం అని మనస్సులో అనుకొన్నాడు. 'మహాత్మా! ఈ ప్రదేశం మీరు నిలువదగినది కాదు. మీకు ఇష్టమయితే మాయింటికి వెళ్దాం.' అని వ్యాధుడు అన్నాడు. ఆ మాటలు విని బ్రాహ్మణుడు సంతోషించి

'అలాగే వెళ్దాం' అన్నాడు. వ్యాధుడు ఆ ద్విజుని ముందుంచుకొని తన ఇంటికి వెళ్ళాడు. ఆ వ్యాధుడు సుందరమైన తన ఇంటిలోకి ఆయనను తీసుకొనిపోయినాడు. మంచి ఆసనంమీద కూర్చోబెట్టాడు. అర్ఘ్యం (కాళ్ళుచేతులు కడుగుకోటానికి నీళ్ళు) ఇచ్చి, పూజించాడు. తరువాత సుఖంగా కూర్చొని ఆయన ఆ వ్యాధునితో ఇలా పలికాడు. 'నాయనా! ఈ మాంసం అమ్మటం అనే పని నీవు చేయదగినదిగా నాకు అనిపించటం లేదు. నీవు చేసే ఈ ఘోరమైన పని చూసి నేను చాలా బాధపడుతున్నాను.'

వ్యాధుడన్నాడు - 'ద్విజా! నేను చేసేపని నా కులానికి తగినది. తాత తండ్రులనుంచీ వంశపరంపరగా వస్తున్నది. నేను నా ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాను. కాబట్టి కోపించదగదు. బ్రాహ్మణోత్తమా! పూర్వం బ్రహ్మదేవుడు నిర్ణయించిన నాకర్తవ్యాన్ని యథావిధిగా చేస్తూ, నేను ముసలివారైన నాతల్లిదండ్రులకు ప్రయత్నపూర్వకంగా సేవ చేస్తున్నాను. నిజమే చెపుతుంటాను. ఎవరినీ నిందించను. నాశక్తిని అనుసరించి దానం చేస్తుంటాను. దేవతలకు, అతిథులకు, కుటుంబంలోని సేవకులకు భోజనంపెట్టి మిగిలినదానితో శరీరాన్ని పోషిస్తుంటాను. నేను దేనిని నిందించను. బలవత్తరమైన ప్రారబ్ధం చేత కలిగే దుఃఖాన్ని నిందించను. పూర్వం చేసిన మంచి చెడు పనులఫలితం స్వయంగా కర్తను వెంటనంటుతుంది కదా ! విప్రోత్తమా! వ్యవసాయం, గోసేవ, వ్యాపారం, దండనీతి, త్రయీవిద్య- మూడువేదాలను అధ్యయనం చేసి వాటిని అనుసరించి యజ్ఞాలు చేయటం - ఈలోకంలో మానవుల జీవనవిధానం. వీటి వల్ల ఇహలోకపరలోకాల్లో ఉన్నతి కలుగుతుంది. శూద్రునికి సేవ, వైశ్యునికి వ్యవసాయం, క్షత్రియునికి యుద్ధం కర్తవ్యాలు. బ్రహ్మచర్యం, తపస్సు, వేదాధ్యయనం, నిజం చెప్పటం అనేవి బ్రాహ్మణునికి కర్తవ్యం. ధర్మం. తమ వర్ణధర్మాలను నిర్వహించటంలో ఆసక్తి కల ప్రజలను రాజు ధర్మపూర్వకంగా పరిపాలిస్తాడు. తమధర్మాన్ని వదలి అపమార్గం పట్టిన వాళ్ళను ధర్మానుసారం ప్రవర్తింపజేస్తాడు. ప్రజలకు శాసకులు కాబట్టి రాజులకు భయపడాలి. క్రూరమృగాలను బాణాలతో నిరోధించినట్లు రాజులు అపమార్గాన పోయేవానిని నివారిస్తారు. బ్రహ్మర్షీ! జనకుని పట్టణమైన ఈ మిథిలానగరంలో స్వవర్ణధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించేవాడు ఎవడూ లేడు. నాలుగు వర్ణాలవారూ కూడ స్వకర్మాచరణ తత్పరులుగా ఉంటారు. అటువంటివాడు జనకమహారాజు. చెడు నడతగలవాడు తనకుమారుడైనా దండించదగినవాడే అని దండిస్తాడు. ధర్మాత్ముని బాధించడు. జనక చక్రవర్తి అన్నివైపులా గూఢచారులను ఉంచి, అందరినీ ధర్మానుసారం గమనిస్తాడు. ధనసంపాదనం, రాజ్యరక్షణ, దుష్టశిక్షణ రాజుల కర్తవ్యం. రాజులు స్వధర్మాన్ని అనుసరిస్తూనే సమృద్ధిగా సంపద కావాలని కోరుకొంటారు. అంతేకాక రాజు అన్ని వర్ణాలవారికి రక్షకుడు అవుతాడు. నేను

స్వయంగా దేన్నీ హింసించను. ఇతరులు చంపిన వరాహాలను, మహిషాలను కొని, వాటి మాంసాన్ని ఎప్పుడూ అమ్ముతుంటాను.

మాంసం తినను. ఋతుకాలంలోనే భార్యాసంగమం చేస్తాను. ఎప్పుడూ పగలు ఉపవాసం ఉంటాను. రాత్రి మాత్రం భోజనం చేస్తుంటాను. శీలంలేనివాడైనా మానవుడు ఒకప్పుడు మంచిశీలం కలవాడు అవుతాడు. అలాగే ప్రాణిహింసలో ఆసక్తికలవాడు కూడా ధర్మాత్ముడు అవుతాడు. రాజుల స్వేచ్ఛాప్రవృత్తి దోషం వల్ల ధర్మం చాలా ఎక్కువగా సంకీర్ణం అవుతుంది. అధర్మం కూడా అభివృద్ధి చెందుతుంది. అందువల్ల ప్రజలలో వర్ణసాంకర్యం ఏర్పడుతుంది. ఆ స్థితిలో భయంకరాకారులు, పొట్టివారు, గూనివారు, పెద్దతలలవారు, నపుంసకులు, గుడ్డివారు, చెవిటివారు, పెద్దకన్నులు కలవారు జన్మిస్తారు. రాజులు అధర్మపరులు కావటంవల్ల ప్రజలు ఎల్లప్పుడు ఉనికిని కోల్పోతారు. మా జనకమహారాజు ప్రజలను ధర్మదృష్టితో చూస్తాడు. నరశ్రేష్ఠా! జనకమహారాజు ఎల్లప్పుడూ స్వధర్మతత్పరు లైన ప్రజలందరినీ తండ్రిలాగా రక్షిస్తాడు. నన్ను ప్రశంసించే వారినీ, నిందించేవారినీ అందరినీ నామంచి నడవడితో సంతోషపెడతాను. స్వధర్మాన్ని అనుసరిస్తూ, దానితోనే జీవించేవారు, ప్రజారక్షణకై సైన్యం సమకూర్చుకొన్నవారే రాజులు. ఇంద్రియాలను వశంచేసుకొని ఉన్నతిని కోరే రాజులు దేనినీ ఆశ్రయించరు. యథాశక్తిగా అన్నదానం చేయటం, ఇతరుల తప్పులను సహించటం, ఎల్లప్పుడూ ధర్మనిష్ఠతో ఉండటం, తగినవిధంగా పూజ్యులను పూజించటం, అనే మానవసద్గుణాలు, స్వార్థత్యాగం లేని పురుషుల్లో ఉండవు. అబద్ధాలు చెప్పటం వదలివేయాలి. అడక్కుండానే ఇతరులకు మేలుచేయాలి.

తనకు ఇష్టమైనది లభిస్తే అతిగా సంతోషించరాదు. తనకు ఇష్టం కానిది, బాధాకరమైనది జరిగితే అతిగా బాధపడరాదు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైతే మోహపరవశులై గాబరా పడరాదు. స్వధర్మాన్ని వదలకూడదు. పొరపాటువల్ల ఒక తప్పుపని చేస్తే మళ్ళీ దాన్ని చేయగూడదు. తనకూ, పరులకూ మంచి పనిని ఆలోచించాలి. ఆ పనిలో తనను లగ్నం చేసుకోవాలి. ఎవరైనా తనవిషయంలో చెడుగా ప్రవర్తిస్తే దానికి బదులు తాను కూడా చెడుగా ప్రవర్తించరాదు. అందరితో మంచిగానే ఉండాలి. ఇతరులకు కీడు చేయదలచిన పాపాత్ముడు స్వయంగానే నష్టపోతాడు. ఇతరులకు కీడుచేయటం దురాచారులకు వలె దుర్వ్యసనాలకు లోనైన పాపాత్ముల పనే అవుతుంది. ధర్మమే లేదనుకొని మంచినడవడి కల ఉత్తములను పరిహసిస్తూ, ధర్మం మీద నమ్మకం లేనివాళ్ళు తప్పకుండా నష్టపోతారు. పాపాత్ములు సారం లేకపోయినా గాలితో కొలిమితిత్తిలాగా పైకిమాత్రం నిండుగా కనిపిస్తారు. బ్రాహ్మణశ్రేష్ఠా! ఉత్తముడు అంతటా నమస్కరింపబడుతూనే ఉంటాడు. అహంకారంగల

మూర్ఖులు ఆలోచించే విషయాలన్నీ సారరహితంగానే ఉంటాయి. సూర్యుడు పగటిపూట రూపాన్ని కనిపింపచేసినట్టు వాళ్ళ అంతరాత్మ వాళ్ళ అసలు స్వరూపాన్ని వ్యక్తం చేస్తుంది. మూర్ఖుడు కేవలం ఆత్మప్రశంసతో లోకంలో కీర్తిపొందడు. విద్వాంసుడు సంపద, సౌందర్యం లేకపోయినా జగత్తులో కీర్తిప్రతిష్ఠలు పొందుతాడు. ఎవ్వరినీ నిందించకుండా ఆత్మప్రశంస చేసుకోకుండా కేవలం సద్గుణాలు మాత్రమే కలవాడెవడూ ఈ భూమిమీద కన్పించడు. పరనిందను, ఆత్మప్రశంసను వదలనివాడు ఎంతగుణవంతుడైనా ఈలోకంలో గౌరవం పొందటం కన్పించదు.

మానవుడు పాపంచేసినందుకు నిండుమనస్సుతో పశ్చాత్తాపపడితే పాపవిముక్తుడు అవుతాడు. 'ఇకముందు మళ్ళీ ఇలాంటిపనిని చేయను' అని గట్టిగా నిశ్చయించుకొంటే ఆ పాపదోషం అసలు అంటదు. బ్రాహ్మణోత్తమా! శాస్త్రం విధించిన జపతపోయజ్ఞాదులలో దేన్ని అయినా నిష్కామంగా చేస్తే పాపవిముక్తి కలుగుతుంది. ధార్మిక విషయాలను గురించి ఇలా చెప్పినట్లు వేదాల్లో కనిపిస్తుంది. ధర్మాత్ముడైనా మొదట తెలియక పాపంచేసి ఉంటే తరువాత నిష్కామంగా మంచిపనిచేస్తే ఆ పాపం పోగొట్టుకొంటాడు. ధర్మజ్ఞా! పొరపాటున అతడు చేసిన పాపాల నుంచి ధర్మమే అతని పాపాలను పోగొట్టుతుంది. మానవుడు పాపం చేసికూడా నేను పాపాత్ముడను కాను అని అనుకోకూడదు. అతని పాపాన్ని దేవతలు, అతని హృదయంలో ఉండే పరమాత్మ చూస్తుంటారు. కార్యదీక్షకలవాడు ఇతరుల తప్పులను చూడకుండ మంచిపనులే చేయగోరాలి. తన తప్పులను గమనించకుండా ఇతరుల దోషాలను చూసేవాడు, మంచివాళ్ళ పొరపాట్లను వస్త్రానికున్న రంధ్రాలలాగా ఎత్తి చూపే పాపాత్ముడు మరణించిన తరువాత పరలోకంలో బాధలపాలవుతారు. మానవుడు మొదట పాపం చేసినా తరువాత మంచిపనులు చేస్తే పెద్దమేఘం చాటునుండి ఇవతలకి వచ్చిన చంద్రునిలాగా సర్వపాపాలనుంచి విముక్తుడు అవుతాడు. **సూర్యుడు ఉదయించి, అంతకు ముందు ఉన్న చీకటిని పోగొట్టినట్లు నిష్కామంగా మంచిపనులు చేసేవాడు అన్ని పాపాలనుంచి విముక్తుడు అవుతాడు.**

పాపాలకు నివాసస్థానం లోభమే అని తెలుసుకో. బాగా శాస్త్రజ్ఞానం లేని లోభులే పాపకార్యాలు చేయటానికి ప్రయత్నిస్తుంటారు.

గడ్డితో మూసుకుపోయిన బావులలాగా ధర్మం ముసుగులో అధర్మాలు కప్పుకొని ఉంటాయి. ధర్మాత్ములుగా కనిపించే ఈ అధార్మికులలో ఇంద్రియనిగ్రహం,ముందు చెప్పుకొన్న పవిత్రతలు, ధర్మాన్ని బోధించే మాటలు అన్నీ ఉంటాయి. కాని శిష్టాచారం మాత్రం దుర్లభం.' తరువాత బుద్ధిమంతుడైన ఆ బ్రాహ్మణుడు 'మానవోత్తమా! నాకు

శిష్టాచారం ఎలా తెలుస్తుంది ?' ఇవన్నీ నీవు చెపుతుంటే వినాలి అని ఉంది. వాటిని ఉన్నవి ఉన్నట్లుగా చెప్పవలసింది. అని అడిగాడు.

బ్రాహ్మణశ్రేష్ఠా! యజ్ఞం, దానం, తపస్సు, వేదాధ్యయనం, నిజం చెప్పటం – ఈ ఐదూ శిష్టుల ఆచారవ్యవహారాల్లో ఎప్పుడూ పవిత్రములని చెప్పబడతాయి. కామక్రోధాలను, దంభాన్ని, లోభాన్ని, కుటిలత్వాన్ని వశం చేసుకొని ధర్మాచరణమే చాలు ననుకొని సంతోషించేవారు సదాచారసంపన్నులకు ఆదరపాత్రులైన వారు శిష్టులు. నిరంతరం యజ్ఞస్వాధ్యాయపరులైన వారికి స్వేచ్ఛాప్రవర్తనం ఉండదు. సదాచార రక్షణం శిష్టుల రెండోలక్షణం. శిష్టాచారాల్లో గురుశుశ్రూష, సత్యం చెప్పటం, కోపం లేకపోవటం, దానం చేయటం అనే నాలుగూ ఎప్పుడూ ఉంటాయి. శిష్టాచారాన్ని మనస్సులో సుస్థిరంగా నిలిపి నేనుస్వీకరించే ఈ వృత్తి గురుశుశ్రూషాదులు లేనిచో ఎన్నటికీ రాదు. **వేదసారం సత్యం. సత్యసారం ఇంద్రియాలను వశంలో ఉంచుకొనటం.** ఇంద్రియసంయమనానికి సారం త్యాగం. ఈ త్యాగం శిష్టాచారంలో ఎప్పుడూ ఉంటుంది. బుద్ధిమోహంతో (అజ్ఞానంతో) గూడిన అపమార్గంలో వెళ్ళేవాళ్ళు, వారిని అనుసరించి వెళ్ళే వాళ్ళు కష్టాల పాలవుతారు. శిష్టులు ఎల్లప్పుడు ఉత్తమాచారపరాయణులు, వేదాధ్యయన పరులై, త్యాగతత్పరులై, ధర్మమార్గాన్ని అధిరోహించి; సత్యాన్ని, ధర్మాన్ని ఆశ్రయించి ఉంటారు. శిష్టాచారపరాయణులైన సజ్జనులు తమ ఉత్తమబుద్ధిని అదుపులో పెట్టుకొంటారు. గురువుల సిద్ధాంతాలను అనుసరిస్తారు. ధర్మార్థాల మీద దృష్టి నిలుపుతారు. కాబట్టి నీవు నాస్తికులను, శిష్టాచారాన్ని నాశనం చేసేవారిని, క్రూరులను, పాపాలోచనలు చేసేవారిని వదిలిపెట్టు. జ్ఞానాన్ని ఆశ్రయించి ధార్మికులను సేవించు. కామం, లోభం అనే మొసళ్ళతో నిండి పంచేంద్రియాల వల్ల గలిగే విషయాసక్తి అనే నీళ్ళు ఉన్న దేహ మనే నదిని ధైర్యాన్ని నావగా చేసుకొని జన్మాదిక్లేశా లనే దుర్గమస్థానాలను దాటి వెళ్ళు. తెల్లని వస్త్రం మీద ఏ రంగు అయినా స్పష్టంగా కనపడుతుంది. అలాగే శిష్టాచారం గల వ్యక్తి క్రమక్రమంగా సంపాదించుకొనే ధర్మం బుద్ధియోగమయమై చక్కగా వెలుగొందుతుంది.

అహింస, నిజం చెప్పటం అనేవి సర్వప్రాణులకు చాల మేలు కలిగిస్తాయి. అహింస అన్నిటిని మించిన ఉత్తమధర్మం. అది సత్యం మీదనే నిలిచిఉంటుంది. ఉత్తముల సత్కార్యాలన్నీ సత్యం మీదనే నడుస్తాయి. కాబట్టి శిష్టులు ఆచరించే సత్యమే చాలాగొప్పది. సదాచారం సత్పురుషుల ధర్మం. సదాచారంతోనే సజ్జనులను గుర్తించవచ్చు (సదాచారమే సజ్జనలక్షణం). ఏ ప్రాణికి ఏది సహజస్వభావమో ఆ ప్రాణి దాన్నే పొందుతాడు. మనస్సును స్వాధీనంలో ఉంచుకోలేని పాపాత్ముడు కోపం, కామం

మొదలైన దోషాలను పొందుతాడు. న్యాయంతో గూడిన కార్యారంభమే ధర్మమని చెప్పబడింది. అనాచారమే అధర్మం అని శిష్టుల ఉపదేశం. కోపించని వారు, ఇతరుల తప్పులను చూడనివారు, అహంకారం, ఈర్ష్య లేనివారు, ఋజుప్రవర్తన, మనోనిగ్రహం బాగా ఉన్నవారు శిష్టాచారులు అవుతారు. మూడువేదాలు అధ్యయనం చేసినవారిలో శ్రేష్ఠులు, పవిత్రులు, సదాచారసంపన్నులు, దృఢమైన మనస్సుగలవారు. గురుసేవ చేసినవారు, ఇంద్రియాలను జయించినవారు శిష్టాచారులు అవుతారు. సత్త్వగుణసంపన్నులు; ఇతరులకు కష్టమైన ఆచారాలు, సత్కర్మలూ చేసేవారు; తమ మంచిపనులచేత లోకంలో గౌరవం పొందేవారు చేసిన పాపకర్మ నశించిపోతుంది. సజ్జనులు ఆచరించినది, అనాది, సనాతనం, నిత్యం, అసామాన్యం అయిన ధర్మాన్ని ధర్మదృష్టితోనే చూసే విద్వాంసులు స్వర్గానికి వెళ్తారు.

ఆస్తికులు, గర్వం లేనివారు, బ్రాహ్మణులను గౌరవించే వారు, విద్వాంసులు, సదాచారసంపన్నులు అయిన సజ్జనులు తుదకు స్వర్గనివాసులు అవుతారు. **వేదం చెప్పిన ధర్మం ఉత్తమం. ధర్మశాస్త్రాలలో చెప్పినది రెండోది. శిష్టుల సదాచారం మూడోది అని ధర్మలక్షణం మూడు విధాలు.** విద్యలను అధ్యయనం చేయటం, పుణ్యతీర్థాలలో స్నానం, ఓర్పు, సత్యం, కపటం లేకపోవటం, పవిత్రత అనేవి ఉత్తముల ఆచారానికి నిదర్శనం.

సర్వభూతదయ కల్గినవారు ఎప్పుడూ అహింసనే పాటిస్తూ ఉంటారు. ద్విజులపై ప్రీతితో ఎన్నడూ పరుషంగా మాట్లాడరు. పుణ్యపాప కర్మలయొక్క ఫలాల పరిణామాన్ని శిష్టులు గ్రహిస్తారు. పుణ్యఫలమైన సుఖాన్ని కోరరు. పాపఫలమైన దుఃఖాన్ని సహిస్తారు. అట్టివారే శిష్టులు. న్యాయపరాయణులు, సద్గుణసంపన్నులు, అందరిమేలు కోరేవారు, శుద్ధులు హింస చేయక, మంచిత్రోవలో నడిచే సత్పురుషులు స్వర్గాన్ని జయించినవారు. 1) దాతలు, 2) తమకుటుంబంలోని వారికి వస్తువులను సమానంగా పంచి తక్కింది తాము ఉపయోగించే వారు, 3) దీనులమీద దయచూపేవారు, 4) అందరి ఆదరాన్ని పొందేవారు, 5) విద్యయే ధనంగా గలవారు, 6) స్వధర్మానుసారులు, 7) సర్వప్రాణులయందు దయచూపేవారు, 8) ఇతర శిష్టులకు ఇష్టమైనవారే శిష్టులు. దానం చేసిన తరువాత మిగిలిన దానిని ఉపయోగించేవారు ఈలోకంలో సుఖసంపదలను, పరలోకంలో సుఖాన్ని పొందుతారు. ఉత్తములైనవారు పవిత్రవ్యక్తులు వద్దకు వచ్చి ఏదైనా అడిగితే వారు కుటుంబంలోని భార్యాదులకు బాధకలిగినా మనస్సు స్థిరపరచుకొని తమశక్తిని మించి దానం చేస్తారు. న్యాయపూర్వకంగా జీవితాన్ని గడుపుకోవటమూ, ధర్మాన్ని రక్షించటమూ తమకు మేలు కలగటమూ ఎలాగా? అని వారు ఆలోచిస్తారు. ఈవిధంగా ఉండే

సజ్జనులు చాలాకాలం అభివృద్ధి నందుతారు. అహింస ఆచరించే వారు, సత్యాన్ని చెప్పేవారు, మార్దవం, ఋజుప్రవర్తన కలిగి కీడు చేయనివారు – అహంకరించకపోవటం, లజ్జ, ఓర్పు, దమం, శమం, కలిగినవారు, బుద్ధిమంతులు, సంతుష్టులు, ప్రాణులమీద దయచూపేవారు, కామం, ద్వేషం లేనివారు – ఇటువంటి సజ్జనులు జనానికి ప్రమాణంగా ఉంటారు. 'ఎవరికిని ద్రోహం చేయరాదు; దానం చేయాలి; ఎల్లప్పుడు సత్యాన్నే చెప్పాలి.' అని సజ్జనుల నియమాన్ని గుర్తుచేస్తూ పెద్దలు మూడు విషయాలనే చెప్పారు. సర్వవిషయాలలో దయగలవారు, కరుణానుభూతి గల సజ్జనులు లోకంలో సంతృప్తితో ఉత్తమ ధర్మమార్గంలో పయనిస్తారు. తమ. యీ ధర్మాలను దృఢంగా నిశ్చయించుకొనిన మహాత్ములే శిష్టాచారవంతులు. **అసూయ లేకుండుట, ఓర్పు, శాంతి, సంతోషం, ప్రేమగా మాట్లాడటం, కోరికలను కోపాన్ని వదలటం, శిష్టాచారాన్ని అనుసరించటం, శాస్త్రానుసారం తనపని చేయటం అనేవి సజ్జనుల శ్రేష్ఠమార్గం.** ద్విజోత్తమా! శిష్టాచారాన్ని సేవించే ధర్మాత్ములు ప్రజ్ఞారూపమైన సౌధాన్ని ఆరోహించి, నానావిధాలైన లోకప్రవృత్తులను అధికమైన పుణ్యపాపాలను సమీక్షిస్తూ, సంసార భయవిముక్తు లవుతారు. నేను తెలుసుకొన్న, నాకు తెలిసిన శిష్టాచార సుగుణాలను అన్నింటినీ నీకు చెప్పాను.

208. హింసాహింసల నిర్ణయము.

అప్పుడు ధర్మవ్యాధుడు కౌశికునితో ఇలా అన్నాడు. 'ఈ మాంసం అమ్మటం అనే పని చాలా ఘోరమైన దనటంలో సందేహం లేదు. కౌశికా! విధి బలీయమైనది. పూర్వజన్మలో చేసిన కర్మఫలాన్ని అతిక్రమించటం చాలా కష్టం. ఈ వ్యాధజన్మ నా పూర్వజన్మలో చేసిన పాపఫలం. ఈ దోషాన్ని పోగొట్టుకొనటానికి ప్రయత్నం చేస్తున్నాను. ఒకప్రాణికి బ్రహ్మ పూర్వమే మృత్యువును నిర్ణయిస్తాడు. అప్పుడు కసాయివాడు ఆ జంతువు మరణానికి కారణం అవుతాడు. ఈ పనిలో మానవులు నిమిత్తమాత్రులు. ఇతరులు చంపిన వాటి మాంసాన్నే నేను ఇక్కడ అమ్ముతున్నాను. బ్రతికిఉన్నప్పుడు ఆ జంతువులను యాగంలో వినియోగించి, శేషం భక్షిస్తే ధర్మమే అవుతుంది. మాంసభక్షణం మాత్రం ధర్మం కాదు. దేవతలను, పితృదేవతలను, అతిథులను, తాను పోషింపదగిన వారిని పూజించటం, ఆదరించటం ధర్మం. వరి, అరటి మొదలైనవి, తీగెలు, పశువులు, మృగాలు, పక్షులు – ఇలాంటివి అన్నీ ప్రాణు లన్నింటికి అనాదికాలంనుంచి ఉపయోగపడేవి అని వేద మంత్రాలు చెపుతున్నాయి కదా. ద్విజసత్తమా! పూర్వకాలంలో ఉశీనరుని పుత్రుడు, సహనశీలి యైన శిబి ఆకలిగొన్న డేగకు పావురానికి బదులుగా తన మాంసాన్ని

ఇచ్చి, దాని మహిమవల్ల పరమదుర్లభమైన స్వర్గానికి వెళ్లాడు. ఈ మాంసవిక్రయం స్వధర్మం కాబట్టి వదలను. మాపూర్వుల బ్రతుకుతెరువు ఇదే కాబట్టి దీనితో నాజీవితాన్ని వెళ్ళదీస్తున్నాము. స్వధర్మమైన పనిని వదలివేసినవానిని అధర్ముడని ఈ లోకంలో అంటారు. కర్తవ్య తత్పరుడే ధర్మాత్ముడని నిర్ణయం. పూర్వజన్మలో చేసిన కర్మ జీవుని వదలదు. కర్మనిర్ణయాన్ని అనేక విధాలుగా చేయటంలో బ్రహ్మ ఈవిధానాన్ని దృష్టిలో ఉంచుకొన్నాడు. క్రూరకర్మలో నిమగ్నమైనవాడు "నేను ఏ మంచిపనిని ఎలా చేయాలి? ఈ పాపకర్మ నుండి ఎలా విముక్తుడను అవుతాను?" అని ఎప్పుడూ ఆలోచన చేస్తూ ఉండాలి. ఈ విధంగా చాలాసార్లు ఆలోచించటం వల్ల ఆ ఘోరకర్మనుంచి విముక్తి పొందటానికి ఒక మంచి ఉపాయం నిశ్చిత మవుతుంది. దానం, నిజం చెప్పటం, గురుశుశ్రూష, బ్రాహ్మణులను గౌరవించటం, ధర్మాచరణతత్పరత, అతివాదానికీ అభిమానానికీ దూరంగా ఉండటమూ నాకు అలవాటు.

కొంతమంది వ్యవసాయం మంచిది అంటారు. కాని దానిలోనూ హింస ఉన్నది. నాగలితో భూమి గున్నే వారు భూమిలో ఉన్న అనేకజీవులను చంపుతున్నారు. ఈ విషయంలో నీకు ఏమనిపిస్తున్నది ? ఆహారానికి అవసరమైన ధాన్యబీజాలు అన్నీ జీవం ఉన్నవే. ఈ విషయంలో నీకు ఏమనిపిస్తుంది ? బ్రాహ్మణోత్తమా! కొంతమంది మనుష్యులు పశువులను పట్టుకొని చంపి తింటారు. అలాగే చెట్లను, పంటలను కోస్తారు. వృక్షాల్లో, పంటలలో, నీళ్ళల్లో అనేక జీవులు ఉన్నవి గదా! ఆ విషయంలో నీకు ఏమి అనిపిస్తున్నది ? జీవులను తిని జీవించే ప్రాణులతో ఈ జగత్తు అంతా వ్యాప్తమై ఉన్నది. చిన్నచేపను తిని పెద్దచేప బ్రతుకుతున్నది. ఆ విషయంలో నీకు ఏమి తోస్తున్నది ? ద్విజోత్తమా! అనేకరీతులుగా జీవులు జీవులతోనే ప్రాణధారణ చేస్తున్నవి. ప్రాణులు ఒకదానిని ఇంకొకటి తింటున్నవి. ఆ విషయంలో నీకు ఏమి అనిపిస్తున్నది. మానవులు భూమిమీద సంచరించే అనేకప్రాణులను అనాలోచితంగానే కాళ్ళతో త్రొక్కి చంపుతున్నారు. అది నీకు ఎలా అనిపిస్తున్నది ? విజ్ఞానులు, మహాజ్ఞానులు కూడా కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు అనుకోకుండా అనేకజీవులను అనేకరీతులుగా చంపుతున్నారు. అది చూస్తే నీకు ఏమనిపిస్తున్నది ? ఆకాశం నుంచి భూమిదాకా ఈ లోకం అంతా జీవులతో నిండి ఉంది. ఎందరో మనుష్యులు తెలియకుండానే జీవహింస చేస్తున్నారు. ఆ విషయంలో నీకు ఏమనిపిస్తున్నది ? పూర్వకాలంలో నిరహంకారులైన అనేకమహాత్ములు అహింసను ఉపదేశించారు. కాని ఈలోకంలో సామాన్యదృష్టితో చూస్తే జీవహింస చేయనివారు ఎవరున్నారు ? బాగా ఆలోచిస్తే హింపచేయనివాడు ఎవడూ లేడని నానిశ్చయం. అహింసా తత్పరులైన యతులు

ఎంతోయత్నించి, కూడా కొద్దో గొప్పో హింస చేస్తూనే ఉన్నారు. కాకపోతే ప్రయత్నం వల్ల హింస తగ్గుతుంది. అంతే.

ఉత్తమవంశంలో పుట్టినవారు, మంచిగుణాలు కలవారు, తెలుసుకొనదగినది తెలిసినవారు కూడా మహాఘోర కార్యాలను చేసి సిగ్గుపడుతుంటారు. మిత్రులు మిత్రులను, శత్రువులు శత్రువులను మంచి పనులను చేస్తున్నవారినైనా సదభిప్రాయంతో చూడరు. బంధువులు సంపన్నులైన చుట్టాలను చూసి సంతోషించలేరు. పండితుల మనుకొనే మూడులు గురువులను కూడా నిందిస్తారు. ఈ విధంగా లోకంలో అనేకరీతులుగా తారుమారైన విషయాలు కన్పిస్తూ ఉంటాయి. అధర్మంతో ధర్మం కలిసిపోయినట్లు కనపడుతుంది. ఈవిషయం నీకు ఏమనిపిస్తున్నది? ధర్మాధర్మకార్యాలను గురించి ఇంకా చాలా చెప్పవచ్చు. కాని ఒకటి నిశ్చయం. స్వధర్మతత్పరుడు చక్కని కీర్తిసంపన్ను డవుతాడు.

209. ధర్మసూక్ష్మత, పరబ్రహ్మప్రాప్త్యుపాయము.

ధర్మవ్యాధుడు కౌశికునికి నేర్పుతో చెప్పసాగాడు. ధర్మనిర్ణయంలో వేదమే ప్రమాణం అని పెద్దల ఉపదేశం. ఇది నిజం. అయినా ధర్మస్వరూపం చాలా సూక్ష్మమైనది. దానిలో అనేకభేదాలు, శాఖలు ఉన్నాయి. ప్రాణాపాయం కలిగినప్పుడు, కన్యావివాహంలో అవసరం ఐతే అసత్యం చెప్పవచ్చు. నిజం చెప్పటం వల్ల ప్రాణాపాయాదులు కలిగేటట్లయితే అబద్ధం చెప్పవచ్చు. అసత్యం వల్ల ఒక్కొక్కప్పుడు సత్యఫలం కలగవచ్చు. అలాగే ప్రాణాపాయ సమయంలో సత్యం చెప్పడం వల్ల (ఒకని ప్రాణాలు పోయి) అసత్యానికి వచ్చే ఫలితం కలగవచ్చు. **ప్రాణులకు చాలా మేలు కలిగించేది నిజానికి సత్యం. ఎవరికైనా కీడు కలిగించేది చూడటానికి నిజమైనా అసత్యం, అధర్మం అవుతుంది. ఇలా పరిశీలిస్తే ధర్మగతి ఎంత సూక్ష్మమో తెలుస్తుంది.*** మనుష్యుడు తాను చేసే మంచి చెడు పనులఫలం తప్పక పొందుతాడు. ఇందులో సందేహం లేదు. తనకు భరింపరాని బాధ కలిగితే మూర్ఖుడు దేవతలను తీవ్రపదాలతో నిందిస్తాడు. కాని ఇది తాను చేసిన దుష్కర్మల ఫలితం అని తెలుసుకోలేడు. మూర్ఖుడు, స్వార్థంతో ఇతరులకు అపకారం చేసేవాడు, చపలచిత్తుడు, భ్రాంతివల్ల సుఖంలో దుఃఖాన్ని, దుఃఖంలో సుఖాన్ని చూస్తాడు. ఆ సమయంలో తనతెలివితేటలు గాని, ఉత్తమనీతి గాని, పురుషార్థం గాని అతనిని రక్షించలేదు. పురుషప్రయత్నం వలన కలిగే కర్మఫలం పరాధీనం కాకపోతే ఎవడు ఏది కోరుకొంటే

* **యద్ భూతహితమత్యంతం తత్ సత్యమితిధారణా।**
విపర్యయకృతోఽధర్మః పశ్య ధర్మస్య సూక్ష్మతామ్ ॥ 4

వాడికి అది లభిస్తుంది.

ఇంద్రియ నిగ్రహం కలవారు, సమర్థులు, మేధావులు అయిన మానవులు గూడా తమపనులు చేసి చేసి అలసిపోయినా తాము కోరుకొన్న ఫలితాన్ని పొందలేకపోవటం లోకంలో మనం చూస్తుంటాం. ఇంకొకరకం మనుష్యుడు నిత్యమూ జీవహింసాపరుడై ఉంటాడు; జనాన్ని మోసం చేస్తుంటాడు. అయినా సుఖంగా జీవిస్తుంటాడు. మరోరకం వాడు ఏ పనీ చేయకుండా ఊరకనే కూర్చుంటాడు. అయినా వానిని లక్ష్మి సేవించటానికి వస్తుంది. ఇంకొకడు ఎప్పుడూ ఏదో ఒకపని చేస్తూకూడా తగినఫలితాన్ని పొందలేడు. కొంతమంది దురదృష్టవంతులు సంతానకాంక్షతో దేవతలను పూజిస్తారు. తపస్సు చేస్తారు. ఆ తల్లిగర్భంలో పదినెలలూ మోసి కన్న పిల్లలు వంశనాశకులుగా తయారవుతారు. మరికొంతమంది పిల్లలు తల్లిదండ్రులు చేసిన ఆయాపుణ్యకర్మలవల్లనే తాతతండ్రులు సంపాదించిన ధనధాన్యాలు, భోగభాగ్యాలు గలిగి జన్మిస్తారు. మానవులకు రోగాలు (పూర్వజన్మ) తాము చేసుకొన్న కర్మలవల్ల కలుగుతాయి అనటంలో సందేహం లేదు. వేటగాళ్ళు చిన్నజంతువులను బాధించినట్లు ఆధివ్యాధులు మానవులను బాధిస్తాయి. ఆ రోగాలను (అనుభవించవలసిన సమయం పూర్తి అయితే) మంచి మందులను సమకూర్చుకొనే నేర్పరులైన వైద్యులు ఆటవికులు అడవిలోని జంతువులను పారద్రోలినట్లు పోగొడతారు. ధర్మాత్ములలో శ్రేష్ఠుడా! కౌశికా! ఈ విచిత్రం చూడు - కొంతమందికి కావలసిన సంపదలూ, ఆహారమూ ఉన్నా అతిసార రోగంతో వాటిని అనుభవించలేరు. మరికొంతమంది బాహుబలం ఆరోగ్యం, జీర్ణశక్తి ఉండి కూడా చాలా కష్టపడి పట్టెడన్నం తింటారు. వాళ్ళు ఎప్పుడూ ఆకలితో బాధపడుతుంటారు. ఈ విధంగా అసహాయమూ, మోహశోకమగ్నమూ అయి ఉంటుంది ఈ లోకం. బలీయమైన ప్రవాహంలో చాలాసార్లు ఆదివ్యాధులు అనే తరంగాల తాకిడితో అటూ ఇటూ కొట్టుకొంటూ సాగుతుంటుంది.

ప్రాణులు తమవశంలో తాము ఉంటే ముసలివారు కారు. మరణించరు. అందరూ తాము కోరుకున్న సర్వసుఖాలను అనుభవిస్తారు. అనిష్టాన్ని చూడరు. లోకంలో జనులందరూ ఒకరికంటే ఒకరు పైకి పైకి - ఉన్నతస్థితికి వెళ్ళటానికి యధాశక్తిగా ప్రయత్నిస్తారు. కాని ఎల్లప్పుడూ అన్నిచోట్లా అలా జరగదు. లోకంలో చాలామంది జనులు ఒకే నక్షత్రంలో పుట్టి ఉంటారు. వారికి జాతకర్మాది సంస్కారాలు సమానంగానే జరుగుతాయి. కాని వారు పూర్వజన్మలో చేసిన పుణ్య పాపకర్మల ననుసరించి ఫలప్రాప్తి కన్పిస్తుంది. ఉత్తమ బ్రాహ్మణా! కొంతమంది తమచేతిలో ఉన్న వస్తువును కూడా ఉపయోగించుకోవటంలో సమర్థులు కాలేరు. పూర్వజన్మలో చేసిన కర్మఫలాన్నే ఈ లోకంలో జనులు పొందటం

కన్పిస్తుంది. వేదానుసారం ఈ జీవాత్మ నిశ్చయంగా సనాతనుడే – నిత్యుడే. వ్యావహారికంగా ఉన్న సమస్తప్రాణుల శరీరాలు లోకంలో అశాశ్వతాలు. శరీరానికి తీవ్రమైన దెబ్బలు తగిలితే ఆ దేహం నాశనం అవుతుంది. జీవుడు కర్మబంధానికి ఆధీనుడై మరొక శరీరంలో ప్రవేశిస్తాడు. బ్రాహ్మణుడు అన్నాడు – 'ధర్మం తెలిసిన వక్తలలో ఉత్తముడవు నీవు. ధర్మవ్యాధా! జీవుడు ఎలా శాశ్వతుడు అవుతాడు? ఈ విషయం ఉన్నది ఉన్నట్లు తెలుసుకోవాలనుకొంటున్నాను.' వ్యాధుడు అన్నాడు – శరీరం నశిస్తే జీవుడు నశించడు. జీవుడు మరణిస్తాడు అనటం మిథ్య – అసత్యం. కాని జీవుడు ఈ శరీరం వదిలిపెట్టి ఇంకొక శరీరంలోకి వెళ్ళుతాడు. శరీరంలో ఉండే ఐదు తత్త్వాలు పంచభూతాలలో కలవటమే దాని నాశం అని చెప్పాలి. (అందుకే చనిపోయాడనటానికి పూర్వం పంచత్వం పొందాడనేవారు). మానవలోకంలో మనుష్యుడు చేసిన కర్మను ఆ కర్త కంటే ఇతరుడు అనుభవించడు. తాను చేసిన ఏ కొంచెం కర్మఫలాన్ని అయినా తానే అనుభవిస్తాడు. చేసిన కర్మలు అనుభవానికి రావలసినవే కానీ నశించవు. పుణ్యాత్ములైన మానవులు పుణ్యశీలులు – పుణ్యకర్మలు చేస్తారు. అధములు పాపపుపనులు చేస్తారు. మానవుడు ఈ లోకంలో చేసిన కర్మలు అతనిని వెంబడిస్తాయి. వాటి ప్రభావం వల్ల ఆతడు ఇంకొక జన్మను పొందుతాడు. కౌశికుడు అన్నాడు – 'సజ్జనశ్రేష్ఠా! జీవుడు ఇంకొక గర్భంలో ఎలా జన్మిస్తాడు? పుణ్యపాపాలతో వానికి సంబంధం ఎలా ఏర్పడుతుంది? పుణ్యపాప జన్మలు ఎలా కలుగుతాయి?'

వ్యాధుడు అన్నాడు – 'ద్విజోత్తమా! ఈ కనిపించేది అంతా కర్మపరిణామమే అని పిండోత్పత్తిని గూర్చి చెప్పే ధర్మశాస్త్రాలలో ఉంది. ఆ విషయం అంతా నీకు సంక్షిప్తంగా చెపుతా. జీవుడు కర్మబీజాలను కూడబెట్టుకొని మళ్ళీ జన్మించే రీతిని చెపుతాను. పుణ్యకర్మలు చేసేవాడు పుణ్యాత్ముల గర్భం నుంచి, పాపాత్ముడు పాపగర్భం నుంచి జన్మిస్తాడు. పుణ్యకర్మానుష్ఠానం వల్ల జీవునికి దేవత్వమూ, పుణ్యపాపకర్మలు కలవటం వల్ల మానవత్వమూ, తామసకర్మలవల్ల పశుపక్ష్యాది జన్మలూ కలుగుతాయి. కేవలం పాపకర్మలు చేయటం వల్ల నరకం కల్గుతుంది. మానవుడు తాను చేసిన తప్పులవల్ల పుట్టుక, మరణం, ముసలితనం మొదలగు బాధలతో ఎప్పుడూ పీడింపబడుతూ, ఎల్లప్పుడూ సంసారంలో వేగుతూ ఉంటాడు. పాపజీవులు కర్మబద్ధులై అనేకవేల పశుపక్ష్యాది జన్మలను పొంది, చివరకు నరకానికి వెళ్ళుతూ వాటిల్లోనే తిరుగుతుంటారు. జీవుడు తాను చేసిన ఆ యా పాపకర్మలవల్ల మరణానంతరం దుఃఖాలను అనుభవిస్తాడు. ఆ దుఃఖానుభవం కోసమే పాపపుజన్మ ఎత్తుతాడు. ఆ జన్మలలో కొత్త కొత్త పాపకర్మలు చేస్తాడు. వాటివల్ల

కీడు కలిగించే పదార్థం తిన్న రోగిలాగా నానాబాధలూ పడతాడు. ఎల్లప్పుడూ దుఃఖాలతో కష్టపడుతూ కూడా ఆ దుఃఖం పోతే సుఖం అని పేరు పెట్టుకొంటాడు. అప్పటికీ సంసారబంధం తొలగకపోవటం వల్లనూ, నూతన కర్మలు కలగటం వల్లనూ అనేకమైన కష్టాలు, బాధలు పడుతూ జనన మరణ రూప సంసారంలో చక్రంవలె పరిభ్రమిస్తూ ఉంటాడు. ద్విజశ్రేష్ఠా! బంధన హేతువులైన కర్మల అనుభవం పూర్తి అయి సత్కర్మఫలంగా పవిత్రుడు అయిన తరువాత తపస్సును, యోగాభ్యాసాన్ని ఆరంభిస్తాడు. అనేక పుణ్యకర్మల ఫలంగా ఉత్తమలోకసుఖాలను అనుభవిస్తాడు. ఇలా బంధాలు తొలగగా సత్కర్మలవల్ల పవిత్రుడై, పుణ్యలోకాలకు చేరుతాడు. అక్కడికి వెళ్లి పరితాపం చెందడు. పాపాలు చేసేవాడికి పాపకర్మలు చేయటమే అలవాటు అవుతుంది. దానికి అంతు ఉండదు. కాబట్టి పుణ్యకర్మలు చేయటానికి ప్రయత్నించాలి. పాపపు పనులు వదలిపెట్టాలి.

మానవుడు అసూయ లేకుండా కృతజ్ఞుడై మంచిపనులు చేస్తుంటే సుఖాలను, ధర్మార్థాలను, స్వర్గాన్ని పొందుతాడు. సంస్కార సంపన్నుడు, ఇంద్రియాలను జయించిన వాడు, పవిత్రాచారపరాయణుడు, మనస్సును వశం చేసుకొన్నవాడు, బుద్ధిమంతుడు అయినవాడికి ఇహలోక పరలోక సుఖాలు కలుగుతాయి. కాబట్టి మానవుడు సత్పురుష ధర్మాన్ని ఆచరించాలి. శిష్టులు చేసే ఉత్తమ కార్యాలను చేయాలి. లోకంలో ఏప్రాణికీ బాధ కలిగించకుండా జీవనం గడపటానికి తగిన వృత్తిని కోరాలి. లోకంలో చాలామంది వేదవేత్తలు, శాస్త్రజ్ఞానంలో నిపుణులు అయిన శిష్టులు ఉన్నారు. వారి ఉపదేశాన్ని అనుసరించి స్వధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే ధర్మసాంకర్యం లేకుండా ఉంటుంది. ద్విజసత్తమా! వివేకవంతుడు ధర్మాచరణంతో ఆనందపడతాడు. ధర్మాన్ని అనుసరించే బ్రతుకు తెరువు చూసుకొంటాడు. ధర్మంతో సంపాదించిన ధనంతోనే ఆ ధర్మమూలం తడిపి పోషిస్తాడు - ధర్మాన్ని ఆచరిస్తాడు. ధర్మంలోనే సద్గుణాలను చూస్తాడు. ఈ విధంగా ధర్మాత్ముడవుతాడు. ఈతని మనస్సు నిర్మలంగా ఉంటుంది. మిత్రుల సాంగత్యంతో సంతృప్తుడై ఇహలోక పరలోకాల్లో ఆనందిస్తాడు. అతడు ఇష్టమైన శబ్ద స్పర్శ రూప (రస)గంధాలతో అన్ని ఇంద్రియసౌఖ్యాలను, అధికారాన్ని పొందుతాడు. ఇది అంతా ధర్మఫలం అనే (పెద్దలు) భావిస్తారు. బ్రాహ్మణోత్తమా! ధర్మఫలాన్ని పొందిన పిదప సంసారసుఖంతో మాత్రమే తృప్తి పడడు. వీటిని జ్ఞాన దృష్టితో చూచి (ఇంద్రియతృప్తి మేలని అనుకొనక) నిర్వేదాన్ని - వైరాగ్యాన్ని పొందుతాడు. ఈ లోకంలో జ్ఞానదృష్టి కల వ్యక్తి రాగ ద్వేషాదులయిన దోషాలను అనుసరించడు. ఆయనకు యథేచ్ఛగా వైరాగ్యం కలుగుతుంది. అయినా ధర్మాన్ని ఆయన ఎప్పుడూ వదలడు. జగత్తు అంతా అశాశ్వతమని భావించి, అన్నింటిని

వదలిపెట్టటానికి ప్రయత్నం చేస్తాడు. తరువాత తగిన ఉపాయంతో మోక్షంకోసం ప్రయత్నం చేస్తాడు. అనుపాయాన్ని (ప్రారబ్ధాన్ని) అవలంబించి ఊరుకోడు. ఈ రీతిగా వైరాగ్యాన్ని పొంది పాపపుపనులు వదలిపెడతాడు. ధర్మాత్ముడవుతాడు. తరువాత పరమ మోక్షాన్ని పొందుతాడు. జీవునికి మేలు కలిగించేది తపస్సు. దానికి మూలం శమం (మనోనిగ్రహం), దమం (ఇంద్రియజయం). **మానవుడు మనస్సుతో కోరుకొనే వాటిని అన్నింటిని తపస్సు వల్ల పొందుతాడు. ఇంద్రియాలను నిగ్రహించటం, సత్యం పలకటం, మనోనిగ్రహం అనే వాటివల్ల మానవుడు పరబ్రహ్మ పదవిని పొందుతాడు.***

బ్రాహ్మణుడు అన్నాడు (అడిగాడు) – 'వ్యాధా! వేటిని ఇంద్రియాలు అంటారు? అవి ఏవి? వాటిని నిగ్రహించటం ఎలాగ? నిగ్రహానికి ఫలం ఏమిటి? ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవటం వల్ల ఏ ఫలం పొందుతాడు? ఈ ఇంద్రియనిగ్రహం అనే ధర్మాన్ని ఉన్నది ఉన్నట్లు తెలుసుకోవాలి అనుకొంటున్నాను. దాన్ని నాకు తెలియజెప్పు.'

210. సత్సాంగత్యము - బ్రహ్మవిద్యావర్ణనము.

వ్యాధుడు ఇలా అన్నాడు – బ్రాహ్మణోత్తమా! ఇంద్రియాల ద్వారా ఏ విషయమైనా తెలియటానికి మనస్సు ముందుగా ప్రవర్తిస్తుంది. విషయం తెలిసిన తరువాత మనస్సుకు దానిమీద రాగంగాని, ద్వేషంగాని కలుగుతుంది. అప్పుడు మనుష్యుడు దానిని పొందటానికి ప్రయత్నిస్తాడు. దానికోసం పెద్దపెద్ద పనులు ప్రారంభిస్తాడు. కావలసిన రూపరస గంధాదులు లభిస్తే వాటిని మాటిమాటికి అనుభవిస్తాడు. తరువాత ఆ విషయం మీద రాగం కలుగుతుంది. అది లభించకపోతే ద్వేషం కలుగుతుంది. దాని తరువాత కావలసిన వస్తువుకై లోభం ఏర్పడుతుంది. ఆ తరువాత మోహం కలుగుతుంది. ఇలా లోభం ఆక్రమించగా రాగద్వేషాలతో పీడితుడైన వాడి బుద్ధి ధర్మం మీదికి పోదు. ఒకవేళ ధర్మాచరణం చేసినా అది లోకవంచన మాత్రమే అవుతుంది. కపటంగా ధర్మం ఆచరిస్తాడు. దాన్ని అడ్డంపెట్టుకొని డబ్బు సంపాదించగోరుతాడు. వంచన వల్ల ధనాదులు రావటం మొదలయ్యాక వాడిబుద్ధి వాటి మీదనే లగ్నమవుతుంది. అందువల్ల పాపం చేయగోరుతాడు. మేలుకోరే మిత్రులు, పండితులు వారిస్తే అతడు తన పనిని సమర్థించుకోటానికి వేదవిరుద్ధమైన సమాధానం చెపుతూ అది వేదప్రతిపాదిత మని అంటాడు. రాగం అనే దోషం వల్ల మూడు రకాల అధర్మం ఏర్పడుతుంది. అది కలిగినవాడు మనస్సులో పాపపు ఆలోచనలు చేస్తాడు.

---

* ఇంద్రియాణాం నిరోధేన సత్యేన చ దమేన చ।
బ్రాహ్మణః పదమాప్నోతి యత్ పరం ద్విజసత్తమ ॥ 54

పాపపు మాటలు మాట్లాడుతాడు. పాపపు పనులు చేస్తాడు. అలాంటి అధర్మవర్తనం వల్ల ఆతని మంచిగుణాలు నశిస్తాయి. పాపాత్ములు తమతో సమానమైన వారితోనే స్నేహం చేస్తారు. అతడు ఆ పాపంవల్ల ఇహలోకంలో దుఃఖపడతాడు. పరలోకంలో ఆపదల పాలు అవుతాడు. ఇలా పాపాత్ముడు అవుతాడు. ఇక ధర్మాన్ని ఎలా పొందుతాడో విను. సుఖదుఃఖాలను తెలుసుకోవటంలో నేర్పరి తన బుద్ధితో ఈ విషయదోషాలను ముందుగానే గుర్తిస్తాడు. వాటిని తొలగించుకొని మంచివారితో మైత్రి చేస్తాడు. సత్సాంగత్యం వల్ల ఆతని బుద్ధి ధర్మంతో వెలుగొందుతుంది.

బ్రాహ్మణుడన్నాడు - 'నీవు ధర్మయుక్తమైన మంచి విషయాలు చెపుతున్నావు. ఇటువంటివి చెప్పే వాడు ఉండడు. నీవు దివ్యప్రభావం గల మహర్షి వని నాకు అనిపిస్తున్నది.' ధర్మవ్యాధుడు ఇలా చెప్పాడు - 'మహాభాగులు, ధర్మాత్ములైన బ్రాహ్మణులు, పితృదేవతలు ఎల్లప్పుడూ ముందుగా భోజనం చేయదగినవారు. కాబట్టి బుద్ధిమంతుడు ఇహలోకంలో వారికి అన్నివిధాలా ఇష్టమైన వాటినే చేయాలి. ద్విజోత్తమా! వారికి ఏది ఇష్టమో దానిని చెపుతాను. ముందుగా వారికి నమస్కరించి, బ్రాహ్మీ విద్యను చెపుతాను విను. పంచమహాభూతాత్మకమైన ఈ చరాచర జగత్తు అంతా అన్నివిధాలా అజేయమైన బ్రహ్మస్వరూపం. పర బ్రహ్మకంటె ఉత్కృష్టమైనది ఇంక ఏమీ లేదు. ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి అనేవి పంచమహాభూతాలు. శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అయిదూ క్రమంగా వాటి గుణాలు. ఆ ఆకాశాదుల గుణాలకు అధికత్వమూ, గంభీరత్వమూ మొదలైనవి అన్నీ ఉన్నవి. ఆ గుణాలకు పరస్పరం సంక్రమణం గూడా ఉన్నది. మొదటి మొదటి భూతాల గుణాలు క్రమంగా తరువాత ఉన్న గుణవంతమైన భూతాలు మూడింటిలో (అగ్ని, నీరు, భూములలో) ఉన్నవి. అంటే అగ్నిలో శబ్ద స్పర్శ రూపాలు, నీటిలో శబ్దస్పర్శ రూపరసాలు, భూమిలో శబ్దస్పర్శ రూప రసగంధాలు ఉన్నవి. ఈ పంచభూతాలే కాక ఆరవ తత్త్వం చేతన ఉన్నది. దీనినే మనస్సు అంటారు. ఏడవ తత్త్వం బుద్ధి. అహంకారం ఎనిమిదవ తత్త్వం. ఇవే కాక ఐదు జ్ఞానేంద్రియాలు, ప్రాణం, సత్త్వరజస్తమస్సులు అనే పదిహేడు తత్త్వాల సమూహాన్ని అవ్యక్తం అంటారు. ఐదు జ్ఞానేంద్రియాల, మనోబుద్ధుల వ్యక్త విషయాలు, అవ్యక్త విషయాలు బుద్ధిగుహలో దాగి ఉంటాయి. వాటిని అన్నిటిని కలిపితే 24 తత్త్వాలు అవుతాయి. ఈ తత్త్వాల సముదాయమే వ్యక్తావ్యక్తరూపమైన గుణాలు. ఇవన్నీ పరబ్రహ్మ స్వరూపాలే. బ్రాహ్మణా! ఇదంతా నీకు చెప్పాను. ఇంకా ఏమి వినాలని అనుకొంటున్నావు ?

211. పంచమహాభూతాల గుణములు - ఇంద్రియ నిగ్రహము.

బ్రాహ్మణుడు ఇలా ప్రశ్నించాడు - పంచభూతాలు అని చెప్పేవాటిల్లో ఒక్కొక్కదాని గుణాలను నాకు చెప్పు. వ్యాధుడన్నాడు - 'బ్రాహ్మణా! భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే అయిదు భూతాలలో ముందుముందువి తరువాతి ఉన్నవాని గుణాలతో కూడి ఉంటాయి. వాటి గుణాలను చెపుతాను. భూమిలో ఐదు గుణాలు, నీళ్లలో నాలుగు గుణాలు, తేజస్సులో మూడు, వాయువులో రెండు, ఆకాశంలో ఒకటి - గుణాలు ఉన్నవి. శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే ఐదు గుణాలు ఉన్నందువల్ల భూమి అన్నిభూతాలకన్నా అధిక గుణాలు కలిగి ఉన్నది. శబ్దం, స్పర్శ, రూపం, రసం అనే నాలుగు నీళ్ళగుణాలు. కౌశికా! వీటిని గూర్చి నీకు ఇంతకుముందే చెప్పాను. శబ్దం, స్పర్శ, రూపం అనే మూడు తేజస్సు గుణాలు. శబ్దం, స్పర్శ అనేవి రెండూ వాయుగుణాలు. శబ్దం ఒక్కటే ఆకాశగుణం. ఇలా పంచభూతాలలో ఈ పదిహేనుగుణాలు ఉన్నాయి. సమస్తజగత్తు వీటి మీదనే స్థాపితమై ఉన్నది. బ్రాహ్మణశ్రేష్ఠా! ఈ పంచభూతాలు ఒక దాన్ని ఒకటి అతిక్రమించకుండా ఉంటాయి. ఒకటి లేకుండా ఇంకొకటి ఉండదు. అన్నీ కలిసే చక్కగా ఉంటాయి. చరాచరా (వ్యక్తావ్యక్తా)లైన పంచభూతాలు విషమాలు (సమంగాలేనివి) ఐనప్పుడు ఈ జీవుడు కాలప్రేరణతో (తన సంకల్పానుసారం) ఇంకొక శరీరంలోకి వెళ్తాడు. ఈ పంచభూతాలు మృత్యువు కలిగినప్పుడు ప్రతిలోమక్రమంలో అదృశ్యం అవుతాయి. ఉత్పత్తి అయ్యేటప్పుడు అనులోమక్రమంలో ఏర్పడతాయి. విభిన్న శరీరాలలో పంచభూతాల నుంచి ఏర్పడిన రక్తాది ధాతువులు ఉన్నాయి. ఈ సమస్త చరాచర జగత్తు వాటితో వ్యాప్తమై ఉన్నది. బాహ్యేంద్రియాలతో దేనికి దేనికి సంసర్గం కలుగుతుందో అది వ్యక్తమనీ, ఇంద్రియగ్రాహ్యం కాకుండా అనుమాన ప్రమాణంతో తెలుసుకునేది అవ్యక్తమనీ భావించాలి. తమతమ విషయాలను అతిక్రమించకుండా (ఈ శబ్దాది విషయాలను గ్రహించే) ఈ ఇంద్రియాలను ఆత్మ తన వశంచేసుకొన్నప్పుడు ఆది తపస్సు చేస్తున్నట్లు ఉంటుంది. తనను అన్నిలోకాల్లో వ్యాపించిన వానినిగాను, తనలో లోకాలు అన్నీ ఉన్నట్లుగాను అతడు చూస్తాడు.

ఇలా సగుణ బ్రహ్మను తెలుసుకునే సమర్థుడైన జ్ఞాని అన్ని ప్రాణులను ఆత్మరూపంగా చూస్తాడు. అన్ని స్థితుల్లో ఎల్లప్పుడూ సమస్తప్రాణులను ఆత్మరూపంతో చూసే బ్రహ్మభూతుడైన జ్ఞానికి అపవిత్రమైన కర్మలతో సంబంధం కలగదు. అజ్ఞానం వల్ల కలిగిన క్లేశాన్ని అతిక్రమించిన ఆ మహాపురుషుడు లౌకికమైన తప్పనిపనులు మాత్రమే చేస్తూ జ్ఞానమార్గంతో మోక్షం పొందుతాడు. మేధావి, భగవంతుడైన బ్రహ్మదేవుడు తన నిఃశ్వాసాలైన వేదాలలో ముక్తుడైన జీవుని గురించి ఆద్యంతాలు లేనివాడు, స్వయంభువు, అవికారి (మార్పులేనివాడు),

సాటిలేనివాడు, నిరాకారుడు అని చెప్పాడు. వీటికి అన్నిటికి తపస్సే మూలం. ఇంద్రియాలను నిగ్రహించుకోవటంవల్లనే ఆ తపస్సు సిద్ధిస్తుంది కాని ఇంకో విధంగా కాదు. నీవు అడిగినదానికి ఇదే నా సమాధానం. స్వర్గనరకాలకు రెండింటికి ఇంద్రియాలే కారణం. ఇంద్రియ నిగ్రహం వల్ల స్వర్గమూ, ఇంద్రియ నిగ్రహం లేకపోవటం వల్ల నరకమూ కలుగుతాయి. మనస్సుతో గూడా ఇంద్రియాలను తనలో ఉంచుకోవటమే సంపూర్ణయోగానుష్ఠానం అవుతుంది. ఇదే తపస్సుకు అంతకూ మూలం. ఇంద్రియాలను వశంలో ఉంచుకోకపోవటమే నరకప్రాప్తికి హేతువు అవుతుంది. ఇంద్రియాలకు అనుచిత విషయాలతో సంబంధం వల్లనే దుష్కార్యాలు చేయటం మొదలైన దోషాలు కలుగుతాయి. ఆ ఇంద్రియాలనే చక్కగా వశంలో ఉంచుకొంటే తరువాత సిద్ధిని పొందవచ్చు. శరీరంలోనే ఎప్పుడూ ఉండే మనస్సుతో కూడా ఆరు ఇంద్రియాల మీద అధికారం సంపాదించిన జితేంద్రియుడైన వ్యక్తి పాపపుపనుల జోలికి పోడు. అలాంటప్పుడు అతనికి పాపంవల్ల కలిగే అనర్థాలు ఎలా సంభవిస్తాయి?

కంటికి కనపడే ఈ స్థూలశరీరం రథం అనీ, ఆత్మ (బుద్ధి) సారథి అనీ, ఇంద్రియాలను గుర్రాలు అనీ శ్రుతివాక్కులు చెపుతున్నవి. నేర్పరి, జాగ్రత్తకల ధీరుడయిన సారధి ఉత్తమాశ్వాలను తన వశంలో ఉంచుకొని సుఖంగా ప్రయాణం చేసినట్లు అప్రమత్తుడు, కుశలుడు, ధీరుడు అయిన పురుషుడు ఇంద్రియాలను వశంచేసుకొని సుఖంగా జీవితమార్గంలో ప్రయాణిస్తాడు. తన శరీరంలో ఉంటూనే క్షోభను కలిగించే ఇంద్రియాలు అనే ఆరు గుర్రాల పగ్గాలను జాగ్రత్తగా పట్టుకొని నడిపించే ధీరుడే ఉత్తమసారథి అవుతాడు. మార్గాలలో పరుగెత్తే గుర్రాలలాగా రాగద్వేషాది విషయాలలో సంచరించే ఇంద్రియాలను వశం చేసుకోవటానికి ధైర్యంతో ప్రయత్నం చేయాలి. ధీరతతో ప్రయత్నం చేసేవానికి వాటిమీద విజయం తప్పక లభిస్తుంది. నీళ్ళల్లో ప్రయాణించే పడవను గాలివాటం నడిపినట్లే విషయాల్లో సంచరించే ఇంద్రియాలతో గూడిన మనస్సు అనే ఒక్క ఇంద్రియమే దృఢత్వం లేని వ్యక్తి బుద్ధిని నడుపుతుంది. (చూ. భగవద్గీత అధ్యా. 2.శ్లో.67) మానవులు అందరూ అజ్ఞానం వల్ల ఈ ఆరుఇంద్రియాల ద్వారా గలిగే ఫలప్రాప్తి విషయంలో సందేహగ్రస్తు లవుతారు. కాని వాటి దోషాలను గుర్తించే విరాగి వాటిని నిగ్రహించి, ధ్యానప్రాప్తమైన ఆనందాన్ని అనుభవిస్తాడు.

212. త్రిగుణస్వరూపము - వాని ఫలము.

ఈ రీతిగా ధర్మవ్యాధుడు సూక్ష్మధర్మాన్ని నిరూపించిన పిదప కౌశికుడు ఏకాగ్రచిత్తుడై ఇంకొక సూక్ష్మ విషయాన్ని అడిగాడు. ఈ సందర్భానికి తగిన రీతిగా అడుగుతున్న

నాకు సత్త్వం, రజస్సు, తమస్సు అనే వాటి గుణాలను యథార్థరూపంగా - ఉన్నది ఉన్నట్లుగా - చెప్పవలసింది. ధర్మవ్యాధుడు అన్నాడు - కౌశికా! నీవు అడిగినదానికి సరైన సమాధానం చెపుతాను విను. సత్త్వ రజస్తమస్సు లనే గుణాలను విడివిడిగా చెపుతాను తెలుసుకో. ఈమూడింటిలో తమోగుణం మోహాన్ని కలిగించేది. వీటిల్లో రజోగుణం పనులలో ప్రవర్తింపజేసేది. సత్త్వగుణం అధిక ప్రకాశవంతం (ఉజ్జ్వలం) కాబట్టి అన్నిటికంటే శ్రేష్ఠం అంటారు. అజ్ఞానం అధికంగా గలవాడు, మూర్ఖుడు, ఒళ్లు తెలియకుండా ఎప్పుడూ నిద్రపోయేవాడు, ఇంద్రియ జయం లేనివాడు, వివేకం లేనివాడు, కోపిష్ఠి, సోమరి తామసుడు. లోక విషయాలు మాత్రమే మాట్లాడేవాడు, సలహాలు ఇవ్వటంలో నేర్పరి, ఇతరుల గుణాలలో దోషాలను చూడనివాడు, మిక్కిలి ఆశ కలవాడు, నమస్కరింపనివాడు, అభిమానం ఎక్కువగా ఉన్నవాడు రాజసుడు. ప్రకాశం (జ్ఞానం) అధికంగా గలవాడు, ధీరుడు, ఆసక్తి లేనివాడు, ఇతరులదోషాలు చూసే స్వభావం లేనివాడు, కోపం లేనివాడు, బుద్ధిమంతుడు, జితేంద్రియుడు సాత్త్వికుడు. పుణ్యపాప ఫలాల సంచయం యొక్క పరిణామాన్ని తెలుసుకొనే వారే శిష్టులు. వారినే ఇతర శిష్టులు సమ్మతిస్తారు. సాత్త్వికునిలో వైరాగ్యలక్షణం ముందుగానే కలుగుతుంది. అహంకారం తగ్గుతుంది. ఋజుప్రవర్తన వ్యక్తం అవుతుంది. తరువాత ఇతనిలో ఉండే రాగద్వేషాదు లయిన ద్వంద్వాలు పరస్పరం ఉపశమిస్తాయి. ఇతనికి ఎప్పుడూ ఏమాత్రమూ సంశయం కలుగదు. ద్విజోత్తమా! శూద్రజాతిలో జన్మించినా ఉత్తమ గుణాలను ఆశ్రయిస్తే వైశ్యత్వాన్ని, క్షత్రియత్వాన్ని పొందుతాడు. ఋజుప్రవర్తన కలిగి ఉంటే అతనికి బ్రాహ్మణత్వం కలుగుతుంది. ఈ విధంగా గుణాలను అన్నింటినీ నీకు చెప్పాను. ఇంకా ఏమి వినాలి అనుకొంటున్నావు?

213. ప్రాణవాయుస్థితి - పరమాత్మ సాక్షాత్కారము.

బ్రాహ్మణుడు అడిగాడు - శరీరంలో ఉండే అగ్ని స్వరూపమైన ప్రాణం పార్థివమైన ధాతువును ఆధారం చేసుకుని ఎలా ఉంటుంది? ప్రాణవాయువు నాడీమార్గం ద్వారా రక్తాదులను ఎలా కదిలించగలుగుతుంది? మార్కండేయుడు చెపుతున్నాడు - 'ధర్మజా! బ్రాహ్మణుడు వేసిన ఈ ప్రశ్నను విని ధర్మవ్యాధుడు ఆ మహాత్మునకు ఇలా చెప్పాడు. బ్రాహ్మణా! ప్రాణి శరీరాన్ని సురక్షితంగా ఉంచే అగ్ని స్వరూపమైన ఉదానవాయువు శిరస్సును ఆశ్రయించి శరీరంలో ఉంటుంది. ముఖ్యప్రాణం శిరస్సు, ఉదానవాయువు - రెండింటిలో ఉండి సంచరిస్తుంటుంది. భూత భవిష్యత్ వర్తమానాలు మూడూ ప్రాణాన్ని ఆశ్రయించి ఉంటాయి. ఆ ప్రాణం సమస్తభూతాల్లో శ్రేష్ఠం, పరబ్రహ్మనుంచి ఏర్పడే ఆ

ప్రాణాన్ని మనమంతా ఉపాసిస్తాం. ఆ ప్రాణమే జీవుడు. సమస్తజీవులకు అదే ఆత్మ, అదే సనాతనం. మహత్తు, బుద్ధి, అహంకారం, పంచభూతాల కార్యరూపాలయిన ఇంద్రియాలు, వాటి విషయాలు అదే.

(బ్రాహ్మణశ్రేష్ఠా! ఆ ప్రాణమే అవ్యక్తం, సత్వం, జీవం, కాలం, ప్రకృతి, పురుషుడు అయి ఉన్నది. అదే జాగ్రదవస్థలో మేలుకొని ఉంటుంది. స్వప్నావస్థలో కలలు కంటుంది. అదే మేలుకొన్నప్పుడు బలాన్ని చేకూరుస్తుంది. కాళ్ళు, చేతులు కదిలించే ప్రాణులలో కదలికలను కలిగిస్తుంది. ఆ ప్రాణసంచారం ఆగిపోతే ప్రాణి మరణించింది అని అంటారు. భూతాత్మకమైన ప్రాణమే ఒక శరీరాన్ని వదలి ఇంకొక శరీరాన్ని ప్రవేశిస్తుంది.)

ఈ రీతిగా లోకం అంతటిని ప్రాణమే పరిపాలిస్తుంది. తరువాత ఆ ప్రాణమే శరీరంలో ప్రవేశించి సమాన వాయువు అయినప్పుడు తన తన గమనాన్ని ఆశ్రయిస్తుంది. సమానవాయురూపంగా జఠరాగ్నిని ఆశ్రయించి, ఆ ప్రాణం మూత్రవిసర్జనేంద్రియాన్ని, మల విసర్జనేంద్రియాన్ని చేరినప్పుడు మలమూత్రాలను వహిస్తుంది. కాబట్టి అది అపాన వాయువుగా మారుతుంది. అదే ప్రాణం పనిచేసే ప్రయత్నంలో, పైకి ఎత్తటం వెళ్ళటం, బరువు నెత్తటం అనేదాంట్లో ప్రవర్తించినప్పుడు అధ్యాత్మవేత్తలు దాన్ని ఉదానం అంటారు. మానవశరీరంలోని అన్ని కీళ్ళలో వ్యాపించినపుడు ఆ వాయువును వ్యానం అంటారు. చర్మం మొదలైన ధాతువులలో జఠరాగ్ని వ్యాపించి ఉంటుంది. ప్రాణాదివాయుప్రేరితమై అది అన్నాది రసాలలో, చర్మాది ధాతువులలో పిత్తాది దోషాలను పరిపక్వం చేస్తూ శరీరం అంతటా పరుగెత్తుతూ ఉంటుంది. ప్రాణాది వాయువులు పరస్పరం కలియటం వల్ల సంఘర్షణ కలుగుతుంది. దానివల్ల వ్యక్తం అయ్యే వేడిమినే జఠరాగ్ని అని తెలుసుకోవాలి. అదే ప్రాణులు తిన్న ఆహారాన్ని అరిగిస్తుంది. సమానం, ఉదానం అనే వాయువుల మధ్యలో ప్రాణాపాన వాయువులు ఉంటాయి. వాటి ఒరిపిడివలన కలిగే జఠరాగ్ని ఆహారాన్ని అరిగిస్తుంది. దాని రసం వల్ల ఈ శరీరం బాగా పుష్టిని పొందుతుంది. ఈ జఠరాగ్ని స్థానం బొడ్డు దగ్గరనుంచి పాయువు దాకా ఉంటుంది. దీన్నే గుదం అంటారు. దానినుంచే దేహధారుల నాడీమార్గం ఏర్పడుతుంది. గుదంనుంచి ప్రాణం అగ్నివేగాన్ని వహించి గుదంచివరను తాకుతుంది. అక్కడినుంచి పైకి లేచి అది జఠరాగ్నిని కూడా పైకి లేపుతుంది. నాభి కింది భాగంలో పక్వాశయం (పక్వమైన ఆహారం ఉండే చోటు) ఉంటుంది. దానిపైన ఆమాశయం (అపక్వాహారం) ఉంటుంది. శరీరంలో ఉండే సమస్తప్రాణాలు నాభిమధ్యలో నిలిచి ఉంటాయి. అదే వాటికి కేంద్రస్థానం. హృదయాన్నుంచి క్రిందికి, పైకి నిలువుగా, అడ్డంగా, వ్యాపించి ఉన్ననాడులు పదివాయువులచే ప్రేరితాలై శరీరంలోని అన్నిభాగాల్లోకి అన్నరసాన్ని పంపుతాయి.

సమస్తక్లేశాలను జయించినవారు, సమదర్శనులు, ధీరులు, (సుషుమ్నా నాడి ద్వారా) తమ ప్రాణమయ మయిన ఆత్మను శిరస్సు (లో ఉండే సహస్రారచక్రం) లోకి తీసికొనిపోయిన యోగులు శిరస్సునుంచి గుదందాకా సుషుమ్నామయమార్గం ద్వారా పరమాత్మను పొందుతారు. ఈ విధంగా సమస్త జీవాత్మల శరీరాల్లో ప్రాణాపానవాయువులు వ్యాపించి ఉన్నాయి. ప్రాణాపాన వాయువులు జఠరాగ్నితో కూడి ఉంటాయి. ప్రాణం అపానంలో ఉంటుంది అని తెలుసుకో. ఆత్మ పదకొండు ఇంద్రియాలు అనే వికారాలు కలది. పదహారుకళలు కలది, శరీరాన్ని ధరించేది, నిత్యమైనది. అది యోగబలంతో మనోబుద్ధులను స్వాధీనం చేసుకొంటుంది అని తెలుసుకో. పాత్రలో ఉంచిన అగ్నివలె వెనకచెప్పిన కళాస్వరూపమైన శరీరంలో ప్రకాశస్వరూపమైన ఆత్మ ఎప్పుడూ ఉంటుంది. దానిని ఆత్మగా తెలుసుకో. అది నిత్యమూ, యోగ శక్తితో మనోబుద్ధులను స్వాధీనం చేసుకొంటుంది. పద్మపత్రం మీద నీటి బిందువు నిర్లిప్తంగా ఉన్నట్లు ఆత్మదైవం కళాత్మకశరీరంలో అసంగమై ఉంటుంది. దానిని క్షేత్రజ్ఞునిగా తెలుసుకో. అది యోగశక్తితో తన మనోబుద్ధులపై అధికారం కలది, నిత్యమైనది. సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు జీవాత్మకాలని తెలుసుకో. అంటే జీవాత్మ అంతఃకరణ వికారాలు, జీవుడు ఆత్మగుణం. ఆత్మయే పరమాత్మ. మహాత్ములు జడమైన శరీరాదులను జీవునికి భోగ్యమైనవానినిగా చెపుతారు. ఆ జీవుడు శరీరంలో ఉండి, తాను చేష్టాశీలుడై, శరీరేంద్రియాదులను అన్నింటిని ఆయా క్రియలలో కర్తవ్యోన్ముఖాలను చేస్తాడు. సప్తభువనాలను నిర్మించిన పరమాత్మను తెలుసుకొన్నవారు జీవునికంటె ఆయన ఉత్కృష్టుడని చెపుతారు.

సర్వభూతాత్మకుడైన పరమేశ్వరుడు అన్ని ప్రాణులలో వెలుగొందుతున్నాడు. జ్ఞానులు శ్రేష్ఠమైన సూక్ష్మబుద్ధితో ఆయనను దర్శిస్తారు. మానవుడు నిర్మలచిత్తంతో సత్కర్మలను, అసత్కర్మలను ఫలాన్ని ఇవ్వలేని వానినిగా చేస్తాడు. నిర్మలమైన అంతఃకరణం గలవాడు తనలో తాను ఉండి అక్షయసుఖాన్ని (మోక్షాన్ని) పొందుతాడు. ఆహారాదులతో తృప్తినందినవాడు సుఖంగా నిద్రించినట్లు, గాలి లేనిచో నిపుణుడు వెలిగించిన దీపం నిశ్చలంగా ప్రకాశించినట్లుగానే మనస్సు ప్రసన్నంగా ఉంటుంది. **సాధకుడు నిత్యమూ తేలికైన ఆహారం తింటూ అంతఃకరణాన్ని నిర్మలం చేసుకొంటూ రాత్రి మొదటి జాములో, చివరి జాములో పరమాత్మ ధ్యానంలో ఉండాలి.** ఇలా నిరంతరం తన హృదయంలో పరమేశ్వర సాక్షాత్కారానికి అభ్యాసం చేసేవాడు వెలుగులు వెదజల్లే దీపంలాగా ప్రకాశించే తన ప్రకాశవంతమైన మనోమయ దీపంతో నిరాకార పరమాత్మను సాక్షాత్కరింపజేసుకొని ముక్తుడు అవుతాడు. **అన్ని ఉపాయాలతో లోభక్రోధాలను**

అణచివేయటమే లోకంలో పవిత్రమైన తపస్సు. ఇదే సంసార సముద్రాన్ని దాటించే వంతెన అని చెపుతారు. తపస్సును క్రోధాన్నుంచి, ధర్మాన్ని ద్వేషాన్నుంచి, విద్యను మానావమానాల నుంచి, తనను ప్రమాదం నుంచి ఎల్లప్పుడూ రక్షించుకోవాలి. దయ అన్నిటినీ మించిన ధర్మం. ఓర్పే గొప్ప బలం. సత్యం చెప్పటమే ఉత్తమవ్రతం. తత్త్వజ్ఞానమే అన్ని జ్ఞానాలను మించిన జ్ఞానం. సత్యాన్ని చెప్పటం శ్రేయస్కరం. యథార్థజ్ఞానమే మేలు కలిగిస్తుంది. **ప్రాణులకు చాలా హితమైనదే ఉత్తమ సత్యం.** ప్రయత్నాలు అన్నీ కోరికలకు ఎప్పుడూ కట్టుబడకుండా చేసుకొని, త్యాగమనే అగ్నిలో తన సర్వస్వాన్ని హోమంచేసిన వాడే త్యాగి, వివేకి అవుతాడు. కాబట్టి కనపడే ప్రపంచం దూరంచేసేది, యోగం అనే పేరుగలది అయిన ఈ బ్రహ్మయోగాన్ని తానే తెలుసుకోవాలి, సంపాదించుకోవాలి. గురువుకూడా అపాత్రుడైన శిష్యుడికి వినిపించగూడదు కాని యుక్తిపూర్వకంగా తెలియచెప్పాలి.

ఏ ప్రాణినీ హింసించగూడదు. అన్నిటియందు స్నేహంతో ప్రవర్తించాలి. దుర్లభమైన ఈ మానవజీవితాన్ని పొంది ఎవరితోనూ వైరం పెట్టుకోకూడదు.* ఏమీ కూడబెట్టు కోకపోవటం, అన్ని పరిస్థితుల్లోను సంతోషంగా ఉండటం, కోరికలను ఆసక్తిని వదలటం - అనేవే పరమజ్ఞానం. ఇదే సత్యస్వరూప మైనది. ఉత్తమ మైన ఆత్మజ్ఞానం. ఇహలోక పరలోకాలకు సంబంధించిన భోగాలను, అన్ని రకాల సంపాదనలను వదలి, అచంచలమైన స్థానాన్ని లక్ష్యంగా చేసుకొని, బుద్ధితో మనస్సును, ఇంద్రియాలను వశం చేసుకోవాలి. ఇంద్రియాలను జయించినవాడు, మనస్సును లొంగదీసుకొన్నవాడు. జయించని వాటిని జయించే కోరికకలవాడు, ఎల్లప్పుడు తపస్సులో మునిగినవాడు అయిన ముని ఆసక్తి కలిగించే భోగాలకు దూరంగా ఉండాలి. గుణాలను అగుణాలుగా చేసుకొన్నది, నిస్సంగమైనది, అంతరాత్మతో మాత్రమే సాధించదగినది, అజ్ఞానంతప్ప ఇంకేమీ ఆటంకం లేనిది, ఒకటిగా తెలియబడేది. అదే నిరతిశయసుఖం. **సుఖదుఃఖాలను రెండింటిని వదలినవాడే అనంతమైన బ్రహ్మపదాన్ని పొందుతాడు.** నిస్సంగంతో గూడా దాన్ని పొందవచ్చు. ద్విజశ్రేష్ఠా! నేను విన్నది అంతా ఉన్నది ఉన్నట్టుగా సంగ్రహంగా నీకు చెప్పాను. ఇంక మళ్ళీ నీవు ఏమి వినాలి అని అనుకొంటున్నావు?'

---

* న హింస్యాత్ సర్వభూతాని మైత్రాయణగతశ్చరేత్ ।
నేదం జీవితమాసాద్య వైరం కుర్వీత కేనచిత్ ॥ 34

214. మాతాపితరులసేవ - ఫలితము.

ధర్మవ్యాధుడు ఈ ప్రకారం పూర్తిగా మోక్షధర్మాన్ని వివరించగా కౌశికుడు బాగా ప్రసన్నమనస్కుడై అతనితో ఇలా అన్నాడు. నీవు నాకు చెప్పింది అంతా న్యాయయుక్తంగా, ఉచితంగా ఉన్నది. ధర్మవిషయంలో నీకు తెలియనిది ఏదీ లేదని నాకు అనిపిస్తున్నది. అనగానే ధర్మవ్యాధుడు చెప్పాడు. 'బ్రాహ్మణశ్రేష్ఠా! నాకు ఈ సిద్ధి కలగటానికి కారణమైన ప్రత్యక్షధర్మాన్ని కూడా నీవు చూడు. ధర్మం తెలిసిన మహాత్మా! లేచి మా లోపలి ఇంట్లోకి రా. నా తల్లిదండ్రులను చూడు.' వ్యాధుడు ఇలా చెప్పిన తరువాత కౌశికుడు ఆతనితో పాటు లోపలికి వెళ్ళాడు. అది ఒక అందమైన నాలుగిండ్ల భవంతి. చాలా శుభ్రంగా ఉన్నది. సున్నం వేయటం వల్ల తెల్లగా ఉన్నది. మనోహరంగా ఉంది. దేవాలయంలాగా ఉన్నది. దేవతలు గూడా ఆదరించే విధంగా ఉన్నది. ఒకవైపు పడుకోవటానికి మంచాలు వేసి ఉన్నవి. ఇంకొకవైపు కూర్చోటానికి ఆసనాలు ఉన్నాయి. ఆ ఇల్లు అంతా సువాసనలతో నిండి ఉంది. ధర్మవ్యాధుని తల్లిదండ్రులు శుభ్రమైన తెల్లని వస్త్రాలు ధరించి, భోజనం చేసి, ఒక అరుగుమీద కూర్చుని ఉన్నారు. వారు పుష్పాదులతో పూజితులై ఉన్నారు. ధర్మవ్యాధుడు వారిని చూచిన వెంటనే వారి పాదాలు పట్టుకొని నమస్కారం చేశాడు. తల్లిదండ్రులు ఆదరంతో ఇలా అన్నారు 'ధర్మం తెలిసిన కుమారా! లే. లే. ధర్మం నిన్ను అన్ని విధాలా రక్షించుగాక. మేము నీ ఆచార వ్యవహారాలు చూచి' సేవను పొందుతూ చాలా సంతోషిస్తున్నాము.. చిరంజీవివి కమ్ము. పూజ్యమైన ఉత్తమస్థితిని, తపస్సును, జ్ఞానాన్ని, వివేకాన్ని సంపాదించావు. ఉత్తమపుత్రుడ వైన నీవు నిత్యమూ సముచితసమయంలో నియమపూర్వకంగా మమ్ములను ఆదరిస్తున్నావు. మేము దేవలోకంలో ఉన్నంత ఆనందంగా, సుఖంగా ఈ ఇంట్లో ఉన్నాం. నీకు మాకంటే ఇతరమైన దైవం దేవతల్లో కూడా లేదు. మనస్సును పవిత్రమూ, స్వాధీనమూ చేసుకోవటంవల్ల బ్రాహ్మణోచితమైన శమదమాదులు కలిగిఉన్నావు. కుమారా! నా తండ్రి తాతముత్తాతలు అందరూ ఎల్లప్పుడూ నీ ఇంద్రియనిగ్రహం చూసి సంతోషిస్తుంటారు. నీవు చూపించే గౌరవాదుల వల్ల మేముగూడ ఆనందపడుతుంటాము. నీవు మనస్సుతో, మాటలతో, పనులతో ఎప్పుడూ మాసేవ వదలకుండా చేస్తుంటావు. ఇప్పుడు గూడా నీ ఆలోచనలు ఇందుకు వ్యతిరేకంగా లేవు. పరశురాముడు వృద్ధులైన తల్లిదండ్రులను సేవించినట్లు, ఇంకా అంతకంటే ఎక్కువగాను మాకు అన్ని సేవలు చేస్తున్నావు.

• తరువాత ధర్మవ్యాధుడు కౌశికుని వారికి పరిచయం చేశాడు. వారు ఆయనకు స్వాగతసత్కారం చేశారు. తగిన రీతిగా గౌరవించారు. కౌశికుడు వారిపూజను స్వీకరించాడు.

'యోగ్యుడైన కుమారుడితో సేవకులతో ఈ ఇంట్లో క్షేమంగా ఉన్నారా? మీ శరీరారోగ్యం ఎప్పుడూ బాగానే ఉంటుందా?' అని అడిగాడు. వృద్ధులు ఇలా అన్నారు. 'బ్రాహ్మణోత్తమా! ఈ ఇంట్లో మాకు, మాసేవకులకు క్షేమమే. నీవు కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఇక్కడికి వచ్చావా?' ఆ బ్రాహ్మణుడు సంతోషంతో 'నాకు ఏ ఇబ్బంది కలగలేదు' అని వారితో చెప్పాడు. తరువాత ధర్మవ్యాధుడు ఆయనను చూచి తనతల్లిదండ్రులను చూస్తూ కౌశికునితో ఇలా అన్నాడు. ధర్మవ్యాధుడన్నాడు 'మహాత్మా! ఈ తల్లిదండ్రులే నాకు ప్రధానదేవతలు. దేవతలకు చేయవలసిన పూజాదులను నేను వీరికే చేస్తుంటాను. సమస్తలోకానికి ఇంద్రాదులైన ముప్పది ముగ్గురు(33) దేవతలు పూజనీయులైనట్లే ఈ వృద్ధపితరులు నాకు పూజింపదగినవారు. ద్విజులు దేవతలకు పూజాద్రవ్యాదులను సమర్పించినట్లు పరాకులేకుండా నేను నాతల్లిదండ్రులకు సేవ చేస్తుంటాను.

నాతల్లిదండ్రులే నాకు సర్వశ్రేష్ఠులైన దేవతలు. వీరికి పూలను, పండ్లను, రత్నాలను ఇచ్చి ఎల్లప్పుడూ సంతోషపరుస్తుంటాను. విద్వాంసులు చెప్పే అగ్నులు నాకు వీరే. యజ్ఞాలు, నాలుగువేదాలు అన్నీ నాకు వీరే. నాప్రాణాలు, భార్యాపుత్రులు, మిత్రులు అందరినీ వీరిసేవకే సమర్పిస్తాను. నేను నిత్యమూ భార్యాపుత్రులతో వీరినే సేవిస్తుంటాను. ద్విజశ్రేష్ఠా! నేను వీరికి స్వయంగానే స్నానం చేయిస్తాను. వీరిపాదాలు కడుగుతాను. స్వయంగానే ఆహారం వడ్డిస్తాను. అనుకూలంగా మాట్లాడతాను. వీరికి ఇష్టం లేని విషయాలు మాట్లాడను. వీరికి ఇష్టమైతే అధర్మకార్యం ఐనా చేస్తాను. పితృశుశ్రూషాధర్మమే గొప్పదని తెలిసి నాకర్తవ్యాన్ని నెరవేరుస్తుంటాను. ఆలస్యం లేకుండా ఎప్పుడూ వీరిసేవ చేస్తుంటాను. ద్విజసత్తమా! ఆత్మోన్నతిని కోరే వ్యక్తికి తండ్రి, తల్లి, అగ్ని, పరమాత్మ, గురువు అనే ఐదుగురే గురువులు. బ్రాహ్మణోత్తమా! వీరి అందరి విషయంలో చక్కగా ప్రవర్తిస్తూ, గృహస్థధర్మాన్ని సరిగా అనుష్ఠించేవానికి ఎప్పుడూ అగ్నిపరిచర్య చేసినఫలం దక్కుతుంది. ఇది సనాతనధర్మం.'

215. ధర్మవ్యాధుని పూర్వజన్మ వృత్తాంతము.

మార్కండేయుడు చెపుతున్నాడు – యుధిష్ఠిరా! ధర్మాత్ముడైన వ్యాధుడు కౌశికునికి తన గురువులైన తల్లిదండ్రుల దర్శనం చేయించి మళ్ళీ ఇలా అన్నాడు. 'తల్లిదండ్రులసేవయే నా తపస్సు. దాని ప్రభావం చూడు. నాకు దివ్యదృష్టి కలిగింది. పతిసేవాపరాయణ, ఇంద్రియ నిగ్రహం కలిగిన సదాచారతత్పర అయిన ఆ పతివ్రత ఈ మహత్త్వం వలననే 'మిథిలానగరంలో ఉండే వ్యాధుడు నీకు ధర్మోపదేశం చేస్తాడు. అక్కడికి వెళ్ళు' అని

నీకు చెప్పింది.' బ్రాహ్మణుడన్నాడు. 'నియతమైన వ్రతం కలవాడా! సత్యశీల అయిన పతివ్రత యొక్క వాక్యాన్ని వినియే నీవు ధర్మజ్ఞుడవూ, సద్గుణవంతుడవూ అయ్యావని నా అభిప్రాయం.' వ్యాధుడు అన్నాడు - 'ద్విజశ్రేష్ఠా! ఆ పతివ్రత చెప్పినదంతా నీవు చూశావు. ఇంక సందేహం ఏముంది? నీపైన అనుగ్రహబుద్ధి కలగటం వలననే ఇదంతా నీ ఎదుట ఉంచాను. నీకు మేలు కలిగించే విషయం చెపుతాను విను. నీ తల్లిదండ్రులను ఉపేక్షించావు. వారి అనుమతి తీసుకోకుండానే ఇంటినుంచి బయటికి వచ్చావు. వేదాధ్యయనం కోసమే అయినా నీవు చేసింది అనుచితం. నీవు దూరం కావటం వల్ల కలిగిన బాధతో వృద్ధులైన వారు గ్రుడ్డివారు అయినారు. వారిని సంతోషపెట్టటానికి ఇంటికి వెళ్ళు. ఇలా చేస్తే నీధర్మం నష్టం గాదు. నీవు తపస్వివి, మహాత్ముడవు, ఎల్లప్పుడు ధర్మతత్పరుడవు. పితృసేవకు దూరం కావటం వల్ల నీ ధర్మానుష్ఠానం అంతా వ్యర్థం. త్వరగా వెళ్ళి వారిని ప్రసన్నులను చేసుకో. నామాటపైన శ్రద్ధ ఉంచు. ఇంకో విధంగా చేయటం తగదు. ఇప్పుడే బయలుదేరి వెళ్ళు. నీకు మేలు కలిగేది చెపుతున్నాను.' బ్రాహ్మణుడు అన్నాడు - 'ధర్మం, సదాచారం, మంచిగుణాలు గల వ్యాధా! నీవు చెప్పింది అంతా నిస్సందేహంగా సత్యమే. నీకు మేలు కలుగుగాక. నాకు సంతోషం కలిగింది.' వ్యాధుడు అన్నాడు - 'బ్రాహ్మణశ్రేష్ఠా! పురాతనమై, సనాతనమై, దివ్యమై, పుణ్యాత్ములకు కూడ పొందవీలుగాని ధర్మాన్ని అనుసరించే నీవు దేవతుల్యుడవు. నీవు తల్లిదండ్రుల వద్దకు త్వరగా వెళ్ళి పరాకులేకుండా వారిసేవలో నిమగ్నుడివి కావలసింది. ఇంతకంటే గొప్పధర్మం నాకు కన్పించదు.'

బ్రాహ్మణుడన్నాడు - 'నా అదృష్టంవల్ల ఇక్కడికి వచ్చాను. నీ సాంగత్యం లభించింది. ధర్మమార్గాన్ని చూపించే ఇటువంటి మనుష్యులు దుర్లభులు. వేలమంది మానవులలో ధర్మం తెలిసిన వాడు ఒకడైనా ఉంటాడో, ఉండడో! నీ నిజాయితీకి సంతోషించాను. నీకు మేలు కలుగుగాక! పుణ్యాత్మా! నరకంలో పడుతున్న నన్ను ఉద్ధరించావు. నీ దర్శనంవల్ల, నీ ఉపదేశాన్ని అనుసరించి ఇక ముందు నడుచుకొంటాను. స్వర్గాన్నుంచి నేలమీద పడిన యయాతి మహారాజును ఆయన పుత్రికాపుత్రులు - అష్టకాదులు ఉద్ధరించినట్లు ద్విజుడనైన నన్ను నీవు ఉద్ధరించావు. నీ మాటను అనుసరించి మాతాపితృసేవ చేస్తాను. అంతఃకరణం పరిశుద్ధం కానివాడు ధర్మాధర్మనిర్ణయాన్ని చక్కగా చెప్పలేడు. శూద్రజాతిలో జన్మించినవానికి సనాతనమైన ధర్మం తెలియటం చాలా కష్టం. నిన్ను శూద్రునిగా నేను అనుకోను. దీనికి ఏదో ప్రత్యేకకారణం ఉంటుంది. ఏ కర్మవిశేషం వల్ల నీకు ఈ శూద్రజన్మ కలిగిందో నేను యథార్థంగా తెలుసుకోవాలి. పవిత్రమైన అంతః

కరణంతో నిజాన్ని అంతా స్వేచ్ఛగా చెప్పవలసింది.'

ధర్మవ్యాధుడు చెప్పాడు - 'ద్విజోత్తమా. బ్రాహ్మణులను నిరాదరించటం నాకు తగదు. నాకు పూర్వజన్మలో కలిగిన శరీరంవల్ల సంభవించిన విషయం చెపుతాను. పూర్వజన్మలో నేను బ్రాహ్మణకుమారుడను. వేదాధ్యయన సంపన్నుడైన బ్రాహ్మణుడను. వేదాంగవిషయాలు కూడా బాగా తెలుసుకొన్నవాడిని. మంచి ప్రతిభాశాలిని. స్వయంకృతాపరాధం వలననే నాకు ఈ దురవస్థ ఏర్పడ్డది. పూర్వజన్మలో నాకు ధనుర్వేదపారంగతుడైన ఒకరాజు మిత్రుడు అయినాడు. అతనితో సహవాసం వలన నేను ధనుర్విద్యలో నిపుణుడిని అయినాను. ఈ సమయంలోనే రాజు మంత్రులతో, ప్రధాన యోధులతో వేటకు వెళ్ళాడు. ఒక మహర్షి ఆశ్రమ సమీపంలో అనేక క్రూరమృగాలను చంపినాడు. అపుడు నేను భయంకరమైన, వంకరములికి గల బాణాన్ని వదిలాను. ఆ బాణం ఒక మునికి తగిలింది. బాణం తగలగానే ఆయన నేలపై పడి దిక్కులు ప్రతిధ్వనించేటట్లు 'అయ్యో! నేను ఎవ్వరికీ ద్రోహం చేయలేదు. ఈ పాపకార్యం ఎవరు చేశారు?' అని అరిచాడు. నేను అది క్రూరమృగం అనుకొని త్వరగా ఆయన దగ్గరికి వెళ్ళాను. నేను వేసిన ఆ వంకరములికి గల బాణం తగిలిన ఆయనను చూశాను. అకార్యం చేయటం వలన నా మనస్సు చాలా వ్యథకు లోనైంది. బాధతో భూమిమీద మూల్గుతున్న ఆ మహాతపస్విని చూశాను. 'మహాత్మా! నేను తెలియక ఈ తప్పు చేశాను. నన్ను క్షమించవలసింది' అని అన్నాను. నా మాట విని ఆ ముని కోపంతో పరవశుడై 'క్రూరాత్మా! నీవు శూద్రజాతిలో జన్మించి వ్యాధుడివి అవుతావు.' అని(శాపంతో) సమాధానం చెప్పాడు.'

216. కౌశికుని స్వగృహగమనము.

ధర్మవ్యాధుడు అన్నాడు. 'విప్రోత్తమా! అలా ఋషి శాపం ఇస్తే నేను "మహాత్మా! నన్ను రక్షించు. తెలియక ఈ తగనిపని చేశాను. నా తప్పులన్నీ క్షమించు. నాపై దయ చూపు" అని ఆయనను ప్రసన్నుని చేసుకొన్నాను. ఋషి ఇలా అన్నాడు. 'ఈ శాపాన్ని తొలగించటం వీలుకాదు. నిస్సందేహంగా ఇది జరగవలసిందే. నేను సహజంగా క్రూరుడిని కాదు. కాబట్టి ఇవ్వేళ నీమీద అనుగ్రహం చూపిస్తున్నాను. శూద్రజాతిలో పుట్టినా నీకు ధర్మాలు అన్నీ తెలుస్తాయి. తల్లిదండ్రులను సేవిస్తావు. ఇందులో సందేహం లేదు. ఆ సేవవల్ల సిద్ధిని, మహత్త్వాన్ని పొందుతావు. పూర్వజన్మ విషయాలను మరచిపోవు. చివరకు స్వర్గానికి వెళ్తావు. శాపఫలం పోయినతరువాత బ్రాహ్మణుడివి అవుతావు' అని తీవ్రతేజస్వి అయిన ఆ ఋషి నన్ను అనుగ్రహించాడు. తరువాత ఆయన శరీరంలో నుంచి బాణాన్ని

తీసి, మెల్లగా ఆశ్రమానికి తీసుకొని వెళ్ళాను. ఆయన ప్రాణాలు పోలేదు. బ్రాహ్మణశ్రేష్ఠా! పూర్వజన్మలో జరిగిన నా వృత్తాంతాన్ని నీకు అంతా చెప్పాను. ఈ జీవితం అంతం అయిన తరువాత నేను స్వర్గానికి వెళ్తాను.'

బ్రాహ్మణుడు అన్నాడు - 'మహామతీ! మనుష్యులు ఈ విధంగా దుఃఖాలను, సుఖాలను పొందుతారు. కాబట్టి విచారపడకు. నిత్య ధర్మపరాయణా ! నీవు పూర్వజన్మ వృత్తాంతాన్ని తెలుసుకోటానికి కారణమైన తల్లిదండ్రులసేవ ఇతరులకు దుష్కరం. అలాంటిది నీవు చేయగలిగావు. మాంసం అమ్మటం అనే దోషం నీ పూర్వజన్మ కర్మఫలమేగాని ఈ జన్మలోది కాదు. కొంతకాలం ఈ శరీరంతోనే ఉంటే తరువాతి జన్మలో బ్రాహ్మణుడవు అవుతావు. ఆసలు నా అభిప్రాయంలో నీవు ఇప్పుడే బ్రాహ్మణుడివి అయినావు. ఇందులో సందేహం లేదు. బ్రాహ్మణుడయి కూడా పతితకర్మలు చేస్తుండే, డాంబికుడు, సామాన్యంగా శూద్రునితో సమానుడు అవుతాడు. ఇందుకు భిన్నంగా జన్మతో శూద్రుడు అయికూడా, దమం, సత్యభాషణం కలిగి ధర్మాచరణంలో ఎల్లప్పుడూ జాగరూకుడై ఉండేవానిని బ్రాహ్మణుడనే నేను భావిస్తాను. మానవుడు సదాచారంతోనే ద్విజుడు అవుతాడు. మానవుడు కర్మదోషంవల్ల భయంకరమైన దుర్గతిని పొందుతాడు. ఇపుడు నీవు సంపూర్ణంగా కర్మదోషం నశించిన వాడ వని అనుకొంటాను. కాబట్టి నీ స్థితికి చింతించకు. ఎల్లప్పుడు **లోకప్రవర్తనను అనుసరించి ధర్మాచరణం చేసే నీవంటివారు ఎన్నడూ విషాదాన్ని పొందరు.**

అపుడు ధర్మవ్యాధుడు ఇలా అన్నాడు - 'తత్త్వం తెలిసినవారు శరీరానికి కలిగే వ్యాధులను ఔషధాలతోను, మనస్సుకు కలిగే కష్టాలను ప్రజ్ఞ చేతను తొలగించుకొంటారు. ఇదే జ్ఞాన సామర్థ్యం. బుద్ధిమంతులు చిన్నపిల్లల వలె దుఃఖించరు. మందబుద్ధులైన మానవులు అవసరం లేని వాని ప్రాప్తి వలన, కావలసినవి దూరం కావటం వలన మానసిక దుఃఖాలను పొందుతారు. త్రిగుణాలతో ఏర్పడిన విభిన్న వస్తువులతో ఒకమారు సంయోగాన్ని, ఇంకోమారు వియోగాన్ని సమస్తప్రాణులు పొందుతూ ఉంటాయి. కాబట్టి వీటిల్లో ఏ ఒక్కటీ నిజానికి శోకకారణం కాదు. ఇష్టంకానిది సంభవిస్తే వ్యక్తి దాని నుండి త్వరగా విరక్తుడవుతాడు. అనిష్టం ఆరంభంలోనే గమనిస్తే దానికి ప్రతీకారం చేస్తాడు. బాధపడటం వల్ల ఏమీ ఉపయోగంలేదు. సంతాపం మాత్రమే మిగులుతుంది. జ్ఞానతృప్తులైన విద్వాంసులు సుఖదుఃఖాలను రెండింటిని వదలి, సంతోషంతో వృద్ధిని పొందుతారు. అజ్ఞానులు సంతోషదూరులు అవుతారు. జ్ఞానులు సంతోషం పొందుతారు. అసంతృప్తికి అంతం ఉండదు. సంతృప్తి మహాసుఖ మిస్తుంది. **జ్ఞానమార్గాంతాన్ని పొంది పరమాత్మ సాక్షాత్కారం పొందినవారు ఏ విషయంలోనూ విచారపడరు. మనస్సును విషాదం వైపు**

పోనీయకూడదు. విషాదమే అన్నిటినీ మించిన విషం. అది కోపించిన సర్పంవలె వివేకరహితుని చంపేస్తుంది. ఏ విషయంలోనైనా అడుగు ముందుకు వెయ్యాల్సి వచ్చినపుడు విషాదానికి లోబడరాదు. అలా లొంగిపోయిన తేజోహీనుడికి ఏ పురుషార్థమూ దక్కదు. చేసే పనికి ఫలితం తప్పక గోచరిస్తుంది. కేవలం నిర్వేదం పొందితే కొంచెంశుభాన్ని కూడా పొందలేడు. అందుచేత దుఃఖాన్ని తొలగించుకొనటానికి ఉపాయం చూడాలి. శోకవిషాదాలు పొందకుండా పనికి ఉపక్రమించాలి. అలా ప్రయత్నపరు డయితే దుఃఖం నుండి విముక్తు డవుతాడు.

'ప్రపంచంలోని అన్ని పదార్థాలు అనిత్యాలు' అని భావించి బుద్ధిని దాటి పరబ్రహ్మాను తెలుసుకున్న జ్ఞానులు పరమాత్మసాక్షాత్కారాన్ని పొందుతూ విచారపడరు. పండితోత్తమా! ఈ జీవితం యొక్క అంతం కోసం ఎదురుచూస్తున్నాను. కాబట్టి శోకించను. సజ్జనశ్రేష్ఠా! ద్విజా! పైన చెప్పిన వానిని మననం చేయటం చేత ఎప్పుడూ క్రుంగిపోను. దుఃఖం కాని, నిరుత్సాహం కాని పొందను.' బ్రాహ్మణుడు అన్నాడు 'ధర్మవ్యాధా! నీవు జ్ఞానివి, మేధావివి. నీబుద్ధి చాలా విశాలమైనది. ధర్మాలను చక్కగా తెలిసినవాడివి, జ్ఞానంతో తృప్తిని పొందావు. కాబట్టి నీ విషయంలో నేను విచారపడటం లేదు. ఇంక నేను వెళ్ళివస్తాను. నీకు మేలు కలుగుగాక. ధర్మం నిన్ను రక్షించుగాక. ధర్మాత్ములలో శ్రేష్ఠుడా! ధర్మాచరణంలో ఎప్పుడూ పొరబాటు చేయకు. ధర్మవ్యాధుడు ఆయన మాటలు విని చేతులు జోడించి – దోసిలొగ్గి 'సరే' అన్నాడు. తరువాత బ్రాహ్మణశ్రేష్ఠుడైన కౌశికుడు ధర్మవ్యాధునికి ప్రదక్షిణం చేసి బయలుదేరాడు. కౌశికుడు ఇంటికి వెళ్ళి, తల్లిదండ్రులకు యథావిధిగా అన్ని సేవలూ చేశాడు. వృద్ధులైన ఆ తల్లిదండ్రులు సంతోషంతో కుమారుని మెచ్చుకొన్నారు.

యుధిష్ఠిరా! నీవు అడిగిన ధర్మప్రశ్నకు తగిన రీతిగా పూర్తిగా సమాధానం చెప్పాను. పతివ్రతా మాహాత్మ్యాన్ని, ధర్మవ్యాధుడు కౌశికునికి చెప్పిన తల్లిదండ్రులసేవ యొక్క గొప్పతనాన్ని వివరంగా చెప్పాను. ధర్మరాజు అన్నాడు – మహాత్మా మీరు చాలా అద్భుతమైన ధర్మోపాఖ్యానాన్ని చెప్పారు. మీరు సర్వధర్మాలు తెలిసినవారిలో శ్రేష్ఠులు. ఈ వృత్తాంతం వినటానికి చాలా ఇంపుగా ఉండటం చేత చాలా సమయం కూడా ఒక్క క్షణం లాగా గడిచిపోయింది. మహాత్మా! ఉత్తమధర్మం ఎంతవిన్నా నాకు తృప్తి కలుగదు.

217. బృహస్పతి అగ్నికి పుత్రుడగుట-జననము.

ధర్మంతో గూడిన ఈ పవిత్రవృత్తాంతాన్ని విని, ధర్మరాజు మార్కండేయ మహర్షిని మళ్ళీ ఇలా అడిగాడు. ధర్మరాజు అన్నాడు. 'మహామునీ! పూర్వం అగ్నిదేవుడు ఎందుకని నీళ్ళల్లోకి వెళ్ళాడు ? అగ్ని అదృశ్యం కాగా మహాతేజస్వి అంగిరసు డనే మహర్షి అగ్ని

అయి దేవతలకు హవిస్సును ఎలా చేర్చాడు ? అగ్నిదేవుడు ఒకడే కదా! విభిన్నమైన పనుల్లో ఆయన అనేకరూపాలుగా ఎందుకు కనిపిస్తాడు ? కుమారస్వామి ఎలా జన్మించాడు? అగ్నిపుత్రుడు ఎలా అయినాడు? శివునివలన గంగకు, కృత్తికలకు ఎలా జన్మించాడు? ఇదంతా ఉన్నది ఉన్నట్లు మీ వలన వినవలెనని కోరుతున్నాను.' మార్కండేయ మహర్షి అన్నాడు - 'ఈ విషయంలో తెలిసినవారు ఈ ప్రాచీనమైన ఇతిహాసాన్ని చెపుతున్నారు.

పూర్వకాలంలో మహాత్ముడైన అంగిరసుడు ఆశ్రమంలో ఉండి, మహత్తరమైన తపస్సు చేసి అగ్నిదేవుని కూడా మించిపోయే కాంతితో ప్రకాశిస్తూ సమస్తజగత్తునూ వెలిగించాడు. ఆ కాలంలో అగ్నిదేవుడుకూడా తపస్సు చేస్తూ స్వయంగా తేజోవంతుడయిన అంగిరసుని తేజస్సుతో సంతప్తుడై బాగా వాడిపోయాడు. దీనికి కారణం అగ్ని తెలుసుకోలేకపోయాడు. అగ్నిదేవుడు ఇలా చింతించాడు - 'లోకాలకోసం బ్రహ్మదేవుడు ఇంకో అగ్నిని ఇలా కల్పించాడా ? తపస్సు చేస్తున్న నాలో అగ్నిలక్షణం నశించింది. మళ్ళీ నేను అగ్నిని ఎలా కాగలను?' అని ఆలోచిస్తూ ఆయన అగ్నివలె లోకాలను తపింపజేస్తున్న మహామునిని చూశాడు. భయపడుతూ అగ్ని ఆ ముని వద్దకు వెళ్ళాడు. అంగిరసుడు ఆయనను చూచి ఇలా అన్నాడు - 'నీవు త్వరగా లోకాలను వృద్ధిచేసే పనికి పూనుకోవాలి. మూడు లోకాలలో, స్థావరజంగమప్రాణులలో బాగా ప్రసిద్ధుడవు. బ్రహ్మదేవుడు నిన్ను చీకటిని పోగొట్టే అగ్నిగా మొదట సృష్టించాడు. అంధకారం తొలగించే దేవా! నీవు త్వరగా నీ స్థానాన్ని గ్రహించు.'

అగ్ని ఇలా అన్నాడు - "లోకంలో నాకీర్తి నశించింది. నీవు అగ్ని వయినావు. లోకం అంతా నిన్నే అగ్నిగా భావిస్తారు కాని నన్ను కాదు. నేను నా అగ్నితత్త్వాన్ని నీలో ఉంచుతాను. నీవే మొదటి అగ్నివి కావలసినది. నేను ప్రాజాపత్యం అనే పేరుతో రెండో అగ్నిని అవుతాను." అంగిరసుడు అన్నాడు - 'అగ్నిదేవా! ప్రజలను స్వర్గానికి చేర్చే పుణ్యకార్యాన్ని (దేవతలకు హవిస్సును చేర్చే పుణ్యకార్యాన్ని) నిర్వహించవలసినది, నన్నుకూడా చీకటిని పోగొట్టే అగ్నిపదంలో స్థాపించి నీ మొదటి పుత్రునిగా చేసుకొనవలసింది.' అంగిరసునిమాటలు విన్న అగ్ని అలాగే చేశాడు. తరువాత అంగిరసునికి బృహస్పతి అనే పుత్రుడు కలిగాడు. అంగిరసుడు అగ్నిదేవుని మొదటి పుత్రుడని తెలిసి దేవతలు వచ్చి 'దానికి కారణం ఏమిటి?' అని అడిగారు. దేవతలు అడిగినదానికి అంగిరసుడు కారణం చెప్పాడు. ఆయన సమాధానం దేవతలు నమ్మారు. ఇప్పుడు నేను బ్రాహ్మణగ్రంథాల్లోని విధివాక్యాల ద్వారా అనేక కర్మలద్వారా ఆనేక ప్రయోజనాల సిద్ధి కలిగించడంలో ప్రసిద్ధాలైన, మిక్కిలి కాంతిమంతమైన అగ్నులను వివరిస్తాను.'

218. అంగిరసుని వంశ వర్ణనము.

మార్కండేయు డన్నాడు. కురువంశశ్రేష్ఠా! బ్రహ్మదేవుని మూడవ కుమారుడైన అంగిరసుని భార్యపేరు సుభ. ఆయనకు ఆమెయందు కలిగిన సంతానాన్ని గురించి వినుము. బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనుడు, బృహన్మంత్రుడు, బృహద్భానుడు, బృహస్పతి ఆయన కొడుకులు. అంగిరసుని మొదటి కూతురు భానుమతీదేవి. ఆయన సంతానంలో ఆమె అధిక సౌందర్యవతి – సాటిలేని సౌందర్యం కలది. (సూర్యునితో కలిసి ఉండటంవల్ల, ఈ భానుమతి దినాభిమానిని అయిన దేవత.) అంగిరసుని రెండవకూతురు రాగ అనేపేరుతో ప్రసిద్ధురాలు. ఆమెమీద సమస్తప్రాణులకు విశేషమైన అనురాగం కలగటం వలన ఆపేరు ప్రసిద్ధమైంది. (ఈ రాగ రాత్రి అభిమానిని ఐన దేవత.) అంగిరసుని మూడవ పుత్రిక సినీవాలి. (ఇది చతుర్దశితో గూడిన అమావాస్య). చాలా సన్నగా ఉండటం వలన ఒకసారి కనిపిస్తుంది. ఇంకొకసారి కనిపించదు. కాబట్టి ఈమె దృశ్యాదృశ్య. ఈశ్వరుడు నుదుట ధరిస్తాడు. అందువల్ల రుద్రసుత అనిపేరు. ఆయన నాల్గవ పుత్రిక అర్చిష్మతి. (పూర్ణచంద్రునితో కలిసి ఉండటంవల్ల శుద్ధపూర్ణిమ). దీని కాంతితో జనం రాత్రి కూడా వస్తువులను స్పష్టంగా చూస్తారు. ఐదవకన్య హవిష్మతి. (పాడ్యమితో కూడిన పూర్ణిమ 'రాక'.) దీని సాన్నిధ్యంలో హవిస్సులతో దేవతలను పూజిస్తారు. ఆయన పవిత్రమైన ఆరవ కూతురిపేరు 'మహిష్మతి'. (ఇదే చతుర్దశితో కూడిన పూర్ణిమ) దీనినే 'అనుమతి' అని కూడా అంటారు. తేజోవంతాలైన సోమయాగాది మహాయజ్ఞాలలో ప్రకాశించేది కాబట్టి మహామతి అనేపేరుతో ప్రసిద్ధమైన ఇది (పాడ్యమితో గూడిన అమావాస్య) అంగిరసుని ఏడవపుత్రిక. అంగిరసుని ఎనిమిదవ పుత్రికపేరు 'కుహు'. అది గల అమావాస్యను చూచి జనులు 'కుహు – కుహు' అని ఆశ్చర్యంతో అంటారు. అందులో చంద్రుని ఒకే కళ చాలా సన్నని అంశతో మిగిలి ఉంటుంది.

219. బృహస్పతి సంతాన వర్ణనము.

బృహస్పతి భార్య చాంద్రమసి (తార) అనే పేరుతో ప్రసిద్ధురాలు. ఆమె పుత్ర రూపంలో ఆరు పవిత్రాగ్నులను, ఒకపుత్రికను కన్నది. (దర్శపూర్ణమాసాదులలో) ప్రధానాహుతులను ఇచ్చేటప్పుడు హవిస్సును స్వీకరించేవాడును. మొట్టమొదట ఇచ్చే ఆజ్యాహుతియే ఉత్తమవ్రతంగా గల శంయువు అనే అగ్నియే బృహస్పతికి మొదటి పుత్రుడు. చాతుర్మాస్య అశ్వమేధ యజ్ఞాలలో పూజితుడు, మొట్టమొదట జన్మించిన సర్వసమర్థుడు, అనేకమైన రంగులుగల జ్వాలలతో వెలిగేవాడు, సాటిలేని శక్తిశాలి అయిన

అగ్నియే శంయువు. శంయువు భార్య ధర్మదేవపుత్రిక సత్య. ఆమె సౌందర్యగుణాలు సాటిలేనివి. ఆమె నిజం చెప్పటమే వ్రతంగా గలది. శంయువుకు ఆమెవలన అగ్ని అనే పుత్రుడు, మంచి నియమాలు గల ముగ్గురు పుత్రికలు జన్మించారు. యజ్ఞంలో మొదటి ఆజ్యభాగంతో పూజింపబడే అగ్నియే శంయువు యొక్క మొదటి పుత్రుడైన భారద్వాజుడు అనే అగ్ని అని చెపుతారు. అన్ని పౌర్ణమాసయజ్ఞాలలో స్రువంతో నేతిని గ్రహించి సమర్పింపబడే భరతుడు (ప్రజాపతి) అనే అగ్నియే శంయువు రెండవ పుత్రుడు. (ఇతడు శంయువు మరొక భార్య పుత్రుడు). శంయువుకు ఇంకా ముగ్గురు కన్యలు కలిగారు. వారిని పెద్దన్న భరతుడే రక్షించేవాడు. భరతు (ప్రజాపతి)నికి భరతుడు అనే కొడుకు, భరతి అనే కూతురు కలిగారు. భరతవంశశ్రేష్ఠా! సర్వరక్షకుడు, పోషకుడు అయిన ప్రజాపతి భరతు డనే అగ్ని నుండి పావకుడు జన్మించాడు. ఆయన సమధికంగా పూజ్యుడు కావటంవల్ల మహాత్ము డన్నారు. శంయువు మొదటిపుత్రుడైన భరద్వాజుని యొక్క భార్యపేరు వీర. ఆమె వీరుడు అనే వానిని కన్నది. బ్రాహ్మణులు సోముని వలెనే వీరునికూడా ఆజ్యభాగంతో పూజించటం చెప్పబడింది. ఈయనకు ఆహుతి ఇచ్చేటప్పుడు మంత్రాన్ని ఉపాంశువుగా ఉచ్చరిస్తారు. సోమదేవతతో పాటు ద్వితీయాజ్యభాగాన్ని పొందే ఈయనను రథప్రభు, రథధ్వానుడు, కుంభరేతుడు అని పిలుస్తారు. వీరుడు శరయువనే పత్నియందు సిద్ధి అనే పుత్రుని కన్నాడు. సిద్ధి తన కాంతితో సూర్యుని కప్పివేశాడు. సూర్యుడు ఆచ్ఛాదితుడై నప్పుడు ఆయన అగ్నిసంబంధయజ్ఞాన్ని అనుష్ఠించాడు. ఆహ్వానమంత్రంలో (అగ్ని మగ్న ఆవహ ఇత్యాదిమంత్రంలో) ఈ సిద్ధి యను అగ్నిస్తుతియే కలదు.

బృహస్పతి రెండో పుత్రునిపేరు నిశ్చ్యవనుడు. ఈయన కీర్తి, తేజస్సు, కాంతులనుండి చ్యుతుడు కాడు. నిశ్చ్యవనాగ్ని వాగభిమానదేవతయైన అగ్ని. ఆయన పాపరహితుడు, నిర్మలుడు, పవిత్రుడు, తేజస్సమూహంతో ప్రకాశిస్తాడు. ఆయన పుత్రుడు సత్యుడు అనే అగ్ని. సత్యుడు శబ్దాలకు వాచ్యవాచక సంబంధం కలిగిస్తాడు. ప్రాణులు నివసించే ఇండ్లు, తోటలు మొదలైనవాటియందు బాధతో ఆర్తనాదం చేసే ప్రాణులను బాధనుండి ఆయన విముక్తులను చేస్తాడు. కాబట్టి ఆ అగ్నికి నిష్కృతి అని ఇంకొకపేరు. సత్యునికొడుకు స్వనుడు. అతనిచే బాధితులై యాతనతో కేకలు పెడతారు. కాబట్టి ఈపేరు ఆయనకు ఏర్పడింది. ఆయన రోగాన్ని కలిగించే అగ్ని. బృహస్పతి మూడవకొడుకు పేరు విశ్వజిత్తు ఈ అగ్ని సమస్తజగత్తుయొక్క బుద్ధినీ వశం చేసుకొని ఉంటాడు. కాబట్టి తత్త్వవేత్తలు ఈయనను విశ్వజిత్తు అంటారు. సమస్తప్రాణుల కడుపులో ఉండి తిన్న పదార్థాలను

జీర్ణంచేస్తాడు. లోకప్రసిద్ధుడైన ఈ విశ్వభుక్కు అనే అగ్ని బృహస్పతి నాల్గవ పుత్రుడుగా జన్మించాడు. ఆ అగ్ని బ్రహ్మచారి, ఇంద్రియాలను జయించినవాడు, మంచి నియమాలు గలవాడు కావటంవల్ల పాకయజ్ఞంలో ఈయన్నే పూజిస్తారు. పవిత్రమైన గోమతీనది ఈయన ప్రియభార్య. ధర్మాచరణం చేసే ద్విజులు ఈవిశ్వభుక్కు అనే అగ్నిలోనే సమస్త కర్మానుష్ఠానం చేస్తారు.

మహాభయంకరమైన బడబాగ్ని రూపంలో సముద్రజలాన్ని త్రాగే అగ్ని శరీరంలో పైకి వెళ్ళే 'ఉదానం' అనే పేరుతో ప్రసిద్ధుడైన అగ్ని. ఊర్ధ్వగతికలవాడు. కాబట్టే ఈయనపేరు 'ఊర్ధ్వభాక్కు. ఈయన ప్రాణవాయువును ఆశ్రయించినవాడు. త్రికాలదర్శి. (ఈయన బృహస్పతి అయిదవ పుత్రుడు) బృహస్పతి ఆరవకొడుకు స్విష్టకృత్తు అనే అగ్ని. ఆయనకు ఎప్పుడూ ఇచ్చే నేతిధార ఉత్తరాభిముఖప్రవాహంగా ఉండి కోరిన కోరికలను సిద్ధింపజేస్తుంది. కాబట్టి ఆ అగ్నికి ఆ పేరు వచ్చింది. అగ్నిస్వరూపుడయిన బృహస్పతి కోపం ప్రశాంతంగా ఉండే ప్రాణులమీద వ్యక్తం ఐనప్పుడు ఆయన శరీరం నుంచి ఏర్పడిన చెమట ఆయన పుత్రిక అయింది. ఆమె స్వాహా అనే పేరుతో ప్రసిద్ధురాలు అయింది. ఆకన్య అన్నిప్రాణుల్లో ఉంటుంది. దారుణమైనది, క్రూరురాలు స్వర్గంలో గూడా సౌందర్యంలో సాటిలేనివాడు అయిన ఆ స్వాహాపుత్రునికి దేవతలు కాముడు అనే అగ్నిగా పేరుపెట్టారు. కోపాన్ని మనస్సులో ఉంచుకొని మాలాలంకృతుడు, ధనుర్ధారి అయి సంతోషంతో, ఉత్సాహంతో రథం మీద కూర్చొని యుద్ధంలో శత్రునాశనం చేసే అగ్నిపేరు అమోఘుడు. ఉక్థం అనే పేరుగల అగ్నిని బ్రాహ్మణులు ఉక్థాలు అనే త్రివిధస్తోత్రాలతో స్తుతిస్తారు. అది మహావాక్కును (పరావాక్కును) వ్యక్తం చేసింది. అది మోక్షాన్ని ఇచ్చేది కాబట్టి దానిపేరు ఉక్థం.

220. పాంచజన్యాగ్ని జననము - సంతతి.

మార్కండేయు డన్నాడు - యుధిష్ఠిరా! కశ్యపపుత్రుడు కాశ్యపుడు, వసిష్ఠపుత్రుడు వాసిష్ఠుడు, ప్రాణపుత్రుడు ప్రాణకుడు, అంగిరసుని పుత్రుడు చ్యవనుడు, త్రివర్చుడు అనే అయిదుగురు ఐదు అగ్నులు. కీర్తిమంతులు, యశస్సులో బ్రహ్మతో సమానులు అయిన కొడుకులు కలుగవలె నని వారు చాలా సంవత్సరాలు తపస్సు చేశారు. ఆ ఐదుగురు మహావ్యాహృతులు అనే ఐదు మంత్రాలతో (భూః, భువః, స్వః, మహః, జనః అనే అయిదు మహావ్యాహృతులు) పరమాత్మను ధ్యానం చేశారు. అప్పుడు వారి ముందు ఐదు రంగులతో అలంకృతుడై, మహాతేజస్వి అయిన పురుషుడు జ్వాలలతో వెలిగిపోయే అగ్ని వలె ప్రకాశిస్తున్నాడు. ఆయన సమస్తలోకాలను సృష్టించటంలో సమర్థుడు. ఆయన

శిరస్సు ప్రజ్వలించే అగ్నిలాగా ఉన్నది. రెండు చేతులు సూర్యకాంతివలె ఉన్నవి. రెండు కన్నులు, చర్మమూ బంగారంవలె ప్రకాశిస్తున్నవి. పిక్కలు నల్లగా కన్పడుతున్నవి. ఆ మునులు ఐదుగురు తమ తపఃప్రభావంతో అయిదురంగులు గల పురుషుని ఆవిర్భవింప జేశారు. కాబట్టి ఆయన పాంచజన్యుడు అయినాడు. అతడు ఈ ఐదుగురు మహర్షుల వంశానికి మూలం అయినాడు. మహాతపస్వి, ప్రజాస్రష్ట అయిన ఆ పాంచజన్యుడు తన పితృవంశాన్ని వృద్ధిచేయటానికి పదివేల సంవత్సరాలు ఘోర తపస్సుచేసి, దక్షిణాగ్నిని కలిగించాడు. బృహత్ అనే సామాన్ని శిరస్సునుంచి, రథంతరం అనే సామాన్ని ముఖంనుంచి వ్యక్తంచేశాడు. ఈరెండూ వేగంగా ఆయువును హరిస్తాయి కాబట్టి వాటికి తరసాహారాలు అనిపేరు. తరువాత ఆయన నాభినుంచి శివుని, బలం వల్ల ఇంద్రుని, ప్రాణం నుంచి వాయువును, అగ్నిని సృష్టించాడు. భుజాలనుంచి ప్రాకృతం, వైకృతం అనే భేదంగల రెండు అనుదాత్తాలను, మనస్సును, ఇంద్రియదేవతలను పంచమహాభూతాలను జన్మింపజేశాడు. ఈసృష్టిని అంతా చేసిన తరువాత ఆయన ఐదుగురు పితరులకోసం ఐదుగురు పుత్రులను సృష్టించాడు.

వాసిష్ఠుడైన బృహద్రథుని అంశతో ప్రణిధిని, కాశ్యపుని అంశతో మహత్తరుని, అంగిరసుడైన చ్యవనుని అంశతో భానుని, వర్చుని అంశతో సౌభరుడు అనే పుత్రుని జనింపజేశాడు. ప్రాణుని అంశతో అనుదాత్తుడు జనించాడు. ఇలాగా ఇరవై అయిదుగురు పుత్రులపేర్లను చెప్పారు. తరువాత తపస్సు అనే మరో పేరుగల పాంచజన్యుడు విఘ్నాలను కలిగించే పదిహేనుమంది ఉత్తరదేవులను సృష్టించాడు. సుభీముడు, అతిభీముడు, భీముడు, భీమబలుడు, అబలుడు అనే ఐదుగురు వినాయకులను ఆయన ఉత్పత్తిచేశాడు. వీరు దేవతల యజ్ఞాన్ని నాశనం చేసేవారు. ఆ పాంచజన్యుడు సుమిత్రుడు, మిత్రవంతుడు, మిత్రజ్ఞుడు, మిత్రవర్ధనుడు, మిత్రధర్ముడు అనే వినాయకులను సృష్టించాడు. తరువాత సురప్రవీరుడు, వీరుడు, సురేశుడు, సువర్చుడు, సురహంత అనే అయిదుగురిని పుట్టించాడు. ఇలా ఈ పదిహేనుమంది వినాయకులు దేవతలతో సమానమైన ప్రభావంగలవారై విడివిడిగా ఐదుగురు ఐదుగురు వ్యక్తులను మూడు దళాలుగా విభజించారు. వీరు స్వర్గంలో ఉండి భూమి మీద యజ్ఞం చేసేవారి యజ్ఞసామగ్రిని అపహరిస్తారు. వీరు అగ్నికి ఇష్టమైన గొప్పహవిస్సును అపహరిస్తారు, పాడు చేస్తారు. అగ్నిగుణంతో స్పర్ధ ఉండటం వల్లనే వీరు హవిస్సును అపహరిస్తారు. కాబట్టి యజ్ఞకర్మలో నిపుణులు. యజ్ఞశాలకు బయట ఉండే వేదిక మీద ఈవినాయకులకు ఇవ్వదగిన భాగాన్ని ఉంచాలి అనే నియమాన్ని ఏర్పరిచారు. అగ్నిస్థాపన అయిన ప్రదేశానికి ఆ విఘ్నకారులు రాలేరు. యజ్ఞంలో హవిర్దాన

శకటాలపై హవిస్సులనుంచి అందులో మంత్రాలతో ఈ రాక్షసులను శాంతింప జేసినందున ఆ హవిస్సులను అపహరింపలేదు. బృహదుక్థుడనే అగ్ని భూమిపై ఉంటాడు. అగ్నిహోత్రం చేసేటప్పుడు ఈ అగ్నికి ఆహుతులు ఇస్తారు. తపస్సు పుత్రుడైన రథంతరు డనే అగ్నికి ఇచ్చే హవిస్సును మిత్రవిందుడు అనే దేవతభాగంగా యజుర్వేద విద్వాంసులు భావిస్తారు. మహాయశస్వి అయిన పాంచజన్యుడు తన ఈ పుత్రులు అందరితో కలిసి చాలా ప్రసన్నుడై ఆనందిస్తుంటాడు.

221. తపుడు - భానువుల సంతతి వర్ణనము.

మార్కండేయుడు చెప్పాడు. ధర్మజా! వెనక చెప్పిన భరతుడు అనే అగ్ని (ఈయన శంయువు పౌత్రుడు, ఊర్జుని పుత్రుడు) చాలా గొప్ప నియమాలతో ఉంటాడు. సంతోషించిన ఆయన పుష్టిని కలిగిస్తాడు. కాబట్టి ఆయనకు పుష్టిమతి అని ఇంకొక పేరు ఉన్నది. సమస్తప్రజలను భరిస్తాడు కాబట్టి ఆయనను భరతుడు అంటారు. శివు డనే పేరుతో ప్రసిద్ధుడైన అగ్ని శక్తిపూజాపరుడు. దుఃఖార్తులైన మానవులకు ఎల్లప్పుడు మేలు కలిగిస్తాడు. ఇందువల్ల ఈయనకున్న శివనామం సార్థకమవుతుంది. తపుని(పాంచజన్యుని) తపస్సు వలన కలిగిన ఫలితంగా ఐశ్వర్యం అధికం గావటం చూచి, దాన్ని పొందాలని మేధావి అయిన ఇంద్రుడే పురందరుడు అనేపేరుతో ఆయన పుత్రుడై అవతరించాడు. ఆ పాంచజన్యునికే ఊష్మా అనేపేరు గల అగ్ని కలిగాడు. ఆయన ప్రాణులశరీరంలో వేడిగా వ్యక్తం అవుతుంటాడు. అలాగే తపునికి కలిగిన మనువు అనే అగ్నిస్వరూపుడైన పుత్రుడు ఊష్మాగ్నిని ప్రజాపతికి సంబంధించినదానినిగా చేశాడు. వేదం తెలిసిన విద్వాంసులు శంభువు అనే అగ్నినే ఆవసధ్యాగ్నిగా చెపుతారు. మహాతేజస్సు, జ్వలనం ఆయన స్వభావం. ఈ రీతిగా తపుడు యజ్ఞంలో ఆహుతులు తీసుకునే అయిదు అగ్నులను జనింపజేశాడు. అయిదూ బంగారు కాంతిగలవి. బలాన్ని, తేజస్సును కలిగించే అవి దేవతలకు హవిస్సును అందించేవి.

మహాభాగా! అస్తమించే సమయంలో శ్రమించటంవల్ల అలసిపోయిన సూర్యుడు అగ్నిలో ప్రవేశించటంవల్ల అగ్నిస్వరూపుడు అవుతాడు. ఆయన భయంకరమైన అసురులను, మరణస్వభావంగల మనుష్యులను ఉత్పన్నం చేస్తాడు. (వారు కూడా తపుని సంతతిలోని వారే అంటారు.) మను (ప్రజాపతి) స్వరూపుడై తపునికి పుత్రుడైన భామవనే అగ్నికి అంగిరుడు (తన మహత్త్వాన్ని అర్పించి) నూతన జీవితాన్ని ఇస్తాడు. వేదపారంగతులు, విద్వాంసులైన బ్రాహ్మణులు భానువునే బృహద్భానుడు అంటారు. భానువుకు సుప్రజ,

బృహద్భాస అనే ఇద్దరు భార్య లయినారు. వీరిలో బృహద్భాస అనే ఆమె సూర్యపుత్రిక. వీరు ఇద్దరు ఆరుగురు పుత్రులను కన్నారు. వీరికి కలిగిన సంతతిని వివరిస్తాను. విను. బలహీన ప్రాణులకు ప్రాణాన్ని, బలాన్ని ఇచ్చే అగ్నికి బలదుడు అని పేరు. ఈయన భానువుకు మొదటి కొడుకు. శాంతంగా ఉండే ప్రాణుల్లో భయంకరమైన కోపరూపంగా వ్యక్తమయ్యే మన్యుమంతుడు అనే అగ్ని భానువుకు రెండవపుత్రుడు. దర్శ పౌర్ణమాస యాగాలలో హవిస్సును సమర్పించే విధానం ఉంది. దానిలో వ్యక్తమయ్యే అగ్నిపేరు విష్ణువు. ఈయన అంగిరసుని గోత్రుడని చెపుతారు. ఆయన కున్న ఇంకొకపేరు ధృతిమంతుడు. ఈయన భానువుకు మూడవ కుమారుడు. ఇంద్రునితో గూడ ఆగ్రయణ (కొత్తపంటతో తయారయ్యే హవిస్సుతో జరిగే యజ్ఞ) కర్మలో హవిస్సును సమర్పించే విధానం ఉంది. దాన్ని గ్రహించే అగ్ని ఆగ్రయణుడు. ఈయన భానువుకు నాలుగవ పుత్రుడు. చాతుర్మాస్య యజ్ఞాలలో నిత్యంగా నిశ్చితమైన ఆగ్నేయం మొదలైన ఎనిమిది హవిస్సులకు ఉద్భవస్థాన నామం 'అగ్రహం'. (ఈయనే వైశ్వదేవపర్వంలో ప్రధానమైన విశ్వేదేవు డనే అగ్ని. భానువుకు ఐదవ పుత్రుడు) స్తుభుడు అనే అగ్ని భానువు ఆరవ పుత్రుడు. మొత్తం వీరు ఆరుగురూ భానుపుత్రులు. మనువు (భానువు) మూడవ భార్యపేరు నిశ. ఆమె రోహిణి అనేకన్యను, ఇద్దరుపుత్రులను కన్నది. సోమాగ్నులు ఆ ఇద్దరుపుత్రులు. వీరినే కాక ఇంకా ఐదుగురు పుత్రులను -అగ్నిస్వరూపులను-కన్నది. (వైశ్వానరుడు, విశ్వపతి, సన్నిహితుడు, కపిలుడు, అగ్రణి అనేవి వారిపేర్లు) చాతుర్మాస్య యజ్ఞాలలో ప్రధానహవిస్సుతో పర్జన్యునితో కూడా పూజితుడయ్యే కాంతిమంతుడైన వైశ్వానరాగ్ని మనువు ప్రథమ పుత్రుడు. 'సంపూర్ణమైన జగత్తుకు పతి' అని వేదాలు చెప్పిన విశ్వపతి అనే అగ్ని మనువు ద్వితీయ పుత్రుడు. ఆయన ప్రభావం వల్లనే ఆహుతులు దోషరహితా లౌతాయి. కాబట్టి ఆయనను పరమ స్విష్టకృత్తు (యాగాన్ని నిర్దోషం చేసేవాడు) అని పిలుస్తారు. మనువు పుత్రికనుగూడ స్విష్టకృత్తు అని భావిస్తారు. ఆమెపేరు రోహిణి. ఆమె ఒకానొక పాపఫలితంగా హిరణ్యకశిపుని భార్య అయింది. నిజానికి రోహిణి అనుపేరుగల ఆ కన్యనే అగ్ని అనీ ప్రజాపతి అనీ చెప్పారు.

దేహధారుల ప్రాణాలను ఆశ్రయించి ఆ వ్యక్తి శరీరాన్ని ఒకపనిలో ప్రవర్తింపజేసే ఆయన పేరు సన్నిహితుడు. ఈయన మనువు మూడవపుత్రుడు. ఈయన శబ్ద రూపాన్ని గ్రహించటంలో సహాయపడతాడు. శుక్లగతికి, కృష్ణగతికి ఆధారమైనవాడు, ఎలాంటి మార్పులు లేనివాడు అయినా వికారస్వరూపమైన సృష్టికర్త, సాంఖ్యయోగప్రవర్తకుడై, క్రోధస్వరూప మయిన అగ్నికి ఆశ్రయమైన కపిలాగ్ని కపిలమహర్షి పేరుతో ఉన్నాడు.

(ఈయన మనువుకు నాల్గవపుత్రుడు) మనుష్యాది సమస్తప్రాణులు ఎల్లప్పుడు రకరకాలయిన యాగాలలో సమస్తభూతాలకు ఆహారంలో మొదటిభాగాన్ని అర్పించగా స్వీకరించే అగ్నిపేరు అగ్రణి. (ఈయన మనువుకు ఐదవకుమారుడు.)

అగ్నికార్యంలో కలిగే దోషాలకు ప్రాయశ్చిత్తంగా లోకప్రసిద్ధమైన, కాంతిమంతాలయిన అగ్నులను మనువు సృష్టించాడు. ఇవి వెనుక చెప్పిన అగ్నులకంటే వేరు. ఏదైనా గాలి వీస్తే అగ్నులలో ఒక దానితో ఇంకొక దానికి స్పర్శ కలిగితే అష్టాకపాలాల (సంస్కారపూర్వకంగా చేసిన చిన్న కుండపెంకుల) పురోడాశంతో శుచి అనే అగ్నికి ఇష్టి (ఆహుతి) ఇవ్వాలి. దక్షిణాగ్నికి, గార్హపత్యం, ఆహవనీయం అనే రెండు అగ్నులతో కలయిక జరిగితే ఎనిమిది కపాలాలలో సంస్కరింపబడిన పురోడాశం - చరువుతో వీతి అనే అగ్నికి ఆహుతి ఇవ్వాలి. ఇంటిలో ఉండే అగ్నులకు దావాగ్ని సంసర్గం కలిగితే ఎనిమిది చిన్న కుండపెంకులతో సంస్కృతమైన హవిస్సుతో శుచి అనే అగ్నికి ఆహుతులు ఇవ్వాలి. అగ్నిహోత్రసంబంధమైన అగ్నిని ముట్టైన స్త్రీ స్పృశిస్తే వసుమంతుడు అనే అగ్నికి ఎనిమిది చిన్న కుండపెంకులతో సంస్కరింపబడిన పురోడాశంతో ఆహుతులు ఇవ్వాలి. ఒకప్రాణి మృత్యువును సూచించే విలాపాదులు వినపడినా, కుక్క మొదలైన జంతువులు అగ్నిని స్పృశించినా చిన్న మట్టిపిడతలలో సంస్కరించిన చరువుతో సురభిమంతుడు అనే అగ్ని ప్రసన్నం కావటానికి హోమం చేయాలి. ఎవరైనా ఒక బ్రాహ్మణుడు అనారోగ్యంతో బాధపడుతూ మూడురాత్రులవరకు అగ్నికార్యం చేయలేకపోతే ఎనిమిది కుండపెంకులతో సంస్కరింపబడిన పురోడాశంతో ఉత్తరుడు అనే అగ్నికి ఆహుతి ఇవ్వాలి. ప్రారంభించిన దర్శ, పౌర్ణమాస యజ్ఞాలు మధ్యలో ఆగిపోతే ఆ వ్యక్తి పథికృత్తు అనే అగ్నికి ఎనిమిది కపాలాలలో సంస్కృతమైన పురోడాశంతో హోమం చేయాలి. పురిటింటి అగ్ని, అగ్నిహోత్రాగ్నిని స్పృశిస్తే అష్టాకపాలంతో అగ్నిమంతుడు అనే అగ్నికి ఆహుతి ఇవ్వాలి.

222. సహుడు అను అగ్ని జలప్రవేశము; అథర్వాంగిరసుని వలన అగ్ని ప్రకటితమగుట.

మార్కండేయుడు చెపుతున్నాడు - ధర్మజా! జలంలో నివసించటం చేత ప్రసిద్ధుడైన సహాగ్నికి బాగా ఇష్టురాలైన భార్యపేరు ముదిత. భూలోకానికి భువర్లోకానికి అధిపతి ఐన సహుడు ఆమె వలన 'అద్భుతుడు' అనే గొప్ప అగ్నిని కన్నాడు. అద్భుతుడు అనే అగ్ని అన్నిప్రాణులకు అధిపతి అని వంశపరంపరాక్రమంలో బ్రాహ్మణులు అందరూ చెపుతారు. ఆయనే అన్నింటికి ఆత్మ, లోకాలకు అధిపతి. ఆయనే లోకంలో అన్ని

మహాభూతాలకు అధిపతి. ఆయనలో పూర్తిగా ఐశ్వర్యం వెలుగొందుతుంటుంది. మహాతేజస్వి అయిన ఆ అగ్నిదేవుడు ఎల్లప్పుడూ అంతటా సంచరిస్తుంటాడు. 'గృహపతి' అనే పేరుతో ఎల్లప్పుడు యజ్ఞంలో పూజింపబడుతూ, హోమహవిస్సును దేవతలకు చేర్చే అద్భుతాగ్నియే ఈ లోకాన్ని పవిత్రం చేసేవాడు. ఆపుడు అనే పేరుగల సహునిపుత్రుడు, మహాత్ముడు, సత్త్వభోక్త, భూలోకాన్ని పాలించేవాడు, భువర్లోకానికి ప్రభువు అయిన అద్భుతాగ్ని బుద్ధితత్త్వానికి అధిపతి అని చెపుతారు. 'అద్భుతుడు లేక గృహపతి' అనే ఆయనకు అగ్నిస్వరూపుడయిన ఒక పుత్రుడు కలిగాడు. ఆయనపేరు భరతుడు. ఆయన మరణించిన ప్రాణుల శరీరాలను దహిస్తాడు. అగ్నిష్టోమమనే యజ్ఞంలో నిత్యమూ ఉంటాడు. ఇందువల్ల ఆయనను నియతుడు అని కూడా అంటారు. నియతుని సంకల్పం ఉత్తమం.

మొదటి అగ్ని సహుడు గొప్పప్రభావం గలవాడు. ఒకప్పుడు దేవతలు ఆయనను వెతుకుతున్నారు. ఆయనతో పాటు ఆయన మనుమడు (పౌత్రుడు) నియతుడు కూడా రావటం చూచి (ఆయన తనను స్పృశిస్తాడేమో అనే) భయంతో సముద్రంలో దాక్కున్నాడు. అప్పుడు దేవతలు అన్నిదిక్కుల్లో ఆయనను వెతుకుతూ ఎక్కడ ఉంటే అక్కడకు చేరుకోసాగారు. ఒకనాడు అధర్వుని (అంగిరసుని) చూచి అగ్ని ఇలా అన్నాడు. 'వీరా! నీవు దేవతలవద్దకు వారి హవిస్సును చేర్చు. నేను ఇనుమిక్కిలిగా బలహీనుడిని అయినాను. ఇప్పుడు నీవే అగ్నిపదవిని అలంకరించు. నాకిష్టమయిన ఈ పనిని చేయి.' ఇలా అధర్వుని పంపించి అగ్నిదేవుడు ఇంకొకచోటికి వెళ్ళాడు. కాని చేపలు అధర్వునికి ఆయన ఎక్కడ ఉన్నాడో చెప్పాయి. ఇందువల్ల కోపించిన అగ్ని శాపాన్ని ఇస్తూ ఇలా అన్నాడు – 'మీరు ప్రాణులకు ఆహారం అవుతారు' అని. తరువాత అగ్ని అథర్వునితో మళ్ళీ అదేమాట అన్నాడు. అప్పుడు దేవతలు చెప్పగా అథర్వముని సహుడు అనే అగ్నిని వినయంతో ప్రార్థించాడు. అయినా ఆయన హవిస్సును భరించటానికి ఇష్టపడలేదు. అంతేకాక ఆయన తన చిక్కిపోయిన శరీరాన్ని గూడా భరించలేకపోయాడు. చివరకు ఆయన ఆ శరీరాన్ని వదిలేశాడు. అప్పుడాయన తన శరీరాన్ని వదిలి భూమిలో లీనమయినాడు. భూమిని స్పృశించి అనేక ధాతువులను (భిన్న భిన్నమయిన ఖనిజాలను) సృష్టించాడు. సహుడు అనే అగ్ని తన చీము రక్తాలనుండి గంధకాన్ని, తైజసధాతువులను (వీర్యం, బంగారం) సృజించాడు. ఆయన ఎముకల నుండి దేవదారు వృక్షాన్ని వెలువరించాడు. కఫం (తెమడ, కళ్ళె) నుంచి స్ఫటికాన్ని, పిత్తంనుంచి (పైత్యం – ధాతువిశేషం – పైత్యరసం) మరకతాన్ని వ్యక్తం చేశాడు. ఆయన యకృత్తు (కడుపులో నీరుతిత్తి క్రింద నుండెడు మాంసపుముద్ద) నుంచి నీలాయసం (నల్లనియినుము) కలిగినది. కాష్ఠం – పాషాణం – లోహం అనే

మూడింటి వల్లనే ప్రజలు వెలుగుతారు. ఆయన గోళ్ళు మేఘాలు అవుతవి. నాడులు పగడాలు అయినవి. రాజా! సహోగ్ని శరీరంనుంచి ఇంకా అనేకవిధాలయిన ధాతువులు ఉత్పన్నం అయ్యాయి. ఇలా శరీరాన్ని వదలి ఆయన మహత్తర తపస్సులో లగ్నమయినాడు.- భృగువు, అంగిరసుడు మొదలైన మునులు మళ్ళీ ఆయనను తపస్సునుండి విరమింపజేశారు. అప్పుడు వారి తపస్సుతో పరిపుష్టుడైన అగ్ని చాలా ఎక్కువగా ప్రజ్వరిల్లసాగాడు. ఆయన ఎట్టఎదుట అంగిరసుని చూచి భయంతో మహాసముద్రంలో ప్రవేశించాడు. ఇలాగా అగ్ని అదృశ్యంకాగా జగత్తు అంతా భయపడి అధర్వుడయిన అగ్నిని ఆశ్రయించింది. అంతట దేవతలు అధర్వుని పూజించారు. అప్పుడు అధర్వుడు సర్వప్రాణులూ చూస్తూ ఉండగా సముద్రాన్ని మథించాడు. పుట్టిన అగ్నిని చూచి లోకులకు ఉపయోగపడుమని ఆదేశించాడు.

ఇలా పూర్వకాలంలో అదృశ్యమైన అగ్నిని అంగిరుడు మళ్ళీ పిలిచాడు. అందువల్ల వ్యక్తమైన అగ్ని అన్ని ప్రాణుల హవిస్సును వహిస్తున్నాడు. అనేకస్థానాలలో తిరుగుతూ సహోగ్ని ఇలాగే వేదం చెప్పిన దేవతలను, వారి స్థానాలను కలిగించాడు. సింధునదం, పంచనదం, దేవిక, సరస్వతి, గంగ, శతకుంభ, సరయు, గండకి, చర్మణ్వతి, మహి, మేధ్య, మేధాతిథి, తామ్రవతి, వేత్రవతి, కౌశికి, తమస, నర్మద, గోదావరి, వేణ, ఉపవేణ, భీమ, బడబ, భారతి, సుప్రయోగ, కావేరి, ముర్మర, తుంగవేణ, కృష్ణవేణ, కపిల, శోణభద్ర అనే నదీనదాలను అగ్నుల ఉత్పత్తిస్థానాలుగా చెప్పారు. అద్భుతుని ప్రియభార్యకు 'విభువు' అనే పుత్రుడు కలిగాడు. అగ్నులసంఖ్యయే సోమయాగాలకూ ఉన్నది. ఆ అగ్నులు అన్నీ బ్రహ్మదేవుని మానసిక సంకల్పంవల్ల అత్రివంశంలో ఆయన సంతానంగా కలిగారు. అత్రిమహర్షికి ప్రజాసృష్టి చేయవలెనని కోరిక కలగగానే ఆయన ఆ అగ్నులను తనహృదయంలో ధరించాడు. ఆ బ్రహ్మర్షిశరీరంనుంచి భిన్నమైన అగ్నులు అవతరించాయి. ఈ విధంగా లెక్కించటానికి వీలులేనివి, చీకటినిపోగొట్టేవి, మిక్కిలి ప్రకాశవంతాలు, గొప్పవి అయిన అగ్నుల ఉత్పత్తి క్రమాన్ని వర్ణించాను. అద్భుతాగ్ని మాహాత్మ్యాన్ని వేదాలు వర్ణించిన విధంగానే అన్ని అగ్నులకు మహత్త్వం ఉన్నదని తెలుసుకోవాలి. వీటిలో అన్నిటిలో అగ్నితత్త్వం సమానంగానే ఉన్నది. జ్యోతిష్టోమం అనే యజ్ఞం ఉద్భిదం మొదలైన అనేకరూపాల్లో వ్యక్తమయినట్లుగానే ఒకే అగ్నితత్త్వం ప్రజాపతి శరీరంనుంచి అనేకరూపాల్లో అవతరించింది. ఇదే అంగిరసుడు అని చెప్పే మొదటి అగ్ని. ఈ విధంగానే నేను మహత్తరమైన అగ్నివంశాన్ని ప్రతిపాదించాను. ఆ అగ్నిదేవుని వివిధవేద మంత్రాలతో అర్చిస్తే దేహధారులు ఇచ్చే హవిస్సును దేవతలకు చేరుస్తాడు.

223. ఇంద్రుడు కేశిదానవుని నుండి దేవసేనను విడిపించుట.

ధర్మంతో కూడిన మంచి కథను విని, ధర్మరాజు తపస్వి ఐన మార్కండేయ మహర్షిని ఇలా అడిగాడు. ధర్మరాజు అన్నాడు 'మహర్షీ! కుమారస్వామి ఏ విధంగా జన్మించాడు? అగ్నికి పుత్రుడు ఎలా అయినాడు? శివుని వల్ల ఎలా జన్మించాడు? గంగకు కృత్తికలకు పుత్రుడు ఎందు కయినాడు? ఇది వినాలి అనుకొంటున్నాను. నాకు చాలా కుతూహలంగా ఉంది. మార్కండేయుడు ఇలా అన్నాడు – 'అనఘా యుధిష్ఠిరా! నేను నీకు అగ్నిదేవుని వివిధ వంశాలను వివరించాను. ఇప్పుడు మహామేధావి అయిన కార్తికేయుని జన్మవృత్తాంతాన్ని చెపుతాను, విను. విలక్షణమైన అగ్నికి ఆశ్చర్యజనకుడైన పుత్రుడు కార్తికేయుడు. అతని బలం, తేజస్సు అమితమైనవి. ఆయన బ్రహ్మర్షుల భార్యలకు జన్మించాడు. కీర్తిని పెంపొందించుకొనే ఆయన బ్రాహ్మణభక్తుడు. ఆయన జన్మవృత్తాంతం చెపుతాను. విను. పూర్వకాలంలో దేవతలు, దానవులు సంసిద్ధులై పరస్పరం యుద్ధానికి తలపడుతుండేవారు. ఆ యుద్ధంలో భయంకరరూపులైన దానవులు దేవతలను ఎల్లప్పుడు జయిస్తుండేవారు. దానవులు మాటిమాటికి దేవతలసైన్యాన్ని వధించటం చూసి తనసైన్యానికి నాయకుడు ఎలా లభిస్తాడా అని ఆలోచించాడు ఇంద్రుడు. దానవుల చేతిలో ఓడిపోతున్న తనసైన్యాన్ని చూసి ఆయన తనపరాక్రమంతో దేవతలసైన్యాన్ని రక్షించే మహాబలుడైన మహావ్యక్తిని గురించి నేను తెలుసుకోవాలి అని అనుకొన్నాడు.

ఈ విషయాన్నే బాగా ఆలోచిస్తూ ఇంద్రుడు మానసపర్వతానికి వెళ్ళాడు. అప్పుడు ఆయన ఒక తీవ్రమైన స్త్రీ ఆర్తస్వరాన్ని విన్నాడు. "ఎవరైనా మహావీరుడైన పురుషుడు త్వరగా పరుగెత్తుకొని వచ్చి నన్ను రక్షించవలసింది. నాకు ఆయన భర్తను ప్రసాదించవచ్చు. లేక ఆ వ్యక్తియే నన్ను వరించవచ్చు" అని ఆమె అరిచింది. ఇంద్రుడు ఆమెతో "భయపడవద్దు. నీకు ఎలాంటి భయమూ లేదు" అని పలికి ఆ వైపు చూశాడు. అప్పుడు కేశి అనే దానవుడు ఎదురుగా కన్పడినాడు. ఆ వ్యక్తికి తలపై కిరీటం ఉన్నది. చేతిలో గద ఉన్నది. గైరికాది ధాతువులతో గూడిన మహాపర్వతంలాగా అతడు ఉన్నాడు. ఇంద్రుడు ఆ కన్యను చేతితో తీసికొని ఇలా అన్నాడు. "నీచ దానవా! ఈమెను నీవు ఎందుకు అపహరిస్తున్నావు? నేను ఇంద్రుడిని. తెలుసుకో. నా చేతిలోనిది వజ్రాయుధం. ఈమెను బాధించటం ఇక మానుకో.' కేశి ఇలా అన్నాడు. 'ఇంద్రా! నీవే విడిచిపెట్టు. ఇలా చేస్తేనే నీవు బతికి బట్టకడతావు. నీ నివాసం అమరావతికి వెళ్ళగలవు". అని పలికి కేశి ఇంద్రుని వధించటానికి గదను విసిరాడు. ఆ వచ్చే గదను మధ్యలోనే ఇంద్రుడు వజ్రాయుధంతో ముక్కలు చేశాడు. అప్పుడు బాగా కోపించిన కేశి ఇంద్రునిపైకి ఒక పర్వతశిఖరాన్ని

విసిరాడు. ఆయన తనమీద పడబోయే పర్వతశిఖరాన్ని చూశాడు. రాజా! వెంటనే ఇంద్రుడు దాన్ని వజ్రాయుధంతో ఖండించాడు. అది నేలమీద పడింది. ఆ పడిపోయే శిఖరశిలలు తగిలి కేశికి గాయాలు అయినాయి. వెంటనే అతడు సౌభాగ్యవతి యైన కన్య చేతిని వదిలి పరుగెత్తాడు. రాక్షసుడు తొలగిపోగా ఇంద్రుడు "సుందరీ! నీవు ఎవరివి? ఎవరి పుత్రికవు? ఇక్కడ ఏం చేస్తున్నావు?" అని అడిగాడు.

224. దేవసేనతో ఇంద్రుడు బ్రహ్మసన్నిధికి, బ్రహ్మర్షుల సన్నిధికి వెళ్ళుట; అగ్ని కాముక వృత్తాంతము.

కన్య ఇలా అన్నది. "నేను దక్ష ప్రజాపతి పుత్రికను. నాపేరు దేవసేన. నాసోదరిపేరు దైత్యసేన. ఆమెను మొదట కేశి అపహరించాడు. అక్క చెల్లెళ్ళం మేము ఇద్దరం చెలికత్తెలతో గూడి ప్రజాపతి అనుమతి తీసుకొని, విహరించటానికి ఎప్పుడూ ఈ మానసపర్వతం మీదికి వస్తుంటాం. ఇంద్రదేవా! మహాసురుడు కేశి ప్రతిరోజూ ఇక్కడికి వచ్చి మమ్ములను అపహరించటాన్ని కాంక్షిస్తుంటాడు. దైత్యసేనకు అతనంటే ఇష్టం ఉంది. కాని నాకు లేదు. స్వామీ ! దైత్యసేనను కేశి అపహరించాడు. నీ శక్తితో నేను బయటపడినాను. దేవేంద్రా ! నీవు సూచించిన దుర్జయునే నేను పతిగా స్వీకరిస్తాను.' ఇంద్రుడు అన్నాడు – "నీవు నా పినతల్లి కూతురివి. మా అమ్మగూడా దక్షప్రజాపతి పుత్రిక. నీబలం ఏమిటో నీవు చెప్పితే వినాలి అని నాకోరిక." కన్య ఇలా అన్నది – "మహాత్మా! నేను అబలను. మాతండ్రి వరం వలన నాకు కాబోయే భర్త దేవదానవులకు నమస్సులు అందుకొంటాడు." ఇంద్రుడు అన్నాడు – 'దేవీ! నీకాబోయే భర్తకు బలం ఎంతగా – ఎలా ఉంటుంది? పవిత్రురాలా! నీవు చెబితే వినాలని నాకోరిక.' కన్య అన్నది – 'దేవతలను, దానవులను, యక్షులను, కిన్నరులను, రాక్షసులను, దుష్టులైన దానవులను జయించగలవాడు, మహాపరాక్రమవంతుడు, అసాధారణమైన బలం కలవాడు నీతో కలిసి సమస్తప్రాణులను జయించగలిగేవాడు, బ్రాహ్మణుల మేలు కోరేవాడు, తన కీర్తిని పెంపొందించుకొనేవాడు, మహావీరపురుషుడు నాభర్త అవుతాడు.'

ఇంద్రుడు దేవసేన మాటలు విని చాలా విచారంలో పడి ఈమె కోరుకొనే భర్త దొరకటం కష్టం అనుకొన్నాడు. ఇంతలో సూర్యసమాన తేజస్సు గల ఆయన సూర్యుడు ఉదయించటాన్ని, మహాత్ముడైన చంద్రుడు సూర్యునిలో ప్రవేశించటాన్నీ చూశాడు. అమావాస్యనాడు రౌద్ర(భయంకర)మైన ముహూర్తంలోనే ఉదయపర్వతశిఖరంపైన ఆయనకు దేవాసురుల యుద్ధలక్షణం కనిపించింది. ప్రభాతసమయంలో తూర్పు దిక్కున ఆకాశంలో

ఎర్రటిమేఘాలు వ్యాపిస్తున్నవి. సముద్రజలం కూడా ఎర్రగానే కనిపిస్తున్నది. ఐశ్వర్యవంతుడైన ఇంద్రుడు అది చూశాడు. భృగుగోత్రులు, అంగిరసునిగోత్రం వారు భిన్నభిన్న మంత్రాలను ఉచ్చరిస్తూ హోమంచేసిన హవిస్సును గ్రహించి అగ్నిదేవుడు కూడా సూర్యునిలో ప్రవేశిస్తున్నాడు. అప్పుడు సూర్యుని వద్దకు ఇరవై నాల్గవ పర్వం వచ్చింది. అంటే... అంతకుముందు దేవాసుర యుద్ధం జరిగి సంవత్సరం నిండిన తరువాత మళ్ళీ అటువంటిస్థితి వచ్చింది. హోమసంధ్యాసమయంలో ఆరుద్రముహూర్తం వచ్చింది. ఆ సమయంలో చంద్రుడు సూర్యరాశిలో ఉన్నాడు. ఇలా సూర్యచంద్రుల ఏకత్వం - అంటే ఒకేరాశిలో ఉండటం, రౌద్రముహూర్తంతో కలియటం చూసి ఇంద్రుడు మనస్సులో ఇలా అనుకొన్నాడు. "ఈ సమయంలో సూర్యచంద్రులమోద భయంకరమైన పరివేషం కనిపిస్తున్నది. తెల్లవారుజాముననే మహాయుద్ధం జరుగుతుంది అనే విషయాన్ని ఇది సూచిస్తోంది. ఈ సింధునది గూడా విపరీతమైన ధారతో రక్తప్రవాహంతో ప్రవహిస్తున్నది. ఆడనక్క నోటినుండి నిప్పులు కురుస్తున్నట్లు సూర్యునివైపు మోర ఎత్తి అరుస్తున్నది. అనేకయోగాలతో ఈ మహాభయంకరమైన యోగం తేజస్సుతో గూడి కన్పడుతున్నది. అగ్ని, సూర్యులతో చంద్రుని ఈ మహాద్భుతమైన యోగం కన్పిస్తున్నది. ఈ సమయంలో చంద్రుడు ప్రసాదించే వ్యక్తియే ఈ దేవికి భర్త అవుతాడు. అలాగే అగ్నికూడా ఈ గుణాలు అన్నిటితో కూడి ఉన్నాడు. ఆయన దేవతాసమూహంలో ఉన్నాడు. కాబట్టి ఈ అగ్ని ఒకబాలకుని కనినచో ఆయనే ఈ దేవికి భర్త అవుతాడు" అని ఆ దేవాధిపతి ఆలోచిస్తూ బ్రహ్మలోకానికి వెళ్ళాడు. ఆయన దేవసేనతో బ్రహ్మలోకానికి వెళ్ళి, చతుర్ముఖునితో "దేవేశ్వరా! ఈమెకు మంచిస్వభావం, పరాక్రమం గల మహాశూరుడైన భర్తను అనుగ్రహించండి." అన్నాడు. బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు - "రాక్షస నాశకా! ఈ విషయంలో నీవు అనుకొన్నదే నాకూ తోచింది. అలా జరిగితేనే మహాపరాక్రమవంతుడు, బలవంతుడు అయిన వీరుడు ఆవిర్భవిస్తాడు. ఇంద్రా! ఆయనయే నీకు తోడై ఉండే వీరుడు. నీసేనకు సహాయం అవుతాడు. ఆయనయే ఈమెకు భర్త అవుతాడు. ఈ మాటలు విని దేవేంద్రుడు బ్రహ్మదేవునికి నమస్కరించి, ఆ కన్యను తీసికొని, మహాశక్తి శాలులైన వశిష్ఠాది శ్రేష్ఠబ్రాహ్మణులు, దేవర్షుల ఆశ్రమానికి వెళ్ళాడు.

ఆ కాలంలో ఆ మహర్షులు చేసే యజ్ఞంలో భాగం గ్రహించటానికి, సోమపానం చేయటానికి ఇంద్రాది సమస్త దేవతలు అక్కడికి వెళ్ళారు. వారందరికి సోమపానం చేయవలెననే కోరిక బాగా ఉంది. మహాత్ములయిన ఆ మహర్షులు ప్రజ్వరిల్లుతున్న అగ్నిలో శాస్త్రానుసారం ఇష్టిని చేసి దేవత లందరికీ హవిస్సుతో ఆహుతులు ఇచ్చారు.

భారత వంశశ్రేష్ఠా! మంత్రాలతో ఆవాహనం జరిగిన తరువాత అద్భుతుడు అనే అగ్ని సూర్యమండలం నుంచి బయలుదేరి, మౌనంతో అక్కడికి వచ్చాడు. బ్రహ్మర్షులు మంత్రోచ్చారణతో యథావిధిగా హోమం చేయటానికి అనేకమైన హోమద్రవ్యాలను గ్రహించారు. అద్భుతుడు ఆ మహర్షుల వల్ల ప్రాప్తించిన హవ్యాలన్నీ దేవత లందరికి సమర్పించాడు. అగ్నిదేవుడు అక్కడినుంచి వెళ్ళుతూ ఉన్నప్పుడు ఆయన దృష్టి మహాత్ములైన సప్తర్షులభార్యలమీద పడింది. వారిలో కొందరు తమ ఆసనాలమీద కూర్చొని ఉన్నారు. కొంతమంది హాయిగా నిద్రిస్తున్నారు. బంగారువేదికవలె శరీరకాంతితో మనోహరంగా ఉన్నారు. చంద్రకళవలె కాంతులు వెదజల్లుతున్నారు. తారకలవలె అద్భుతమైన సౌందర్యంతో వెలుగుతున్నారు. వారి పై మనసుపడి చూస్తున్న అద్భుతాగ్ని యొక్క ఇంద్రియాలు అన్నీ క్షోభించిపోయాయి. ఆయన కామదేవునికి లొంగినాడు. మళ్ళీ ఆయన మనస్సులో ఇలా అనుకొన్నాడు. "ఈ మహర్షుల భార్యలు పతివ్రతలు. నాపని సరైనది కాదు. వీరికి నాయందు ఏమాత్రం కోరిక లేదు. అయినా వీరియందు నాకు కోరిక కలిగినది. నిష్కారణంగా నేను వీరిని చూడలేను. వారిని తగలలేను. కాబట్టి గార్హపత్యాగ్నిలో ప్రవేశిస్తే మాటిమాటికి వీరిని చూసే అవకాశం లభిస్తుంది" మార్కండేయ మహర్షి ఇలా అన్నారు. అలా నిశ్చయించుకొని అగ్నిదేవుడు గార్హపత్యాగ్నిని ఆశ్రయించి, తనజ్వాలలతో బంగారు కాంతిగల ఆ ఋషిపత్నులను చూస్తూ, స్పృశిస్తూ చాలా సంతోషిస్తున్నాడు. ఇలా చాలాసేపు అక్కడ నిలచి ఉండి అగ్నిదేవుడు కామవశు డయినాడు. తనమనస్సును ఆ సుందరులపై నిలిపి పరవశించాడు. కామసంతప్తమనస్కుడై ఆ మునిపత్నుల సమాగమం కలగకపోవటం వలన శరీరాన్ని విడిచిపెట్టాలని అడవిలోనికి వెళ్ళాడు. దక్షుని కూతురు స్వాహాదేవి అంతకుముందు నుంచే అగ్నిదేవుని (తను భర్తగా) పొందాలి అని చాలాకాలం నుంచి ఆయనలో లోపాలను వెదకుతున్నది. అప్పటి దాకా చాలా జాగ్రత్తగా ఉన్న అగ్నిలో ఆమెకు ఏ దోషమూ కనిపించలేదు. అగ్ని కామసంతప్తుడయి ఉన్నాడని తెలిసిన వెంటనే ఆమె మనస్సులో ఇలా అనుకొన్నది. 'కామార్తురాలనయిన నేను వారి రూపం దాల్చి అగ్నిని మోహింపజేస్తాను - అలా చేస్తే ఆయన మనస్సూ సంతోషిస్తుంది. నా కోరికా తీరుతుంది.'

225. కుమారస్వామి జననము, క్రౌంచ పర్వత ఖండనము.

మార్కండేయుడు చెప్పసాగాడు. రాజా! అంగిరసుని భార్య శివ చక్కని శీలమూ, సౌందర్యమూ, సద్గుణసంపద కలది. స్వాహాదేవి మొదట ఆమె రూపం ధరించింది. ఆ ఉత్తమ స్త్రీ అగ్నిదేవుని వద్దకు వెళ్లి "కామ సంతప్తనైన నన్ను నీవు మొదట అంగీకరింపవలసినది.

లేకుంటే నేను ప్రాణత్యాగం చేయటం నిశ్చయం. మిగిలిన సప్తర్షుల భార్యలు ఆలోచించుకొని ఒక నిర్ణయానికి వచ్చి, నన్ను ఇక్కడికి పంపించారు" అని ఆమె అన్నది. అగ్ని ఇలా అన్నాడు - 'నీవు చెప్పిన సప్తర్షుల భార్యలకూ, నీకూ నేను కామార్తుడనైతి నని ఎలా తెలిసింది?' శివాదేవి అన్నది - 'అగ్నిదేవా! ఎల్లప్పుడు మాకు నీవు అంటే ఇష్టమే. కాని మేము నీకు భయపడుతూ ఉంటాం. ఇవ్వేళ నీచేష్టలవలన నీమనస్సు తెలుసుకుని వారు నన్ను నీవద్దకు పంపారు. నీతో సంగమించవలెననే కోరికతో నీవద్దకు వచ్చాను. నన్ను త్వరగా పొందు. ఆ నా సోదరీమణులు నాకాకకోసం ఎదురుచూస్తున్నారు.'

అప్పుడు అగ్ని సంతోషంతో ఆమెను స్వీకరించాడు. శివారూపంలో ఉన్న స్వాహాదేవి అగ్నితో సమాగమంలో ఆయన తేజస్సును చేత ధరించింది. తరువాత ఆమె కొంచెం ఆలోచించి "అగ్నికులనందనా! ఈ అరణ్యంలో నా ఈ రూపాన్ని చూచినవారు బ్రాహ్మణ భార్యలందరిమీద అసత్యదోషాన్ని ఆరోపిస్తారు. కాబట్టి నేను ఈ రహస్యాన్ని దాచటం కోసం ఆడ గరుడ పక్షి రూపాన్ని ధరిస్తాను. ఇందువలన ఈ అడవినుంచి నేను సుఖంగా వెళ్ళటానికి వీలు అవుతుంది." అన్నది.

ఇలా ఆమె చెప్పి వెంటనే ఆడ గరుడ పక్షిరూపం ధరించి, ఆ మహారణ్యం నుంచి బయటపడింది. ముందరికి పోయి రెల్లుపొదలతో కప్పబడిన శ్వేతపర్వతశిఖరాన్ని చూచింది. (చూపులలోనే విషమున్న) ఏడు తలలు గల అద్భుతమైన సర్పాలు ఆ పర్వతాన్ని రక్షిస్తున్నాయి. ఇవేకాక రాక్షసులు పిశాచాలు, భయంకర భూతగణాలు, రాక్షస సముదాయంతో అది నిండిపోయింది. అనేకమైన నదులతో, సెలయేళ్లతో, నానావిధ పుష్పాలతో, వృక్షాలతో అడుగు పెట్టటానికి వీలులేనంత దట్టంగా ఆ పర్వతం ఉంది. మంగళమయి అయిన స్వాహాదేవి వేగంగా ఆ దుర్గమ పర్వతశిఖరం మీద ఉన్న ఒక బంగారుకుండంలో ఆ వీర్యం వదలింది. అలాగే సప్తమహర్షుల భార్యలరూపం ధరించి అగ్నిని పొందవలె ననుకొన్న ఆమె తపస్సు, పతిసేవా ప్రభావంతో విరాజిల్లే అరుంధతీరూపాన్ని ధరించలేకపోయింది. తక్కిన ఆరుగురు మునిపత్నుల స్వరూపాలను ధరించి గ్రహించిన రేతస్సును ఆ కుండలో వదలింది. స్వాహాదేవి ప్రతిపత్తు (పాడ్యమి)నాడు ఆ వీర్యాన్ని ఆ కుండలో వదలింది. స్థలితమయిన ఆ తేజస్సు ఒక తేజస్వి అయిన కుమారుని గాంచినది. మహర్షులు పూజించి స్కందిత మయిన దానివలన ఏర్పడడం చేత ఆ కుమారుని పేరు స్కందుడు అయినది. ఆరుతలలు, పన్నెండు చెవులు, పన్నెండు కన్నులు, పన్నెండు భుజాలు ఉన్నవి. కాని ఆ కుమారునికి మెడ, పొట్ట మాత్రం ఒకటే ఉన్నది. విదియనాడు వ్యక్తమైన ఆయన మూడవరోజున శిశువు అయ్యాడు. నాల్గవనాడు

ఆ స్కంద కుమారునికి అంగాలు, ఉపాంగాలు (చేతులు, కాళ్ళు, వ్రేళ్ళు మొ।నవి) కలిగాయి.

అప్పుడు కుమారస్వామి ఎర్రని విశాలమైన మేఘంతో కప్పబడి ఉన్నాడు. అందువల్ల ఎర్రని విశాల మేఘంలో వెలిగే సూర్యునివలె ఆయన ప్రకాశించాడు. త్రిపురనాశకుడైన పరమేశ్వరుడు దేవశత్రువులను నాశనం చేయటానికి ఒక వింటిని సిద్ధం చేశాడు. అది పెద్దది. చూస్తేనే గగుర్పాటు కల్గించేది. మహాబలుడైన ఆ స్కందుడు ఆ మహాధనుస్సు నెత్తి సింహనాదం చేశాడు. మహామేఘగర్జన వలె ఉన్న ఆ సింహనాదాన్ని విని, స్థావరజంగమ ప్రాణులతో గూడిన ముల్లోకాలు మూర్ఛ పొందినట్లైనవి. చిత్రం, ఐరావతం అనేపేర్లు గల ఏనుగులు పరుగులెత్తాయి. మహాబలిష్ఠుడై, సూర్యసమానకాంతి గల ఆయన వాటిని రెండిటిని రెండుచేతులతో గ్రహించాడు. ఇంకొక చేతితో శక్తి అనే ఆయుధాన్ని, మరోచేతితో పెద్దశరీరం, ఎర్రటి శిఖ గల కోడిపుంజును పట్టుకొని పెద్దగా సింహనాదం చేసి వాటితో ఆ మహాభుజుడు ఆడుకొన్నాడు. రెండుచేతులతో ఆయన ఉత్తమశంఖాన్ని పట్టుకొని బలిష్ఠమైన ప్రాణులకు కూడా భయంకలిగిస్తూ ఊదాడు. ఆ మహాసేనుడు మూడులోకాలను మ్రింగుతున్నట్లు రెండుచేతులతో ఆకాశాన్ని కొడుతున్నాడు. ఇలా ఆయన ఆడుకొంటున్నాడు. అపరిమిత ఆత్మబలమూ, అద్భుతపరాక్రమమూ గల స్కందుడు ఉదయపర్వత శిఖరంమీద కిరణమాలికలతో కూడిన సూర్యభగవానుని వలె విరాజిల్లుతున్నాడు. అనేక ముఖాలతో సంపూర్ణ విశాలప్రపంచాన్ని చూస్తున్నాడు. వివిధ వస్తువులను చూచి మహాత్ముడైన స్కందుడు మళ్ళీ కేకలు పెడుతున్నాడు. తీవ్రమయిన ఆ గర్జనను విని, అనేకప్రాణులు నేలమీద పడ్డాయి. భయంతో వణికిపోయే మనస్సుతో అన్నీ ఆయనను శరణు పొందాయి. ఆ సమయంలో నానావర్ణాల జీవులు ఆ స్వామిని శరణుకోరారు. వారందరినీ బాహుబలసంపన్నులైన వారి పారిషదులు అని బ్రాహ్మణులు చెప్పారు.

మహాబాహువైన స్కందస్వామి లేచి ఆ ప్రాణులన్నిటికీ ఊరట కలిగించాడు. తరువాత శ్వేతపర్వతం మీద నిలచి అల్లె త్రాటిని లాగి బాణాలను వర్షించాడు. ఆ బాణాలతో ఆయన హిమవంతుని పుత్రుడైన క్రౌంచ పర్వతాన్ని చీల్చివేశాడు. ఆ రంధ్రం నుంచి హంసలు, గ్రద్దలు మేరుపర్వతానికి వెళ్ళుతున్నాయి. స్కందుని బాణాలవల్ల ఛిన్నాభిన్నం అయిన క్రౌంచపర్వతం పెద్దగా ఆర్తనాదం చేస్తూ నేలగూలింది. అది పడటంతోనే ఇతరపర్వతాలు కూడా తీవ్రంగా ఆర్తనాదం చేశాయి. అమితమైన ఆత్మబలం గల కుమారస్వామి వాటి నాదం విని కూడా తొణకలేదు. అంతేకాక చేతిలోకి శక్త్యాయుధాన్ని తీసికొని సింహనాదం చేశాడు. అప్పుడు ఆయన విమలమైన శక్త్యాయుధాన్ని ప్రయోగించి,

శ్వేతపర్వతశిఖరాన్ని చాలావేగంగా ముక్కలు చేశాడు. కార్తికేయుని శక్త్యాయుధం దెబ్బకు చీలిపోయిన శ్వేతపర్వతం ఆ మహాత్ముని భయంతో వణికిపోయింది. ఇతరపర్వతాలతో పాటు భూమిని వదలి ఆకాశంలోకి ఎగిరిపోయింది. తరువాత భూమి అన్నివైపులా పగిలిపోయి, ఆర్తురాలై కుమారస్వామిని శరణంది, మళ్ళీ బలంగలిగి శోభించినది. తరువాత పర్వతాలు కూడా ఆయనకు నమస్కరించి, మళ్ళీ భూమి పైకి వచ్చాయి. అప్పటినుంచి జనులు అందరూ ప్రతిమాసంలో శుక్లపక్ష పంచమి నాడు కుమారస్వామిని పూజింపసాగారు.

226. స్కందునికి జాతకాదులు - అగ్నిదేవాదుల రక్షణము.

మహాధైర్యశాలి, మహాబలవంతుడూ అయిన మహాసేనుడు జన్మించిన తరువాత అనేక విధాల భయంకరోత్పాతాలు కలిగాయి. స్త్రీ పురుషుల మధ్య శత్రుత్వం ఏర్పడింది. ద్వంద్వాల మధ్య వైపరీత్యం ఏర్పడింది. గ్రహాలు, దిక్కులు, ఆకాశం మండుతున్నట్లున్నాయి. భూమి చాల వేగంగా ధ్వనింపసాగింది. లోకక్షేమాన్ని కోరే మహర్షులు నాలుగు వైపుల మిక్కిలి భయంకరమైన ఉత్పాతాలను చూసి, కలత చెంది, లేచి లోకంలో శాంతి కలగటానికి శాంతి కర్మలను యధావిధిగా అనుష్ఠించారు. చైత్రరథ మనే వనంలో ఉన్న అగ్ని సప్తర్షుల ఆరుగురు భార్యలతో సంగమించి మనకు ఈ మహాభయంకరమైన అనర్థాన్ని కలిగించాడు. ఇతరులు ఆడ గరుడపక్షితో 'నీవే ఈ అనర్థాన్ని కలిగించావు' అని అన్నారు. స్వాహాదేవి గరుడపక్షిరూపంలో వెళ్ళటం చూసినవారు ఇలా అనుకొన్నారు. 'ఇదంతా స్వాహాదేవి చేసినపని అని వారికి తెలియదు.' ఆడగరుడపక్షి జనులమాటలు విని 'ఇతడు నా కుమారుడు' అన్నది. తరువాత మెల్లగా స్కందునివద్దకు వెళ్ళి 'వత్సా! నీకు జన్మనిచ్చిన తల్లిని' అని అన్నది. సప్తర్షులు తమ ఆరుగురు పత్నుల సమాగమంతో అగ్నిదేవునికి ఒక కుమారుడు కలిగినాడు అన్నమాట విని, అరుంధతీ దేవిని మినహా తక్కిన ఆరుగురి భార్యలను వదిలివేశారు. ఆ వనంలో ఉండేవారు ఆ సమయంలో ఆ ఆరుగురు ఋషులభార్యలే ఆ పుత్రుని తల్లులని అనటమే దానికి కారణం. స్వాహాదేవి చాలాసార్లు 'ఈ పిల్లవాడు నాపుత్రుడే. ఈయన జన్మ రహస్యం నాకు తెలుసు. జనం చెప్పేది ఆబద్ధం' అని చెప్పినా లాభం లేకపోయింది. విశ్వామిత్రమహర్షి సప్తర్షుల యజ్ఞం పూర్తి అయినప్పుడు కామపీడితుడైన అగ్నిదేవుని వెంబడి రహస్యంగా వెళ్ళాడు. అప్పుడు ఆయన ఎవరికి కన్పించలేదు. కాబట్టి ఆయనకు ఈ వృత్తాంతం అంతా తెలుసు. విశ్వామిత్రుడు మొదట కుమారస్వామిని శరణుపొందాడు. మహాసేనుని దివ్యస్తోత్రంతో స్తుతించాడు. ఆ ముని కుమారస్వామికి మంగళకృత్యాలు అన్నీ చేశాడు. జాతకర్మమొదలైన

13 సంస్కారాలు నిర్వర్తించాడు. స్కందుని మహిమను, కుక్కుటాన్ని ధరించటం, పరమేశ్వరితో సమానమైన బలంగల శక్తి ఆయుధాన్ని గ్రహించటం, పారిషదులను గ్రహించటం మొదలైన సమస్త కార్యాలను లోకానికి మేలు కలిగించటానికి అవసరమైన రీతిగా సిద్ధం చేశాడు. అందువలన కుమారస్వామికి విశ్వామిత్రముని ఇష్టుడైనాడు. స్వాహాదేవి ఇతర ఋషిపత్నుల రూపాన్ని ధరించి అగ్నిదేవునితో సంయోగం పొందటం తెలుసుకాబట్టి ఆ మునులతో 'మీ భార్యలు ఏ తప్పు చేయలేదు' అని చెప్పాడు. ఆయన చెప్పిన సత్యం తెలిసికూడా ఋషులు భార్యలను పూర్తిగా వదలిపెట్టారు.

మార్కండేయమహర్షి ఇలా అన్నాడు - రాజా! ఆ సమయంలో కుమారస్వామి జననమూ, బలపరాక్రమాలనూ గురించి విన్న దేవతలు అందరు కలిసి ఇంద్రునితో ఇలా అన్నారు. 'దేవా! కుమారుని బలం మనకు తట్టుకొనరానిది. కాబట్టి త్వరగా ఆతనిని సంహరించు. ఆలస్యం చేయవద్దు. అలా ఇప్పుడే చేయకపోతే ఈయన మమ్ములను అందరిని, చివరకు నిన్ను గూడ వశం చేసుకొని దేవేంద్రుడు అవుతాడు.' అప్పుడు ఆయన బాధపడుతూ "దేవతలారా! ఈ బాలుడు చాలా బలవంతుడు. ఈయన లోకాలను సృష్టించే బ్రహ్మను గూడ యుద్ధంలో జయించగలడు. అందువల్ల నేను ఈ బాలుని చంపే సాహసం చేయలేను" అని మాటిమాటికి చెప్పాడు. ఇది విని వారు 'నీకు ఇప్పుడు బలపరాక్రమాలు లోపించాయి. అందువలననే ఇలా అంటున్నావు. ఆరుగురు లోకమాతలు ఇప్పుడు స్కందుని వద్దకు వెళ్ళాలి. వారు ఇష్టం వచ్చినట్లు పరాక్రమించగలరు. స్కందుని మట్టుపెట్టగలరు.' అని అన్నారు. మాతలు ఆమాటలు విని 'అలాగే' అని బయలుదేరారు. సాటిలేని శక్తిగల కుమారస్వామిని చూసి, నిరుత్సాహపడి, 'ఈ మహావీరుని ఓడించటం అసంభవం' అని నిశ్చయించుకొని ఆయనను శరణు పొందారు. 'మహాబలా! కుమారా! నీవు మా పుత్రుడవు కావలసినది. పుత్రప్రేమతో మేము చలించిపోతున్నాం. మా పాలను త్రాగి సంతోషపెట్టు' అని పలికారు. వారిమాటలు విని, ఆ సమర్థుడు మాతృస్తనపానాన్ని చేయగోరాడు. మహాసేనుడు వారిని గౌరవించి వారికోరికను తీర్చాడు. ఇంతలో ఆ మహాబలుడు తండ్రియైన అగ్నిదేవుని చూశాడు. కుమారుని పూజ స్వీకరించి, శుభంకరుడైన అగ్ని మాతృగణంతో గూడా ఆయనను చుట్టుముట్టి నిలిచి, రక్షించసాగాడు. ఆ సమయంలో మాతృగణాలనుంచి అవతరించిన క్రోధరూప స్త్రీ చేతిలో త్రిశూలాన్ని పట్టుకొని, తనకు పుత్ర సమానుడైన ఆయనను అన్నివైపుల నుంచి రక్షిస్తూ నిలచింది. రక్తసముద్ర పుత్రిక, క్రూరస్వభావం గలది, రక్తభోజనప్రియ అయిన ఒక కన్యక పుత్రునివలె ఆయనను గుండెకు హత్తుకొని అన్నివైపులనుండి రక్షించసాగింది. వేదప్రతిపాదితుడైన

అగ్నిదేవుడు మేకముఖం గలిగి తన సంతానంతో వచ్చి, పర్వతనివాసి అయిన కుమారుని ఆటబొమ్మలతో చిన్నపిల్లవానిని వలె సంతోషపెట్టాడు.

227. ఓడిపోయి శరణు కోరిన ఇంద్రాదులకు స్కందుని అభయప్రదానము.

మార్కండేయు డన్నాడు. రాజా! గ్రహాలు, ఉపగ్రహాలు, మాతృగణం, అగ్నిముఖులు, పాగరుబోతులు అయిన పార్షదుల గణాలు, ఇంకా స్వర్గంలో ఉన్న భయంకరమైన ప్రాణులు, మాతృగణాలతో కలిసి ఆయనకు చుట్టూ ఉండి అన్నివైపుల నుండి రక్షించసాగాయి. విజయం సందిగ్ధంగా ఉన్నదని తలచిన ఇంద్రుడు జయం కలగాలనే కోరికతో ఐరావతాన్ని ఎక్కి దేవతలతో కలిసి ముందరికి వెళ్ళాడు. దేవగణాలు చుట్టూ ఉండగా మహాసేనుని సంహరించాలనే ఉద్దేశ్యంతో వజ్రాయుధాన్ని ధరించి ఇంద్రుడు వేగంగా వెళ్ళాడు. దేవసైన్యం చాలా భయంకరంగా ఉంది. ఆ సేనలో నుంచి తీవ్రమైన గర్జనలు వెలువడుతున్నాయి. వాటి కాంతులు విస్తారంగా ఉన్నాయి. వాటి జెండాలు, కవచాలు విచిత్రంగా ఉన్నాయి. సైనికులు, వాహనాలు నానావిధాలుగా కన్పిస్తున్నాయి. వారు అందరూ ఉత్తమవస్త్రాలను ధరించారు. ప్రకాశవంతమైన వివిధాభరణాలను ధరించి కనపడుతున్నారు. తనను చంపటానికి వస్తున్న ఇంద్రుని చూచి కుమారస్వామి కూడా తన సైన్యాన్ని ఎదురువెళ్ళమని ఆజ్ఞ ఇచ్చాడు. ధర్మజా! బలిష్ఠుడైన ఇంద్రుడు అగ్ని కుమారుడైన స్కందుని సంహరించాలని దేవసైన్యానికి సంతోషం పెంపొందిస్తూ, తీవ్రంగా సింహనాదం చేస్తూ, వేగంగా ముందుకు వెళ్ళుతున్నాడు. దేవతలు, మహర్షులు ఆయనను చాలా గౌరవిస్తున్నారు. దేవరాజు కార్తికేయుని సమీపానికి వస్తూ దేవతలతో కూడా సింహగర్జన చేస్తున్నాడు. ఆ సింహనాదాన్ని విన్న కుమారస్వామి కూడా సముద్రధ్వనివంటి గర్జన చేయసాగాడు. మహోత్సాహంతో పొంగిపోతూ, సముద్రంలాగా ముందుకు ఉరుకుతూ ఉన్న దేవతలసైన్యం కుమారస్వామి భయంకరసింహనాదం విన్నంతనే జడప్రాయమై అక్కడే తిరగసాగింది. తనను సంహరించటానికి ముందుకు వస్తున్న దేవసైన్యాన్ని చూసి, ఆ అగ్నిపుత్రుడు తీవ్రకోపంతో నోటినుంచి మహాగ్నిజ్వాలలను వెళ్ళగ్రక్కసాగాడు. ఈ రీతిగా ఆయన దేవసైన్యాన్ని దగ్ధం చేయసాగాడు. ఆ సైన్యం అంతా నేలమీద పడి గిలగిల తన్నుకొనసాగింది. వారి శరీరాలు కాలిపోయాయి. వారందరూ చెల్లాచెదరై చెదరుమదురుగా పడిన ఆకాశంలోని నక్షత్రాలవలె కన్పడినారు. ఇలా తగలబడుతున్న దేవసైన్యం ఇంద్రుని వదలి, అగ్నిపుత్రుడైన స్కందునే శరణు పొందడంతో సంతాపం తొలగింది. దేవతలు తనను వీడి వెళ్ళిన తరువాత దేవరాజు కుమారునిపై వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. రాజేంద్రా! ఆ ఆయుధం

స్కందుని శరీరంలో కుడిప్రక్క ఎడమ ఎముకవరకూ పోయి పెద్దగాయం చేసింది. ఆయన ప్రక్కభాగం విరిగింది. వజ్రాయుధం దెబ్బతో కుమారస్వామి గాయం నుంచి ఒక యువకుడైన వీర పురుషుడు ఆవిర్భవించాడు. బంగారుకవచాన్ని ధరించిన ఆయన చేతిలో ఉన్న శక్తి అనే ఆయుధమూ, చెవులకున్న దివ్యకుండలాలూ మెరిసిపోతున్నాయి. వజ్రాయుధం శరీరంలో ప్రవేశించటం వలన (జనించటంచేత) ఆయన విశాఖుడు అనేపేరుతో ప్రసిద్ధుడైనాడు. ప్రళయాగ్నివలె తేజస్వి ఐన ఆరెండవ వీరుడు అవతరించటం చూసి, భయంతో వణికిపోతూ ఇంద్రుడు చేతులు జోడించి కుమారుని శరణుకోరాడు. అప్పుడు సత్పురుషశ్రేష్ఠుడైన స్కందుడు ఆయనకు అభయం ఇచ్చాడు. అందుకు సంతోషించి దేవతలు మంగళవాద్యాలను మ్రోగించారు.

228. కుమారస్వామి అనుయాయుల వర్ణన.

ఇప్పుడు స్కందుని అనుచరగణాన్ని గురించి చెపుతాను. విను. వారు భయంకరులు, విలక్షణంగా ఉంటారు. ఇంద్రుని వజ్రపు దెబ్బ తగిలినతరువాత కుమారుని శరీరం నుంచి అనేక కుమారగ్రహాలు కలిగాయి. క్రూరస్వభావం గల ఆ కుమారగ్రహాలు అప్పుడే పుట్టిన పిల్లలను, తల్లికడుపులో ఉన్న శిశువులను కూడ హరించగలవు. వజ్రప్రహారంవల్ల కుమారుని శరీరంనుండి మహాబలం కల కన్యలు కూడా ఆవిర్భవించారు. ఆ కుమారగ్రహాలు కుమారుని తమతండ్రిని చేసికొన్నవి. మేషముఖుడైన కుమారుడు కన్యాసమూహంతో, తనపుత్రులతో గూడి మాతృగణం చూస్తూండగా యుద్ధంలో తన పక్షంవారిని రక్షిస్తుంటాడు. ఆయనయే భద్రశాఖుడు, కౌసలుడు అనే పేర్లతో ప్రసిద్ధుడైనాడు. అందువల్ల భూలోకంలోని మనుష్యులు స్కందుని 'కుమారగ్రహాల తండ్రి' అని అంటారు. పుత్రులు వివిధ ప్రాంతాలలో ఉన్నవారు, పుత్రకాంక్ష గల వారు అగ్నిని, రుద్రుని, స్వాహాస్వరూపురాలు, బలిష్ఠ అయిన ఉమాదేవిని ఉపాసిస్తూ ఉంటారు. తపుడు అనే అగ్ని కనిన కన్యలు అందరు స్కందుని వద్దకు వచ్చి 'మేము ఏమి చేయాలి.' అని అడుగసాగారు.

'మేము జగత్తుకంతటికి శ్రేష్ఠమాతలం కాగలగాలి. మీ దయవలన పూజలందుకొన గలగాలి. మా కోరిక ఇదే. మీరు తీర్చాలి.' అన్నారు. అప్పుడు గొప్ప మనస్సు గల స్కందుడు 'అలాగే మీరు అందరూ విడివిడిగా పూజించదగిన మాతలుగా లోకం భావిస్తుంది. మీరు శివ, అశివ అని రెండు వర్గాలుగా అవుతారు' అన్నాడు. తరువాత స్కందుని తమపుత్రునిగా అంగీకరించి మాతృకలు అక్కడనుండి వెళ్ళారు. కాకి, హలిమ, మాలిని, బృంహత, ఆర్య, పలాల, వైమిత్ర అనేవారు ఏడుగురు శిశువులకు మాతలు.

కుమారస్వామి అనుగ్రహంవలన వీరికి శిశువు అనే పేరుగల మహాపరాక్రమవంతు డయిన పుత్రుడు కలిగాడు. ఆయన చాలా దారుణమయినవాడు – ఎర్రటి కన్నులు గలవాడు. శిశువులు మాతృగణాలు కలిసి అష్టవ్యక్తులు అవుతారు. వీరిని 'వీరాష్టకం' అంటారు. మేషముఖ స్కందునితో కలిపి వీరిని మొత్తాన్ని వీరనవకం అని అంటారు. ధర్మజా! స్కందుని ఆరవముఖం మేషముఖం అని తెలుసుకో. అది ఆరుముఖాల మధ్యలో ఉంటుంది. మాతృగణం నిత్యం దాన్ని పూజిస్తుంటుంది. స్కందుని ఆరుముఖాలలో అదే సర్వశ్రేష్ఠం అంటారు. ఆయన దివ్యశక్తిని సృష్టించాడు. అందువల్ల ఆయనకు భద్రశాఖుడు అనే ప్రసిద్ధి కలిగింది. రాజేంద్రా! ఈ రీతిగా శుక్లపక్షంలో పంచమీతిథినాడు వివిధాకారాలు గల అనుచరుల సృష్టి జరిగింది. షష్ఠినాడు చాలభయంకరమైన యుద్ధం జరిగింది.

229. స్కందుని దేవసేనాపతిత్వము - దేవసేనతో వివాహము.

మార్కండేయముని ఇలా అన్నాడు. రాజా! స్కందుడు బంగారు కవచాన్ని, స్వర్ణమాలికను, బంగరుతురాయి గల కిరీటాన్ని ధరించి సుందరాసనంమీద కూర్చొని యున్నాడు. ఆయన కన్నులనుండి బంగరు వెలుగు వెలువడుతోంది. ఆయన శరీరంనుండి తేజఃపుంజం బయల్వడుతోంది. ఆయన అరుణవస్త్రం ధరించి ఉన్నాడు. ఆయన దంతాలు చాలా పదునుగా ఉన్నాయి. చక్కని ఆకృతి, మిక్కిలి శుభలక్షణాలు గల ఆయన ముల్లోకాలకు చాల ఇష్టుడై ఉన్నాడు. వరదాత, శూరుడు, యువకుడు, అందమైన కుండలాలతో అలంకృతుడైన కార్తికేయుని తామరపూవుతో సమానమైన కాంతిగల లక్ష్మి సాకారయై సేవిస్తోంది. తేజస్సంపన్నుడై అక్కడ కూర్చున్న ఆ సుందర కుమారస్వామిని ఆ సమయంలో సమస్తప్రాణులు పూర్ణిమాచంద్రునివలె దర్శించారు. మహాత్ములైన బ్రాహ్మణులు బలిష్ఠుడైన కుమారస్వామిని పూజించారు. మహర్షులు అక్కడికి వచ్చి ఆయనను ఇలా స్తుతించారు. మహర్షులు ఇలా అన్నారు – హిరణ్యగర్భా! నీకు మేలుకలుగుగాక. లోకాలకు సుఖం కలిగించు. ఆరురోజులకు ముందు పుట్టిన నీవు లోకాలు అన్నింటినీ వశం చేసుకొన్నావు. దేవశ్రేష్ఠా! నీవే ఈ అన్నిలోకాలకు అభయం ఇచ్చావు. కాబట్టి నీవు ఈరోజే ఇంద్ర పదవిని అధిష్ఠించి మూడులోకాల భయాన్ని పారద్రోలు!' కుమారస్వామి అన్నాడు – 'తపోధనులారా! ఇంద్రుడు ఈ పదవిలో ఉండి లోకాలు అన్నింటికి ఏం మేలు చేస్తుంటాడు? ఆ దేవాధిపతి నిత్యమూ, దేవసమూహాన్ని ఎలా రక్షిస్తుంటాడు?' మునీంద్రులు అన్నారు – 'దేవేంద్రుడు సంతోషిస్తే సమస్తప్రాణులకు బలాన్ని, తేజస్సును, సంతతిని, సుఖాన్ని ఇస్తాడు. వారికోరికలను అన్నిటినీ తీరుస్తాడు. ఆయన దుష్టులను

సంహరిస్తాడు. మంచి నియమాలను పాటించి జీవించేవారికి బ్రతుకుతెరువు చూపిస్తాడు. బలాసురుని సంహరించిన ఆయన ప్రాణు లన్నిటిని అవసరమైన పనులు ఆచరించమని ఆదేశిస్తాడు. సూర్యుడు లేనిచో సూర్యు డవుతాడు. చంద్రుడు లేనిచో చంద్రు డవుతాడు. అవసరాన్ని అనుసరించి అగ్ని, వాయు, భూమి, జల స్వరూపాలు ధరిస్తాడు. ఇవి అన్నీ ఇంద్రుడు చేయవలసినవి. ఆయన మహాబలశాలి. కాబట్టి నీవే ఇంద్రుడివి కావాలి. నీవు అందరిలోకి శ్రేష్ఠుడవు.'

ఇంద్రు డన్నాడు – 'మహాభుజా! నీవే ఇంద్రుడివి అయి మాకు అందరికీ సుఖం కలిగించు. మహాత్మా! నీవే ఈ పదవికి అన్నివిధాలా యోగ్యుడివి. కాబట్టి నేడే ఈ పదవిలో పట్టాభిషిక్తుడవు కావాలి.' కుమారస్వామి అన్నాడు – 'ఇంద్రా! పరాకు లేకుండా నీవే ముల్లోకాలను పరిపాలించు. విజయాసక్తుడవుకా. నేను నీకు సేవకుడను. నాకు ఇంద్రపదవీ కాంక్ష లేదు.' ఇంద్రుడు అన్నాడు. 'వీరశ్రేష్ఠా! నీబలం అద్భుతం. కనుక నీవే దేవశత్రువులను జయించు. నీచేతిలో ఓడిపోవటంచేత దుర్బలుడ నని స్పష్టమయినది. (నీబలానికి ఆశ్చర్యపడి లోకులు నన్ను గేలి చేస్తారు. నేను ఇంద్రపదవిలో ఉన్నా మాకు పరాజయం తప్పదు) మనమధ్య భేదం కలిగించాలని ఇతరులు చాలా జాగ్రత్తగా ప్రయత్నిస్తారు. నీలో భేదం ఏర్పడితే లోకమంతా రెండుగా చీలిపోతుంది. వెంటనే మనమధ్య యుద్ధం ప్రారంభం అవుతుంది. ఆయుద్ధంలో నీవే తప్పక జయిస్తావని నా దృఢవిశ్వాసం. కాబట్టి నీవే ఇంద్రుడివి కావలసింది. ఈ విషయంలో ఇంకోవిధంగా ఆలోచించవద్దు.' కుమారస్వామి ఇలా అన్నాడు – 'ముల్లోకాలకు, నాకు కూడా నీవే రాజువు. నీకు మేలు కలుగుగాక. ఇంద్రా! నేను ఏమి చేయాలో ఇక చెప్పు.' ఇంద్రుడు అన్నాడు – 'మహాబలా! నీమాట తప్పక నిజమయితే ఇంద్రపదవిలో నిలుస్తాను. యథార్థంగా నీవు నా ఆజ్ఞను పాటించాల నుకొనేటట్టయితే ఈ నామాట విను. మహాబలా! దేవతలకు సేనాపతివిగా నీవు పట్టాభిషిక్తుడివి కావాలి.' స్కందుడు ఇలా అన్నాడు– 'ఇంద్రా! రాక్షసులు నాశనం కావటానికి, దేవతల కార్యసిద్ధికి, గోవులకు బ్రాహ్మణులకు మేలు కలగటానికి నన్ను దేవసేనాధిపతిగా అభిషేకించు.'

అటు తరువాత సమస్తదేవతలతో గూడి ఇంద్రుడు కుమారస్వామిని దేవతల సేనాపతిగా అభిషేకించాడు. అప్పుడు అక్కడ మహర్షుల పూజలందుకొని కుమారస్వామి మిక్కిలి మంగళకరు డయినాడు. ఆయనకు పైన బట్టిన స్వర్ణమయమయిన ఛత్రం అగ్నిమండలం వలె ప్రకాశిస్తున్నది. శత్రునాశకా! ధర్మజా! త్రిపురాలను నాశనంచేసిన పరమేశ్వరుడు, పరమేశ్వరి అక్కడికి వచ్చి కుమారస్వామి మెడలో విశ్వకర్మ తయారుచేసిన బంగారు దివ్యమాలికను వేశారు. వృషభధ్వజు డయిన పరమేశ్వరుడు బాగా ప్రసన్నుడై

కుమారస్వామిని ఆదరించాడు. బ్రాహ్మణులు అగ్నిని రుద్రస్వరూపునిగా చెపుతారు. కాబట్టి స్కందుడు రుద్రపుత్రుడే. రుద్రుడు త్యజించిన వీర్యం శ్వేత పర్వతమైంది. తరువాత కృత్తికలు అగ్నివీర్యాన్ని శ్వేతపర్వతంపైకి చేర్చారు. గుణగణ్యుడైన కుమారస్వామిని రుద్రుడు ఆదరించటం చూసిన దేవతలు 'ఈయన రుద్రపుత్రుడే' అన్నారు. రుద్రుడు అగ్నిదేవునిలో ప్రవేశించి ఈ శిశువుకు జన్మనిచ్చాడు. రుద్రస్వరూపుడయిన అగ్నివల్ల కలగటం చేత ఈయనను రుద్రపుత్రుడే అనాలి. భరతవంశీయా! ధర్మజా! దేవశ్రేష్ఠుడైన స్కందుడు రుద్రస్వరూపుడయిన అగ్నివలన, స్వాహావలన, ఆరుగురు స్త్రీలవలన జన్మించాడు. అందుచేత రుద్రపుత్రు డయినాడు. అగ్నిపుత్రు డయిన స్కందుడు స్వచ్ఛమైన ఎఱ్ఱని వస్త్రద్వయం ధరించి, కాంతిమంతమయిన శరీరంతో రెండు ఎర్రనిమేఘాలతో గూడిన సూర్యభగవానుని వలె తేజరిల్లుతున్నాడు.

అగ్నిదేవుడు స్కందునికి కోడి గుర్తుగల ఎత్తైన జెండాను బహూకరించాడు. అది రథంమీద అరుణకాంతితో ప్రళయాగ్నివలె ధగధగ ప్రకాశిస్తున్నది. సర్వప్రాణులలో ఉన్న చైతన్యం కాంతి, శాంతి, బలం – ఇవి అన్నీ కలిసి కార్తికేయుని ముందు శక్తిరూపంలో నిలిచాయి. అవి దేవతల విజయలక్ష్మిని పెంపొందిచేవిగా ఉన్నాయి. అలాగే ఆ స్కందుని శరీరంలో సహజకవచం ప్రవేశించింది. అది యుద్ధసమయంలో ఎల్లప్పుడూ వ్యక్తమవుతుంది. రాజేంద్రా! శక్తి, ధర్మం, బలం, తేజస్సు, సత్యం, సమున్నతి, రక్షణ, శత్రునాశనం, సమస్తలోకపాలనం అనే సమస్త గుణాలు స్కందునితోనే ఆవిర్భవించాయి. ఈ విధంగా సమస్త దేవతలచేత దేవసేనాపతిగా అభిషిక్తుడై, నానావిధాలంకార శోభితుడై, పవిత్రమూ, ప్రసన్నమూ ఐన హృదయం గల స్కందుడు సంపూర్ణచంద్రుని వలె విరాజిల్లాడు. ఆ సమయంలో చాలా వేదమంత్రధ్వనులు ప్రతిధ్వనించాయి. దేవవాద్యాలు మ్రోగసాగాయి. దేవతలు, గంధర్వులు గానం చేయసాగారు. ఇంకా అనేక దేవతాగణాలు, పిశాచ సమూహాలు నానాలంకార భూషితులై, సంతోషపరవశులై స్కందుని చుట్టూ నిలిచారు. అగ్నినందనుడైన కుమారస్వామి దేవతలచేత అభిషిక్తుడై వివిధక్రీడామగ్నుడై విలసిల్లాడు. పట్టాభిషిక్తుడైన మహాసేనుని దేవతలు అంధకారాన్ని ధ్వంసం చేస్తూ ఉదయించిన సూర్యునివలె చూశారు. ఆ తరువాత వేలసంఖ్యలో దేవతల సేనలు అన్నిదిక్కుల నుంచి వచ్చి 'మాకు నీవే సేనాపతివి!' అని చెప్పసాగాయి. సమస్త భూతగణాలు సేవిస్తున్న స్కందుడు దేవతలసైన్యాలు అన్నీ తనవద్దకు రాగా వాటికి ధైర్యం చెప్పాడు. వాటిపూజలను, ప్రశంసలను అందుకొన్నాడు.

ఇంద్రుడు స్కందుని సేనాపతిగా అభిషేకించిన తరువాత తాను కేశి అనే రాక్షసుని నుంచి విముక్తురాలిని చేసిన దేవసేనను తెచ్చుకొన్నాడు. 'బ్రహ్మదేవుడు కార్తికేయునే

ఈమెకు భర్తగా నిశ్చయించాడు. ఇది యథార్థం!' అని నిర్ణయించుకొని దేవసేనను నూతన వస్త్రాభరణాలతో అలంకరించి తీసికొని వచ్చాడు ఇంద్రుడు. "దేవశ్రేష్ఠా! నీవు పుట్టక ముందే బ్రహ్మదేవుడు ఈ కన్యను నీభార్యగా నిశ్చయించాడు. కాబట్టి నీవు వేద మంత్రాలను ఉచ్చరిస్తూ యథావిధిగా ఈమెను వివాహం చేసుకో. పద్మారుణకాంతితో విరాజిల్లే నీచేతితో ఈ దేవసేన దక్షిణహస్తాన్ని గ్రహించు' అని ఇంద్రుడు చెప్పగా ఆ కుమార స్వామి ఆమెను యథావిధిగా వివాహం చేసుకున్నాడు. ఆ సమయంలో మంత్రవేత్త అయిన బృహస్పతి వేదమంత్రాలను జపిస్తూ హోమంచేశాడు. ఇది జరిగిన తరువాత జనులందరూ దేవసేన కార్తికేయుని పట్టపురాణి అని తెలుసుకొన్నారు. ఆమెను బ్రాహ్మణులు షష్ఠి, లక్ష్మి, ఆశ, సుఖప్రద, సినీవాలి, కుహు, సద్వృత్తి, అపరాజిత అని చెపుతారు. దేవసేన స్కందుని తన సనాతనపతిగా స్వీకరించినపుడు శోభాస్వరూపిణి అయిన లక్ష్మీదేవి స్వయంగా ఆకారం ధరించి ఆమెను ఆశ్రయించింది. పంచమీ తిథినాడు కుమారస్వామి లక్ష్మీశోభాసేవితుడు అయినాడు. అందువల్ల ఆ తిథిని శ్రీపంచమి అన్నారు. షష్ఠీ తిథినాడు కృతకృత్యు డయినాడు. కాబట్టి షష్ఠిని మహాతిథి అన్నారు.

230. కృత్తికలకు నక్షత్ర మండలస్థానప్రాప్తి; కష్టప్రద గ్రహములు.

మహాసేనుడు శోభాసంపన్నుడై దేవసేనాపతి కావటం చూచి సప్తర్షులూ వారి ఆరుగురు పత్నులూ ఆయన వద్దకు వచ్చారు. పూర్వం మహర్షులు విడిచిపెట్టిన ఆ పతివ్రతలు దేవసేన భర్త యగు కుమారుని వద్దకు త్వరగా వచ్చి ఇలా అన్నారు. 'వత్సా! దైవసమానులయిన మా భర్తలు కుపితులై నిష్కారణంగా మమ్ము వదలివేశారు. అందుచే మేము ఉత్తమలోకాలకు దూర మైనాము. నీవు మా కడుపున పుట్టావని ఎవరో వారికి చెప్పారు. అది వాస్తవం కాదు. మేము చెప్పే నిజాన్ని విని, ఈ ఆపదనుంచి మమ్ములను కాపాడు. దేవా! నీదయవలన మాకు శాశ్వత స్వర్గప్రాప్తి కలుగుతుంది గదా! ఇంతేకాక మేము నిన్ను మాపుత్రుని చేసుకోవాలని కోరుకొంటున్నాము. ఇది చేసి నీవు ఋణవిముక్తుడివి కావలసినది.' కుమారస్వామి అన్నాడు. 'పరమపవిత్రలారా! మీరు నాతల్లులే. నేను మీ అందరి పుత్రుడను. ఇదే కాక ఇంకా మీకు ఏమైనా కోరిక ఉంటే దాన్నీ తీరుస్తాను.' అప్పుడు ఇంద్రుడు ఏదో చెప్పవలెనని అనుకొంటున్నట్లు తెలుసుకొని స్కందుడు ఏమిటో చెప్పమని అడగగా ఆయన ఇలా అన్నాడు- రోహిణి చెల్లెలు అభిజిద్దేవి అసూయతో తాను పెద్దతనం సంపాదించటానికి తపస్సు చేయాలని వనానికి వెళ్లింది. నీకు మేలు కలుగుతుంది. ఆకాశం నుంచి ఈ నక్షత్రం ఒకటి పతన మయింది. ఈ స్థానం ఎలా

పూర్తి అవుతుంది? ఈ ప్రశ్నతో ఏంచేయాలో నాకు తోచలేదు. కాబట్టి కుమారా! ఈ సమయంలో ఏం చేయాలో బ్రహ్మతో నీవే ఆలోచించు. అభిజిన్నక్షత్రం పడిపోవటం వలన బ్రహ్మ ధనిష్ఠానక్షత్రమే ఆదిగా (కృతయుగాది) కాలగణానాక్రమం నిశ్చయించాడు. (అదే సమయంలో యుగాది నక్షత్రం) దీనికి పూర్వం రోహిణినే యుగాదినక్షత్రంగా భావించేవారు. రోహిణి ప్రారంభకాలంలో చంద్రుడు, సూర్యుడు, గురుగ్రహాల యోగం ఉండేది. ఈరీతిగా నక్షత్రమాస దినసంఖ్య ఆరోజులలో సమంగా ఉండేది. ఇంద్రుడు ఆ విధంగా ప్రస్తావించగా ఆయన ఉద్దేశం తెలిసికొని ఆరుకృత్తికలు అభిజిత్తు నక్షత్రస్థానాన్ని పూర్తిచేయటానికి ఆకాశంలోకి వెళ్ళాయి. అగ్నిదేవతాకమయిన కృత్తికా నక్షత్రం ఏడు శిరస్సుల ఆకారంలో ప్రకాశిస్తున్నది. గరుడజాతిలోని దగు వినత స్కందునితో "వత్సా! నీవు నాకు పిండదాతవు (రక్షకుడవు) కావలసినది. ఎల్లప్పుడు నీతోపాటు ఉండాలని నాకోరిక' అన్నది. స్కందు డిలా అన్నాడు. 'అమ్మా! అలాగే. నీకు నమస్కారం. నీవు పుత్రప్రేమతో నాకు కర్తవ్యాన్ని ఉపదేశిస్తూ ఉండు. ఇక్కడ ఎల్లప్పుడు నీకోడలు దేవసేనచే పూజింపబడుతూ ఉండు.'

తరువాత మాతృగణం స్కందుని వద్దకు వచ్చి 'వత్సా! విద్వాంసులు మమ్ములను లోకమాతలు అని స్తుతించారు. ఇప్పుడు మేము నీకు మాతలుగా ఉండాలని అనుకొంటున్నాము. మమ్ము మాతృభావనతో పూజించు.' అన్నారు. స్కందు డిలా అన్నాడు. 'మీరు నాతల్లులు. నేను మీపుత్రుడను. మీకు కావలసినది నేను చేయవలసినది ఏమిటో చెప్పండి' మాతలు ఇలా అన్నారు - పూర్వం మాతృస్థానంలో ఉన్న (బ్రాహ్మి మహేశ్వరి మొదలైన) సుప్రసిద్ధ సప్తమాతల స్థానంలో మాఅధికారం ఇకముందు ఉండాలి. వారికి దానిమీద ఎలాంటి అధికారం ఉండరాదు. దేవశ్రేష్ఠా! జగత్తుకు అంతటికి మేము పూజనీయులం కావాలి. ఇక వారికి ఆ గౌరవం దక్కరాదు. వారు నీ కోసమని మామీద అసత్యమైన అపవాదును వేసి మా భర్తలకు కోపం కల్గించి మా సంతానసౌభాగ్యాన్ని లాగేశారు. కనుక నీవు ఆ సుఖాన్ని మాకు ప్రసాదించు.' స్కందుడు ఇలా అన్నాడు. 'మాతలారా! సంతానోత్పత్తి ఆవశ్యకత తీరిపోయిన ఆ భర్తలను మీరు ఇప్పుడు పొందలేరు. ఇంకొకరీతిగా సంతతి పొందాలనే కోరిక ఉంటే చెప్పండి. దాన్ని తీరుస్తా!' మాతలు అన్నారు - 'అలాగైతే మాకు ఆ లోకమాతల సంతానాన్ని ఇవ్వు. దాన్ని తింటాం. ఆ సంతాన సంరక్షకులలో నిన్ను తప్ప మిగిలినవారిని కూడా తినాలనుకొంటున్నాం.' స్కందుడు అన్నాడు - 'మీరు కష్టసాధ్య మైనది అడిగారు. అయినా మీకు పూర్వమాతల సంతానాన్ని అర్పిస్తాను. దాన్ని మీరు భక్షించకుండా రక్షిస్తే మీకు మేలు జరుగుతుంది. మీకు

భక్తితో నమస్కరిస్తున్నాను.' మాతలు ఇలా అన్నారు. 'స్కందా! నీకు మేలు కలుగుతుంది. నీ ఇష్టప్రకారం ప్రజారక్షణ చేస్తాం. ప్రభూ! సర్వకాలమూ నీతో కలిసి ఉండటం మాకు చాలా ఇష్టం.' స్కందుడు అన్నాడు - 'లోకంలో జనం పదహారు సంవత్సరాల యువకులు అయ్యేదాకా మానవులను భిన్నభిన్న రూపాలను ధరించి బాధించండి. నేను మీకు భయంకరమై, వినాశరహితమై నన్ను పోలిన రూపంగల పురుషుని ప్రసాదిస్తాను. ఆతనితో కలిసి పూజ లందుకొని మీరు చిరకాలం సుఖపడండి.

తరువాత కుమారస్వామి శరీరంనుంచి అగ్నితో సమానమైన తేజస్సు, కాంతి కల, పురుషుడు అవతరించాడు. అతడు సమస్త మానవసంతతిని తినవలె ననే కోరిక గలవాడు. అతడు పుట్టిన వెంటనే ఆకలితో బాధపడుతూ, మూర్ఛతో నేలమీద పడ్డాడు. స్కందుని ఆజ్ఞానుసారం ఆతడు భయంకరరూపం గల గ్రహం అయినాడు. బ్రాహ్మణశ్రేష్ఠులు ఆయనను స్కందాపస్మారగ్రహం అంటారు. వినతను మహాభయంకరమైన శకుని గ్రహం అంటారు. పూతనను రాక్షసి అంటారు. దాన్ని పూతనాగ్రహం అని తెలుసుకోవాలి. భయంకర రూపాన్ని ధరించే ఆ నిశాచరి చాల క్రూరత్వంతో బాలకులను బాధిస్తుంటుంది. ఈమెయే కాక భయంకరమైన ఆకారంగల ఒకపిశాచి ఉన్నది. దానిని శీత పూతనాగ్రహం అంటారు. అది చూడటానికి చాలా భయంకరంగా ఉంటుంది. అది మానవస్త్రీల గర్భాలను పోగొడుతుంది. అదితీదేవిని లోకంలో రేవతి అంటారు. ఆ రేవతి గ్రహంపేరు రైవతం. భయంకరమైన ఆ మహాగ్రహం కూడా బాలకులను బాధిస్తుంది. దైత్యుల తల్లి అయిన దితిని 'ముఖమండిక' అంటారు. దానికి చిన్నపిల్లల మాంసం అంటే చాలా ఇష్టం. ఆ గ్రహాన్ని జయించటం మిక్కిలి కష్టం. కురువంశీయా! ధర్మజా! స్కందుని శరీరంనుంచి జనించిన కుమార కుమారీగ్రహాలు అన్నీ తల్లికడుపులో ఉన్న పిల్లలను భక్షించే మహాగ్రహాలు. ఈ కుమారీ గ్రహాలకు కుమారగ్రహాలు భర్తలు అని చెపుతారు. భయంకర కార్యాలు చేసే ఈ గ్రహాలు అన్నీ పుట్టకముందే పిల్లలను పట్టుకొంటాయి. రాజా! గోవులకు తల్లి అయిన సురభిని ఎక్కి పక్షి గ్రహం అయిన వినత ఇతరగ్రహాలతోపాటు భూమండలంలో పిల్లలను తింటుంది. రాజేంద్రా! కుక్కలకు తల్లి అయిన సరమ దేవజాతీయురాలు. ఆమెకూడా ఎల్లప్పుడు మానవస్త్రీల గర్భాలలో ఉండే బాలకులను అపహరిస్తుంది. వృక్షాలతల్లి కానుగు చెట్టుమీద ఉంటుంది. ఆమె వరాలు ఇచ్చే దేవి. సౌమ్యురాలు. సమస్తప్రాణులపైనా దయ చూపుతుంది.

ఇందువల్ల కొడుకులు కావాలి అని కోరేవారు కానుగు చెట్టుమీద ఉండే ఆమెను పూజిస్తారు. వీరు, ఇంకా పదునెమిదిగ్రహాలకు మద్యం, మాంసం అంటే చాలా ఇష్టం.

ఇవి పదిరోజులు పురిటింటిలో మకాం వేస్తాయి. తరువాత కద్రువ సూక్ష్మరూపం ధరించి గర్భిణీ స్త్రీల గర్భంలో ప్రవేశిస్తుంది. అక్కడి శిశువును తినేస్తుంది. ఆ స్త్రీ సర్పాన్ని ప్రసవిస్తుంది. గంధర్వుల మాత అయిన గ్రహం గర్భవతుల గర్భాన్ని అపహరిస్తుంది. అందువల్ల ఆ మానవస్త్రీ గర్భం అక్కడే లీనమైనట్లు కన్పిస్తుంది. అప్సరసల తల్లి అయిన గ్రహం గూడా గర్భాన్ని పట్టుకొంటుంది. అందువల్ల మేధావు లయిన మానవులు 'ఫలానా స్త్రీ కడుపు పోయింది' అని అంటారు. అరుణ సముద్రకన్యక పేరు లోహితాయని. ఆమెను కుమారస్వామి తల్లి అని చెపుతారు. ఆమెను కడిమిచెట్టులో పూజిస్తారు. పురుషులలో రుద్రునివలె స్త్రీలలో ఆర్యాదేవి శ్రేష్ఠురాలు. ఆమె కార్తికేయుని తల్లి. జనులు తమకోరికలు తీరటానికి పైన చెప్పిన గ్రహాలకంటే విడిగా ఆమెను పూజిస్తారు. ఈ రీతిగా కుమారుని మహాగ్రహాలను గురించి చెప్పాను. పదహారేండ్లు నిండని పిల్లలకు ఈ గ్రహాలు కీడు కలిగిస్తాయి. ఇంతవరకు చెప్పిన మాతృగణ, పురుషగ్రహాలు అన్నీ స్కంద గ్రహాలు అని అందరూ తెలుసుకోవాలి. కుమారస్వామికి స్నానం, ధూపం, గంధాదుల పూత, పుష్పాదిపూజ, కానుకలు అర్పించి స్కందగ్రహశాంతి చేయాలి. రాజేంద్రా! ఈ విధంగా పూజించి, యథావిధిగా పూజాస్తుత్యాదులతో నమస్కరిస్తే ఈ గ్రహాలు అన్నీ మేలు చేస్తాయి. పూజించే వారికి ఆయువును, బలాన్ని కలిగిస్తాయి.

పదునారేండ్ల తరువాత మానవులకు అనిష్టాలను కలిగించే గ్రహాలను గురించి – ముందుగా పరమేశ్వరునకు నమస్కరించి – చెపుతాను. మనుష్యుడు మేలుకొన్నప్పుడుగాని, నిద్రిస్తున్నప్పుడుగాని దేవతలను చూస్తే వెంటనే పిచ్చివాడు అవుతాడు. ఆ అనిష్టాన్ని కలిగించే గ్రహాన్ని దేవగ్రహం అంటారు. కూర్చుని ఉన్నప్పుడు గాని, పడుకొన్నప్పుడుగాని పితృదేవతలను చూస్తే వెంటనే పిచ్చివాడు అయితే ఆ బాధ కలిగించే గ్రహాన్ని పితృగ్రహం అని తెలుసుకోవాలి. సిద్ధపురుషులను అవమానిస్తే వారు కోపించి శపిస్తారు. ఆ శాపం కారణంగా పిచ్చివాడయితే అది సిద్ధగ్రహ ప్రభావంగా గ్రహించాలి. అనేకవిధాలైన సుగంధద్రవ్యాలను వాసనచూసి, వాటిరసాలను ఆస్వాదించినంతనే ఒకవ్యక్తి ఉన్మత్తుడు అయితే అతనిమీద ఆ ప్రభావం చూపిన గ్రహాన్ని రాక్షసగ్రహం అని తెలుసుకోవాలి. ఈ భూలోకంలో దేవజాతీయులైన గంధర్వులు ఆవేశించటంవల్ల ఒకవ్యక్తి ఉన్మత్తుడు అయితే అందుకు కారణమైన గ్రహంవల్ల కలిగే బాధను గాంధర్వగ్రహ బాధగా తెలిసికోవాలి. పిశాచ గ్రహావేశం నిత్యమూ జరగటంవల్ల ఒకవ్యక్తి పిచ్చివాడైతే ఆ బాధను పైశాచగ్రహబాధ అంటారు. కాలక్రమాన యక్షావేశం జరగటం వల్ల ఒకవ్యక్తి పిచ్చివాడు అయితే దానిని యక్ష గ్రహబాధగా భావించాలి. ఒకవ్యక్తి మనస్సు వాత పిత్త కఫా లనే మూడుదోషాలవల్ల

ప్రకోపిస్తే త్వరగా మతితప్పి పిచ్చివాడు అవుతాడు. వానికి వైద్యశాస్త్ర ప్రకారం చికిత్స చేయాలి. గాబరావల్ల గాని, భయంవల్ల గాని, ఘోరమైన వాటిని చూడటంవల్ల గాని వెంటనే పిచ్చివాడయ్యే వ్యక్తికి ధైర్యం చెప్పటమే తగిన చికిత్స అవుతుంది. ఒక విధమైన గ్రహానికి ఆడుకోవాలి అని, ఇంకొక గ్రహానికి తినాలి అని, మరొకగ్రహానికి సంయోగం పొందాలి అని కోరిక ఉంటుంది. ఈరీతిగా గ్రహాలప్రకృతి మూడురకాలు. డెబ్బది సంవత్సరాలు నిండేదాకా ఈ గ్రహాలు మానవులను బాధిస్తాయి. ఆ తరువాత అందరు శరీరధారులను గ్రహాలతో సమానంగా జ్వరం బాధిస్తుంది. ఇంద్రియోద్వేగం లేనివానిని, జితేంద్రియుని, పవిత్రుని, పరాకులేనివానిని, ఆస్తికుని, శ్రద్ధగలవానిని ఏ గ్రహమూ సమీపించదు. గ్రహాలన్నీ దూరంగా నిలుస్తాయి. రాజా! ఈరీతిగా నేను మానవులకు కలిగే గ్రహబాధను సంక్షేపంగా, వివరంగా చెప్పాను. పరమేశ్వరునీ ఆయన భక్తులను ఈ గ్రహాలు తాకలేవు.

231. స్కందుడు స్వాహాదేవిని గౌరవించుట, శివదేవగణసహిత స్కందుని భద్రవటగమనము.

మార్కండేయ ముని ఇలా అన్నాడు – యుధిష్ఠిరా! స్కందుడు ఇలా మాతృగణాల కోరిక తీర్చిన తరువాత స్వాహాదేవి వచ్చి ఇలా అంది. "నీవు నాకు పుట్టిన కుమారుడవు. అందువల్ల నీవు నాకు పరమదుర్లభమైన సంతృప్తిని సమకూర్చాలి." 'అమ్మా! నీకున్న కోరిక ఏమి?' అని స్కందుడు ప్రశ్నించాడు. స్వాహాదేవి అన్నది – 'మహాభుజా! దక్షప్రజాపతికి మిక్కిలి ఇష్టురాలైన పుత్రికను నేను. నాపేరు స్వాహా. చిన్ననాటి నుంచి నాకు అగ్ని దేవునియందు కోరిక ఉంది. వత్సా! నాకు తనమీద ప్రేమ ఉన్నదని ఆయన బాగా ఎరుగడు. ఆయనతో శాశ్వతంగా కలిసి ఉండాలని నాకోరిక.' స్కందు డన్నాడు – 'దేవీ! ఇవ్వాళనుంచి మంచిమార్గాన నడిచేవారు, సదాచారులు, ధర్మాత్ములు అయిన మనుజులు దేవతలకు, పితృదేవతలకు హవ్యకవ్యరూపంగా బ్రాహ్మణుల వేదమంత్రోచ్చారణతో అగ్నిలో వేసే ఆహుతులను స్వాహాకారంతో అర్పిస్తారు. కాంతిమూర్తీ! ఇందువలన అగ్నిదేవుడు నిరంతరమూ నీతో కూడి ఉంటాడు.' మార్కండేయు డన్నాడు – ఇలా స్కందుడు స్వాహాదేవికి చెప్పి పూజించాడు. తరువాత అగ్నిదేవునితో కలిసి స్వాహాదేవి స్కందుని ఆదరించింది. అపుడు ప్రజాపతి అయినబ్రహ్మ మహాసేనునితో ఇలా అన్నాడు – త్రిపురాలను ధ్వంసంచేసిన నీతండ్రి పరమేశ్వరుని దర్శించు. రుద్రదేవుడు అగ్నిలో, పార్వతీ దేవి స్వాహాదేవిలో ప్రవేశించి లోకాలు అన్నింటికీ మేలుచేయాలని పరాజయం ఎరుగని మహావీరుడవైన నిన్ను కన్నారు. పరమేశ్వరుడు ఉమాదేవి గర్భంలో నిక్షేపించిన వీర్యంతో

కొంతభాగం ఈ పర్వతం మీద పడినది. మింజికామింజికలు అనే జంట జన్మించారు. మిగిలిన వీర్యంలోని ఒక చిన్నభాగం రక్తసాగరంలోను, ఇంకాకొంత సూర్యకిరణాలలోను, ఇంకా కొంత భూమిమీద, మరికొంత అంశ చెట్లమీద పడింది. ఈ రీతిగా ఆయన తేజస్సు ఐదుభాగాలుగా విడిపోయి పడిపోయింది. దానివలననే విభిన్నాకారాలు గల మాంసభక్షకులు ఆయన అనుచరులు అయ్యారు. వారిని విధ్వంసులే తెలుసుకోగలరు. అపరిమితమైన ఆత్మబలం గల్గి, పితృభక్తుడు అయిన స్కందుడు 'అలాగే జరగనీ' అని తన తండ్రి అయిన పరమశివుని పూజించాడు

మార్కండేయముని అన్నాడు – రాజా! ధనం కావాలి అనుకొనే వ్యక్తి జిల్లేడుపూలతో ఆ అయిదుగణాలను పూజించాలి. రోగాలు తగ్గటానికి గూడా ఆ గణాల పూజ చేయాలి. పరమశివుని వలన జన్మించిన మింజికామింజిక లనేజంటకు తమ పిల్లల మేలు కోరేవారు ఎల్లప్పుడూ నమస్కరించాలి. వృక్షాల మీదనుంచి పడిన శుక్రం వలన వృద్ధిక అనేపేరు గల స్త్రీలు జన్మించారు. వీరు మానవమాంసాన్ని తినేవారు. సంతానం కావాలి అని కోరుకొనేవారు ఈ దేవతలముందు తలవంచి నమస్కరించాలి. ఈరీతిగా లెక్కలేనన్ని పిశాచగణాలను చెప్పినారు. 'రాజా! ఇప్పుడు నీకు కుమారుని గంట,జెండా పుట్టిన వృత్తాంతం చెపుతాను. విను. ఇంద్రుని ఐరావతం అనే ఏనుగుకు అమర్చే 'వైజయంతి' అనే పేరుగల రెండుగంటలు ఉండేవి. వానిని మేధావి అయిన ఇంద్రుడు తెచ్చి కుమారస్వామికి అర్పించాడు. ఆ గంటలు రెండింటిలో ఒకదానిని విశాఖుడు' ఇంకొకదానిని స్కందుడు తీసికొన్నారు. కార్తికేయుడు, విశాఖుడు అని వారిఇద్దరి పతాకలు అరుణవర్ణం గలవి. మహాబలుడైన మహాసేనుడు దేవతలు ఇచ్చిన బొమ్మలతోనే ఆడుకొనేవాడు. మహత్తరతేజఃపుంజంతో వెలుగొందే తేజస్వియైన కార్తికేయుడు ఆ సమయంలో బంగారు కొండమీద పిశాచాలు, దేవసమూహాలు చుట్టూ ఉండగా విరాజిల్లాడు. కిరణసమూహంతో విరాజిల్లే సూర్యోదయంవలన సుందరమైన గుహలుగల మేరుపర్వతం ప్రకాశించినట్లు, మహావీరుడైన కుమారస్వామి నివసించటం వలన సుందరమైన వనమున్న ఆ శ్వేతపర్వతం వెలుగొందినది. చక్కగా వికసించిన కల్పవృక్షవనాలతో, గన్నేరు వనాలతో, పారిజాతవనాలతో, దాసాని వనాలతో, అశోకవనాలతో కదంబ వృక్షసమూహాలతో, దివ్య మృగాలతో, దివ్య పక్షిసమూహాలతో ఆ శ్వేతపర్వతం శోభిల్లింది. అక్కడికి సమస్తదేవగణాలు, దేవర్షుల సమూహాలు వచ్చి నివసించేవి. సముత్తుంగ తరంగాలతో పెద్దగా ధ్వనించే సముద్రఘోషవలె నున్న మేఘాల దివ్య వాద్యాలధ్వనులు అన్నివైపులనుంచి వినిపిస్తున్నవి. అక్కడ దేవజాతీయ గంధర్వులు, అప్సరసలు నృత్యం చేస్తున్నారు. సంతోషపూర్ణులైన సమస్తప్రాణుల కోలాహలం వినిపిస్తున్నది. ఈ

రీతిగా ఇంద్రునితో కూడ జగత్తు అంతా శ్వేతపర్వతం మీద స్కందుని దర్శింపసాగింది. ఆయనను ఎంతసేపు దర్శించినా ఆప్రాణులకు తృప్తి కలగటం లేదు.

కార్తికేయుడు దేవసేనాపతిగా పట్టాభిషిక్తు డయినప్పుడు పరమశివుడు పార్వతీదేవితో గూడి, సూర్యసమానమైన రథాన్ని ఎక్కి, ప్రసన్నుడై, భద్రవటంవైపు వచ్చాడు. అప్పుడు ఇంద్రాది దేవతలు ఆయన వెనక వచ్చారు. శివుడు అధిరోహించిన ఆ రథానికి వేయిసింహాలను కట్టారు. సాక్షాత్తుగా కాలుడు నడుపుతున్న ఆ రథం ఆకాశంలో పరుగులు తీస్తున్నది. దానికి సింహాలను కట్టారు. అందమైన జూలుతో శోభిల్లే ఆ సింహాలు చరాచరప్రాణులను భయపెడుతూ, ఆకాశాన్నే మ్రింగుతున్నట్లు గర్జన చేస్తూ, పోతున్నవి. ఇంద్రధనుస్సుతో గూడిన మేఘసమూహాలలోని మెరుపు తీగతో ఉన్న సూర్యునివలె ఆ రథంలో పార్వతీదేవితో గూడిన శివుడు ప్రకాశించాడు. ఆయన రథానికి ముందు నరవాహనుడైన కుబేరుడు యక్షులతో కూడ అందమైన పుష్పకవిమానాన్ని అధిరోహించి వెళ్ళుతున్నాడు. వృషభధ్వజుడైన పరమేశ్వరుని రథానికి వెనుకగా ఇంద్రుడు ఐరావతాన్ని ఎక్కి, దేవతలతో గూడ వెళ్ళుతున్నాడు. పూలమాలలను ధరించిన జృంభకగణం, యక్షులు, రాక్షసులతో వెలుగొందే మహాయక్షుడు అమోఘుడై దక్షిణంవైపున వెళ్ళుతున్నాడు.

ఆయనకు కుడివైపున విచిత్రమైన యుద్ధం చేసే అనేకదేవతలు, వసువులు, రుద్రులతో కలసి వెళ్ళుతున్నారు. మృత్యుదేవతతో గూడిన యముడు మహాభయంకరాకారాన్ని ధరించి, దేవతలతో కూడా వెళ్ళుతున్నాడు. ఆయనకు నాలుగువైపులా భయంకరమైన రోగాలు ఆకారం దాల్చి వెళ్ళుతున్నవి. యమునికి వెనుక విజయమనే పేరుగల శంకరుని త్రిశూలం మూడుకొనలు గలిగి తీక్షణమై భయంకరంగా ఉంది. ఆ త్రిశూలాన్ని సింధూరం మున్నగువాటితో అలంకరించారు. జలాధిపతి యైన వరుణుడు భయంకరశూలాన్ని ధరించి, ఆ త్రిశూలానికి ప్రదక్షిణంగా వెళ్తున్నాడు. ఆయన చుట్టూ అన్నిరకాల జలజంతువులూ ఉన్నాయి. ఆ విజయం అనే ఆయుధం వెంట శివుని ఇంకొక ఆయుధం పట్టిశం(అడ్డంకత్తి) వెళ్ళుతున్నది. దానికి గద, ముసలం(రోకలి), శక్తి మున్నగు ఉత్తమాయుధాలు చుట్టూ ఉన్నవి. రాజా! పట్టిశం వెనకాల కాంతిమంతమైన పరమశివదేవుని వెల్లగొడుగు వెళ్ళుతున్నది. దాని వెనుక మహర్షుల సమూహంతో సేవితమైన కమండలం వెళ్ళుతున్నది. కమండలానికి కుడిప్రక్కన వెళుతున్న తేజోవంతమైన దండం చక్కని కాంతితో ప్రకాశిస్తున్నది. దానితోపాటు భృగువు, అంగిరసుడు మున్నగు మహర్షులు ఉన్నారు. దేవతలు దాన్ని పూజిస్తున్నారు. వీటికి అన్నింటికి వెనక ప్రకాశవంతమైన రథాన్ని ఎక్కి, రుద్రదేవుడు వెళ్ళుతున్నాడు. ఆయన తేజస్సు వల్ల అందరి దేవతల సంతోషం అధికమవుతున్నది. ఋషులు, దేవతలు,

గంధర్వులు, నాగులు నదులు, లోతైన సరస్సులు, సముద్రాలు, అప్సరసలు, నక్షత్రాలు, గ్రహాలు, దేవపుత్రులు వెళ్ళుతున్నారు.

మనోహరసౌందర్యం కలిగి నానావిధాలైన ఆకారాలు ధరించిన అందమైన స్త్రీలు పూలవర్షం కురిపిస్తూ పరమేశ్వరుని వెనక వెళ్ళుతున్నారు. పినాకధన్వి యగు శంకరునికి నమస్కరించి, పర్జన్యదేవుడూ వెంటవచ్చాడు. చంద్రుడు ఆ దేవునికి గొడుగు పట్టాడు. అగ్నిదేవ వాయుదేవులు వింజామరలను గైకొని రెండు ప్రక్కల ఉండి వీస్తున్నారు. తేజస్వియగు ఇంద్రుడు రాజర్షులతో గూడి పరమాత్మ అయిన శివుని స్తుతిస్తూ వెనుక వచ్చాడు. గౌరి, విద్య, గాంధారి, కేశిని, మిత్ర, సావిత్రి అనేవారూ పార్వతీదేవి వెనుక వైపున నడచారు. విద్వాంసులు స్మరించిన విద్యాసమూహాలు కూడా వారితోపాటు ఉన్నారు. ఇంద్రాదిదేవతలు సేనకుముందున్న పరమేశ్వరుని ఆజ్ఞలను నిర్వర్తిస్తున్నారు. నవగ్రహాలలో నొకడగు నిర్ఋతి పతాకను పట్టుకొని ముందు వెళ్ళుతున్నాడు. పరమేశ్వరుని మిత్రుడు, శ్మశానంలో ఆయనకు రక్షకుడూ అయిన పింగళుడు అనే యక్షరాజు జగత్తుకు ఆనందం కలిగిస్తూ ఆ యుద్ధయాత్రలో శివునితోపాటు ఉన్నాడు. వీరందరితో శివుడు సుఖంగా భద్రవటానికి వెళ్ళుతున్నాడు. ఆయన ఒకసారి సేనకు ముందుగాను, ఇంకొకప్పుడు సేనకు వెనుకగాను నిశ్చితగతిలేకుండా వెళ్ళుతున్నాడు. మరణధర్మం గల మానవులు ఈలోకంలో మంచిపనులు చేస్తూ పరమేశ్వరారాధనలు చేస్తూంటారు. ఈయనను శివుడు, ఈశానుడు, రుద్రుడు, పితామహుడు అని వ్యవహరిస్తారు. జనులు నానావిధాలుగా ఈయనను పూజిస్తారు. ఈ రీతిగా బ్రాహ్మణుల మేలుకోరేవాడు, దేవసేనాపతి, కృత్తికాపుత్రుడైన కుమారస్వామి కూడా దేవసైన్యం చుట్టూ ఉన్న శివునికి వెనక వెళ్ళుతున్నాడు.

ఆ తరువాత మహాదేవుడు 'వత్సా! నీవు చాలా మెలకువతో మరుత్ స్కంధాలనే దేవతలలో ఏడవవ్యూహాన్ని రక్షిస్తూ ఉండు.' అని కుమారస్వామితో అన్నాడు. స్కందుడిలా అన్నాడు. 'దేవా! నేను సప్తమస్కంధాన్ని తప్పక రక్షిస్తాను. ఈపనేకాక ఇంకేదయినా కర్తవ్యం ఉంటే ఆలస్యం లేకుండా చెప్పవలసింది.' రుద్రుడు అన్నాడు - 'కుమారా! పనివచ్చినప్పుడు నీవు నన్ను తప్పక కలవాలి. నాదర్శనం వల్లా, నాభక్తివల్లా నీకు మంచి జరుగుతుంది.' ఇలా అని, పరమశివుడు కార్తికేయుని గాఢంగా కౌగలించుకొని, పంపించాడు. కుమారుడు వెళ్ళినవెంటనే గొప్ప అపశకునాలు కనిపించసాగాయి. వెంటనే సమస్తదేవతలను కలవరపరుస్తూ నక్షత్రాలతో గూడా ఆకాశం మండసాగింది. లోకం అంతా పరవశం అయిపోయింది. భూమి కంపింపసాగింది. జగత్తు అంతా చీకటిలో మునిగింది. భూమిలోనుండి ధ్వనులు రాసాగాయి. అప్పుడు ఆ తీవ్రమయిన ఉత్పాతాలను చూసి శంకరుడు, పార్వతి,

దేవతలు, మహర్షులు క్షోభిల్లారు.

వారంతా మోహపరవశు లయ్యారు. అపుడే పర్వతాల్లా, మేఘసమూహంలా విశాలంగా భయంకరంగా ఉన్న దానవసైన్యం కనిపించింది. అది అస్త్రశస్త్రాలతో కూడి ఉంది. ఆ సైన్యసంఖ్య లెక్కింప వీలుగాకుండా ఉన్నది. ఆ సేన నానావిధాలుగా మాట్లాడుతూ తీవ్రగర్జనలు చేస్తున్నది. ఆ దైత్యసైన్యం యుద్ధరంగంలో దేవతల మీదా, శివునిమీద దండయాత్రకై హెచ్చరికలు చేసింది. రాక్షసులు దేవతాసైన్యం మీద చాలాసార్లు బాణవర్షం కురిపించారు. రాళ్ళు, ఫిరంగులు, ప్రాసాలు, ఖడ్గాలు, పరిఘలు, గదలతో యుద్ధం జరుగుతున్నది. ఈ భయంకరమైన మహాస్త్రాల దెబ్బలతో దైవసైన్యం అంతా ఒక్కక్షణంలో వెన్నుచూపి పారిపోయింది. సైన్యం అంతా యుద్ధానికి పెడముఖం అయినట్లు కనిపించింది. అనేకయోధులు, ఏనుగులు, గుఱ్ఱాలు ముక్కలు ముక్కలు అయ్యాయి. లెక్కలేనన్ని ఆయుధాలు, పెద్దపెద్ద రథాలు ముక్క లయినాయి. ఇలాగా రాక్షసుల బాధ తట్టుకోలేక దేవతలసేన యుద్ధంలో వెనుదిరిగింది. రాక్షసుల ధాటికి తట్టుకోలేక అగ్నిజ్వాలలకు ఆహుతియైన దేవసైన్యం విరిగిపోయి నాశనమైన మహావృక్షాలు గల వనంలాగా అయింది. శిరస్సులు, శరీరాలు పగిలిపోయి చీలిపోగా పారిపోతున్న దేవతలు మహాయుద్ధంలో రాక్షసులు గాయపరుస్తూండగా దిక్కులేనివా రయ్యారు.

తరువాత తనసైన్యం రాక్షసబాధతో పారిపోతుండగా చూచి ధైర్యం కలగటానికి ఇంద్రుడు ఇలా అన్నాడు - 'మహావీరులారా! భయం వదిలేయండి. అందువల్ల మీకు మేలు కలుగుతుంది. ఆయుధాలను మళ్ళీ తీసుకోండి. పరాక్రమించండి. మీరు ఏ మాత్రం బాధపడకూడదు. భయంకరంగా కన్పించే ఈ దానవసైన్యాన్ని మట్టుపెట్టండి. మీరంతా నాతోకూడా మహాశరీరులైన రాక్షసులమీదికి దూకండి.' ఇంద్రుడి మాటలు విన్న దేవసైన్యానికి కొంత ఊరట కలిగింది. ఇంద్రుని తమకు ఆశ్రయంగా తలంచి దైవసైన్యం దానవసైన్యంతో మళ్ళీ యుద్ధం ప్రారంభించింది. తరువాత దేవతలు, మహాబలులైన మరుద్గణాలు సాధ్యగణాలతో కలిసి యుద్ధరంగంలో ముందుకు దూకాయి. వారు యుద్ధభూమిలో కుపితులై దానవులమీద శస్త్రాలను బాణాలను కురిపించారు. అవి దానవుల శరీరాల్లో దూరి రక్తపానం చేయసాగాయి. వృక్షాలను పాములు చుట్టివేస్తున్నట్లు ఆ తీవ్రబాణాలు రాక్షస సైన్యశరీరాలను చీల్చివేస్తూ కన్పించాయి. దేవతల బాణాలతో చీలిపోయిన రాక్షసశరీరాలు అన్నివిధాల చిన్నభిన్నాలైన మేఘాలవలె నేలగూలాయి. తరువాత దేవతలు అందరూ కలిసి ఆ యుద్ధంలో దానవసైన్యాన్ని బాణాలదెబ్బలకు భయపడి, పారిపోయేటట్లు చేశారు. ఆ సమయంలో దేవతలు అస్త్రశస్త్రాలను పైకెత్తి పట్టుకొని,

సంతోషంతో సింహనాదాలు చేయసాగారు. దేవతల విజయమంగళవాద్యాలు ఎన్నో మ్రోగసాగాయి. ఇలా దేవదానవయుద్ధం భయంకరంగా సాగింది. రక్తమాంసాలతో అక్కడిభూమి బురద-బురదగా మారింది. మళ్ళీ దృశ్యం మారింది. దేవతల పరాజయం మొదలయింది. భయంకరదానవులు దేవతలను హింసించసాగారు. దానవుల భయంకర సింహనాదాలు వినపడసాగాయి. వారి యుద్ధవాద్యాల ఘోష అన్నిదిక్కుల మార్మ్రోగింది. మహిషుడు అనే మహాబలవంతుడైన దానవుడు పెద్దబండను తీసికొని ఘోరమైన రాక్షససైన్యం నుంచి ముందుకు దూకాడు. మేఘాలు చుట్టూ ఉన్న సూర్యునిలాగా పర్వతశిఖరాలను ఎత్తి ఉన్న రాక్షసుని చూసి దేవతలు పారిపోసాగారు. అయినా మహిషుడు దేవతలను వెంబడిస్తూ వారిమీద మహాశిలాఖండాన్ని విసిరివేశాడు. ఆ భయంకర శిల పడేసరికి దేవసైన్యంలోని పదివేలమంది వీరులు నుజ్జునుజ్జు అయి నేలమీద పడిపోయారు. సింహం క్షుద్రమృగాలకు భీతి కలిగిస్తూ, వాటిమీద పడినట్టు మహిషాసురుడు తనదానవ సైన్యంతో వారిమీదికి దూకాడు. ఆ మహిషాసురుడు తమమీదికి వస్తూఉండటం చూసి ఇంద్రాది దేవతలందరూ భయపడి తమ వద్ద ఉన్న శస్త్రాస్త్రధ్వజాదులను క్రిందపడవేసి యుద్ధభూమి నుండి పారిపోసాగారు. కోపపరవశుడైన మహిషుడు వేగంగా రుద్రదేవుని రథంవైపు వెళ్ళాడు. రథంనొగను గట్టిగా పట్టుకొన్నాడు. కోపంతో మహిషారుడు రథాన్ని సమీపించగానే భూమిమీద, ఆకాశంలోనూ అధికంగా కోలాహలం వ్యాపించింది. మహర్షులు కూడా కలతచెందారు. ఇటువైపు మహాశరీరులైన దైత్యులు మేఘాలలాగా గంభీరంగా గర్జించారు. "మనం తప్పక గెలుస్తాం' అని వారికి గట్టి నమ్మకం కలిగింది.

ఆ పరిస్థితిలో గూడా పరమశివుడు ఆ మహిషాసురుని సంహరింపలేదు. ఆ దుర్మార్గునికి కుమారస్వామి చేతిలో మరణం ఉందని తెలుసు కాబట్టి కుమారుని స్మరించాడు. భయంకరుడైన మహిషాసురుడు రుద్రుని రథాన్ని చూసి, దేవతలకు భయాన్ని, దానవులకు సంతోషాన్ని కలిగిస్తూ పలుమారులు సింహనాదం చేశాడు. దేవతలకు ఈ రీతిగా భయంకరపరిస్థితి కలుగగానే మహాసేనుడు కోపంతో సూర్యునిలాగా వెలుగొందుతూ అక్కడికి వచ్చాడు. ఆయన రక్తవస్త్రధరుడు, ఎఱ్ఱని పూలమాలలు, ఆభరణాలు ధరించినవాడు, అరుణాశ్వాలు కట్టిన రథంమీద బంగారు కవచం దాల్చి అక్కడికి వచ్చాడు. సూర్యుని వలె బంగారు రంగుతో వెలిగిపోతున్న రథంమీద ఉన్న ఆయనను చూసి, ఆ రాక్షససైన్యం రణరంగం నుంచి త్వరగా పారిపోసాగింది. రాజేంద్రా! మహాబలిష్ఠుడైన కుమారస్వామి మహిషాసురునిమీద వెలిగిపోతున్న శక్తిఆయుధాన్ని ప్రయోగించాడు. అది ఆతని శరీరాన్ని చీల్చేటట్లుంది. కుమారస్వామి చేతిలోనుంచి వెళ్ళిన ఆ శక్తి మహిషాసురుని శిరస్సును

ఖండించింది. శిరస్సు తెగిపోగా మహిషాసురుడు నేలగూలాడు. పర్వతంలాగా చాలా పెద్దదైన అతని శరీరం ఈశాన్యదిక్కుగా పడేసరికి పదహారు యోజనాల పొడవు గల ద్వారం మూసుకుపోయింది. అందుచేత ఆ దేశం మామూలుగా వెళ్ళటానికి వీలుకాకపోయింది. ఉత్తరకురుదేశంలో నివసించేవారు ఇప్పుడు ఆ మార్గంలో సుఖంగా వెళ్ళుతున్నారు. దేవదానవులను చూచిన కుమారస్వామి పలుమారులు శత్రువులమీద శక్త్యాయుధాన్ని ప్రయోగింపసాగాడు. అది వేలకొలది శత్రువులను సంహరించి తిరిగి, స్కందుని చేతికి వచ్చేది. మహామేధావి ఐన మహాసేనుడు బాణాలతో దానవసైన్యంలో ఎక్కువ భాగాన్ని హతమార్చాడు. మిగిలిన రాక్షసులు భయగ్రస్తులై ధైర్యం కోల్పోయారు. స్కందుని అనుచరగణం ఆ వేలకొలది రాక్షసులను చంపి తినివేసింది. స్కందగణాలు అన్నీ అధిక సంతోషంతో దానవులను తింటూ, వారి రక్తాన్ని త్రాగుతూ ఒక్కక్షణంలో యుద్ధరంగం అంతా రాక్షసరహితం చేశాయి.

సూర్యుడు చీకటిని పోగొట్టినట్లు, అగ్ని చెట్లను కాల్చినట్లు, ఆకాశంలో తిరిగే గాలి మేఘాలను ఛిన్నభిన్నం చేసినట్లు కీర్తిశాలి అయిన కార్తికేయుడు పరాక్రమంతో రాక్షసనాశం చేసి విజయం పొందాడు. అప్పుడు కుమారస్వామిని దేవతలు స్తుతించారు. ఆయన తండ్రి పరమేశ్వరునికి నమస్కరించాడు. కిరణాలను అంతటా ప్రసరింపజేసే సూర్యునివలె విరాజిల్లాడు. శత్రునాశం చేసి, స్కందుడు పరమేశ్వరుని దగ్గరకు వచ్చినప్పుడు ఇంద్రుడు ఆయనను కౌగిలించుకొని ఇలా అన్నాడు. 'విజయం సాధించే వీరులలో శ్రేష్ఠుడా! కుమారా! ఈ మహిషాసురునికి బ్రహ్మదేవుడు వరం ఇవ్వటంవలన ఈతని ముందు దేవతలు గడ్డిపోచలతో సమానమయినారు. అలాంటివానిని నీవు ఈనాడు సంహరించావు. వీరా! ఇతడు దేవతలకు నీచశత్రువు. అలాంటివాడిని నీవు చంపావు. ఈవేళ రణరంగంలో ఈ మహిషాసురునితో సమానమైన పరాక్రమంగల దేవశత్రువులు అయిన నూర్గురు దైత్యులను నేలగూల్చావు. వారు అందరూ మాకు పూర్వం చాలా బాధలు కలిగించారు. నీ అనుచరులు కూడా లెక్కలేనంతమంది రాక్షసులను తినివేశారు. దేవా! నీవు పరమశివునివలె యుద్ధంలో శత్రువులకు జయింప శక్యంకానివాడవు. నీవు సంపాదించిన ఈ విజయం లోకప్రసిద్ధం అవుతుంది. అక్షయమైన నీకీర్తి ఘుల్లోకాలలో వ్యాపిస్తుంది. మహాభుజా! దేవతలు అందరూ నీకు లోబడతారు.' అని మహాసేనునితో పలికి శచీభర్త అయిన యింద్రుడు శంకరుని అనుమతి తీసికొని దేవతలతో కలిసి స్వర్గలోకానికి వెళ్ళాడు. 'మీరంతా కుమారస్వామిని నన్ను చూసినట్లే చూసి గౌరవించండి' అని చెప్పి శంకరుడు భద్రవటానికి వెళ్ళాడు. అగ్నిపుత్రుడు దానవులను అందరిని నాశనంచేసి మహర్షులు

పూజిస్తుండగా ఒకరోజులోనే ముల్లోకాలను జయించాడు. స్కందుని ఈ జన్మవృత్తాంతాన్ని ఏకాగ్రమైన మనస్సుతో పారాయణం చేసే బ్రాహ్మణుడు ఈ లోకంలో సుఖసంపదలు కలిగి తుదకు స్కందలోకానికి వెళ్ళుతాడు.

232. స్కందుని ప్రసిద్ధనామములను జెప్పుట, ఆయన స్తుతి.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు- మహాత్మా! బ్రాహ్మణశ్రేష్ఠా! మూడులోకాలలో ప్రసిద్ధమైన కార్తికేయుని నామాలను వినగోరుతున్నాను. వైశంపాయను డన్నాడు - జనమేజయా! పాండురాజపుత్రుడైన యుధిష్ఠిరుడు ఇలా ప్రశ్నించగా మహాతపస్వి, మహాత్ముడు అయిన మార్కండేయమహర్షి ఈవిధంగా చెప్పాడు. ఆగ్నేయుడు, స్కందుడు, దీప్తకీర్తి, అనామయుడు, మయూరకేతువు, ధర్మాత్ముడు, భూతేశుడు మహిషాసురమర్దనుడు, కామజిత్తు, కామదుడు, కాంతుడు, సత్యవాక్కు, భువనేశ్వరుడు, శిశువు, శీఘ్రుడు, శుచి, చండుడు, దీప్తవర్ణుడు, శుభాననుడు, ఆమోఘుడు, అనఘుడు, రౌద్రుడు, ప్రియుడు, చంద్రాననుడు, దీప్తశక్తి, ప్రశాంతాత్ముడు, భద్రకృత్తు, కూటమోహనుడు, షష్ఠిప్రియుడు, ధర్మాత్ముడు, పవిత్రుడు, మాతృవత్సలుడు, కన్యాభర్త, విభక్తుడు, స్వాహేయుడు, రేవతీసుతుడు, ప్రభువు, నేత, విశాఖుడు, నైగమేయుడు, సుదుశ్చరుడు, సువ్రతుడు, లలితుడు, బాలక్రీడనక ప్రియుడు, ఆకాశచరుడు, బ్రహ్మచారి, శూరుడు, శరవణోద్భవుడు, విశ్వామిత్రప్రియుడు, దేవసేనాప్రియుడు అనే ఈ నామాలను పఠించేవాడు స్వర్గాన్ని, కీర్తిని, ధనాన్ని పొందుతాడు. ఈ విషయంలో సందేహంలేదు. కురువంశవీరా! దేవతలు, మహర్షులు సేవించేవాడు, లేక్కలేనన్ని నామాలు కలవాడు, అపారశక్తిసంపన్నుడు, శక్తి అనే అస్త్రం దాల్చిన వీరశ్రేష్ఠుడు, షడాననుడు అయిన గుహుని స్తుతిస్తున్నాను. శ్రద్ధగా విను.

స్కందదేవా! నీవు బ్రాహ్మణుల మేలు కోరేవాడవు. బ్రహ్మోత్మజుడవు, బ్రహ్మవేత్తవు, బ్రహ్మనిష్ఠుడవు, బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడవు, బ్రాహ్మణప్రియుడవు, బ్రాహ్మణులతో సమానమైన వ్రతాలు గలవాడవు, బ్రహ్మజ్ఞుడవు, బ్రాహ్మణ నాయకుడవు. స్వాహవు, స్వధవు నీవే. పరమపవిత్రుడవు, మంత్రాలు స్తుతించే ప్రసిద్ధమైన ఆరుజ్వాలలతో గూడినవాడవు(అగ్నివి), సంవత్సరం, ఆరుఋతువులు పక్షాలు, మాసాలు, అయనాలు, దిక్కులును నీవే! నీవు కమలాల వంటి కన్నులు గల వాడవు, కమలముఖుడవు, సహస్రకరుడవు, సహస్రవదనుడవు, సహస్రబాహుడవు. లోకపాలకుడవు, సర్వోత్తమ మగు హవిస్సువు, దేవాసురులను అందరిని రక్షించేవాడవు. నీవే సేనాపతివి, మహాకోపివి, ప్రభువువు, విభుడవు, శత్రువులను జయించేవాడవు. సహస్రభువుడవు (అనేకమైనవాడవు), భూమివి నీవే. అనేక ప్రాణులకు సంతోషదాయకుడవు,

సహస్రభోక్తవు నీవే. అనేక శీర్షాలు గలవాడవు. అనంతరూపుడవు, వేలపాదాలు గలవాడవు, గుహా! శక్తిధారివి, నీ ఇచ్ఛానుసారమే గంగకు, స్వాహాదేవికి, భూమికి, కృత్తికలకు సుతుడవుగా అవతరించావు.

షడాననా! నీవు కోడితో ఆడుకొంటావు. ఇష్టానుసారం నానావిధాల సుందరరూపాలు ధరిస్తావు. నీవు ఎల్లప్పుడు దీక్ష, సోమం, మరుద్గణం, ధర్మం, వాయువు, శైలేంద్రుడవు, ఇంద్రుడవు అగుదువు. సనాతనులలో సనాతనుడవు, ప్రభుడవు, నీధనుస్సు భయంకరం, సత్యప్రవర్తకుడవు, దైత్యసంహారం చేసేవాడవు, శత్రువిజేతవు, దేవశ్రేష్ఠుడవు. అన్నిటికన్న గొప్పదైన సూక్ష్మతపస్సు నీవే. కార్యకారణతత్త్వం తెలిసినవాడవు. కార్యకారణస్వరూపుడవు నీవే. ధర్మకామాలు, ఈ రెండింటి కన్నా పరమైన మోక్షతత్త్వం తెలిసినవాడవు నీవే. ఈజగత్తు అంతయు మీతేజస్సుతో వెలుగొందుతున్నది. సర్వదేవతాశ్రేష్ఠా! నీశక్తితో ఈ జగత్తు అంతా వ్యాప్తమైయున్నది. లోకేశ్వరా! నేను యథాశక్తిగా మిమ్ము స్తుతించాను. పన్నెండుకన్నులు, చేతులతో శోభిల్లే నీకు సమస్సులు. దీనికి అతీతమైన మీస్వరూపం నేను ఎరుగను. ఏకాగ్రమైన మనస్సుతో స్కందుని ఈ జన్మవృత్తాంతాన్ని చదివే బ్రాహ్మణుడు, బ్రాహ్మణులకు వినిపించేవాడు, బ్రాహ్మణుని వలన వినేవాడు సంపదను, ఆయువును, మహత్తరయశస్సును, సంతతిని, శత్రువిజయాన్ని, తుష్టిని, పుష్టిని పొంది తుదకు స్కందలోకాన్ని చేరతాడు.

233. ద్రౌపదీ సత్యభామా సంవాదము.

మహాత్ములైన విప్రులూ, పాండవులూ ఆసీనులయ్యారు. అలాగే ద్రౌపదీసత్యభామ లిద్దరూ ప్రక్కనే కూర్చున్నారు. ఒకరినొకరు చూసికొని చాలాకాల మవడంతో ఇద్దరూ పరిహాసాలు చేసుకొంటూ సుఖంగా కూర్చున్నారు. కురువంశంలోనూ, యాదవవంశంలోనూ జరిగిన విశేషాలన్నీ చెప్పుకొంటున్నారు. అపుడు సత్యభామ రహస్యంగా ద్రౌపదితో ఇలా అంది. 'ద్రౌపదీ! నీవు దిక్పాలురవంటి పాండవులను ఎలా వశం చేసుకొంటున్నావు? పైగా వారంతా కలిసి కట్టుగా ఉండే వీరులు కదా! వారంతా నీకు ఎలా వశు లయ్యారు? వారు నీమీద ఎన్నడూ, ఏమాత్రమూ కోపపడకుండా ఉన్నారే! పాండవులు నీకు సదా వశ్యులై ఉంటారు. నీ ముఖదర్శనంకోసం తహతహలాడుతారు. ద్రౌపదీ! ఇందులోని రహస్యమేమిటో చెప్పవమ్మా! వ్రతాచారం కాని, తపస్సు కాని, స్నానమంత్రాలు కాని, ఔషధాలు కాని, విద్యాశక్తికాని, మూలశక్తి కాని, జపహోమాలు కాని, అంజనాలు కాని ఏవైనా ఉన్నాయా? ద్రౌపదీ ! నాకు ఇపుడు చెప్పు - సౌభాగ్యం వృద్ధి చేసే చక్కని మార్గాలు ఏవైనా

ఉన్నాయా, చెప్పు – వాటితో నాకు సదా కృష్ణుడు వశవర్తియై ఉంటాడు.' ఇలా సత్యభామ అనగానే పతివ్రతయైన ద్రౌపది ఇలా సమాధానం చెప్పింది. 'సత్యా! దుష్టస్త్రీల గురించి నన్ను అడుగుతున్నావు. దుష్టస్త్రీల గురించి ఎలా సమాధానం చెప్పాలి? ఇటువంటి ప్రశ్న కాని సందేహం కాని నీకు రాకూడదు. ఎందుకంటే బుద్ధిమంతురాలివి. పైగా కృష్ణునికి ఇష్టమయిన రాణివి. మంత్రతంత్రాలు పెట్టే భార్యను గురించి భర్తకు తెలిస్తే అతడు చాలా వ్యాకులపడతాడు. ఇంట్లో పామును పెట్టుకొన్నట్లు మనసు కుదురులేకుండా పోతుంది. అలా వ్యాకులపడితే శాంతి ఉండదు. శాంతిలేని వానికి సుఖమెక్కడిది? ఈ మంత్రాలతో, తంత్రాలతో భర్త ఎన్నడూ భార్యకు వశం కాడు. మోసంతో శత్రువులు పంపిన ఓషధులను భర్తలకు పెట్టి, ఎందరో స్త్రీలు వారిని తీవ్రవ్యాధులకు గురి చేశారు. శత్రువును చంపదలచిన వారు "భర్తను వశపరచుకొనే గొప్పమూలిక ఇది" అని స్త్రీలను మభ్యపెట్టి వారికి విష మందిస్తారు. ఆటువంటి వారిచ్చిన చూర్ణాలు నాలుకకో, చర్మానికో తగిలినంతనే నిస్సంశయంగా మనుషులను చంపగలుగుతాయి. ఎందరోస్త్రీలు భర్తను వశపరచుకొంటున్నామనుకొంటూ వారిని జలోదర, శ్వేత కుష్ఠవ్యాధులకు గురిచేశారు. అకాలంలో వృద్ధులను చేశారు. నపుంసకులుగా, గ్రుడ్డివారుగా, మూగవారుగా కూడా చేశారు. ఈ రీతిగా పాపాత్ములను అనుసరించిన పాపాత్ములయిన స్త్రీలు భర్తలను బాధలకు గురి చేశారు. భార్య ఎప్పుడూ ఏరీతిగానూ భర్తకు అప్రియాన్ని చేయదగదు.

సత్యభామా! మహాత్ములైన పాండవులతో నేనెలా ప్రవర్తిస్తానో యథార్థంగా చెపుతాను. విను. నేను అహంకారాన్ని, కామక్రోధాలను ఎప్పుడూ దరిచేరనీయక పూర్తిగా ఏకాగ్రతతో నిత్యమూ పాండవులనూ, వారి ఇతరభార్యలను సేవిస్తుంటాను. నాకోరికలను నియంత్రించుకొని, ఒళ్ళు మరచిపోకుండా సేవాభావంతోనే భర్తల మనస్సులను కాచుకొంటాను. అహంకారాభిమానాలకు తావివ్వను. చెడ్డమాటలు, చెడ్డనడత, నిలకడలేని చూపు, తగనిచోట కూర్చొనటం, తగని నడక – వీటికి అవకాశం లేకుండా జాగ్రత్తపడతాను. భర్తల అభిప్రాయాలను గ్రహించి అనుసరిస్తాను. కౌంతేయులు సూర్యాగ్నిసములు, చంద్రసమానులు, మహారథులు, కంటితోనే శత్రువులను చంపగలవారు, భీకరబలపరాక్రమాలు గలవారు. వారినెప్పుడూ సేవిస్తుంటాను. దేవుడయినా, మనుష్యుడైనా, గంధర్వుడైనా, యువకుడైనా, శోకులాడు అయినా, ధనవంతు డయినా, అందగాడైనా సరే నా మనస్సుకు మరొక మగవాడు నచ్చడు. భర్త, ఆయన సేవకులు తినకముందు నేను తినను. వారు స్నానం చేయకముందు నేను స్నానం చేయను. భర్త శయనించకముందు నిదురించను. పొలంనుండి గానీ, తోటనుండి గానీ, గ్రామాంతరం నుండి గానీ భర్త ఇంటికివస్తే లేచి అభినందిస్తాను.

ఆసనోదకాలను సమర్పిస్తాను. నేనే గిన్నెలు శుభ్రం చేస్తాను. మృష్టాన్నాన్ని వండి వేళకు భోజనం పెడతాను. నన్ను నేను అదుపులో ఉంచుకొని ధాన్యాన్ని దాచి ఉంచుతాను. ఇంటిని చక్కగా, శుభ్రంగా ఉంచుతాను. మాటలతో ఎవ్వరినీ తిరస్కరించను. చెడ్డఆడవాళ్ళతో స్నేహం చెయ్యను. ఎప్పుడూ అలసత్వం లేకుండా భర్తలకు అనుకూలంగా నడచుకొంటాను. నిష్కల్మషంగా నవ్వుతాను. అదేపనిగా గుమ్మంలో నిలవను. మురికితావులలో కానీ, ఉద్యానవనాల్లో కానీ ఎక్కువసేపు ఉండను. నీచులతో మాటాడను. అసంతుష్టికి అవకాశ మివ్వను. ఇతరుల పనులను ప్రస్తావించను. మిక్కిలిగా నవ్వను. ఎక్కువగా కోపించను. కోపానికి అవకాశం కూడా ఇవ్వను. ఎప్పుడూ సత్యమే పలుకుతూ భర్తసేవలోనే ఆసక్తితో ఉంటాను.

భర్తలేని చోటు నాకు ఏరీతిగాను నచ్చదు. కుటుంబం పనిమీద భర్త ఏ ఊరికైనా వెళితే పూవులను అలంకరించుకోవటం కూడా మాని వ్రతాలను ఆచరిస్తుంటాను. భర్త తిననివాటిని, భర్త త్రాగనివాటిని, భర్త సేవించని వాటిని నేను కూడా విడిచిపెడతాను. సుందరీ! శాస్త్రోపదేశాలననుసరించి నియమపూర్వకంగా జీవిస్తాను. చక్కగా అలంకరించుకొని ఏకాగ్రతతో భర్తకు నచ్చిన, హితకరమైన పనులమీదే ఆసక్తి చూపుతాను. మా అత్త గతంలో నాకు చెప్పిన కుటుంబధర్మాలను అన్నింటినీ, ఎప్పుడూ ఏమరుపాటులేకుండా పాటిస్తాను. నేను పగలూ, రేయీ కూడా అలసత్వం లేకుండా, భిక్షపెట్టటం, బలివైశ్వదేవం, శ్రాద్ధం, పర్వకాలాలలో చేయదగిన స్థాలీపాకం, మాన్యులను సత్కరించటం మొదలయిన పనులనూ, వినయనియమాలను అన్నింటిని సప్రయత్నంగా ఎప్పుడూ పాటిస్తాను. నాభర్తలు మృదుస్వభావులు, సజ్జనులు, సత్యశీలులు, సత్యధర్మపరిపాలకులు. అయినా కోపించిన పాములనుగానే వారిని భావించి భయభక్తులతో నేను సేవిస్తాను.

భర్త ఏలుబడిలో ఉండటమే స్త్రీలకు సనాతనధర్మమని నా అభిప్రాయం. భర్తయే దేవుడు. ఆయనయే గతి. అటువంటి భర్తకు ఇష్టంలేనట్లు ఏ స్త్రీ ప్రవర్తించగలదు? నేను భర్తలను మించిపోను. వారికంటే ఎక్కువ తినను. ఎక్కువగా అలంకరించుకొనను. అత్తగారికి ఎదురు చెప్పను. ఎప్పుడూ నన్ను నేను అదుపులో ఉంచుకొంటాను. సౌభాగ్యవతీ ! నేను నిత్యమూ ఉదయమే లేచి వారి సేవకు సావధానంగా సన్నద్ధమవుతాను. గురుశుశ్రూష కారణంగానే భర్తలు నాకు అనుకూలురై ఉంటారు. పూజనీయ, వీరమాత, సత్యవాదిని అయిన కుంతిని జలపానం, వస్త్రధారణం, భోజనం వంటి పనులలో. నిత్యమూ నేనే పరిచర్యలతో అలరిస్తాను. వస్త్ర, భూషణ, భోజన విషయంలో ఎప్పుడూ ఆమెను మించిపోను. ఆమె భూదేవి వంటిది. ఆ కుంతికి ఎప్పుడూ ఎదురాడను. ఇంతకుముందు యుధిష్ఠిరుని

ప్రాసాదంలో ప్రతిరోజూ ఎనిమిదివేలమంది బ్రాహ్మణులు బంగారుపాత్రలలో భుజించేవారు. ఎనభై ఎనిమిది వేలమంది స్నాతక గృహస్థులు, వారిని సేవించటానికి ఒక్కొక్కరికి ముప్ఫైమంది దాసులు ఉండేవారు. వారినందరినీ యుధిష్ఠిరుడు భరించేవాడు. మరొక పదివేలమంది ఊర్ధ్వరేతస్కు లయిన యతులు ఉండేవారు. వారికై చక్కగా వండిన అన్నాన్ని బంగారు పాత్రలతో కొనిపోయేవారు. వేదవాదులయిన ఆ బ్రాహ్మణుల కందరకూ వైశ్వదేవం ముగిసినవెంటనే ముందుగా సమర్పించి పాన, ఆచ్ఛాదన, భోజనాలతో తగురీతిగా అర్చించేదాన్ని. మహాత్ము డయిన యుధిష్ఠిరుని దగ్గర లక్షమంది దాసీజన ముండేవారు. వారంతా శంఖమాలలు, అంగదాలు, కంఠాభరణాలు ధరించి చక్కగా అలంకరించుకొని ఉండేవారు. నృత్యగీతవిశారదులయిన కళాకారులు మాలలు, ఆభరణాలు ధరించి, చందనజలంతో స్నానం చేసి, చందనాన్ని పూసికొని, మణులను, సువర్ణాభరణాలను ధరించి అందంగా ఉండేవారు. వారిపేర్లు, రూపం నాకెరుకే. వారి భోజన వస్త్రాలను గమనించటం నా బాధ్యత. ఎవరెవరు ఏమేం చేశారో, చేయలేదో అంతా నాకు తెలిసేది. ధీమంతుడైన యుధిష్ఠిరుని దాసీజనం లక్షమంది దివారాత్రాలు పాత్రలను చేతబట్టి ఆతిథులకు భోజనాలు పెట్టేవారు.

యుధిష్ఠిరుడు ఇంద్రప్రస్థంలో ఉండి భూమిని పరిపాలిస్తున్నప్పుడు ప్రయాణకాలంలో లక్షగుర్రాలు, లక్ష ఏనుగులు కూడా వెళ్తుండేవి. నేను వాటిని గణిస్తూ, అవసరమయినవి అందిస్తూ వాటివిశేషాలు వింటుండేదాన్ని. అంతఃపురంలోనూ, గోపాలకులనుండి గొర్రెలకాపరుల వరకు భృత్యులందరి విషయంలోనూ ఏం జరిగిందో, ఏం జరగలేదో అంతా నాకు తెలిసేది. యశస్వినీ! కళ్యాణీ! యుధిష్ఠిరుడు, ఇతరపాండవుల ఆదాయవ్యయాలూ, శ్రేష్ఠధనం అంతా నేనొక్కదాన్నే తెలిసికొనేదాన్ని. భరతశ్రేష్ఠులైన పాండవులు కుటుంబభారమంతా నామీద నిలిపి, ఉపాసనాసక్తులై తదనుగుణంగా ప్రవర్తించేవారు. అందరూ సాధారణంగా మోయలేనంత భారం నామీద పడేది. అయితే నేను సుఖాన్ని వీడి, పగలనకా రాత్రనకా ఆ భారాన్ని మోసేదాన్ని. ధర్మాచారు లయిన నా భర్తల ఖజానా వరుణుని కోశాగారంవలె, పరిపూర్ణసాగరంవలె అక్షయమై ఉండేది. నాకు మాత్రమే దాని వివరాలు తెలిసిఉండేవి. నేను ఆకలిదప్పులను కూడా సహిస్తూ రాత్రి అయినా, పగలు అయినా పాండవులను ఆరాధించేదాన్ని. నాకు పగలయినా, రాత్రి అయినా ఒక్కటే. సత్యభామా! అందరికన్న ముందు నిదురలేచేదాన్ని. అందరూ శయనించిన తరువాత నిద్రించేదాన్ని. నిత్యమూ ఇదే పరిస్థితి. ఈ పతిభక్తియే నా వశీకరణమంత్రం. భర్తలను వశం చేసికొనేందుకు గొప్పమంత్రం ఇదొక్కటే నాకు తెలుసు. చెడ్డస్త్రీలు పాటించే పద్ధతులను నేను పాటించను.

నాకిష్టం లేదు కూడా.' వైశంపాయనుడిలా అన్నాడు. ధర్మసమ్మతమైన ఆ ద్రౌపది మాటను విని సత్యభామ ధర్మచారిణి అయిన ద్రౌపదిని సత్కరించి ఇలా అన్నది. 'పాంచాలి! నేను శరణుగోరుతున్నాను. యాజ్ఞసేని! నన్ను క్షమించు. నెచ్చెలులమధ్య ఇటువంటి పరిహాసప్రసంగాలు మామూలే.'

234. భర్తను అనుకూలుని చేసికొను ఉపాయము.

ద్రౌపది ఇలా అన్నది. 'భర్త మనస్సును లోబరచుకొనేందుకు నీకొక ఉపాయం చెప్తాను. దానిలో భ్రాంతికి అవకాశం లేదు. ఈమార్గంలో యథాతథంగా నడిస్తే నీభర్తను ఇతరసపత్నుల నుండి నీవైపునకు లాగవచ్చు. సత్యభామా! దేవలోకంతో సహా ఏ లోకంలో కూడా భార్యకు భర్తవంటి దైవం మరొకరు లేరు. భర్త ప్రసన్నుడైతే స్త్రీలకోరికలన్నీ తీరుతాయి. భర్త కోపిస్తే కోరికలు నశిస్తాయి. భర్తసేవవలననే స్త్రీకి సంతానం, వివిధ భోగాలు, శయ్య, ఆసనం, అందమైన వస్త్రాలు, మాలలు, సుగంధాలు, స్వర్గలోకం, మహాకీర్తి - అన్నీ లభిస్తాయి. ఈలోకంలో ఎప్పుడూ సుఖం ద్వారా సుఖం కలుగదు. పతివ్రత అయిన స్త్రీ దుఃఖంద్వారానే సుఖాలు పొందగలదు. నీవు నిత్యమూ సౌహార్దంతో, ప్రేమతో, వ్యవహారకౌశలంతో, ఆసనసమర్పణతో, మనోహరపుష్పమాలలతో, ఔదార్యంతో, వివిధగంధాలతో శ్రీకృష్ణుని ఆరాధించు. దానితో "సత్యకు నేనంటే చాలా ఇష్టం" అని భావించి నిన్నే మనస్సులో నిలుపుకొనేటట్లు ప్రవర్తించు. ద్వారం దగ్గరకు వచ్చిన భర్తకంఠస్వరాన్ని విని, లేచి, ఇంటిమధ్యలో నిలు. లోనికి ప్రవేశించగానే త్వరగా ఆసనపాద్యాల నిచ్చి, పూజించు.

సత్యా! కృష్ణుడు ఏ పనిమీదనైనా దాసిని పంపబోతే నీవే లేచి స్వయంగా ఆ పనిచేయాలి. నీ భావాన్ని కృష్ణుడు గ్రహించి "సత్య నిండు మనస్సుతో నన్ను సేవిస్తోంది" అనుకోవాలి. భర్త నీదగ్గర చెప్పిన మాటను - అది రహస్యం కాకపోయినా - నీవెవ్వరికీ చెప్పకూడదు. నీద్వారా విషయం గ్రహించిన ఏ సవతి అయినా వాసుదేవుని దగ్గర దానిని ప్రస్తావిస్తే నీపై విరక్తి కలుగవచ్చు. భర్తకు ప్రియులు, అనురక్తులు, హితులు అయిన వారిని వివిధోపాయాలతో ఆరగింపు చేయాలి. భర్తకు ద్వేషింపదగినవారికి, పట్టించుకొనదగనివారికి, అహితులకూ, ఎప్పుడూ కుహకంగా ప్రవర్తించేవారికీ దూరంగా ఉండాలి. పరాయి పురుషుల దగ్గర పాగరును, ఏమరుపాటును వీడి, మౌనంగా నిలవాలి. మనస్సును బయటపడనీయరాదు. ప్రద్యుమ్నుడు, సాంబుడు నీకు పుత్రసమానులే. అయినా వారితో కూడా ఎప్పుడూ ఒంటరిగా ఉండదగదు. మంచివంశంలో పుట్టి,

పాపపుపనులకు దూరంగా నిలిచి ప్రవర్తించే పతివ్రతలతోనే నీకు మైత్రి ఉండాలి. కోపస్వభావం గలవారిని, మత్తులో మునిగేవారిని, తిండిపోతులను, దొంగలను, చెడ్డవారిని, చాపల్యంగల వారిని వదలిపెట్టాలి. గొప్పవిలువగల హారాలను, ఆభరణాలను అంగరాగాన్ని ధరించి, దివ్యపరిమళాలతో భర్తను ఆరాధించు. ఇది కీర్తికరం, సౌభాగ్యకరం. దీనితో నీకోరికలు తీరుతాయి. శత్రువులు అణుగుతారు.

235. శ్రీకృష్ణగమనము.

వైశంపాయను డిలా అన్నాడు. 'జనార్దనుడు మార్కండేయాది మహర్షులతో, మహాత్ములైన పాండవులతో కలిసి తనకు నచ్చిన విషయాలు ప్రస్తావిస్తూ కొంతకాలం గడిపాడు. జనార్దనుడు అందరితో ఎప్పటివలె మాటాడి, సెలవు తీసికొని, రథాన్నెక్కి బయలుదేరబోతూ సత్యభామను పిలిపించాడు. అప్పుడు అక్కడ సత్యభామ ద్రౌపదిని కౌగిలించి, తన మనోగతికి తగినట్లుగా, సావధానంగా, మనోహరంగా ఇలా అన్నది. 'ద్రౌపదీ, నీవు ఉత్కంఠకు గురికావద్దు. కలతపడవద్దు. జాగరణలు చేయవద్దు. నీ భర్తలు దేవసమానులు. వారిద్వారా మరల రాజ్యాన్ని పొందగలవు. నీలలోచనా! నీవు అనుభవిస్తున్నట్టి కష్టాలను నీవలె శీలసంపదా, ఉత్తమలక్షణాలు గల స్త్రీలు పెద్దకాలం అనుభవించరు. నీవు నీ భర్తలతో కలిసి ఈ భూమిని నిష్కంటకంగా, నిర్ద్వంద్వంగా తప్పక అనుభవిస్తావని నేను విని ఉన్నాను. ద్రుపదకుమారీ! ధార్తరాష్ట్రులను చంపి, శత్రుత్వానికి బదులు తీర్చికొని, యుధిష్ఠిరాదులు రాజ్యాన్ని చేపడతారు. త్వరలోనే నీవు దాన్ని చూడగలవు. నీవు వనవాసానికి వెళ్తున్న సమయంలో గర్వమోహంతో నిన్ను పరిహసించిన వారి ఆశలన్నీ నీరుగారిపోతాయి. ఆ స్థితిలో వారిని నీవు త్వరలోనే చూస్తావు. ద్రౌపదీ! కష్టాలలో ఉన్న నీకు అప్రియంగా ప్రవర్తించినవారంతా యమలోకానికి వెళ్ళినట్టే అనుకో.

ధర్మజసుతుడు ప్రతివింధ్యుడు, భీమనందనుడు సుతసోముడు, అర్జునునికొడుకు శ్రుతకర్మ, నకులుని కొడుకు శతానీకుడు, సహదేవ సుతుడు శ్రుతసేనుడు వీరంతా వీరులు, అస్త్రవిద్యానిపుణులు. ద్వారకలో క్షేమంగా ఉన్నారు.వారంతా అభిమన్యునివలె ఆనందంగా ఉన్నారు. ద్వారకపై ఆసక్తితో ఉన్నారు. సుభద్రకూడా నీవలెనే వారందరితో అన్నివిధాలుగా ప్రేమపూర్వకంగా ఉంటుంది. సుభద్ర ఏ భేదభావమూ లేక నీవంటే ఇష్టంగా ఉంటుంది. ఆ పిల్లలను ప్రేమగా చూస్తుంది. వారు బాధపడితే తాను బాధ పడుతుంది. వారు సుఖంగా ఉంటే తాను సుఖంగా ఉంటుంది. ప్రద్యుమ్నుని తల్లి రుక్మిణి కూడా వారిని సర్వవిధాలా బాగా చూసుకొంటోంది. శ్రీకృష్ణుడు కూడా భానువు

మొదలుగా గల తన కొడుకుల కన్న మిన్నగా వారిని ఆదరిస్తాడు. మా మామగారు వారి భోజనవస్త్రాలను గురించి ఎప్పుడూ పరిశీలిస్తుంటారు. బలరాముడు మొదలయిన వృష్ణి, అంధక వంశస్థులందరూ వారిని గమనిస్తూ ఉంటారు. భావినీ! వారందరికీ, ప్రద్యుమ్నుడికీ కూడా నీ కొడుకులపై సమానమైన ప్రేమ. ప్రియం, సత్యం, మనోహరం, మనోనుగతమైన ఇటువంటి మాట చెప్పి కృష్ణుని పట్టమహిషి అయిన సత్యభామ వాసుదేవరథం దగ్గరకు బయలుదేరబోతూ ద్రౌపదికి ప్రదక్షిణం చేసింది. ఆపై భావిని అయిన సత్యభామ రథ మెక్కింది. శ్రీకృష్ణుడు నవ్వుతూ ద్రౌపదిని ఊరడించి, వెనుదిరిగి వేగగాము లయిన గుర్రాలతో తననగరానికి బయలుదేరాడు.

236. పాండవులను గురించి విని ధృతరాష్ట్రుడు చింతించుట.

పాండుసుతులు జనాన్ని వీడి, కుటీరం నిర్మించుకొని రమ్యవనాలలో, పర్వతాలలో నదీప్రవేశాల్లో సంచరించసాగారు. ఆ రీతిగా వనంలో సంచరిస్తున్న ఆ వీరుల దగ్గరకు స్వాధ్యాయతత్పరులు, తపోధనులు, వేదవేత్తలు అయిన ప్రాచీనమునులు వచ్చారు. ఆ నరోత్తములు వారిని పూజించారు. ఆపై ఒకప్పుడు కథాప్రసంగాలలో నేర్పుగల ఒక విప్రుడు పాండవుల దగ్గరకు వచ్చాడు. వారితో కలిసి సంచరిస్తూ ఆ విప్రుడు అనుకోకుండా ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళాడు. ధృతరాష్ట్రునిచే సత్కరింపబడి, ఆసీనుడై ఆ విప్రుడు ధృతరాష్ట్రుడు అడిగితే పంచపాండవులను గురించి చెప్పసాగాడు. గాలికీ ఎండకూ కృశించి, తీవ్రదుఃఖాన్ని ముఖాన నింపుకొన్న పాండవులను గూర్చి, వీరపత్ని అయి కూడా అనాథవలె కష్టాలనుభవిస్తున్న ద్రౌపదిని గూర్చి చెప్పాడు. అప్పుడు పాండవుల వృత్తాంతాన్ని విన్న ధృతరాష్ట్రుడు జాలితో తపించాడు. రాజకొడుకులు, మనవళ్ళు అయికూడా అరణ్యంలో దుఃఖనదిలో మునిగిపోయిన పాండవులను గూర్చి విన్న ధృతరాష్ట్రుని మనసు కరుణతో నిండిపోయింది. దీర్ఘనిశ్వాసాలు విడుస్తూ, ఎట్టకేలకు కుదుటపడి, అదంతా తనవల్లనే జరిగిందని భావించి ఇలా అన్నాడు. 'ధర్మరాజు సత్యవాది, పవిత్రుడు, పెద్దరికంతో ప్రవర్తించేవాడు. నా కొడుకులలో పెద్దవాడు. అజాతశత్రువు. ఉన్నిపరువులపై గతంలో శయనించిన అతడు ఇప్పుడు నేలపై ఎలా పడుకొంటున్నాడు? తాను ఇంద్రునితో సమానుడు. నిత్యమూ మాగధసూతుల స్తోత్రపాఠాలతో నిదురలేచేవాడు. ఇప్పుడు నేలపై పరుండి వేకువజామున పక్షుల కిలకిలారావాలతో నిదురలేస్తున్నాడు. వృకోదరుడు గాలి, ఎండల తాకున కృశించి ఉంటాడు. శరీరాంగా లన్నింటా కోపం నిండి ఉంటుంది. అటువంటివాడు ద్రౌపది సమక్షంలో నేలపై ఎలా శయనిస్తున్నాడు? ఆ శరీరం ఆ

కష్టాలకు తగదు. అలాగే అర్జునుడు అభిమానవంతుడు, సుకుమారుడు. ధర్మజుని అదుపులో ఉండేవాడు. అమర్షంతో శరీరమంతా బాధ నిండి ఉంటుంది. అటువంటి అర్జునునికి కుటీరంలో నిద్ర పట్ట దనుకొంటాను. అర్జునుడు ఉగ్రతేజస్సు గలవాడు. సుఖానికి దూరమయిన నకుల సహదేవులను, ద్రౌపదిని, ధర్మరాజును, భీముని చూసి పాములె బుసకొడుతూ అసహనంతో నిద్రకు దూరమై ఉంటా డనుకొంటాను. నకులసహదేవులు కూడా సుఖాల ననుభవించవలసినవారే. అశ్వినీదేవతలవంటి చక్కని రూపంగలవారు. వారికి కూడా అశాంతితో నిదురపట్టదనే భావిస్తున్నాను. ధర్మ సత్యాలే వారిని నిరోధిస్తున్నాయి.

వాయుసుతుడు భీముడు బలవంతుడు. బలంలో వాయువుతో సమానుడు. అన్నకారణంగా ధర్మపాశబద్ధుడు. అందువలననే నిట్టూర్పులు విడుస్తూ, క్రోధాన్ని భరిస్తుంటా డనుకొంటాను. ఆ భీముడు కూడా నా కుమారులను చంపాలని కోరుతూ శయ్యపై అటు ఇటు పొర్లుతుంటాడు. సత్యం, ధర్మం అతనిని ఆపుతున్నాయి. యుద్ధభూమిలో అందరినీ మించగలవాడు. కానీ కాలానికై ఎదురుచూస్తున్నాడు. ధర్మరాజు జూదంలో వంచనతో ఓడిపోయినపుడు దుఃశాసనుడు పలికిన పరుషవాక్యాలు వృకోదరుని శరీరంలో ప్రవేశించి అగ్ని ఇంధనాన్ని తగులబెట్టినట్టు అతనిని దహిస్తున్నాయి. ధర్మరాజు నా పాపాలను పట్టించుకోడు. అర్జునుడు కూడా ఆయననే అనుసరిస్తాడు. కానీ అరణ్యవాసంతో భీమునికోపం మాత్రం గాలిసోకిన అగ్నిలా పెరుగుతూనే ఉంటుంది. ఆ కోపంతో మండుతున్న భీముడు చేతులు అప్పళిస్తూ నాకొడుకులనూ, మనవళ్ళనూ దహిస్తున్నట్లు భీకరంగా, వేడిగా నిట్టూర్పులు విడుస్తుంటాడు. అర్జునుడు, భీముడు క్రోధావిష్టులయితే యమునితో, మృత్యువుతో సమానులు. పిడుగుల వంటి బాణాలను వెదజల్లుతూ రణరంగంలో శత్రుసేనను మిగల్చరు. దుర్యోధనుడు, శకుని, కర్ణుడు, దుఃశాసనుడు – వీరు మూర్ఖులు. జూదాన్ని ఆశ్రయించి రాజ్యాన్ని అపహరించారు. తేనెమీదనే దృష్టిపెట్టారు కానీ లోయలో పడతామేమో అని ఆలోచించలేదు. నరుడు కర్తయై శుభాశుభకర్మలను చేసి, ఫలితం కోసం ఎదురు చూస్తుంటాడు. ఆ ఫలంతో వ్యామోహితు డవుతాడు. ఆ వ్యామోహంనుండి ఎలా బయటపడగలుగుతాడు? పాలాన్ని చక్కగా దున్నాం. గింజలు నాటాం. ఋతుకాలంలోనే వర్షం కురిసింది. అయితే ఫలించటం లేదంటే ప్రారబ్ధం తప్ప మరోకారణ మక్కడుండే అవకాశం లేదు. ద్యూతప్రియుడయిన శకుని సరిగా ప్రవర్తించలేదు. సాధుస్వభావంతో ధర్మరాజు కూడా సరిగా ప్రవర్తించలేదు. చెడ్డకొడుకులకు లోబడి నేను కూడా సరిగా ప్రవర్తించలేదు. వీటి ఫలితమే నేడు కౌరవులకు పోయేకాలం.

గాలిని ఎవరూ కదిలించకపోయినా అది ప్రసరిస్తుంది. గర్భవతి తగిన కాలంలో ప్రసవిస్తుంది. పగటి ప్రారంభంలో రాత్రి నశిస్తుంది. రాత్రి ప్రారంభంలో పగలు నశిస్తుంది. అయినా లోభంతో చేయరాని పనులు చేస్తూనే ఉంటాం. ఇతరులూ చేస్తుంటారు. బుద్ధిమంతులు కూడా ఆర్జించిన దానిని ఎందుకు దానం చేయరో? అవసరపడినపుడు ఉపయోగపడని అర్థం అనర్థకమే. ఆ ధనం ఎందుకు ఉపయోగపడటం లేదో ఎలా ఉపయోగపడుతుందో ఆలోచించాలి. ధనాన్ని దానం చేయకపోతే దాన్ని ముక్కలు కాకుండా, జారిపోకుండా, వ్యర్థం కాకుండా కాపాడుకోవాలి. కాపాడుకోకపోతే నూరురకాలుగా అది చెదిరిపోతుంది. చేసిన కర్మఫలం ఎప్పుడూ నశించదు. అర్జునుని పరాక్రమాన్ని చూడు. అరణ్యవాసం చేస్తూ, కూడా ఇంద్రలోకానికి వెళ్ళగలిగాడు. అక్కడ నాల్గువిధా లయిన దివ్యాస్త్రాలను పొంది, మరలా ఈలోకాన్ని చేరగలిగాడు. శరీరంతో స్వర్గానికి వెళ్ళగలిగితే తిరిగిరావాలని ఎవరికి అనిపిస్తుంది? కాలోపహతులై మృత్యువునకు దగ్గరవుతున్న కౌరవులందరినీ చక్కగా చూడాలనేదే అర్జునుని రాకకు కారణమై ఉంటుంది. అర్జునుడు సవ్యసాచి అయిన విలుకాడు. గాండీవం తీవ్రవేగం గల ధనుస్సు. అర్జునుని అస్త్రాలు దివ్యాలూ. ఈ మూడింటి కలయికతో ఏర్పడిన తేజస్సును ఎవడు సహించగలడు.' ఏకాంతంలో ధృతరాష్ట్రుడు పలికిన ఈ మాటలు విని, శకుని రహస్యంగా కర్ణదుర్యోధనుల దగ్గరకుపోయి మొత్తం వివరంగా చెప్పాడు. దానితో మందమతి అయిన దుర్యోధనుడు అసంతృప్తికి గురి అయ్యాడు.

237. పాండవుల దగ్గరకు వెళ్లుమని కర్ణశకునులు దుర్యోధనుని ప్రోత్సహించుట.

ధృతరాష్ట్రుని ఆ మాటలను విని, అదను చూసి, శకుని కర్ణునితో కూడి దుర్యోధనుడితో ఇలా అన్నాడు. 'భారతా! నీవు నీ పరాక్రమంతో వీరపాండవులను వెడలగొట్టావు. ఇప్పుడు స్వర్గలోకంలో ఇంద్రునివలె నీవు ఒక్కడవే ఈ రాజ్యాన్ని అనుభవించు.

(రాజా! పర్వతాలు, అరణ్యాలు, తోటలు, స్థావరజంగమప్రాణులు - వీటితో కూడిన, సముద్రపర్యంతమైన ఈ భూమి నేడు నీ అధీనంలో ఉన్నది.)

రాజా! తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం - ఈ దిక్కులలో రాజ్యా లేలుతున్న రాజులంతా ఇప్పుడు నీకు కప్పం కడుతున్నారు. రాజా! గతంలో కళాకాంతులతో పాండవులను సేవించిన లక్ష్మి నేడు ధర్మజుని సోదరులతో సహా నీకు వశ మయింది. రాజా! ఇంద్రప్రస్థానికి వెళ్ళినపుడు యుధిష్ఠిరుని సన్నిధిలో వెలుగుతున్న ఏ రాజశ్రీని చూశామో అది నేడు

నీదగ్గర ప్రకాశిస్తుంటే చూస్తున్నాం. నీ దాయాదులు అప్పుడే శోకంతో కృశించిపోయారు. ఈ రాజ్యలక్ష్మిని నీవు యుధిష్ఠిరరాజు నుండి బుద్ధిబలంతో లాగుకొన్నావు. అందువల్ల ఇప్పుడది నీదగ్గర వెలుగుతోంది. రాజేంద్రా! అట్లే రాజులందరూ "ఏం చేయమంటారు" అంటూ నీ ఏలుబడిలో నీ కధీనులై ఉన్నారు. రకరకాల తోటలతో, పర్వతాలతో శోభిస్తూ సముద్రం చీరకట్టిన భూదేవి ఇప్పుడు పర్వతాలతో, వనాలతో, గ్రామాలతో, నగరాలతో, కందకాలతో సహా నీ అదుపులోనికి వచ్చి ఉన్నది.

(వివిధధ్వజపతాకాలు చిహ్నాలుగా గలిగి సమృద్ధిగా ఉన్న ఈ రాష్ట్రంలో విశాలసేన వ్యవస్థీకృతమై ఉన్నది.)

రాజా! నీవు నీ పౌరుషంద్వారా ద్విజులచే సత్కరింపబడుతూ, రాజులచే పూజింపబడుతూ స్వర్గంలో దేవతలలో సూర్యునివలె ప్రకాశిస్తున్నావు. రాజా! రుద్రులలో యమునివలె, దేవతలలో ఇంద్రునివలె, నక్షత్రాలలో చంద్రునివలె నీవు కౌరవులమధ్య ప్రకాశిస్తున్నావు. నీ ఆదేశాలను లెక్కచేయకుండా, నీ అదుపులో లేకుండా ప్రవర్తించిన పాండవుల పరిస్థితిని చూస్తూనే ఉన్నాం. వారు రాజ్యలక్ష్మిని కోల్పోయి వనవాసం చేస్తున్నారు. పాండవులు ద్వైతవనంలో, సరోవర తీరంలో, వనవాసులైన బ్రాహ్మణులతో కలిసి జీవిస్తున్నారని వింటున్నాం. కాబట్టి మహారాజా! పరమశోభాయుతుడవై కిరణాలతో సూర్యుడు జగత్తును తపింపజేసినట్లు పాండుపుత్రులను తపింపజేస్తూ అక్కడకు వెళ్ళు. రాజా! నీవు రాజ్యాధికారంలో ఉన్నావు. వారు రాజ్యభ్రష్టులు. నీవు సంపన్నుడవు. వారు శ్రీవిహీనులు. నీవు ధనవంతుడవు. వారు ధనహీనులు. ఈ స్థితిలో వెళ్ళి వారిని చూడు. గొప్పవంశంలో పుట్టి, ఎన్నో శుభాలతో వెలుగొందుతున్న నిన్ను నహుషనందను డైన యయాతినిగా పాండవులు చూడగలరు. రాజా! పురుషనియందున్న సంపదను అతని మిత్రులు, శత్రువులు కూడా చూచినప్పుడే ఆ సంపద సమర్థమవుతుంది. కొండపై నున్నవాడు నేలపై నున్న వారిని తక్కువగా చూచినట్టు, సుఖాలతో నున్నవాడు కష్టాలలో ఉన్న శత్రువులను చూస్తుంటే అంతకన్న గొప్ప సుఖ మేముంటుంది? రాజశ్రేష్ఠా! శత్రువుల దుఃస్థితిని చూస్తుంటే కలిగే ఆనందం పుత్రలాభంవలన కానీ, ధనలాభంవలన కానీ, రాజ్యలాభం వలన కానీ కలగదు. మనలో ఎవడో ఒకడు సిద్ధమనోరథుడై నారచీరలను, మృగచర్మాన్ని ధరించిన అర్జునుని చూడగలిగితే అతని ఆనందం ఎంతని చెప్పగలం? మంచి మంచి చీరలు ధరించిన నీ రాణులు నారచీరలను, మృగచర్మాలను ధరించి బాధలు పడుతున్న ద్రౌపదిని చూడాలి. ఆమెకూడా వారిని చూచి మరలా బాధపడాలి. ధనాన్ని కోల్పోయిన తనజీవితాన్ని పదేపదే నిందించుకోవాలి. చక్కగా అలంకరించుకొనిన నీ రాణులను చూస్తే ఆమెలో కలిగే బాధ

నాటి కొలువుకూటంలోని బాధకన్న ఎక్కువ కావాలి.' కర్ణుడూ, శకునీ కలిసి దుర్యోధనునితో ఆరీతిగా పలికి మౌనాన్ని వహించారు.

238. ఘోషయాత్రానుమతికై దుర్యోధనుడు ధృతరాష్ట్రునికడ కేగుట.

కర్ణునిమాట విని దుర్యోధన నరపాలుడు ఆనందించి, మరల దీనుడై ఈ మాట పలికాడు. 'కర్ణా! నీవన్నదంతా నా మనస్సులో నున్నదే. కానీ పాండవులున్న తావునకు వెళ్ళటానికి తండ్రి అనుమతిని పొందలేను. ధృతరాష్ట్రమహారాజు ఆ వీరులపై జాలిచూపుతున్నాడు. తపశ్శక్తి కారణంగా వారు మనకన్న గొప్పవారని భావిస్తున్నాడు. అక్కడకు వెళ్లాక మనం చేయదలచుకొన్న పనిని ఆయన గ్రహిస్తే, కలుగబోయే కష్టాలనుండీ మనలను రక్షించాలన్న తలపుతోనైనా అనుమతిని నిరాకరించవచ్చు. మహాతేజస్వీ! వనవాసం చేస్తున్న ఆ పాండవులను కలతపెట్టడం తప్ప ద్వైతవనంలో మరొక ప్రయోజనం లేదు. జూదమాడబోయే సమయంలో విదురుడు నాతో, నీతో, శకునితో ఏమన్నాడో తెలుసు కదా! ఆ మాటలనూ, పాండవులకై విలపించటాన్ని ఆలోచిస్తుంటే ద్వైతవనానికి వెళ్ళాలో, అవసరం లేదో తెలియటం లేదు. ద్రౌపదితోపాటు అరణ్యంలో కష్టాలుపడుతున్న భీమార్జునులను చూడాలన్న ముచ్చట నాకూ ఉంది. నారచీరలు, మృగచర్మాలు ధరించిన పాండవులను చూస్తుంటే కలిగే ఆనందం ఈ భూమండలాన్నంతా పొందినా కలుగదు. కర్ణా! ద్రుపదుని పుత్రిక అయిన ద్రౌపదిని అరణ్యంలో కాషాయవస్త్రాలలో చూస్తుంటే అంతకన్న కావలసిన దేముంటుంది? పాండుకుమారులయిన ధర్మరాజు, భీముడు పరమోత్కృష్ట మయిన రాజ్యలక్ష్మితో కూడిన వనమ్ము చూసినప్పుడే నా జీవితం సఫలమవుతుంది. ఆ అరణ్యానికి ఎలా వెళ్ళాలో అర్థంకావటం లేదు. అనుమతి పొందే ఉపాయం కూడా కనిపించటం లేదు.

నీవు శకునితో, దుఃశాసనునితో కలిసి ఆ అరణ్యానికి వెళ్ళే ఉపాయాన్ని జాగ్రత్తగా ఆలోచించు. నేను వెళ్ళటమో, మానటమో ఈ రోజు నిశ్చయించు కొంటాను. రేపు ఉదయమే మహారాజు దగ్గరకు వెళదాము. నేను అక్కడే కూర్చుంటాను. కురుసత్తముడైన భీష్ముడు కూడా ఉంటాడు. అప్పుడు నీవూ, శకునీ కలిసి మీ మనస్సులలోని ఉపాయాన్ని చెప్పాలి. ప్రయాణవిషయంలో మహారాజూ, భీష్ముడూ ఏమంటారో విని, భీష్ముని ఏదో ఒకరీతిగా అంగీకరింపజేసి ద్వైతవనప్రయాణాన్ని నిర్ణయిస్తాను.' అలాగే అనుకొని అందరూ ఎవరి భవనానికి వారు వెళ్ళిపోయారు. రాత్రి గడవగానే కర్ణుడు దుర్యోధనుని దగ్గరకు వెళ్ళి నవ్వుతూ ఇలా అన్నాడు– 'రాజా! ఉపాయం దొరికింది. విను. రాజా! ద్వైతవనంలో

గొల్లపల్లెలన్నీ నీకోసం ఎదురు చూస్తున్నాయి. ఘోషయాత్ర అన్న నెపంతో వెళదాం. అనుమానించనక్కరలేదు. రాజా! ఘోషయాత్ర అన్నది ఎప్పుడయినా సరే తగిన పనియే. ఈ పద్ధతిలో నీ తండ్రి కూడా నీకు అనుమతి ఇవ్వగలడు.' ఘోషయాత్రను నిశ్చయింపగోరి, ఆ రీతిగా సంభాషిస్తున్న కర్ణదుర్యోధనులను చూచి గాంధారరాజైన శకుని నవ్వుతూ ఇలా అన్నాడు. 'ద్వైతవనానికి వెళ్ళటానికి ఈ ఉపాయం ఇబ్బందిలేనిదిగా నాకనిపిస్తోంది. ధృతరాష్ట్రుడు అనుమతించటంతో పాటు మన కర్తవ్యాన్ని కూడా నిర్దేశించవచ్చు. రాజా! గొల్లపల్లెలన్నీ నీకోసం ద్వైతవనంలో నిరీక్షిస్తున్నాయి. కాబట్టి ఘోషయాత్ర అన్న నెపంతో అక్కడకు వెళదాం. సంశయించ నవసరం లేదు.' అప్పుడు వారంతా ఆనందంగా నవ్వుకొంటూ కరచాలనం చేసికొన్నారు. ఆ నిశ్చయంతోనే కురుశ్రేష్ఠుడైన ధృతరాష్ట్రుని సందర్శించారు.

239. ధృతరాష్ట్రుని అనుమతితో దుర్యోధనుడు బయలుదేరుట.

ఆ తరువాత కర్ణశకుని దుర్యోధనులు ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళారు. పరస్పరం కుశలప్రశ్నలు వేసికొన్నారు. వారు సమంగుడనే పేరుగల గొల్లవానిని అంతకుముందే ఏర్పాటుచేసికొని ఉన్నారు. వాడు ధృతరాష్ట్రుని దగ్గరకు వచ్చి "మనగోవులు దగ్గరకే వచ్చి ఉన్నాయి" అని చెప్పాడు. రాజా! అప్పుడు కర్ణుడు, శకుని రాజశ్రేష్ఠుడూ, నరపతి అయిన ధృతరాష్ట్రునితో ఇలా అన్నారు. 'కౌరవా! ఇప్పుడు గొల్లపల్లెలన్నీ రమణీయంగా ఉన్నాయి. గోవులను, దూడలను లెక్కించటానికి, వివరాలు సేకరించటానికి ఇది తగిన సమయం. రాజా! ఈ సమయంలో నీకుమారుడు వేటకు వెళ్ళటం కూడా యుక్తమే. దుర్యోధనుని ప్రయాణానికి అనుమతించు.'

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. 'నాయనా! వేట మంచిదే. గోవుల పర్యవేక్షణ కూడా మంచిదే. కానీ గొల్లవారి మాటలు నమ్మకూడదంటారు. అదే ఆలోచిస్తున్నా. నరశ్రేష్ఠులయిన ఆ పాండవులు అక్కడకు దగ్గరగానే ఉంటున్నట్లు వింటున్నాను. అందువలన నా అంతట నేను మీరు వెళ్ళటానికి అనుమతించలేను. కర్ణా! వారిని మోసంతో ఓడించాం. అరణ్యంలో నివసిస్తూ వారు కష్టాలు పడుతున్నారు. నిత్యమూ తపస్సు నాచరిస్తూ వారు శక్తిని కూడా పెంచుకొని మహారథులయ్యారు. ధర్మరాజుకు కోపం రాకపోవచ్చు. కానీ భీమసేనుడు కోపిష్ఠి. ద్రౌపది సాక్షాత్తు నిప్పురవ్వయే. అహంకారంతో, మోహంతో మీరు కూడా అక్కడ పొరపాట్లు చేయవచ్చు. దానితో తపశ్శక్తిసంపన్నులైన వారు మిమ్ము తగులబెట్టవచ్చు. లేదా వారు సాయుధులైన వీరులు. మీమీద తీవ్రకోపంగలవారు. కత్తులు కట్టుకొని ఉన్నారు. కలిసి ఉన్నవారు. శస్త్రశక్తితో మిమ్ము దహించవచ్చు. మీరు ఎక్కువమంది

ఉన్నారు. కాబట్టి ఏదో ఒకరీతిగా వారిని ఎదిరించగలిగినా అదికూడా పెద్దతప్పుగానే కనిపిస్తుంది. వాళ్ళను గెలవటం అంత తేలిక కాదు. మహాబాహువయిన అర్జునుడు ఇంద్రలోకంలో కూడా కొంతకాల మున్నాడు. దివ్యాస్త్రాలను పొంది, మరలా అరణ్యానికి వచ్చాడు. ఏ అస్త్రాలు లేనప్పుడే అర్జునుడు గతంలో భూమిని జయించాడు. ఇప్పుడు అస్త్రాలు కూడా సంపాదించాడు. ఇక చెప్పేదే ముంది? ఆ మహారథుడు మిమ్ము చంపి తీరుతాడు. అయినా నామాట విని మీరంతా మీ నివాసాలలోనే సావధానులై ఉండండి. స్వతః వారు మంచివారైనా వనవాసక్లేశం వలన దుఃఖితులయిన వారిద్వారా దుఃఖం కలుగవచ్చు. అథవా నీ సైనికులలో కొందరు యుధిష్ఠిరునకు అపకారం చేయవచ్చు. ఆ అజ్ఞానచేష్ట మీకు ఇబ్బందులను కలిగించవచ్చు. కాబట్టి భారతా! ఆప్తు లయిన వేరెవరి నయినా గోపరిగణనకోసం పంపు. నీవే వెళ్ళటం నాకంతగా ఇష్టంలేదు.'

అపుడు శకుని ఇలా అన్నాడు. 'భారతా! ధర్మరాజు ధర్మజ్ఞుడు. పైగా పండ్రెండు సంవత్సరాలు వనవాసం చేస్తామని సభలో ప్రతిజ్ఞచేసి ఉన్నాడు. ధర్మవర్తనులయిన మిగిలిన పాండవులు ధర్మరాజును అనుసరించేవారే. కుంతీనందనుడైన యుధిష్ఠిరుడు మనపై కోపించడు. వేటకు వెళ్ళాలన్న కోరిక మాకు బాగా ఉంది. గోపరిగణననే చేయాలనుకొంటున్నాం కానీ పాండవులను చూడాలనుకోవటం లేదు. మార్గం తప్పిన వృత్తాంత మేదీ అక్కడ జరగదు. అసలు పాండవులున్న చోటునకు వెళ్ళనే వెళ్ళం.' శకుని ఇలా అనగానే ధృతరాష్ట్రనరపతి ఇష్టం లేకపోయినా అమాత్యులతో సహా వెళ్ళటానికి దుర్యోధనునకు అనుమతి నిచ్చాడు. తండ్రి అనుమతి పొంది దుర్యోధనుడు కర్ణునితో కూడి, పెద్దసైన్యం వెంటరాగా బయలుదేరాడు. బుద్ధిమంతుడైన శకుని, దుశ్శాసనుడు, ఇతర సోదరులు, వేలకొలదిగ స్త్రీలు దుర్యోధనుని వెంట ఉన్నారు. దుర్యోధనుడు బయలుదేరగా, ద్వైతవనాన్నీ, ఆపేరుగల సరస్సును, చూడాలన్న కోరికతో పౌరులు కూడా భార్యలతో సహా ఆయన ననుసరించారు. దుర్యోధనుని వెంట ఎనిమిదివేల రథాలు, ముప్పయివేల ఏనుగులు, ఎన్నో వేల సైనికులు, తొమ్మిదివేల గుర్రాలు నడిచాయి. బండ్లు, దుకాణాలు, గుడారాలు, దుర్యోధనుని వెంట వెళ్ళాయి. వణిజులు, వందిమాగధులు, వేటపై మోజుగల మనుజులు వందలు, వేలసంఖ్యలో బయలుదేరారు. రాజా! వర్షాకాలంలోని ఝుంఝూవాతధ్వనిలాగా, దుర్యోధనుని ప్రయాణంలో మహాకోలాహలధ్వని వినిపించింది. నగరానికి రెండుక్రోసుల దూరంలో దుర్యోధనరాజు గుడారాలు వేయించాడు. ఆపై అక్కడ నుండి సర్వవాహనాలతో ద్వైతవనంవైపు, సరస్సువైపు పయనించాడు.

240. గంధర్వ దుర్యోధనసేనా సంవాదము.

ఆ తరువాత దుర్యోధననరపాలుడు వనంలో అక్కడక్కడ ఆగుతూ గోశాలల దగ్గరకు చేరి, అక్కడ వసతి ఏర్పాటుచేసికొన్నాడు. దుర్యోధనుని వెంట వస్తున్నవారు కూడా సర్వగుణసంపన్నమై, రమణీయమై, నీటితో చెట్లతో కూడిన పరిచితమైన ప్రదేశంలో గుడారాలు వేసికొన్నారు. అదేవిధంగా దుర్యోధనుని గుడారం దగ్గరే కర్ణునికీ, శకునికీ, దుర్యోధనుని సోదరు లందరికీ కూడా విడివిడిగా చాలా గుడారాలు నిర్మించారు. అప్పుడు వందలు, వేలుగా ఉన్న గోవులను దుర్యోధనుడు చూశాడు. వాటన్నిటిపై ముద్రను, సంఖ్యను వేయించాడు. దూడలను కూడా లెక్కింపజేశాడు. పాల్లిన వాటిని తెలుసుకొన్నారు. లేగదూడలున్న ఆవులనూ లెక్కించారు. ఆ రీతిగా దుర్యోధనుడు గుర్తులు పెట్టించి, పరిగణనను ముగింపజేసి, మూడుసంవత్సరాలు వయసున్న వాటిని ప్రత్యేకంగా గుర్తించి, గోపాలకులతోపాటు ఆనందంగా విహరించసాగాడు. వెంటవచ్చిన పురజనులూ, వేలకొలదిగ ఉన్న సైనికులు తమతమ అభిరుచుల ననుసరించి దేవతలవలె ఆ వనంలో క్రీడించసాగారు. అప్పుడు నృత్యవాదనలలో నేర్పరులు, గాయకులు అయిన కొందరు గోపాలురు, చక్కగా అలంకరించుకొని ఉన్న కన్యలతోపాటు దుర్యోధనుని దగ్గరకు వచ్చారు. తన రాణులతో కలిసి వారిని చూచి దుర్యోధనుడు సంతసించి వారికి డబ్బును, యోగ్యతకు తగినట్లు వివిధాన్నపానాలను సమకూర్చాడు. ఆ తరువాత వారంతా కలిసి సివంగులను, అడవిదున్నలను, గవయమృగాలను, ఎలుగుబంట్లను, అడవిపందులను, ఇతరేతర మృగాలను అన్నిదిక్కుల నుండి వేటాడసాగారు. అరణ్యంలో అందమయిన తావులలో ఆ దుర్యోధనుడు ఎన్నో ఏనుగులను తన బాణాలతో చీల్చాడు. క్రూరజంతువుల నెన్నింటినో పట్టి బంధించాడు. భారతా! దుర్యోధనుడు గోరసాలను ఉపయోగించుకొంటూ, వివిధభోగాలను అనుభవిస్తూ అందమయిన వనాలనూ, ఉపవనాలనూ చూస్తున్నాడు. ఆ తోటలలో, వనాలలో మదించిన తుమ్మెదలు ఝంకారాలు చేస్తున్నాయి. ఇవన్నీ చూస్తూ ముందుకు నడుస్తూ క్రమంగా పవిత్రమైన ద్వైతవన సరస్సు దగ్గరకు వచ్చాడు. మదించిన తుమ్మెదలు తేనెలు గ్రోలుతున్నాయి. నెమళ్ళ కేకలు అంతటా వ్యాపిస్తున్నాయి. ఏడాకుల అరటిచెట్లు ఆ సరోవరాన్ని కప్పుతున్నాయి. పున్నాగ, వకుల వృక్షాలు శోభిస్తున్నాయి.

ఆ సరస్తీరంలో యుధిష్ఠిరుడు ధర్మపత్ని అయిన ద్రౌపదితో కలిసి సాద్యస్కమనే(ఒకే రోజులో పూర్తియగునది) రాజర్షియజ్ఞాన్ని చేస్తున్నాడు. పండితులు, ధీమంతులు, వనవాసులయిన బ్రాహ్మణు లెందరో ఆయనతో ఉన్నారు. కురుసత్తమా! అరణ్యంలో లభించే సామగ్రితో ధర్మజుడు ఆ దివ్యయజ్ఞాన్ని నిర్వర్తిస్తున్నాడు. ఆ సరోవరానికి దగ్గరలోనే

కుటీరాన్ని నిర్మించుకొని ఆయన వసిస్తున్నాడు. భారతా! అప్పుడు దుర్యోధనుడు వేలకొలదిగ క్రీడామండపాలను నిర్మించమని తన సేవకులను ఆదేశించాడు. దుర్యోధనుని ఆజ్ఞానువర్తులయిన వారంతా "అలాగే" అని క్రీడామండపాలను నిర్మించడానికి ద్వైతవనసరస్సు దగ్గరకు వెళ్ళారు. దుర్యోధనుని సేనాధిపతి ద్వైతవనసరస్సుకు దగ్గరగా వెళ్ళాడు. ద్వైతవనద్వారం దగ్గరున్న గంధర్వులు అతనిని అడ్డగించారు. రాజా! అప్పటికే కుబేరవనం నుండి గంధర్వరాజు తన సేవకగణాలతో అక్కడకు వచ్చి ఉన్నాడు. అప్సరసల సమూహాలతో, దేవకుమారులతో కలిసి ఆయన సంచరిస్తున్నాడు. క్రీడావిహారంకోసం ఆయన ఆ సరస్సు చుట్టు ఉన్నాడు. రాజా! గంధర్వరాజు చుట్టూరా ఉన్న సరస్సును చూచి దుర్యోధనుని సేవకులు వెనుదిరిగి దుర్యోధనుని దగ్గరకు వెళ్ళారు. కౌరవ్య(జనమేజయా!) దుర్యోధనుడు తన పరిచారకుల మాటలు విని "గంధర్వులను అక్కడనుండి తరిమివేయం"డని యుద్ధదుర్మదు లయిన సైనికులను పంపించాడు. దుర్యోధనుని ఆజ్ఞను విని సేనాధిపతులు ద్వైతవనసరస్సు దగ్గరకు పోయి గంధర్వులతో ఇలా అన్నారు. 'ధృతరాష్ట్రకుమారుడైన దుర్యోధనమహారాజు బలవంతుడు. విహారార్థం ఇక్కడకు వస్తున్నాడు. కాబట్టి మీరు తొలగిపొండి.' రాజా! ఆ మాటలు విని, గంధర్వులు నవ్వుతూ దుర్యోధనుని సేనాధిపతులకు పరుషవచనాలతో ఇలా బదులిచ్చారు. 'మీరాజు సుయోధనుడు బుద్ధిహీనుడు. కొంచెంకూడా జ్ఞానం లేదు. కాబట్టియే దేవతలమైన మమ్ము వైశ్యులను శాసించినట్టు శాసిస్తున్నాడు. మీరు కూడా బుద్ధిహీనులే. అనుమానం లేదు. చావదలచుకొన్నట్టుంది. కాకపోతే ఆయన మాటమేరకు తెలివిలేకుండా మాతో ఇలా అంటారా? మీరంతా వెంటనే దుర్యోధనరాజు దగ్గరకు వెళ్లిపోండి. లేదా నేడే యమధర్మరాజుఇంటికి వెళ్ళవలసి వస్తుంది.' గంధర్వ లలా అనగానే దుర్యోధనుని సేనాధిపతులు దుర్యోధనుని దగ్గరకు వచ్చి చేరారు.

241. కౌరవులు గంధర్వులతో యుద్ధము చేయుట, కర్ణుని పరాజయము.

వారంతా ఒక్కుమ్మడిగా దుర్యోధనుని దగ్గరకు వచ్చి, గంధర్వరాజు దుర్యోధనునకు చెప్పమన్న మాటలన్నీ చెప్పారు. దుర్యోధనుడు కోపంతో నిండిపోయి సేనలను ఇలా ఆదేశించాడు. 'దేవతలందరితో కలిసి దేవేంద్రుడే వచ్చి ఇక్కడ విహరించినా, వారు కూడా నాకు నచ్చని పనిచేసినట్లే. వెళ్ళండి. ఆ అధర్మపరుల్ని శిక్షించండి.' దుర్యోధనుని మాటవిని మహాబలులయిన ధార్తరాష్ట్రులు, వేలకొలదిగ ఉన్న సైనికులు అందరూ యుద్ధానికి సన్నద్ధు లయ్యారు. పెద్దపెద్ద సింహనాదాలతో దశదిక్కులనూ నింపుతూ వారు గంధర్వులను మథించి బలపూర్వకంగా ద్వైతవనంలో ప్రవేశించారు. రాజా! అపుడు మరికొందరు

గంధర్వులు కురుసైనికులను మంచి మాటలతోనే వారించారు. వారు వారిస్తున్నా కూడా లెక్కచేయక కౌరవసేనలు ఆ మహావనంలో ప్రవేశించాయి. దుర్యోధనుడు, ఆయన సేనలు మాటలతో ఆగకపోయినందువలన గంధర్వులు ఆ విషయాన్ని చిత్రసేనునికి నివేదించారు. చిత్రసేనుడు తీవ్రంగా కోపించి "ఆ దుర్మార్గులను శిక్షించండి" అని కౌరవదండనకు ఆదేశించాడు. చిత్రసేనుని ఆదేశాన్ని అనుసరించి గంధర్వులు ఆయుధాలు చేతబట్టి, ధార్తరాష్ట్రులందరిపై దాడిచేశారు. ఆయుధాలు పైకెత్తి మీద పడుతున్న గంధర్వులను చూసి, కౌరవులందరూ దుర్యోధనుడు చూస్తుండగానే అన్నిదిక్కులకూ పరుగెత్తారు.

వెనుదిరిగి కౌరవు లందరూ పరుగెత్తడం చూచి కూడా వీరుడయిన కర్ణు డొక్కడే వెన్నుచూపక నిలిచాడు. మీదపడుతున్న గంధర్వుల మహాసైన్యాన్ని తేరిపారజూసి కర్ణుడు బాణాలజడివానతో దానిని నివారించాడు. కర్ణుడు హస్తలాఘవంతో క్షురప్రాలను, బాణాలను, భల్లాలను, వత్సదంతాలనే లోహబాణాలను ప్రయోగించి వందలకొలది గంధర్వులను చంపాడు. మహారథుడైన కర్ణుడు గంధర్వుల తలలను పడగొడుతూ క్షణకాలంలో చిత్రసేనుని సేనను చిన్నాభిన్నం చేశాడు. ధీమంతుడైన కర్ణుడు గంధర్వులను చంపుతుంటే మరల వందలవేల గంధర్వులు కర్ణుని కెదురు నిలువసాగారు. మహావేగంతో వచ్చిపడుతున్న చిత్రసేనుని సేనలతో క్షణకాలంలో భూమండలం గంధర్వమయ మైనది. అపుడు దుర్యోధననరపతి, శకుని, దుశ్శాసనుడు, వికర్ణుడు, ధృతరాష్ట్రుని ఇతర కుమారులు గరుడునివలె భీకరధ్వని చేస్తున్న రథాలనెక్కి ఆ సేనను సంహరించారు. కర్ణుని ముందుంచుకొని మరల గంధర్వుల నెదిరించారు. లెక్కలేనన్ని రథసమూహాల విచిత్రగతితో కర్ణుని రక్షించుకొంటూ గంధర్వులపై బాణాలను కురిపించారు. గంధర్వ లంతా ఒక్కుటై కౌరవులపై పడ్డారు. అపుడు రోమాలు నిక్కపొడుచుకొనేంత భయంకరయుద్ధం జరిగింది. బాణాలతాకిడికి గంధర్వులు డీలా పడిపోయారు. గంధర్వులు బాధపడుతుంటే చూచి కౌరవులు పెడబొబ్బలు పెట్టారు. గంధర్వులు భయపడి వెనుకంజవేయటం చూసి చిత్రసేనుడు అసహనంతో తీవ్రంగా కోపించి, కౌరవులను చంపగోరి, ఆసనం నుండి ఎగిరి క్రిందికి ఉరికాడు. అపుడు విచిత్రయుద్ధపద్ధతులు తెలిసిన చిత్రసేనుడు మాయాస్త్రాన్ని ప్రయోగించాడు. చిత్రసేనుని మాయతో కౌరవులంతా మూర్ఛిల్లారు.

అపుడు దుర్యోధనుని ఒక్కొక్క సైనికుని పదిమంది గంధర్వులు చుట్టుముట్టారు. రాజా! చిత్రసేనుని ఆ మహాసైన్యం బాధపెడుతుంటే గెలవాలని వచ్చిన ఆ కౌరవసేనలు రణభయంతో పరుగులు పెట్టాయి. కౌరవసేనలు అన్నిదిక్కులకూ పారిపోతుంటే సూర్యసుతుడైన కర్ణుడు మాత్రం కొండలా నిశ్చలంగా నిలిచాడు. రణంలో తీవ్రంగా

గాయపడి కూడా దుర్యోధనుడు, కర్ణుడు, శకుని గంధర్వులతో పోరాడుతూనే ఉన్నారు. గంధర్వులంతా గుమిగూడి కర్ణుని చంపాలనే వ్యూహంతో వందలుగా, వేలుగా గుంపులుగా విడిపోయి రణభూమిలో కర్ణుని ఎదిరించారు. ఆ మహాబలులు కర్ణునిచంపగోరి కత్తులతో, పట్టిశాలతో, శూలాలతో, గదలతో కర్ణుని చుట్టుముట్టి మోదసాగారు. కొందరు రథం కాడిని విరగగొట్టారు. కొందరు ధ్వజాన్ని పడగొట్టారు. కొందరు నొగలు విరుగగొట్టారు. కొందరు గుర్రాలను పడగొట్టారు. ఇతరులు సారథిని పడగొట్టారు. ఇతరులు గొడుగును, కవచాన్ని, ఇరుసులను విరుగగొట్టారు. వేలకొలదిగ ఉన్న గంధర్వులు రథాన్ని నుగ్గు నుగ్గు చేశారు. అపుడు కర్ణుడు కత్తిని, డాలునూ పట్టుకొని తనరథం నుండి దూకి, వికర్ణుని రథాన్ని ఎక్కి, ఆత్మరక్షణకై గుఱ్ఱాలను వేగంగా తోలాడు.

242. గంధర్వులు దుర్యోధనాదులను అపహరించుట.

మహారాజా! మహారథుడైన కర్ణుని గంధర్వులు భంగపరచారు. దుర్యోధనుడు చూస్తుండగానే సైన్యమంతా పారిపోయింది. ధార్తరాష్ట్రులందరూ వెనుదిరిగి పారిపోతున్నా దుర్యోధనమహారాజు మాత్రం అక్కడ వెనుకంజవేయలేదు. మిక్కిలిగా ఉన్న ఆ గంధర్వసైన్యం మీద పడుతుంటే చూసి, అరిందముడైన దుర్యోధనుడు బాణాల జడివానను కురిపించాడు. బాణవర్షాన్ని లెక్కచేయకుండా గంధర్వులు దుర్యోధనుని చంపదలచి, ఆయన రథాన్ని చుట్టుముట్టారు. రథంకాడిని, నొగలును, కవచాన్ని, ధ్వజాన్ని, సారథిని, గుర్రాలను, గొడుగును, తల్పాన్నీ బాణాలతో నుగ్గుచేశారు. దుర్యోధనుడు రథంనుండి జారి నేలపై పడిపోగా, మహాబాహువైన చిత్రసేనుడు వేగంగా వచ్చి దుర్యోధనుని ప్రాణాలతో పట్టుకొన్నాడు. దుర్యోధనుడు పట్టుపడగానే గంధర్వులు రథంపై నున్న దుశ్శాసనుని అన్నివైపులనుండి దాడిచేసి పట్టుకొన్నారు. కొందరు గంధర్వులు వివింశతిని, చిత్రసేనుని (దుర్యోధనుని సోదరుడు) బంధించి తీసికొనిపోయారు. మరికొందరు విందానువిందులను, రాజస్త్రీలను అదుపులోనికి తీసికొన్నారు. గంధర్వులు ధార్తరాష్ట్రుని సేనను తరిమికొట్టారు. వారూ, అంతకుముందే గాయపడి పారిపోయి ఉన్నవారూ అందరూ కలిసి అప్పుడు పాండవుల శరణు కోరారు. దుర్యోధనుడు బంధింపబడగానే శకటాలు, ఆపణాలు, గుడారాలు, బండ్లు, వాహకాలు(ఎద్దు మొ।) మొత్తం వెంట బెట్టుకొని కౌరవసేనలు పాండవుల శరణుకోరారు. సైనికులిలా అన్నారు. ప్రియదర్శి, మహాబాహువు, మహాబలుడు అయిన దుర్యోధననరపాలుని అపహరించుకొని పోతున్నారు గంధర్వులు. కౌంతేయులు – మీరు – వారిని వెంటాడాలి. గంధర్వులు దుఃశాసనుని, దుర్విషహుని, దుర్ముఖుని, దుర్జయుని,

రాజస్త్రీలనందరినీ బంధించి తీసికొని పోతున్నారు. రాజును కాపాడుకోవాలని ఆరాటపడుతున్న దుర్యోధనమంత్రు లందరూ ఆర్తులై, దీనులై పైరీతిగా విలపిస్తూ యుధిష్ఠిరుని చెంతచేరారు. దుర్యోధనుని వృద్ధమంత్రులు ఆ రీతిగా బాధపడుతూ దీనంగా ధర్మరాజును అభ్యర్థించగా భీమసేనుడు వారితో ఇలా అన్నాడు.

"ఏనుగులను, గుర్రాలను సిద్ధం చేసికొని ఎంతో ప్రయత్నంతో మేము చేయవలసిన కాగలకార్యం గంధర్వులే చేశారు. ఏదో చేయాలనుకొంటే మరేదో జరిగింది. కపటద్యూత మాడే దుర్యోధనమహారాజు ఆలోచనలో దారి తప్పాడు. విఫల మయ్యాడు. బలహీనుని ద్వేషించేవానిని మరొకరు పడగొడతారని విని యున్నాం. అలౌకికపరాక్రమంతో గంధర్వులు ఇప్పుడు కళ్ళకు కట్టి చూపారు. మాభాగ్యం వలన లోకంలో ఒక్కడైనా మావైపు మొగ్గేవాడు కనిపించాడు. మా బరువును దించాడు. సుఖంగా కూర్చొనే వీలు కల్పించాడు. మేము చలి, గాలి, ఎండలను భరిస్తున్నాం. తపస్సుతో కృశించిపోయాం. విషమస్థితిలో ఉన్నాం. అయినా దుర్మార్గుడైన దుర్యోధనుడు సుఖంగా ఉంటూ కూడా దుర్దశలో ఉన్న మమ్ము చూడాలనుకొన్నాడు. దురాత్ముడు, అధర్మప్రవర్తకుడు అయిన దుర్యోధనుని మార్గాన్ని అనుసరించే వారంతా పరాభవాన్ని పొందుతారు. ఘోషయాత్ర చేయమని దుర్యోధనునకు సలహా ఇచ్చినవాడు అధర్మం చేసినట్లే. కౌంతేయులు క్రూరులు కారు. ఇది మీ ఎదుటనే చెప్తున్నా.' కుంతీనందనుడైన భీమసేనుడు విలక్షణస్వరంతో ఈరీతిగా మాటాడుతుండగా "ఇది పరుషవాక్యాలకు సమయం కాదు" అని ధర్మరాజు పలికాడు.

243. దుర్యోధనుని విడిపించుటకు భీమసేనుని ఆదేశించుట - అర్జునుడు ప్రతిజ్ఞ చేయుట.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'నాయనా! కౌరవులు భయపడి, శరణుకోరి, మన దగ్గరకు వచ్చారు. కష్టాలలో ఉన్నారు. అటువంటి వారితో ఈ విధంగా ఎలా మాటాడగలుగుతున్నావు? వృకోదరా ! జ్ఞాతుల మధ్య భేదాలు, కలహాలు సహజమే. శత్రుత్వాలు ఏర్పడుతుంటాయి. కానీ వంశధర్మం నశించదు ఎప్పుడైనా బయటివాడెవడో వచ్చి వంశస్థులపై ఆక్రమణ చేస్తే సత్పురుషులు దాన్ని – బయటివారు వచ్చిపైబడటాన్ని – సహించరు.

(ఇతరులు అవమానిస్తుంటే మనం నూట అయిదుగురం. మనలో మనకు వైరుధ్యమేర్పడితే మనం అయిదుగురం, వారు నూర్గురు.)

ఈ దుర్మార్గుడికి(చిత్రసేనుడికి) మనం చాలా రోజులుగా ఈ ప్రాంతంలోనే

ఉంటున్నామని తెలుసు. అయినా మనలను తిరస్కరించి మనకు నచ్చని ఈ పని చేశాడు. భీమా! గంధర్వుడు దుర్యోధనుని బలాత్కారంతో బంధించటం వలనా, పరాయివారెవరో కురుకుల కాంతలను అపహరించటం వలనా మనవంశ ప్రతిష్ఠ నశించిపోతుంది. నరోత్తములారా! శరణుకోరినవారిని కాపాడటానికీ, కులప్రతిష్ఠను నిలపటానికీ లేవండి. ఆలస్యం చేయకుండా సిద్ధంకండి. నరోత్తములారా! అర్జునుడు, నకులసహదేవులు, ఓటమినెరుగని నీవు – అందరూ కలిసి గంధర్వులు కొనిపోతున్న సుయోధనుని విడిపించండి. నరోత్తములారా! ఇవిగో ధృతరాష్ట్రకుమారుల ఈ రథాలు కాంచనధ్వజాలతో నిర్మలంగా ఉన్నాయి. అన్ని శస్త్రాలతో నిండి ఉన్నాయి. ఇంద్రసేనుడు మొదలయిన యుద్ధనిపుణులయిన సూతులచే అధిష్ఠింపబడి, సర్వదా సన్నద్ధంగా ఉన్నాయి. ఇవి వెడుతుంటే గొప్ప సవ్వడి వస్తుంది. ఈ రథాలను ఎక్కండి. వీటినెక్కి రణరంగంలో అలసట లేకుండా గంధర్వులతో పోరాడి సుయోధనుని విడిపించండి. భీమసేనా! సాధారణ రాజయినా శరణుకోరి దగ్గరకు వచ్చిన వానిని శక్తినంతా ఒడ్డి, రక్షిస్తాడు. నీవు శరణాగతుని రక్షించాలని మరలా చెప్పాలా ?

(వైశంపాయనుడిలా అన్నాడు – ధర్మరాజు అలా పలుకగానే భీమసేనునికి కోపంతో కన్నులు ఎర్రబడ్డాయి. పూర్వశత్రుత్వాన్ని తలచుకొంటూ మరలా ఇలా అన్నాడు. 'వీరా! యుధిష్ఠిరా! గతంలో మనలనందరినీ లక్క్యింటిలో తగులబెట్టాలని దురాలోచన చేసిన వాడితడు. కాని దైవం మనలను కాపాడింది. భారతా! మహారాజా! నా భోజనంలో శక్తిమంతమైన కాలకూటవిషాన్ని కలిపి, తీగెలతో బంధించి, గంగలోనికి త్రోశారు. కౌంతేయా! జూదమాడిన వేళలో కూడా ఎన్నో పాపాలు చేశారు. ద్రౌపదిని పట్టి లాగారు. జుట్టుపట్టుకొన్నారు. నిండుకొలువులో వస్త్రాపహరణం చేశారు. నాడు చేసిన పాపాల ఫలితాన్ని అనుభవిస్తున్నాడు సుయోధనుడు. కానీ మరెవరో మనతో మైత్రిని కోరుతూ ఆ పని చేశారు. గంధర్వుడు మనకు మేలే చేశాడు. రాజా! కోపించవద్దు.' ఆ సమయంలోనే చిత్రసేనుడు అపహరించుకొనిపోతున్న దుర్యోధనుడు మిక్కిలి దుఃఖంతో విలపించాడు. దుర్యోధనుడిలా అన్నాడు. 'పాండుకుమారా! మహాబాహూ! పురువంశకీర్తికారకా! ధర్మవేత్తలలో శ్రేష్ఠుడా! పురుషవ్యాఘ్రా! యుధిష్ఠిరా! మహాయశస్వీ, నీ సోదరుని నన్ను రక్షించు. ఈ గంధర్వుడు నన్ను బంధించి కొనిపోతున్నాడు. ఈ గంధర్వులు దుఃశాసనుని, దుర్విషహుని, దుర్ముఖుని, దుర్జయుని, నా భార్యల నందరినీ కూడా బంధించి కొనిపోతున్నారు. పురుషోత్తములారా! వారిని వెంబడించండి. నన్ను త్వరగా రక్షించండి. మహాబాహూ వృకోదరా! కీర్తిశాలీ అర్జునా! నకులసహదేవులారా! ఆయుధాలతో నావెంట పరుగెత్తండి. నన్ను రక్షించండి. కురువంశానికి ఈ రీతిగా గొప్ప అపకీర్తి కలిగింది. పాండు కుమారులారా ! మీ పరాక్రమంతో గంధర్వులను జయించి అపకీర్తిని తొలగించండి. వైశంపాయనుడిలా అన్నాడు. ఈరీతిగా దీనస్వరంలో విలపిస్తున్న సుయోధనుని విలాపాన్ని విని, జాలితో తడిసిపోయిన ధర్మరాజు భీమసేనునితో మరలా ఇలా అన్నాడు.)

'చేతులు జోడించి, శరణుగోరి "పరుగెత్తండి! రక్షించండి" అని ప్రార్థిస్తే అతడు శత్రు వయినా సరే, రక్షించటానికి ప్రయత్నించని పురుషు డెవ డుంటాడు? పాండవులారా! వరప్రదానం, రాజ్యప్రదానం, పుత్రుని కల్గించటం, శత్రువును ఇబ్బందులలో నుండి రక్షించటం - ఈ నాలుగింటిలో మొదటి మూడింటితో నాలుగవది సమానం. భీమా! నీకింతకన్నా ఆనందించదగిన దేముంటుంది? సుయోధనుడు ఆపదలలో చిక్కి, నీ బాహుబలాన్ని ఆసరా చేసికొని, ప్రాణాలు కాపాడుకోవాలనుకొంటున్నాడు. భీమసేనా! ఈ యజ్ఞాన్ని ఉపక్రమించకుండా ఉంటే దుర్యోధనుని రక్షించటానికి నేనే వెళ్ళిఉండేవాణ్ణి. మరొక ఆలోచన చేసేవాడిని కాదు. కురునందనా! భీమా! మంచిమాటలతోనే ఎలాగైనా సరే, సుయోధనుని విడిపించటానికి ప్రయత్నించు. సర్వోపాయాలతో అలాగే ప్రయత్నం చేయి. మంచిమాటలతో ప్రయత్నిస్తే ఆ గంధర్వరాజు వినకపోతే మార్దవంతో కూడిన పరాక్రమంతో సుయోధనుని విడిపించు. భీమా! మృదుపరాక్రమంతో యుద్ధంచేసినా కౌరవులను చిత్రసేనుడు విడువకపోతే సర్వోపాయాలను ఆశ్రయించి, శత్రువులను బంధించి కౌరవులను విడిపించాలి. ప్రస్తుతం నేను యజ్ఞకర్మలో ఉన్నాను. కాబట్టి ఇంతమాత్రమే చెప్పగలను.' అజాతశత్రు వయిన ధర్మజుని మాట విని అర్జునుడు అన్నమాట మేరకు కౌరవులను విడిపించటానికి ప్రతిజ్ఞ చేశాడు. అర్జునుడిలా అన్నాడు. మంచిమాటలతో గంధర్వులు ధార్తరాష్ట్రులను విడువకపోతే నేడు పృథివి ఆ గంధర్వరాజు నెత్తురు త్రాగుతుంది. రాజా! సత్యవచనుడైన అర్జునుని ప్రతిజ్ఞ విని, కౌరవుల మనస్సులు కుదుటబడ్డాయి.

244. పాండవ గంధర్వ సంగ్రామము.

యుధిష్ఠిరుని మాట విని భీమసేనుడు మొదలుగాగల నరశ్రేష్ఠులైన పాండవు లందరూ తృప్తినిండిన ముఖాలతో యుద్ధానికి సన్నద్ధులయ్యారు. ఆ మహారథు లందరూ స్వర్ణమయమై విచిత్రశోభాకర మయిన అభేద్యకవచాలను ధరించారు. నానాదివ్యాయుధాలనూ, కవచాలను ధరించి, రథాలనెక్కి, ధ్వజాలతో, ధనుస్సులతో ప్రకాశిస్తున్న పాండవులు ప్రజ్వరిల్లే అగ్నిలా కనిపించారు. రథాలకు వేగంగా దౌడుతీసే గుర్రాలను పూన్చారు. అవసరమైన సామగ్రితో రథాలు నిండుగా ఉన్నాయి. అటువంటి రథాలనెక్కి రథికశ్రేష్ఠ లయిన పాండవులు త్వరగా వెళ్ళిపోయారు. అప్పుడు కౌరవసేనలు పెద్దగా గర్జించాయి. మహారథులైన పాండుపుత్రులు సన్నద్ధులై ఒక్కటిగా రావటం చూసి మహారథులు, విజయశోభావంతులు అయిన గంధర్వులు తీవ్రవేగంతో, క్షణకాలంలో నిర్భయంగా వనంలో గుమిగూడారు. విజయకాంక్షతో ప్రకాశిస్తున్న ఆ గంధర్వ లందరూ శత్రువుల

నెదిరించటానికి వెనుదిరిగి నిలిచారు. రథాల నెక్కి యుద్ధానికి వచ్చిన నలుగురు పాండవులను చూశారు. వారు లోకపాలకుల వలె ప్రకాశిస్తున్నారు. వారిని చూసి గంధమాదననివాసులైన గంధర్వులు వ్యూహాత్మకంగా నిలిచారు. భారతా! యమసుతుడూ, ధీమంతుడూ అయిన ధర్మరాజు మాటను స్మరించి పాండవులు మృదువుగా యుద్ధానికి ఉపక్రమించారు. కాని బుద్ధిహీనులయిన గంధర్వరాజసేనలు సున్నితంగా యుద్ధం జరిగితే లొంగివచ్చేటట్లు కనిపించలేదు. అప్పుడు పరంతపుడయిన అర్జునుడు యుద్ధంలో దుర్జయులైన గంధర్వులను చూసి అనునయపూర్వకంగా "మా సోదరుని సుయోధనమహారాజును విడిచిపెట్టండి" అని పలికాడు.

కీర్తిశాలి అయిన అర్జునుడు అలా అనగానే గంధర్వులు నవ్వుతూ అర్జునునితో ఇలా అన్నారు.

'నాయనా! లోకంలో మేము ఒక్కరి మాటనే వింటాం. ఆ ఒక్కరి మాటను శిరసావహించి నిశ్చింతంగా తిరుగుతున్నాం. భారతా! ఆ ఒక్కరు ఎలా ఆదేశిస్తే అలాగే ప్రవర్తిస్తాం. ఆయనే దేవతాశ్రేష్ఠుడైన చిత్రసేనుడు. ఆయన తప్ప మరెవ్వరూ మమ్ము శాసించలేరు.' గంధర్వులు అలా పలుకగానే కుంతీనందనుడైన అర్జునుడు ఆగంధర్వులతో మరలా ఇలా అన్నాడు. 'పరదారలను అపహరించటం, మానవులతో యుద్ధానికి దిగటం ఇటువంటి నీచపుపనులు గంధర్వరాజునకు తగవు. ధర్మరాజు ఆజ్ఞమేరకు మీరు మహాపరాక్రమశాలులైన ధృతరాష్ట్రకుమారులను, వారి భార్యలను విడిచిపెట్టండి. గంధర్వులారా! మంచిమాటలతో ధార్తరాష్ట్రులను మీరు వదలకపోతే నేను స్వయంగా పరాక్రమించి, సుయోధనుని విడిపిస్తాను.' అని పలికి సవ్యసాచీ, కుంతీనందనుడూ అయిన అర్జునుడు వాడిబాణాలను విడివిడిగా గంధర్వసమూహాలపై ప్రయోగించాడు. అదేవిధంగా బలోన్మత్తులైన గంధర్వులు బాణాలవాన కురిపిస్తూ పాండవులకు ఎదురు నిలిచారు. పాండవులు కూడా గంధర్వులను ఎదిరించారు. అప్పుడు బలసంపన్నులైన గంధర్వులకు, తీవ్రవేగం గల పాండవులకు మధ్య భీకరయుద్ధం జరిగింది.

245. పాండవుల చేతిలో గంధర్వులు ఓడిపోవుట.

అప్పుడు సువర్ణహారాలు ధరించి, దివ్యాస్త్రసంపన్నులైన గంధర్వులు కాంతిమంతమయిన బాణాలను వదలుతూ పాండవులను చుట్టుముట్టారు. వీరపాండవులు నలుగురే. గంధర్వులు వేలకువేలు. వీరందరూ పాండవులపై పడ్డారు. అది అద్భుతంగా కనిపించింది. కర్ణుని రథాన్ని, సుయోధనుని రథాన్ని వందలముక్కలుగా విరిచినట్లు

గంధర్వులు పాండవుల రథాలను కూడా ముక్కలు చేయబూనారు రాజా వందలకొలదిగ గంధర్వులు మీద పడుతుంటే నరశ్రేష్ఠులైన పాండవులు శరవర్షంతో చాలామందిని నిరోధించారు. అన్నివైపులనుండి బాణాలు వచ్చి మీదపడుతుంటే గంధర్వులు పాండవుల సమీపానికి కూడా రాలేకపోయారు. గంధర్వులు కోపోద్రిక్తులై ఉండటం చూసి అర్జునుడు కూడా కోపంతో గొప్పగొప్ప దివ్యాస్త్రాలను వారిపై ప్రయోగింపసాగాడు. బలిష్ఠుడైన అర్జునుడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించి, లక్షమంది గంధర్వులను యమలోకానికి పంపించాడు. అదేరీతిగా బలవంతులలో శ్రేష్ఠుడు, మహాధానుష్కుడు అయిన భీమసేనుడు కూడా వాడిబాణాలతో వందల కొద్దీ గంధర్వులను చంపాడు రాజా! బలోన్మత్తు లయిన నకులసహదేవులు కూడా అదేవిధంగా యుద్ధంచేస్తూ వందలకొలది శత్రువులను ముందునుంచి పట్టుకొని, చంపారు. మహారథుల దివ్యాస్త్రాల తాకిడికి తట్టుకొనలేక గంధర్వులు ధార్తరాష్ట్రులను తీసికొని ఆకాశానికి ఎగిరిపోయారు.

పైకెగిరిపోతున్న ఆ గంధర్వులను చూచి కౌంతేయుడైన అర్జునుడు గొప్పబాణసమూహంతో వారిని అన్నివైపులా నిరోధించాడు. పంజరంలో చిక్కిన పక్షులవలె గంధర్వులు బాణాలమధ్య చిక్కి, కోపంతో అర్జునునిపై గదలను శక్తులను ఋష్టులను కురిపించారు పరమాస్త్రవేత్త అయిన అర్జునుడు గద శక్తి, ఋష్టుల ఆ వానను నివారించి భల్లాలతో గంధర్వుల శరీరాలను గాయపరిచాడు అప్పుడు రాళ్ళవాన కురుస్తున్నట్లు గంధర్వుల తలలు చేతులు, కాళ్ళు తెగిపడుతున్నాయి. గంధర్వులకు చాలా భీతి కల్గింది. మహాత్ముడైన అర్జునుడు గంధర్వులను చంపుతుంటే వారు గగనచారులై, నేలపైనున్న అర్జునునిపై బాణవృష్టిని కురిపించారు. తేజస్వి పరంతపుడైన అర్జునుడు వారి బాణవర్షాలను తన అస్త్రాలతో నివారించి, గంధర్వులను గాయపరిచాడు. కురుకుమారుడయిన అర్జునుడు స్థూణాకర్ణం, ఇంద్రజాలం, సౌరం, ఆగ్నేయం సౌమ్యం - అనే అస్త్రాలను ప్రయోగించాడు. ఇంద్రుడు రాక్షసులను దహించినట్లు అర్జునుడు బాణాలతో గంధర్వులను దహిస్తుండగా, వారు తీవ్రవిషాదాన్ని పొందారు. గంధర్వులు పైపైకి వెళ్ళబోతుంటే అర్జునుడు శరసమూహంతో నివారించాడు వారు అటు ఇటు పరువెత్తబోతే అర్జునుడు భల్లాలతో నివారించాడు. భారతా! అర్జునుడు గంధర్వులను భయపెట్టడం చూసి, చిత్రసేనుడు గదను చేతబట్టి అర్జునునిపై కురికాడు. గదను చేతబట్టి చిత్రసేనుడు రణభూమిలోని కురకగానే అర్జునుడు తన బాణాలతో లోహమయమైన ఆ గదను ఏడుముక్కలుగా విరగగొట్టాడు.

వేగశాలి అయిన అర్జునుడు తనగదను ముక్కలు ముక్కలు చేయటం చూసి,

చిత్రసేనుడు అదృశ్యరూపుడై యుద్ధాని కుపక్రమించాడు. అప్పుడు చిత్రసేనుడు ప్రయోగించిన దివ్యాస్త్రాల నన్నింటిని వీరుడైన అర్జునుడు తన దివ్యాస్త్రాలతో నివారించాడు. మహాత్ముడైన అర్జునుడు తన అస్త్రాలను నిరోధించగా, బలవంతుడైన గంధర్వరాజు (చిత్రసేనుడు) అదృశ్య మయ్యాడు. చిత్రసేనుడు మాయమై దెబ్బతీస్తుంటే అర్జునుడు ఆకాశంలో సంచరించగల దివ్యాస్త్రాలను అభిమంత్రించి, అతనిపై ప్రయోగించాడు. అర్జునుడు రణభూమిని మొత్తం ఆక్రమిస్తూ బహురూపుడుగా కనిపించాడు. ఆ ధనంజయుడు కోపించి శబ్దవేధ విద్యను ఆశ్రయించి చిత్రసేనుని అంతర్ధాన విద్యను నశింపజేశాడు. మహాత్ముడైన అర్జునుని బాణాలదెబ్బలు తిని చిత్రసేనుడు తన ప్రియసఖుడైన అర్జునుని ఎదుట నిజరూపంతో నిలిచాడు. "అర్జునా! ఈ యుద్ధం చేస్తున్న నన్ను నీ మిత్రుడైన చిత్రసేనునిగా గ్రహించు' అన్నాడు చిత్రసేనుడు. అప్పుడు యుద్ధంలో గాయపడి, దుర్బలుడై ఉన్న మిత్రుని చిత్రసేనుని గమనించి, అర్జునుడు ఎక్కుపెట్టిన దివ్యాస్త్రాన్ని ఉపసంహరించాడు అర్జునుడు అస్త్రాల నుపసంహరించటాన్ని చూసి, పాండవులంతా పరుగుపెడుతున్న తమగుర్రాలను నిలువరించి ధనుర్బాణాలను కట్టిపెట్టారు. చిత్రసేనుడు, భీముడు, అర్జునుడు, నకులసహదేవులు పరస్పరం కుశలప్రశ్నలు వేసికొని రథాలపైనే నిలచారు

246. దుర్యోధనుడు విడుదల అగుట.

ఆపై మేటి విలుకాడు, మేటివన్నెకాడు అయిన అర్జునుడు గంధర్వసేనలమధ్య నిలిచి, నవ్వుతూ, చిత్రసేనునితో ఇలా అన్నాడు. 'వీరుడా! కౌరవులను బంధించటంలో నీ భావమేమిటి? రాణులతో సహా సుయోధనుని ఎందుకు బంధించావు?' చిత్రసేనుడిలా అన్నాడు 'అర్జునా దురాత్ముడయిన ఈ దుర్యోధనుడు, పాపాత్ముడైన ఈ కర్ణుడు చేస్తున్న దురాలోచనను దేవేంద్రుడు గ్రహించాడు మీరు అనాధలవలె అరణ్యంలో సంచరిస్తూ, కష్టాలుపడుతూ, విషమస్థితిలో ఉండగా ఆ స్థితిలో మిమ్ములను చూడాలని, బాధించాలని హాయిగా ఉన్న ఈ సుయోధనుడు భావించాడు. కీర్తిశాలిని అయిన ద్రౌపదిని గేలిచేయాలని వీరు వచ్చారు వీరు చేయనెంచిన పనిని గ్రహించి, దేవేంద్రుడు నన్ను ఇలా ఆదేశించాడు. 'వెళ్లు! దుర్యోధనుని మంత్రులతో సహా బంధించి ఇక్కడకు తీసికొనిరా! అర్జునుని, అతని సోదరులను కూడా రక్షించాలి. ఆ అర్జునుడు నీకు ప్రియమిత్రుడు, శిష్యుడు కూడా." దేవేంద్రుని ఆదేశాన్ని అనుసరించి వెంటనే ఇక్కడకు వచ్చాను ఈ దుర్యోధనుని బంధించాను. ఇక స్వర్గానికి వెళతాను. దేవేంద్రుని శాసనం మేరకు ఈ దుర్మార్గుణ్ణి స్వర్గలోకానికి తీసికొనిపోతాను. అర్జునుడిలా అన్నాడు. 'చిత్రసేనా! ఈ దుర్యోధనుడు

మా సోదరుడు. నాకు నచ్చినపని చేయాలనుకొంటే, ధర్మరాజు ఆదేశం మేరకు ఇతనిని విడిచిపెట్టు.' చిత్రసేనుడిలా అన్నాడు. 'అర్జునా! ఈ పాపాత్ముడు రాజ్యభోగాల ననుభవిస్తూ ఆనందంతో పోతరించి ఉన్నాడు. ధర్మజుని, ద్రౌపదిని కూడా మోసగించిన ఇతనిని విడిచిపెట్టకూడదు. ధర్మరాజుకు సుయోధనుని ఈ దురాలోచన తెలియదు. దీనిని విన్నావు గదా! ఎలా నచ్చితే అలా చేయి.' వారంతా ధర్మరాజు దగ్గరకు వెళ్ళారు. దుర్యోధనుని దుశ్చర్యల నన్నింటినీ వివరించారు

అజాతశత్రువు(ధర్మరాజు) ఆ గంధర్వవచనాన్ని విని కౌరవుల నందరినీ విడిపించాడు. గంధర్వులను ఇలా ప్రశంసించాడు. 'మీరంతా బలవంతులు, శక్తిసంపన్నులు. అయినా దుర్మార్గుడైన ఈ దుర్యోధనుని అమాత్యులు, సోదరులు, బంధువులతో సహా మీరు హింసించకపోవటం అదృష్టం. నాయనా! గగనచారు లయిన మీరు నాకెంతో ఉపకారం చేశారు. ఈ దుర్మార్గుని విడిపించారు మా వంశానికి పరాభవాన్ని నిలవరించారు. మేమేం చేయాలో ఆజ్ఞాపించండి మీ దర్శనంతో ఆనందిస్తున్నాం. మీకు నచ్చిన వాటినన్నింటినీ స్వీకరించి ఇక్కడ నుండి త్వరగానే వెళ్ళవచ్చు.' ధీమంతుడైన ధర్మరాజు అనుమతిని గైకొని, చిత్రసేనాది గంధర్వులు అప్సరసలతో సహా నిష్క్రమించారు.

(ఆపై చిత్రసేనుడు గంధర్వులతో కలిసి దేవలోకానికి వెళ్ళి, జరిగినదంతా ఇంద్రునకు తెలియజేశాడు)

దేవేంద్రుడు కౌరవులతో యుద్ధం చేస్తూ మరణించిన గంధర్వుల నందరినీ దివ్యామృతవర్షంతో మళ్ళీ బ్రతికించాడు. ఈ రీతిగా జ్ఞాతులను, రాజకులస్త్రీలను అందరిని విడిపించి, అసాధారణమైన పని చేయగలిగినందులకు పాండవులంతా ఆనందించారు. మహాత్ములు, మహారథులైన ఆ పాండవులను స్త్రీబాలకులతో సహా కౌరవు లందరూ పూజించారు. యాగమధ్యంలోని అగ్నులవలె పాండవులు ప్రకాశించారు. అప్పుడు సోదరులతో కలిసి ధర్మరాజు బంధవిముక్తుడైన దుర్యోధనునితో ప్రేమగా ఇలా అన్నాడు. **'భారతా! మరల ఎప్పుడు ఇటువంటి సాహసం చేయవద్దు. సాహసికులకు సుఖ ముండదు.*** కురునందనా! నీ సోదరులతో కలిసి క్షేమంగా, స్వేచ్ఛగా ఇంటికి వెళ్ళు. మనస్సులో ఎమీ పెట్టుకోవద్దు.' వైశంపాయనుడిలా అన్నాడు. ధర్మరాజు అనుమతి పొంది, అప్పుడు దుర్యోధనుడు ఆయనకు నమస్కరించి, నగరానికి బయలుదేరాడు. అవయవాలు పనిచేయని రోగివలె సిగ్గుతో అతడు బ్రద్దలవుతున్నాడు. దుర్యోధనుడు వెళ్ళగానే వీరుడైన కుంతీసుతుడు – ధర్మరాజు – సోదరులు, బ్రాహ్మణులు, తాపసులు పూజిస్తూ ఉండగా దేవతలమధ్యనున్న

* న హి సాహసకర్తారః సుఖమేధంతి భారత ॥ 22

దేవేంద్రునివలె ప్రకాశిస్తూ, ద్వైతవనంలో ఆనందంగా విహరించాడు.

247. దుర్యోధనుడు విశ్రమించుట.

ధర్మరాజు విడిపిస్తే దుర్యోధనుడు సిగ్గుతో తలవంచుకొని, దుఃఖంతో ఖిన్నుడై, నిష్క్రమించాడు. శోకంతో మతి చెదరి జరిగిన పరాభవాన్నే తలచుకొంటూ, సుయోధనుడు చతురంగబలాలు అనుసరిస్తుంటే నగరానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఆహారం, నీరు బాగా దొరికే చోట వాహనాలను వీడి, ఒక రమణీయమైన భూభాగంలో తన ఇచ్ఛవచ్చినట్లు నిలిచి, చతురంగబలాలను వారి వారికి అనువైన ప్రదేశాలలో నిలువమన్నాడు. ఆపై అగ్నిజ్వాలలవలె ప్రకాశిస్తున్న శయ్యపై కూర్చున్నాడు. నిశావసానవేళలో రాహుగ్రస్తుడైన చంద్రుడు కాంతిహీనుడైనట్లు దుర్యోధనుడు శోభను కోల్పోయి ఉన్నాడు. అప్పుడు కర్ణుడు దుర్యోధనుని సమీపించి ఇలా అన్నాడు. 'సుయోధనా! అదృష్టంవలన బ్రతికిపోయావు. దానివల్లనే మనం మరలా కలిశాం. భాగ్యవశాన కామరూపు లయిన గంధర్వులను కూడా గెలవగలిగాం. కురునందనా! అదృష్టవశాన నీ సోదరుల నందరినీ మరల చూడగలుగుతున్నా. వారు జయశీలురు, రణాసక్తులు, శత్రువులను ఓడించిన మహారథులు. నీవు చూస్తుండగానే గంధర్వ లందరూ నన్ను పరుగెత్తించారు చెదరిపోయే సేనను కూడా నేను నిలువరించలేకపోయాను. బాణాల తాకిడితో తీవ్రంగా గాయపడి బాధతో పారిపోయాను. ఇది చాలా అద్భుతంగా ఉన్నది. అమానుషమైన ఆ యుద్ధంలో గాయపడకుండ, నష్టపోకుండా అంతఃపురస్త్రీలతో, సేనలతో, వాహనాలతో విముక్తిపొందిన మిమ్ము చక్కగా చూడగలుగుతున్నాను. మహారాజా! నీ సోదరులతో కలిసి యుద్ధంలో నీవు ప్రదర్శించిన పరాక్రమం వంటి పరాక్రమాన్ని ప్రదర్శించగలవాడు లోకంలో మరొకడు లేడు.' కర్ణుని మాటలు విని, దుర్యోధననరపతి బాష్పగద్గదమైన వాక్కుతో అంగరాజుతో ఇలా అన్నాడు.

248. దుర్యోధనుడు తన పరాజయమును వివరించుట.

దుర్యోధనుడిలా అన్నాడు. 'రాధేయా! నీకు విషయమంతా తెలియదు. అందుకే ఇలా మాటాడుతున్నా నేను కోపించటం లేదు. నా పరాక్రమంతో నేను గంధర్వులను ఓడించిన విషయం నీకు తెలుసు నా సోదరులు నాతో కలిసి చాలాసేపు గంధర్వులతో పోరాడారు ఇరువైపులా నష్టం జరిగింది. అయితే మాయగలవారు కాబట్టి వారు అధికులు. ఆ గంధర్వవీరులు గగనచారులై యుద్ధం చేసినప్పుడే వారితో సమానంగా మేము యుద్ధం చేయలేకపోయాం. యుద్ధంలో ఓడిపోయాం. సేవకులతో మంత్రులతో, పుత్రులతో,

అంతఃపురకాంతలతో, సేనలతో, వాహనాలతో సహా బందీల మయ్యాం. గంధర్వులు ఆకాశమార్గంలో మమ్ము తీసికొనిపోసాగారు. ఎంతో దుఃఖం కలిగింది. అప్పుడు మహారథులైన మా అమాత్యులు కొందరూ, మా సైనికులూ కలిసి దీనులై శరణప్రదాత లయిన పాండవులకడకు పోయి ఇలా పలికారు. ఈ ధార్తరాష్ట్రుని - సుయోధన నరపతిని - సోదర-అమాత్య భార్యా సహితంగా గంధర్వులు అపహరించి ఆకాశమార్గాన వెళుతున్నారు. అంతఃపురస్త్రీలతో సహా దుర్యోధనుని విడిపించండి. మీకు మేలు జరుగుతుంది కురుకాంతలకు ఎట్టిపరిస్థితిలోనూ పరాభవం జరుగకూడదు.

వారలా అడుగగానే పాండుకుమారులలో పెద్దవాడు, ధర్మాత్ముడైన ధర్మరాజు తన తమ్ములను అనునయించి, మమ్ము విడిపించమని ఆజ్ఞాపించాడు. అప్పుడు పురుషశ్రేష్ఠులు, మహారథులు ఐన పాండవులు ఆ ప్రదేశానికి వచ్చి సామర్థ్యానికి లోటులేకపోయినా మంచిమాటలతోనే గంధర్వుల నర్థించారు. భీముడు, బలసంపన్నులైన నకుల సహదేవులు అసంఖ్యాకులైన ఆ గంధర్వులమీద బాణాలవానలు కురిపించారు. అయినా ఆ గంధర్వ లంతా యుద్ధాన్ని మాని, దీను లయిన మమ్ములను లాగుతూ, గగనతలంపైకి ఎగిరారు. ఆ సమయంలో నాలుగువైపుల బాణాలవల ఏర్పడింది. అర్జునుడు దివ్యాస్త్రాలను ప్రయోగిస్తూ కనిపించాడు. అర్జునుని వాడిబాణాలు దిక్కుల నన్నింటినీ ఆవరించగా చూసి, అర్జునుని మిత్రుడు చిత్రసేనుడు ప్రత్యక్షమయ్యాడు. చిత్రసేనుడు, అర్జునుడు పరస్పరం కౌగిలించుకొని కుశలప్రశ్నలు వేసికొన్నారు మా క్షేమాన్ని గూర్చి కూడా అడిగారు. ఆ ఇద్దరూ కలిసికొని యుద్ధసన్నాహాలను వీడారు పాండవులు, గంధర్వవీరులు ఒక్కటైపోయారు. అర్జునచిత్రసేనులు ఒకరినొకరు ఆదరించుకొన్నారు.

249. దుర్యోధన ప్రాయోపవేశము.

అప్పుడు అర్జునుడు చిత్రసేనుని సమీపించి, నవ్వుతూ ఇలా గంభీరంగా పలికాడు. 'గంధర్వశ్రేష్ఠా! వీరా! ఈ మా సోదరులను విడిపించాలి. పాండవులు బ్రతికి ఉండగా వీరిని పరాభవించటం తగదు. కర్ణా! మహాత్ముడైన అర్జునుడు అలా అనగానే చిత్రసేనుడు మన ఘోషయాత్రలోని మంత్రాంగాన్ని చెప్పేశాడు. సుఖీనులై ఉన్న ద్రౌపదిని, పాండవులను చూడటంకోసమే మనం బయలుదేరినట్లు చెప్పేశాడు. చిత్రసేనుడు ఆ మాటను చెప్తుండగానే నేను సిగ్గుపడి, భూమిలోనికి కూరుకొని పోవాలనుకొన్నాను. అప్పుడు గంధర్వులు పాండవులతోపాటు ధర్మరాజు దగ్గరకు వచ్చి, మన దురాలోచనను చెప్పి బందీలమైన మమ్ము ఆయన కప్పగించారు నేను దీనుడనై, బంధింపబడి, శత్రువుల కధీనుడనై,

స్త్రీలసమక్షంలో యుధిష్ఠిరునకు అప్పగించబడ్డాను. ఇంతకన్న బాధాకర మేముంటుంది? నేను దుర్మతిని. పాండవులనెప్పుడూ తిరస్కరించేవాడిని. వారికి నిత్యశత్రువును. అయితే వారే నన్ను విడిపించారు. వారే నాకు బ్రతుకు నిచ్చారు. వీరా! ఆ మహాయుద్ధంలో నేను చచ్చిపోయినా ఇంతకన్నా బాగుండేది. ఈ విధంగా బ్రతకటం నాకు మేలుకాదు. గంధర్వులచేత చచ్చి ఉంటే లోకంలో కీర్తి లభించేది. ఇంద్రసన్నిధిలో అక్షయపుణ్యలోకాలను పొందగలిగేవాడిని

నరశ్రేష్ఠులారా! ఇప్పుడు నా నిర్ణయ మొక్కటే. వినండి. ఇక్కడే ప్రాయోపవేశం చేస్తాను. మీరు ఇంటికి వెళ్ళండి. నా సోదరులందరూ నగరానికి వెళ్ళిపొండి. కర్ణుడు మొదలయిన మిత్రులు, బంధువులు దుశ్శాసనుని నేతృత్వంలో నగరానికి వెళ్ళిపొండి. ఇప్పటివరకు శత్రువులను పరాభవించి, మిత్రులను సత్కరించిన నేను శత్రువులచేత పరాభవాన్ని పొంది నగరానికి రాలేను. ఆటువంటి నేను మిత్రులకు శోకాన్నీ శత్రువులకు హర్షాన్నీ కల్గిస్తూ హస్తినాపురానికి వచ్చి మహారాజుతో ఏం చెప్పగలను? భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, విదురుడు, సంజయుడు, బాహ్లీకుడు, భూరిశ్రవుడు మొదలయిన పెద్దలు, బ్రాహ్మణులు, ప్రముఖ వైశ్యులు, తటస్థులైన ప్రజలు నాతో ఏమనగలరు? వారికి నేనేం బదులివ్వగలను. పరాక్రమంతో శత్రువుల మస్తకాలపై, గుండెలపై నిలువగలిగిన నేను స్వయంకృతాపరాధంతో భ్రష్టుడ నైనట్లు వారి కెలా చెప్పగలను. మదగర్వితు లయిన నా వంటి దుర్మార్గులు సంపదను, విద్యను, అధికారాన్ని పొంది కూడా చిరకాలం ఆ సుప్రతిష్ఠలో నిలువలేరు. అయ్యో! ఆ పని చేయకుండానే ఉండవలసినది. చాలా చెడ్డపని చేశాను. మోహంతో దుర్బుద్ధితో స్వయంగా దీని కుపక్రమించాను. ఇప్పుడు బ్రతుకే సంశయగ్రస్త మయింది. కాబట్టి ప్రాయోపవేశమే చేస్తాను. నేను బ్రతుకలేను. శత్రువులచే కష్టాలనుండి రక్షింపబడినవాడు బుద్ధి ఉన్నవాడయితే బ్రతకా లనుకోడు. శత్రువులు నన్ను పరిహసించారు. నేను అభిమానవంతుడిని. కానీ ఇప్పుడు పౌరుషహీనుడ నయ్యాను. పరాక్రమసంపన్నులైన పాండవులు నన్ను హేళనగా చూశారు.' ఇలా చింతించి దుశ్శాసనునితో అన్నాడు. 'దుశ్శాసనా! నామాటను అర్థం చేసుకో. నేను నిన్ను అభిషేకిస్తున్నాను. అంగీకరించు. రాజువు కమ్ము కర్ణశకునుల సహకారంతో ఈ విశాల రాజ్యాన్ని పరిపాలించు. దేవతలను దేవేంద్రుడు పరిపాలించినట్లు నీ సోదరులను నమ్మకంగా పరిపాలించు. దేవేంద్రుని ఆశ్రయించి దేవతలు జీవించినట్లు నీ ఆశ్రయంలో బాంధవులను జీవించనీ. ఏమరుపాటు లేకుండా బ్రాహ్మణులకు జీవికను ఏర్పాటుచేయి. బంధువులకు, మిత్రులకు ఎప్పుడూ నీవే ఆశ్రయంగా నిలు. విష్ణువు దేవగణాలను రక్షించినట్లు జ్ఞాతులను జాగ్రత్తగా చూచుకో. గురువులను కాపాడు. మిత్రులను ఆనందింపజేస్తూ, సర్వశత్రువులను అణచివేస్తూ

రాజ్యపాలన చేయి.' ఇలా పలికి దుశ్శాసనుని కంఠాన్ని కౌగిలించుకొని 'ఇక వెళ్ళు' అన్నాడు. సుయోధనుని మాటను విని దుశ్శాసనుడు దీనుడై, దుఃఖితుడై చేతులు జోడించి నమస్కరించి కన్నీరు కంఠాన్ని చేరడంతో బొంగురు పోయిన గొంతుతో, కలతపడిన మనస్సుతో తన అన్నతో 'ప్రసన్నుడవు క'మ్మని పలికి నేలపై పడిపోయాడు. బాధపడుతూ తన కన్నీటిని ఆయన పాదాలపై విడుస్తూ నరశ్రేష్ఠుడైన దుశ్శాసనుడు ఇది ఇలా జరగదు ' అని అన్నాడు. సమస్తభూమి బ్రద్దలయినా, ఆకాశం ముక్కలయినా, సూర్యుడు తేజస్సును వీడినా చంద్రుడు శీతకిరణత్వాన్ని వదలినా, గాలి వేగాన్ని విడనాడినా, హిమాలయం చలించినా, సముద్రజలం ఎండిపోయినా, అగ్ని వెచ్చదనాన్ని పరిత్యజించినా నీవు లేని రాజ్యాన్ని నేను పరిపాలించలేను. 'రాజా ప్రసన్నుడవు క' మ్మని మాటిమాటికి అనునయించి ఇలా అన్నాడు

"మనవంశంలో నూరేళ్ళూ నీవే రాజువు కావాలి" - ఆ రీతిగా పలికి దుశ్శాసనుడు పూజార్హాలయిన అన్నపాదాలను స్పృశించి వెక్కివెక్కి ఏడువసాగాడు. ఆ రీతిగా దుఃఖపడుతున్న దుశ్శాసనసుయోధనులను చూసి, కలతపడి, కర్ణుడు వారి దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. 'కౌరవ్యులారా! అజ్ఞానంతో అనాగరికులవలె బాధపడతా రెందుకు? ఏడ్చినంతమాత్రాన బాధలు తొలగిపోవు. ఏడుస్తున్న వాడి ఏడుపు ఇబ్బందులను తొలగించలేకపోతే ఎందుకది? మీరిద్దరూ ఏడుస్తూ కనిపిస్తున్నారు. ధైర్యంగా ఉండండి. ఎడ్చి, శత్రువులను సంతోషపెట్టకండి. రాజా! పాండవులు నిన్ను విడిపించటం వారి కర్తవ్యం. అది చేశారు. రాజ్యంలోని ప్రజలు ఎప్పుడూ రాజు కిష్టమయిన పనిని చేయాలి వారు నీపాలనలో ఉండి గదా విశ్చింతగా జీవిస్తున్నారు. ఈస్థితిలో నీవు సాధారణవ్యక్తివలె దుఃఖింపతగదు. రాజా! నీవు ప్రాయోపవేశానికి సిద్ధపడితే చూడు నీ సోదరులంతా విషణ్ణులై ఉన్నారు వీళ్ళనందరినీ కష్టపెట్టి ఏం లాభం? లేచి పద ! అంతా మంచే జరుగుతుంది. తమ్ముళ్ళను ఓదార్చు.

250. దుర్యోధనుని ప్రాయోపవేశ విరమణకై విఫలయత్నము.

'రాజా! నీవింతగా చిన్నబుచ్చుకోవటానికి కారణం నాకర్థం కావటం లేదు. వీరా! ఒక్కమారు శత్రువుల వశమై పాండవులచే విడిపించబడ్డావు దీనిలో మునిగిపోయే దేముంది? కౌరవ్యా! రాజులసేనలో ఉండి బ్రతుకు గడుపుకొనేవారూ, రాజ్యంలోని ప్రజలూ తెలిసి అయినా, తెలియకుండా అయినా రాజుకు ప్రియమైన పనిని చేయవలసినదే! సాధారణంగా ప్రధానవీరులు శత్రుసేనలను కలతపెడుతుంటారు. యుద్ధంలో ఒకవేళ వారు పట్టుబడితే

సైనికులు విడిపిస్తుంటారు. రాజు కొలువులోనివారు, రాజ్యప్రజలు కలిసి రాజు కోసం యథాశక్తి ప్రయత్నం చేస్తూనే ఉండాలి. రాజా! ఆ నీతితో నీ రాజ్యంలో ఉన్న పాండవులు దైవికంగా నిన్ను విడిపించారు. దీనిలో బాధపడవలసిన దేముంది? -

రాజా! నీవు నీ సేనలతో బయలుదేరినపుడు పాండవులు కూడా నృపశ్రేష్ఠుడవైన నిన్ను అనుసరించి ఉండవలసినది. వాళ్ళు అలా చేయలేదు. అదేమంత బాగాలేదు. పాండవులు శూరులు, బలవంతులు, యుద్ధంలో వెనుకంజవేయనివారు. అంతకుముందే వారు నీకు దాసులై ఉన్నారు. కాబట్టి నీకు సహకరించి తీరాలి. పాండవుల రత్నాల నన్నింటినీ ఇప్పటికీ నీవే అనుభవిస్తున్నావు. అంతమాత్రాన వారు ప్రాయోపవేశం చేయలేదు చూడు ఇప్పటికీ స్థిరంగానే ఉన్నారు. కాబట్టి మహాబాహూ! నీవు ఈ విధంగా దుఃఖించ నవసరం లేదు. రాజా! లే ! నీకు మేలే జరుగుతుంది ఇంకా జాగుచేయదగదు. రాజా! రాజ్యంలో ఉన్న ప్రజలు రాజుకు ఇష్టమైన పనులను తప్పక చేయాలి. దీనికై నీవు బాధపడవలసిన దేదీ లేదు. రాజేంద్రా! ఈ నా మాటను మన్నించకపోతే నీ పాదసేవ చేస్తూ ఇక్కడే నిలిచిపోతాను. రాజా! నీవు లేకుండా నేను బ్రతకాలనుకోవటం లేదు. ఇలా ప్రాయోపవేశం చేస్తే రాజులు నవ్వుకొంటారు.' కర్ణుడు ఆ రీతిగా పలికినా దుర్యోధన నరపతి లేవటానికి మనసు పడలేదు. స్వర్గానికి వెళ్ళటానికే నిశ్చయించుకొన్నాడు.

251. శకుని దుర్యోధనుని అనునయించుట దుర్యోధనుడు రసాతలమునకు కొనిపోబడుట.

రాజా! ఆపై అసహనానికి గురి అయి, ప్రాయోపవేశానికి సిద్ధపడిన దుర్యోధననరపతిని అనునయిస్తూ, సౌబలుడైన శకుని ఇలా అన్నాడు. 'కౌరవా! కర్ణుడు చక్కగా చెప్పాడు. నీవు అది విన్నావు. నేను సమృద్ధమైన పాండవరాజ్యలక్ష్మిని అపహరించాను. నీవు మోహంతో దానిని పరిత్యజిస్తున్నావు. రాజా! నీవు నీ మందమతి వలన ప్రాణాలను వీడదలచుకొన్నావు. అసలు నీవెప్పుడూ పెద్దలను సేవించలేదని నాకు అనిపిస్తోంది. మీదపడుతున్న ఆనందాన్ని కానీ, దుఃఖాన్ని కానీ నియంత్రించుకొనలేనివాడు సంపదలను పొందినా పచ్చికుండ నీళ్లలో కరిగిపోయినట్లు ఆ సంపద నశిస్తుంది. రాజు మరీ పిరికివాడైనా, శక్తిహీనుడైనా, అలసత్వం కల వాడైనా ఏమరుపాటు కలవాడైనా, వ్యసనంలో, విషయాలలో చిక్కుపడిపోయినా ఆ రాజును ప్రజలు సేవించరు. పాండవులు నిన్ను ఆదరిస్తేనే ఇలా కుమిలిపోతున్నావు. వారు తిరస్కరించి ఉంటే ఎమయ్యేదో? కౌంతేయులు పాటించిన మర్యాదను నీ శోకంతో నశింపజేసికొనవద్దు. రాజేంద్రా! నీవు ఆనందించి, పాండవులను సత్కరించవలసిన సందర్భంలో

బాధపడుతున్నావు. ఈ నీ ప్రవృత్తి విపరీతంగా ఉంది. ప్రసన్నుడవుకమ్ము, ప్రాణాలు తీసికొనవద్దు. ఆనందంగా ఉండు. వారి మంచితనాన్ని తలచుకొంటూ పాండవులకు రాజ్యాన్ని ఇచ్చి కీర్తినీ, ధర్మాన్నీ పొందు. నా మాటను గ్రహించి ఆ విధంగా చేస్తే నిన్ను కృతజ్ఞు డంటారు. పాండవులతో సౌభ్రాత్రాన్ని పాటించి వారికి పైతృకమైన రాజ్యాన్ని సమర్పించి, సింహాసనంపై నిలుపు. దానితో నీవు సుఖంగా ఉండవచ్చు.' శకుని చెప్పిన మాటలు విని, సుయోధనుడు ఖిన్నవదనంతో పాదాలపైబడిన దుశ్శాసనునివైపు చూసి తన సుందర బాహువులతో పైకి లేపి, కౌగిలించుకొని, ప్రేమతో శిరస్సు మూర్కొన్నాడు. కర్ణశకునుల మాటలు విని కూడా దుర్యోధననరపతి తీవ్రనిర్వేదానికి లోనయి, సిగ్గుతో కుంచించుకొనిపోయి పరమనైరాశ్యాన్ని పొందాడు మిత్రులందరి మాటలు విని దుర్యోధనుడు కోపంగా ఇలా అన్నాడు. నాకు ధర్మం ధనం, సౌఖ్యం, అధికారం అనుశాసనం, భోగాలు ఎవీ అవసరం లేదు. నన్ను బాధించకండి వెళ్ళండి ప్రాయోపవేశం చేయాలనే నాకు నిశ్చితబుద్ధి కలిగింది. మీరంతా నగరానికి వెళ్ళండి. మన గురుజనుల నందరినీ ఆదరించండి.' దుర్యోధనుడు అలా అనగానే వారంతా శత్రుసంహారకుడైన దుర్యోధనరాజుతో ఇలా అన్నారు– 'రాజేంద్రా! భారతా! నీ మార్గమే మాకు కూడా మార్గం. నీవు లేకుండా మేము నగరానికి ఎలా వెళ్ళగలం?' మిత్రులు, అమాత్యులు, సోదరులు, బంధువులు ఎన్ని రకాలుగా చెప్పినా దుర్యోధనుడు తన నిర్ణయం నుండి మరల లేదు. ఆ దుర్యోధనుడు తన నిర్ణయం నుండి వెనుదిరగక ఆచమించి, పవిత్రుడై దర్భాసనాన్ని నేలపై పరచి దర్భలను నారబట్టలను ధరించి, కూర్చున్నాడు. స్వర్గగమన కాంక్షతో మౌనాన్ని వహించి, ఉత్తమనియమాలను ఆశ్రయించి, స్నానభోజనాది బాహ్యక్రియలను విసర్జించి, ప్రాణత్యాగానికి గట్టిగా నిర్ణయించుకొన్నాడు.

దుర్యోధనుని ఆ నిర్ణయం పాతాళవాసులయిన దైతేయులకు, దానవులకు తెలిసింది వారు అసలే రౌద్రులు. ఇంతకుముందే దేవతలచే ఓడింపబడినవారు దుర్యోధనుని ఆ నిర్ణయం తమ పక్షానికి నష్టమని భావించి వారు దుర్యోధనుని తమచెంతకు రప్పించుకొనటానికి ఉద్యమించారు. మంత్రవిశారదులయిన వారు బృహస్పతి, శుక్రాచార్యుడు చెప్పిన మంత్రాలను అధర్వవేదంలో, ఉపనిషత్తులలో చెప్పిన యజ్ఞకర్మలను, ఉపనిషత్తులలో చెప్పిన మంత్రజపాది క్రియలను ప్రారంభించారు. వేదవేదాంగపారంగతులు దృఢవ్రతులు అయిన బ్రాహ్మణులు నిశ్చలదీక్షతో మంత్రపూర్వకంగా అగ్నిహోత్రంలో నేతిని, పాలను ఆహుతి చేయసాగారు. రాజా! యజ్ఞకర్మ సిద్ధించి ఆ అగ్నిహోత్రం నుండి ఒక అద్భుతకృత్య ఆవులిస్తూ లేచి "ఏం చేయాలి?' అని అడిగింది. అప్పుడు దైత్యులు మనసా పరమానందపడి "ప్రాయోపవిష్టుడైన

దుర్యోధనమహారాజును ఇక్కడకు తీసుకొనిరా" అని దానితో అన్నారు. అలాగే' అని అంగీకరించి ఆ కృత్య బయలుదేరి నిమేషకాలంలో సుయోధనుడున్న చోటికి వచ్చింది. రాజును తీసికొని క్షణకాలంలో పాతాళానికి వెళ్ళింది. సుయోధనుని తెచ్చినట్టు దానవులకు తెలిపింది కొనిరాబడిన దుర్యోధనుని చూసి దానవులంతా రాత్రివేళ గుమిగూడి, మనస్సులు ఆనందించగా, కళ్ళు వికసించగా ప్రేమపూర్వకంగా దుర్యోధనునితో ఇలా అన్నారు.

252. దానవప్రబోధము - కర్ణుని పట్టుదలతో దుర్యోధనుడు దీక్ష విరమించుట.

రాజేంద్రా! శూరులు మహాత్ములు ఎప్పుడూ నీ చుట్టూ ఉంటారు. ప్రాయోపవేశన రూపమైన ఈ సాహసాన్ని ఎందుకు చేశావు? ఆత్మత్యాగం చేసినవాడు అధోలోకాలకు పోతాడు. నిందకు లోనవుతాడు. అపకీర్తికి ఆశ్రయ మవుతాడు అభీష్టకార్యానికి విరుద్ధమై, పాపహేతువై, మూలనాశనం చేసే పనులలో నీవంటి బుద్ధిమంతులు తగులుకొనతగదు. రాజా! ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకో! ఇది ధర్మార్థసుఖాలను నాశనం చేస్తుంది. కీర్తినీ, పరాక్రమాన్నీ హతం చేస్తుంది. శత్రువులకు ఆనందాన్ని పెంపొదిస్తుంది. స్వామీ! రాజా! తత్త్వాన్ని విను. నీ దివ్యత్వాన్ని గ్రహించు. శరీరనిర్మాణాన్ని ఆకళింపు చేసుకో. ఆపై ధైర్యాన్ని తెచ్చుకో రాజా! గతంలో మేము తపఃఫలంగా మహేశ్వరుని ద్వారా నిన్ను పొందగలిగాం. నీ శరీరంలోని పూర్వభాగం వజ్రసమూహంతో తయారయినది. అది శస్త్రాలతో గానీ, అస్త్రాలతో గానీ భేదింపరానిది. నీ శరీరంలో అధోభాగాన్ని పార్వతీదేవి పుష్పమయంగా చేసింది. అది అందమై అతివలమనస్సుల నపహరింపగలది. ఈ విధంగా నీదేహం పార్వతీదేవితో కలిసి పరమేశ్వరుడు నిర్మించినది నీవు మానవుడవు కాదు. దివ్యపురుషుడవు భగదత్తాది క్షత్రియులు నీ శత్రువులను నశింపజేయగలరు. కాబట్టి నీవు బాధపడ నవసరం లేదు. భయపడ నవసరంలేదు. నీకు సహకరించటానికే దానవవీరులు భూలోకంలో జన్మించారు ఇతరరాక్షసులు భీష్మద్రోణకృపాదులను కూడా ఆవేశిస్తారు. దానితో వారు జాలిలేకుండా నీ శత్రువులతో పోరాడుతారు. కురుశ్రేష్ఠా! దానవులు ఆవేశించినందువలన భీష్మాదులకు కూడా తమ అంతరాత్మలపై అదుపు ఉండదు. దానితో స్నేహాన్ని కూడా లెక్కచేయక పుత్రులను, సోదరులను, తండ్రులను, బంధువులను శిష్యులను, దాయాదులను, బాలురను, వృద్ధులను ఎవ్వరినీ వదలకుండా యుద్ధంలో సంహరిస్తారు. పురుషోత్తము లయిన భీష్మాదుల మనస్సులు కలుషిత మవుతాయి. వారు అజ్ఞానమోహంలో పడి వివశులై స్నేహాన్ని దూరంగా వదలి అందరినీ చంపుతారు ఇది విధివిలాసం, దైవికం కూడా.

కురుశ్రేష్ఠా! "నేను నిన్ను ప్రాణాలతో విడువను ' అని ఒకరినొకరు రెచ్చగొడుతూ, పరాక్రమంతో అందరూ ఒకరిపైఒకరు శస్త్రాస్త్రాలను ప్రయోగిస్తూ, తమను తాము పొగడుకొంటూ జననాశనం చేస్తారు. దైవసహకారంతో మహాబలులైన ఆ మహాత్ములు - పాండవులు - భీష్మాదుల కెదురునిలిచి పోరాడి వారిని చంపివేస్తారు. రాజా క్షత్రియులలో పుట్టి ఉన్న దైత్య రాక్షసగణాలు యుద్ధంలో పరాక్రమించి నీ శత్రువులతో పోరాడుతారు. మహాబలు లయిన ఆ వీరులు గదలతో, రోకళ్ళతో, శూలాలతో ఇంకా చిన్న - పెద్ద ఆయుధాలతో నీ శత్రువులను కొడతారు. వీరుడా నీ మనస్సులో అర్జును డంటే భయ ముంది. ఆ అర్జునసంహారంకోసం కూడా మేము ఉపాయం ఆలోచించాం. మరణించిన నరకుని ఆత్మ కర్ణుని శరీరంలో ప్రవేశించింది. వీరా! ఆ వైరాన్ని తలచుకొంటూ కర్ణుడు కృష్ణార్జునులతో పోరాడుతాడు. ఆ కర్ణుడు మహారథి. పరాక్రమగర్వం గలవాడు. యోధులలో శ్రేష్ఠుడు అతడు యుద్ధంలో అర్జునుని ఇతర శత్రువుల నందరినీ జయిస్తాడు. ఇది గ్రహించి ఇంద్రుడు అర్జునుని రక్షింపగోరి, మోసంతో కర్ణుని కవచాన్నీ, కుండలాలనూ అపహరిస్తాడు. అందుకోసమే మేము కూడా సంశప్తకులనే పేర లక్షమంది దైత్యులనూ, రాక్షసులనూ ఏర్పాటు చేశాం. వారు ప్రఖ్యాతవీరులు. వీరు డయిన అర్జునుని సంహరిస్తారు. నీవు దుఃఖించవద్దు. రాజా! ఈ భూమిని నీవు శత్రురహితంగా అనుభవించాలి. కాబట్టి బాధపడవద్దు. నీకిది తగదు. కౌరవా! నీవు మరణిస్తే మా పక్షం బలహీనమవుతుంది. వీరుడా! వెళ్ళు. నీవు ఎ రీతిగానూ మరొక ఆలోచన చేయవద్దు. మాకెప్పుడూ నీవే దిక్కు. పాండవులు దేవతలకు దిక్కు.'

దైత్యులు ఎదిరించరాని వీరుడూ, రాజశ్రేష్ఠుడూ అయిన దుర్యోధనుని కౌగిలించుకొని పుత్రునివలె అనునయించి, ప్రియవచనాలతో అతని బుద్ధిని కుదుటపరచి, 'ఇకవెళ్ళు. నీదే గెలుపు" అని ఆజ్ఞాపించారు. వారు విడిచిపెట్టగానే ఆ కృత్యయే మరల సుయోధనుని అంతకుముందు ప్రాయోపవేశం చేయబూనిన ప్రదేశానికే తీసికొని వచ్చింది. వీరుడైన దుర్యోధనుని అక్కడ నిలిపి, సత్కరించి, ఆ రాజు అనుమతిని పొంది కృత్య అక్కడే అంతర్ధానమైంది. ఆ కృత్య అలా వెళ్ళిపోగానే దుర్యోధనునకు అదంతా కలలా అనిపించింది దానవులు పలికిన మాటలను తలచుకొని ఆ దుర్మతి "నేను యుద్ధంలో పాండవులపై గెలుస్తాను" అని సంకల్పించుకొన్నాడు కర్ణుడూ, సంశప్తకులూ శత్రుసంహర్త అయిన అర్జునునికి యుద్ధంలో తగినవారూ, సమర్థులూ అని సుయోధనుడు భావించాడు. భరతశ్రేష్ఠా! దుర్మతి అయిన దుర్యోధనునకు ఆ రీతిగా పాండవులను గెలవటంపై ఆశ గట్టిపడింది. నరకుని ఆత్మ తనలో ప్రవేశించటంచేత కర్ణుడు కూడా అర్జునుని చంపాలని క్రూరంగా సంకల్పించసాగాడు. వీరు లయిన సంశప్తకులు కూడా రాక్షసులు వారి మనస్సులలో

ప్రవేశించటం వలన అర్జునుని చంపగోరుతూ రజస్తమోగుణాలకు లోనయ్యారు. రాజా! భీష్మద్రోణకృపాదుల మనస్సులను కూడా దానవులు ఆక్రమించారు. దానితో పాండుకుమారులపై వారంతగా స్నేహాన్ని ప్రదర్శించలేకపోయారు.

కృత్యద్వారా కొనిపోయి ఆ రాత్రి దానవులు తనకు చెప్పిన విషయాలను దుర్యోధనరాజు ఎవ్వరికీ చెప్పలేదు. సూర్యసుతుడైన కర్ణుడు ఆ వేకువజామున చేతులు జోడించి, చిరునవ్వుతో దుర్యోధనునితో హేతుబద్ధంగా ఇలా చెప్పాడు. **'కౌరవనందనా! మరణించినవాడు శత్రువులను జయించలేడు. బ్రతికిఉంటే శుభాలు కలుగుతాయి. మరణించినవాడికి శుభాలూ ఉండవు. విజయాలూ ఉండవు.*** విషాదానికి కానీ, భయానికి కానీ, మరణానికి కానీ ఇది సమయం కాదు' అని చెప్పి మహాభుజుడైన ఆ కర్ణుడు భుజాలతో దుర్యోధనుని కౌగిలించి, మరలా ఇలా అన్నాడు. 'రాజా! లే! ఎందుకు పడుకొంటావు? శత్రుసంహర్తా! ఎందుకు దుఃఖిస్తావు? పరాక్రమంతో శత్రువులను తపింపజేసి ఇప్పుడు మరణాన్ని ఎందుకు కోరుకొంటావు? లేకపోతే అర్జునుడి పరాక్రమాన్ని చూసి నీవు భయపడ్డావా? నేను నీకు ఒట్టువేసి చెప్తున్నాను. యుద్ధంలో అర్జునుని నేనే చంపుతాను రాజా! ధనుస్సుచేతబట్టి సత్యంమీద ఒట్టువేసి చెప్తున్నాను. పదమూడవ సంవత్సరం పూర్తికాగానే పాండవులను తెచ్చి నీ వశం చేస్తాను.' కర్ణుడు అలా అనగా దుర్యోధనుడు దైత్యులమాటలను కూడా తలచుకొని, సోదరులు తన కాళ్ళపై పడటాన్ని మన్నించి, ప్రాయోపవేశాన్ని వీడి లేచాడు. దైత్యులు చెప్పిన ఆ మాటలను తలచుకొని, మనస్సులో స్థిరనిర్ణయానికి వచ్చి మనుజశ్రేష్ఠుడైన దుర్యోధనుడు అప్పుడు సేనను సన్నద్ధం చేయించాడు. రాజా! రథాలు, ఏనుగులు, గుర్రాలు, సైనికులతో కల్లోలితమయిన ఆ మహాసేన గంగాప్రవాహంలా సాగిపోయింది కల్లోలితమయిన ఆ సేన తెల్లగొడుగులతో, పతాకాలతో, తెల్లని వింజామరలతో, రథాలతో, ఏనుగులతో, సైనికులతో వెన్నెల కొంచెం కొంచెం కనిపిస్తున్న శరత్కాలగగనంవలె శోభించింది. ధృతరాష్ట్రసుతుడైన దుర్యోధనమహారాజు చక్రవర్తివలె ద్విజశ్రేష్ఠుల జయాశీస్సులనూ, స్తుతులనూ వింటూ జనుల నమస్సులను స్వీకరిస్తూ, పరమశోభతో ప్రకాశిస్తూ, ముందుకు సాగిపోయాడు రాజేంద్రా! కర్ణుడు జూదగాడైన శకుని, దుశ్శాసనాది సమస్తసోదరులు, భూరిశ్రవుడు, సోమదత్తుడు మహారాజైన బాహ్లికుడు – ఈ కురువీరులంతా వివిధాకారాలు గల రథాలపై, గుర్రాలపై, ఏనుగులపై నిలిచి రాజసింహమైన దుర్యోధనుని వెంట వచ్చారు.

---

* న మృతో జయతే శత్రూన్ జీవన్ భద్రాణి పశ్యతి । 39

253. కర్ణ దిగ్విజయము.

జనమేజయుడిలా అడిగాడు. 'మహాత్ములయిన పాండవులు వనవాసం చేస్తున్నప్పుడు మేటివిలుకాండ్రు, నరశ్రేష్ఠులయిన ధార్తరాష్ట్రులు ఏం చేస్తున్నారు? సూర్యనందనుడైన కర్ణుడు, మహాబలుడయిన శకుని, భీష్ముడు, ద్రోణుడు, కృపుడు - వీరంతా ఏం చేస్తున్నారు? దాన్ని నాకు వివరంగా చెప్పు.' వైశంపాయనుడిలా చెప్పాడు. 'మహారాజా ! పాండునందనులు సుయోధనుని విడిపించి వదలిపెట్టగా సుయోధనుడు హాస్తినపురానికి వచ్చాడు. అప్పుడు భీష్ముడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'నాయనా! ముందు నీవు తపోవనానికి వెళ్తున్నప్పుడు ఏం చెప్పానో ఇప్పుడూ అదే చెప్తున్నాను. నీవు అక్కడకు వెళ్ళటం కానీ, అక్కడ చేసిన పని కానీ నాకు నచ్చలేదు. వీరా! శత్రువులు అక్కడ నిన్ను బలవంతంగా బందీని చేశారు ధర్మజ్ఞు లయిన పాండవులు నిన్ను విడిపించారు అయినా నీవు సిగ్గుపడవు. నరపతీ! గంధర్వులతో యుద్ధంచేసేవేళలో కర్ణుడు భయపడి సైన్యంతో సహా పారిపోవటం నీ కళ్ళ ఎదుటే జరిగింది. నీవు ససైన్యంగా ఆక్రోశిస్తుంటే మహాత్ము లయిన పాండవులు ప్రదర్శించిన పరాక్రమాన్నీ నీవు చూశావు దుర్మతి అయిన కర్ణుని పరాక్రమాన్నీ నీవు చూశావు. ధనుర్వేదంలో కానీ, శౌర్యంలో కానీ, ధర్మంలో కానీ కర్ణుడు పాండవులలో పావువంతుకు కూడా సరిపోడు. కాబట్టి సంధివేత్తలలో శ్రేష్ఠుడా! ఈ వంశవృద్ధికోసం మహాత్ము లయిన పాండవులతో సంధిచేసికోవటమే తగినదని నేను భావిస్తున్నాను.' రాజా! భీష్ముడలా అనగానే దుర్యోధనుడు పెద్దగా నవ్వి, శకునితో పాటు అక్కడనుండి వెళ్ళిపోయాడు. మహాబలి, దుర్యోధనుడు వెళ్ళిపోయాడని తెలిసికొని మేటివిలుకాండ్రయిన కర్ణదుశ్శాసనాదులు ఆయనను అనుసరించారు. రాజా! వారు వెళ్ళిపోవటాన్ని చూసి కురుపితామహుడైన భీష్ముడు సిగ్గుతో కుదించుకొనిపోయి, తన నివాసానికి వెళ్ళిపోయాడు మహారాజా! భీష్ముడు నిష్క్రమించగానే దుర్యోధననరపతి మరల అక్కడకు వచ్చి, మంత్రులతో కలిసి ఆలోచించసాగాడు. 'మనకు ఏది మేలు చేస్తుంది? ఇక మిగిలిన కర్తవ్యమేమిటి? ఎలా చేస్తే సత్ఫలితాలు లభిస్తాయి ? మనకు హితమైన దేది? అది ఇప్పుడు ఆలోచించాలి.'

కర్ణుడిలా అన్నాడు. 'కౌరవా! దుర్యోధనా! నేను చెప్తున్నాను గ్రహించు. భీష్ముడెప్పుడూ మనలను నిందిస్తూ, పాండవులను ప్రశంసిస్తుంటాడు. నిన్ను ద్వేషిస్తూ ఉంటాడు. కనుక నాకు కూడా ఆయన ద్వేషింపదగినవాడే నీసన్నిధిలో నన్నెప్పుడూ నిందిస్తూనే ఉంటాడు ఆ కారణంగా భీష్మవచనాలను నేను సహించలేను. నీ సమక్షంలోనే పాండవుల యశస్సును కీర్తిస్తూ, నిన్ను నిందిస్తూ భీష్ముడు మాటాడడం నేను భరించలేను. సేవకులు, సేనలు,

వాహనాలతో నేను వెళ్ళటానికి అనుమతి నివ్వు. రాజా! పర్వత వన కాననాలతో సహా భూమండలాన్ని జయిస్తాను. బలశాలులయిన పాండవులు నలుగురు కలిసి గెలుచుకొన్న భూమిని నేను నీకోసం ఒంటరిగానే గెలుచుకొని వస్తాను. దుర్మతి అయిన భీష్ముడు దానిని చక్కగా చూస్తాడు. ఎప్పుడూ నిందకు తగనివానిని నిందిస్తూ, పొగడ్తకు తగనిదానిని పొగుడుతూ ఉంటాడు. ఈ రోజు నా బలాన్ని చూసి తనను తాను అసహ్యించుకొంటాడు రాజా! నన్ను అనుమతించు. తప్పనిసరిగ గెలుపు నీదే. ఆయుధాన్ని పట్టి, సత్యంమీద ఒట్టువేసి, ప్రతిజ్ఞ చేస్తున్నా' రాజా! కర్ణుని మాట విని పరమానందపడి దుర్యోధనుడు కర్ణునితో ఇలా అన్నాడు. నేను ధన్యుడను. నీ ఆదరణకు పాత్రుడను. నీవంటి మహాబలుడు నిత్యమూ నా హితాన్ని కోరి పనిచేయటం అదృష్టం. నేడు నా జన్మ సఫల మయినది వీరా! సర్వశత్రువులను చంపగలనని నీవనుకొంటే అలాగే కానీ. బయలుదేరు. నీకు శుభం జరుగుతుంది. నేనేం చేయాలో ఆదేశించు. ధీమంతుడైన దుర్యోధనుడు అలా అనగానే కర్ణుడు ప్రయాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయించమని ఆదేశించాడు. మేటివిలుకాడైన కర్ణుడు మంగళస్నానం చేసి, బ్రాహ్మణుల ఆశీర్వాదవచనాలచే సత్కరింపబడి, ప్రశంసలనందుకొని శుభనక్షత్రంలో, శుభతిథిలో, శుభముహూర్తంలో రథఘోషతో స్థావరజంగమసహితంగా మూడులోకాలను ప్రతిధ్వనింపజేస్తూ బయలుదేరాడు.

254. కర్ణదిగ్విజయము - హస్తినలో సత్కారము.

ఆ తరువాత మేటివిలుకాడయిన కర్ణుడు పెద్దసేనను వెంటబెట్టుకొని, రమణీయమైన ద్రుపదనగరాన్ని ముట్టడించాడు. మహాయుద్ధం చేసి వీరుడైన ద్రుపదుని లోగొని బంగారాన్ని వెండినీ, వివిధరత్నాలను కప్పంగా కట్టించాడు. రాజోత్తమా! ఈ రీతిగా ద్రుపదుని జయించిన కర్ణుడు ద్రుపదుని అనుయాయులయిన రాజు లందరినీ కూడా లోబరచుకొని, వారిచేతకూడా కప్పం కట్టించాడు ఆ తరువాత ఉత్తరదిక్కుపై దండెత్తి అక్కడున్న రాజులను వశపరచుకొన్నాడు భగదత్తుని ఓడించి కర్ణుడు రాజులతో యుద్ధం చేస్తూ చేస్తూ మహాపర్వతమైన హిమాలయాన్ని అధిరోహించాడు అక్కడనుండి సర్వదిక్కులలో పయనించి రాజులను లోబరచుకొన్నాడు. హిమాలయపర్వత ప్రాంతీయుల నందరినీ ఓడించి, కప్పం కట్టించాడు. నేపాలప్రాంతంలోనున్న రాజులనందరినీ ఓడించాడు. ఆపై హిమాలయం నుండి దిగి తూర్పుదిక్కుగా దూసుకొని పోయాడు. అంగ, వంగ, కళింగ శుండిక, మిథిల, మాగధ, కర్కఖండ దేశాలను తన రాజ్యంలో కలుపుకొని ఆవశీర యోధ్య అహిక్షత్ర దేశాలను కూడా జయించాడు. ఈ రీతిగా తూర్పుదిక్కుపై గెలుపు

సాధించి వత్సభూమిలో అడుగుపెట్టాడు. వత్సభూమిని జయించి కేవల మృత్తికావతి, మోహన, పత్తన, త్రిపురి, కోసల – ఈ దేశాలను కూడా గెలిచి, అందరినుండి కప్పం స్వీకరించి మరల బయలుదేరాడు. దక్షిణదిక్కుకు బయలుదేరి మహారథుల నెందరినో జయించాడు. దాక్షిణాత్యులలో రుక్మితో యుద్ధం చేశాడు కర్ణుడు. ముందు భీకరయుద్ధం చేసిన రుక్మి ఆ తరువాత కర్ణునితో ఇలా అన్నాడు. "రాజేంద్రా! నీ పరాక్రమం, నీ శక్తి చూచి ఆనందిస్తున్నాను. నిన్ను ఆటంకపరచను. క్షాత్రధర్మంమేరకు యుద్ధం చేశాను. అంతే. నీకు కావలసినంత బంగారాన్ని ఆనందంగా ఇస్తాను." ఇలా రుక్మితో మైత్రి కుదుర్చుకొని కర్ణుడు పాండ్య, శ్రీశైల దేశాలవైపు పయనించాడు.

మహాబలుడైన కర్ణుడు యుద్ధంలో కేరళరాజును, నీలరాజును, వేణుదారి కుమారుని ఓడించి, దక్షిణదిక్కున ఉన్న ఇతరరాజులను కూడా గెలిచి, వారినుండి కప్పం గైకొన్నాడు. ఆపై మహాబలుడైన కర్ణుడు శిశుపాలసుతుని ఓడించాడు. చుట్టుప్రక్కల ఉన్న రాజులందరినీ లోబరచుకొన్నాడు. సామోపాయంతో అవంతీరాజును వశంచేసికొని, వృష్ణివంశస్థులతో చెలిమిచేసి, పశ్చిమదిక్కును కూడా జయించాడు. పశ్చిమదిక్కున పయనించి, పశ్చిమదేశరాజులయిన యవనులను, బర్బరులను ఓడించి వారిచే కప్పం కట్టించాడు. ఇలా తూర్పు పడమర, ఉత్తర, దక్షిణ దిశలలోని భూమినంతా జయించి ఆ వీరకర్ణుడు మ్లేచ్ఛ – ఆటవిక – గిరిజన – భద్ర – రోహితక – ఆగ్రేయ – మాలవాది సమస్త గణరాజ్యాలను ఓడించాడు. ఆపై నీతిమంతుడైన కర్ణుడు అవలీలగా శకక, యవనరాజులను గెలిచాడు. ఈ రీతిగా నగ్నజిత్తు మొదలైన మహారథులతో కూడిన గణరాజ్యాలను జయించి, సమస్తభూమిని ఓడించి లొంగదీసికొని మహారథి, పురుషశ్రేష్ఠుడైన కర్ణుడు హస్తినకు చేరాడు. మహారాజా! మేటివిలుకాడైన కర్ణుడు మరలవచ్చుట తెలిసి, దుర్యోధన నరపతి పితృభ్రాతృబంధుసహితంగా ఎదురేగి, విధిపూర్వకంగా స్వాగతసత్కారాలు జరిపించాడు. యుద్ధానికే వన్నె తీసికొనిరాగల కర్ణుని దిగ్విజయయాత్రను దుర్యోధనుడు ఆనందంగా అంతటా ప్రకటింపజేశాడు.

కర్ణునితో ఇలా అన్నాడు – 'కర్ణా! భీష్మ, ద్రోణ, కృప, బాహ్లికులద్వారా కూడా పొందలేనిదాన్ని నీద్వారా నేను పొందాను. నీకు మేలు జరుగుతుంది. కర్ణా! ఇన్ని మాటలు ఎందుకు? ఒకటి చెపుతా వినుమా! మహాబాహూ! సజ్జనశ్రేష్ఠా! నీ సహాయంతోనే నేను సనాథుడ నైనాను. పురుషశ్రేష్ఠా! పాండవులందరూ లేదా శ్రేష్ఠులుగా పరిగణింపబడే ఇతరరాజులు నీలోని పదహారవభాగానికి కూడా సరికారు. కర్ణా! ఇప్పుడు నీవు ధృతరాష్ట్రునీ, యశస్వినీ అయిన గాంధారిని ఇంద్రుడు అదితిని కలిసినట్లుగా కలియుము.'

అప్పుడే హస్తినగరమంతటా గొప్ప కోలాహలశబ్దం వినిపించింది వివిధహాహాకారాలు వినిపించాయి. రాజా! అక్కడ కొందరు రాజులు కర్ణుని ప్రశంసిస్తున్నారు. మరికొందరు నిందిస్తున్నారు. ఇతరులు మౌనంగా ఉండిపోయారు. రాజేంద్రా! ఈరీతిగా యోధులలో మేటి అయిన కర్ణుడు పర్వతాలు వనాలు శూన్యప్రదేశాలు, సముద్రాలు, ఉద్యానాలు, చిన్నపెద్దదేశాలు, పట్టణాలు, నగరాలు ద్వీపాలు, జలప్రాంతాలు - వీటిన్నింటితో నిండిన సమస్తపృథివిని స్వల్పవ్యవధిలోనే జయించి, రాజులను లొంగదీసికొని, అక్షయధనాన్ని సాధించి, ధృతరాష్ట్రసందర్శనకు వెళ్ళాడు. అరిందమా! రాజా! ధర్మవేత్త, వీరుడు అయిన కర్ణుడు అంతఃపురంలో ప్రవేశించి, గాంధారీసహితుడైన ధృతరాష్ట్రుని సందర్శించాడు. కన్నబిడ్డవలె వారిపాదాలకు ప్రణమిల్లాడు. ధృతరాష్ట్రుడు కూడా ప్రేమపూర్వకంగా కర్ణుని కౌగిలించి విడిచాడు భారతా! నాటినుండి దుర్యోధనుడు, శకుని యుద్ధంలో కర్ణుడు పాండవులను జయించినట్లే భావించారు.

255. దుర్యోధనుని వైష్ణవయాగసమారంభము.

పరవీరహంత అయిన కర్ణుడు పృథివినంతా జయించిన తర్వాత దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'దుర్యోధనా! నేను చెప్తున్న మాటను విను. విన్న తరువాత దాని ననుసరించి అంతా ఆచరించు. రాజశ్రేష్ఠా ఇప్పుడు భూమండలమంతా నిష్కంటకంగా నీదయినది. మహామనస్వి అయిన ఇంద్రుడు శత్రువులను సంహరించి, రాజ్యపాలన చేసినట్లు నీవు కూడా పరిపాలించు.' కర్ణుడిలా అనగానే దుర్యోధనుడు కర్ణునితో ఇలా అన్నాడు - పురుషోత్తమా! నీవంటి మిత్రు డున్నవానికి దుర్లభమైనది ఏదీ లేదు. నీవు నాకు సహాయకుడవు. నాపై అనురాగం కలవాడవు నాకై ఉద్యమించినవాడవు. నాకొక ఆలోచన ఉంది. దాన్ని యథాతథంగా విను. కర్ణా యాగశ్రేష్ఠమైన రాజసూయాన్ని ధర్మరాజు చేస్తుంటే చూసిన తర్వాత నాకు కూడా రాజసూయం చేయాలని కోరిక కలిగింది ఆ కోరికను నెరవేర్చాలి.' ఆ మాటలువిని కర్ణుడు దుర్యోధనునితో ఇలా పలికాడు. రాజోత్తమా! ఇప్పుడు రాజులందరూ నీ అదుపులో ఉన్నవారే. బ్రాహ్మణోత్తములను పిలిపించు. యథావిధిగా యజ్ఞసామగ్రిని ఉపకరణాలను సమకూర్చు. రాజా! వేదపారంగతులై, తగిన అర్హతలు గలిగి నీవు పిలువగా వచ్చిన ఋత్విక్కులు యథాశాస్త్రంగా పని ముగిస్తారు. భరతశ్రేష్ఠా నీ మహాయాగం కూడా విరివిగా అన్నపానీయాలతో, సర్వసమృద్ధగుణాలతో సంపన్నమవుతుంది. రాజా! కర్ణుడిలా అనగానే దుర్యోధనుడు పురోహితుని పిలిపించి ఇలా చెప్పాడు - ఉత్తమదక్షిణలతో కూడిన క్రతుశ్రేష్ఠమైన రాజసూయాన్ని యథాక్రమంగా, యథాశాస్త్రంగా నాచేత జరిపించాలి

దుర్యోధనుడు ఆదేశించగా పురోహితుడు అక్కడున్న మిగిలిన బ్రాహ్మణులతో కలిసి దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'కౌరవశ్రేష్ఠా! ధర్మరాజు జీవించి ఉండగా మీ వంశంలో రాజసూయాన్ని చేయటం వీలుకాదు. రాజశ్రేష్ఠా! ఇప్పుడు దీర్ఘాయువు అయిన నీ తండ్రి - కూడా సజీవుడే. రాజా! ఆ కారణంగా నీవు రాజసూయం చేయటం శాస్త్ర విరుద్ధం. ప్రభూ! రాజసూయంతో సమానమైన మరో మహాక్రతువు ఉన్నది. నీవు ఆ యాగాన్ని చేయి ఈ నామాట విను. రాజా! ఇప్పుడు నీకు కప్పం చెల్లిస్తున్న ఈ రాజులందరూ బంగారాన్నీ బంగారునగలను నీకు కప్పంగా చెల్లించాలని ఆదేశించు. ఆ బంగారంతో ఒక నాగలిని చేయించు భారతా! నీ యజ్ఞమండపభూమిని ఆ నాగలితో దున్నించు. అక్కడ సుసంస్కృతమై, విరివిగా అన్నపానాలుగల యాగాన్ని నిరాటంకంగా, యథాశాస్త్రంగా ప్రారంభించుదాం. నీకు నేను చెప్పిన ఈ యాగం వైష్ణవయాగం. సత్పురుషులకు తగిన దిది. పురాతనుడైన విష్ణువు తప్ప మరెవ్వరూ ఈ యాగం చేయలేదు. ఈ మహాక్రతువు యాగశ్రేష్ఠమైన రాజసూయంతో పోటీపడగలది. భారతా ఇది మాకు నచ్చిన యాగం. నీకు శ్రేయస్కరం. ఇది నిర్విఘ్నంగా జరుగుతుంది నీ కోరిక నెరవేరుతుంది. కాబట్టి మహాబాహూ! నీవు ఈ యాగాన్ని ఆరంభించు' బ్రాహ్మణులు అలా అనగానే దుర్యోధనరపతి కర్ణునితో, శకునితో, సోదరులతో ఇలా అన్నాడు. 'ఈ బ్రాహ్మణుల మాట నాకు పూర్తిగా నచ్చింది. సందేహం లేదు మీకు కూడా నచ్చితే ఆలస్యం లేకుండా చెప్పండి. దుర్యోధను డలా అనగానే వారంతా 'అలాగే' అని దుర్యోధనునితో అన్నారు. అప్పుడు దుర్యోధనుడు పనిచేసుకొంటున్న శిల్పుల నందరినీ యథాక్రమంగా నాగలి తయారుచేయటానికి నియమించాడు. రాజోత్తమా! అలా ఆదేశించగానే శిల్పులందరూ క్రమంగా పని అంతా పూర్తిచేశారు.

256. దుర్యోధన వైష్ణవయాగ పరిసమాప్తి.

ఆ తరువాత శిల్పులందరూ, అమాత్యశ్రేష్ఠులూ, మహాజ్ఞానియైన విదురుడూ దుర్యోధనునకు ఇలా నివేదించారు యాగానికి అంతా సిద్ధమయినది సమయం కూడా సమీపించినది. మహాధనసంపన్నమైన బంగారునాగలి కూడా తయారయింది ఇది విని దుర్యోధన నరపాలుడు మహాయాగప్రారంభానికి ఆదేశించాడు అప్పుడు సుసంస్కృతమూ బహుధనసంపన్నమూ అయిన యాగం ప్రారంభమైంది దుర్యోధనుడు యథాక్రమంగా యథాశాస్త్రంగా దీక్ష పూనాడు. ధృతరాష్ట్రుడు, మహాయశస్వి అయిన విదురుడు, భీష్ముడు ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, యశస్విని అయిన గాంధారి ఆనందించారు రాజేంద్రా!

రాజులను బ్రాహ్మణులను ఆహ్వానించటానికి శీఘ్రగాములయిన దూతలను పంపారు. వేగంగా నడిచే వాహనాలతో ఆ దూతలు వారి గమ్యాల ననుసరించి ప్రయాణమయ్యారు. బయలుదేరుతున్న ఒక దూతతో దుశ్శాసనుడు ఇలా అన్నాడు. 'వేగంగా ద్వైతవనానికి వెళ్ళు. పాపాత్ము లయిన పాండవులు అక్కడుంటారు. వారినీ, ఆ వనంలో ఉన్న బ్రాహ్మణులను యథోచితంగా ఆహ్వానించు.'

ఆ దూత పాండవుల దగ్గరకు వెళ్ళి, అందరికీ నమస్కరించి ఇలా అన్నాడు. 'మహారాజా! రాజశ్రేష్ఠుడు కురుకులశ్రేష్ఠుడు అయిన దుర్యోధనుడు తన పరాక్రమంతో సంపాదించిన ధనరాసులతో యాగం చేస్తున్నాడు. ఎక్కడెక్కడ నుండో రాజులు, బ్రాహ్మణులు అక్కడకు వస్తున్నారు. రాజా! మహాత్ముడైన కౌరవుడు నన్ను పంపించాడు. దుర్యోధన నరపాలుడు మిమ్ములను ఆహ్వానిస్తున్నాడు దుర్యోధనుని మనోవాంఛారూపమైన ఆ యాగాన్ని మీరు చూడాలి.' అప్పుడు ధర్మరాజు ఆ దూతమాటలు విని ఇలా అన్నాడు 'రాజశ్రేష్ఠుడైన దుర్యోధనరాజు పూర్వీకుల కీర్తిని పెంపొందింపజేస్తూ గొప్పయాగాన్ని చేస్తున్నాడు ఇది సౌభాగ్యపలం మేము కూడా వెళ్ళాలి. కానీ ఇప్పుడు వెళ్ళలేం. పదమూడు సంవత్సరాలవరకు మేము వనవాసం చేయాలి గదా!' ధర్మరాజు మాట విని దూతతో భీము డిలా అన్నాడు. 'వెళ్ళు. మీరాజు దుర్యోధనునితో ఇలా చెప్పు. నశాధిపుడైన ధర్మరాజు - యుధిష్ఠిరుడు - పదమూడు సంవత్సరాలు గడిచిన తర్వాత అక్కడకు వస్తాడు రణయజ్ఞంలో అస్త్రశస్త్రాలతో జ్వలింపజేయబడిన రోషాగ్నిలో మిమ్ము ఆహుతి చేస్తాడు. రోషాగ్నిలో మండిపోయే ధార్తరాష్ట్రులపై ధర్మరాజు తన క్రోధ మనే హవిస్సును ఆహుతి చేస్తున్నప్పుడు నేను అక్కడ కాలు మోపుతాను. మిగిలిన పాండవులెవరూ అప్రియంగా ఏమీ పలుకలేదు. దూతకూడా వెళ్ళి జరిగినదంతా దుర్యోధనునకు చెప్పాడు.

అప్పుడు నరోత్తములయిన వివిధదేశాధిపతులు బ్రాహ్మణులు హస్తినకు వచ్చారు. వారు యథావిధిగా, యథాశాస్త్రంగా, యథాక్రమంగా సత్కరింపబడ్డారు- ఆ రాజులంతా పరమానందపడిపోయారు. రాజేంద్రా! ధృతరాష్ట్రుడు కూడా కౌరవులందరూ చుట్టూ నిలువగా మహానందంతో విదురునితో ఇలా అన్నాడు. 'విదురా! జనులంతా యజ్ఞసదనంలో అన్నపానాలతో ఆనందించేటట్లు వెంటనే అన్ని ఏర్పాట్లు చేయి.' పండితుడు, ధర్మవేత్త అయిన విదురుడు ఆ ఆదేశాన్ని మన్నించి సర్వవర్ణాలను శాస్త్రోక్తరీతిలో సత్కరించాడు ఆనందంగా భక్ష్యాలనూ, పేయాలనూ, అన్నపానాలనూ పరిమళభరితమయిన పూలమాలలను, వివిధవస్త్రాలను సమకూర్చాడు వీరుడైన దుర్యోధనుడు అందరికీ యథాశాస్త్రంగా యథాక్రమంగా వసతి ఏర్పాటు చేయించాడు. వారిని ఆప్యాయంగా పలుకరిస్తూ, వివిధ

ధనాలను ఇచ్చి వేలకొలదిగ ఉన్న రాజులను విప్రులను వీడ్కొలిపాడు. రాజులనందరినీ వీడుకొలిపి, సోదరులు కలిసి నిలువగా కర్ణశకునులతో కలిసి దుర్యోధనుడు హస్తినాపురంలో ప్రవేశించాడు.

257. అర్జునసంహారమునకై కర్ణప్రతిజ్ఞ - ధర్మజుని చింత.

నగరంలో ప్రవేశిస్తున్న మేటివిలుకాడు అయిన ఆ సుయోధనుని అతని కుమారులు, ఇతరజనులు ప్రస్తుతించారు. అప్పుడు పేలాలను, చందనపుపొడిని చల్లి ప్రజలు రాజా అదృష్టంకొద్దీ ఈ నీక్రతువు నిర్విఘ్నంగా సమాప్తమైనది' అని పలికారు. అక్కడున్న కొందరు వెర్రివాళ్ళు రాజుతో ఇలా అన్నారు- 'నీ క్రతువు యుధిష్ఠిరుని క్రతువుతో సమానం కాదు.' మరికొందరు వెర్రివాళ్ళు "యుధిష్ఠిరుని యాగంలో పదహారవభాగంతో కూడా నీ యాగం సమానం కాదు" అని దుర్యోధనునితో అన్నారు. దుర్యోధనుని మిత్రులు 'ఇది ఇంతకుముందు జరిగిన యజ్ఞాల నన్నిటినీ మించినది. యయాతి, నహుషుడు, మాంధాత, భరతుడు ఈ యజ్ఞకర్మను అనుష్ఠించి పవిత్రులై అందరూ స్వర్గానికి వెళ్ళారు.' మిత్రుల ఈ మంచిమాటలు వింటూ, ఆనందిస్తూ, సుయోధనుడు తన నగరంలో తన మందిరంలో ప్రవేశించాడు. ఆపై తల్లిదండ్రుల పాదాలకు మ్రొక్కి, భీష్మద్రోణకృపాదులకు, ధీమంతుడైన విదురునకు ప్రణమిల్లాడు. సోదరులకు ఆనందదాయకుడైన దుర్యోధనుడు తన తమ్ముల అభినందనలు స్వీకరించాడు. సోదరులందరు చుట్టూ నిలువగా ప్రముఖాసనంపై కూర్చున్నాడు. అప్పుడు కర్ణుడు లేచి మహారాజుతో ఇలా అన్నాడు. 'భరతశ్రేష్ఠా! అదృష్టవశాన నీ ఈ మహాక్రతువు ముగిసింది. నరశ్రేష్ఠా! రణంలో, పాండవులు చనిపోయి, నీవు రాజసూయాన్ని చేస్తే అది సమాప్తమైన రోజు మరలా నిన్ను అభినందిస్తాను.' దుర్యోధన మహారాజు కర్ణునితో ఇలా అన్నాడు - 'నరశ్రేష్ఠా! నీవు చెప్పినది నిజమే. దురాత్ములైన పాండవులు మరణించి రాజసూయమహాక్రతువును చేసినరోజు నీవు ఇదేరీతిగా అభినందించగలవు.' ఇలా పలికి దుర్యోధనుడు కర్ణుని కౌగిలించుకొని, యాగశ్రేష్ఠ మయిన రాజసూయాన్ని గురించి ఆలోచించాడు. ఆ దుర్యోధనుడు తన ప్రక్కనున్న కౌరవులతో ఇలా అన్నాడు. 'కౌరవులారా! పాండవులను అందరినీ సంహరించి, ధనబహుళమైన ఆ మహాయాగాన్ని - రాజసూయాన్ని - నేనే ఎప్పుడు నిర్వహించగలనో?'

అప్పుడు కర్ణుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు- 'రాజోత్తమా! అర్జునుని చంపేదాకా నేను ఎవ్వరిచేతనూ కాళ్ళు కడిగించుకోను. నీటబుట్టినవేవీ తినను. ఆసురవ్రతాన్ని చేపడతాను.

ఎవరయినా యాచిస్తే లేదు అనను.' కర్ణుడు యుద్ధంలో అర్జునుని చంపటానికి ప్రతిజ్ఞ చేయగా మహారథులు, మేటివిలుకాండ్రు అయిన ధార్తరాష్ట్రులు పెద్దపెట్టున అరిచారు. పాండవులు ఓడిపోయినట్లే అని కూడా భావించారు ధార్తరాష్ట్రులు. దుర్యోధనుడు కూడా సహచరుల వందరినీ వీడి, దేవేంద్రుడు చైత్రరథోద్యానవనంలో ప్రవేశించినట్లు తన ఇంట ప్రవేశించాడు ఆ మేటి విలుకాండ్రు అందరు కూడా తమనివాసాలకు వెళ్ళిపోయారు. మేటివిలుకాండ్రయిన పాండవులు దూతవాక్యంతో ప్రేరణపొంది, ఆ విషయాన్ని గూర్చియే ఆలోచిస్తూ, ఎక్కడా సుఖాన్ని పొందలేకపోయారు. దానికితోడు అర్జునుని చంపుతానని కర్ణుడు ప్రతిజ్ఞ చేసిన వృత్తాంతం కూడా గూఢచారుల ద్వారా తెలిసింది. అది విని ధర్మరాజు ఉద్వేగానికి లోనయ్యాడు. కర్ణుని పరాక్రమాన్నీ, సహజకవచాన్నీ తలచుకొని, తాము పడుతున్న కష్టాలను తలచుకొని అశాంతికి గురి అయ్యాడు. ఈ రీతిగా చింతకులోనైన ధర్మరాజుకు మనస్సులో రకరకాల పాములు, జంతువులు నిండి ఉన్న ద్వైతవనారణ్యాన్ని వీడిపోవాలన్న ఆలోచన కలిగింది. దుర్యోధన నరపతి కూడా సోదరులతో, వీరులయిన భీష్మద్రోణ కృపాదులతో, రణభూమిలో ప్రకాశింపగల కర్ణునితో, జూదగాడైన శకునితో కలిసి ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటూ రాజ్యాన్ని పరిపాలించాడు. దుర్యోధనుడు నిత్యమూ రాజులకు అనుగుణంగా ప్రవర్తిస్తూ, యాగాలలో భూరిదక్షిణలిస్తూ, బ్రాహ్మణోత్తములను పూజించాడు. పరంతపుడు, వీరుడూ అయిన దుర్యోధనుడు ధనం దానం చేసినప్పుడు అనుభవించినప్పుడు మాత్రమే సఫల మవుతుందని భావించి, సోదరులకు కూడా అభీష్టాలను సమకూర్చాడు.

258. పాండవులు కామ్యకవనమువకు వెడలుట.

అనంతరం ద్వైతవనంలో ఒకరోజు రాత్రివేళ నిద్రపోతున్న కుంతీసుతుడు యుధిష్ఠిరునికి కన్నీటితో మృగాలు కలలో దర్శనమిచ్చాయి. చేతులు జోడించి భయంతో వణుకుతున్న జంతువులను చూచి ఆ రాజేంద్రుడు 'మీరెవరు? మీకు ఏమి కావాలి? మీరు చెప్పదలచుకున్నది ఏదో చెప్పండి" అని అడిగాడు. పాండుపుత్రుడు ఇలా అడగగానే ఆ మృగాలు యుధిష్ఠిరునితో ఇలా అన్నాయి. 'భారతా! ద్వైతవనంలో చావగా మిగిలిన మృగాలం మేము. మేము ఇక చావలేం. మీరు మీ నివాసస్థానాన్ని మార్చుకోండి. నీ సోదరులు అందరూ శూరులూ అస్త్రవిద్యావిశారదులూ. ఈ అడవిలో నివసించే మా జంతుజాతులను కొద్దిగా మిగిల్చారు. మహామతీ! బీజప్రాయంగా కొద్దిమందిమి మాత్రమే మేము మిగిలిఉన్నాం. మహారాజా! నీ అనుగ్రహంతో వృద్ధి పొందగలుగుతాం భయంతో

వణికిపోతూ బీజమాత్రంగా మిగిలిన ఆ మృగాలను చూచి ధర్మరాజు యుధిష్ఠిరుడు ఎంతో చింతించాడు. సర్వ ప్రాణుల మేలును ఆశించే ఆ రాజు వాటితో "అలాగే మీరు చెప్పినట్లే చేస్తాను' అన్నాడు.

ఈ రీతిగా రాత్రి గడిచింది. ఆ రాజోత్తముడు మేలుకొని మృగాలపట్ల జాలితో సోదరులతో ఇలా అన్నాడు – "చావగా మిగిలిన మృగాలు రాత్రి నా కలలో కనపడి – 'మేము మా మా జాతులలో దారపు పోగులవలె మిగిలాం. మీకు శుభమగుగాక! మా మీద దయ చూపండి' అన్నాయి. అవి కూడా నిజమే చెప్పాయి. అడవిలో నివసించే ఆ జంతువుల పట్ల కూడా మనం దయ చూపాలి. ఎడాదిపై ఎనిమిది నెలలుగా మనం వీనిని ఉపయోగిస్తున్నాం. కనుక మనం మళ్లీ తృణబిందు సరోవర సమీపంలో అనేక మృగాలతో అందంగా ఉండే, ఉత్తమమైన, కామ్యకవనానికి వెళ్లుదాం. అది మరుభూమికి శిరఃస్థానంలో ఉంది. అక్కడే మనం మిగిలిన వనవాస దినాలను సుఖంగా విహరిస్తూ గడుపుదాం. రాజా! ఆపై ధర్మజ్ఞులైన, పాండవులు అక్కడ తమతో కలిసి నివసించే బ్రాహ్మణులతో; ఇంద్రసేనాదులైన పరిచారకులు అందరితో కలిసి బయలుదేరారు. బాటసారులు సదా తిరుగుతూ ఉండే మార్గంలో వారు ప్రయాణించి అనేక తాపసులతో కూడి చక్కని ఆహారం, స్వచ్ఛమైన జలంతో నిండిన పవిత్రాశ్రమాలు కల కామ్యకవనాన్ని దర్శించారు. భరతవంశశ్రేష్ఠులైన ఆ కౌరవులు విప్రపుంగవులు కూడిరాగా పుణ్యాత్ములు స్వర్గాన్ని ప్రవేశించినట్లుగా ఆ వనాన్ని ప్రవేశించారు.

259. వ్యాసమహర్షి పాండవులకు దానమహిమను చెప్పుట.

వనవాసం చేస్తున్న మహాత్ములైన ఆ పాండవులకు అతికష్టంమీద పదకొండు ఏళ్లు గడిచాయి. ఆ పురుషోత్తములు ఫలమూలాలు తింటూ సుఖాలు అనుభవించడానికి అర్హులైనప్పటికీ తమకు కష్టకాలం ప్రాప్తించిందని తలచి, ఆ మహాకష్టాన్ని సహించసాగారు. మహాబాహువు, రాజర్షి అయిన ఆ యుధిష్ఠిరుడు తాను చేసిన అపరాధంవల్లనే తన సోదరులకు ఆ మహాకష్టం వచ్చిందని తలపోస్తూ ఉండేవాడు. జూదసమయంలో జూదానికి కారకుడయిన శకుని యొక్క దుష్టత్వాన్ని భావిస్తూ, కర్ణుని పరుషవాక్యాలను స్మరిస్తూ యుధిష్ఠిరుడు నిట్టూర్పులు విడుస్తూ ఉండేవాడు. దీనుడై కోపమనే విషాన్ని భరిస్తూ మనసులో ముళ్లు గుచ్చుకొన్నవానిలా సుఖంగా నిద్రించలేకపోయేవాడు. అర్జునుడూ, నకులసహదేవులూ, యజ్ఞసేని అయిన ద్రౌపదీ, బలవంతుడు అయిన భీముడూ యుధిష్ఠిరుని చూస్తూ మహాదుఃఖాన్ని ఎలాగో సహించసాగారు. ఇక మిగిలినది కొద్దికాలమే కదా అని

తలపోస్తూ ఆ పురుషశ్రేష్ఠులు ఉత్సాహక్రోధాలు ఉట్టిపడే చేతలతో తమ శరీరాలను వేరొకరీతిగా రూపొందించుకొన్నారు. పిమ్మట కొంతకాలానికి సత్యవతీ సుతుడు, మహాయోగి అయిన వ్యాసమహర్షి పాండవులను చూడడానికి వచ్చాడు. అతని రాకను చూసి కుంతీపుత్రుడయిన యుధిష్ఠిరుడు ఎదురేగి ఆ మహాత్ముని యథావిధిగా తోడ్కొనివచ్చాడు. వ్యాసమహర్షి ఆసీను డయ్యాక ఆయనను సేవించటానికి యుధిష్ఠిరుడు ఆయన ధగ్గరకు చేరి, పాదాలకు నమస్కరించి, సంతోషం కలిగించాడు. అడవులలో కందమూలాలతో జీవనం గడుపుతూ కృశించిపోయిన మనుమలను చూసి మహర్షి జాలిపడ్డాడు. వారిమీద దయచూపుతూ కన్నీటితోనూ, రుద్ధమైన కంఠంతోనూ ఇలా అన్నాడు.

'ధర్మజ్ఞులలో మేటి అయిన మహాబాహూ యుధిష్ఠిరా! నేను చెప్పేది విను. తపస్సు చేయనివారు ఈ లోకంలో మహాసుఖాలను పొందలేరు. మానవుడు సుఖదుఃఖాలను పర్యాయంగా అనుభవిస్తూ ఉంటాడు. పురుషశ్రేష్ఠా! ఎవడూ కూడా అనంతమైన సుఖాన్ని పొందలేడు. ప్రాజ్ఞుడైన పురుషుడు మాత్రమే చక్కని బుద్ధితో సుఖదుఃఖాల రాకపోకలను తెలిసికొని ఆనందించడు, విచారించడు. కాబట్టి వివేకవంతుడు సుఖం వస్తే (త్యాగపూర్వకంగా) అనుభవించాలి. దుఃఖం వచ్చిపడితే(ధైర్యంతో) సహించాలి. కాలానుసారంగా ప్రాప్తించేదానిని రైతు పంటను స్వీకరించినట్లు స్వీకరించాలి. భారతా! తపస్సును మించినది లేదు. తపస్సు చేత గొప్ప ఫలాలను పొందవచ్చు. తపస్సుకు అసాధ్యమైనదేదీ లేదని తెలుసుకో. మహారాజా! సత్యం, ఋజువర్తనం, క్రోధం లేకపోవడం, దేవతలకు అతిథులకు నివేదించిన తరువాత భుజించడం, ఇంద్రియనిగ్రహం, శాంతం, అసూయ లేకపోవడం, హింస చేయకపోవడం, శౌచం, ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవడం - అనేవి పుణ్యాత్ములు ఆచరిస్తారు. ఈ గుణాలు మనుష్యులను పవిత్రం చేస్తాయి అధర్మమందు ఆసక్తికల మూఢాత్ములు పశుపక్ష్యాది తిర్యగ్యోనులను పొందుతారు. అటువంటి కష్టమైన జన్మలను పొందిన జనులు సుఖాన్ని పొందలేరు. ఇక్కడ చేసిన కర్మలు అక్కడ పరలోకంలో ఫలిస్తాయి. కనుక శరీరాన్ని తపస్సుతోను, నియమంతోను జోడించాలి. రాజా! సమయానికి వచ్చిన అతిథికి నమస్కరించి, పూజలు చేసి, మాత్సర్యం లేకుండా, సంతోషంతో నిండిన మనస్సుతో దానం చేయాలి. సత్యవాది దీర్ఘాయువును, ఆక్లేశాన్ని సరళత్వాన్ని పొందుతాడు **క్రోధం లేనివాడు, అసూయలేనివాడు పరమానందాన్ని పొందుతాడు.**

మనోనిగ్రహం కలవాడు శాంత స్వభావం కలవాడు ఎన్నడూ కష్టాలను పొందడు. దాంతాత్ముడు ఇతరులు పొందిన సంపదను చూచి పరితపించడు. దేవతలకు అతిథులకు

వారి వారి భోగాలను వారికి ఇచ్చినవాడు భోగాలను అనుభవిస్తాడు దానం చేసిన నరుడు సుఖవంతు డవుతాడు. **హింసచేయనివాడు చక్కని ఆరోగ్యాన్ని పొందుతాడు.** మాన్యులను గౌరవించేవాడు సత్కులంలో పుడతాడు. జితేంద్రియుడు వ్యసనాలకు లోబడడు. (ఈ లోకంలోను, పరలోకంలోను మిక్కిలి సుఖాలను పొందుతాడు.) **శుభాలనే అనుపరించే బుద్ధిగలవాడు చనిపోయినప్పటికీ ఆ గుణసంయోగం వలన మంచిబుద్ధిగలవాడుగానే పుడతాడు.*** యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు - 'పూజ్యుడా! మహామునీ! దానధర్మాలు, తపస్సు - వీటిలో ఏది అధికఫలమిస్తుంది? కష్టమయిన దేది?" వ్యాసుడు చెపుతున్నాడు - "దానాన్ని మించిన దుష్కరకార్యం ఈ లోకంలో మరొకటి లేదు ధనమందు ఎక్కువ మక్కువ ఉంటుంది. సంపద కష్టం మీద లభిస్తుంది. మహామతీ! సాహసవీరులు ధనంకోసం(రత్నాలకోసం) తమకు ప్రియమైన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా సముద్రంలో మునకలు వేస్తూంటారు. అరణ్యాలలో తిరుగుతూ ఉంటారు. కొంతమంది మానవులు వ్యవసాయం, పశుపాలన తమ జీవనాధారంగా స్వీకరిస్తారు. కొంతమంది ధనం కోసం దాస్యం చేయడానికి బయలుదేరుతారు. కాబట్టి కష్టపడి సంపాదించిన దానిని వదిలిపెట్టడం అతిదుష్కరం. దానంకంటె దుష్కరతరమయినది లేదు. కాబట్టి దానమే గొప్పదని నా అభిప్రాయం. ఇక్కడ ఒక విశేషాన్ని తెలుసుకోవాలి. **న్యాయంగా ఆర్జించిన ధనాన్ని దేశకాలపాత్రాలు గమనించి సత్పురుషులకు దానం చేయాలి.** అన్యాయంగా ఆర్జించిన విత్తంతో ఎవరైనా దానం చేస్తే అది ఆ చేసినవానిని మహా భయాన్నుండి రక్షించదు. యుధిష్ఠిరా! పరిశుద్ధమైన మనసుతో, సరియైన సమయంలో, సత్పాత్రునికి కొద్దిగా ఇచ్చినా సరే అది పరలోకంలో అనంతఫలం ఇస్తుందని భావింపబడుతోంది. ఈ సందర్భంగా ప్రాచీనమైన ఈ ఇతిహాసాన్ని ఉదాహరిస్తూ ఉంటారు. ముద్గలుడు ద్రోణపరిమాణం కల ధాన్యాన్ని దానం చేసి గొప్ప ఫలితాన్ని పొందాడు.

260. దుర్వాసుడు ముద్గలుని దాననిష్ఠను పరీక్షించుట.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు - "భగవాన్! మహాత్ముడైన ముద్గలుడు ద్రోణ పరిమాణం కల వ్రీహిధాన్యాన్ని ఎలా ఎవిధిని అనుసరించి దానం చేశాడు? ఎవరికి దానం చేశాడు? నాకు వివరంగా చెప్పండి. ధర్మాన్ని ప్రత్యక్షంగా చూసి, తెలుసుకోగల భగవంతుడు ఎవరు చేసిన పనులవలన సంతుష్టుడు అవుతాడో ఆ సద్ధర్మచారి యొక్క జన్మ సఫలమని

* శుభామశయబుద్ధిర్హి పంయుక్తః కాలధర్మణా ।
ప్రాదుర్భవతి తద్యోగాత్ కల్యాణమతిరేవ పః ॥ 26

నేను అనుకొంటున్నాను." వ్యాసుడు చెప్పసాగాడు – "రాజా! జితేంద్రియుడు, సత్యవాక్కు, అసూయలేనివాడు, ధర్మాత్ముడు అయిన ముద్గలుడు అనే మహర్షి కురుక్షేత్రంలో శిలోంఛవృత్తిచేత జీవిస్తూ ఉండేవాడు. అతడు అతిథిసేవను వ్రతంగా ఆచరిస్తాడు. కర్మనిష్ఠుడు కపోతవృత్తిని ఆశ్రయించినవాడు. ఆ మహాతపస్వి ఇష్టికృతమనే యజ్ఞం అనుష్ఠిస్తూ ఉండేవాడు. కపోత వృత్తిని అనుసరించి పక్షంలో ద్రోణపరిమాణం కల వ్రీహి ధాన్యాన్ని సంపాదించేవాడు. (పావురం గింజ గింజ చొప్పున ఏరినట్లుగా, ఒక్కొక్క గింజను ఏరి పక్షంలో ద్రోణం నిండుగా ధాన్యాన్ని సంపాదించేవాడు). భార్యాపుత్రులతో కలిసి ముని పక్షంలో ఒక్కసారి మాత్రమే ఆహారం భుజిస్తూ ఉండేవాడు. మాత్సర్యం లేని అతడు అమావాస్యకు పౌర్ణమికి యజ్ఞాలు చేస్తూ దేవతలకు అతిథులకు సమర్పించి, మిగిలిన అన్నంతోనే జీవనం గడుపుతూ ఉండేవాడు. ముల్లోకాలకు అధిపతి అయిన ఇంద్రుడు దేవతలతోపాటు ప్రతిపర్వంలోను అతని యజ్ఞంలో భాగాన్ని స్వయంగా గ్రహిస్తూ ఉండేవాడు.' ముద్గలఋషి మునివృత్తిని అవలంబించి పర్వకాలోచితమైన కర్మలు – దర్శపౌర్ణమాస యజ్ఞాలు చేసి హర్షోల్లాసాలు నిండిన హృదయంతో అతిథులకు అన్నం పెడుతూ ఉండేవాడు. మాత్సర్యహీనుడైన ఆ మహాత్ముడు ముద్గలుడు ద్రోణ పరిమాణం కల వ్రీహి ధాన్యంతో వండిన అన్నాన్ని ఒక అతిథికి అర్పించేవాడు. రెండవ అతిథిని ముద్గలుడు చూడగానే మిగిలిన అన్నం వృద్ధి పొందుతూ ఉండేది. ఆ విధంగా ఆ అన్నాన్ని మనీషులైన బ్రాహ్మణులు వందమందిదాకా తింటూ ఉండేవారు. ముని యొక్క విశుద్ధమైన త్యాగబుద్ధి వలన ఆ అన్నం వృద్ధి పొందుతూ ఉండేది.

రాజా! దిగంబరంగా తిరిగే దుర్వాసు డనే మహర్షి ధర్మిష్ఠుడైన ముద్గలుని యొక్క ఉత్తమవ్రతనియమం గురించి విన్నాడు. విని అతని దగ్గరకు విచ్చేశాడు. పాండవా! పిచ్చివానివలె అస్తవ్యస్త వేషంతో, బోడితలతో, రకరకాలుగా పరుష వాక్కులు పలుకుతూ ఉన్నాడు ఆ దుర్వాసముని. మునిసత్తముడైన దుర్వాసుడు అతనిని సమీపించి ఆ విప్రునితో ఇలా అన్నాడు – "ద్విజోత్తమా! నేను అన్నార్థినై ఇక్కడకు వచ్చానని తెలుసుకో". "మీకు స్వాగతం" అని ముద్గలుడు మునితో పలికి, పాద్యాన్ని ఉత్తమమైన అర్ఘ్యాన్ని, ఆచమనీయాన్ని సమర్పించాడు. ధృతవ్రతుడూ, అతిథివ్రతీ అయిన అతడు ఆకలితో ఉన్మత్తుడైన ఆ తాపసికి మిక్కిలి శ్రద్ధతో అన్నం పెట్టాడు. ఆ అన్నమేమో రుచిగా ఉంది. అతడేమో క్షుధార్తుడై ఉన్నాడు. ఆ ఉన్మత్తుడు మొత్తం అంతా తినేశాడు. ముద్గలుడు అతనికి ఇంకా పెట్టాడు. ఆ అన్నం కడుపునిండా తిని, ఎంగిలి అన్నం తన శరీరమంతా పూసుకొన్నాడు. తరువాత ఎలా వచ్చినవాడు ఆలాగే వెళ్లిపోయాడు. ఈ రీతిగానే తర్వాతి

పర్వదినం రాగానే, ఉంఛవృత్తితో జీవించే ఆ మనీషి ముద్గలుని వద్దకు సరియైన సమయానికి వచ్చి, అతని అన్నాన్నంతటినీ తినేశాడు. నిరాహారుడైన ముని తిరిగి ఉంఛవృత్తిని అనుసరించి, గింజలు ఏరి పోగుచేయడం మొదలుపెట్టాడు. ఆకలి ముద్గలునిలో వికారం కలుగచేయడానికి సమర్థంకాకపోయింది. భార్యాపుత్రులతో కూడి ఉంఛవృత్తి చేసుకొంటున్న ఆ ద్విజోత్తముని క్రోధం గాని, మాత్సర్యం గాని, అవమానం గాని, సంభ్రమం గాని ఆవేశించలేదు. ఆ రీతిగా ఉంఛవృత్తి ధర్మాన్ని పాటించే ముద్గలముని దగ్గరకు దుర్వాసుడు అతని దీక్షను భంగపరచడానికి కృతనిశ్చయుడై ఆరుసార్లు పర్వసమయాలలో వచ్చాడు. కాని అతని మనసులో ఏమాత్రం మార్పు అతనికి కనపడలేదు. శుద్ధమైన చిత్తవృత్తి కల ఆ ముద్గలముని యొక్క మనస్సు ప్రతిపర్యాయమూ నిర్మలంగానే కనపడింది.

అతడు ప్రీతుడై ముద్గలమునితో – "మాత్సర్యం విడిచిపెట్టిన నీవంటి దాతతో సమానుడైనవాడు ఈ లోకంలోనే లేడు. ఆకలి ధర్మజ్ఞానాన్ని నశింపచేస్తుంది. ధైర్యాన్ని హరిస్తుంది. పైగా రుచులు కోరుకొనే నాలుక రుచులకోసం వెంపర్లాడుతుంది. ప్రాణాలు ఆహారంవల్ల నిలుస్తాయి. చంచలమైన మనస్సును అరికట్టడం కష్టసాధ్యం. మనస్సును, ఇంద్రియాలను ఏకాగ్రం చేయడమే తపస్సు శ్రమపడి సంపాదించినదానిని నిర్మలచిత్తంతో దానం చేయడం అతికష్టం. కాని సాధుపురుషా! అదంతా నీవు యథార్థంగా సాధించగలిగావు. మేము సంతోషించాం. నిన్ను కలుసుకొని నీ అనుగ్రహం పొందినట్లుగా భావిస్తున్నాం. ఇంద్రియనిగ్రహం, ధైర్యం, దేవతలకు అతిథులకు దానం చేయడం, దమం, శమం, దయ, సత్యం, ధర్మం – అన్నీ నీయందు చక్కగా కుదురుకొన్నాయి. (నీవంటి నిర్మలమైన అంతఃకరణం కలవాడు వేరొకడు లేడు). నీవు నీ పుణ్యకర్మలచేత లోకాలన్నీ జయించావు. పరమపదాన్ని పొందావు. ఆహా! స్వర్గంలో ఉండే దేవతలు కూడా నీ దానమహిమను ఎలుగెత్తి చాటుతున్నారు. ఉత్తమవ్రత చరిత కలవాడా! నీవు సశరీరంగా స్వర్గానికి వెళ్తావు" అన్నాడు. దుర్వాసముని ఈ రీతిగా అంటూండగానే, దేవదూత విమానం తీసుకొని ముద్గలునివద్దకు వచ్చాడు. ఆ విమానానికి హంసలు, బెగ్గురుపక్షులు కట్టబడి ఉన్నాయి. చిరుమువ్వల మాలికలు అలంకరింపబడి ఉన్నాయి. దివ్యమైన సువాసనతో కామగమనం కలిగిన అది విచిత్రంగా భాసిస్తోంది. దేవదూత బ్రాహ్మణోత్తము డైన ముద్గలమునితో – "మునీ! నీపుణ్యకర్మలచేత ఈ విమానాన్ని పొందగలిగావు. దీనిని ఎక్కు. పరమగతిని పొందావు" అన్నాడు.

అలా అన్న ఆ దేవదూతను ముద్గలఋషి ఇలా ప్రశ్నించాడు –"దేవదూతా! స్వర్గంలో నివసించే వారి గుణాలను నీవు చెప్పగా వినా లనుకొంటున్నాను. అక్కడ

నివసించేవారి గుణా లేమిటి? వారు ఎటువంటి తపస్సు చేసినవారు? వారి నిశ్చయాలు ఎలా ఉంటాయి? స్వర్గంలోని సుఖం ఏమిటి? దోషం ఏమిటి? ప్రభూ! సత్పురుషులకు "సఖ్యం సాప్తపదీనం" అని కులీనులైన సత్పురుషులు చెపుతూ ఉంటారు. కాబట్టి ఆమైత్రిని పురస్కరించుకొని నేను నిన్ను అడుగుతున్నాను. ఈ విషయంలో తథ్యమూ, హితకరమూ అయినది సంకోచించకుండా చెప్పు. నీ మాటలు విన్నాక దానిని బట్టి నా కర్తవ్యం నిశ్చయించుకొంటాను".

261. ముద్గలుడు స్వర్గలోకమును నిరాకరించుట - వ్యాసుడు యుధిష్ఠిరుని ఓదార్చి వెడలుట.

దేవదూత ఇలా అన్నాడు. 'మహర్షీ! నీవు ఉత్తమమైన బుద్ధి కలవాడవు. స్వర్గసుఖాలు ఉత్తమమైనవని చాలామంది అనుకొంటూ ఉంటారు. దానిని నీవు పొందావు. అయినా పామరుని వలె గుణదోషాలను గూర్చి ఆలోచిస్తున్నావు. మునీ! స్వర్లోకమని చెప్పబడే లోకం ఇక్కడికి చాలాపైన ఉంది. ఆ మార్గం చాలా ఉత్తమం. కనుకనే దానిని ఊర్ధ్వగమని, సత్పథమని అంటారు. అక్కడి వారు ఎల్లప్పుడూ విమానాలమీద విహరిస్తూ ఉంటారు. ముద్గలా! తపస్సు చేయనివారు, గొప్పగొప్ప యజ్ఞాలు చేయనివారు, అసత్యవాదులు, నాస్తికులు అక్కడికి వెళ్లలేరు. బ్రాహ్మణోత్తమా! ధర్మాత్ములు, మనసును అదుపులో ఉంచుకొన్నవారు, శాంతులు, దాంతులు, మాత్సర్యం లేనివారు, దానధర్మపరాయణులు, యుద్ధకళాకుశలులైన శూరులు - వీరు మాత్రమే శమదమాత్మకమైన ధర్మాన్ని ప్రధానంగా చేసుకొని, సత్పురుషులు సంచరించే పుణ్యలోకాలను చేరుకొంటారు. మౌద్గల్యా! అక్కడ దేవతలు, సాధ్యులు, విశ్వేదేవులు, మహర్షులు, యాములు, ధాములు, గంధర్వులు, అప్సరసలు - మొదలైన దేవసమూహాలకు వేరువేరుగా అనేక లోకాలున్నాయి. అవి ప్రకాశ మహితాలు; ఇచ్ఛారూప మైన భోగాలతో కూడినవి, తేజోమయాలు, మంగళప్రదాలూ. ముద్గలా! ఆ స్వర్గంలో ముప్పది మూడువేల యోజనాలు విస్తృతికల బంగారుమయమైన మేరుపర్వతం ఉంది. పుణ్యాత్ములు విహరించే నందనం మొదలైన దేవోద్యానాలు ఉన్నాయి. అక్కడ ఆకలిదప్పులు గాని, అలసట గాని, శీతోష్ణాలవలన భయం కాని ఉండవు. అక్కడ జుగుప్సాపూరితమైన, అమంగళకరమైన వస్తువులు ఏవీ ఉండవు. సుగంధాలు మనసును మురిపిస్తాయి. అంతటా స్పర్శ సుఖకరమై ఉంటుంది. శబ్దాలు అక్కడంతటా చెవిని, మనసును ఆకట్టుకొనేలా ఉంటాయి. మునీ! అక్కడ శోకం ఉండదు. అలసట గాని, విలాపాలు గాని ఉండవు.

మహర్షీ! ఇటువంటి స్వర్గలోకం తమతమ సత్కర్మలకు ఫలంగానే పొందదగింది. మానవులు తాము చేసిన పుణ్యకర్మలవలన అక్కడ ఉండగలుగుతారు. అక్కడివారి శరీరాలు తేజోరూపాలుగా ఉంటాయి. అంతేకాని మాతాపితరుల రజోవీర్యాల వలన కలిగినవి కావు. మునీ! అక్కడ ఉన్నవారికి చెమటపట్టదు. దుర్వాసన ఉండదు. మల మూత్రాలు ఉండవు. వారి వస్త్రాలు మాసిపోవు. దివ్యమైన సువాసనలు వెదచల్లుతూ, మనోజ్ఞంగా ఉండే వారి పూలమాలలు వాడిపోవు. ఆ రీతిగా ఉండే విమానాలే వారందరికీ ఉంటాయి. వారు అసూయకు, శోకానికి, అలసటకు దూరంగా ఉంటారు. మోహం, మాత్సర్యం వారికి ఉండవు. తమ సత్కర్మలచేత స్వర్గాన్ని పొందినవారు సుఖంగా జీవిస్తారు. పైన వర్ణింపబడిన దేవతల యొక్క ఆ లోకాలకు పైన గుణసంపన్నమైన దివ్యలోకాలెన్నో ఉన్నాయి. అన్నిటికంటెపైన తేజోమయమై మంగళకరమైన బ్రహ్మలోకం ఉంది. అక్కడకు శుభకర్మలు చేసి పవిత్రులైన ఋషులు వెడతారు. దేవతల లోకాలకంటే ఉత్కృష్టమైన ఇంకొక లోకం ఉంది. దేవతలకు కూడా ఆరాధ్యులైన ఋభువులు అనే దేవతలు అక్కడ ఉంటారు. దేవతలు వారిని పూజిస్తూ ఉంటారు. ఆ ఉత్తమమైన లోకాలు స్వయంప్రకాశాలు. తేజస్వంతాలు. కోరికలను తీర్చేవి. అక్కడున్నవారికి స్త్రీసంబంధమైన బాధలు లేవు. లోకాలలోని ఐశ్వర్యాన్ని గూర్చి, వారికి మాత్సర్యం లేదు. వారు ఆహుతులతో జీవించరు. అమృతాన్ని భుజించవలసిన అవసరం కూడా లేదు. వారు దివ్యశరీరులు. ఆకారాలు లేనివారు. వారు సుఖంలోనే ఉంటారు. కాని సుఖాన్ని కోరుకోరు. దేవతలకు కూడా దేవతలైన వారు సనాతనులు. కల్పాలు మారినా వారు మాత్రం మారరు. ఎప్పటిలాగే ఉంటారు. మునీ! హర్షం, ప్రీతి, సుఖం మొదలైన భావాలే వారికి ఉండవు. ఇక చావు పుట్టుకలు ఎక్కడివి ? ఇక సుఖం, దుఃఖం, రాగద్వేషాలు ఎక్కడుంటాయి ? మౌద్గల్యా! స్వర్గవాసులైన దేవతలు కూడా ఆ ఉత్తమగతిని పొందాలని కోరుకొంటారు. ఆ పరమ సిద్ధి పొందడం దుర్లభం. కామవాసనలు గలవారు చేరలేనిది. ముప్పదిమూడుమంది దేవతలు ఉండే ఈ లోకాలను మనుషులు ఉత్తమనియమాలద్వారా గాని, విధిపూర్వకమైన దానాల ద్వారా గాని చేరుకోగలరు. ఆ సుఖసంపత్తిని నీవు నీ దానం ద్వారా పొందగలిగావు. తపస్సుచేత విరాజమానుడవై పుణ్యం చేత లభించే దానిని అనుభవించు.

విప్రవర్యా! ఇదీ స్వర్గసుఖం అంటే. ఈ లోకాలు రకరకాలుగా ఉంటాయి. స్వర్గంలో ఉండే గుణాలు చెప్పాను. దోషాలు కూడా నీకు చెప్తాను విను. చేసినపనికి ఫలితాన్నే ఆ స్వర్గంలో అనుభవిస్తారు. అంతే తప్ప వేరే ఏ కర్మా చేయడానికి వీలుకాదు. ఆ ఫలితం అంతా తరిగిపోయేవరకు భోగాలు ప్రాప్తిస్తాయి. ముద్గలా! పుణ్యకర్మలకు భోగాలు

అనుభవించడం పూర్తి అయ్యాక అక్కడినుండి పతనం కాకతప్పదు! ఇదే స్వర్గంలోని దోషమని నా ఉద్దేశ్యం. సుఖాలలో మనస్సు లగ్న మయిన వారికి పతనం కావడం ఎంతోకష్టం. స్వర్గంలో కూడా క్రిందిస్థాయిలో ఉన్నవారు తమకంటె పైలోకాలలో ఉన్నవారి సముజ్జ్వల సంపత్తిని చూచి అసంతుష్టిని, పరితాపాన్ని పొందడం చాలా బాధాకరమైన విషయం. స్వర్గాన్నుండి జారిపోయేసమయంలో వారికి తెలివి లోపించిపోతుంది. రజోగుణం చేత బుద్ధి నశిస్తుంది. హారాలు వాడిపోవడం ద్వారా వారికి తమపతనం గురించి తెలిసి, మనసులో మహాభయం కలుగుతుంది. మౌద్గల్యా! బ్రహ్మలోకపర్యంతం అన్నిలోకాలలోను ఈ దారుణమైన దోషాలు ఉన్నాయి. స్వర్గలోకంలో ఉండే పుణ్యాత్ముల గుణాలు మాత్రం పదివేలు. మునీ! స్వర్గంనుండి పతనమయ్యేవారిలో ఇంకొక మంచిగుణం ఉంది. తాముచేసిన పుణ్యకర్మల సంస్కారం వలన మనుష్యులలోనే జన్మిస్తారు. అక్కడకూడా ఆ మహాభాగుడు సుఖసాధనసంపత్తితోనే జన్మిస్తాడు. అప్పుడు మాత్రం తన కర్తవ్యం గుర్తించలేకపోతే అంతకంటె అధమగతిని పొందుతాడు. బ్రాహ్మణోత్తమా! ఇక్కడ కర్మలు చేస్తారు. ఫలితాలు అక్కడ అనుభవిస్తారు. ఇది కర్మభూమి, అది ఫలభూమి అని భావిస్తారు.'

ముద్గలుడు ఆడుగుతున్నాడు – "స్వర్గంలో ఉండే ఈ మహాదోషం గురించి నీవు చెప్పావు. కాని దోషంలేని వేరే ఇంకొక లోకమేదైనా ఉంటే దానిని గురించి చెప్పు." దేవదూత చెపుతున్నాడు – "బ్రహ్మలోకానికి పైన విష్ణువుయొక్క పరమపదం ఉంది. అది శుద్ధం, సనాతనం, జ్యోతిర్మయం. దానిని పరబ్రహ్మ అని కూడా అంటారు. విప్రుడా! విషయలాలసులైన వారు అక్కడకు వెళ్లలేరు. దంభం, లోభం, మహాక్రోధం, మోహం, ద్రోహం – ఈ దోషాలతో కూడినవారు కూడా అక్కడకు చేరుకోలేరు. **అహంకారం, మమకారం లేనివారు, ద్వంద్వరహితులు, ఇంద్రియనిగ్రహం కలవారు, ధ్యానయోగపరులు అయిన వారు మాత్రమే అక్కడకు వెళ్లగలరు.*** ముద్గలా! నీవు నన్ను అడిగినదంతా నీకు చెప్పాను. సాధుపురుషా! ఇక నీవు దయచూపితే మనం చక్కగా స్వర్గానికి వెడదాం. ఆలస్యం చేయకు.'

ఇదంతా విని మౌద్గల్యుడు తనబుద్ధితో ఆలోచించాడు. అలా ఆలోచించి ఆ మునిశ్రేష్ఠుడు దేవదూతతో ఇలా అన్నాడు. "దేవదూతా! నీకు నమస్కారం. తండ్రీ! ఇక నీవు సుఖంగా వెళ్లిరా. మహాదోషంతో కూడిన ఆ స్వర్గంతో కాని, సుఖంతో కాని నాకు పనిలేదు. స్వర్గాన్ని పొందినవారు పతనమయ్యాక అతిభయంకరమైన మహాదుఃఖాన్ని

---

* నిర్మమా నిరహంకారాః నిర్ద్వంద్వాః సంయతేంద్రియాః ।
ధ్యానయోగపరాశ్చైవ తత్ర గచ్ఛంతి మానవాః ॥ 39

పరితాపాన్ని పొందుతారు. మళ్లీ ఇక్కడే తిరుగుతూ ఉంటారు. కాబట్టి నేను స్వర్గాన్ని కోరుకోను. శోకం లేనిచోటికి, వ్యథ లేనిచోటికి, చలనం లేనిచోటికి వెళ్లాలని దాని కోసం అన్వేషిస్తున్నాను.' ఆ ముని దేవదూతకు ఇలా చెప్పి అతనికి వీడ్కోలు ఇచ్చాడు. తాను యథాప్రకారం శిలోంఛవృత్తిని స్వీకరించి, ధర్మాత్ముడై ఉత్తమమైన శమాదిగుణాలను పాటించసాగాడు. **నిందాస్తుతులను సమానంగా పరిగణిస్తూ, కొయ్య, రాయి, బంగారాలయందు సమభావం చూపుతూ, శుద్ధమైన యోగంతో నిత్యధ్యానంతో కాలం గడపసాగాడు. ధ్యానయోగ బలంచేత అత్యుత్తమమైన బుద్ధిని పొంది, మోక్షస్వరూపమైన శాశ్వతమైన పరమసిద్ధిని పొందాడు.** కాబట్టి కౌంతేయా! చక్కని రాజ్యం నుండి భ్రష్టుడవై నందుకు నీవు కూడా విచారించకు. తపస్సు చేత దానిని పొందగలవు. **సుఖానంతరం దుఃఖం, దుఃఖానంతరం సుఖం చక్రంలోని ఆకులలాగ మనిషికి పర్యాయక్రమంలో తారసపడుతూ ఉంటాయి.** అమితవిక్రముడా! పదమూడేళ్లు గడిచాక ఆపై సంవత్సరంలో నీవు నీతండ్రి తాతల రాజ్యాన్ని పొందగలవు, నీ మనసులోని చింతను దూరం చేసుకో. ధీమంతుడైన వ్యాసభగవానుడు ఈరీతిగా పాండునందనునికి చెప్పి తిరిగి తపస్సు చేసుకోవడానికి ఆశ్రమానికి మరలిపోయాడు.

262. దుర్యోధనుడు దుర్వాసుని యుధిష్ఠిరుని కడకు పంపుట.

జనమేజయుడు అడుగుతున్నాడు - "వైశంపాయన మహర్షీ! మహాత్ములైన పాండవులు ఈరీతిగా అడవులలో నివసిస్తూ; మునులతో కలిసి విచిత్రమైన కథలు వింటూ ఆనందిస్తూ; సూర్యుడు ఇచ్చిన పాత్రలో ద్రౌపదీదేవి భుజించేంతవరకు అక్షయంగా ఉండే అన్నంతో అన్నార్థులై వచ్చిన బ్రాహ్మణులను తృప్తిపరుస్తూ కాలం గడుపుతూ ఉండగా దుశ్శాసన కర్ణశకునుల మతాన్ని అనుసరించి నడుచుకొనే ఆ దుర్యోధనాదులు అందరూ ఆ పాండవులపట్ల ఎలా ప్రవర్తించారు? నేను అడిగిన విషయాలన్నీ చెప్పండి." వైశంపాయనుడు చెప్పసాగాడు - "మహారాజా! వారు అడవులలో కూడా పట్టణంలో ఉన్నట్లుగానే ఆనందంగా ఉంటున్నారని విని దుర్యోధనుడు వారికి అపకారం చేయాలని భావించాడు. ఆ రీతిగా ఆలోచించివారు కర్ణదుశ్శాసనాదులతో కలిసి పాండవులకు అపకారం చేయడానికి అనేక ఉపాయాలు ఆలోచిస్తూ ఉన్నారు. అప్పుడు మహాయశస్వి, ధర్మాత్ముడు, తాపసి అయిన దుర్వాస మహాముని పదివేలమంది శిష్యులతో కలిసి యథేచ్ఛగా వారివద్దకు వచ్చాడు. ముక్కోపి అయిన ఆ మునిరాకను చూచి శ్రీమంతుడయిన దుర్యోధనుడు ఒళ్లు దగ్గరపెట్టుకొని నమ్రభావంతో వినీతాత్ముడై, తమ్ముళ్లతో కలిసి, అతనిని ఆతిథ్యంకోసం ఆహ్వానించాడు.

దుర్యోధనుడు స్వయంగా సేవకునివలె నిలబడి విధిపూర్వకంగా ఆ మునిని పూజించాడు. ఆ మునిపుంగవుడు అక్కడ కొన్నిరోజులపాటు ఉన్నాడు. దుర్యోధనుడు అతడు శపిస్తాడేమోనని శంకించి దివారాత్రాలు జాగరూకుడై అతనికి సేవలు చేశాడు. ఆ ముని ఒక్కొక్కసారి "నాకు ఆకలిగా ఉంది. వెంటనే భోజనం పెట్టు" అని చెప్పి స్నానానికి వెళ్లిపోయి, చాలాసేపటికి తిరిగివస్తాడు. వచ్చి, "ఈరోజు అన్నం తినను. నాకు ఆకలిలేదు." అని చెప్పి అదృశ్యమైపోతాడు. ఒక్కొక్కసారి ఎక్కడినుండో అకస్మాత్తుగా వచ్చి తొందరపడిపోతూ "మాకు భోజనం పెట్టు" అంటాడు. ఒక్కొక్కసారి అర్ధరాత్రివేళ లేచి బెదిరించేవాడు. ఎప్పటిమాదిరిగానే సిద్ధం చేయించిన అన్నాన్ని దూషిస్తూ తినడు. అతడు అలా ప్రవర్తిస్తున్నప్పటికీ దుర్యోధన మహారాజు ఏమాత్రం చిరాకును, కోపాన్ని ప్రదర్శించలేదు. అప్పుడు దుర్దర్షుడైన ముని సంతుష్టుడై అతనితో "వరం ఇస్తాను" అని అన్నాడు.

"రాజా! నీకు శుభమగుగాక! నీ మనసులో ఏదైనా ఉంటే అది వరంగా అడుగు. నేను సంతోషించాక ధర్మానుకూలమైనది ఏదీ నీకు లభించకుండా ఉండదు." శుద్ధాంతఃకరణుడైన ఆ మహర్షియొక్క మాటలు విని సుయోధనుడు తన్ను పునర్జీవితునిగా భావించుకొన్నాడు. ముని సంతుష్టు డయితే వరం అడగాలని నిశ్చయించుకొని అంతకుముందే కర్ణదుశ్శాసనాదులతో మంత్రాంగం జరిపి ఉన్నాడు ఆ దుష్టుడు. అందుకని రాజా! అతిసంతోషంతో ఇలా వరం అడిగాడు. "బ్రాహ్మణోత్తమా! శిష్యులతో కలిసి మీరు నాకు అతిథి అయ్యారు. మావంశంలో జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అయినవాడు యుధిష్ఠిరమహారాజు; ఆ ధర్మాత్ముడు తమ్ములతో పరివేష్టింపబడి అడవులలో నివసిస్తున్నాడు. శీలసంపన్నుడు గుణవంతుడు అయిన అతనికి మీరు అతిథులు కండి. ఆ సుకుమారి, యశస్విని, రాజపుత్రి ద్రౌపదీ సతి విప్రులందరికీ, భర్తలకు భోజనం పెట్టి, తాను కూడా భుజించి విశ్రాంతిగా సుఖంగా కూర్చున్నపుడు, నామీద మీకు అనుగ్రహం ఉంటే ఆ సమయంలో మీరు అక్కడకు వెళ్లండి.' "నీకు ప్రీతి కలిగించడానికి అలాగే చేస్తాను' అని సుయోధనునికి చెప్పి బ్రాహ్మణోత్తముడైన దుర్వాసుడు కూడా ఎలా వచ్చినవాడు అలాగే వెళ్లిపోయాడు. అప్పుడు సుయోధనుడు తన్ను తాను కృతార్థునిగా భావించాడు. అతడు తన చేతితో కర్ణుని చేతిని పట్టుకొని, మిక్కిలిగా సంతోషించాడు. కర్ణుడు కూడా తమ్ముళ్లతో కలిసి ఉన్న రాజుతో సంతోషంగా ఇలా అన్నాడు. కర్ణుడు అంటున్నాడు – "కౌరవా! అదృష్టంకొద్దీ మనకోరిక నెరవేరింది. అదృష్టం కొద్దీ నీవు వృద్ధి పొందుతున్నావు. అదృష్టం కొద్దీ నీ శత్రువులు దాటలేని దుఃఖసముద్రంలో మునిగిపోయారు. పాండుకుమారులు దుర్వాసునియొక్క క్రోధం వలన పుట్టిన అగ్నిలో పడిపోయారు. వారు తాము చేసిన మహాపాపాల వల్లనే

దుస్తరమైన నరకంలో పడిపోయారు." "రాజా! కాపట్యనిపుణులైన దుర్యోధనాదులు ఈరీతిగా నవ్వుకొంటూ సంతోషచిత్తులై తమతమ ఇళ్లకు వెళ్లారు.

263. శ్రీకృష్ణుడు పాండవులను దుర్వాసుని బారినుండి రక్షించుట.

ఇలా ఉండగా ఒకసారి పాండవులందరూ సుఖాసీనులై ఉండడం, ద్రౌపది కూడా భోజనం చేసి కూర్చుని ఉండడం తెలుసుకొని దుర్వాసమహాముని పదివేలమంది శిష్యులతో కూడి ఆ వనానికి వచ్చాడు. వచ్చిన ఆ అతిథిని చూచి, యుధిష్ఠిరుడు ధర్మానుసారం తమ్ముళ్లతో కలిసి ఎదురువెళ్లాడు. అతనికి చేతులు జోడించి నమస్కరించి ఉత్తమాసనం మీద చక్కగా కూర్చుండపెట్టి విధిపూర్వకంగా పూజించి ఆతిథ్యం ఇవ్వదలచి భోజనానికి పిలిచాడు. పైగా "భగవాన్! మీరు మీ ఆహ్నికం పూర్తిచేసుకొని శీఘ్రంగా రండి" అని కూడా చెప్పాడు.మహామునికూడా "శిష్యసహితుడనైన నాకు ఇప్పుడు ఎలా భోజనం పెట్టగలడు" అని ఆలోచించకుండానే శిష్యులతో కలిసి స్నానానికి వెళ్లాడు. మునులందరూ స్నానంచేసి ధ్యాననిమగ్నులయ్యారు. ఈలోపల ఇక్కడ స్త్రీ రత్నమూ, పతివ్రతా అయిన ద్రౌపది అన్నం గురించి మిక్కిలిగా వ్యాకులపడింది. ఆమెకు ఎంత ఆలోచించినా అన్నం దొరికే ఉపాయం కనిపించలేదు. ఇక కంసారి అయిన కృష్ణుని మనసులో ధ్యానించసాగింది.

హేకృష్ణా! మహాబాహూ! దేవకీనందనా! అవినాశీ! వాసుదేవా! నమస్కరించిన వారి ఆర్తిని పోగొట్టేవాడా! జగన్నాథా! విశ్వాత్మా! విశ్వజనకా! విశ్వహర్తా! ప్రభూ! అవ్యయా! దీనులను కాపాడేవాడా! గోపాలా! ప్రజాపాలా! పరాత్పరా! మనోబుద్ధులను ప్రేరేపించే నీకు నమస్కరిస్తున్నాను. వరేణ్యా! వరదా! అనంతా! దిక్కులేని వారికి దిక్కు అయినవాడా! పురాణపురుషా! ప్రాణమనోవృత్తులకు గోచరించనివాడా! సర్వాధ్యక్షా! పరాధ్యక్షా! నేను నీ శరణు పొందాను. శరణాగతవత్సలా! దేవా! దయతో నన్ను రక్షించు. నల్లకలువ రేకులవంటి శ్యామవర్ణం కలవాడా! పద్మగర్భంలోని ఎరుపువంటి కన్నులు కలవాడా! పీతాంబరధారీ! ప్రకాశించే కౌస్తుభం ఆభరణంగా కలవాడా! సమస్తప్రాణులకు ఆద్యంతాలు నీవే. నీవే వారికి పరమాశ్రయుడవు. నీవు పరాత్పరుడవు. జ్యోతిస్స్వరూపుడవు. విశ్వాత్ముడవు. సర్వతోముఖుడవు. పండితులు నిన్నే పరమబీజమని, సర్వసంపదలకు నిధానమని అంటారు. దేవేశ్వరా! నీవు నాథుడివి(రక్షకుడివి) అయితే ఎన్ని ఆపదలు వచ్చినా భయంఉండదు. భగవంతుడా! పూర్వం సభలో దుశ్శాసనుని బారినుండి నన్ను తప్పించినట్లే ఈ సంకటంనుండి కూడా నన్ను ఉద్ధరించడానికి ఇప్పుడు నీవే తగినవాడివి". ద్రౌపది ఈవిధంగా ప్రార్థించగానే అచింత్యగతి, పరమేశ్వరుడు, దేవాధిపుడు, జగన్నాథుడు, భక్తవత్సలుడు, భగవంతుడు

అయిన కృష్ణుడు ద్రౌపది ఆపదను గ్రహించి ప్రక్కనే శయనం మీద ఉన్న రుక్మిణిని కూడా వదిలి, త్వరగా అక్కడికి వచ్చాడు.

అప్పుడు ద్రౌపది అతనిని చూసి పరమసంతోషంతో అతనికి నమస్కరించి, వాసుదేవునితో ముని రావడం మొదలైన విషయమంతా చెప్పింది. అపుడు కృష్ణుడు ఆమెతో "నాకు భరించరానంత ఆకలివేస్తోంది. ముందు వెంటనే అన్నంపెట్టు. తరువాత అంతా చేస్తాను." అన్నాడు. ఆ మాటలు విని ద్రౌపది సిగ్గుతో - "సూర్యదేవుడిచ్చిన అక్షయపాత్ర నా భోజనం అయ్యేవరకే పనిచేస్తుంది. దేవా! ఇప్పుడు నాభోజనం అయిపోయింది. అందుకని అన్నం దొరకదు" అంది. అప్పుడు కమలలోచనుడూ భగవానుడూ అయిన కృష్ణుడు ద్రౌపదితో - "ద్రౌపదీ! ఇది వేళాకోళానికి సమయం కాదు. నేను ఆకలితో ఎంతో అలసిపోయి ఉన్నాను. వెళ్లు. వెంటనే ఆ పాత్ర తెచ్చి నాకు చూపించు" అని బలవంతంగా పాత్రను తెప్పించి, కేశవుడు పాత్రయొక్క అంచుకు అంటుకొని ఉన్న తోటకూర ఆకుముక్కను చూచి, దానిని తిని - "దీనితో విశ్వాత్ముడు, యజ్ఞభోక్త, సర్వేశ్వరుడు అయిన భగవంతుడు శ్రీహరి సంతోషించుగాక ! తృప్తిచెందునుగాక" అన్నాడు. అలా అని కష్టాలను పోగొట్టే కృష్ణుడు సహదేవునితో "మును లందరినీ వెంటనే భోజనానికి రమ్మని పిలువు" అని చెప్పాడు. మహాయశస్వి అయిన సహదేవుడు దేవనదిలో స్నానం చేయడానికి వెళ్లిన దుర్వాసుడు మొదలైన ఆ మునులందరినీ భోజనం కోసం పిలువడానికి త్వరగా వెళ్లాడు. అక్కడ నీటిలో దిగి అఘమర్షణమంత్రాన్ని జపిస్తున్న ఆ మునులందరికీ పరమతృప్తి కలిగి, అన్నరసంతో కూడిన త్రేనుపులు వచ్చాయి. అది గమనించి నీటిలో నుండి బయటికి వచ్చి ఒకరినొకరు చూసుకొంటూ దుర్వాసమునిని చూచి వారంతా ఇలా అన్నారు - "విప్రోత్తమా! యుధిష్ఠిరునికి అన్నం సిద్ధం చేయించమని చెప్పి మనం స్నానానికి వచ్చాం. గొంతువరకు తృప్తిగా ఉన్న మనం ఏం తింటాం ? మనం సిద్ధం చేయించిన అన్నమంతా వ్యర్థం అవుతుంది. ఇప్పుడు మనం ఏం చేయాలి ?" అని అడిగారు.

దుర్వాసుడు అంటున్నాడు - "అనవసరంగా అన్నం వండించి రాజర్షి అయిన యుధిష్ఠిరునిపట్ల గొప్ప అపరాధమే చేశాం. పాండవులు క్రూరదృష్టితో చూచి మనలను భస్మం చేయరుకదా! ధీమంతుడు రాజర్షి అయిన అంబరీషునితో కలిగిన అనుభవం గుర్తుకు వచ్చి హరిపాదాలను ఆశ్రయించిన భక్తజనులను గూర్చి చాలా భయపడుతూ ఉంటాను. పాండవులు కూడా అందరూ మహాత్ములు, ధర్మపరాయణులు. శూరులు, పండితులు, వ్రతపరాయణులు, తపస్వులు, సదాచారరతులు, నిత్యమూ వాసుదేవుని

పరమాశ్రయంగా పొందినవారు. వారు కోపగిస్తే నిప్పు దూదిరాశిని కాల్చినట్లుగా దహించివేస్తారు సుమా! కనుక శిష్యులారా! వారిని ఏమీ అడుగకుండానే వెంటనే పారిపొండి." తమ గురువైన దుర్వాసమహాముని ఇలా చెప్పగానే ఆ బ్రాహ్మణు లందరూ పాండవులకు మిక్కిలిగా భయపడి, పదిదిక్కులకు పారిపోయారు. సహదేవుడు దేవనదిలో ఆ మునీశ్వరులు కనిపించక, ఆటు ఇటు ఉన్న ఆ నదీతీర్థాలలో వారికోసం వెదుకుతూ తిరగసాగాడు. అక్కడ ఉండే తాపసులవలన వారంతా పారిపోయారని విని, యుధిష్ఠిరుని వద్దకువచ్చి ఆ వృత్తాంతాన్ని నివేదించాడు. తరువాత జితేంద్రియు లయిన పాండవు లందరూ వారు తిరిగివస్తారనే ఆశతో కొంతసేపటివరకు ఎదురుచూస్తూ ఉండిపోయారు. "అర్ధరాత్రివేళ వచ్చి అకస్మాత్తుగా అతడు మనలను మోసగిస్తాడు. దైవవశాత్తు వచ్చిపడిన ఈ కష్టంనుండి మనం ఎలా బయటపడగలం ?" అని మాటిమాటికీ నిట్టూర్పులు విడిస్తూ చింతాపరులై ఉన్నవారిని చూచి శ్రీకృష్ణుడు వారికి ప్రత్యక్షమై ఇలా అన్నాడు-

"కుంతీపుత్రులారా! పరమకోపనుడైన దుర్వాసమహర్షి వలన మీకు కలిగిన ఆపదను గుర్తించి ద్రౌపది నన్ను ప్రార్థిస్తే నేను వెంటనే వచ్చాను. ఆ దుర్వాసమహర్షి వలన మీకు కొంచెమైనా భయం లేదు. మీ తేజస్సుకు భయపడి ఇంతకు పూర్వమే పారిపోయాడు. నిత్యమూ ధర్మతత్పరులై ఉండేవారు ఎప్పుడూ కూడా నశించిపోరు. మీనుండి సెలవు తీసుకొంటున్నాను. ఇక నేను వెళ్తాను. మీకు ఎల్లపుడూ శుభమగుగాక.' కేశవుడు చెప్పినది విని కుంతీపుత్రులు కుదుటపడిన మనసులతో తమ చింతతొలగి, ద్రౌపదీసహితంగా కృష్ణునితో ఇలా అన్నారు – "గోవిందా! ప్రభూ! మహాసాగరంలో మునిగిపోతున్న వారికి నావ దొరికినట్లుగా నిన్ను మేము రక్షకునిగా పొంది అతికష్టమైన ఈ ఆపదనుండి గట్టెక్కాము. శుభం. బయలుదేరు. నీకు కల్యాణమగుగాక" – అని పాండవులు అనుమతించారు. కృష్ణుడు తన నగరానికి బయల్దుదేరాడు. జనమేజయా! మహాత్ములైన పాండవులు కూడా ద్రౌపదితో కలిసి సంతోషమనస్కులై ఒక వనం నుండి మరొక వనానికి తిరుగుతూ గడుపసాగారు. రాజా! ఇప్పు డిక్కడ నీవు అడిగినదంతా నీకు చెప్పాను. ఈరీతిగా దుర్బుద్ధు లయిన ధార్తరాష్ట్రులు అడవులలో నివసించే పాండవుల పట్ల చేసిన మోసాలన్నీ వ్యర్థం అయ్యాయి.

264. జయద్రథుడు ద్రౌపదిని మోహించి కోటికాస్యుని ఆమెకడకు పంపుట.

బహుమృగాకీర్ణమైన ఆ కామ్యకవనంలో భరతశ్రేష్ఠులు దేవతలవలె అంతటా తిరుగుతూ విహరించసాగారు. ఎన్నో అరణ్యప్రాంతాలను, ఆయా ఋతువులలో రమణీయంగా

పుష్పించిన వనపంక్తులను చూశారు. మృగయాసక్తులైన పాండవులు ఆ మహారణ్యంలో తిరుగుతూ కొంతకాలం దేవేంద్రునిలా విహరించారు. ఒకసారి తమ పురోహితుడు, గొప్ప తపస్వి అయిన ధౌమ్యుని యొక్క, తృణబిందు మహర్షియొక్క అనుమతి తీసుకొని ద్రౌపదిని ఆశ్రమంలో ఉంచి, పురుషసింహులు అయిన వారంతా బ్రాహ్మణరక్షణార్థం ఒకేసారి వేటకోసం నలుదిక్కులకు వెళ్లారు. అదేసమయంలో సింధుదేశపు రాజు మహాకీర్తిశాలి, వృద్ధక్షత్రుని కొడుకు అయిన జయద్రథుడు వివాహేచ్ఛతో శాల్వదేశానికి వెడుతున్నాడు. అతడు రాజోచితమైన ఆభరణాలు అలంకరించుకొని ఉన్నాడు. పెక్కుమంది రాజులతో కూడి ప్రయాణిస్తూ కామ్యకవనాన్ని చేరుకొన్నాడు. అక్కడ అతడు నిర్జనారణ్యంలో ఆశ్రమ ద్వారం వద్ద నిల్చున్న యశస్విని అయిన ద్రౌపదిని చూశాడు. మెఱుపు నల్లని మబ్బులను వెలిగించినట్లుగా ఆమె అతిసుందర రూపంతో శరీరకాంతితో ఆ అరణ్యప్రాంతాన్నంతటినీ ప్రకాశింపజేస్తూ ఉంది. అప్సరయో, దేవకన్యయో, లేక దేవతలు కల్పించిన మాయయో అనుకొని చేతులు జోడించి అందరూ ఆ మచ్చలేని సుందరిని చూశారు. తీరైన అవయవసంపద కల ఆ ద్రౌపదిని చూచి సింధురాజు, వృద్ధక్షత్రుని కొడుకు అయిన జయద్రథుడు ఆశ్చర్యచకితు డయ్యాడు. అతనిలో దుష్టభావనలు కలిగాయి. అతడు కామమోహితుడై కోటికాస్యుడనే రాజుతో 'ఈ అనవద్యాంగి మానుషస్త్రీ కాకపోతే ఎవరిది అయి ఉంటుంది? వివాహంకోసం వెళ్లే నాకు ఈ అతిలోకసుందరిని పొందితే వేరెవరితోనూ పనిలేదు. ఈమెనే నేను తెచ్చుకొని ఇంటికి తిరిగివెళ్తాను. సౌమ్యుడా! వెళ్లు. ఈమె ఎవరికి చెందినదో ఎక్కడిదో, (అందమైన కనుబొమలు కల) ఈమె కంటకావృతమైన ఈ అడవికి ఎందుకువచ్చిందో తెలుసుకో ! చక్కని పలువరుస, సన్నని నడుము, విశాలమైన కన్నులు కలిగిన ఈ అతిలోక సుందరి వరారోహ ఇప్పుడు నన్ను వరిస్తుందా? ఈ స్త్రీరత్నాన్ని పొంది నేను కృతార్థుడ నవుతానా? కోటికా! వెళ్లు. ఈమె నాధు డెవరో కనుక్కో." అన్నాడు. కుండలాలంకృతుడైన కోటికాస్యుడు ఆమాటలను విని, రథం నుండి దూకి, నక్క ఆడుపులిని సమీపించినట్లుగా వచ్చి, ద్రౌపదిని ఇలా అడిగాడు.

265. కోటికాస్యుడు ద్రౌపదికి తన్ను పరిచయము చేసికొని ఆమెను గూర్చి అడుగుట.

కోటికాస్యుడు అడుగుతున్నాడు - "సుందరీ! కడిమి చెట్టుకొమ్మను వంచి విలాసంగా పట్టుకొని, ఈ ఆశ్రమంలో ఒంటరిగా ఉన్న నీవు ఎవరవు? రాత్రివేళ గాలికి చెలరేగిన

దేదీప్యమానంగా ఉన్న అగ్నిజ్వాలలా శోభిల్లుతున్నావు. చాలా అందగత్తెవు. ఈ అరణ్యంలో నీకు భయంలేదా? నీవు దేవతవా? యక్షిణివా? దానవివా? లేక అప్సరసవా? దైత్యాంగనవా? దివ్యరూపధారిణివి అయిన నాగరాజ కన్యవా? అడవులలో తిరిగే రాక్షసుని భార్యవా? కాకుంటే యమ వరుణ కుబేర చంద్రులలో ఒకరి భార్యవా? లేక ధాత, విధాత, సవిత, ఇంద్రుడు - వీరిలో ఎవరి భవనం నుండి అయినా వచ్చావా? మా గురించి నీవు అడగవు. నీ పతిగురించి మేము కూడా ఎరుగం. భద్రా! మేము నీ గౌరవాన్ని పెంపుచేస్తూ నీ తండ్రిని, భర్తను గూర్చి అడుగుతున్నాం. నీ బంధువులను గూర్చి, భర్త, వంశం గురించికూడా చెప్పు. ఇంకా ఇక్కడ నిజంగా నీవేమి చేస్తున్నావో చెప్పు.

కమలాయతాక్షీ! నేను సురధుడనే రాజు కొడుకును. నన్ను ప్రజలు కోటికాస్యుడని అంటారు. బంగారుమయమైన రథంమీద వేదియందు వేల్చబడిన అగ్నిలా ప్రకాశించే ఆ వీరుడు త్రిగర్తరాజు క్షేమంకరుడు. ఆ తరువాత మహాధనుర్ధారి, విశాలమైన కన్నులతో చక్కని పూలమాలలు ధరించి, నిన్ను చూస్తూ ఉన్నవాడు కుళిందరాజు పెద్దకొడుకు. నిత్యమూ పర్వతమే వాసస్థానంగా ఉన్నవాడు. సుందరాంగీ! పుష్కరిణీ సమీపంలో నల్లని యువకుడు చూడచక్కనివాడు ఉన్నాడే వాడు ఇక్ష్వాకురాజైన సుబలుని సుతుడు. ఇతడు శత్రువులను మట్టుపెట్టగల సమర్థుడు. ఎఱ్ఱనిగుఱ్ఱాలు పూన్చిన రథాలలో యజ్ఞాలలోని అగ్నులవలె ప్రకాశిస్తూ సౌవీరరాజకుమారులు అంగారకుడు, కుంజరుడు, గుప్తకుడు, శత్రుంజయుడు, సంజయుడు, సుప్రవృద్ధుడు, భయంకరుడు, భ్రమరుడు, రవి, శూరుడు, ప్రతాపుడు, కుహనుడు - అనే పన్నెండుమంది ధ్వజాలు చేతధరించి, రథం వెనుక నడువగా, ఆరువేల రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, పదాతులు అనుసరిస్తున్నాయే అక్కడ ఉన్న ఆ సుభగుడు సౌవీరరాజు జయద్రథుడు. అతనిపేరు నీవు వినే ఉంటావు. అతని యొక్క ఇతరసోదరులు దృఢచిత్తులు అయిన బలాహక, అనీక, విదారణాదులు కూడా అతనితో ఉన్నారు. యువకులు, బలిష్ఠులు అయిన ఈ సౌవీర వీరప్రముఖులు రాజైన జయద్రథుని వెన్నంటి నడుస్తారు. ఈ సహాయకులతో ఇంద్రుడు మరుద్గణాల చేత రక్షింపబడుతూన్నట్లు రాజు ప్రయాణిస్తున్నాడు. సుకేశీ! మాకు నీ గురించి తెలియదు. కాబట్టి నీవు ఎవరి భార్యవో, ఎవరి కుమార్తెవో చెప్పు.' 1తిగ

266. ద్రౌపది కోటికాస్యునకు సమాధానమిచ్చుట.

అతడు ఇలా అడుగగా రాజపుత్రి అయిన ద్రౌపది కడిమి చెట్టుకొమ్మను వదిలి తన పట్టు ఉత్తరీయాన్ని సవరించుకొంటూ అతనిని సంకోచంతో చూస్తూ ఇలా అన్నది.

"రాజకుమారా! నావంటి స్త్రీ నీతో సంభాషించడం తగదని బుద్ధిపూర్వకంగా ఎరుగుదును అయినా అడిగినదానికి సమాధానం చెప్పడానికి ఇక్కడ వేరే పురుషుడు గాని స్త్రీ గాని లేరు. ఇప్పుడు నేను ఒక్కతినే ఉన్నాను. కనుక సమాధానం ఇవ్వవలసివస్తోంది. భద్రపురుషా! దీనిని కూడా నీవు గమనించు. స్వధర్మనిరతురాలైన నేను అరణ్యంలో ఒంటరిగా ఒంటరి పురుషుడవైన నీతో ఎలా మాట్లాడగలను? నీవు సురధుని పుత్రుడ వని, ప్రజలు నిన్ను కోటికాస్యుడంటారని ఎరుగుదును. శైబ్యా! కాబట్టి నేను కూడా ఆలాగే నీకు నా బంధువులను ప్రసిద్ధమైన నావంశాన్ని గురించి చెపుతున్నాను.

నేను ద్రుపదమహారాజు కూతుర్ని, శైబ్యా! నన్ను ప్రజలు 'కృష్ణ' అంటారు. నేను ఐదుగురిని పతులుగా వరించాను. ఖాండవ ప్రస్థంలో ఉండేవారు. వారిని గూర్చి నీవు వినే ఉంటావు. యుధిష్ఠిరుడు, భీమసేనుడు, అర్జునుడు, పురుషోత్తములైన మాద్రికొడుకులు ఇద్దరు. ఆ కుంతీపుత్రులు నన్ను ఇక్కడ ఉంచి నలుదిక్కులకు వేటకోసం విడివిడిగా వెళ్లారు. యుధిష్ఠిరమహారాజు తూర్పుకు, భీమసేనుడు దక్షిణానికి, అర్జునుడు పడమరకు, కవలు ఉత్తరానికి వెళ్లారు. ఆ రథసత్తములు అన్నివైపులనుండి ఇక్కడకు వచ్చేసమయం అయింది. వారిచేత ఆదరసత్కారాలు పొంది యథేచ్ఛగా వెళ్దురుగాని. గుఱ్ఱాలను విడిపించి రథాలనుండి దిగండి. మహాత్ముడైన ధర్మసుతునికి అతిథులంటే ప్రీతి. మిమ్మల్ని చూచి అతడు సంతోషిస్తాడు.' శైబ్యసుతునికి ఇంతమాత్రం చెప్పి చంద్రముఖి అయిన ద్రౌపది ముందుకు కదిలింది. వారు తమకు అతిథులు అని ఆలోచించి, వారికి అతిథ్యపు టేర్పాట్లుకోసం ఆమె తమ ప్రశస్తమైన పర్ణశాలలోనికి ప్రవేశించింది.

267. ద్రౌపదీ జయద్రథుల సంవాదము.

రథాల మీద కూర్చున్న ఆ రాజుల దగ్గరకు వెళ్లి కోటికాస్యుడు ద్రౌపదితో జరిగిన సంభాషణ అంతా వారికి తెలియచేశాడు. కోటికాస్యుని మాటలు విని సౌవీరనరేశుడు జయద్రథుడు ఆ శైబ్యునితో ఇలా అన్నాడు - "స్త్రీలలో శ్రేష్ఠురాలయిన ఆమె నీతో మాట్లాడుతూ ఉన్నప్పుడు ఆమె యందు నామనసు తగుల్కొంది. నీవు ఎలా తిరిగి

గావు? ఈమెను చూచిన నాకు ఇతరస్త్రీలు ఆడుకోతులవలె అనిపిస్తున్నారు. నేను నిజం చెపుతున్నాను. చూడగానే నా మనసును ఆమె పూర్తిగా అపహరించింది. శైబ్యా! ఆమె మానవకాంతయే అయితే ఆ కల్యాణిని గూర్చి చెప్పు.' కోటికాస్యుడు చెపుతున్నాడు - "ఈ యశస్విని ద్రుపదుని కూతురు రాజకుమారి కృష్ణ. ఐదుగురు పాండవులకు మిక్కిలి ఆదరణీయురాలయిన పట్టమహిషి. ఆ కుంతీసుతులందరికీ కూడా

చాలా మెచ్చుకోదగిన ఇష్టురాలయిన భార్య. సౌవీరా! ఆమెతో కలిసి సౌవీర దేశాభిముఖంగా వెళ్లు". ఇలా చెప్పగానే సింధు సౌవీరవీరులకు అధిపతియై, దుష్టభావం కల ఆ జయద్రథుడు "ద్రౌపదిని చూస్తాను" అన్నాడు. తన ఆరుగురు సోదరులు కలిసి అతడు సింహం గుహలోకి ప్రవేశించే తోడేలులా పవిత్రమైన ఆశ్రమంలోకి వెళ్లి ద్రౌపదితో ఇలా అన్నాడు - "వరారోహా! నీకు క్షేమమేనా? నీ భర్తలు అందరూ కుశలంగా ఉన్నారా? నీవు కోరుకొంటున్న వారందరూ కూడా కుశలమేనా?" ద్రౌపది అడుగుతోంది - "రాజా! మీకు కుశలమేనా? మీ రాజ్యం, కోశం, బలం అన్నీ బాగున్నాయా? సింధుదేశంతోపాటు సమృద్ధమంతమైన శిబి, సౌవీరదేశాలు ఇంకా మీరు జయించిన ఇతర దేశాలు అన్నిటినీ మీరు ధర్మాన్ని అనుపరించి పాలిస్తున్నారా? కుంతీపుత్రుడు కౌరవకులాలంకారుడు అయిన యుధిష్ఠిరమహారాజు క్షేమమే. నేను, వారి సోదరులు, ఇంకా మీరు అడిగినవారందరూ కూడా క్షేమమే. రాకుమారా! పాద్యం, ఆసనం ఇదిగో గ్రహించండి".

జయద్రథుడు అంటున్నాడు - "రా. నా రథం ఎక్కు. అమితమైన సుఖాలు పొందు. పాండవులు సంపదలు కోల్పోయారు. రాజ్యభ్రష్టు లయ్యారు. దీనులై, ఆధీరులై ఉన్నారు. అరణ్యవాసులైన ఆ కుంతీకుమారులను అనుసరించడం నీకు తగదు. వివేకం కలిగిన స్త్రీలు ధనం కోల్పోయిన భర్తను అనుసరించరు. ధనం ఉన్ననాడే వారిని అనుసరిస్తారు. ఆ ధనం కోల్పోతే వారివద్ద ఉండరు. పాండవులు శాశ్వతంగా సంపద పోగొట్టుకొన్నారు. రాజ్యభ్రష్టు లయ్యారు. వారిని భక్తిగా సేవించడం కోసం పడే కష్టం చాలు. సుశ్రోణీ! నాకు భార్యవు కమ్ము. వీరిని విడిచిపెట్టు, సుఖాలుపొందు. నీవు నాతో కూడి సమస్త సింధు సౌవీర దేశాలను (మహారాణిగా) పొందు". హృదయాన్ని కంపింపచేసే సింధురాజు యొక్క ఈ మాటలను విని, కృష్ణకు కనుబొమలు ముడిపడ్డాయి. ఆ ప్రదేశం నుండి దూరంగా తొలగిపోయింది. అతడు అన్న మాటలను తిరస్కరించి ఆ సుందరి ద్రౌపది అతనిని తీవ్రంగా అధిక్షేపిస్తూ - " ఆలా ఎన్నటికీ జరగదు. సైంధవా! (ఇలా అనటానికి) నీవు సిగ్గుపడాలి" అన్నది. అనింద్యురాలయిన ద్రౌపది భర్తల రాకను కోరుకొంటూ వాదోపవాదాలతో అతనిని మభ్యపెట్టసాగింది.

(ద్రౌపది ఇలా అంది. "మహాబాహూ! ఆలా అనకు. నీవు న్యాయం గురించి ఆలోచించడం లేదు. పాండవులకు, ధార్తరాష్ట్రులకు కూడా చిన్న చెల్లెలు అయిన దుశ్శలయొక్క భర్తవు నీవు. రాజవంశీకుడా! నీవు నాకు సోదరుడవు. న్యాయంగా అయితే నీవు నన్ను రక్షించాలి. మహారథీ! ధార్మికుల వంశంలో పుట్టావు. కాని నీవు ధర్మాన్ని గమనించడం లేదు.)

"అలా అన్న ఆమెకు సింధురాజు ఇలా బదులిచ్చాడు. "ద్రౌపదీ! నీవు రాజధర్మం

ఎరుగవు. స్త్రీలు, రత్నాలు ఈ లోకంలో సర్వులకు సాధారణ వస్తువులని పండితులు చెప్తారు".

268. జయద్రథుడు ద్రౌపదిని బలవంతముగా ఎత్తికొనిపోవుట.

జయద్రథుని మాటలు విన్న ద్రౌపది అందమైన ముఖం రోషంతో ఎఱ్ఱబడింది. కన్నులు ఎరుపెక్కాయి. కనుబొమలు పైకిలేచాయి. చీత్కారం చేస్తూ అతనితో ఇలా అన్నది. "నా భర్తలైన పాండవులు యశస్వులు. స్వధర్మానురక్తులు. యక్షరాక్షసులతో కూడా యుద్ధం చేయగల సమర్థులు, దేవేంద్రునికి దీటు వచ్చేవారు, కోపంలో తీక్ష్ణమైన విషసర్పాలవంటివారు, మహారథులు. మూర్ఖుడా! వారిని ఇలా తుచ్ఛంగా మాటలాడడానికి నీకు సిగ్గుగా లేదూ? తపస్వులై పరిపూర్ణవిద్యాధికులైన పూజనీయులు వనంలో నివసిస్తున్నా, గృహస్థులైనా, వారిని గురించి ఎవరూ అనుచితంగా పలకరు. జయద్రథా! నీవంటి కుక్కలు మాత్రమే మొరుగుతాయి. పాతాళముఖంగా పతనమవుతున్న నిన్ను చేతులతో పట్టుకొని ఆపగలిగినవాడు ఈ క్షత్రియులలో ఎవడూ లేడని అనుకొంటున్నాను. హిమవత్పర్వతం చరియలలో తిరుగుతున్న గిరిశిఖరం వంటి మదపుటేనుగును అంకుశం ధరించి, గుంపునుండి చెదరగొట్టా లనుకొనేవాడిలా నీవు ధర్మరాజును జయించాలను కొంటున్నావు. నిద్రిస్తున్న బలిష్ఠ మయిన సింహం యొక్క జూలును మూర్ఖుడవై లాగా లనుకొంటున్నావు. క్రుద్ధుడైన భీమసేనుని చూడగానే కాళ్లు కూడదీసుకొని పరుగులు తీస్తావు. పర్వతగుహలలో పుట్టి అక్కడే ఎదిగిన మహాభయంకరమైన మహాబలిష్ఠమైన సింహాన్ని నిద్రిస్తూండగా కాలితో తన్ని చంపాలనుకొంటున్నావు. రోషంతో కోపావిష్టుడైన భయంకరుడైన అర్జునునితో, నీవు యుద్ధం చేయదలచుకొన్నావు. పురుషోత్తములైన, పాండుపుత్రులలో చిన్నవారైన కవలలతో నీవు యుద్ధం చేయా లనుకోవడం – భయంకరమైన ముఖాలతో రెండు నాల్కలతో ఉన్న రెండు నల్లత్రాచుల తోకలను కాలితో త్రొక్కివేయడమే. వెదురు, అరటి, నలము – ఇవి తమ ఉనికి కోల్పోవడానికే ఫలిస్తాయి, తమ అభివృద్ధికి కాదు. ఆడు ఎండ్రకాయ తన చావుకోసమే గర్భం దాల్చినట్లుగా నీవు పాండవులచేత రక్షింపబడుతున్న నన్ను అపహరించాలనుకొంటున్నావు.

జయద్రథుడు అంటున్నాడు – "కృష్ణా! నీ భర్తలైన ఆ నరదేవపుత్రులు ఎటువంటివారో నాకంతా తెలుసు. ఇప్పుడు మమ్మల్ని నీవు ఇలా బెదిరించలేవు. ద్రుపదపుత్రీ! కృష్ణా! మేమయితే శ్రేష్ఠమైన పదిహేడు గుణాలు కల ఉత్తమ వంశాలలో పుట్టాం. ఆరుగుణాలలో పాండవుల కంటె అత్యధికులం. కాబట్టి పాండుపుత్రులను మాకంటె తక్కువవారని

భావిస్తాం. వచ్చి త్వరగా రథం గాని, ఏనుగు గాని ఎక్కు. ఈ మాటలతో మమ్మల్ని మభ్యపెట్టడానికి శక్యం కాదు. తరువాత అయితే దీనురాలివై ఈ సౌవీరరాజుయొక్క అనుగ్రహాన్ని అర్థించవలసి ఉంటుంది." ద్రౌపది అంటోంది – "నేను మహాబలవంతురాలిని. అయినా గానీ ఇప్పుడు సౌవీరరాజు దృష్టికి దుర్బలు– రాలిలా అనిపిస్తున్నాను. బలాత్కారానికి ఎలాగూ ప్రసిద్ధి వహించాను. ఇక సైంధవుని దీనంగా వేడుకోను. కృష్ణార్జునులు ఇద్దరూ కలిసి ఏకరథస్థులై ఎవరికోసం బయలుదేరుతారో ఆమెను ఇంద్రుడు కూడా అపహరించలేడు. ఇక అల్పుడైన మనుష్యమాత్రుని సంగతి ఎందుకు? శత్రుసంహారకుశలుడైన అర్జునుడు శత్రువుల మనోబలాన్ని అణచివేస్తూ వేసవికాలంలో గడ్డిని దహించే అగ్నిలా నాకోసం నీ సైన్యంలో ప్రవేశిస్తాడు. అంధకవృష్ణి వీరులతో కూడిన జనార్దనుడు, మహాధనుర్ధరులైన కేకయులందరూ నాకు రక్షకులే. ఈ రాజపుత్రు లందరూ అతిహర్షంతో నా జాడకోసం వెదకుతారు. అర్జునుని గాండీవం యొక్క నారినుండి వెలువడే బాణాలు మేఘంలా గర్జిస్తాయి. వేగవంతాలయిన ఆ బాణాలు అర్జునుని చేతినుండి వెలువడి భయంకరంగా నినదిస్తాయి. గాండీవ నిర్ముక్తాలైన, మిడుతలదండు వంటి అమితవేగం కల మహాశరజాలాన్నీ, పరాక్రమశాలి అయిన అర్జునునీ చూసినప్పుడు నీ బుద్ధిని నీవు నిందించుకొంటావు. గాండీవం ధరించి, శంఖం పూరిస్తూ, అల్లెతాటిని మీటుతూ, మాటిమాటికి బాణాలను ఎక్కుపెడుతూ అర్జునుడు నీ గుండెలపై బాణాలను వేసినపుడు నీ మనస్సు ఎలా ఉంటుందో ఆలోచించుకో. నీచుడా! భీముడు గద చేతపట్టి, పరుగెత్తుకొని వచ్చినపుడు, మాద్రీపుత్రులు అమర్షజనితమైన క్రోధ మనే విషాన్ని క్రక్కుతూ అన్ని దిక్కులనుండి విరుచుకుపడినప్పుడు ఎంతో సంతాపం పొందుతావు. పరమపూజనీయులైన భర్తలకు నేను మనసులో కూడా ఏ రీతిగానూ జవదాటనట్లయితే, నేడు ఆ సత్యప్రభావం వలన పాండవులు నిన్ను వశపరచుకొని నేలకీడ్వడం చూస్తాను. క్రూరుడైన నీవు నన్ను బలవంతంగా లాగుకొని పోయినా నేను సంభ్రమం పొందను. ఆ కురువీరులు నన్ను తీసుకొని వస్తారు. మళ్లీ ఈ కామ్యకవనానికే తిరిగివస్తాను.'

ఆ విశాలనేత్ర ద్రౌపది తన్ను పట్టుకోదలచిన వారిని చూచి బెదిరిస్తూ "నన్ను తాకకండి" అని అరిచింది. భీతురాలయి తమ పురోహితుడైన ధౌమ్యునికొరకు కేకవేసింది. ఇంతలోనే జయద్రథుడు ఆమె ఉత్తరీయపుకొంగును పట్టుకొన్నాడు. ఆమె అతనిని నెట్టివేసింది. ఆమెచేత త్రోసివేయబడిన ఆ పాపి, మొదలునరికిన చెట్టులా పడిపోయాడు. అయినా అతడు మహావేగంగా తిరిగి లేచి, ఆమెను పట్టుకొన్నాడు. రాజపుత్రి మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ అతడు బలవంతంగా లాగుతూండడంతో ధౌమ్యుని పాదాలకు

నమస్కరించి, రథం ఎక్కింది. ధౌమ్యుడు అంటున్నాడు – "జయద్రథా! క్షత్రియుల యొక్క ప్రాచీన ధర్మాన్ని గుర్తించు. మహారథులైన పాండవులను జయించకుండా ఈమెను నీవు తీసుకొనిపోలేవు. ధర్మరాజు మొదలైన పాండవవీరుల ఎదుటపడి నీవు చేసిన నీచకృత్యానికి తగిన పాపఫలాన్ని పొందుతావు. ఇందులో ఏమీ సందేహం లేదు". అని పలికి ధౌమ్యుడు అపహరించబడిన ఆ ద్రౌపది వెంట పదాతిదళం మధ్యలో అనుసరించాడు.

269. పాండవులు మరలివచ్చి ద్రౌపదీహరణమును గూర్చి విని జయద్రథుని వెన్నంటుట.

అనంతరం భూమండలంలోనే మిక్కిలి శ్రేష్ఠధనుర్ధరులైన కుంతీపుత్రులు ఐదుగురు అన్ని దిక్కులలో విహరిస్తూ క్రూర జంతువులను, వరాహాలను, అడవి దున్నలను చంపి, వేర్వేరుగా తిరుగుతున్న వారు ఒకచోటకు చేరారు. ఆ సమయంలో క్రూర జంతువులు, సర్పాలతో నిండి ఉండే ఆ ఘోరారణ్యం ఒక్కసారిగా పక్షుల కలకలలతో మ్రోగిపోయింది. మృగాలు ఆర్తనాదాలు చేయసాగాయి. ఆ ధ్వనులన్నీ విని, యుధిష్ఠిరుడు సోదరులతో ఇలా అన్నాడు. "మృగాలు, పక్షులు ఇలా కఠోరంగా అరుస్తూ సూర్యునితో ప్రకాశమానమైన తూర్పుదిక్కునకు పరుగెత్తుతూ, భయంకరమైన ఉత్పాతాన్ని సూచిస్తున్నాయి. ఈ మహావనానికి శత్రుబాధ కలిగినట్లుంది. వెంటనే ఆశ్రమానికి మరలండి. ఆలస్యం చేయకండి. నా మనసు వివేచనాశక్తిని కూడా కప్పివేసి కలత చెందుతోంది. దహించివేస్తోంది. నా శరీరంలోని ప్రాణపతి(జీవుడు) శోకంతో ఎగిసిపడుతున్నాడు. గరుడుడు నీటిలోని సర్పాన్ని ఒడిసిపట్టుకొంటే కలకబారిన సరస్సులా, రాజులేకపోతే శ్రీవిహీనమైన రాజ్యంలా, ధూర్తులు రసం త్రాగివేసిన ఖాళీకుండలా ఈ కామ్యకం శత్రువుల చేతిలో చిక్కి దురవస్థ పొందిన దానిలా నాకు అనిపిస్తోంది". అనంతరం ఆ నరవీరులు గాలిని మించిన వేగంతో, సింధుదేశపు గుఱ్ఱాలు పూన్చిన రథాలతో ఆశ్రమాభిముఖంగా కదిలారు. ఆ సమయంలో ఆశ్రమానికి తిరిగివస్తున్న వారికి ఎడమప్రక్కగా ఒక నక్క పెద్దగా అరుస్తూ వెళ్లింది. ఆ శకునం గూర్చి తర్కించుకొని యుధిష్ఠిరుడు భీమార్జునులతో ఇలా అన్నాడు. 'ఈ నీచజంతువైన నక్క మనకు ఎడమప్రక్కగా రావడం, ఇలా అరవడం చూస్తే – పాపాత్ములైన కౌరవులు మనలను ధిక్కరించి బలవంతంగా పెద్ద అపచారం చేస్తున్నట్లుగా వ్యక్తమవుతోంది.'

ఈ రీతిగా వారు మహారణ్యంలో వేటాడి, తిరిగి ఆశ్రమసమీపంలోని వనప్రదేశాన్ని సమీపిస్తూండగా తమకు ప్రియమైన భార్య ద్రౌపదియొక్క దాసి, తమ దాసుని యొక్క భార్య అయిన ధాత్రేయిక ఏడుస్తూ ఉండడం చూశారు. అప్పుడు సారథి అయిన

ఇంద్రసేనుడు రథాన్నుండి వెంటనే దూకి, వేగంగా పరిగెత్తి ధాత్రేయిక దగ్గరకు వెళ్లి, ఇలా అడిగాడు. "నీవు నేలమీద పడి ఎందుకు ఏడుస్తున్నావు? నీముఖం దీనంగా వాడిపోయిందెందుకు? అత్యంత క్రూరకర్మలు చేసే పాపాత్ములైన కౌరవులు రాజకుమారి ద్రౌపదికేమీ అపకారం చేయలేదు కదా? ధర్మపుత్రు డయిన యుధిష్ఠిరుడు ద్రౌపదికోసం చాలా బాధపడుతున్నాడు. ఊహకందని సౌందర్యం ఆమెది. విశాలమైన కన్నులు కలది. కురుశ్రేష్ఠులకు తమ శరీరంతో సమానం. ఒకవేళ ఆమె భూమిలోపల దాగినా, స్వర్గంలో ఉన్నా, లేక సముద్రంలో ప్రవేశించినా కుంతీపుత్రులు ఆమె జాడను తెలుసుకొంటారు. శత్రుమర్దనులై, కష్టసహిష్ణువులై, జయింపశక్యం కాని వారికి ప్రాణసమానురాలైన, అనర్ఘరత్నం వంటి ద్రౌపదిని ఏ మూఢాత్ముడు అపహరించాలనుకొంటాడు? మగనాలి అయిన ద్రౌపది పాండవులకు ప్రకట రూపంలో ఉన్న హృదయమని (బహిఃప్రాణమని) ఎవరికి తెలియదు? ఈనాడు వారి బాణాలు ఎవరి శరీరాన్ని చీల్చి భూమిలో గ్రుచ్చుకొంటాయో! పిరికిదానా! ఆమె గురించి శోకించకు. ఇప్పుడే ఆమె తిరిగిరాగలదని తెలుసుకో. సమస్త శత్రువులను సమూలంగా చంపి, పార్థులు యాజ్ఞసేనిని కలుసుకొంటారు".

ఈ మాటలు విని ధాత్రేయిక అందమైన తన ముఖాన్ని తుడుచుకొని సారథి అయిన ఇంద్రసేనునితో ఇలా అంది - "పంచేంద్రులవంటి పాండవులను తిరస్కరించి జయద్రథుడు బలవంతంగా కృష్ణను అపహరించాడు. (ఆ రథచక్రాలక్రింద నలిగి) క్రొత్తగా ఏర్పడిన ఈ దారి అలాగే ఉంది. విరిగిన చెట్లుకూడా ఇంకా వాడిపోలేదు. పాండవులారా! మీరు మీ రథాలను వెనుకకు త్రిప్పండి. శీఘ్రంగా శత్రువులను వెంబడించండి. రాజకుమారి ద్రౌపది ఇప్పటికింకా దూరం వెళ్లి ఉండదు. వెంటనే కవచాలను ధరించండి. అనర్ఘ ధనుస్సులను, బాణాలను తీసుకోండి. వెంటనే శత్రువులు వెళ్లిన దారిలో వెళ్లండి. బెదిరింపులకు గాని, దండనలకు గాని భయపడి మూఢచిత్తురాలై వాడిపోయిన ముఖంతో ఏ అయోగ్యునికీ ఆమె తనువును అర్పించక పూర్వమే వెళ్లండి. అదే కనుక జరిగితే స్వచ్ఛమైన నేతితో నిండిన స్రుక్కును బూడిదలో కుమ్మరించినట్లు, హవిస్సును ఊకనిప్పులో హోమం చేసినట్లు, (దేవ పూజకోసం ఉంచిన) పూలమాలను శ్మశానంలోకి విసిరినట్లు. బ్రాహ్మణులు ఆదమరిచిఉండగా యజ్ఞమండపంలోని సోమరసాన్ని కుక్క నాకి వేసినట్లు. మహారణ్యంలో వేటాడుతూ తిరిగిన నక్క పద్మాకరంలో మునిగినట్లు అవుతుంది. అందమైన నాసిక, చక్కని కన్నులు కలిగి చంద్రకాంతిలా స్వచ్ఛంగా వెలుగొందే ఆ మీ ప్రియురాలియొక్క పవిత్రమైన, ప్రసన్నమైన ముఖాన్ని కుక్క యజ్ఞవేదికయందలి పురోడాశాన్ని నాకినట్లుగా ఏ పాపాత్ముడూ తాకకూడదు. ఈ దారుల వెంటనే శీఘ్రంగా శత్రువుల వెన్నంటి

వెళ్లండి. మీ సమయం ఇక్కడే గడిచిపోకూడదు.

యుధిష్ఠిరుడు అన్నాడు. "భద్రా! పక్కకి తొలగు" మాటలు తూలకు - మా ఎదుట అతిపరుషంగా మాట్లాడుతున్నావు. బలగర్వితుడైన అతడు రాజుకానీ, రాజపుత్రుడు కానీ ముప్పుతప్పదు" ఇలా అని ఆ పాండవులు అందరూ ధనుష్టంకారాలు చేస్తూ, మాటిమాటికి పాములవలె బుసలు కొడుతూ, ఆ మార్గాన్నే అనుసరిస్తూ వెంటనే బయలుదేరారు. అంతట జయద్రథుని సైన్యంలోని కాలిగిట్టల తాకిడికి ఎగిరిన ధూళి వారికి కనపడింది. కాల్బలం మధ్యలో "భీమసేనా! పరుగెత్తుకురా" అని ఆక్రోశిస్తున్న ధౌమ్యుడు కూడా కనిపించాడు. అసాధారణ పరాక్రమం కలిగిన రాజపుత్రులైన ఆ పాండవులు "ఇక మీరు నిశ్చింతగా వెళ్లండి" అని ధౌమ్యుని ఓదార్చి, మాంసంకోసం గద్ద ఎగిరినంత వేగంగా జయద్రథుని యొక్క సైన్యాన్ని వెన్నంటి వెళ్లారు. మహేంద్రసమాన పరాక్రములై విజృంభించిన ఆ పాండవులకు ద్రౌపదియొక్క ధిక్కారపూర్వకమైన మాటలు విన్పించాయి. ఆ వెంటనే జయద్రథుడు, అతని రథంలో ఉన్న ద్రౌపదీ కన్పించారు. వారి క్రోధం ప్రజ్వరిల్లింది. వెంటనే భీముడు, అర్జునుడు, నకులసహదేవులు, యుధిష్ఠిరుడు - ఈ మహాధనుర్ధారు లందరూ సింధురా జైన జయద్రథుని అదిలించారు. అప్పుడు శత్రుసైనికులకు, దిక్కుతోచకుండా పోయింది.

270. ద్రౌపది పాండవుల పరాక్రమమును జయద్రథునికి చెప్పుట.

అప్పుడు భీమసేనుని, అర్జునుని చూచి అమర్షపూరితులైన ఆ క్షత్రియులు అరణ్యంలో అతిభయంకరంగా కోలాహలం చేయసాగారు. ఆ నరశ్రేష్ఠుల ధ్వజాగ్రాలను చూచి ఉత్సాహం అంతరించిపోయిన దురాత్ముడు జయద్రథుడు రథంలో ఉన్న తేజోమూర్తి యాజ్ఞసేనితో ఇలా అన్నాడు. "సుకేశీ! ఇదిగో మహారథాలు ఐదు వస్తున్నాయి. ద్రౌపదీ! వారు నీ భర్తలని నేను అనుకొంటున్నాను. వారిని బాగా ఎరిగి ఉన్న నీవు రథస్థులైన ఆ పాండవులను గూర్చి వరుసగా నాకు తెలియచెప్పు". ద్రౌపది ఇలా సమాధానం చెప్పింది. " మూఢుడా! ఆయువును హరించి వేసే అతిఘోరమైన కర్మను చేసి, ఇక ఆ మహాధనుర్ధారులను గురించి తెలుసుకొని ఏం చేస్తావు? ఇదిగో వీరులైన నా భర్తలు ఐదుగురు కూడివచ్చారు. ఇక యుద్ధంలో నీ పక్షంలోని వారెవరూ మిగలరు. తమ్ములతో కూడి ఉన్న ధర్మరాజును చూస్తున్న నాకు దుఃఖమూ లేదు, నీ వలని భయమూ లేదు. చచ్చిపోబోతున్న నీకు నన్ను అడిగినది అంతా చెప్పడం ధర్మం.

ధ్వజాగ్ర - చక్కగా కట్టబడి మధురంగా నీదిమోగుతున్న నందోపనందకములనే

మృదంగాలు కలవాడు; మేలిమిపసిమిచాయతో, సమున్నతమైన నాసిక, బక్కపలుచని శరీరంతో, విశాలమైన కన్నులు కలిగి ఉన్న ఇతడు కురువంశ శ్రేష్ఠుడుగా చెప్పబడుతూ ఉంటాడు. ఇతడే నాభర్త ధర్మసుతుడైన యుధిష్ఠిరుడు. ధర్మార్థాలను చక్కగా ఎరిగినవాడని తెలుసుకొని లోకులు ఇతనిని ఎప్పుడూ పనికట్టుకొని అనుసరిస్తూ ఉంటారు. ధర్మవర్తనుడైన నరపుంగవుడు తన్ను శరణు కోరివస్తే శత్రువు కయినా ప్రాణాలను ఇస్తాడు. మూర్ఖుడా! నీవు నీ మేలుకోసం ఆయుధాలు ప్రక్కనపెట్టి, చేతులు జోడించి, వేగంగా ఇతనిని శరణువేడు. ఆదిగో! నీవు చూస్తున్నావే, ఏపుగా ఎదిగిన మద్దిమ్రాకులా మహాబాహువులతో, కనుబొమలు ముడివేస్తూ, పళ్లు కొరుకుతూ రథస్థుడై ఉన్న అతడు వృకోదరుడు. బలిష్ఠాలు, సుశిక్షితాలు, శక్తిమంతాలు ఆజానేయాలయిన గుఱ్ఱాలు ఆ శూరుని రథాన్ని లాగుతున్నాయి. ఇతడు చేసే పనులు అతిమానుషా కాబట్టి భీము డనే పేరు ఇతనికి పుడమిలో ప్రసిద్ధమయింది. ఇతనికి అపకారం చేసినవారు మిగలరు. ఇతడు వైరాన్ని ఎన్నడూ మర్చిపోడు. వైరం యొక్క అంతు తేల్చిగాని ఊరుకోడు. ఆ తరువాత కూడా పూర్తిగా శాంతించడు. ఆ కనిపించే వీరపురుషుడు ధనంజయు డనే పేరుగల నాభర్త. అతడు ధనుర్ధరులలో అగ్రగణ్యుడు. ధైర్యశాలి. యశస్వి, జితేంద్రియుడు. వృద్ధులను సేవించేవాడు. యుధిష్ఠిరునికి తమ్ముడు, శిష్యుడూ కూడా. అతడు కామలోభాలకులోనై గాని, భయం చేత గాని తన ధర్మాన్ని ఎన్నడూ విడువడు. క్రూరకృత్యాన్ని ఎన్నడూ చేయడు. అగ్నితుల్యమైన తేజస్సు కల ఈ కుంతీసుతుడు శత్రువులను ఎదిరిస్తాడు, సంహరిస్తాడు.

సమస్త ధర్మార్థాలను నిశ్చింతగా ఎరిగి, భయాతురుల భయాన్ని పోగొట్టే, బుద్ధిమంతుడు, ఈ భూమిపైన ఉత్తమరూపం గలవానిగా పేరెన్నికగన్నవాడు, తన అన్నలను సేవించేవాడు, వారికి ప్రాణాధికు, పాండవులందరిచేత రక్షింపబడుతూ ఉండేవాడు ఆదిగో ఆ వీరుడే నకులుడు, నాభర్త. ఖడ్గవిద్యలో ఆరితేరినవాడు, చిత్రమైన లాఘవమైన హస్తవిన్యాసాలు చూపేవాడు, మిక్కిలి బుద్ధిమంతుడు, అద్వితీయ వీరుడు ఆ సహదేవుడు. మూఢప్రాణీ! దైత్యసేనలో ఇంద్రునివలె యుద్ధంలో అతడు పరాక్రమించడం నీవు నేడు చూస్తావు. ఆతడు శూరుడు, కృతాస్త్రుడు, మతిమంతుడు, మనస్వి, యుధిష్ఠిరమహారాజుకు ప్రియం చేసేవాడు. ఇతడు సూర్యచంద్రులతో సమానమైన తేజస్సు కలవాడు. అందరికంటె చిన్నవాడు, పాండవులకు ప్రీతిపాత్రుడు, బుద్ధిలో ఇతనికి సాటిరాగలవారు లేరు. మాటనేర్పరి. సత్పురుషులమధ్య నిశ్చితజ్ఞానం కలవాడని పేరొందినవాడు. శూరుడు, అమర్షణశీలుడు, ధీమంతుడు, ప్రాజ్ఞుడు అయిన ఈ సహదేవుడు నాభర్త. ప్రాణాలనైనా విడుస్తాడు, అగ్నిలోనైనా దూకుతాడు గాని ధర్మబాహ్యంగా మాత్రం మాటలాడడు. ఎప్పుడూ

క్షత్రధర్మరతుడై, మనస్వియై ఉంటాడు. ఈ వీరపురుషుడు కుంతికి ప్రాణాలకంటె మిక్కిలి ఇష్టమైనవాడు. సముద్రమధ్యంలో తిమింగిలపు తోక చేత బ్రద్దలయిన రత్నాల ఓడవలె యుద్ధంలో పాండుపుత్రుల చేత యోధులందరూ చనిపోయి ఛిన్నాభిన్నమైన నీ ఈ సేనను నీవు చూస్తావు. నేను వర్ణించిన ఇటువంటి పాండుపుత్రులను అవమానించి నీవు ఈ నీచకర్మానికి ఒడిగట్టావు. వీరివలన నీ శరీరం తపించకుండా తప్పించుకొంటే బ్రతికిఉండగానే నీవు పునర్జన్మ పొందినట్లు కాగలదు".

ఇంతలోనే ఆ పంచపాండవులు పంచేంద్రులవలె పరాక్రమించి, భయంతో చేతులు జోడించిన కాల్బలాన్ని వదిలి, కుపితులై, అన్నివైపులనుండి అడ్డుకొని రధగజతురగసైన్యాన్ని బాణవర్షంతో అంధకారమయంగా చేశారు.

271. జయద్రథుడు ద్రౌపదిని విడిచి పారిపోవుట - భీమార్జునులు అతనిని వెన్నంటుట.

సింధురాజు తన వెంట వచ్చిన ఆ రాజు లందరినీ - "నిలవండి ఎదుర్కోండి. ముందుకు దూసుకువెళ్లండి" అని ఉత్సాహపరచసాగాడు. ఆ సమయంలో యుద్ధభూమిలో యుధిష్ఠిరునితో సహితంగా భీమార్జుననకుల సహదేవులను చూసి జయద్రథుని సైనికులలో దారుణమైన కోలాహలం చెలరేగింది. పెద్దపులులవలె బలవంతులైన ఆ పురుష పుంగవులను చూచి శిబి, సౌవీర, సింధురాజుల మనసులలో కూడా విషాదం అలముకొంది. బంగారు తాపడంతో చిత్రవర్ణశోభితమైన, శైక్యమనే ఇనుముతో చేయబడిన గదను తీసుకొని భీముడు కాలప్రేరితుడైన సింధురాజువైపు ఉరికాడు. ఇంతలో కోటికాస్యుడు గొప్ప రధసైన్యంతో భీముని అన్నివైపులనుండి చుట్టుముడుతూ ఇరువురి మధ్య దూరాన్ని ఎక్కువ చేశాడు. వీరభుజులైన ఆ యోధులు ప్రయోగించిన శక్తి, తోమర, నారాచాలు అధికంగా వెదచల్లబడినప్పటికీ భీముడు ఏమాత్రం చలించలేదు. భీముడు సైంధవసేనాముఖంలోకి వెళ్లి మావటివానితో పాటుగా ఒక ఏనుగును, పద్నాలుగు మంది పదాతులను గదతో మోది చంపివేశాడు. అర్జునుడు సౌవీర రాజు అయిన జయద్రథుని పట్టుకోవాలనే కోరికతో సేనాగ్రభాగాన నిలిచిన శూరులైన, ఐదువందలమంది పార్వతీయులను చంపివేశాడు. స్వయంగా యుధిష్ఠిర మహారాజుకూడా యుద్ధంలో తనపై ప్రహారాలు కురిపిస్తున్న ప్రముఖ సౌవీర క్షత్రియులను వందమందిని రెప్పపాటుకాలంలో వధించాడు. నకులుడు ఖడ్గధారియై రధం నుండి దూకి పాదరక్షకుల యొక్క తలలను నరికి విత్తనాలవలె భూమిపై పాతిపెట్టడం కనిపించింది. సహదేవుడు రథంతో ముందుకు కదిలి వేటకాడు చెట్లనుండి నెమళ్లను

పడగొట్టినట్లుగా నారాచాలతో గజయోధులను నేలకూల్చాడు.

అంతలో త్రిగర్తరాజు ధనుర్ధరుడై పెద్దరథాన్నుండి దిగి, గదతో యుధిష్ఠిరమహారాజు యొక్క నాలుగు గుఱ్ఱాలను కూల్చి వేశాడు. కాలినడకన తనకు దగ్గరగా వచ్చిన అతనిని యుధిష్ఠిరుడు అర్ధచంద్రబాణంతో రొమ్ముపై కొట్టాడు. గుండెబ్రద్దలయి ఆ వీరుడు నోటినుండి రక్తాన్ని క్రక్కుకొంటూ యుధిష్ఠిరుని ఎదుటనే మొదలు నరికిన చెట్టులా పడిపోయాడు. తన గుఱ్ఱాలు చనిపోగా యుధిష్ఠిరుడు సారథి అయిన ఇంద్రసేనునితో కలిసి రథాన్నుండి దూకి, సహదేవుని పెద్దరథాన్ని ఎక్కాడు. మరొకవైపు క్షేమంకరుడు, మహాముఖుడు అనే రాజు లిద్దరూ నకులుని లక్ష్యంగా చేసుకొని రెండువైపుల నుండి బాణవర్షాన్ని కురిపించారు. వర్షాకాలంలోని మేఘాలవలె తోమరాలను వర్షిస్తున్న ఆ ఇద్దరిని మాద్రీసుతుడైన నకులుడు విపాఠమనే ఒక్కొక్క బాణంతో నేలకూల్చాడు. ఏనుగులను నడపటంలో దిట్ట అయిన త్రిగర్తరాజు సురథుడు నకులుని రథాగ్రం దగ్గరకు చేరి తన ఏనుగుచేత రథాన్ని దూరంగా విసిరివేయించాడు. కాని నకులుడు ఏమాత్రం భయపడక కత్తిని డాలును ధరించి రథంనుండి దూకి క్షేమంగా ఉండే చోట కొండవలె నిశ్చలంగా నిలబడ్డాడు. అంతట సురథుడు క్రోధంతో ఘీంకరిస్తూ తొండం పైకెత్తిన గజరాజును నకులుని చంపడానికి అతని మీదికి తోలాడు. కాని నకులుడు తనకు దగ్గరగా వచ్చిన ఆ ఏనుగు యొక్క తొండాన్ని దంతాలతో సహా మొదలంటా కత్తితో నరికేశాడు. చిరుమువ్వలతో అలంకరింపబడిన ఆ ఏనుగు పెద్దగా ఘీంకరిస్తూ తలక్రిందికి వాల్చి, భూమి మీదికి ఒరిగిపోతూ తనపైనున్న వానిని కూడా క్రిందికి కూలదోసింది. ఆ ఘనకార్యాన్ని సాధించి మహారథి అయిన నకులుడు భీమసేనుని రథాన్ని ఎక్కి, ఊపిరి పీల్చుకొన్నాడు. భీమసేనుడు యుద్ధంలో తన మీదికి వచ్చిన కోటికాస్యుని యొక్క గుఱ్ఱాలను తోలుతున్న సారథిని ఒక్క క్షురంతో తలను నరికేశాడు. తన సూతుడు బాహుశాలి అయిన భీమునిచేత చంపబడినట్లు ఆ రాజుకు తెలియనే లేదు. సారథి చనిపోగా అతని గుఱ్ఱాలు యుద్ధభూమిలో అటు ఇటు పరుగులు తీశాయి. సూతుడు చనిపోగా యుద్ధవిముఖుడైన అతనిని శస్త్రధారులలో మేటి అయిన భీముడు సమీపించి తొడుగు కలిగిన ప్రాసమనే ఆయుధంతో చంపివేశాడు. ధనంజయుడు పన్నెండుమంది సౌవీరరాజుల ధనుస్సులను, శిరస్సులను కూడా వాడి భల్లాలతో నరికివేశాడు. అతిరథుడైన అర్జునుడు యుద్ధంలో తన బాణాలకు అడ్డువచ్చిన త్రిగర్తులను, సైంధవులను, శిబి ఇక్ష్వాకు ప్రముఖ లందరినీ చంపివేశాడు. అర్జునుడు చంపిన పతాకాలతో కూడిన ఏనుగులు, అలాగే ధ్వజాలతో కూడిన మహారథాలు ఎన్నో కనిపించాయి. ఆ యుద్ధభూమిలో

అనేకం దర్శన మిచ్చాయి. ఆ సమయంలో తలలు లేని మొండెములు, శరీరాలు లేని తలలు ఆ యుద్ధభూమి నిండా పరుచుకొని, చెల్లా చెదురుగా పడిపోయాయి. ఆ రణభూమిలో చనిపోయిన వీరుల రక్తమాంసాలతో కుక్కలు, గద్దలు, బొల్లిగద్దలు, కొండ కాకులు, గృధ్రాలు, నక్కలు, కాకులు అన్నీ తృప్తి పొందాయి.

ఆ వీరు లందరూ చనిపోగా సింధురాజు జయద్రథుడు భయపడి ద్రౌపదిని వదిలి పారిపోసాగాడు. నరాధము డైన జయద్రథుడు ఆ సంకులసైన్యమధ్యంలో ద్రౌపదిని రథం నుండి దించివేసి, తన ప్రాణాలు రక్షించుకోవాలని అడవిలోకి పారిపోయాడు. ధౌమ్యుని ముందు నడవగా వెనుక వస్తున్న ద్రౌపదిని చూచి ధర్మరాజు మాద్రీసుతు డైన సహదేవుని పంపి ఆమెను రథంలో ఎక్కించాడు. జయద్రథుడు తొలగిపోగానే చిందరవందర అయిన సైన్యాన్ని భీముడు తనపేరు చెప్పి చెప్పి, మరీ బాణాలతో కొట్టి సంహరించాడు. జయద్రథుని పలాయనాన్ని చూచిన అర్జునుడు ఆ సైంధవుని సైనికులను చంపుతున్న భీముని వారించాడు. అర్జునుడు అన్నాడు – 'ఏ దురాత్మునివలన మనకు ఈ కష్టం కలిగిందో ఆ జయద్రథుడు ఈ రణభూమిలో కనిపించడం లేదు. సోదరా! నీకు మేలగుగాక. అతనినే అన్వేషించు. ఈ యోధులను చంపడంవలన నీకేమి లాభం ? ఇది వ్యర్థం కదా! నీకేమనిపిస్తోంది?' బుద్ధిమంతు డయిన అర్జునుడు ఇలా అనగానే మాటలలో నేర్పుకల భీముడు యుధిష్ఠిరుని చూచి ఇలా అన్నాడు. "రాజా! శత్రువులలో ముఖ్యు లందరూ చనిపోయారు. సైనికులలో చాలామంది దిక్కులుపట్టి పారిపోయారు. ద్రౌపదిని తీసుకొని మీరు ఇక్కడినుండి వెనుకకు మరలండి. రాజేంద్రా! మహాత్ము డయిన ధౌమ్యునితో నకుల సహదేవులతో కలిసి ఆశ్రమానికి వెళ్లి ద్రౌపదిని ఓదార్చండి. ఆ మూర్ఖుడు సైంధవుడు పాతాళప్రదేశంలో దాగున్నాసరే స్వయంగా ఇంద్రుడే అతనికి సారథిగా వచ్చినాసరే, ఇప్పుడు నా నుండి ప్రాణాలతో తప్పించుకో లేడు". యుధిష్ఠిరుడు అంటున్నాడు – "మహాబాహూ! ఆ సైంధవుడు దురాత్ము డయినప్పటికీ యశస్వి అయిన గాంధారిని, దుశ్శలను తలచుకొని చంపకూడదు".

ఆ మాటలు విని ద్రౌపది ఇంద్రియాలన్నీ వ్యాకులం చెందగా ప్రాజ్ఞురాలు, లజ్జావతి అయినప్పటికీ కోపగించి, పతులయిన భీమార్జునులిద్దరినీ ఉద్దేశించి ఇలా అంది.

"మీరు నాకు ప్రియం చేయదలచుకొంటే ఆ నరాధముని వధించండి. ఆ పాపాత్ముడు, దుర్బుద్ధి సింధుదేశానికి కళంకం. కులంలో చిచ్చు వంటివాడు. భార్యను అపహరించిన శత్రువు గాని, రాజ్యాన్ని హరించిన శత్రువు గాని యుద్ధంలో ప్రాణదానం చేయమని ప్రాధేయపడినా వదిలిపెట్టకూడదు".

ద్రౌపది ఇలా చెప్పగానే ఆ పురుషసింహులు ఇద్దరూ సైంధవుడు వెళ్లిన వైపుకు వెళ్లారు. యుధిష్ఠిరమహారాజు ద్రౌపదిని తీసుకొని పురోహిత సహితంగా వెనుకకు తిరిగాడు. అతడు ఆశ్రమాన్ని చేరుకొనే సరికి కూర్చుండే ఆసనాలు ఇతరవస్తువులూ చిందరవందరగా పడి ఉన్నాయి. మార్కండేయాది విప్రులందరూ అక్కడ గుమికూడి ఉన్నారు. అక్కడి వారందరూ మనసులలో పదేపదే ద్రౌపదిని గూర్చి విచారిస్తున్నారు. అంతలో మహాప్రాజ్ఞుడు అయిన యుధిష్ఠిరుడు భార్యను వెంటపెట్టుకొని, సోదరులతో కలిసి అక్కడికి వచ్చాడు. సింధు సౌవీరరాజులను జయించి, అపహరింపబడిన ద్రౌపదిని తీసుకొని, మరలివచ్చిన రాజును చూచి వారందరూ సంతోషించారు. వారందరూ పరివేష్టించగా రాజు అక్కడే కూర్చుండిపోయాడు. భామిని ద్రౌపది కవలతో కలిసి ఆశ్రమం లోపలికి వెళ్లింది. ఇక్కడ భీమార్జునులు కూడా శత్రువు క్రోసెడు దూరం వెళ్లాడని విని, స్వయంగా గుఱ్ఱాలను తోలుకొంటూ వేగంగా ముందుకు సాగిపోయారు. నరోత్తము డయిన అర్జునుడు ఇక్కడ ఒక అత్యద్భుత కార్యం చేశాడు. క్రోసెడు దూరంలో ఉన్న సైంధవుని గుఱ్ఱాలను చంపి వేశాడు. అతడు దివ్యాస్త్ర సంపన్నుడు. సంకటస్థితిలో కూడా తడబాటుపడడు. అస్త్రాలతో అభిమంత్రించిన బాణాలను ఉపయోగించి, ఈ దుష్కరకార్యాన్ని చేశాడు.

గుఱ్ఱాలు చనిపోగా భయంతో వ్యాకులచిత్తుడూ, ఒంటరివాడూ అయిన సైంధవుని ఆ భీమార్జునులు ఇద్దరూ వెంబడించారు. చనిపోయిన తన గుఱ్ఱాలను, వెనుక వస్తున్న అలౌకిక పరాక్రమం చూపిన అర్జునుని చూచి, సైంధవుడు ఎంతో దుఃఖించాడు. కేవలం పారిపోవాలనే తపనతోనే సైంధవుడు అడవిలోకి పరుగెత్తాడు. పారిపోవడంలో పరాక్రమం చూపుతున్న సైంధవుని చూచి మహాబాహువు అయిన అర్జునుడు అతనిని వెంబడించి, ఇలా అన్నాడు. "రాజకుమారా! ఇలాంటి పరాక్రమంతోనే పరస్త్రీని బలవంతంగా పొందాలనుకొన్నావా? వెనక్కి తిరుగు. పారిపోవడం నీకు తగదు. శత్రుమధ్యంలో నీ సేవకులను వదిలి ఎలా పారిపోతావు?" అర్జునుడు ఇలా నిందించినా సైంధవుడు వెనక్కి తిరగలేదు. బలిష్ఠ డయిన భీముడు వెంటనే "ఆగు ఆగు" అంటూ అతని వెంట పడ్డాడు. దయాళువు అయిన అర్జునుడు "అతని ప్రాణాలు తీయకు" అని అతనిని హెచ్చరించాడు.

272. యుధిష్ఠిరుడు జయద్రథుని విడిపించుట - అతడు తపముచేసి శివుని వలన వరము పొందుట.

అన్నదమ్ములిద్దరూ సన్నద్ధులై ఉండడం చూసి జయద్రథుడు మిక్కిలి దుఃఖంతో ప్రాణాలమీది ఆశతో తడబాటు లేకుండా అతివేగంగా పరుగెత్త సాగాడు.

బలిష్ఠుడైన భీముడు కోపావిష్టుడై రథం నుండి దిగి, పరిగెడుతున్న అతనిని వెంబడించి, అతని జుట్టుపట్టుకొన్నాడు. భీముడు అతనిని పైకెత్తి భూమిపై పడవేసి నలిపివేశాడు. తల పట్టుకొని ఎడాపెడా వాయించసాగాడు. మహాబాహువు అయిన భీముడు ఇంకా ప్రాణాలతో ఉండి పైకి లేవబోతున్న అతనిని తలపై కాలితో తన్నాడు. అరుస్తూ ఏడుస్తున్న అతనిని మోకాళ్లు రెండిటితో నొక్కిపట్టి పిడికిళ్లతో పొడిచాడు. ఆ గాఢమైన దెబ్బలకు ఓర్చుకోలేక బాధతో సింధురాజు మూర్ఛిల్లాడు. ఇంకా రోషంతో ఉన్న భీమసేనుని అర్జునుడు – "కురునందనా! దుశ్శలను గూర్చి మహారాజు చెప్పిన మాటను కూడా పాటించు" అని వారించాడు. భీమసేనుడు అన్నాడు. "ఈ నరాధముడు కష్టాలు పొందదగని ద్రౌపదికి కష్టం కలిగించాడు. ఈ మదించిన పాపి జీవించడానికి తగడు. కాని నేను ఏమి చేయగలను? ఆ యుధిష్ఠిరమహారాజు ఎప్పుడూ దయాళువే. నీవు కూడా అజ్ఞానంతో ఎప్పుడూ నన్ను బాధపెడుతూ ఉంటావు". ఇలా అని వృకోదరుడు అర్ధచంద్రబాణంతో అతని జుట్టును పంచశిఖలుగా కత్తిరించివేశాడు. ఆ సమయంలో జయద్రథుడు ఏమీ మాట్లాడలేకపోయాడు. జయద్రథుని గట్టిగా నిందిస్తూ వృకోదరుడు ఇలా అన్నాడు – "మూఢుడా! నీవు జీవించదలచుకొంటే దానికి హేతుభూతమైన నేను చెప్పేది విను. రాజసభలలో, పెద్దల సభలలో "నేను (యుధిష్ఠిరునికి) దాసుడను" అని చెప్పాలి. అలా అయితే నీకు ప్రాణదానం చేస్తాను. యుద్ధంలో జయించినవారి పద్ధతి ఇది". నేలమీద ఈడ్చబడుతున్న సింధురాజు జయద్రథుడు యుద్ధరంగంలో శోభించే పురుషసింహుడైన భీమునికి "అలాగే జరుగుతుంది" అని చెప్పాడు. పైకి లేవడానికి ప్రయత్నిస్తున్న అతనిని భీముడు బంధించి, రథంపైకి ఎక్కించాడు. అతడు మట్టి కొట్టుకుపోయి చేష్టలు దక్కి ఉన్నాడు.

అనంతరం భీముడు రథం ఎక్కి అర్జునుడు తన్ను అనుసరిస్తూ ఉండగా ఆశ్రమం చేరుకొని, అక్కడ కూర్చున్న యుధిష్ఠిరుని సమీపించాడు. ఆ స్థితిలో ఉన్న జయద్రథుని భీముడు రాజుకు చూపించాడు. యుధిష్ఠిరుడు అతనిని చూచి పెద్దగా నవ్వి "విడిచిపెట్టు" అన్నాడు. భీముడు రాజుతో – "ఈ పాపచిత్తుడు పాండవులకు దాసు డయ్యాడని ద్రౌపదికి చెప్పండి" అన్నాడు. అప్పుడు పెద్దవాడయిన యుధిష్ఠిరుడు ప్రేమపూర్వకంగా అతనితో – "నా మాట మీద గౌరవముంటే ఈ నీచకర్ముని. విడిచిపెట్టు" అన్నాడు. ద్రౌపదికూడా యుధిష్ఠిరునికేసి చూస్తూ భీమునితో – నీవు పంచశిఖలు పెట్టిన ఇతడు రాజుగారికి దాసుడు కనుక వదిలివెయ్యి" అన్నది. జయద్రథుడు బంధవిముక్తుడై యుధిష్ఠిరమహారాజును సమీపించి అభివాదం చేశాడు. విహ్వలుడై అక్కడ ఉన్న మునులందరినీ

చూచి, వందనం చేశాడు. అర్జునుడు జయద్రథుని పట్టుకోగా దయాళువైన ధర్మపుత్రుడు యుధిష్ఠిరుడు అతనితో ఇలా అన్నాడు. "నీవు ఇక్కడ దాసుడవు కావు. విడుదల పొందావు వెళ్లు. ఇంక ఎపుడూ ఇలా చేయకు. స్త్రీ కాముకుడవైన నిన్ను చీదరించుకొంటున్నాను. నీవు నీచుడవు. నీ సహాయకులూ నీచులే. ఇలాంటిపని పురుషాధముడైన నీవు తప్ప వేరెవరు చేస్తారు? (నీవు చేసినది ధర్మవిరుద్ధమైనపని లోకనింద్యమైనది కూడా)" అప్రాచ్యపు పనులు చేసే జయద్రథుడు ఇప్పుడు బలహీను డయ్యాడని గుర్తించి యుధిష్ఠిరమహారాజు అతనిని చూచి జాలిపడ్డాడు. "జయద్రథా! నీ బుద్ధి ధర్మమందే వృద్ధిపొందును గాక. అధర్మం మీద మనసు పెట్టకు. గుఱ్ఱాలతో, రథాలతో, కాల్బలంతో సుఖంగా వెళ్లు" అన్నాడు. రాజా! యుధిష్ఠిరుడు ఇలా అనగానే జయద్రథుడు సిగ్గుతో కొద్దిగా ముఖం దించుకొని, మౌనంగా వెళ్లిపోయాడు. అతడు దుఃఖార్తుడై గంగా ద్వారానికి వెళ్లి విరూపాక్షుడు ఉమాపతి అయిన దేవుని శరణు చొచ్చి, గొప్ప తపస్సు చేశాడు. శివుడు ప్రీతు డయ్యాడు. ప్రీతు డయిన త్రిలోచనుడు స్వయంగా పూజను స్వీకరించాడు.

మహాదేవుడు అతనికి వరమిచ్చాడు. అతడు దానిని గ్రహించాడు. అదెలాగో వినుము, జయద్రథుడు మహాదేవుని – "రథసహితులైన పాండవులైదుగురను యుద్ధంలో నేను జయించాలి" అని అడిగాడు. అలా కాదని శివుడు అతనికి బదులిచ్చాడు. "వారు అజేయులు. అవధ్యులు కూడా. మహాబాహువయిన అర్జునుని తప్ప మిగిలిన వారిని యుద్ధంలో నీవు అడ్డుకొనగలవు. అతడు నరు డనే పేరుతో ఉన్న ఇంద్రుడు. బదరికాశ్రమంలో తపస్సు చేసిన నారాయణునికి సహాయకుడు. అతడు సమస్తలోకాలకు జయింపశక్యం కానివాడు. దేవతలకు కూడా సాధ్యంకానివాడు. దివ్యమైన సాటిలేని పాశుపతబాణాన్ని అతనికి నేను ప్రసాదించాను. అతడు ఇంకా లోకపాలురనుండి వజ్రాది దివ్య శరాలను పొంది ఉన్నాడు. (ఇక నరరూపుడైన అర్జునునికి సహాయకుడైన నారాయణుని మహిమను వర్ణిస్తాను వినుము). నారాయణ భగవానుడు దేవతలకెల్ల దేవుడు. అనంతస్వరూపుడు. సర్వవ్యాపి, దేవగురువు, సర్వసమర్థుడు, ప్రధాన పురుషుడు, అవ్యక్తుడు, విశ్వాత్మ, విశ్వమూర్తి. యుగాంతకాలం వచ్చినపుడు పర్వతాలు, సముద్రాలు, ద్వీపాలతోపాటు, కొండలు, వనాలు, అడవులతో సహితంగా ఈ జగత్తునంతా కాలాగ్ని దహించివేస్తుంది. పాతాళతలంలో చరించే నాగలోకాలను సైతం ఆ అగ్ని దహించివేస్తుంది. అప్పుడు అంతరిక్షంలో గొప్పవైన అనేకవర్ణాల మేఘాలు వ్యాపిస్తాయి. ఘోరంగా గర్జిస్తూ మెఱుపులపంక్తులతో కూడిన ఆ మేఘాలు దిక్కులంతటా నిండిపోయి ఎల్లెడలా వర్షిస్తాయి. అప్పుడు ప్రళయకాలాగ్నిని కూడా అవి చల్లార్చివేస్తాయి. సంవర్తాగ్నిని నియంత్రించగలిగే ఆ మేఘాలు పాడవైన

పాములవంటి ధారలతో అన్నివైపుల ముంచెత్తుతాయి. చరాచరజగత్తు నశించిపోతుంది. సూర్యచంద్రులు, వాయువు విలీన మయిపోతాయి. గ్రహ నక్షత్రాలు ఉండవు. మొత్తం అంతా మహాసముద్రం అయిపోతుంది. వేయి మహాయుగాలు పరిసమాప్తమయ్యాక (పైన చెప్పిన) మహార్ణవ జలంలో ఈ భూమి మునిగిపోతుంది. అప్పుడు సహస్రాక్షుడు, సహస్రపాదుడు, సహస్ర శీర్షుడు, అతీంద్రియుడు అయిన నారాయణుడు అనే పేరుగల భగవానుడు నిద్రించగోరి నిశాంధకారం వ్యాపించిన కాళరాత్రిని తనకోసం సృష్టించుకొంటాడు. మొల్లపూలు, చంద్రుడు, ముత్యాలహారం, ఆవుపాలు, తామరతూడు, తెల్లకలువల వంటి తెల్లని కాంతి కలిగిన వేయి సూర్యులు ఒక్కచోట కూడినట్లున్న మహాకాంతితో వెలుగొందుతున్న వేయి పడగలు విచ్చుకొన్న శేషనాగుని పర్యంకంగా చేసుకొని అప్పుడు ఆ జలనిధిలో దేవదేవుడు పవ్వళిస్తాడు. అనంతరం సత్త్వగుణప్రవృద్ధి చేత మేల్కొనిన భగవానుడు ఈలోకమంతా శూన్యంగా ఉండడం చూశాడు. నారాయణుని గూర్చి ఈ సందర్భంగా ఈ శ్లోకాన్ని (మహర్షిగణం) చెపుతూ ఉంటారు. "జలం భగవానుని శరీరం. అందుకే జలానికి "నారాః" అనే పేరు వినబడుతోంది. నారములు అయనంగా (గృహంగా) ఉన్నవాడు కనుక లేక నారములతో కలిసి ఉంటాడు కనుక అతడు నారాయణుడు అయినాడు". ప్రాణులను సృష్టించడానికి నారాయణుడు తీవ్రంగా ధ్యానించాడు. ఆ ధ్యాన మాత్రం చేతనే భగవానుని నాభినుండి సనాతనమైన కమలం పుట్టింది. ఆ నాభికమలం నుండి చతుర్ముఖబ్రహ్మ ఉద్భవించాడు. లోకపితామహుడు ఆ పద్మంలో ఆసీనుడై జగత్తంతా శూన్యంగా ఉండడం చూసి, వెంటనే తనతో సమానులైన మరీచి ప్రముఖులైన తొమ్మిదిమంది మానసపుత్రులను సృజించాడు. ఆ మహర్షులు స్థావర జంగమరూపమైన సమస్త ప్రాణులను, యక్షులను, రాక్షసులను, భూతాలను, పిశాచాలను, నాగులను, మనుష్యులను సృష్టించారు. **భగవానుడు బ్రహ్మరూపంతో సృజిస్తాడు. పురుషోత్తమ శరీరంతో రక్షిస్తాడు. రుద్రస్వరూపంతో సంహరిస్తాడు. ప్రజాపతి అయిన భగవానునికి ఈ మూడు అవస్థలూ ఉన్నాయి.**

సింధురాజా! వేద పారంగతులైన, బ్రహ్మజ్ఞానులైన మునులు వర్ణించే విష్ణువు యొక్క అద్భుత కృత్యాలను గూర్చి నీవు వినలేదు. భూమి అంతా నీటిలో మునిగిపోయి మహార్ణవంగా మారిపోయినపుడు ఆకాశం ఒక్కటే కనిపిస్తూంటే భగవానుడు వర్షాకాలపు రాత్రి మిణుగురుపురుగు అన్ని వైపులకు ఎగురుతున్నట్లుగా ఆ నీటిలో అన్నివైపుల సంచరిస్తూ, స్థిరంగా ప్రతిష్ఠించడానికి అన్వేషించసాగాడు. నీటిలో మునిగిన భూమిని చూచి భగవానుడు దానిని ఉద్ధరించాలని మనసులోనే సంకల్పించుకొన్నాడు. ఏ రూపం

ధరించి నీటినుండి భూమిని ఉద్ధరించాలి? అని ఆలోచించాడు. ఈ రీతిగా మనసులోనే ఆలోచించి, దివ్యదృష్టితో చూచి నీటిలో క్రీడించడానికి యోగ్యమైనది వరాహమే అని ఆ రూపాన్ని స్మరించాడు. భగవానుడు వేదసమ్మితమైన, వైదిక వాఙ్మయ రూపమైన వరాహ శరీరాన్ని ధరించాడు. ఆ దేహం మహాపర్వతంలా వందయోజనాల పొడవు, పదియోజనాల విస్తీర్ణం కలిగి, దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. వాడికోరలతో, నీలజీమూతసన్నిభమై, మహామేఘగర్జనలవంటి ధ్వని కలిగి ఉంది. ఆ రీతిగా భగవానుడు యజ్ఞవరాహమూర్తియై నీటిలో ప్రవేశించాడు. ఒక కోరతో పైకెత్తి భూమిని స్వస్థానంలో ఉంచాడు. ఆపై మహాబాహువు అయిన భగవానుడు అర్ధశరీరం నరునిగా, అర్ధశరీరం సింహంగా అపూర్వమైన శరీరాన్ని ధరించి చేతులు రెండూ ఒకదానితో ఒకటి అప్పళిస్తూ, దైత్యరాజు సభకు వెళ్లాడు. దైత్యు లందరికీ ఆదిపురుషుడు, దేవతలకు శత్రువు అయిన దితినందనుడు హిరణ్యకశిపునకు ఆ అపూర్వపురుషుని చూచి, క్రోధంతో కన్నులు ఎఱ్ఱబడ్డాయి. కారుమబ్బుల వంటి శరీరచ్ఛాయ కలిగిన వీరుడు, దేవతల శత్రువు, దితికుమారుడు అయిన హిరణ్యకశిపుడు శూలం చేతితో ఎత్తిపట్టుకొని, మెడలో పూలమాల ధరించి మేఘగర్జన వంటి హుంకారంతో నృసింహుని మీద దాడి చేశాడు. బలవంతుడు, మృగేంద్రస్వరూపుడు అయిన భగవానుడు అతనిని సమీపించి నరసింహాకృతితో గోళ్లతో మిక్కిలిగా చీరేశాడు. ఈ రీతిగా శత్రుభూత కుడయిన దైత్యేంద్రుని భగవానుడు సంహరించాడు. ఆ కమలనయనుడు లోకహితం కొఱకు తిరిగి ఇంకొక రూపంలో ప్రకటమయ్యాడు. శ్రీమంతు డయిన నారాయణుడు కశ్యపునికి పుత్రునిగా జన్మించాడు. అదితి ఆతనిని వేయి సంవత్సరాలు పూర్తిగా గర్భంలో ధరించి, ఉత్తముడైన బాలకునిగా ప్రసవించింది. ఆ వామనాకారుడు వర్షాకాలపు మేఘంలా నల్లగా, మెరుస్తున్న కన్నులతో దండాన్ని, కమండలువును ధరించి, ఎదపై శ్రీవత్సచిహ్నంతో శోభిస్తున్నాడు.

శిఖ, యజ్ఞోపవీతం, కలిగి బాలరూపధారి శ్రీమంతుడు అయిన భగవానుడు అపుడు దానవేంద్రుని యజ్ఞవాటికకు వెళ్లాడు. అతడు బృహస్పతి సహాయంతో బలియొక్క యజ్ఞమండపాన్ని ప్రవేశించాడు. ఆ వామనుని చూచి, ముచ్చటపడి బలి ఇలా అడిగాడు. "విప్రుడా! నిన్ను చూడగానే సంతోషం కలిగింది చెప్పు. నీకేమి ఇవ్వమంటావు?" బలి ఇలా అడగగానే వామనుడు బలికి 'స్వస్తి' అని చెప్పి చిరునవ్వుతో "దానవపతీ! నాకు మూడు అడుగుల నేల ఇవ్వు" అని సమాధానమిచ్చాడు. బలి ప్రసన్నచిత్తుడై మహాతేజశ్శాలి అయిన ఆ విప్రునికి అతడు అడిగినది ఇచ్చాడు. భూమిని కొలిచే ఆ సమయంలో విక్రమించిన హరియొక్క రూపం దివ్యంగా, మహాద్భుతంగా ఉంది. అక్షోభ్యుడు, సనాతనుడు,

అయిన ఆ విష్ణుదేవుడు వెంటనే మూడు అడుగులతోనే భూమిని అంతా హరించివేసి, ఆ భూమిని ఇంద్రునికి ఇచ్చాడు. వామనావతారం గురించి వర్ణించి చెప్పాను నీకు. అతని వలననే దేవతలు పుట్టారు. ఈ జగత్తు అంతా కూడా అతని వలన పుట్టింది కనుక వైష్ణవమని పిలువబడుతుంది. దుష్టులను శిక్షించడానికి, ధర్మాన్ని సంరక్షించడానికి ఆ విష్ణుభగవానుడే మనుష్యులమధ్యలో అవతరించి యదువంశంలో పుట్టాడు. కృష్ణునిగా కీర్తింపబడుతున్నాడు. ఆ దేవుడు అనాది, అనంతుడు, అజుడు, లోకవంద్యుడు. సైంధవా! పండితులు అతనిని కొనియాడుతారు. అతడు చేసిన పనులను కీర్తిస్తారు. అజేయుడు, శంఖచక్రగదాధారి, శ్రీవత్సధరుడు, పీతకౌశేయవాసుడు అయిన ఆ దేవుని కృష్ణునిగా పిలుస్తారు. ఆ కృష్ణుడే అస్త్రవిద్యావేత్తలలో శ్రేష్ఠుడైన అర్జునుని రక్షిస్తున్నాడు. శత్రు సంహారకుడు, శ్రీమంతుడు, సాటిలేని పరాక్రమం కలవాడు అయిన పుండరీకాక్షుడు పార్థుని తనతోపాటుగా రథంపై కూర్చోపెట్టుకొని సహాయం చేస్తున్నాడు. ఈ కారణంగానే అతనిని జయించడానికి సాధ్యం కాదు. దేవతలకు కూడా అతడు తేరిచూడరానివాడే. ఇక యుద్ధంలో పార్థుని జయించగల మానవుడు ఎవడు? రాజా! అతనిని ఒక్కనిని విడిచి, మిగిలిన యుధిష్ఠిరుని సైన్యం, అంతటినీ శత్రువులయిన నలుగురు పాండవులను ఒకరోజు జయించగలవు.' వైశంపాయనుడు చెపుతున్నాడు – "రాజోత్తమా! సైంధవునికి ఈ రీతిగా చెప్పి సర్వపాపహరుడు, ఉమాపతి, పశుపతి, యజ్ఞధ్వంసి, త్రిపుర సంహారి, త్రినేత్రుడు, భగనేత్రనిపాతకుడు, అయిన శివుడు – వామనులు, వికటులు, కుబ్జులు, ఉగ్ర శ్రవణలోచనులు, నానారకాల ఆయుధాలు ధరించినవారు అయిన తన పార్షదులతో కలిసి, ఉమాసహాయుడై అక్కడే అంతర్ధాన మయ్యాడు. మూఢబుద్ధి అయిన జయద్రథుడు తన ఇంటికి వెళ్లాడు. పాండవులు కూడా ఆ కామ్యకవనంలోనే అలాగే నివసించారు.

273. యుధిష్ఠిరుడు తన దురవస్థకు దురపిల్లుచు మార్కండేయుని ప్రశ్నించుట.

జయద్రథుని జయించి, కృష్ణను విడిపించి, తీసికొని వచ్చాక ధర్మరాజు మునులతో పాటుగా ఆసీను డయ్యాడు. మహర్షులందరూ కూడా పాండవులకు వచ్చిన కష్టాలను విని సంతాపం ప్రకటిస్తూండగా, పాండునందనుడైన యుధిష్ఠిరుడు మార్కండేయ మహాముని ని ఉద్దేశించి ఇలా అన్నాడు. యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు – "భగవాన్! మీరు భూత భవిష్యత్తులు తెలిసినవారు. దేవర్షులలో చాలా ప్రసిద్ధులు. నా మనసులోని సందేహాన్ని అడుగుతున్నాను తీర్చండి. ద్రుపదుని కూతు రయిన ఈమె అగ్నికుండం నుండి అయోనిజయై జన్మించింది. సౌభాగ్యశాలిని. మహాత్ము డయిన పాండునికి కోడలు. భగవంతు

డయిన కాలానికి, విధి నిర్మిత మయిన దైవానికి ప్రాణుల యొక్క భవితవ్యానికి (జరుగబోయే ఘటనలకు) తిరుగులేదని అనుకొంటున్నాను. కాకుంటే ధర్మజ్ఞురాలు, ధర్మపరాయణురాలు అయిన మా ఈ భార్య పట్ల అటువంటి భావం (అపహరించాలనే భావం) ఎలా కలుగుతుంది ? ఇది ఎలా ఉందంటే సత్ప్రవర్తన కలవానిపై అబద్ధపు దొంగతనం ఆరోపించినట్లు ఉంది. ఈమె ఎప్పుడూ కించిత్తు పాపమయినా చేయలేదు. నింద్యమైన పనులు కూడా చేయలేదు. బ్రాహ్మణుల పట్ల సేవా సత్కారాది మహా ధర్మాలనే ఈ ద్రౌపది ఆచరిస్తూ ఉంటుంది. అటువంటి ఆమెను మూఢుడైన జయద్రథుడు బలవంతంగా ఎత్తుకుపోయాడు. ఆ కారణంగానే ఆ.పాపికి శిరోముండనం చేయబడింది. మేము అతనిని అనుచరులతో సహితంగా యుద్ధంలో ఓడించి, సింధు దేశపు సైన్యాన్ని సంహరించి, ఈమెను తిరిగి తీసుకొనివచ్చాము. ఊహించని రీతిగా భార్యాపహరణం అనే కష్టం మాకు కలిగింది. కపట వర్తనులైన జ్ఞాతుల చేత ఈ వనవాసం కలిగింది. నావంటి నిర్భాగ్యుడైన పురుషుడు ఎవరైనా ఉన్నట్లు మీరు ఇంతకుముందు చూచిగాని విని గాని ఉన్నారా ?'

274. శ్రీరామాదుల జనవము - కుబేరోత్పత్తి.

మార్కండేయుడు చెపుతున్నాడు. 'భరతశ్రేష్ఠ ! శ్రీరామచంద్రుడు ఇటువంటి మహాదుఃఖాన్ని పొందాడు. అతని భార్య జానకిని రాక్షసరాజు, మహాబలవంతుడు, దుర్మార్గుడు అయిన రావణుడు మాయలు పన్ని, ఆశ్రమం నుండి ఎత్తుకు పోయాడు. ఆ సమయంలో జటాయువు అనే పక్షి అడ్డురాగా దెబ్బకొట్టి వేగంగా ఎత్తుకెళ్ళాడు. రాముడు సుగ్రీవునియొక్క సైన్యాన్ని సహాయంగా తీసుకొని సముద్రానికి సేతువును నిర్మించి, తన నిశిత బాణాలతో లంకను దగ్ధం చేసి ఆమెను తిరిగి తీసుకొని వచ్చాడు.' యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. 'రాముడు ఏ వంశంలో పుట్టాడు ? అతని బలపరాక్రమాలు ఎటువంటివి ? రావణుడు ఎవరి కొడుకు ? వారిద్దరి మధ్య ఎటువంటి వైరం ఉంది? మహాత్మా! ఈ వృత్తాంతాన్ని అంతా నాకు పూర్తిగా చెప్పాలి. అద్భుతకృత్యాలు చేసిన రాముని యొక్క చరిత్రను వినాలనుకుంటున్నాను.' మార్కండేయుడు చెపుతున్నాడు - 'ఇక్ష్వాకు వంశీయుడైన అజుడనే మహారాజు ఉన్నాడు. అతని కొడుకు దశరథుడు. అతడు ఎల్లప్పుడూ స్వాధ్యాయం చేస్తూ శుచియై ఉండేవాడు. అతనికి ధర్మార్థకోవిదులైన నలుగురు కొడుకులు కలిగారు. వారు రామలక్ష్మణ, శత్రుఘ్నులు, మహాబలి అయిన భరతుడు. రాముని తల్లి కౌసల్య. భరతునికి తల్లి కైకేయి. పరంతపులయిన లక్ష్మణ శత్రుఘ్నులు సుమిత్ర యొక్క కొడుకులు. రాజా! విదేహరాజు జనకుడు. అతని కూతురు సీత. రామునికి భార్యగా

ఆమెను స్వయంగా బ్రహ్మదేవుడే సృష్టించాడు. జనేశ్వరా! సీతారాముల జన్మవృత్తాంతం చెప్పాను. ఇక రావణుని పుట్టుకనుగూర్చి నీకు చెపుతాను.

సమస్తలోకాలకూ నిర్మాత, ప్రభువు, మహా తపస్వి, స్వయంభువు, సాక్షాత్తు భగవంతుడూ అయిన బ్రహ్మదేవుడు రావణునికి పితామహుడు. ఆ బ్రహ్మదేవునికి ఇష్టుడయిన పులస్త్యుడు అనే మానస పుత్రుడు ఉన్నాడు. అతనికి ఒక గోవు నందు శక్తి సంపన్నుడయిన వైశ్రవణుడు అనే కొడుకు పుట్టాడు. రాజా! వైశ్రవణుడు తండ్రిని విడిచి, పితామహుని సేవించసాగాడు. ఆ కోపంతో తండ్రి తనను తాను మరియొక రూపంలో సృష్టించుకొన్నాడు. పులస్త్యుని అర్ధశరీరంతో పుట్టిన ఆ ద్విజుడు విశ్రవసుడు. అతడు వైశ్రవణునిపై ప్రతీకారంకోసం కోపంతో ఉండేవాడు. పితామహుడు మాత్రం వైశ్రవణుని పట్ల ప్రీతుడై అతనికి ధనేశత్వాన్ని, అమరత్వాన్ని, లోకపాలత్వాన్ని ప్రసాదించాడు. ఇంకా అతనికి మహాదేవునితో మైత్రిని కలిగించి నలకూబరు డనే కొడుకును, నివసించడానికి రాక్షస గణాలతో కూడిన లంకను రాజధానిగాను ప్రసాదించాడు. ఇచ్ఛానుసారంగా తిరిగే పుష్పకం అనే విమానాన్ని ప్రసాదించాడు. యక్షులకు అధిపతిగా చేశాడు. 'రాజరాజు' పదవిని ఇచ్చాడు.

275. రావణకుంభకర్ణాదుల ఉత్పత్తి - కుబేరుడు రావణునకు శాపమునిచ్చుట.

మార్కండేయుడు చెపుతున్నాడు – పులస్త్యుని క్రోధం వలన అతని అర్ధదేహంనుండి పుట్టిన విశ్రవసుడనే ఆ ముని వైశ్రవణుని క్రోధదృష్టితో చూడసాగాడు. రాజా! రాక్షసేశ్వరుడయిన కుబేరుడు – తండ్రి తనపట్ల క్రోధం కలిగిఉన్నాడని తెలిసినప్పటినుండి అతనిని ప్రసన్నుని చేసుకోవడానికి సదా యత్నించసాగాడు. నరవాహనుడు, రాజరాజు అయిన కుబేరుడు లంకలో నివసిస్తూ ఉన్నాడు. అతడు ముగ్గురు రాక్షసవనితలను తండ్రికి పరిచారికలుగా నియమించాడు. ఆ ముగ్గురు నృత్యగానాలలో ఆరితేరినవారు, వారు మహాత్ముడయిన ఆ ఋషిని ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచడానికే ప్రయత్నిస్తూ ఉండేవారు. మహారాజా! పుష్పోత్కట, రాక, మాలిని అని వారిపేర్లు. ఆ సుందరీమణులు తమకు మేలు కలగాలని, పరస్పరం పోటీలు పడి ఆ మునిని సేవించారు. భగవంతుడైన ఆ మహాత్ముడు సంతుష్టి చెంది వారిలో ఒక్కొక్కరికి వారి వారి కోరిక ప్రకారం లోకపాలురతో సమానులైన పుత్రులు కలుగుతారని వరం ఇచ్చాడు. పుష్పోత్కటకు ఇద్దరు కొడుకులు, రావణ కుంభకర్ణులు అనేవారు పుట్టారు. వారు రాక్షసేశ్వరులు. ఈ భూమండలంలో పరాక్రమంలో వారికి సాటి వచ్చేవారు లేరు. మాలినికి విభీషణుడనే ఒక కొడుకు కలిగాడు. రాకకు ఖరుడనే కొడుకు, శూర్పణఖ అనే కూతురు ఇద్దరు కలిగారు. విభీషణుడు

వారందరికంటె రూపంలో అధికుడు, అతడు సౌభాగ్యశాలి, ధర్మరక్షకుడు, కర్తవ్యపరాయణుడు రావణుడు, దశగ్రీవుడు అతడు అందరికీ శ్రేష్ఠుడైన రాక్షసరాజు, గొప్ప ఉత్సాహం, బలం కలవాడు. మహాధైర్యపరాక్రమాలు కలవాడు. కుంభకర్ణుడు శారీరకబలంతో యుద్ధంలో అందరినీ మించినవాడు. మాయావి, రణకుశలుడు. ఆ నిశాచరుడు మహాభయంకరుడు. ఖరుడు ధనుర్విద్యలో మహాపరాక్రమవంతుడు, బ్రహ్మద్వేషి మాంసాహారి. శూర్పణఖ మహారౌద్రంగా ఉంటుంది. సిద్ధపురుషులకు(మునులకు, ఋషులకు) విఘ్నాలు కలిగిస్తూ ఉంటుంది. వారందరూ వేదవేత్తలు, శూరులు. అందరూ బ్రహ్మచర్యవ్రతాన్ని ఆచరించేవారు. తండ్రితో కలిసి గంధమాదన పర్వతంపై సుఖంగా ఉండసాగారు. ఇలా ఉండగా ఒకరోజున పరమైశ్వర్య యుక్తుడైన నరవాహనుడు వైశ్రవణుడు తండ్రితో కలిసి కూర్చుని ఉండగా వారు చూశారు.

వారికి అసూయ కలిగి తపస్సు చేయడానికి దృఢంగా నిశ్చయించుకొన్నారు. మహాఘోరమైన తపస్సుతో బ్రహ్మదేవుని మెప్పించారు. దశగ్రీవుడు వేల సంవత్సరాల పాటు ఒంటికాలి మీద నిలిచి, పంచాగ్ని మధ్యంలో, ఏకాగ్రచిత్తుడై, వాయుభక్షకుడై తపస్సు చేశాడు. కుంభకర్ణుడు ఆహారాన్ని పరిమితం చేసుకొని, నేలపై పడుకొంటూ, కఠోరనియమాలను పాటించాడు. విభీషణుడు కేవలం ఒక్క ఎండుటాకునే భుజిస్తూ ఉండిపోయాడు. బుద్ధిమంతు డయిన విభీషణుడు ఉపవాస ప్రియుడై, సదా జపం చేస్తూ ఉండేవాడు. ఉదారబుద్ధిగల అతడు కూడా అంతకాలమూ తపస్సు చేశాడు. ఖరుడు, శూర్పణఖ ఇద్దరూ తపస్సు చేసుకొనే వారికి (తమ అన్నలకు) సంతోషంగా పరిచర్యలు చేస్తూ రక్షణ కల్పిస్తూ ఉండేవారు. వేయి సంవత్సరాలు నిండిన తరువాత దుర్ధర్షుడైన దశాననుడు తన శిరసును ఖండించుకొని అగ్నిలో వ్రేల్చాడు. దానికి లోకేశ్వరుడైన బ్రహ్మ ఆనందించాడు. అంతట బ్రహ్మదేవుడు స్వయంగా వెళ్లి తపస్సు చేస్తున్న వారిని వారించాడు. వారందరికీ వేర్వేరుగా వరాలిస్తానని ప్రలోభపెట్టి (ఇలా అన్నాడు) బ్రహ్మ .అంటున్నాడు – "పుత్రులారా! మీపట్ల నేను ప్రసన్నుడిని అయ్యాను. తపస్సును చాలించండి. వరాలు కోరుకోండి. అమరత్వం తప్ప ఎవరెవరికి ఏమేమి ఇష్టమో అడగండి. అది అలాగే జరుగుతుంది. (అనంతరం రావణుని ఉద్దేశించి) నీవు గొప్ప కోరికతో అగ్నిలో వ్రేల్చిన నీ శిరసులన్నీ మళ్లీ అలాగే నీ దేహంలో యథేచ్ఛగా కలుగుతాయి. నీ శరీరంలో వైరూప్యం ఉండదు. కామరూపధరుడవు అవుతావు. యుద్ధంలో శత్రువులమీద విజయం పొందుతావు. ఇందులో సంశయం లేదు." రావణుడు అన్నాడు – 'గంధర్వులు, దేవతలు, అసురులు, యక్షులు, రాక్షసులు, సర్పాలు, కిన్నరులు, భూతాలు – వీరెవరివలనా నాకు

పరాజయం ఉండకూడదు.' 'మనుష్యుల వలన తప్ప నీవు పేర్కొన్న వారివలన నీకు ఏమాత్రం భయంలేదు. నీకు మేలగుగాక! అది నేను విధించాను.' బ్రహ్మ అలా అనగానే దశగ్రీవుడు సంతుష్టుడయ్యాడు. దుర్బుద్ధి, నరభక్షకుడు అయిన అతడు మనుష్యులను చులకనగా తలచాడు.

బ్రహ్మ కుంభకర్ణుని కూడా అలాగే (వరం కోరుకోమని) అడిగాడు. మనస్సు తమోగుణంతో నిండిపోవడం వలన అతడు ఎక్కువ నిద్రను కోరుకొన్నాడు. అలాగే జరుగుతుందని చెప్పి బ్రహ్మ విభీషణునితో - "నాయనా! నేను చాలా ఆనందించాను. వరం కోరుకో" అని పదే పదే పలికాడు. విభీషణుడు అన్నాడు - "భగవాన్! ఎంత గొప్ప ఆపద ఎదురు అయినప్పటికీ నా మనసు అధర్మంవైపు మొగ్గకూడదు. నేర్చుకోకపోయినా బ్రహ్మాస్త్రం నాకు స్ఫురించాలి. బ్రహ్మ అన్నాడు - "శత్రుసూదనా! రాక్షస యోని యందు పుట్టినా నీ బుద్ధి అధర్మంలో తగుల్కోదు. అందువలన నీకు అమరత్వం కూడా ప్రసాదిస్తున్నాను.' మార్కండేయుడు చెపుతున్నాడు - 'రాజా! రాక్షసుడైన దశగ్రీవుడు వరాన్ని పొంది (మొట్టమొదటగా) ధనేశ్వరుని యుద్ధంలో జయించి, అతనిని లంక నుండి వెళ్లగొట్టాడు. భగవానుడైన కుబేరుడు లంకను విడిచి గంధర్వయక్ష రాక్షస కింపురుషులు వెంటరాగా వారితో పాటుగా గంధమాదన పర్వతాన్ని చేరుకొని, అక్కడ నివసించసాగాడు. రావణుడు దురాక్రమణ చేసి, అతని పుష్పకవిమానాన్ని కూడా అపహరించాడు. వైశ్రవణుడు కోపించి "ఇది నీకు వాహనంగా ఉండదు. యుద్ధంలో నిన్ను చంపినవానికే ఇది వాహనం అవుతుంది. నీకంటె పెద్దవాడినైన నన్ను అవమానించావు. నీవు ఎక్కువ కాలం ఉండబోవు" అని శపించాడు. మహారాజా! ధర్మాత్ముడయిన విభీషణుడు సత్పురుషుల మార్గాన్నే సదా స్మరిస్తూ కుబేరుని అనుసరించి మహదైశ్వర్యాన్ని పొందాడు. బుద్ధిమంతు డయిన సోదరుడు కుబేరుడు తన సోదరుడు విభీషణుని పట్ల సంతుష్టుడై యక్షరాక్షససైన్యానికి అతనిని సేనాపతిగా చేశాడు. నరభక్షకులైన రాక్షసులు, మహాబలవంతులయిన పిశాచులు అందరూ కలిసి దశాననుని రాజుగా అభిషేకించారు. దశగ్రీవుడు కామరూపధరుడై, ఆకాశ సంచారియై బలమదంతో దేవతలపై, దైత్యులపై కూడా దాడి చేసి వారివద్దనున్న రత్నాలను, రత్నఖచితవస్తువులను అపహరించాడు. అతడు సమస్తలోకాలను ఏడిపించాడు (అరిపించాడు) కాబట్టి "రావణుడు" అనిపించుకొన్నాడు. ఆ దశగ్రీవుడు కామబలుడు అంటే ఇచ్ఛానుసారంగా బలం వృద్ధి పొందేవాడు. కాబట్టి దేవతలకు భయం కలిగించాడు.

276. బ్రహ్మ ఆజ్ఞానుసారముగా దేవతలు ఋక్షవానరులయందు పుట్టుట.

మార్కండేయుడు చెపుతున్నాడు - అంతట బ్రహ్మర్షులు, సిద్ధులు, దేవర్షులు అగ్నిని పురస్కరించుకొని బ్రహ్మను శరణు చొచ్చారు. అగ్ని ఇట్లన్నాడు - 'భగవాన్! పూర్వం తమరు ఇచ్చిన వరదానం వలన మహాబలుడు అయిన విశ్రవసుని పుత్రుడు దశగ్రీవుడు అవధ్యుడు అయినాడు. ఆ మహాబలుడు అనేక రకాలుగా ప్రజలను అందరినీ బాధిస్తున్నాడు. కాబట్టి మీరు మమ్ము కాపాడాలి. మీకంటె వేరు రక్షకుడెవరూ లేరు. అగ్నీ! దేవాసురులు అతనిని యుద్ధంలో జయించడం సాధ్యం కాదు. అతని చావుకు అన్నివైపులనుండి చేయవలసినదంతా ఏర్పాటు అయింది. చతుర్భుజుడు అయిన విష్ణువు నా నియోగం వలన అతని కొరకే అవతరించాడు. అతడు ఆ పనిని నెరవేర్చగలడు.' అని చెప్పిన తరువాత పితామహుడు వారందరి సమక్షంలో ఇంద్రునితో - "సమస్త దేవగణాలతో సహా నీవు భూమి మీద పుట్టు. ఋక్ష (ఎలుగుబంటి) వానర స్త్రీలు అందరియందు వీరులై, కామరూపం ధరించగలిగిన, బలిష్ఠులైన కొడుకులను విష్ణువుకు సహాయకులుగా పుట్టించండి" అని చెప్పాడు.

అనంతరం దేవతలు, గంధర్వులు, నాగులు అందరూ తమ తమ అంశలతో, అంశాంశలతో శీఘ్రంగా భూమిమీద అవతరించడానికి తమలో తాము సంప్రదించుకొన్నారు. వరదుడైన బ్రహ్మదేవుడు వారందరి ఎదుటనే దుందుభి అనే పేరుగల గంధర్వ స్త్రీని "నీవు కూడా దేవతల కార్యం సిద్ధింప చేయడానికి భూలోకానికి వెళ్లు" అని ఆజ్ఞాపించాడు. అనంతరం బ్రహ్మదేవుని మాట విని అప్పుడు దుందుభి అనే ఆ గంధర్వ స్త్రీ మానవలోకంలో మంథర అనే కుబ్జస్త్రీగా (మరుగుజ్జు) పుట్టింది. ఇంద్రుడు మొదలైన ఆ దేవతా శ్రేష్ఠులందరూ ఋక్ష వానరులయొక్క కులీనస్త్రీలయందు పుత్రులను కలిగించారు. వారంతా కీర్తిలోను, బలంలోనూ కూడా తండ్రులనే తలపిస్తున్నారు. వారు పర్వత శిఖరాలను పగులగొట్ట కలిగినవారు. సాలవృక్షాలను, తాటిచెట్లను, రాళ్లను ఆయుధాలుగా కలిగినవారు. వారందరూ వజ్రసదృశ దేహులు. సముదాయ బలం కలవారు. కోరినంత బలపరాక్రమాలు కలవారు. అందరూ యుద్ధవిద్యలో ఆరితేరినవారు. పదివేల ఏనుగుల బలం కలిగినవారు. వేగంలో వాయువుతో సమానులైనవారు. ఎక్కడ కావాలనుకుంటే అక్కడ నివసించేవారు. కొంతమంది అడవులలోనే నివసించేవారు. ఈ విధంగా మొత్తం ఏర్పాటంతా చేసి, సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు ఏదేది ఎలా ఎలా చేయాలో మంథరకు బోధించాడు. మనోవేగం కలిగిన ఆమె ఆ మాటలన్నీ బాగా ఆకళింపు చేసుకొని, అటు ఇటు తిరుగుతూ వైరం పురికొల్పడంలో నిమగ్న మయింది.

277. రాముని వనవాసము - రాముడు ఖరదూషణులను సంహరించుట.

రాజా! దశరథుడు సత్కర్మ నిరతుడు, ధర్మపరాయణుడు, ఎల్లప్పుడూ వృద్ధులను సేవిస్తూ ఉండేవాడు. పుత్రులు కలిగినందుకు అతడు ఎంతో సంతోషించాడు. రాజా! మహా తేజస్వులయిన అతనియొక్క ఆ పుత్రులు దినదినాభివృద్ధి చెందారు. బ్రహ్మచర్యవ్రతులై వారు వేదాలలో ధనుర్వేదరహస్యాలలో పారంగతు లయ్యారు. వారికి వివాహం కాగానే దశరథుడు మిక్కిలి సంతోషించాడు. సుఖంగా ఉన్నాడు. వారిలో జ్యేష్ఠుడయిన రాముడు ప్రజలను రంజింపచేశాడు. తన మనోహరరూపంతో బుద్ధిమంతు డయిన అతడు తండ్రి హృదయానికి ఆనందం కలిగించే వాడయ్యాడు. భారతా ! బుద్ధిశాలి అయిన ఆ దశరథమహారాజు తనకు వయసు పైబడిందని తలచి, రామునికి యువరాజ్యాభిషేకం చేయడానికి ధర్మజ్ఞులైన పురోహితులతో, మంత్రులతో ఆలోచించాడు. ఆ మంత్రిసత్తము లందరూ సమయోచితమైన ఆ ప్రస్తావనను ఆమోదించారు. శ్రీరామచంద్రుడు కొద్దిగా ఎరుపైన కన్నులు కలవాడు. ఆజానుబాహుడు, మదగజం వలె ఠీవిగా నడిచేవాడు. శంఖం వంటి మెడ, విశాల వక్షఃస్థలం, నల్లని గిరజాల జుట్టు, సౌందర్యంతో ప్రకాశించే శరీరమూ కలిగి ఉండేవాడు. యుద్ధంలో ఇంద్రునకు తక్కువ కాని వీరుడు. సర్వధర్మ పారగుడు, బుద్ధికి బృహస్పతివంటివాడు. అందరినీ అలరించే స్వభావం కలవాడు. సర్వవిద్యా విశారదుడు, జితేంద్రియుడు. శత్రువులకు కూడా కన్నులపండువైనవాడు. దుర్జనులను నియంత్రించ కలిగేవాడు. ధర్మచరితులను రక్షించేవాడు, ధైర్యవంతుడు, అనాధృష్యుడు, విజయశీలి, పరాజయమెరుగనివాడు, కౌసల్యకు ఆనందం పెంపొందించే ఆ పుత్రుని చూచి దశరథమహారాజు మిక్కిలి సంతోషించాడు. దశరథుడు రాముని గుణాలను తలచుకొంటూ మురిసిపోతూ పురోహితునితో "బ్రహ్మజ్ఞా! ఈరోజు పుష్యమీ నక్షత్రం. రాత్రి వేళ మిక్కిలి పవిత్రమైన యోగం కలుగబోతోంది. మీరు సంభారాలన్నీ సమకూర్చండి. నా రామునికి కూడా ఈ వార్త తెలియచేయండి" అన్నాడు.

రాజు యొక్క ఈ మాటలు విని, మంథర తగిన సమయం చూసుకొని కైకేయిని సమీపించి ఇలా అంది. 'కైకేయీ! ఈరోజు రాజు నీకు గొప్ప దౌర్భాగ్యమైన విషయాన్ని వెల్లడించాడు. అంతకంటె భయంకరంగా బుసకొట్టే విషసర్పం నిన్ను కాటువేయడం మంచిది. పుత్రునికి పట్టాభిషేకం జరుగబోతున్న కౌసల్యయే అదృష్టవంతురాలు సుమా! రాజ్యార్హత లేని కొడుకు గల నీకు సౌభాగ్యం ఎక్కడిది"? ఆ మాట విని, ఆమె సర్వాభరణ భూషితురాలై, అత్యంత సుందరమైన రూపం దాల్చి, ఏకాంతంలో భర్తను సమీపించింది, అందంగా నవ్వగల ఆమె ప్రేమ ఉట్టిపడేలా నవ్వుతున్నట్లుగా తీయగా ఇలా అంది.

ఆడినమాట తప్పని రాజా! నీవు పూర్వం నాకోరికను ఒకదానిని తీరుస్తానన్నావు అది ఇప్పుడు నెరవేర్చు. అందువలన నీవు ఆ సంకటాన్నుండి విముక్తుడవు కాగలవు." రాజు అన్నాడు - "ప్రియా! నీకు వరం ఇస్తున్నాను. నీకు ఇష్టమైనది తీసుకో. ఇప్పుడు బంధింపతగని వానిని ఎవరినైనా బంధించాలా? లేక బంధింపతగిన వానిని విడిచిపెట్టాలా? ఎవరికైనా ధనం ఇవ్వనా ? లేక ఎవరి ధనమైనా అపహరించాలా? బ్రాహ్మణుల సొమ్ము కాక ఇక్కడగాని, మరొకచోటగాని నాకున్న ధనమంతా నీదే. ఈ భూమండలంలో రాజరాజును నేను. చతుర్వర్ణాల వారిని రక్షిస్తున్నాను. కల్యాణీ! నీకు ఇష్టమైన కోరిక ఎమిటో చెప్పు. ఆలస్యం చేయకు ' ఆయన మాటను విని ఆమె రాజును మాటకు కట్టుబడేలా చేసి తన బలం గుర్తెరిగి తరువాత ఇలా అంది. "మీరు రామునికోసం ఎర్పాటు చేసిన అభిషేకసంభారాలన్నీ భరతునికి దక్కాలి రాఘవుడు అడవికి వెళ్లాలి భరతశ్రేష్ఠా! అప్రియమైన దారుణమైన ఫరిణామం కల ఆమాటను విని, రాజు దుఃఖార్తుడై ఎమీ మాటలాడలేకపోయాడు.

తండ్రిమాట ఇచ్చాడని తెలుసుకొని పరాక్రమవంతుడు ధర్మాత్ముడు అయిన రాముడు రాజు సత్యవాక్కు కావాలని (ఆడిన మాట తప్పరాదని) అడవికి బయల్దేరాడు. లక్ష్మీయుతుడు ధనుర్ధారి అయిన లక్ష్మణుడు, విదేహరాజు కూతురు, జనకాత్మజ అయిన సీతాదేవి కూడా అతనిని అనుసరించారు. రాముడు అడవికి వెళ్ళాడు దశరథమహారాజు దేహత్యాగం చేశాడు. రాముడు అడవికి వెళ్లడం, దశరథుడు ఆ రీతిగా మరణించడం చూసిన కైకేయీదేవి భరతుని పిలిపించి ఇలా అంది. 'దశరథుడు స్వర్గలోకానికి వెళ్లాడు రామలక్ష్మణులు అడవిలో ఉన్నారు విశాలమూ క్షేమకరమూ, కంటకరహితమూ అయిన ఈ రాజ్యాన్ని నీవు గ్రహించు."

ధర్మాత్ముడైన ఆ భరతుడు - "కులకళంకినీ! తల్లీ ధనలోభం చేత అయ్యో ! నీవు ఎంత క్రూరకృత్యం చేశావు? భర్తను చంపి, ఈ వంశాన్ని నశింపచేసి, అప్రతిష్ఠను నానెత్తిన రుద్ది నీవు నీ మనోరథాన్ని నెరవేర్చుకున్నావు." అని పలికి వెక్కి వెక్కి ఎడ్చాడు. మంత్రులందరి సన్నిధిలో ప్రజల ఎదుట తన నిజాయితీని నిరూపించుకొని అనంతరం సోదరుని తిరిగి తీసుకురావాలనే కోరికతో రాముని మార్గాన్ని అనుసరించాడు వసిష్ఠవామదేవులతో, ఇతర విప్రులతో, వేలకొద్దీ పౌర జానపదులతో కలిసి రాముని తీసుకొని రావాలనే కాంక్షతో.. చిత్రకూట పర్వతంపై లక్ష్మణునితో కలిసి ధనుర్ధరుడై, తాపసవేషాన్ని తాల్చి ఉన్న రాముని భరతుడు చూశాడు అంతట శ్రీరాముడు "వెళ్ల నాయనా! ప్రజలను రక్షించు. నేను తండ్రి మాటను రక్షిస్తాను అన్నాడు పితృవాక్యపరిపాలకుడైన

రాముడు అతనిని వెనక్కి పంపగా అతడు అతని పాదుకలను ముందుంచుకొని నందిగ్రామంలో ఉంటూ రాజ్యం చేశాడు. రాముడు పౌరజానపదులు తిరిగిరావచ్చని ఆశంకించి మహారణ్యంలోని శరభంగాశ్రమాన్ని చేరుకొన్నాడు. శరభంగమహాముని సత్కరించి, దండకారణ్యాన్ని చేరుకొన్నాడు. అక్కడ రమణీయమైన గోదావరీనదీ తీరంలో నివసించాడు. అక్కడ నివసిస్తున్న రామునికి శూర్పణఖకారణంగా జనస్థాన నివాసి అయిన ఖరునితో గొప్పవైరం తటస్థించింది ధర్మవత్సలుడైన రాఘవుడు మునులను రక్షించడానికి భూమిపై పద్నాలుగు వేలమంది రాక్షసులను సంహరించాడు. గొప్ప బలవంతులైన ఖరదూషణు లనే రాక్షసులను సంహరించి, బుద్ధిశాలి అయిన ఆ రాముడు తిరిగి ఆ ప్రాంతాన్ని క్షేమకరమైన ధర్మారణ్యంగా చేశాడు.

ఆ రాక్షసులందరూ చనిపోగా, ముక్కు, పెదవులు కోసివేయబడిన శూర్పణఖ తిరిగి తన సోదరుని ఇంటికి లంకకు వెళ్లింది అక్కడ రావణుని సమీపించి ఆ రాక్షసి దుఃఖంతో ఒళ్లు తెలియక, ఎండిపోయిన రక్తపు చారికలున్న ముఖంతో అన్నగారిపాదాలపై వ్రాలిపోయింది. ఆ రీతిగా వికృతరూపంతో ఉన్న ఆమెను చూసి రావణుడు కోపంతో ఒళ్లు తెలియక, క్రుద్ధుడై పళ్లు పటపట కొరుకుతూ ఆసనం నుండి ఒక్కఉదుటున లేచాడు. తన మంత్రులందరినీ విడిచి, ఏకాంతంలో అతడు ఆమెతో "అమ్మాయీ! నన్ను కూడా లెక్కించక, అవమానించి, ఎవరు నిన్ను ఇలా చేసినది ? శరీరమంతటా తీక్ష్ణమైన శూలాన్ని గ్రుచ్చుకోవాలనుకుంటున్న వాడెవడు ? నెత్తిన నిప్పు పెట్టుకొని నిశ్చింతగా సుఖంగా నిద్రించాలనుకుంటున్న వాడెవడు ? మహాభయంకరమైన విషసర్పాన్ని కాలితో తొక్కుతున్న దెవరు ? జూలుతో ఉన్న సింహం నోటిలోని కోరలను స్పృశించి నిశ్చింతగా ఉన్నవా డెవడు ?" అని ఈ రీతిగా పలుకుతున్న రావణుని కన్నులు, ముక్కు చెవులనుండి రాత్రిపూట మండుతున్న చెట్టుయొక్క రంధ్రాలనుండి అగ్నిజ్వాలలు వెలువడినట్లుగా విస్ఫులింగాలు వెలికి వచ్చాయి. అంతట అతని సోదరి శూర్పణఖ రాముని పరాక్రమాన్ని ఖరదూషణ సహితంగా రాక్షసుల మరణాన్ని – అంతా అతనికి వర్ణించి చెప్పింది. అది విన్నాక రావణుడు తాను చేయవలసినది నిర్ణయించుకొని చెల్లెలిని ఓదార్చి నగరానికి రక్షణ ఏర్పాటు చేసి ఆకాశమార్గాన సాగిపోయాడు. త్రికూటాన్ని, కాలపర్వతాన్ని దాటి, మొసళ్లతో, లోతైన నీటితో నిండి ఉన్న మహాసాగరాన్ని చూశాడు. దానిని కూడా పైనుండే దాటి దశాననుడు పరమాత్మ, శూలపాణి అయిన శివునికి ప్రీతికరమైన, అవిచలమైన గోకర్ణక్షేత్రాన్ని చేరుకున్నాడు. పూర్వమే రామునివలన భయంతో మునివృత్తిని ఆశ్రయించిన, తన పూర్వపుమంత్రి అయిన మారీచుని దశాననుడు అక్కడ కలుసుకొన్నాడు,

278. మారీచ వధ - సీతాపహరణము.

రావణుని రాకను చూచిన మారీచుడు ఆశ్చర్యంతో తొట్రుపడుతూ అతనిని ఫలమూలాదులతో సత్కరించి, గౌరవించాడు. రావణుడు విశ్రాంతంగా కూర్చున్నాక అతనివద్ద తాను కూడా కూర్చుని, మాటలాడడంలో నేర్పరి అయిన మారీచ రాక్షసుడు మాటలలోని మర్మాన్ని గుర్తించగలిగిన రావణాసురునితో వినయంగా ఇలా అన్నాడు. "రావణా! నీ శరీరపు రంగు సహజంగా లేదు. (పాలిపోయినట్లున్నావు) నీ నగరమంతా క్షేమమే కదా! నీ ప్రజలు, మంత్రులు అందరూ నిన్ను ఎప్పటిమాదిరిగానే సేవిస్తున్నారా? రాక్షసరాజా! నీవు ఇక్కడికి రావలసినంత పనేమిటి ? నేను చేయగలిగితే ఎంత దుష్కరకార్య మయినా అది నెరవేరినట్లే అనుకో ?" అని అడిగాడు. క్రోధాసూయలతో నిండిపోయిన రావణుడు రాముడు చేసినదంతా, సంక్షిప్తంగా (అతని కార్యాలను), మారీచునకు చెప్పాడు. మారీచుడు అదంతా విని కష్టంగా రావణునితో "నీవు రామునితో వైరం పెట్టుకోకు. అతని పరాక్రమం తెలిసిన వాడిని నేను. ఆ మహాత్మునియొక్క బాణవేగాన్ని తట్టుకోవడం ఎవరికి సాధ్యమవుతుంది ? నేను సన్యసించడానికి ఆ పురుషశ్రేష్ఠుడే కారణం కదా! రామునితో వైరం వినాశానికి దారితీస్తుంది. ఏ దురాత్ముడు దీనిని నీకు చెప్పాడు? అని ఉపదేశించాడు. అది విని రావణుడు మరింత క్రోధంతో అతనిని బెదిరిస్తూ - "నీవు నామాట పాటించకపోతే నీకు మృత్యువు తప్పదు" అన్నాడు. మారీచుడు తనలో "మరణం ఎలాగూ తప్పనప్పుడు విశిష్టమైన వ్యక్తులచేతిలో చావే శ్రేష్ఠమైనది. కనుక ఇతనికి ఏది ఇష్టమో అలాగే చేస్తాను' అని ఆలోచించుకొన్నాడు. అనంతరం మారీచుడు ఆ రాక్షస శ్రేష్ఠునికి - 'నీకు నేను చేయవలసిన సహాయం ఏమిటి ? అది నావలన కాకపోయినా చేస్తాను." అని బదులిచ్చాడు. దశగ్రీవుడు - 'నీవు రత్నమయమైన కొమ్ములు, రత్నకాంతులు, విచిత్రమైన రోమాలు గల లేడిగా మారి సీతను ప్రలోభపెట్టు. వెళ్లు. నిన్ను చూసి సీత తప్పకుండా రాముని పంపిస్తుంది. (పట్టుకోవడానికి) రాముడు దూరంగా వెళ్లిపోగానే సీత నాకు వశమైపోతుంది. ఆమెను ఆశ్రమం నుండి అపహరించి తీసుకొనివచ్చేస్తాను దుర్బుద్ధి అయిన రాముడు భార్యావియోగంతో జీవించలేడు. ఈ సాహాయ్యం నాకు చేసిపెట్టు" అన్నాడు. రావణుడు ఇలా చెప్పగానే మారీచుడు తనకు నీళ్లు వదలుకొని, అత్యంతమూ దుఃఖితుడై రావణుడు ముందు నడుస్తూ ఉండగా అతనిని అనుసరించాడు.

అనంతరం వారిద్దరూ ఆ రాముని ఆశ్రమానికి వెళ్లి, పూర్వం తాము అనుకొన్న రీతిగా సర్వమూ నిర్వహించారు. బోడితలతో, భిక్షాపాత్రతో, త్రిదండంతో రావణుడు సన్యాసిగానూ, మారీచుడు మృగంగానూ మారి ఆప్రదేశాన్ని సమీపించారు మృగరూపాన్ని

ధరించిన మారీచుడు సీతకు కనిపించాడు. విధిప్రేరణతో సీతాదేవి ఆ మృగంకోసం రాముని పంపింది. రాముడు కూడా ఆమెకు ప్రియం చేయదలచి సత్వరంగా ధనుస్సు తీసుకొని, ఆమెకు రక్షణగా లక్ష్మణుని ఉంచి మృగాన్ని పట్టుకోవాలని బయలుదేరాడు. అతడు చేతిలో విల్లు ధరించి, అమ్ములపొదిని వీపున కట్టుకొని, నడుమున కత్తి, చేతికి గోధాంగుళిత్రము (ఉడుము చర్మంతో చేసిన తొడుగు) ధరించి, శివుడు మృగశిరా నక్షత్రం వెంట పడినట్లుగా ఆ మృగం వెంట పరుగు తీశాడు. ఆ రాక్షసుడు అంతర్ధానుడవుతూ, తిరిగి కనిపిస్తూ ఆశ్రమంనుండి రాముని చాలాదూరం వచ్చేలా చేశాడు. అతనిని రాక్షసునిగా తెలుసుకొని ప్రతిభాశాలి అయిన రాముడు అమోఘమైన ఒక బాణాన్ని సంధించి మృగరూపధారి యైన అతనిని సంహరించాడు. రాముని బాణం తగిలిన అతడు అప్పుడు రాముని కంఠంతోనే "హాసీతా! హా లక్ష్మణా!" అని దీనస్వరంతో ఆక్రోశించాడు.

అతనియొక్క దీనమైన ఆ వాక్కును వైదేహి విన్నది. ఆమె ఆ శబ్దం వచ్చినవైపుగా పరుగుతీసింది. ఆమెతో లక్ష్మణుడు – "భీరూ! నీవు శంకించవలసిన పని లేదు. రాముని చంపగలిగిన వారెవరు ఉన్నారు ? శుచిస్మితా! ఒక్క ముహూర్తకాలంలోనే నీవు నీ భర్త రాముని చూడగలుగుతావు " అన్నాడు. అది విని ఆమె వీడుస్తూ లక్ష్మణుని శంకించింది. సదాచారమే భూషణంగా గలిగి సాధ్వి, పతివ్రత అయిన ఆమె స్త్రీ స్వభావం వలన అతనిని పరుషంగా మాటలాడసాగింది. 'మూఢుడా! నీవు నీ మనసులో కోరుకొంటున్నది ఎప్పటికీ జరుగదు. కత్తి తీసుకొని నన్ను నేను చంపుకొంటాను. కొండ కొమ్మునుండి దూకి చస్తాను. లేదా అగ్నిలో దూకుతాను. అంతేకాని రామునివంటి భర్తను వదిలి నీవంటి నీచుని పొందను. పులిపిల్ల నీచమైన నక్కను చేరనట్లుగా నేను నిన్ను చేరను" అన్నది. అటువంటి మాటలు విని అన్నగారిపట్ల ప్రేమ కల లక్ష్మణుడు చెవులు మూసుకొన్నాడు. సదాచారి అయిన అతడు అన్నగారు వెళ్లిన వైపు బయలుదేరాడు. ధనుర్ధరుడై కాలిగుర్తులవెంట సాగాడు. సీతాదేవి వైపు కన్నెత్తి కూడా చూడకుండానే అక్కడి నుండి బయలుదేరాడు ఈ అవకాశం చూసుకొని రావణుడు, భయానకరూపుడైనా అందమైన ఆకారం దాల్చి, నివురు కప్పిన నిప్పులా సన్యాసివేషంలో తన్ను తాను మరుగుపరచుకొని, ఆ సీతాసాధ్విని అపహరించడానికి అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

ధర్మజ్ఞురా లయిన జానకి ఆశ్రమానికి వచ్చిన అతనిని చూచి అప్పుడు పళ్లు, దుంపలు మొదలైన భోజనంతో అతిధి సత్కారం చేయడానికి భోజనానికి పిలిచింది. ఆమె చేసిన ఆ సత్కారాన్నంతటినీ తృణీకరించి, రాక్షసరాజు తన అసలురూపం పొంది

వైదేహిని ఇలా బుజ్జగించసాగాడు. "సీతా! నేను రాక్షసరాజును రావణు డనే పేరుతో ప్రసిద్ధి కెక్కినవాడను. సముద్రానికి ఆవలివైపున రమణీయమైన లంక అనే పేరుగల నా రాజధాని ఉంది. అక్కడ స్త్రీ పురుషులమధ్య నీవు నన్ను కూడి శోభిల్లగలవు సుశ్రోణీ! నీవు నాకు భార్యగా ఉండు తాపసి అయిన ఆ రాఘవుని వదిలిపెట్టు" అన్నాడు. అతనియొక్క ఈ రకమైన మాటలను విని సీత చెవులు మూసుకొని ఇలా అంది 'అలా ఎన్నటికీ కాదు. నక్షత్రసహితంగా మిన్ను విరిగిపడినా భూమి ముక్కలయినా అగ్ని చల్లబడినా రాముని నేను విడువను మదజలం స్రవిస్తున్న గండస్థలం కలిగి పద్మమాలికలు ధరించిన అడవిలో ఉన్న మదపుటేనుగును పొందిన ఆడ ఎనుగు పందిని ఎలా స్పృశిస్తుంది ? పూలతేనె త్రాగి, పట్టుతేనెను క్రోలిన ఏ స్త్రీ అయినా రేగుపండ్లమీద ఎలా లోభపడగలుగుతుంది ?" అని అతనిని ఉద్దేశించి చెప్పి ఆమె క్రోధంతో పెదవులు అదురుతూండగా మాటిమాటికీ చేతులు దులుపుతూ ఆశ్రమం లోపలికి వెళ్లిపోయింది. వెన్నంటి పరుగెత్తి రావణుడు ఆమెను అడ్డగించాడు కఠోరమైన కంఠంతో ఆమెను భయపెట్టసాగాడు. ఆమె మూర్ఛపోయింది ఆమెను జుట్టుపట్టుకొన్నాడు. వెంటనే ఆకాశంలోకి ఎగిరిపోయాడు. రావణుడు ఆమెను అపహరించి తీసుకొని పోతూండగా ఆమె దీనురాలై 'రామా! రామా!" అపి విలపిస్తోంది. అటువంటి ఆమెను పర్వతగుహలో నివసించే జటాయువు అనే గ్రద్ద చూచింది.

279. రావణుడు జటాయువుకు అగ్నిసంస్కారమును చేయుట - కబంధునికి శాపవిముక్తి.

మహావీరుడు, గృధ్రరాజు అయిన జటాయువు అరుణుని కొడుకు. దశరథుని స్నేహితుడు. సంపాతి అతనికి అన్నగారు. అప్పుడు అతడు రావణుని ఒడిలో ఉన్న కోడలు సీతను చూశాడు. క్రోధంతో ఆ పక్షి రాక్షసేశ్వరుడైన రావణునివైపు వేగంగా ఎగురుతూ వచ్చింది. ఆ పక్షిరాజు అతనితో ఇలా అన్నాడు - నిశాచరా! విడు. విడు. నేను ప్రాణాలతో ఉండగా మైథిలిని ఎలా అపహరించగలుగుతావు ? నీవు నా కోడలిని విడిచిపెట్టకపోతే ప్రాణాలతో నానుండి తప్పించుకోలేవు" ఇలా అని ఆ రాక్షసేంద్రుని గోళ్లతో బాగా గాయపరిచాడు రెక్కలతో కొట్టి ముక్కుతో పొడవడం వలన వందలకొద్దీ గాయాలై రావణుని శరీరం శిథిలమయిపోయింది సెలయేళ్లతో నిండిన పర్వతంలా అతని శరీరంనుండి అధికంగా రక్తం స్రవించసాగింది. రామునికి ప్రియం హితం చేయదలచుకొన్న ఆ పక్షిరాజు తన్ను చంపటానికి సిద్ధంగాకా రావణుడు కత్తి తీసుకొని

ఆ పక్షి యొక్క రెండు భుజాలూ (రెండు రెక్కలు) నరికి వేశాడు. మేఘాలను భిన్నం చేయగలిగిన పర్వతశిఖరం వంటి ఆ గృధ్రరాజును పడగొట్టి రావణుడు సీతను ఒడిలో పెట్టుకొని ఆకాశమార్గాన వెళ్లిపోయాడు. ఎక్కడెక్కడ ఆశ్రమవాటికలు, సరస్సులు, నదులు కనిపించాయో, అక్కడ వైదేహి తన నగలను పడవేయసాగింది. ఒకచోట ఒక కొండశిఖరంమీద ఐదుగురు వానరశ్రేష్ఠులను ఆమె చూచింది. బుద్ధిమతి అయిన ఆమె తన దివ్యమైన వస్త్రాన్ని అక్కడ పడవేసింది. చక్కని పీతవర్ణం కలిగిన ఆ వస్త్రం గాలికి ఎగురుతూ మేఘాల మధ్యలోకి మెఱుపు వచ్చినట్లుగా ఆ వానరుల మధ్యకు వచ్చి పడింది. ఆకాశంలో సంచరించే పక్షివలె అతి శీఘ్రంగా దారి అంతా కడచి, అతడు బహుద్వారాలతో మనోహరంగా ఉన్న అందమైన తన లంకా నగరాన్ని చూశాడు. విశ్వకర్మ నిర్మించిన ప్రాకారాలతో అగడ్తలతో చుట్టూ ఆవరించబడిన ఆ లంకాపురిని సీతతోపాటుగా రాక్షసేశ్వరు డయిన రావణుడు ప్రవేశించాడు.

ఇలా సీత అపహరించబడినాక, ధీమంతుడయిన రాముడు ఆ మహామృగాన్ని చంపి, వెనుతిరిగి వస్తూ సోదరుడైన లక్ష్మణుని చూశాడు. "రాక్షసులు నిండి ఉండే అడవిలో వైదేహిని విడిచి ఎలా వచ్చావు" అని తన సోదరుని నిందించాడు. మృగరూపధారి అయిన రాక్షసుడు తన్ను ఆశ్రమం నుండి దూరంగా తీసుకురావడం, తమ్ముడు కూడా ఇక్కడికి వచ్చెయ్యడం తలచుకొని, రాముడు మనసులోనే పరితపించాడు. రాముడు అలా నిందించుకొంటూనే త్వరత్వరగా వెళ్లి అతనిని కలుసుకొన్నాడు. 'లక్ష్మణా! వైదేహి ఇప్పుడు బ్రతికి ఉందో లేదో చూడాలి" అన్నాడు. అప్పుడు లక్ష్మణుడు చివరలో సీత అన్న అనుచితమైన, అసంగతమైన మాటలన్నీ చెప్పాడు. శోకంతో దహించుకుపోతున్న మనసుతో రాముడు ఆశ్రమం వైపు బయలుదేరాడు. అప్పు డక్కడ పర్వతంలా ఉన్న గాయపడిన పక్షిని అతడు చూశాడు. అతనిని రాక్షసునిగా శంకించి బలంగా ధనస్సును లాగిపట్టుకొని రాముడు లక్ష్మణసమేతుడై అతనివైపు పరుగుతీశాడు. తేజస్వి అయిన జటాయువు కలిసి వచ్చిన ఆ రామలక్ష్మణులతో మీకు మేలగు గాక! నేను పక్షిరాజును దశరథునకు స్నేహితుడను" అన్నాడు. అతని ఆ మాటలను విని వారిద్దరు దివ్యమైన ఆ విండ్లను దించి, "మా తండ్రిగారి పేరును ఉచ్చరించావు. నీవెవరవు?" అని అడిగారు. అప్పుడు వారిద్దరు ఆ పక్షియొక్క రెక్కలు తెగి ఉండడం గమనించారు. సీతకోసం రావణుని చేతిలో తాను గాయపడడం గురించి ఆ పక్షి వారిద్దరికి చెప్పింది. రావణుడు ఏ దిక్కుకు వెళ్లాడని రాఘవుడు అడిగాడు. ఆ పక్షి తల ఊపడం ద్వారానే చెప్పి, ప్రాణాలు వదిలేసింది 'దక్షిణదిశ' అని దాని ఇంగితాన్ని గుర్తించాడు రాముడు తండ్రికి

స్నేహితు డని గౌరవించి, అగ్ని సంస్కారం చేశాడు

అనంతరం ఆశ్రమానికి వెళ్లి చూశాడు. ఆశ్రమం అంతా చిందరవందరగా ఉంది. దర్భాసనం విసిరివేయబడి ఉంది. కలశాలు విరిగిపడి ఉన్నాయి. అంతా శూన్యంగా ఉంది. ఎన్నో నక్కలు అక్కడ గుమికూడి ఉన్నాయి. సీతాపహరణానికి బాధపడుతూ, దుఃఖశోకాలతో నిండిపోయిన శత్రుమర్దనులైన ఆ రామలక్ష్మణులిద్దరూ దండ కారణ్యాన్నుండి దక్షిణదిక్కుగా బయల్దేరారు. ఆ మహారణ్యంలో లక్ష్మణునితో కలిసి రాముడు జంతుజాలమంతా అన్నివైపులకు పరుగులు తీయడం చూశాడు. దావాగ్నికి భయపడినట్లుగా జంతువుల ఘోరనాదాలన్నీ అంతకంతకు పెరుగుతున్నాయి ముహూర్తమాత్రకాలంలో వారు భయంకరాకారం కల కబంధుని చూశారు ఆ కబంధుడు మేఘంలా నల్లగా పర్వతంలా విశాలకాయం కలిగి ఉన్నాడు. మద్దిచెట్టులా పొడవైన భుజాలు కలిగి, వక్షఃస్థలంలోనే వెడల్పైన కన్నులతో, పెద్ద పొట్టలో పెద్దనోటితో వికృతంగా ఉన్నాడు ఆ రాక్షసుడు అనుకోకుండా అకస్మాత్తుగా లక్ష్మణుని చేతిని పట్టుకొన్నాడు. భారతా! వెంటనే సుమిత్రానందనుడు విషాదం పొందాడు. ఆ రాక్షసుడు లక్ష్మణుని తన నోటివైపు లాగుకోసాగాడు. లక్ష్మణుడు విషణ్ణుడై రాముని వైపు చూచి ఇలా అన్నాడు – అన్నయ్యా! నా ఈ అవస్థను చూడు. సీతాదేవి అపహరణకు గురికావడం నాకు ఇలాంటి ఉపద్రవం రావడం నీవు రాజ్యభ్రష్టుడవు-కావడం, తండ్రిగారు చనిపోవడం (ఇలా ఒకదాని మీద ఒకటి ఆపదలు వచ్చిపడుతున్నాయి) సీతతో కూడి నీవు కోసలదేశానికి వెళ్లి, తాత తండ్రుల నుండి సంక్రమించిన భూమండలరాజ్యాన్ని పొందడం నేను చూడలేనేమో ! కుశలతో, లాజలతో (పేలాలతో) శమీపత్రాలతో అభిషేకింపబడిన మీయొక్క మేఘరహితమైన చంద్రుని వంటి ముఖాన్ని చూడగలిగిన వారు ధన్యులు . ఇలా పలు విధాలుగా బుద్ధిమంతు డయిన ఆ లక్ష్మణుడు విలపిస్తూంటే కంగారుపడే సమయంలో కూడా కంగారు పడని ఆ రాముడు అతనితో ఇలా అన్నాడు. 'నరశార్దూలా! విచారించకు నేను ఉండగా ఇతడు లెక్కలోని వాడు కాడు. (ఏమీ చేయలేడు). నీవు ఈతని కుడిచేతిని ఖండించు నేను ఎడమ చేతిని నరుకుతున్నాను." అన్నాడు. ఇలా అంటూనే రాముడు పదునైన కత్తితో త్రుంచివేయబడిన నువ్వు కాడలా అతని భుజాన్ని నరికిపారేశాడు.

బలవంతుడయిన సుమిత్రానందనుడు కూడా అప్పుడు అతని కుడిచేతిని ఖండించివేశాడు తన అన్న రాఘవుడు నిల్చుని ఉండడం చూసి లక్ష్మణుడు మళ్లీ ఆ రాక్షసుని ప్రక్కటెముకపై గట్టిగా వేటు వేశాడు. అంతట పెద్ద శరీరంకల ఆ కబంధుడు ప్రాణాలు కోల్పోయి నేలకు ఒరిగాడు అతని దేహం నుండి దివ్యరూపధారి అయిన ఒక

పురుషుడు వెలువడి ఆకాశంలో సూర్యునిలా వెలుగొందుతూ, నిలిచి ఉండడం కనిపించింది. మాటలలో నేర్పరి అయిన రాముడు అతనిని "నీవు ఎవరవు? నీకు ఇష్టమయితేనే అడుగుతున్న నాకు సమాధానం చెప్పు. ఇదంతా ఏదో అద్భుతంగానూ, చిత్రంగానూ అనిపిస్తోంది' అని అడిగాడు. "రాజా! నేను విశ్వావసువనే గంధర్వుడిని. బ్రాహ్మణ శాపం వలన రాక్షస జన్మ ప్రాప్తించింది. లంకలో నివసించే రాక్షసరాజు రావణుడు, సీతను అపహరించాడు సుగ్రీవుని కలుసుకో, అతడు నీకు సహాయం చేస్తాడు. ఇదిగో దగ్గరలోనే హంసలతో, బెగ్గురు పక్షులతో కూడి, పవిత్రజలంతో నిండిన, పంపా సరోవరం ఉంది ఆ చెరువు ఋశ్యమూక పర్వతానికి ఆనుకుని ఉంది. అక్కడ సుగ్రీవుడు నలుగురు మంత్రులతో కలిసి నివసిస్తున్నాడు. అతడు సువర్ణమాలను ధరించి ఉంటాడు. వానర రాజయిన వాలికి సోదరుడు. నీవు అతనిని కలుసుకొని నీ దుఃఖానికి కారణాన్ని తెలియచేయి. నీతో సమానమైన శీలం కల అతడు నీకు సహాయం చేస్తాడు. నేను ఇంతమాత్రం చెప్పగలను - నీవు జానకిని చూస్తావు. వానరరాజు సుగ్రీవునికి రావణుని నివాసం నిశ్చయంగా తెలుసు" అని చెప్పి మిక్కిలి ప్రకాశం కలిగిన ఆ దివ్యపురుషుడు అంతర్ధానమయ్యాడు. మహావీరులైన రామలక్ష్మణులు ఇద్దరూ ఆశ్చర్యపడ్డారు

280. రామసుగ్రీవులమైత్రి - వాలివధ - లంకలో సీతను త్రిజట ఓదార్చుట

సీతాపహరణం వలన దుఃఖార్తుడైన రాముడు కొద్ది దూరంలోనే ఉన్న పంపాసరోవరాన్ని చేరుకున్నాడు. ఆ సరస్సులోని తీగలకు తామరలు, కలువలు పూచి ఉన్నాయి. చల్లని, సుఖకరమైన, అమృతపు సువాసనతో కూడిన గాలిని అనుభవిస్తూ ఆ వనంలో రాముడు మనసులోనే తన ప్రియురాలిని తలచుకొన్నాడు. ఆ రాజేంద్రుడు అక్కడ భార్యను తలచుకొంటూ కామబాణ సంతప్తుడై విలపించాడు. అంతట సౌమిత్రి అతనితో ఇలా అన్నాడు. "మానదా! మనసును స్వాధీనంలో ఉంచుకోగలిగిన వృద్ధులకు వలె, నియమనిగ్రహాలు కలిగిన వ్యక్తిని వ్యాధి తాకలేనట్లే నిన్ను ఈరకమైన భావం స్పృశించకూడనిది వైదేహియొక్క, రావణుని యొక్క సమాచారం నీకు తెలిసింది. నీవు నీ పౌరుషం చేతనూ, బుద్ధిబలం చేతనూ సీతను పొందు. కొండ మీద ఉన్న వానరశ్రేష్ఠుడు సుగ్రీవుని గురించి వెళదాం. నీకు శిష్యునిగా, భృత్యునిగా, సహాయకునిగా నేను ఉన్నాను ఊరడిల్లు'. ఈ రీతిగా అనేకరకాలుగా లక్ష్మణుడు ఓదార్చగా రాముడు స్వస్థచిత్తు డయ్యాడు అనంతరం చేయవలసిన పనిలో లగ్నమయ్యాడు. వీరులు, అన్నదమ్ములు అయిన ఆ రామలక్ష్మణులు ఇద్దరూ పంపానదిలో స్నానమాడి పితరులకు తర్పణం చేసి బయల్దేరారు. అధికమైన ఫలమూలాలతో

చెట్లతో నిండి ఉన్న ఆ ఋశ్యమూక పర్వతాన్ని చేరుకుని, ఆ వీరులిద్దరూ కొండశిఖరాన ఉన్న ఐదుగురు వానరులను చూశారు. సుగ్రీవుడు హిమవంతంలా గంభీరంగా కూర్చుని, బుద్ధిమంతుడు, మంత్రి అయిన వానరుని హనుమంతుని వారివద్దకు పంపాడు ముందుగా అతనితో మాటలాడి వారు సుగ్రీవుని వద్దకు చేరుకున్నారు. రాముడు అప్పుడు వానరరాజుతో చెలిమి చేశాడు. రాముడు తన పని గురించి చెప్పగానే, అపహరణకు గురి అయిన సమయంలో సీత వానరుల మధ్య పడవేసిన ఆ వస్త్రాన్ని వారు అతనికి చూపించారు విశ్వసించదగిన ఆ గుర్తును పొంది రాముడు వానర నాయకుడైన సుగ్రీవుని భూమండలంలోని వానరులకు సమ్రాట్టుగా స్వయంగా అభిషేకించాడు.

రాముడు యుద్ధంలో వాలిని చంపుతానని, సుగ్రీవుడు వైదేహిని వెదికి తెస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఇలా అనుకొని పరస్పరం విశ్వాసంతో ప్రతిజ్ఞలు చేసుకొని అందరూ కిష్కింధను చేరుకొని, యుద్ధకాంక్షులై నిలిచారు. సుగ్రీవుడు కిష్కింధకు వెళ్లి పెద్దగా సింహనాదం చేశాడు వాలి దానిని సహించలేకపోయాడు. కాని తార అతనిని వారించింది. "సుగ్రీవుడు తాను బలవంతుడైన వానరునివలె గర్జిస్తున్నాడు, అతనికి ఎవరిదో ఆశ్రయం లభించి ఉంటుందని నేను అనుకొంటున్నాను. కాబట్టి నీవు ఇప్పుడు వెళ్లడానికి వీలుకాదు" అని అన్నది. అప్పుడు చంద్రముఖి అయిన తారతో సువర్ణమాలా ధారి, మాటలలో నేర్పరి, వానరపతి అయిన భర్త వాలి ఇలా అన్నాడు. 'నీవు సమస్త ప్రాణులయొక్క అరపులను తెలుసుకోగలవు. తెలివైనదానివి చూడు! నాకు పేరుకు మాత్రమే సోదరుడైన ఇతడు ఎవరి ఆశ్రయాన్ని పొంది ఉన్నాడో చెప్పు ?" చంద్రునితో సమానమైన కాంతిగల, ప్రాజ్ఞురాలయిన తార ముహూర్తకాలం ఆలోచించి భర్తతో ఇలా అన్నది - 'కపీశ్వరా! అంతా చెప్తాను విను. దశరథుని కొడుకయిన రాముడు మహాబలవంతుడు. అతని భార్య అపహరింపబడింది. అతడు సుగ్రీవునితో మైత్రి చేసుకొన్నాడు. వారిద్దరూ పరస్పరం ఒకరి శత్రువులను శత్రువులుగానూ, ఒకరి మిత్రులను మిత్రులనుగానూ పరిగణిస్తున్నారు. ఆ రాముడు గొప్ప విలుకాడు. ఆ రాముని యొక్క తమ్ముడు, సుమిత్రానందనుడు, లక్ష్మణు డనే పేరుగలవాడు. అతడు కూడా మహాబాహువు, పరాజయమెరుగనివాడు, మేధావి. అన్నగారి కార్యసిద్ధికోసమే ఉన్నవాడు. ఇంకా మైందుడు, ద్వివిదుడు, పవనసుతుడయిన హనుమంతుడు, ఋక్షరాజు అయిన జాంబవంతుడు - సుగ్రీవుని మంత్రులయిన ఈ నలుగురు ఉన్నారు. వీరంతా మహామనస్వులు, బుద్ధిమంతులు, మహాబలవంతులు, రాముని బలపరాక్రమాలను ఆశ్రయంగా పొంది నీ వినాశనానికి సమర్థులై ఉన్నారు". తన మేలుకోరి చెప్పిన ఆమె మాటలను వాలి త్రోసిపుచ్చాడు. పైగా ఈర్ష్యాళువై ఆమెకు

సుగ్రీవునిపై మనసుందని అనుమానించాడు. తారను పరుషంగా మాటలాడి, గుహద్వారం నుండి వెలుపలికి వచ్చాడు. మాల్యవంత పర్వతానికి సమీపంలో నిలిచిన సుగ్రీవుని ఉద్దేశించి అతడు ఇలా అన్నాడు.

'నేను నిన్ను పూర్వం ఎన్నోసార్లు ఓడించాను. నీవు ప్రాణాలమీది ఆశతో పారిపోయి తిరుగుతున్నావు. నేను కూడా నిన్ను సోదరుడవని భావించి విడిచిపెడుతున్నాను. ఇప్పుడు మరల చనిపోవడానికి ఇంత తొందరెందుకు పడుతున్నావు ?' వాలి ఇలా అనగానే శత్రుహంతకుడైన సుగ్రీవుడు రామునికి తెలియచేస్తున్నట్లుగా సమయానుకూలంగా సోదరునితో ఇలా అన్నాడు. 'రాజా నీవు నా రాజ్యాన్ని అపహరించావు నా భార్యను నీ అధీనంలో ఉంచుకొన్నావు. ఇక నాకు జీవించే సామర్థ్యం ఎక్కడిది? నిన్ను కలుసుకోవడానికి వచ్చిన నన్ను అలాగే అనుకో (మరణించడానికే వచ్చానని తెలుసుకో)". ఇలా పలువిధాలుగా అనుకొని వారిద్దరూ అప్పుడు కలియబడ్డారు. యుద్ధంలో వాలి సుగ్రీవులు మద్దిచెట్లను, తాటిచెట్లను, రాళ్లను ఆయుధాలుగా చేసుకున్నారు. ఇద్దరూ పరస్పరం కొట్టుకొంటున్నారు. ఇద్దరూ నేలపై పడుతున్నారు. ఇద్దరూ చిత్రవిచిత్రంగా పాదవిన్యాసాలు చేస్తున్నారు. పిడికిళ్లతో పొడుచుకుంటున్నారు. ఇద్దరూ గోళ్లతో కోరలతో గాయపడి రక్తసిక్తులయ్యారు. అప్పుడు వారు పూచిన మోదుగుచెట్లవలె ప్రకాశించారు. యుద్ధం జరిగేటపుడు ఇద్దరిలో ఏమీ తేడా కనిపించలేదు. అప్పుడు హనుమంతుడు సుగ్రీవుని మెడలో ఒక మాలను వేశాడు. వీరుడయిన సుగ్రీవుడు మెడలో పడిన మాలచేత మేఘపంక్తులచేత శోభిల్లే మలయ మహాపర్వతం వలె శోభించాడు. రాముడు మాలను గుర్తుగా ధరించిన సుగ్రీవుని చూచి, వాలిని లక్ష్యంగా నిర్దేశించి శ్రేష్ఠమయిన వింటిని ఎక్కుపెట్టాడు యంత్రధ్వనిలా అనిపించిన ఆ ధనుష్టంకారానికి అప్పుడు వాలి చాలా భయపడ్డాడు. ఇంతలోనే అతని రొమ్మున బాణం తగిలి గాయపడ్డాడు. (బాణం తగిలి) గుండెలు చీలిపోయిన వాలి నోటినుండి రక్తాన్ని క్రక్కుకొంటూ, లక్ష్మణునితో కలిసి అక్కడ నిలిచి ఉన్న రాముని అప్పుడు చూశాడు. అతడు రాముని నిందించి, మూర్ఛితుడై నేలమీద పడిపోయాడు. భూమిపై పడిఉన్న చంద్రునివంటి కాంతి గలిగిన అతనిని తార చూచింది. వాలి చనిపోగానే నాథుడు లేని కిష్కింధానగరాన్ని, చంద్రముఖి అయిన తారను కూడా సుగ్రీవుడు పొందాడు.

బుద్ధిశాలి అయిన రాముడు మాల్యవంతపర్వతం మీది అందమైన లోయలలో నాలుగునెలల పాటు నివసించాడు సుగ్రీవుడు అతని సమక్షానికి అప్పుడప్పుడు వస్తూ ఉండేవాడు ఇటు రావణుడు కూడా కామవశీభూతుడై లంకానగరికి వెళ్లి అశోకవన సమీపంలో తాపసాశ్రమం వలె ప్రశాంతంగా ఉండే నందనవనం వంటి భవనంలో

సీతను ఉంచాడు. ఆమె తాపసీవేషం ధరించి, పతినే నిరంతరం స్మరిస్తూ కృశించిపోయింది. విశాలమైన కన్నులు కల సీత ఉపవాసం, తపస్సు తన స్వభావంగా మలచుకొంది. ఫలమూలాలు మాత్రమే ఆహారంగా తీసుకొంటూ దుఃఖంతో కాలం గడుపుతోంది. రాక్షసరాజు రావణుడు సీతయొక్క రక్షణకు బల్లెములు, కత్తులు, శూలాలు, పరశువులు, ముద్గరాలు, కొరకంచులు ధరించిన రాక్షసస్త్రీలను నియోగించాడు. వారిలో కొందరికి రెండు కన్నులు, కొందరికి మూడు కన్నులు ఉంటే, కొందరికి నుదుటియందు కన్ను లున్నాయి. కొందరికి పొడవైన నాలుక ఉంటే కొందరికి నాలుకలే లేవు. మూడు వక్షోజాలు కలవారు ఒకే కాలు కలవారు కొంద రున్నారు. ఒకతెకు మూడు జటలు, ఒకతెకు ఒకే కన్ను ఉన్నాయి. వీరూ ఇంకా ఇతర స్త్రీలూ నిద్రగాని, ఏమరుపాటుగాని లేకుండా రాత్రింబవళ్లు సీతకు చుట్టూ చేరి ఉంటున్నారు. వారందరూ ఎఱ్ఱగా అగ్నిగోళాలవలె ఉండే కన్నులతో, పొట్టిగా బిరుసుగా ఉన్న తలవెండ్రుకలతో ఉన్నారు. ఆ పిశాచస్త్రీలు భయంకరమైన గొంతులతో, పరుషమైన స్వరవ్యంజనాలతో (అక్షరాలతో), రౌద్రంగా దీర్ఘమైన కన్నులు కల సీతను ఎప్పుడూ ఇలా భయపెడుతూనే ఉన్నారు 'మన స్వామిని అవమానించి ఈమె ఇక్కడ జీవించి ఉంది. ఈమెను ముక్కలు ముక్కలుగా నరికి తినివేద్దాం.' అని ఈ రీతిగా కఠినమైన బెదిరింపులతో మాటిమాటికీ ఆ రాక్షసస్త్రీలు భయపెడుతున్నారు. భర్తయొక్క వియోగం చేత దుఃఖితురాలై ఉన్న సీతాదేవి దీర్ఘంగా నిట్టూర్చి వారితో ఇలా అంది "అమ్మలారా! నన్ను తొందరగా తినివేయండి నాకు జీవితం మీద ఆశలేదు. తెల్లతామరల వంటి కన్నులు, నల్లని గిరజాల జుట్టు గల ఆ నాస్వామి లేని కారణంగా నేను నిరాహారినై జీవితేచ్ఛను వదిలేశాను. తాటిచెట్టుమీది నాగినివలె నేను నా శరీరాన్ని శుష్కింప చేసుకొంటాను గాని రాఘవుని కంటె ఇతర పురుషుని నేను ఎన్నటికీ పొందను. నా మాట నిజమని నమ్మండి. ఆపై మీరు చేయవలసినది చేసుకోండి". సీతయొక్క ఆ మాటలను విని కటువైన కంఠాలు గల ఆ రాక్షసస్త్రీలు ఈ వృత్తాంతమంతా ఆదరపూర్వకంగా రాక్షస రాజునకు విన్నవించడానికి వెళ్లారు.

వారందరూ వెళ్లాక ధర్మజ్ఞురాలు, ప్రియవాదిని అయిన త్రిజట అనే పేరుగల రాక్షసి వైదేహిని ఊరడించసాగింది. 'సీతా! నీకు నేను ఒకటి చెపుతాను. చెలీ! నా యందు విశ్వాసం ఉంచు వామోరూ! నీవు భయం విడిచిపెట్టు. నేను చెప్పే ఈ మాటలు కూడా విను. అవింధ్యుడనే రాక్షస శ్రేష్ఠుడు మేధావి, వయసులో పెద్దవాడు. అతడు రాముని మేలునే కాంక్షిస్తూ ఉంటాడు. నీ కోసమే (నీతో చెప్పమని) నాతో ఇలా అన్నాడు. "సీతను ఓదార్చి, సంతుష్టపరచి, ఆమెకు నామాటగా చెప్పు. బలవంతుడైన నీ భర్తరాముడు

లక్ష్మణుడు వెంటనంటి ఉండగా కుశలుడై ఉన్నాడు. ఇంద్రునితో సమానమైన పరాక్రమం కల వానరరాజుతో చెలిమి చేసుకొని, ఆ సుందరుడు నీకోసం ప్రయత్నం చేస్తున్నాడు. లోకనింద్యుడైన రావణుని వలన నీకు భయం అక్కరలేదు. నందినీ! నలకూబర శాపంవలన రావణుని నుండి నీవు రక్షించబడినావు. పూర్వం పాపాత్ముడయిన వీడు కోడలు రంభను స్పృశించి శాపాన్ని పొందాడు. ఇంద్రియనిగ్రహం లేని ఇతడు తనకు వశంకాని స్త్రీని పొందడానికి శక్తుడు కాడు. సుగ్రీవుని చేత సురక్షితుడై, లక్ష్మణ సహితుడై ధీమంతుడయిన నీ భర్త త్వరలోనే వస్తాడు. నిన్ను ఇక్కడి నుండి విడిపిస్తాడు" అనిచెప్పాడు. పౌలస్త్య వంశఘాతకుడు, దుర్బుద్ధి అయిన ఈ రావణుని యొక్క వినాశనాన్ని, అనిష్టాలను సూచించే మిక్కిలి భయంకరమైన కలలు నాకు వచ్చాయి. దారుణుడు, దుష్టాత్ముడు, క్షుద్రకర్మ అయిన ఈ నిశాచరుడు స్వభావం వలన, శీలదోషం వలన అందరికీ భయాన్ని ఇనుమడింప చేస్తాడు. విధిచేత క్షీణించిన బుద్ధితో సమస్త దేవతలతో స్పర్ధపూనిన ఇతని వినాశనాన్ని సూచించే గుర్తులను నేను స్వప్నంలో దర్శించాను. దశాననుడు ఒంటినిండా నూనె పూసుకొని జుట్టు విరబోసుకొని బురదలో మునుగుతూ గాడిదలు కట్టిన రథంమీద నాట్యం చేస్తున్నట్లుగా ఉండడం చాలాసార్లు కలలో కన్పించింది. కుంభకర్ణుడు మొదలైన వీరందరూ జుట్టు రాలిపోయి, ఎఱ్ఱనిపూలమాలలు, రక్తచందనం ధరించి నగ్నంగా దక్షిణదిక్కుకు వెళ్తున్నారు. ఒక్క విభీషణుడు మాత్రమే శ్వేతచ్ఛత్రాన్ని ధరించి, కిరీటంతో, తెల్లని పూలమాలలు, తెల్లని గంధం తాల్చి, శ్వేతపర్వతారూఢుడై ఉన్నాడు. అతనియొక్క నలుగురు మంత్రులూ కూడా తెల్లని మాల్యాలు, తెల్లని గంధం ధరించి, శ్వేతపర్వతారూఢులై ఈ మహాభయం నుండి విడుదల పొందారు. రాముని అస్త్రం చేత సాగరసహితంగా భూమి అంతా కప్పివేయబడింది. నీ భర్త ఈ సమస్త భూమండలాన్ని కీర్తిచేత నింపి వేయగలడు. లక్ష్మణుడు ఎముకలగుట్టను ఎక్కి, తీయని పాయసాన్ని తింటూ అన్నివైపులనుండి దిక్కులను దగ్ధం చేయాలని కోరుకొంటున్న వానిలా నాకు కనపడ్డాడు. రక్తంతో తడిసిన శరీరంతో ఏడుస్తూ, ఒక పెద్దపులి చేత రక్షింపబడుతూ ఉత్తరదిశగా వెళ్తున్న నిన్ను నేను చాలాసార్లు చూశాను. వైదేహీ! శీఘ్రంగా భర్తను కలుసుకొని నీవు సంతోషాన్ని పొందగలవు. సీతా! నీవు త్వరలోనే తమ్మునితో కూడిన రాఘవుని కలుసుకోగలవు' జింకపిల్ల కన్నులున్న ఆ సీతకు త్రిజట మాటలతో తిరిగి భర్తను కలుసుకోగలననే ఆశ కలిగింది. భయంకరులు క్రూర స్వభావులు అయిన ఆ పిశాచినులు తిరిగివచ్చి, త్రిజటతో కలిసి సీత యథాపూర్వకంగా కూర్చుని ఉండడం చూశారు.

281. సీతారావణ సంవాదము.

ఒకరోజున పతివియోగదుఃఖంచేత దీనురాలై మాసినవస్త్రంతో, చూడామణి మాత్రమే అలంకారంగా కలిగి, రాక్షస స్త్రీలచేత సేవించబడుతూ రాతినేలమీద కూర్చుని ఎడుస్తున్న పతివ్రత అయిన సీత దగ్గరకు కామబాణ పీడితుడైన రావణుడు వెళ్లాడు. దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, కింపురుషులు ఎవరి చేతనూ ఎప్పుడూ యుద్ధంలో పరాజయమెరుగని ఆ రావణుడు అశోకవనాన్ని చేరుకొని మన్మధబాధతో ఆమెను సమీపించాడు. అతడు దివ్యవస్త్రాలు ధరించి, అందమైన మణిమయ కుండలాలు అలంకరించుకొని, విచిత్రమైన పూలమాలలతో కిరీటంతో మూర్తీభవించిన వసంతునివలె శోభాసంపన్నుడై ఉన్నాడు అతడు ప్రయత్నపూర్వకంగా అలంకరించుకొని కూడా అందమైన కల్పవృక్షంలా లేడు. అలంకరించుకొన్నప్పటికీ శ్మశానంలోని చైత్యవృక్షంలా భయంకరంగానే ఉన్నాడు. ఆ నిశాచరుడు సన్నని నడుముగల సీతాదేవిని సమీపిస్తే శనిగ్రహం రోహిణీ నక్షత్రం చెంతచేరినట్లు కనిపించాడు మన్మధబాణ హతుడైన రావణుడు ఆడులేడి వలె భయపడిపోయి అబల అయిన ఆ సీతతో ఇలా అన్నాడు.

సీతా ! ఇంతవరకు నీవు నీ భర్తమీద చూపిన అనుగ్రహం చాలినంత ఉంది. తన్వంగీ! ఇక శృంగారం చేయించుకొని నా మీద దయచూపు. వరారోహా! అతి విలువైన వస్త్రాభరణాలు ధరించి నన్ను సేవించు నా స్త్రీలందరిలోకీ శ్రేష్ఠురాలవు, అందగత్తెవు అగుము. నావద్ద దేవకన్యలు, గంధర్వస్త్రీలు, దానవకన్యలు, దైత్యస్త్రీలు కూడా ఉన్నారు. పద్నాలుగు కోట్ల పిశాచులు నా ఆజ్ఞను పాటిస్తారు. నరభక్షకులు, భయంకర కృత్యాలు చేసే రాక్షసులు అంతకు రెట్టింపు మంది ఉన్నారు అంతకంటె మూడురెట్లు యక్షులు నా ఆజ్ఞను పాటిస్తారు. కొద్దిమంది మాత్రమే నా సోదరుడు అయిన ధనాధ్యక్షుని ఆశ్రయించుకొని ఉన్నారు. వామోరూ! మధుపానం చేసే నన్ను గంధర్వులు, అప్సరసలు సదా నా అన్నగారిని సేవించినట్లే సేవిస్తారు నేనుకూడా (కుబేరుని వలెనే) సాక్షాత్తు బ్రహ్మర్షి అయిన విశ్రవసముని యొక్క కుమారుడను. ఐదవ లోకపాలునిగా (ఇంద్ర - యమ - వరుణ - కుబేరులు - నలుగురు - లోకపాలకులు) నా కీర్తి ప్రసిద్ధికెక్కింది. శుభాంగీ! దివ్యమైన భక్ష్యభోజ్యాలు, వివిధ పానీయాలు ఇంద్రునికివలెనే నాకు కూడా లభిస్తాయి. సుశ్రోణి వనవాసం చేయడం వలన కలిగే కష్టా లనే దుష్కర్మలు నీకు తొలగిపోవాలి. మండోదరి వలెనే నీవుకూడా నా భార్యవు అగుము' అనగానే శుభానన అయిన వైదేహి ముఖం త్రిప్పుకొని గడ్డిపరకను మధ్యలో ఉంచుకొని ఆ రాక్షసునితో పలుకసాగింది. అతిసుందరమైన ఊరువులు కల్గి, భర్తనే దైవంగా భావించే ఆ వైదేహి

అమంగళ సూచకమైన కన్నీటితో తన ఎత్తయిన స్తనాలను నిరంతరం తడుపుతూ నీచుడయిన ఆ రాక్షసునితో ఇలా అంది.

"రాక్షసేశ్వరా! నీవు చాలాసార్లు ఇలాంటి దుఃఖపూరితమైన మాటలు చెప్పావు. అభాగ్యురాలనైన నేను వినవలసి వచ్చింది. భద్రముఖా! నీకు మేలు కలుగుతుంది. నీ మనసు మార్చుకో. నేను పరుని భార్యను. పతివ్రతను. ఎప్పటికీ నీకు లభించని దానిని. దీనురాలను. మానవకాంతను అయిన నేను నీకు భార్యగా తగను. వివశురాల నయిన నన్ను అవమానిస్తే నీకు ఏమి ప్రీతి కలుగుతుంది? నీ తండ్రి బ్రాహ్మణుడు. బ్రహ్మనుండి ఉద్భవించినవాడు ప్రజాపతి వంటివాడు. నీవు లోకపాలురతో సమానుడవై కూడా ధర్మాన్ని ఎలా పాటించకుండా ఉంటున్నావు? రాజరాజు, మహేశ్వరసఖుడు, ధనేశ్వరుడు అయిన ప్రభువు కుబేరుని నీ సోదరునిగా చెప్పుకొంటున్నావు. ఈ పనిచేయడానికి నీకు సిగ్గు కలగడం లేదా? అని పలికి తన్వంగి అయిన సీత ముఖాన్ని, మెడను బట్టతో కప్పుకొని పాలిండ్లు కదిలిపోయేలా వెక్కివెక్కి ఏడ్చింది అలా ఎడుస్తున్న భామిని సీతాదేవియొక్క శిరసు మీది నల్లనై, నునుపై, గట్టిగా చుట్టబడిన దీర్ఘవేణి నల్లత్రాచుపాములా కనిపించింది. సీత పలికిన అతినిష్ఠురమైన ఆ మాటలను విని రావణుడు పూర్తిగా తిరస్కరించబడినా దుర్బుద్ధియై మళ్లీ ఇలా అన్నాడు. "సీతా ! మన్మధుడు నా అవయవాలను మిక్కిలిగా పిండేస్తున్నాడు. కాని చక్కని నవ్వుతో అందంగా ఉన్నా కోరిక లేని నిన్ను పొందను. మాకు ఆహారంగా అయ్యే మానవు డయిన రామునే ఇప్పటికీ నీవు ప్రేమిస్తున్నావు. నేను ఏమి చేయగలను?' చక్కని శరీరంకల ఆమెతో ఇలా అని ఆ రాక్షసరాజు అక్కడే అంతర్ధానమై తనకు అభీష్టమైన చోటికి వెళ్లాడు. రాక్షసస్త్రీలు చుట్టూ ఉండగా దుఃఖం చేత కృశించిపోయిన వైదేహిని త్రిజట సేవిస్తూ ఉండగా అక్కడే నివసించసాగింది.

282. సీతాన్వేషణము - హనుమంతుడు లంకకు వెళ్లి తిరిగివచ్చుట.

సుగ్రీవుని సంరక్షణలో రాముడు లక్ష్మణునితో కలిసి మాల్యవంతపర్వతం యొక్క పృష్ఠ భాగంలో నివసిస్తూ ఆకాశం నిర్మలంగా ఉండడం చూశాడు. (శరత్కాలంనాటి) నిర్మలమైన ఆకాశంలో గ్రహనక్షత్ర తారకలతో కూడిన స్వచ్ఛమైన చంద్రుని చూస్తూ ఉన్నాడు రాముడు. శత్రుమర్దనుడైన రాముని తెల్లకలువల, నల్లకలువల, పద్మాల సుగంధాన్ని మోసుకొస్తున్న చల్లని వాయువు ఆకస్మాత్తుగా మేలు కొలిపింది ధర్మాత్ముడైన శ్రీరామునికి ఉదయాన్నే రాక్షసుని ఇంటిలో బందీగా ఉన్న సీత గుర్తుకు వచ్చి మనసులో దుఃఖపడ్డాడు. అతడు వీరుడైన లక్ష్మణునితో ఇలా అన్నాడు. "లక్ష్మణా! కిష్కింధలో సంసార

భోగాలలో బాగా మత్తిల్లి ఉన్నాడు, సుగ్రీవుడు. కృతఘ్నుడై, స్వార్థాన్ని సాధించుకోవడంలో పండితుడా వానరరాజు సుగ్రీవుడు. అతడు ఏం చేస్తున్నాడో వెళ్లి తెలుసుకో. ఆ వానరకులాధముని, మూఢుని నేనే రాజ్యాభిషిక్తుని చేశాను కనుకనే సమస్తవానరులు లాంగూలులు, ఋక్షాలు అతనిని సేవిస్తున్నారు. మహాబాహూ రఘుకుల తిలకా! ఆ నాడు నీతో కలిసి కిష్కింధకు సమీపంలోని వనంలో అతనికొరకే వాలిని నేను వధించాను. ఆ నీచవానరుడైన సుగ్రీవుని ఈ భూలోకానికి సరిపడినంత కృతఘ్నుడని నేను అనుకొంటున్నాను లక్ష్మణా! ఈ నాడు ఈ దశకు చేరుకొని ఆ మూఢుడు నన్ను గుర్తించడంలేదు ఉపకారం చేసిన నన్ను అల్పబుద్ధితో అవమానించి, చేసిన ప్రతిజ్ఞను చెల్లించుకోవాలని అతడు తెలుసుకోవడం లేదని అనుకొంటున్నాను కామసుఖాసక్తుడై, సీతాన్వేషణకు ఎమీ ప్రయత్నం చేయకుండా నిద్రపోతుంటే వాలిమార్గంలోనే సకలప్రాణులు పొందే గతినే (మరణాన్ని) అతనికి నీవు కలిగించు ఒకవేళ ఆ వానరపుంగవుడు మనకోసం పనిచేస్తున్నట్లయితే లక్ష్మణా! అతనిని వెంటపెట్టుకొని త్వరగా రా. ఆలస్యం చేయకు' అన్నాడు. అని అన్న పలుకగానే పెద్దలమాటయందు వారికి మేలు చేయడంలోను తత్పరుడైన లక్ష్మణుడు బాణంతో అల్లెత్రాడు కూర్చిన అందమైన ధనుస్సును తీసుకొని బయలుదేరాడు

కిష్కింధా ద్వారాన్ని చేరుకొని అడ్డు లేకుండా లోపలికి ప్రవేశించాడు అతడు క్రోధంతో ఉన్నాడని తెలుసుకొని, అయిన సుగ్రీవుడు ఎదురువెళ్లాడు భార్యాసహితుడై వానరరాజు సుగ్రీవుడు వినయంగా లక్ష్మణుని పూజించి తోడ్కొని వెళ్లాడు ఎవరికీ భయపడని సౌమిత్రి ఆ పూజతో ప్రసన్నుడై రాముడు చెప్పిన మాటలన్నీ అతనికి చెప్పాడు. అతడు అదంతా పూర్తిగా విని వినయంతో చేతులు జోడించాడు, భార్యతో అనుచరులతో కలిసి వానరాధిపు డయిన సుగ్రీవుడు మానవ శ్రేష్ఠు డయిన లక్ష్మణునితో ప్రీతుడై ఇలా అన్నాడు. లక్ష్మణా! నేను దుర్బుద్ధినికాను. కృతజ్ఞత లేనివాడిని కాను దయలేని వాడిని కాను సీతాన్వేషణకోసం నేను చేసిన ప్రయత్నం గురించి విను వినీతులయిన వానరులను నేను అన్నిదిక్కులకూ పంపాను. ఒకనెల రోజులకు తిరిగి రావాలని వారందరికి సమయావధిని విధించాను వీరుడా ! వీరందరూ అడవులు, కొండలు, పట్టణాలు, గ్రామాలకు నగరాలకు నిలయమై; సముద్రమే వసనంగా గల భూమి నంతటినీ సీతకోసం అన్వేషిస్తారు. ఆ మాసంకూడా ఇక ఐదురాత్రులలో పూర్తి కావస్తోంది రామునితో కూడి అప్పుడు ప్రియమైన వార్తను వింటావు'. బుద్ధిమంతు డయిన వానరేంద్రుడు ఇలా అనగానే లక్ష్మణుడు రోషాన్ని విడిచి, ఉదారహృదయుడై సుగ్రీవుని తిరిగి గౌరవించాడు

అతడు సుగ్రీవునితో కలిసి మాల్యవంత పర్వతంయొక్క పృష్ఠభాగంలో ఉన్న రాముని సమీపించి, సీతాన్వేషణమనే ఆ కార్యం ప్రారంభ మయిందని తెలియచేశాడు. మూడు దిక్కులకు వెదకడానికి వెళ్లిన వేలకొద్దీ ఆ వానరవీరు లందరూ నెల పూర్తికాగానే తిరిగి అక్కడికి చేరుకొన్నారు కేవలం దక్షిణ దిక్కుకు వెళ్లినవారు మాత్రం రాలేదు. సముద్రపర్యంతం ఉన్న భూమినంతటినీ వెదికినా సీతగాని, రావణుడు గాని కనపడలేదని వారు రామునికి చెప్పారు దక్షిణదిశకు వెళ్లిన వానర శ్రేష్ఠులమీదనే ఆశపెట్టుకొన్న కాకుత్స్థుడు ఆర్తుడైనప్పటికీ ప్రాణాలను నిలిపి ఉంచుకొన్నాడు. రెండు నెలల కాలం ముగుస్తూ ఉండగా వానరులు కొందరు వడివడిగా సుగ్రీవుని సమీపించి ఇలా అన్నారు వానరరాజా! వాలీ, నీవూ కూడా రక్షిస్తూ ఉన్న సమృద్ధమయిన మధువనాన్ని పవనాత్మజు డయిన హనుమంతుడు ఉపభోగిస్తున్నాడు. (రాజాజ్ఞలేకుండానే) రాజా! వాలి పుత్రు డయిన అంగదుడు, ఇంకా వెదకడానికి దక్షిణదిక్కుకు మీరు పంపిన వానరశ్రేష్ఠులు కూడా ఉన్నారు". వారి అవినయాన్ని గురించి విని సుగ్రీవుడు వారు వెళ్లిన పనిలో కృతకృత్యులయ్యారని భావించాడు. కృతార్థులయిన సేవకులు మాత్రమే ఇటువంటి చేష్టలు చేస్తారు కదా! మేధావి అయిన ఆ వానర శ్రేష్ఠుడు సుగ్రీవుడు రామునికి తన నిశ్చయాన్ని తెలిపాడు. వారు మైథిలిని చూశారని రాముడు కూడా తలచాడు

హనుమంతుడు మొదలైన ఆ వానరవీరు లందరూ విశ్రాంతి తీసుకొన్నాక రామలక్ష్మణుల సన్నిధిలో ఉన్న ఆ సుగ్రీవుని సమీపించారు. హనుమంతునియొక్క నడక తీరును, ముఖ కవళికను చూచిన రామునికి "ఇతడు సీతను చూశాడు" అనే విశ్వాసం కలిగింది. సఫలమనోరథులయిన హనుమంతుడు మొదలైన ఆ వానరవీరులందరూ విధ్యుక్తంగా రామునికి, సుగ్రీవునికి, లక్ష్మణునికి నమస్కరించారు. రాముడు ధనుర్బాణాలు చేతపట్టి తనకు ప్రణమిల్లిన వారినుద్దేశించి 'మీరు నన్ను బ్రతికిస్తున్నారా లేదా ? మీరు కృతకృత్యు లయ్యారా? శత్రువులను యుద్ధంలో ఓడించి సీతాదేవిని తీసికొని వచ్చి మళ్లీ నేను అయోధ్యలో రాజ్యం చేస్తానా? వైదేహిని విడిపించకుండా యుద్ధంలో శత్రువులను చంపకుండా భార్యను కోల్పోయి అవధూతనై జీవించడానికి నేను ఇష్టపడడంలేదు" అన్నాడు అని పలుకుతున్న రాముని ఉద్దేశించి.హనుమంతుడు ఇలా సమాధానమిచ్చాడు – 'రామా! నీకు నేను ప్రీతి కలిగించే విషయం చెపుతున్నాను. ఆ జనకాత్మజను నేను చూశాను.

కొండలు, అడవులు గనులతో సహితంగా దక్షిణదిక్కునంతా వెదికి అలసిపోయాము. కాలం గడువు తీరిపోయింది. అప్పుడు మేము ఒక మహాగుహను చూశాం. మేము ఆ

గుహను ప్రవేశించాము. అది అనేక యోజనాల పొడవు ఉంది. చీకటిగా ఉంది. అందులో దట్టమైన అడవులున్నాయి. కీటకాలు తిరుగుతున్నాయి. అలా చాలా దూరం వెళ్లాక అప్పుడు సూర్యకాంతి కనపడింది ఆ గుహలోపలే అక్కడ ఒక దివ్యమైన భవనం ఉంది. రాఘవా ! ఆ భవనం మయుడనే దైత్యుని దట. అక్కడ ప్రభావతి అనే తాపసి తపస్సు చేసుకొంటోంది. ఆమె ఇచ్చిన ఆహారాన్ని, రకరకాల పానీయాలను తిని, త్రాగి, తిరిగి బలాన్ని పొందాము. ఆమె చెప్పిన మార్గంగుండా ఆ ప్రదేశాన్నుండి బయటపడి లవణ సముద్రతీరాన్ని చేరుకొన్నాము. అక్కడ సహ్య, మలయ పర్వతాలను పెద్ద దర్దుర పర్వతాన్ని చూశాం. మలయ పర్వతాన్ని ఎక్కి సముద్రాన్ని చూస్తున్న మాకు విచారం కలిగింది. వ్యగ్రులమైనాం, ఖిన్నులమయ్యాం. జీవితం పట్ల చాలా నిరాశ కలిగింది. అనేకవందల యోజనాల విస్తీర్ణం కలిగి, తిమింగిలాలకు, మొసళ్లకు చేపలకు నివాసమైన ఆ మహాసముద్రాన్ని గూర్చి ఆలోచిస్తేనే మాకు మిక్కిలి దుఃఖం కలిగింది.

అక్కడ ప్రాయోపవేశం చేయాలనే సంకల్పం పూని మేమంతా కూర్చున్నాం. అప్పుడు మాటలమధ్యలో పక్షిరాజు జటాయువు యొక్క ప్రసంగం వచ్చింది కొండశిఖరంలా ఘోరమైన రూపంతో భయం కొలుపుతూ రెండవ గరుడునిలా ఉన్న పక్షి ఒకటి కనిపించింది. అతడు మమ్మల్ని తినివేయాలనే అనుకొన్నాడు. అయినా మాదగ్గరకు వచ్చి "ఓరీ! ఎవడురా నా తమ్ముడు జటాయువు గురించి మాటలాడుతున్నది? అతని అన్నను పక్షిరాజును నేను. నాపేరు సంపాతి మేము ఒకరితో ఒకరు పోటీపడి సూర్యమండలాన్ని చేరుకోవాలని ఎగిరాం. అప్పుడు నా ఈ రెక్కలు కాలిపోయాయి జటాయువు రెక్కలు కాలిపోలేదు. నాకు సోదరుడు, ఇష్టుడు అయిన ఆ పక్షిరాజును అప్పుడు చూశాను. చాలాకాలమయింది. రెక్కలు కాలిపోయి నేను ఈ పెద్దకొండ మీద పడిఉన్నాను ' అలా చెప్తున్న అతనికి తమ్ముని చావును గురించి తెలియచేశాం. మీ ఈ కష్టాన్ని గురించి కూడా సంక్షిప్తంగా చెప్పాం. రాజా! అప్పుడు మిక్కిలి అప్రియమయిన వార్తను విని, ఆ సంపాతికి మనసంతా విషాదంతో నిండిపోయింది శత్రుసూదనా! అతడు మళ్లీ మమ్మల్ని ఇలా అడిగాడు. "వానరశ్రేష్ఠులారా! ఆ రాము డెవరు? సీత ఎలా ఉంటుంది? జటాయువు ఎలా చనిపోయాడు? ఇదంతా వినాలని ఉంది" అన్నాడు. నేను అతనికి మీకు వచ్చిన కష్టం· మేము ప్రాయోపవేశం చేయడానికి గల కారణాన్ని అంతటినీ వివరంగా చెప్పాను. పక్షిరాజు సంపాతి మాకు ఉత్సాహాన్నిచ్చి లేపుతూ ఇలా అన్నాడు. "రావణుడు నాకు తెలుసు అతని రాజధానీ నగరం లంకను కూడా నేను చూశాను. అది సముద్రానికి ఆవల త్రికూట పర్వతకందరంలో ఉంది వైదేహి అక్కడే ఉండవచ్చు. నాకు ఇంకొక ఆలోచన లేదు పరంతపా! అతడు

చెప్పిన ఈ మాటలన్నీ విని మేము వెంటనే లేచి, సముద్రాన్ని దాటడానికి ఉపాయాన్ని ఆలోచించసాగాం. ఎవరూకూడా సాగరాన్ని దాటడానికి సాహసించలేదు. అప్పుడు నేను తండ్రిని ఆవేశించి (తండ్రి అయిన వాయువు రూపాన్ని ఆవేశించి) జలాలలో ఉండే రాక్షసిని చంపి, వందయోజనాల విస్తీర్ణం కలిగిన ఆ మహాసాగరాన్ని తరించాను. రావణాంతఃపురంలో ఉన్న సీతాదేవిని నేను చూశాను. భర్తను చూడాలనే కోరికతో ఆమె ఉపవాసాలు చేస్తోంది. తపస్సు తన స్వభావంగా చేసుకొంది. ఆమె జుట్టు జడలు కట్టి ఉంది. శరీరం అంతా దుమ్ముకొట్టుకొని ఉంది. ఆ తపస్వినిని దీనురాలై కృశించిపోయింది. చాలా కారణాల వలన నేను ఆమెను సీతగా తెలుసుకొని రహస్యంగా ఆమె దగ్గరకు వెళ్లి "సీతా! రాముని దూతను నేను మారుతాత్మజు డను వానరుడను. నీ దర్శనం కోరి ఇక్కడకు ఆకాశమార్గాన వచ్చాను. అన్నదమ్ములయిన ఆ రాజకుమారులు రామలక్ష్మణులు ఇద్దరూ క్షేమంగానే ఉన్నారు. వారు సమస్తవానరులకు రాజు అయిన సుగ్రీవుని రక్షణలో ఉన్నారు. సీతా! లక్ష్మణునితో పాటు రాముడు తాను క్షేమంగా ఉన్నట్లు నీకు చెప్పమన్నాడు స్నేహం కారణంగా సుగ్రీవుడు కూడా నీ క్షేమం గురించి అడుగుతున్నాడు. వానరులందరితో కలిసి నీభర్త శీఘ్రంగానే ఇక్కడకు వస్తాడు. దేవీ! నన్ను విశ్వసించు నేను వానరుడను. రాక్షసుడను కాను" అన్నాడు. క్షణకాలం ఆలోచించి సీత నాకు ఇలా బదులిచ్చింది "అవింధ్యుని మాటలవలన నిన్ను హనుమంతునిగా నేను గుర్తించాను. మహాబాహూ! అవింధ్యుడు రాక్షసుడే అయినా వృద్ధుడు, ఆదరణీయుడుసుమా! నీవంటి మంత్రులతో సుగ్రీవుడు కలిసిఉన్నాడని అతడు చెప్పాడు. ఇక నీవు వెళ్లు.' అని నాకు ఈమణిని ఇచ్చింది. ఇంతకాలం సాధ్వి అయిన ఆమె దీనిని ధరించియే కాలం వెళ్లపుచ్చింది. నమ్మకం కుదరడానికి ఈకథను కూడా జానకి చెప్పింది. 'పురుష సింహమా! చిత్రకూట మహాపర్వతంపై నివసించినపుడు ఒక కాకిపై మీరు ఒక ఈనెపుల్లను అస్త్రంగా చేసి వదిలారు దుష్టచిత్తుడైన ఆ కాకికి ఒక కన్ను గ్రుడ్డిదైపోయింది. ఈ ప్రసంగం మీ గుర్తుకోసమే చెప్పబడింది నా అంతట నేను రాక్షసులకు పట్టుబడి ఆ లంకాపురిని కాల్చి ఇక్కడికి వచ్చాను" అని చెప్పిన ప్రియవాది అయిన అతనిని రాముడు ఎంతగానో ఆదరించాడు.

283. అంగదుని రాయబారము.

మార్కండేయుడు చెపుతున్నాడు - అనంతరం మాల్యవంత పర్వతం మీద లక్ష్మణుడు మొదలైన వారితో కూడి ఉన్న రామునివద్దకు సుగ్రీవుని ఆజ్ఞప్రకారం వానరశ్రేష్ఠులు

చేరుకొన్నారు. వాలియొక్క మామగారైన సుషేణుడు వేగవంతులైన వేయికోట్ల వానరులతో కూడి రాముని చేరుకున్నాడు. గజగవయు లనే మహాపరాక్రమవంతులైన వానరముఖ్యులు ఒక్కొక్కరు వందకోట్ల వానరసైన్యంతో కూడి వేర్వేరుగా రావడం కనిపించింది. మహారాజా! గోలాంగూల జాతికి చెంది, భయంకరంగా ఉండే గవాక్షు డనే వానరవీరుడు అరవై వేల కోట్ల వానర సైన్యంతో అట్టహాసంగా రావడం కనిపించింది. గంధమాదన పర్వతం మీదనే నివసించే గంధమాదను డనే ప్రసిద్ధుడైన వానరుడు లక్షకోట్ల వానరవీరులతో చేరుకొన్నాడు. మేధావి అయిన పనసు డనే వానరుడు ఏభై ఎడుకోట్లు వానరసైన్యంతో చేరుకొన్నాడు. వానరులలో వృద్ధుడు, మిక్కిలి బలవంతుడు అయి శ్రీమాన్ దధిముఖుడనే వానరుడు గొప్ప సైన్యాన్ని తీసుకొనివచ్చాడు. నుదుటిపై ఊర్ధ్వపుండ్రాలు ధరించి; భయంకరమైన పరాక్రమం కల; నల్లని ఋక్షవీరులను లక్షకోట్లమందిని తీసుకొని జాంబవంతుడు రావడం కనిపించింది. మహారాజా! వీరే కాక ఇంకా ఇతరులైన అసంఖ్యాక వానరసేనానాయకులు వానరవీరులతో కలిసి రాముని పనిమీద అక్కడకు చేరుకొన్నారు. పర్వతశిఖరాలవంటి శరీరాలతో వారు సింహాలవలె గర్జిస్తూ అటు ఇటు పరుగులు తీస్తున్నారు. ఆ శబ్దం మహాభయంకరంగా వినిపిస్తోంది. వారిలో కొంతమంది పర్వతశిఖరాలవంటి శరీరాలు కలవారు, కొంతమంది ఆడవిదున్నలవంటి శరీరాలు కలవారు. శరత్కాలమేఘాలవలె తెల్లని శరీరాలు కలవారు కొందరున్నారు. కొంతమంది సిందూరంవలె ఎర్రనైన ముఖాలతో ఉన్నారు. ఆ వానరులు ఎగురుతూ, గంతులు వేస్తూ, దూకుతూ దుమ్మురేపుతూ అన్నివైపులనుండి వచ్చి చేరుకొన్నారు.

ఆ వానరమహాసైన్యం మహాసముద్రంలా ఉంది. సుగ్రీవుని ఆజ్ఞపై వారికి ఆ పర్వతం చుట్టుపక్కలే నివాసం ఏర్పాటు చేయబడింది. ఆ వానరవీరు లందరూ అన్నివైపులనుండి వచ్చి చేరుకొన్నారు. తరువాత ఒకరోజున శుభతిథి, శుభనక్షత్రం చూసుకొని మంచిముహూర్తంలో సుగ్రీవునితో కలిసి రాముడు సైన్యాన్ని వ్యూహప్రకారం నడిపిస్తూ లోకాలను తల్లకిందులు చేసేటట్లు బయలుదేరాడు. ఆ సైన్యానికి ముందుభాగంలో మారుతాత్మజుడైన హనుమంతు డున్నాడు. వెనుకభాగాన్ని భయమంటే ఎరుగుని లక్ష్మణుడు రక్షిస్తున్నాడు. రామలక్ష్మణులు గోధాంగుళి త్రాణాలు ధరించి గ్రహాలతో కూడిన సూర్యచంద్రులవలె వానరసచివులతో కలిసి బయలుదేరాడు. మద్దిచెట్లు, తాటిచెట్లు రాళ్లు ఆయుధాలుగా ధరించిన ఆ వానరసైన్యం సూర్యోదయసమయంలో పండిన పంటచేనులా ప్రకాశించింది. నలుడు, నీలుడు, అంగదుడు, క్రథుడు మైందుడు, ద్వివిదుడు సంరక్షిస్తున్న ఆ మహాసైన్యం రాముని కార్యం నెరవేర్చడానికి బయలుదేరింది ప్రశస్తమైన వివిధ

కందమూలఫలాలు, తేనె నీరు లభించే; శుభకరమైన కొండ చరియలలో ఆగుతూ ఎటువంటి ఆటంకమూ లేకుండా ముందుకుసాగుతూ ఆ వానరసైన్యం లవణసాగరాన్ని చేరుకొంది. అనేక ధ్వజపతాకాలతో కూడిన ఆ సైన్యం రెండవ సాగరమా అన్నట్లుంది. ఆ బలమంతా సాగరతీరంలోని వనం చేరుకొని అక్కడ డేరాలు వేసింది. పిమ్మట వానరయోధముఖ్యులమధ్య ఉన్న సుగ్రీవునితో ప్రాప్తకాలజ్ఞుడు అయిన దాశరధి ఇలా అన్నాడు. "ఈ సేన చూస్తే చాలా విస్తృతమైనది. సాగరమేమో తరింపశక్యం కానిది. ఈ దశలో సాగరం దాటడానికి ఏమైనా ఉపాయం ఉన్నదా ?' అప్పుడు మిక్కిలి గర్వించిన వానరులు కొంతమంది "మేము సముద్రం దాటగలం. కాని అది అందరికీ సాధ్యమయ్యేది కాదు" అన్నారు. కొంతమంది నౌకలతో దాటవచ్చని తమ నిశ్చయాన్ని ప్రకటించారు. కొంతమంది పడవలతో దాటవచ్చునన్నారు. కాని రాముడు వారందరినీ కాదని, వారిని సముదాయిస్తూ ఇలా అన్నాడు.

'వీరులారా! శతయోజనవిస్తారమైన జలనిధిని దాటడానికి వానరు లందరూ సమర్థులు కారు. కాబట్టి మీరు చెప్పినది సర్వసమ్మతమైన నిర్ణయం కాదు. మనసేన చాలా విస్తారమైనది కనుక దానినంతటిని దాటించడానికి తగినన్ని నౌకలు మనవద్ద లేవు. (ఒకవేళ వర్తకులవద్ద తీసుకోవచ్చు కదా అంటే) మావంటివారు వర్తకుల పనికి భంగం కలిగించేలా ఎలా నడచుకొంటారు ? అంతేకాదు. మనది విశాలమైన సైన్యం కనుక అటు ఇటు విడిపోతే శత్రువు సమయం చూసి దెబ్బతీయవచ్చు. కాబట్టి పడవలు, తెప్పలు మొదలైన సాధనాలతో సముద్రాన్ని దాటడం నాకు ఇష్టంలేదు. నేను ఏదో ఒక ఉపాయంతో ఈ సముద్రాన్ని ఆరాధించడం మొదలుపెడతాను. ఈతీరంలోనే ఉపవాసాన్ని పూని కదలకుండా పడుకొంటాను. అప్పుడు అతడే నాకు మార్గం చూపుతాడు. అతడు నాకు మార్గం చూపకపోతే అగ్నికంటె, వాయువు కంటె కూడా తీక్ష్ణమైన ఎదురులేని మహాదివ్యాస్త్రాలతో నేను అతనిని కాల్చివేస్తాను.' అని పలికి రాఘవుడు లక్ష్మణునితో కలిసి ఆచమించి శాస్త్రానుసారంగా సముద్రతీరంలో దర్భశయనం మీద కదలకుండా పడుకొన్నాడు. సమస్త నదీనదాలకు స్వామి అయిన సాగరుడు జలచరాలతో కూడి స్వప్నంలో రాఘవునికి సాక్షాత్కరించాడు. అతడు వందలకొద్దీ రత్న నిధులతో ఆవరింపబడి ఉన్నాడు. 'కౌసల్యానందనా!" అని అతనిని సంబోధించి మధురమైన వాక్కులతో ఇలా అన్నాడు. 'పురుషోత్తమా! నేను కూడా ఇక్ష్వాకువంశీయుడనే. నీ జ్ఞాతి బంధువును. నేను నీకు ఇప్పుడేమి సహాయం చేయగలను ? చెప్పు' అనగానే రాముడు అతనితో ఇలా అన్నాడు. "నదీనదాలకు ప్రభువైన సాగరుడా! నీవు నాసైన్యానికి దారిని ఇవ్వాలని

కోరుకొంటున్నాను. ఆ మార్గం ద్వారా వెళ్లి పులస్త్యవంశంలో నీచుడిగా జన్మించిన దశగ్రీవుని చంపగలను. నేను ఇలా యాచించినా మీరు నాకు మార్గం ఇవ్వకపోతే దివ్యాస్త్రాలతో అభిమంత్రించిన బాణాలతో నిన్ను శోషింపచేస్తాను." ఇలా అంటున్న రాముని మాటలను విని వరుణాలయుడైన సాగరుడు దుఃఖితుడై, చేతులు జోడించి నిలిచి, ఇలా అన్నాడు. శ్రీరామా! నిన్ను ఎదిరించాలని నేను కోరడం లేదు. నీ మార్గానికి అడ్డురావాలని కూడా నేను అనుకోవడం లేదు. నేను చెప్పే ఈ మాట విను. విన్నాక ఏది కర్తవ్యమో అది చేయి. నీ ఆజ్ఞప్రకారం లంకకు వెళ్తున్న నీ సైన్యానికి నేను దారి ఇచ్చినట్లయితే ఇతరులు కూడా వింటిబలంతో నన్ను ఇలాగే ఆజ్ఞాపిస్తారు. ఇక్కడ నీ సైన్యంలో నలు డనే వానరుడు ఉన్నాడు కదా! అతడు శిల్పులలో మన్నింపదగినవాడు. ఆ బలవంతుడు దేవశిల్పి అయిన విశ్వకర్మయొక్క కుమారుడు. అతడు ఏ కట్టెగాని, గడ్డిపరకగాని, రాయినిగాని నా యందు పడవేసినా, దానిని నేను పైకి తేల్చి ఉంచుతాను. అదే నీకు సేతువు కాగలదు." అని చెప్పి అతడు అంతర్ధానం కాగానే రాముడు నలునితో - "సముద్రంలో నీవు సేతువును నిర్మించు. నీవు సమర్థుడవని నాకు తెలుసు ' అన్నాడు. ఆ ఉపాయంతోనే కకుత్స వంశీయుడైన రాముడు సేతునిర్మాణం చేయించాడు అది పదియోజనాల వెడల్పు; వంద యోజనాల పొడవు ఉంది.

అది ఈనాటికీ భూమిపై "నలసేతువు" అనే పేరుతో ప్రసిద్ధంగా ఉంది. రాముని ఆజ్ఞను పురస్కరించుకొని కొండవంటి ఆ సేతువును సముద్రుడు ధరించాడు. సముద్రం ఒడ్డునే ఉన్న శ్రీరామచంద్రుని వద్దకు ధర్మాత్ముడూ, రాక్షసరాజు తమ్ముడూ అయిన విభీషణుడు తన నలుగురు మంత్రులతో కలిసి వచ్చాడు. మహామనస్వి అయిన రాముడు అతనికి స్వాగతం చెప్పి స్వీకరించాడు. కాని సుగ్రీవునికి "ఇతడు గూఢచారి అయి ఉండవచ్చును" అనే శంక కలిగింది. కాని రాఘవుడు అతని చేతలలోని నిజాయితీని, చక్కని నడతను, హావభావాలను చక్కగా ఆకళింపు చేసుకొని, సంతుష్టుడై అతనిని బాగా ఆదరించాడు. పైగా అతనిని సమస్త రాక్షసరాజ్యానికి రాజుగా అభిషేకించాడు. తనకు మంత్రాంగం నెరపే మంత్రిగా, లక్ష్మణునికి స్నేహితునిగా చేసుకొన్నాడు నరేశ్వరా! విభీషణునియొక్క సలహా ప్రకారం రాముడు ఆ సేతువు ద్వారా ఒక్క నెలలోనే ఆ మహాసాగరాన్ని ససైన్యంగా దాటాడు అలా వెళ్లి లంకలోని ఉద్యానవనాలను చేరుకొని, అనేకమైన ఉద్యానవనాలను వానరులచేత చిన్నాభిన్నం చేయించాడు. ఆ సమయంలో రావణుని మంత్రులు శుకసారణులు గూఢచారులై వానరరూపంలో అక్కడ తిరుగుతూండగా వారిని విభీషణుడు పట్టుకొన్నాడు. ఆ నిశాచరులిద్దరూ తమ రాక్షసరూపాన్ని ధరించగానే

రాముడు వారికి తనసైన్య మంతటినీ చూపి, అనంతరం వదిలివేశాడు. ఆ రీతిగా సైన్యాన్ని లంక యొక్క ఉపవనంలో విడిది చేయించి శ్రీరాముడు ప్రాజ్ఞుడైన అంగదుని దూతగా రావణుని వద్దకు పంపాడు.

284. అంగదరాయబారము - ఘోరసంగ్రామము.

లంకయొక్క ఆ వనంలో అన్న పానీయాలు సమృద్ధిగా ఉన్నాయి. కందమూలఫలాలు చాలా లభ్యం అవుతున్నాయి. శ్రీరాముడు అక్కడే సైన్యాన్ని ఉంచి, విధిపూర్వకంగా దానిని రక్షిస్తున్నాడు లంకలో రావణుడు యుద్ధశాస్త్రాన్ని అనుసరించి నిర్మించే యుద్ధసామగ్రిని (యంత్ర నిర్మిత శతఘ్నులు మొదలైనవి) సేకరించడం మొదలుపెట్టాడు. లంకయొక్క ప్రహరీగోడలు, నగర ద్వారాలు స్వతస్సిద్ధంగానే ఇతరులు ఎవరూ లోపలకు ప్రవేశించడానికి సాధ్యంకానంత బలిష్ఠమైనవి. నగరానికి నలువైపులా లోతైన నీటితో నిండిన ఎడు అగడ్తలు ఉన్నాయి. వాటిలో చేపలు, మొసళ్లు మొదలైనవి నిరంతరం తిరుగుతూ ఉంటాయి. ఆ పరిఖలు (అగడ్తలు) బలిష్ఠమైన తలుపులతో రాళ్లు విసిరే యంత్రాలతోను కూడి ఉన్నాయి. అక్కడ కొమ్ములు, రాళ్లు గుట్టలుగా ఉన్నాయి. ఇంకా విషసర్పాలు, సైనికులు, లక్కరసం, ధూళి - ఇవన్నీ ఉండడంవలన అవి ఎవరికీ చొరశక్యం కాకుండా ఉన్నాయి. ముసలాలు, ఆలాతాలు, బాణాలు, తోమరాలు, కత్తులు, గండ్రగొడ్డళ్లు, శతఘ్నులు, మైనం పూసిన ముద్గరాలు మొదలైన వివిధ ఆయుధాలతో కూడి ఉండడం వలన కూడా అవి దుర్భేద్యంగా ఉన్నాయి. నగరద్వారాలన్నింటియందు బురుజు లున్నాయి. అందులో స్థిరంగా ఉండి కొందరు, అటు ఇటు తిరుగుతూ కొందరు కాపలా కాసే సైనికులున్నారు. వీటిని గుల్మములు అంటారు. అనేకమైన పత్తులు (సేనావిశేషం) ఉన్నాయి. అధికమైన గజ, అశ్వసైన్యం ఉంది. అంగదుడు ఇలాంటి లంకానగరం యొక్క ప్రవేశద్వారాన్ని సమీపించాడు రాక్షసరాజు రావణునికి దూత వచ్చాడని తెలిసింది. అతని అనుమతితో నిర్భయుడై, మహాబలుడైన అంగదుడు లోపలకు ప్రవేశించాడు అసంఖ్యాకమైన రాక్షసకోటల మధ్య అతడు మేఘపంక్తుల నడుమ ఉన్న సూర్యునిలా శోభిల్లాడు

మంత్రులు పరివేష్టించి ఉండగా పులస్త్యనందనుడైన రావణుని సమీపించి, మంచి మాటకారి అయిన అంగదుడు రావణుని సంబోధించి శ్రీరామసందేశాన్ని చెప్పడానికి ఉపక్రమించాడు. 'రాజా! కోసలదేశపు రాజు మహాకీర్తిమంతుడూ అయిన రాఘవుడు సమయోచితంగా నీకు ఇలా చెపుతున్నాడు. విని, అలా చెయ్యి. తన్ను తాను అదుపులో ఉంచుకోలేని, అవినీతిపరుడైన రాజును ఆశ్రయించి ఉండే దేశాలు గాని నగరాలు కాని

అవినీతిమయములై నశించిపోతాయి సీతను బలవంతంగా అపహరించి నాపట్ల నీవు ఒక్కడివే అపరాధం చేశావు. కాని అది అపరాధం చేయని మిగిలిన వారి చావుకు కూడా కారణమవుతుంది నీవు బలంతో దర్పంతో ఉన్మత్తుడవై పూర్వం అడవులలో నివసించే మునులను హింసించావు. దేవతలను అవమానించావు. రాజర్షులను చంపివేశావు ఏడుస్తున్న స్త్రీలను అపహరించావు ఈ నీ అవినయానికి తగినఫలం ఇప్పుడు నీకు ప్రాప్తించబోతోంది. నిన్ను నీమంత్రులతో సహితంగా చంపుతాను. పౌరుషం గలవాడివై యుద్ధం చేయి. నిశాచరా! మానవుడినే అయినా నా వింటిబలం చూడు. జనకనందిని అయిన సీతను విడిచిపెట్టు లేకపోతే నానుండి ఏవిధంగానూ తప్పించుకోలేవు వాడి బాణాలతో లోకంలో రాక్షసులే లేకుండా చేస్తాను.' అని చెపుతున్న దూతయొక్క ఆ పరుషవాక్యాలను విని, రావణుడు సహించలేకపోయాడు. క్రోధంతో అతనికి ఒళ్లు తెలియలేదు. ప్రభువుయొక్క ఇంగితాన్ని గుర్తించిన నలుగురు రాక్షసులు పక్షులు పెద్దపులిని పట్టుకొన్నట్లుగా అంగదుని రెండుకాళ్లను రెండు చేతులను పట్టుకొన్నారు. ఆ రీతిగా తన కాళ్లుచేతులను పట్టుకొన్న ఆ రాక్షసులను తీసుకొనే అంగదుడు ఆకాశంలోకి ఎగిరి భవనాగ్రాన్ని చేరుకొన్నాడు. పైకి ఎగురుతున్న అతని వేగానికి ఆ రాక్షసులు నలుగురు నేలపై పడిపోయారు. వారి గుండెలు పగిలిపోయాయి. గట్టి దెబ్బలకు వారు విలవిలలాడిపోయారు. మేడపై నిలిచిన అంగదుడు తిరిగి ఆ భవనశిఖరం నుండి భూమిపైకి దూకాడు. లంకాపురిని దాటుకొని సువేల పర్వత సమీపానికి చేరుకొన్నాడు.

కోసలరాజయిన రాఘవునివద్దకు వచ్చి ఆ వానరుడు జరిగినదంతా చెప్పాడు. అతడు అభినందించాడు ఆపై ఆ పరాక్రమశాలి విశ్రాంతి తీసుకొన్నాడు. ఆ తరువాత రఘునందనుడు శ్రీరామచంద్రుడు గాలితో సమానమైన వేగం కల వానరసైన్యం అంతటితో కలిసి లంకానగరం యొక్క ప్రాకారాలను భేదించివేశాడు. లక్ష్మణుడు విభీషణ జాంబవంతులను ముందుంచుకొని అభేద్యమైన దక్షిణనగరద్వారాన్ని మట్టిలో కలిపేశాడు. అనంతరం ఆరచేతి వర్ణంలా ఎఱ్ఱగా, తెల్లగా ఉన్న యుద్ధకుశలురు అయిన శతసహస్రకోట్ల వానరులతో రాముడు లంకలో ప్రవేశించాడు బాగా పాడవుగా ఉన్న బాహువులు ఊరువులు, చేతులు, పిక్కలు అన్నీ విశాలంగా ఉన్న, ధూమ్రవర్ణంలో ఉన్న ఋక్షవీరులు మూడుకోట్లమంది అతనితో పాటు లంకలో ప్రవేశించి యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. వానరులు ఎగురుతూ, గంతులు వేస్తూంటే రేగిన ధూళిచేత కాంతి నశించి సూర్యుడు కనపడలేదు ఆ వానరులు శాలిధాన్యపు పూలరంగులో శిరీషపుష్పకాంతుల ఉదయసూర్యులవలె శణమల వలె తెలుపురంగులో ఉండి ప్రాకారాలన్నింటినీ అన్నివైపులనుండి కపిలవర్ణంలా కనిపింపచేశారు

రాజా! స్త్రీలు, వృద్ధులతో సహితంగా రాక్షసులందరూ అన్నివైపులనుండి వారిని ఆశ్చర్యచకితులై చూశారు. వారు మణిస్తంభాలను, భవనగోపురాలను, విరుగకొట్టారు. రాళ్లను విసిరే యంత్రాల కొమ్ములను విరుగకొట్టి విసిరివేశారు. చక్రాలతో కూడిన శతఘ్నులను, కొమ్ములను, గోళాలను పట్టుకొని భీకరధ్వనులు చేస్తూ వానరులు తమ చేతులసత్తువ కొద్దీ వాటిని లంకమధ్యలోకి విసిరివేశారు. అప్పుడు ప్రాకారాలమీద రక్షకులుగా ఉన్న వందలకొద్దీ నిశాచరులను వానరులు తరిమేశారు.

అనంతరం రాజాజ్ఞపై కామరూపధారు లయిన లక్షలమంది రాక్షసులు వికృతాకారంతో గుంపులుగుంపులుగా నగరం బయటకు వచ్చారు. ప్రాకారశోభను ఇనుమడింపచేస్తూ శస్త్రవర్షాన్ని కురిపిస్తున్న వారు వనౌకసు లయిన వానరులను తరిమి తరిమి కొట్టి, తమ పరాక్రమాన్ని ప్రదర్శించారు. మినుములరాశిలా నల్లగా, చూడడానికి భయం కొలుపుతున్న రాక్షసులు తిరిగి ఆ ప్రాకారాన్ని వానరులు లేకుండా చేసివేశారు. రాక్షసులు ప్రయోగించిన శూలాలతో శరీరాలు ముక్కలయిపోయి వానరశ్రేష్ఠులు ఎంతోమంది నశించిపోయారు. వానరులు స్తంభాలను తోరణాలను భగ్నం చేయడం వలన ఎంతోమంది నిశాచరులు వాటిక్రింద పడి నశించారు. రాక్షసులు వానరులు జుట్లు జుట్లు పట్టుకొని యుద్ధం చేశారు ఆ వీరులు పరస్పరం గోళ్లతో పళ్లతో రక్కుకొన్నారు. రెండువైపులనుండి వానరరాక్షసవీరులు గర్జిస్తూ, యుద్ధంచేస్తూ, చచ్చి, భూమిపై పడికూడా ఒకరినొకరు విడిచిపెట్టలేదు. మేఘుడు నీటిని వర్షించినట్లుగా రాముడు బాణాలను కురిపించాడు ఆవి లంకను చేరుకొని అక్కడ ఉండే రాక్షసులను చంపివేశాయి. క్లేశం, అలసటలను జయించిన లక్ష్మణుడు గట్టి ధనుస్సును చేతపట్టుకొని దుర్గంలో ఉన్న రాక్షసులను చెప్పి మరీ బాణాలతో పడగొట్టాడు. ఈ రీతిగా లంకను బాగా అతలాకుతలం చేసిన తరువాత లక్ష్యాన్ని సిద్ధింపచేసుకొని, విజయాన్ని పొందిన వానరసైన్యం రాముని ఆజ్ఞమేరకు వెనక్కు మరలింది.

285. రామరావణ సైనికుల ద్వంద్వయుద్ధము.

ఆ రీతిగా శిబిరాలలోకి చేరిన వానరసైనికులపై రావణుని అనుచరులైన పర్వణుడు, పతనుడు, జంభుడు, ఖరుడు, క్రోధవశుడు, హరి ప్రరుజుడు, అరుజుడు, ప్రఘసుడు మొదలైన పిశాచులూ, క్షుద్రరాక్షసులూ దాడి చేశారు ఆ దుర్మార్గులు అదృశ్యులై వచ్చి దాడి చేశారు. ఆ విషయం తెలుసుకొన్న విభీషణుడు, దాని గురించి తెలిసి ఉండడంతో ఆ అదృశ్యశక్తిని రూపుమాపాడు. అప్పుడు వారందరూ వానరులకు కనబడసాగారు ఆ

వానరవీరులు బలవంతులు చాలాదూరం వరకు ఎగరగలిగినవారు రాజా కాబట్టి వారి చేతిలో ఆ రాక్షసు లందరూ ప్రాణాలు కోల్పోయి నేలకు ఒరిగారు. దీనితో బలవంతుడైన రావణాసురుడు మండిపడ్డాడు. అతడు పిశాచులు, రాక్షసులతో కూడిన భయంకర దళాలను వెంటబెట్టుకొని నగరం వెలుపలికి వచ్చాడు. అపర శుక్రాచార్యునిలా అతడు యుద్ధశాస్త్రవిధానాలు తెలిసినవాడు. కనుక శుక్రాచార్యుని మతాన్ని అనుసరించి అతడు వ్యూహరచన చేసి, వానరు లందరిని చుట్టుముట్టాడు. నగరం వెలువడి వ్యూహాకారంలో ఉన్న సైన్యంతో వస్తున్న దశాననుడైన రావణుని చూచి రాఘవుడు కూడా బృహస్పతి మతాన్ని అనుసరించి ప్రతివ్యూహాన్ని రచించాడు. అనంతరం అక్కడకు చేరుకొని రావణుడు రామునితో యుద్ధం చేయసాగాడు అలాగే లక్ష్మణుడు కూడా ఇంద్రజిత్తుతో యుద్ధం చేయసాగాడు. సుగ్రీవుడు విరూపాక్షునితో, తారుడు నిఖర్వటునితో నలుడు తుండునితో, పనసుడు పటుశునితో యుద్ధం చేయసాగారు. యుద్ధసమయంలో ఎవరెవరు ఎవరికెవరికి తగినవారని భావించారో వారు వారు వారివారితో తమ భుజబలం కొద్దీ యుద్ధం చేయసాగారు. రోమాంచం కలిగేటట్లు పూర్వం దేవాసురుల మధ్య జరిగిన యుద్ధం మాదిరిగా ఆ యుద్ధం పిరికివాళ్లకి మరింత భయాన్ని కలిగిస్తూ క్రమక్రమంగా తీవ్రం కాసాగింది. రావణుడు శక్తి, శూల, ఖడ్గ ఆయుధాలను వర్షించి రాముని బాధించాడు. రాముడు కూడా వాడియైన ఇనుపబాణాలతో రావణుని బాధించాడు అలాగే లక్ష్మణుడు మర్మభేదులైన బాణాలతో ఆ ఇంద్రజిత్తును బాధించాడు. ఇంద్రజిత్తు కూడా అనేక బాణాలతో సౌమిత్రిని తూట్లు పొడిచాడు. విభీషణుడు ప్రహస్తునిపై ప్రహస్తుడు విభీషణుని పై వాడియైన బాణాలను వర్షించుకొన్నారు. అయినా వారిరువురూ ఏ మాత్రం చలించలేదు. మహాస్త్రధారులై, బలవంతులైన ఆ వీరుల యొక్క సంగ్రామం వలన ముల్లోకాలలోని చరాచరప్రాణులు అన్నీ బాధపడ్డాయి.

286. రాముడు కుంభకర్ణుని యుద్ధమునకు పంపుట.

అంతలో యుద్ధ కర్కశుడయిన ప్రహస్తుడు ఆకస్మాత్తుగా విభీషణుని సమీపించి, అరుస్తూ అతనిని గదతో మోదాడు. భయంకరమైన వేగంతో వచ్చిపడిన ఆ గదాప్రహారాన్ని తట్టుకొని, ఆ విభీషణుడు హిమవంతునిలా చలించకుండా సుస్థిరుడై నిలిచాడు. విభీషణుడు వెడల్పయిన శతఘంటలు కల ఒక మహాశక్తిని చేతిలోకి తీసుకొని అభిమంత్రించి, ఆ ప్రహస్తుని శిరసుపైకి విసిరాడు. పిడుగుపాటులా అతివేగంగా పడిన ఆ మహాశక్తి యొక్క వేగం చేత తలతెగి ప్రహస్తుడు ఝుంఝామారుతానికి తల తెగిపడిన వృక్షంలా కనిపించాడు.

ఆ ప్రహస్తుడు యుద్ధంలో చనిపోవడం చూసి, ధూమ్రాక్షుడు మహావేగంతో వానరులవైపు పరుగెత్తుకొని వచ్చాడు. కారుమబ్బుల్లా భయంకరంగా వచ్చిపడుతున్న ఆ సైన్యాన్ని చూసి, వానరశ్రేష్ఠులందరూ భయంతో యుద్ధభూమిలో చెల్లాచెదరైపోయారు. అప్పుడు చెల్లాచెదరైపోయిన ఆ వానరశ్రేష్ఠులను చూసి హనుమంతుడు వెంటనే ముందుకు వచ్చాడు. పవనతనయుడు యుద్ధంలో నిలబడడం చూచిన వానరులందరూ మహోత్సాహంతో అన్నివైపులనుండి తిరిగి వచ్చారు. రామరావణుల సైన్యంయొక్క దాడులతో అక్కడ ఘోరమైన గగుర్పాటు కలిగించే గొప్ప శబ్దం పుట్టింది. ఆ ఘోరసంగ్రామం జరుగుతూంటే భూమి అంతా రక్తంతో బురదగా మారిపోయింది. ధూమ్రాక్షుడు బాణాలతో వానరసైన్యాన్ని తరిమి కొట్టసాగాడు. హనుమంతుడు అలా విరుచుకుపడుతున్న మహాకాయుడైన ఆ రాక్షసుని అడ్డుకొన్నాడు. వానర రాక్షసవీరులు ఇద్దరిమధ్య ఘోరమైన యుద్ధం జరిగింది. యుద్ధంలో జయాభిలాషులైన వారు ఇంద్ర ప్రహ్లాదులవలె పోరాడసాగారు. గదలతో పరిఘలతో రాక్షసుడు వానరుని గాయపరిస్తే, వానరుడు కాండాలు, కొమ్మలు గల చెట్లతో అతనిని గాయపరిచాడు. ఆ తరువాత పవనసుతుడు హనుమంతుడు కోపించి గుర్రాలతో, సారథితో, రథంతో సహితంగా ధూమ్రాక్షుని సంహరించాడు. రాక్షసవీరుడయిన ధూమ్రాక్షుడు చనిపోవడం చూసిన వానరులకు, భల్లూకాలకు ఆత్మవిశ్వాసం కలిగి, వారు కూడా రాక్షససైనికులను హతమార్చారు.

విజయోన్మత్తులు అయిన వానరుల చేతిలో చావుదెబ్బ తిన్న రాక్షసులు తమ ఊహలు తారుమారుకాగా భయాతురులై లంకలోనికి పరుగులు తీశారు. చావగా మిగిలిన ఆ రాక్షసులు భగ్నమనోరథులై లంకను ప్రవేశించి, మహారాజు రావణునికి అంతా జరిగినది జరిగినట్లుగా విన్నవించారు. ప్రహస్తుడు, ధూమ్రాక్షుడు తమ సైన్యంతో సహితంగా యుద్ధంలో వానరపుంగవుల చేతిలో చనిపోయారని వారివలన విని రావణుడు దీర్ఘంగా నిట్టూర్చాడు. అతడు శ్రేష్ఠమైన సింహాసనం మీద నుండి ఒక్కఉదుటున లేచి "ఇప్పుడు కుంభకర్ణుడు తన పరాక్రమం చూపే సమయం వచ్చింది" అన్నాడు. ఇలా అని మిక్కిలి గట్టిగా మోగే రకరకాల వాద్యాలతో నిద్రపోతున్న అతినిద్రాళువు అయిన కుంభకర్ణుని మేల్కొలిపాడు. భయపడిన రావణుడు అతిప్రయత్నం మీద అతనిని మేల్కొలిపాడు. శాంతంగా, నిద్రారహితుడై స్వస్థుడై కూర్చున్న మహాబలుడు కుంభకర్ణునితో రావణుడు – 'ఇటువంటి నిద్ర కలిగిన నీవు ధన్యుడివి." "మనకు కలిగిన మహాభయం గురించి నీవు ఎరుగవు. రాముడు సేతువు కట్టి వానరులతో సహితంగా సముద్రాన్ని దాటివచ్చి, మనను లెక్కచేయకుండా ఘోరమైన యుద్ధం చేస్తున్నాడు. అతని భార్య సీతను నేను

అపహరించి తెచ్చాను. ఆమెను తీసుకువెళ్లడానికే మహాసముద్రానికి సేతువు కట్టి అతడు ఇక్కడికి వచ్చాడు. మనవారిని ప్రహస్తాదిప్రముఖులను అతడు చంపివేశాడు. నీవు తప్ప అతనిని చంపగలిగినవారు వేరెవరూ లేరు. నీవు ఇప్పుడు కవచాన్ని ధరించి బయలుదేరు. యుద్ధంలో రాముడు మొదలైన శత్రువుల నందరినీ వధించు. దూషణుని తమ్ములైన వజ్రవేగుడు ప్రమాథి మహాసైన్యంతో నిన్ను అనుసరిస్తారు." కుంభకర్ణునికి ఈరీతిగా చెప్పి రాక్షసరాజు రావణుడు వజ్రవేగప్రమాథులకు కర్తవ్యం బోధించి, పాటించమని ఆజ్ఞాపించాడు. వీరులయిన దూషణుని తమ్ముళ్లు వజ్రవేగప్రమాథులు రావణునితో అలాగే అని చెప్పి కుంభకర్ణుడు ముందు నడువగా పట్టణం నుండి బయలుదేరారు.

287. కుంభకర్ణుడు, వజ్రవేగప్రమాథులు చనిపోవుట.

అనుచరులతో కలిపి కుంభకర్ణుడు తన నగరం నుండి బయలుదేరి వచ్చి తన ఎదురుగా విజయోల్లాసంతో నిలిచి ఉన్న కపిసైన్యాన్ని చూశాడు. రాముని చూడాలనే కోరికతో ఆ సైన్యాన్ని అటు ఇటు కలయ చూస్తున్న అతనికి ధనుస్సును చేతపట్టి నిలుచున్న లక్ష్మణుడు కనిపించాడు. ఇంతలో వానరులు అన్నివైపులనుండి అతనిని సమీపించి వెంటనే చుట్టుముట్టారు. అనేక మహావృక్షాలతో అతనిని ప్రహరించారు. అందులో కొంతమంది వానరులు (కుంభకర్ణుని వలన కలిగే) గొప్పభయాన్ని విడిచిపెట్టి గోళ్లతో రక్కి అతనిని బాధించసాగారు. రకరకాల యుద్ధమార్గాలలో ఆ వానరులు యుద్ధం చేస్తూ భయంకరమైన అనేక ఆయుధాలతో రాక్షసేంద్రు డయిన కుంభకర్ణుని కొట్టసాగారు. అలా వారు ప్రహరిస్తున్నా అతడు నవ్వుతూ వానరులను భక్షించసాగాడు. బలుడు, చండబలుడు వజ్రబాహుడు అనే వానరులు అతనికి ఆహారమైపోయారు కుంభకర్ణుడు చేసే దుఃఖదాయకమైన ఆ పనిని చూసి తారుడు మొదలైన వానరులు భయంతో ఆక్రోశించారు. తనసైనికులు, వానరపుంగవులు బిగ్గరగా చేస్తున్న ఆ ఆర్తనాదాలు విని సుగ్రీవుడు భయపడకుండా కుంభకర్ణునివైపు పరిగెత్తాడు. సుగ్రీవుడు వేగంగా ఎగురుతూ ఒక మద్దిచెట్టుతో బలంగా కుంభకర్ణుని తలపై కొట్టాడు. సుగ్రీవుడు మహావేగం కలవాడు, మహాత్ముడు. అతడు కుంభకర్ణుని తలపై మద్దిచెట్టును రెండు ముక్కలుగా చేశాడు. అయినా అతనికి ఏమాత్రం వ్యధ కలిగించలేకపోయాడు

ఆ మద్దిచెట్టు స్పర్శ తెలిసి కుంభకర్ణుడు వెంటనే గర్జిస్తూ సుగ్రీవుని రెండుచేతుల నడుమ నొక్కిపట్టి, బలవంతంగా ఎత్తుకుపోయాడు కుంభకర్ణుడు సుగ్రీవుని అపహరించడం చూసి, వీరవరుడు లక్ష్మణుడు అతనివైపు పరుగుతీశాడు లక్ష్మణుడు అక్కడికి చేరుకొని

బంగారపు అంచు కలిగిన ఒక మహాశరాన్ని ఆ కుంభకర్ణుని గురి చూసి కొట్టాడు. ఆ బాణం అతని కవచాన్ని, దేహాన్ని కూడా ఛేదించి రక్తంతో తడిసి భూమిని చీల్చుకుంటూ వెళ్లింది. ఆ రీతిగా హృదయం భిన్నం కాగా మహాధనుర్ధరుడైన కుంభకర్ణుడు సుగ్రీవవానరుని వదిలి మహావేగంతో లక్ష్మణుని వైపు తిరిగి నిలు, నిలు" అని పలికాడు. అనంతరం శిలాయుధం ధరించిన అతడు పెద్దరాయిని ఎత్తి, లక్ష్మణునివైపు పరిగెత్తాడు. లక్ష్మణుడు వెంటనే వాడిములుకులు గల రెండు నారాచారాలతో తనవైపు వస్తున్న కుంభకర్ణుని రెండు చేతులను ఖండించివేశాడు. కాని అతడు నాలుగు చేతులు కలవాడయ్యాడు. కుంభకర్ణుడు ఆ నాలుగు భుజాలతోనూ రాళ్లను పట్టుకున్నాడు. సౌమిత్రి తన అస్త్రలాఘవాన్ని ప్రదర్శిస్తూ ఆ భుజాలనన్నిటినీ కూడా నారాచాలతో ఖండించివేశాడు. కుంభకర్ణుడు అనేకపాదాలు శిరస్సులు, భుజాలు కలిగి మహాకాయుడిగా అవతరించాడు. లక్ష్మణుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి కొండల సమూహంలా ఉన్న అతని శరీరాన్ని చీల్చివేశాడు. గొప్ప పిడుగుపాటుకు పూర్తిగా దగ్ధమైన ఊడలు దిగిన చెట్టువలె దివ్యాస్త్రం తగిలి, ఆ మహావీరుడు యుద్ధంలో కూలిపోయాడు.

వృత్రాసురునితో సమానుడు, వేగరి అయిన కుంభకర్ణుడు ప్రాణాలు కోల్పోయి భూమిపై పడి ఉండడం చూసిన రాక్షసులు భయంతో పరుగులు తీశారు. ఆ రీతిగా పారిపోతున్న ఆ యోధులను చూచి దూషణుని తమ్ములైన వజ్రవేగుడు, ప్రమాధి వారిని ఎలాగో నిలువరించి అతికుపితులై లక్ష్మణునిపై దాడిచేశారు. మిక్కిలి కోపంతో తనవైపు పరుగెత్తి వస్తున్న వజ్రవేగ ప్రమాధులను ఇద్దరినీ కూడా లక్ష్మణుడు సింహనాదం చేసి బాణాలతో అడ్డుకొన్నాడు. యుధిష్ఠిరా! అప్పుడు దూషణుని తమ్ములకు, ధీమంతుడైన లక్ష్మణునికి మధ్య గగుర్పాటు కలిగించే భీకరయుద్ధం జరిగింది లక్ష్మణుడు గొప్ప శరవర్షంతో రాక్షసులను ముంచెత్తాడు. ఆ వీరులు ఇద్దరూ కూడ కోపంతో అతనిపై బాణవర్షం కురిపించారు. వజ్రవేగప్రమాధులకు, మహాబాహువయిన లక్ష్మణునికి నడుమ జరిగిన దారుణమయిన పోరాటం ముహూర్తకాలం కొనసాగింది. ఇంతలో పవనసుతుడు హనుమంతుడు కొండశిఖరాన్ని పట్టుకొని వజ్రవేగునిపై దాడిచేసి ఆ రాక్షసుని ప్రాణాలను తీశాడు. మహాబలుడైన నీలుడు పెద్దబండతో దూషణుని తమ్ముడైన ప్రమాధిపై దాడిచేసి అతనిని హతమార్చాడు. అనంతరం రామరావణుల యొక్క సైన్యాల మధ్య పరస్పరదాడులతో చేదుఫలితాన్నిచ్చే యుద్ధం తిరిగి కొనసాగింది. రాక్షసులను వానరులు వానరులను రాక్షసులు వందలకొద్దిగా చంపుకొన్నారు. ఆ యుద్ధంలో ఎక్కువగా రాక్షసులే చనిపోయారు కాని వానరులు కాదు.

288. ఇంద్రజిత్తు మాయాయుద్ధము చేయుట - రామలక్ష్మణులు మూర్ఛిల్లుట.

అనుచరులతో సహా కుంభకర్ణుడు, మహాధనుర్ధారి అయిన ప్రహస్తుడు, మిక్కిలి పరాక్రమవంతు డయిన ధూమ్రాక్షుడు కూడా యుద్ధంలో చనిపోయారని విని రావణుడు వీరు డయిన కొడుకు ఇంద్రజిత్తుతో ఇలా అన్నాడు - "శత్రుదమనా! సుగ్రీవుని, లక్ష్మణ సహితుడైన రాముని చంపు." సుపుత్రా! సహస్రాక్షుడు, వజ్రాయుధధరుడు అయిన ఇంద్రుని యుద్ధంలో ఓడించిన నీ వల్లనే నేను ఉజ్జ్వలమైన కీర్తిని సంపాదించగలిగాను. నీవు శస్త్రధారులలో మేటివి, శత్రునాశకుడవు. దేవతలు వరంగా ఇచ్చిన దివ్యమైన బాణాలతో నీవు అదృశ్యంగా ఉండి గాని, ప్రకటమై గాని నా శత్రువులను సంహరించు. రామలక్ష్మణ సుగ్రీవులే నీ బాణాల తాకిడిని తట్టుకోవడానికి సమర్థులు కారు. ఇక వారి అనుచరులు ఎక్కడ ? ప్రహస్తుడు, కుంభకర్ణుడు కూడా ఖరుని వధకు ప్రతీకారం చేయలేకపోయారు. దానిని తీర్చడానికి యుద్ధానికి వెళ్లు. కుమారా! నేడు నీవు వాడియైన బాణాలతో సైన్యసహితంగా శత్రువులను వధించి, పూర్వం ఇంద్రుని జయించిన రీతిగా నాకు సంతోషం కలిగించు" రావణుడు ఈ రీతిగా పలుకగానే ఇంద్రజిత్తు 'సరే' అని కవచం ధరించి, రథం ఎక్కి, వెంటనే యుద్ధానికి బయలుదేరాడు. అనంతరం ఆ రాక్షసశ్రేష్ఠుడు అతిస్పష్టంగా తన పేరును తెలుపుతూ శుభలక్షణుడైన లక్ష్మణుని యుద్ధానికి పిలిచాడు. లక్ష్మణుడు కూడా ధనుర్బాణాలు తీసుకొని, సింహం క్షుద్రమృగాలను భయపెట్టినట్లుగా వింటిధ్వనిచేత రాక్షసులను భయపెడుతూ అతనికి ఎదురునడిచాడు. అప్పుడు దివ్యాస్త్రకోవిదులు, జయాభిలాషులు, పరస్పరం స్పర్ధ కలిగిన వారిరువురిమధ్య తీవ్రమైన యుద్ధం జరిగింది. ఇంద్రజిత్తు బాణాలతో లక్ష్మణుని మించలేకపోయాడు. అప్పుడు ఇంద్రజిత్తు అత్యధికమైన ప్రయత్నం ఆరంభించాడు. మహావేగం కలిగిన తోమరాలను ప్రయోగించి, లక్ష్మణుని నొప్పించడానికి ప్రయత్నించాడు. కాని ఆ వచ్చే తోమరాలను లక్ష్మణుడు వాడి బాణాలతో ఖండించివేశాడు. లక్ష్మణుని వాడిబాణాలతో తునుకలై ఆ తోమరాలు నేల రాలాయి. వాలిపుత్రుడు అంగదుడు మహావేగంగా ఒకచెట్టుతో పరిగెత్తుకొని వచ్చి ఇంద్రజిత్తు తలపై మోదాడు బలవంతుడైన ఇంద్రజిత్తు దానికి ఏమాత్రం చలించకుండా ఒక ప్రాసంతో అతని ఛాతిపై కొట్టాలనుకొన్నాడు. కాని లక్ష్మణుడు ఆ ప్రాసాన్ని మధ్యలోనే తుంచివేశాడు.

రావణపుత్రుడైన ఇంద్రజిత్తు తన సమీపానికి వచ్చిన వీరుడు, వానరశ్రేష్ఠుడు అయిన అంగదుని గదతో ఎడమపక్క కొట్టాడు. అంగదుడు ఆ దెబ్బను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా క్రోధంతో ఒక మద్దిమ్రాకును ఇంద్రిజిత్తుపై విసిరాడు ఇంద్రజిత్తును

వధించడానికి కోపంతో అంగదుడు విసిరిన ఆ చెట్టు ఇంద్రజిత్తుయొక్క రథాన్ని గుర్రాలతో, సారథితో సహా మట్టుపెట్టింది సారథి చనిపోయి, గుఱ్ఱాలు లేని ఆ రథాన్నుండి ఇంద్రజిత్తు తన మాయాబలంచేత అక్కడే అదృశ్యుడైపోయాడు. అనేకమాయలుగల ఆ రాక్షసుడు అంతర్ధానం అయ్యాడని తెలుసుకొన్న శ్రీరామచంద్రుడు అచ్చటికి వచ్చి తనసైన్యాన్ని అన్నివైపులనుండి రక్షించసాగాడు. ఇంద్రజిత్తు అప్పుడు దేవతలు వరంగా ప్రసాదించిన బాణాలతో శ్రీరాముని, మహాబలి అయిన లక్ష్మణుని కూడా శరీరమంతా తూట్లు పొడిచాడు. మాయతో అంతర్ధానమై అదృశ్యంగా ఉన్న ఇంద్రజిత్తుతో శూరులైన రామలక్ష్మణులు ఇద్దరూ బాణాలతో యుద్ధం చేస్తూనే ఉన్నారు అతడు కోపంతో ఆ పురుషసింహాల శరీరాలమీద అంతటా వందల, వేల బాణాలను పదే పదే గుప్పించాడు. ఎడతెగకుండా బాణాలను వేస్తున్న అతడు అదృశ్యంగా ఉండడం చూసి వానరులు పెద్ద పెద్ద రాళ్లను తీసుకొని ఆకాశానికి ఎగిరారు. మాయను ఆశ్రయించి అదృశ్యంగా ఉన్న ఆ ఇంద్రజిత్తు ఆ వానరులను రామలక్ష్మణులను కూడా బాణాలు కురిపించి, మిక్కిలిగా గాయపరిచాడు. రామలక్ష్మణులు ఇద్దరూ బాణాలతో పూర్తిగా కప్పబడి, సూర్యచంద్రులు ఆకాశాన్నుండి పడినట్లుగా భూమిపై పడిపోయారు.

289. ఇంద్రజిత్తు చనిపోవుట.

ఆ రామలక్ష్మణులు ఇద్దరూ నేలపై వాలిపోవడం చూసి ఇంద్రజిత్తు తనకు దేవతలు వరంగా ప్రసాదించిన బాణాలతో పూర్తిగా బంధించివేశాడు. ఆ వీరులు యుద్ధంలో ఇంద్రజిత్తుయొక్క బాణాలచేత బంధింపబడి పంజరంలోని పక్షులవలె ప్రకాశించారు. వందలకొద్దీ బాణాలచేత ఆవరింపబడి భూమిమీదపడిఉన్న వారిని చూచి సుగ్రీవుడు వానరులతోకలిసి, వారి చుట్టూ చేరి నిలిచాడు. సుషేణుడు, మైందుడు, ద్వివిదుడు, కుముదుడు, అంగదుడు, హనుమంతుడు, నీలుడు, తారుడు నలుడు – వీరందరితో కలిసి సుగ్రీవుడు వారిద్దరిని రక్షించసాగాడు. అప్పుడు కార్యసాధకుడైన విభీషణుడు అక్కడికి వచ్చి ప్రజ్ఞాస్త్రం ద్వారా ఆ వీరులిద్దరికీ మెలకువ తెప్పించాడు సుగ్రీవుడు దివ్యమంత్రాలను ప్రయోగించి విశల్య మనే గొప్ప ఓషధి చేత క్షణంలో వారిద్దరి శరీరాలలోని బాణాలను తొలగించి స్వస్థులుగా చేశాడు. నరశ్రేష్ఠులైన ఆ మహారథులు ఇద్దరూ తెలివి తెచ్చుకొని బాణరహితులై, అలసట – బద్దకం తొలగిపోయి క్షణకాలంలో లేచి కూర్చున్నారు. యుధిష్ఠిరా! అప్పుడు ఇక్ష్వాకునందనుడైన రాముడు స్వస్థుడై ఉండడంతో విభీషణుడు చేతులు జోడించి ఇలా అన్నాడు. "శత్రుదమనుడా! రాజరాజు కుబేరుని ఆజ్ఞపై గుహ్యకుడు

ఈ నీటిని తీసికొని శ్వేతపర్వతం నుండి నీసన్నిధికి వచ్చాడు. పరంతపా! అంతర్హితులైన ప్రాణులను దర్శించడానికి మహారాజు కుబేరుడు నీకు ఈ నీటిని ఇచ్చాడు. దీనితో కన్నులు తుడుచుకొని అదృశ్యంగా ఉన్న ప్రాణులను నీవు చూడగలవు. అంతేకాక ఎవరికి దీనిని ఇచ్చినా అతడు కూడా చూడగలడు. 'సరే' అని రాముడు అభిమంత్రించిన ఆ జలాన్ని తీసుకొని కన్నులను తుడుచుకొన్నాడు. మహామతియైన లక్ష్మణుడు కూడా అలాగే చేశాడు. ఇంకా సుగ్రీవుడు, జాంబవంతుడు, హనుమంతుడు, అంగదుడు, మైందుడు, ద్వివిదుడు, నీలుడు మొదలైన వానరప్రముఖులు ఇంచుమించు అందరూ ఆ నీటితో తమ కన్నులను కడుగుకొన్నారు. యుధిష్ఠిరా! అప్పుడు విభీషణుడు చెప్పినట్లుగానే జరిగింది. క్షణకాలంలోనే వారి కన్నులకు అతీంద్రియత్వం కలిగింది.

కార్యసాధకుడైన ఇంద్రజిత్తు తాను సాధించిన పనిని గూర్చి అప్పుడు తండ్రికి తెలిపి, త్వరితంగా సంగ్రామతలానికి తిరిగివచ్చాడు సంక్రుద్ధుడై యుద్ధం చేయాలనే ఉత్సుకతతో తిరిగి వస్తున్న ఇంద్రజిత్తును, విభీషణుని అభిప్రాయాన్ని అనుసరించి లక్ష్మణుడు ఎదుర్కొన్నాడు. నిత్యకర్మలు కూడా నెరవేర్చకుండా విజయోల్లాసంతో తిరిగివచ్చిన ఇంద్రజిత్తును స్మృతిలోకి వచ్చిన లక్ష్మణుడు మహాకోపంతో చంపాలనే కోరికతో బాణాలు వేశాడు. అప్పుడు పరస్పర విజయకాంక్షతో ఉన్న వారిద్దరి నడుమ ఇంద్ర ప్రహ్లాదులకు వలె మిక్కిలి చిత్రమైన ఆశ్చర్యకరమైన యుద్ధం జరిగింది. ఇంద్రజిత్తు మర్మభేదులైన తీక్ష్ణబాణాలతో సౌమిత్రిని గాయపరిచాడు. లక్ష్మణుడు కూడా ఇంద్రజిత్తును అగ్నిలా చురుక్కుమనిపించే బాణాలతో గాయపరిచాడు. లక్ష్మణుడు వేసిన బాణాలతాకిడికి క్రోధమూర్ఛితుడై ఇంద్రజిత్తు విషసర్పాలవంటి ఎనిమిది బాణాలను లక్ష్మణునిపై వేశాడు. లక్ష్మణుడు అగ్నిలా దహించివేసే మూడు బాణాలతో అతని ప్రాణాలను ఎలా హరించాడో అది చెపుతా విను. ఒక బాణంతో విల్లు పట్టుకొన్న బాహువును శరీరం నుండి వేరుచేశాడు. రెండవ బాణంతో బాణసహితమైన బాహువును నేలపాలు చేశాడు. వెడల్పయిన అంచు కలిగి ప్రకాశించే మూడవ బాణంతో చక్కని ముక్కు, మెరిసే కుండలాలు కల అతని శిరస్సును దేహం నుండి వేరుచేశాడు ఖండింపబడిన భుజస్కంధాలతో అతని మొండెం మిక్కిలి భయంకరంగా కనిపించింది లక్ష్మణుడు అతనిని చంపిన తరువాత సూతుని కూడా అస్త్రాలతో సంహరించాడు.

గుఱ్ఱాలు ఆ రథాన్ని ఈడ్చుకుంటూ లంకను ప్రవేశించాయి కొడుకు లేని ఆ రథాన్ని చూశాడు రావణుడు. కొడుకు చనిపోయాడని తెలుసుకొని భయంతో అతని మనస్సు దిగ్భ్రాంతి చెందింది శోకమోహాలతో ఆర్తుడైన రావణాసురుడు వైదేహిని చంపడానికి

పూనుకొన్నాడు. అశోకవనంలో రామదర్శనం కోసం ఆసక్తితో ఉన్న ఆమెవద్దకు ఆ దుష్టాత్ముడు కత్తిపట్టుకొని వేగంగా వచ్చిపడ్డాడు. దుర్బుద్ధి అయిన అతనియొక్క పాపపుటాలోచనను తెలుసుకొని మంత్రి అయిన అవింధ్యుడు క్రోధంతో ఉన్న అతనిని శాంతింపచేశాడు. ఏ యుక్తితో అతనిని శాంతింప చేశాడో విను. "రాక్షసరాజా! సముజ్జ్వలమైన లంకా మహారాజ్య పదవి యందున్న మీరు స్త్రీని చంపడానికి తగరు. ఎప్పుడయితే స్త్రీ బంధితురాలై మీ వశమయిందో అప్పుడే ఆమె మరణించింది. శరీరాన్ని ముక్కలు చేయడం వల్లనే ఈమె చనిపోదని నా ఉద్దేశ్యం. ఈమె భర్తనే చంపండి, భర్త చనిపోగానే ఈమె కూడా చనిపోతుంది. పరాక్రమంలో సాక్షాత్తు ఆ ఇంద్రుడు కూడా మీకు సాటి రాడు. ఎన్నోసార్లు మీరు యుద్ధంలో ఇంద్రునితో సహితంగా దేవతల నందరినీ భయభ్రాంతులను చేశారు". ఈ రీతిగా అవింధ్యుడు క్రుద్ధుడైన రావణాసురుని ఆ సమయంలో అనేకవిధాలుగా చెప్పి శాంతింపచేశాడు. అతడు కూడా ఆ మాటలను ఒప్పుకున్నాడు. ఆ నిశాచరుడు రావణుడు యుద్ధానికి బయలుదేరాలని సంకల్పించుకొని కత్తిని ఒరలోపెట్టి "నా రథం సిద్ధం చేయండి" అని ఆజ్ఞాపించాడు.

290. రామరావణుల యుద్ధము - రావణ వధ.

తన ప్రియపుత్రుడు చనిపోగా క్రుద్ధుడైన దశగ్రీవుడు సువర్ణరత్నాలతో అలంకరింపబడిన రథాన్ని ఎక్కి, లంకానగరం నుండి బయలుదేరాడు. వివిధాయుధాలను చేత ధరించిన భయంకరులైన రాక్షసులు అతని చుట్టూ ఉన్నారు. అతడు వానర యూథపతులతో యుద్ధం చేస్తూ రామునిపై వేగంగా కదిలాడు మహాక్రోధంతో వస్తున్న అతనిని మైందుడు, నీలుడు, నలుడు, అంగదుడు హనుమంతుడు, జాంబవంతుడు సైన్యసహితులై ముట్టడించారు. ఆ ఋక్ష వానరపుంగవులు రావణాసురుడు చూస్తూ ఉండగానే అతనిసైన్యాన్ని చెట్లతో విధ్వంసం చేయసాగారు. రాక్షసరాజయిన రావణుడు మాయావి కూడా. శత్రువులు తన సైన్యాన్ని వధించడం చూసి మాయను కల్పించాడు. అతని శరీరంనుండి వెలువడిన వందలు వేల రాక్షసులు బాణాలు, శక్తులు, ఋష్టులు చేత ధరించి కనిపించారు ఆ రాక్షసు లందరినీ రాముడు దివ్యాస్త్రంతో సంహరించాడు. అయినా ఆ రాక్షసాధిపుడు తిరిగి మాయను సృష్టించాడు రామలక్ష్మణుల యొక్క రూపాలను ధరించి రావణుడు రామలక్ష్మణులను ఎదిరించాడు. అనంతరం ఆ రాక్షసు లందరూ ధనుస్సులు దాల్చి రామలక్ష్మణులను బాధిస్తూ వారిపై విరుచుకుపడినారు. రాక్షసరాజు యొక్క ఆ మాయను చూచి లక్ష్మణుడు ఏమాత్రం చలించకుండా రామునితో గట్టిగా ఇలా అన్నాడు. 'మి

ప్రతిరూపాలను ధరించిన పాపాత్ములైన ఈ రాక్షసులను సంహరించు , ఇది విని రాముడు తన ప్రతిరూపాలైన వారిని ఇంకా ఇతర రాక్షసులను కూడా సంహరించాడు ఆ సమయంలో ఇంద్రసారధి అయిన మాతలి పచ్చని గుఱ్ఱాలు కట్టబడి సూర్యునిలా ప్రకాశిస్తున్న రథంతో యుద్ధభూమిలో రాముని వద్దకు వచ్చాడు. మాతలి అంటున్నాడు - ' పురుషశ్రేష్ఠా! రామా! ఆకు పచ్చని గుఱ్ఱాలతో విజయాన్ని సాధించే ఈ ఉత్తమమైన రథం ఇంద్రునిది. ఈ రథంతోనే ఇంద్రుడు యుద్ధంలో వందలకొద్దీ దైత్యదానవులను సంహరించాడు. కాబట్టి నరవరా! నేను నడిపే ఈ రథంతో యుద్ధంలో రావణుని వెంటనే చంపు. ఆలస్యం చేయకు" మాతలి ఇలా అనగానే రాఘవుడు అతని మాటలను "ఇది రాక్షసమాయ" అని శంకించాడు. కాని విభీషణుడు అతనితో - "నరోత్తమా! ఇది దుర్మార్గుడైన రావణుని మాయ కాదు మహాద్యుతీ! ఈ ఇంద్ర రథాన్ని శీఘ్రంగా అధిరోహించు" అన్నాడు. అంతట ప్రసన్నచిత్తుడై రాఘవుడు విభీషణునితో సరే అని చెప్పి, రథం ఎక్కి, రోషావిష్టుడైన దశగ్రీవుని ఎదిరించాడు. శ్రీరాముడు రావణుని ఎదుర్కొగానే ప్రాణులన్నీ "హాహా" కారాలు చేశాయి. స్వర్గంలో దేవతల సింహనాదాలు, భేరీనాదాలు హోరెత్తాయి. అప్పుడు దశగ్రీవునికి, శ్రీరామునికి మధ్యఘోరమైన యుద్ధం జరిగింది

లోకంలో పోల్చడానికి వీలు లేని యుద్ధం వారిమధ్య జరిగింది. నిశాచరుడైన రావణుడు ఇంద్రుని వజ్రాయుధంలా, ఎత్తబడిన బ్రహ్మదండంలా, భయంకరమైన శూలాన్ని విసిరాడు. కాని రాముడు వెంటనే దానిని వాడి బాణాలతో ఖండించి వేశాడు. దుష్కరమైన ఆ కార్యాన్ని చూచి రావణునికి మనసులో భయం కలిగింది. అయినా కుపితుడై వాడి బాణాలను కురిపించాడు. అప్పుడు రామునిపై భుశుండులు శూలాలు, ముసలాలు, గండ్రగొడ్డళ్లు, శక్తులు, వివిధాకృతులు కల శతఘ్నులు, వాడి ఆయిన బాణాలు ఇలా రకరకాల ఆయుధాలు వేలుగా లక్షలుగా కురిశాయి. రాక్షసుడైన దశగ్రీవునియొక్క ఆ వికృతమైన మాయను చూచి వానరు లందరూ భయంతో అన్నిదిక్కులకు పరుగులుతీశారు. అంతట రాముడు బంగారుపుంఖం, చక్కని ములికి మంచి పత్రం కల శ్రేష్ఠమైన బాణాన్ని అమ్ములపొది నుండి తీసి బ్రహ్మాస్త్రంతో అభిమంత్రించాడు అది చూచి ఇంద్రుడు మొదలైన దేవతలు, గంధర్వులు మిక్కిలి సంతోషించారు. తన శత్రువైన ఆ రాక్షసునిపై రాముడు బ్రహ్మాస్త్రాన్ని ఎక్కుపెట్టడం వలన అతని ఆయువు ఇక కొద్దిసేపు మాత్రమే అని వారంతా భావించారు. అనంతరం రాముడు ఎత్తబడిన బ్రహ్మదండంలా భయంకరంగా ఉన్న, సాటిలేని తేజస్సు కలిగి రావణుని అంతమొందించగల ఆ బాణాన్ని రావణునిపైకి

వదిలాడు. యుధిష్ఠిరా! రాముడు వింటిని బాగా లాగి బాణాన్ని వేయగానే రాక్షసశ్రేష్ఠుడైన రావణుడు ఆ బాణం తగిలి రథంతో, గుర్రాలతో, సారథితో చెలరేగుతున్న మంటలు గల అగ్ని చుట్టుముట్టి కాలిపోయాడు. సునాయాసంగా పనులు చేయగల రాముడు ఈ రీతిగా రావణుని సంహరించగానే గంధర్వులతో చారణులతో సహితంగా దేవతలందరూ మిక్కిలి సంతోషించారు. మహాభాగుడైన ఆ రావణుని పంచభూతాలు వదిలివేశాయి. బ్రహ్మాస్త్రం యొక్క ప్రభావం వలన అతడు అన్నిలోకాల నుండి భ్రష్టుడై పోయాడు. అతని శరీరంలోని ధాతువులు, మాంసం, రక్తం కూడా బ్రహ్మాస్త్రం చేత దగ్ధమై నశించిపోయాయి. చివరికి బూడిద కూడా కనపడలేదు.

291. శ్రీరామ పట్టాభిషేకము.

రాక్షసేంద్రు డయిన రావణుని చంపి రాముడు స్నేహితులతో, లక్ష్మణునితో కలిసి మిక్కిలి ఆనందించాడు దశగ్రీవుడు చనిపోగానే మహర్షి గణాలు ముందునడువగా దేవతలు ఆ మహాభుజుని జయవాచకాలతో కూడిన ఆశీస్సులతో స్తుతించసాగారు. స్వర్గంలో నివసించే సర్వదేవతలూ, గంధర్వులూ పుష్పవర్షం కురిపిస్తూ చక్కని వాక్కులతో కమలనయనుడైన ఆ శ్రీరాముని స్తోత్రం చేశారు. వారందరూ రాముని పూజించి వచ్చినవారు వచ్చినట్లే మరలిపోయారు. అచ్యుతా! ఆకాశమంతా ఆ మహోత్సవపరంభంలో నిండిపోయినట్లుంది. మహాయశస్వి అయిన శ్రీరాముడు దశగ్రీవుని సంహరించి, లంకను విభీషణునకు సమర్పించాడు. మిక్కిలి బుద్ధిమంతు డయిన వృద్ధామాత్యుడు ఆవింధ్యుడు సీతను ముందుంచుకొని విభీషణుడు ముందునడువగా లంకనుండి వెలుపలికి వచ్చాడు. మహాత్ముడు అయిన రామునితో వారు దీనత్వం ఉట్టిపడేలా – "మహాత్మా! సదాచారవతి జనకసుత అయిన దేవిని పరిగ్రహించండి" అన్నారు. ఆ మాటలు విని ఇక్ష్వాకునందనుడయిన రాముడు ఆ దివ్యరథాన్నుండి దిగి, కన్నీరు కారుస్తున్న సీతను చూశాడు. సీతాదేవి దుఃఖంతో కృశించిపోయి ఉంది. ఒడలంతా ధూళి ధూసరితమై ఉంది. జుట్టు జడలుకట్టి ఉంది. మాసిన వస్త్రాలు ధరించి ఉంది. పల్లకీలో ఉన్న సర్వాంగసుందరి అయిన అటువంటి సీతను చూచి. పరపురుషస్పర్శ కలిగి ఉండవచ్చునని శంకించిన రాముడు ఆ విదేహకుమారితో – "వైదేహీ! నీకు విముక్తి కలిగింది. వెళ్ళు. నా కర్తవ్యం నేను నిర్వహించాను. నావంటి భర్తను పొందిన నీవు ముసలితనం వచ్చేవరకు రాక్షసగృహంలో ఉండకూడదని నేను ఈ రాక్షసుని వధించాను. నిశ్చితమైన ధర్మాన్ని ఎరిగిన నావంటివాడు పరహస్తగతమైన స్త్రీని క్షణకాలం పాటైనా ఎలా స్వీకరించగలుగుతాడు? మైథిలీ ! నీవు సదాచారిణివి అయినా,

దురాచారిణివి అయినా గాని నేను ఇప్పుడు కుక్క నాకిన హవిస్సులాంటి నిన్ను అనుభవించడానికి ఇష్టపడను" అన్నాడు. దారుణమైన ఆ మాటలను విని, సీతాదేవి వ్యధతో వెంటనే నరకబడిన అరటిచెట్టులా కూలిపోయింది. నిశ్వాసం వలన అద్దంలోని ప్రతిబింబం మలినమైనట్లుగా హర్షం వలన కలిగిన ఆమె ముఖంలోని కాంతి క్షణకాలంలోనే తిరిగి నశించిపోయింది. రాముని యొక్క ఆ మాటలను విన్న వానరు లందరూ కూడా లక్ష్మణునితో సహితంగా ఆ సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారిలా నిశ్చేష్టులు అయిపోయారు.

అప్పుడు విశుద్ధమైన అంతఃకరణం కల పద్మగర్భుడు, సృష్టికర్త అయిన చతుర్ముఖబ్రహ్మ దేవుడు విమానంపై వచ్చి రాఘవునికి దర్శనమిచ్చాడు. ఇంద్రుడు, అగ్ని, వాయుదేవుడు, యముడు, వరుణుడు, కుబేరుడు, నిర్మలచిత్తులైన సప్తర్షులు కూడా (అక్కడికి వచ్చారు). హంసలతో కూడి ప్రకాశించే బహుమూల్యమైన రథాన్ని ఎక్కి దివ్యతేజోమూర్తి అయిన దశరథ మహారాజు కూడా అక్కడికి విచ్చేశాడు. దేవగంధర్వులతో నిండిపోయిన అంతరిక్షం అంతా నక్షత్రగణాలతో చిత్రితమైన శరత్కాలపు ఆకాశంలా భాసించింది. వారందరిమధ్య నిల్చుని యశస్వినీ అయిన సీత అప్పుడు విశాలవక్షు డయిన రామునితో ఇలా అంది. "రాజకుమారా! నేను నిన్ను తప్పు పట్టడం లేదు. స్త్రీల యొక్క, పురుషుల యొక్క నడత ఎలాంటిదో నీకు తెలుసు. అయినా నేను చెప్పే ఈ మాటలు విను. నిరంతరగమన శీలుడైన వాయుదేవుడు ప్రాణులందరిలోను తిరుగుతూ ఉంటాడు. నేను పాపం చేసినట్లయితే అతడు నా ప్రాణాలను విడిచిపెట్టు గాక! నేను పాపమే చేసినట్లయితే అగ్ని జలం, ఆకాశం, పృథివి వాయువు (పంచభూతములు) నా ప్రాణాలను వదిలివేయునుగాక! వీరుడా! ఎలాగైతే నేను నిన్ను తప్ప అన్యపురుషుని కలలో కూడా చింతించనో అలాగే దేవతలు నిర్దేశించిన నీవే నాకు పతివి కావాలి". అప్పుడు సమస్తలోకాలకు సాక్షి భూతమూ, వానరులందరికీ హర్షం కలిగించేది, పవిత్రమైన ఒక వాణి అంతరిక్షం నుండి వినబడింది

వాయుదేవుడు అన్నాడు - రఘునందనా! నేను సదాగతి అయిన వాయువును, సీత చెప్పినది సత్యం. రాజా! మైథిలి పాపం లేనిది నీవు నీ భార్యను కలుసుకో". అగ్నిదేవుడు చెప్పాడు - " రఘునందనా ! నేను ప్రాణులందరి శరీరాల లోపల ఉండే అగ్నిని ఈ మైథిలి అణుమాత్రమైనా అపరాధం చేయలేదు' వరుణదేవుడు చెపుతున్నాడు - "రాఘవా! ప్రాణుల దేహాలలో ఉండే రసాలన్నీ నా నుండి పుడుతున్నవే. నేను నీకు గట్టిగా చెపుతున్నాను - ఈ మైథిలిని స్వీకరించు.' అనంతరం బ్రహ్మదేవుడు పలుకసాగాడు

- 'వత్సా! రాజర్షి ధర్మాలను ఆచరించే నీ పట్ల ఇది ఆశ్చర్యకరమైన విషయం కాదు. సాధుపురుషా! సదాచారీ! కకుత్స్థ ! నా మాట విను. వీరుడా ! దేవగంధర్వ పన్నగయక్ష దానవులకు, మహర్షులకు కూడా శత్రువైన ఇతనిని నీవు సంహరించావు. పూర్వం నా అనుగ్రహం వల్లనే ఇతడు సర్వప్రాణులకూ అవధ్యు డయ్యాడు. ఏదో కారణంగా కొంతకాలం పాటు ఈ పాపాత్ముడు ఉపేక్షింపబడ్డాడు. తన చావు కోసమే ఈ దురాత్ముడు సీతను అపహరించాడు. నలకూబర శాపం ద్వారా నేను ఈమెకు రక్షణ కల్పించాను. పూర్వం రావణునికి ఈ శాపం కలిగింది. కోరికలేని పరస్త్రీని బలవంతంగా అనుభవించినట్లయితే నిశ్చయంగా అతని శిరసు నూరుముక్కలుగా విచ్చిపోతుంది. మహాద్యుతీ! ఈమె విషయంలో నీవు శంకించనక్కర లేదు. ఈమెను స్వీకరించు. దివ్య ప్రభామయుడా! నీవు దేవతల యొక్క మహత్కార్యాన్ని సాధించావు". దశరథుడు అంటున్నాడు - 'వత్సా! నేను నీ తండ్రి దశరథుడిని. నీ పట్ల ప్రీతుడనైనాను. నీకు శుభమగు గాక! పురుషోత్తమా! నేను అనుమతిస్తున్నాను. రాజ్యాన్ని కూడా ఏలుకో".

రాముడు అంటున్నాడు - "రాజేంద్రా! నీవు నా తండ్రివి అయినట్లయితే నీకు నేను నమస్కరిస్తున్నాను. నీ ఆజ్ఞను పాటించి అందమైన అయోధ్యాపురికి వెడతాను.'. మార్కండేయుడు ఇలా అన్నాడు - 'భరతశ్రేష్ఠా! ఎట్టని జీరలు గల కన్నులతో మనోహరుడైన ఆ రాముని ఉద్దేశించి తండ్రి అత్యంత హర్షంతో తిరిగి "మహాద్యుతీ! ఇప్పటికే పద్నాలుగు సంవత్సరాలు పూర్తి అయ్యాయి వెళ్లు. అయోధ్యను పాలించు" అని అన్నాడు. అనంతరం దేవతలందరికీ నమస్కరించి, సుహృదులు అభినందిస్తూండగా శచీదేవితో ఇంద్రుడు కూడినట్లుగా ఆ రాముడు భార్యను కలుసుకొన్నాడు. తరువాత రాముడు ఆ అవింధ్యునికి అభీష్ట వరం ఇచ్చాడు. రాక్షస స్త్రీ అయిన త్రిజటను కూడా ధనసన్మానాలతో సంతుష్టిపరచాడు. అంతా అయ్యాక ఇంద్రాది దేవతలను పురస్కరించుకొని బ్రహ్మదేవుడు ఆతనిని "కౌసల్యానందనా! ఇప్పుడు నీకు ఏ అభీష్టవరాలు ఇవ్వను?" అని అడిగాడు. తాను ధర్మమందు నిలకడగా ఉండాలని, శత్రువుల చేతిలో పరాజయం లేకుండా ఉండాలని, రాక్షసుల చేతులలో మరణించిన వానరులు జీవించాలని రాముడు కోరుకొన్నాడు. బ్రహ్మదేవుడు "తథాస్తు" అని పలుకగానే మహారాజా! ఆ వానరులందరూ లబ్ధచేతనులై లేచి నిలిచారు. మహాసౌభాగ్యవతి అయిన సీత కూడా హనుమంతునికి "నాయనా! శ్రీరాముని కీర్తితో సమంగా నీవు జీవించి ఉంటావు. హనుమంతా! నా అనుగ్రహం వలన నీకు సదా దివ్య భోగాలు లభిస్తాయి". అని వరం ఇచ్చింది ఆ వానరులు చూస్తు ఉండగానే ఇంద్రాది దేవతలు అందరూ అంతర్ధానమయ్యారు. జానకితో కూడి ఉన్న శ్రీరామచంద్రుని చూచి

మాతలి పరమప్రీతుడై స్నేహితులందరి మధ్య ఇలా అన్నాడు – ' సత్యపరాక్రముడా! దేవగంధర్వ యక్షమనుష్య అసుర నాగులందరి యొక్క దుఃఖాన్ని నీవు పోగొట్టావు. ఈ భూమి నిలిచినంత కాలం దేవాసురగంధర్వ యక్షరాక్షస పన్నగలోకాలన్నీ నీ కీర్తిని గానం చేస్తాయి. అని చెప్పి, రాముని అనుమతి తీసుకొని, అతనిని పూజించి, సూర్యతేజస్సు కల ఆ రథం మీదనే మాతలి స్వర్గానికి వెళ్లిపోయాడు.

అనంతరం జితేంద్రియుడైన శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో సుగ్రీవుడు మొదలైన సమస్త వానరులతో కలిసి లంక రక్షణకు ఏర్పాట్లు చేసి, విభీషణుడు మొదలైన ముఖ్యులైన అమాత్యులతో కూడి, సీతను ముందుంచుకొని, కామగమనం కలిగి ఆకాశంలో చరించే, ప్రకాశమానమైన పుష్పకవిమానాన్ని ఎక్కి తిరిగి సేతుమార్గం ద్వారానే సముద్రాన్ని దాటాడు. ఆ సముద్రతీరంలో ధర్మాత్ముడైన ఆ రాజు పూర్వం తాను ఎక్కడ శయనించాడో అక్కడే వానరులతో కలిసి విశ్రమించాడు. అక్కడ రాఘవుడు సమయోచితంగా వారందరినీ పిలిచి, సత్కరించి రత్నాలతో, సర్వవిధాలా సంతృప్తి పరచి వీడుకొలిపాడు వానరేంద్రులు, గోపుచ్ఛులు, ఋక్షేశ్వరులు అందరూ వెళ్లిపోయాక, సుగ్రీవసహితుడై రాముడు కిష్కింధకు బయలుదేరాడు. విభీషణుడు అనుసరించిరాగా, సుగ్రీవ సహితుడై శ్రీరాముడు పుష్పకవిమానం ఎక్కి వైదేహికి అరణ్య శోభను చూపిస్తూ కిష్కింధను చేరుకొన్నాడు అక్కడకు చేరి పని నెరవేర్చిన అంగదుని యువరాజుగా అభిషేకించాడు. అనంతరం వారితో లక్ష్మణునితో కలిసి, వచ్చిన దారినే తన నగరానికి బయలుదేరాడు రాష్ట్రపాలకుడైన శ్రీరాముడు అయోధ్యానగరాన్ని చేరుకొని భరతుని వద్దకు హనుమంతుని దూతగా పంపాడు. హనుమంతుడు భరతుని ఇంగితాన్ని గ్రహించి, అతనికి ప్రియవార్తను నివేదించి తిరిగి వచ్చాక రాముడు నందిగ్రామాన్ని చేరుకొన్నాడు.

అక్కడ అతడు – ధూళి ధూసరితమైన శరీరంతో, నార చీరలు ధరించి ఎదుట పాదుకలు ఉంచుకొని, దర్భాసనం మీద కూర్చుని ఉన్న భరతుని చూశాడు భరతుని, శత్రుఘ్నుని కలుసుకొని రాఘవుడు లక్ష్మణునితోపాటు ఆనందించాడు. అన్నగారిని కలుసుకొని భరతశత్రుఘ్నులు కూడా ఆనందించారు వైదేహిని చూచి ఇద్దరూ మిక్కిలి ఆనందాన్ని పొందారు. తిరిగివచ్చిన అతనికి భరతుడు తన వద్ద న్యాసంగా ఉంచబడిన రాజ్యాన్ని పరమసంతోషంతో సత్కారపూర్వకంగా అప్పగించాడు. అనంతరం విష్ణుదేవతాకమైన శ్రవణా నక్షత్రంలో పుణ్యదినాన వసిష్ఠవామదేవు లిద్దరూ కలిసి శూరుడైన శ్రీరామునికి రాజ్యాభిషేకం చేశారు. రాజ్యాభిషిక్తుడైన శ్రీరామచంద్రుడు సుహృజ్జనాలతో కూడిన సుగ్రీవుని, పులస్త్యనందనుడైన విభీషణుని ఇళ్లకు వెళ్లడానికి అనుమతించాడు వివిధభోగాలతో వారిద్దరినీ

సత్కరించాడు. వారుకూడా ప్రీతిచెంది సంతోషించారు. వారికి ఇతికర్తవ్యాన్ని బోధించి అతిదుఃఖంతో వీడ్కోలిచ్చాడు. రఘునందను డైన శ్రీరాముడు పుష్పకవిమానాన్ని ఆర్చించి ప్రీతితో కుబేరునికి తిరిగి పంపాడు. దేవర్షిసహితుడై గోమతీ నదీ తీరంలో శ్రీరామచంద్రుడు అన్నాన్ని కోరివచ్చిన యాచకులకు ఆటంకం లేని రీతిగా స్తుతియోగ్యమైన, పది అశ్వమేధ యజ్ఞాలను చేశాడు.

292. మార్కండేయుడు యుధిష్ఠిరుని ఓదార్చుట.

మార్కండేయుడు చెపుతున్నాడు – యుధిష్ఠిరా! ఈ రీతిగా పూర్వం శ్రీరాముడు వనవాసం చేసి భయంకరమైన ఇటువంటి కష్టాలను పొందాడు శత్రుసంతాపకుడవైన పురుషోత్తమా! నీవు క్షత్రియుడవు. శోకించకు బాహుబలంమీద ఆధారపడిన అభీష్టఫలంతో నిశ్చితమైన మార్గంలోనే నీవు పయనిస్తున్నావు. (శ్రీరామునితో పోలిస్తే) నీకష్టం అణుమాత్రం కూడా కాదు. ఇంద్రాది దేవతలు, అసురులు కూడా క్షత్రియధర్మాన్ని పాటించే .ఈ మార్గంలోనే నడుస్తారు. వజ్రపాణి అయిన ఇంద్రుడు మరుద్గణాలతో కలిసి వృత్రాసురుని, దుర్ధర్షుడైన నముచిదానవుని, రాక్షసి అయిన దీర్ఘజిహ్వాను సంహరించాడు. సహాయసంపన్నుడికి ఈలోకంలో సమస్త ప్రయోజనాలు సమకూరుతాయి. ఇక ధనంజయునివంటి సోదరుడు ఉన్నవానికి యుద్ధంలో పరాజయం ఎక్కడిది? భీమపరాక్రముడైన ఈ భీముడు బలవంతులలో శ్రేష్ఠుడు, మాద్రీసుతులు నకులసహదేవులు యువకులు మహా ధనుర్ధరులు, వీరులు. ఇటువంటి సహాయకులను పొంది కూడా ఎందుకు విచారిస్తున్నావు ? వీరు మరుద్గణాలతో కూడిన ఇంద్రుని సైన్యాన్ని కూడా జయించగలరు. దేవరూపులయిన ఈ నీ తమ్ముళ్ల సహాయంతో సమస్త శత్రువులను నీవు యుద్ధంలో జయించగలవు. ఇదిగో ఇటు చూడు ఈ ద్రౌపదిని, దురాత్ముడైన సైంధవుడు బలగర్వంతో బలవంతంగా ఈమెను అపహరించాడు. అయినా ఈ మహాత్ములు అతిదుష్కర మయిన పనిని చేసి ద్రుపదుని కూతు రయిన కృష్ణను తీసుకొనివచ్చారు. జయద్రథుని ఓడించి నీకు అప్పగించారు. ఎటువంటి మానవ సహాయం లేకుండానే రాముడు భయంకరపరాక్రమం కలిగిన రాక్షసుడైన దశగ్రీవుని యుద్ధంలో చంపి వైదేహిని తిరిగి తీసికొని వచ్చాడు. రాజా! ఇతర జాతులకు చెందిన కోతులు, లాంగూలాలు, ఎలుగుబంట్లు అతనికి మిత్రులు సహాయకులు, (నీకయితే నీ నలుగురు సోదరులున్నారు). ఈ విషయాన్ని బుద్ధిపెట్టి ఆలోచించు. కాబట్టి కురుశ్రేష్ఠా! ఇటువంటి నీవు శోకించకు. పరంతపా నీవంటి మహాత్ములు శోకించరు.' ఈ రీతిగా మార్కండేయుడు ఊరడించాడు. బుద్ధిమంతుడయిన యుధిష్ఠిరమహారాజు దుఃఖం దైన్యం

విడిచి మళ్లీ అతనితో ఇలా అన్నాడు.

293. సావిత్రి జననము - వరాన్వేషణము.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. మహామునీ! నాగురించి బాధపడటం లేదు. నా సోదరుల గురించి కానీ, రాజ్యాపహరణాన్ని గురించి కానీ బాధపడటం లేదు. ద్రౌపదిని గురించియే బాధపడుతున్నాను. జూదంలో ఆ దుర్మార్గులు మమ్ము బాధించారు. ద్రౌపదిద్వారా బయట పడ్డాం. కానీ మరలా ఈ అరణ్యంలో సైంధవుడు బలవంతంగా ద్రౌపదిని అపహరించాడు. మహా పతివ్రత అయిన ద్రౌపది వంటి సీమంతినిని ఎప్పుడైనా చూశావా? కనీసం విన్నావా?' మార్కండేయు డిలా అన్నాడు రాజా! యుధిష్ఠిరా! కులకాంతల సౌభాగ్యాన్ని గురించి విను సావిత్రి అనే రాజకుమారి ఆ భాగ్యాన్ని పూర్తిగా పొందగలిగింది. మద్రదేశంలో పరమధార్మికుడు ధర్మాత్ముడైన ఒక రాజుండేవాడు. ఆయన బ్రాహ్మణభక్తుడు, మహాత్ముడు సత్యసంధుడు, జితేంద్రియుడు కూడా. ఆ రాజు యజమాని. దానపతి. సమర్థుడు. నగరవాసులకు గ్రామీణులకు నచ్చినవాడు. సర్వప్రాణులహితాన్ని కోరేవాడు. పేరు అశ్వపతి. ఆ అశ్వపతి సహనశీలుడు, సత్యవాది జితేంద్రియుడు. కానీ సంతానం లేనివాడు. వయస్సు గడిచిపోతున్నకొద్దీ బాధపడసాగాడు. సంతానాన్ని పొందటానికి తీవ్రనియామాలను స్వీకరించాడు. నియమిత వేళలో స్వల్పంగా ఆహారాన్ని స్వీకరిస్తూ, జితేంద్రియుడై బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నాడు ఆ రాజశ్రేష్ఠుడు రోజూ లక్ష గాయత్రిహోమం చేస్తూ రోజులోని ఆరవభాగంలో మితంగా భోజనం చేస్తుండేవాడు ఈ నియమంతో పద్దెనిమిది సంవత్సరాలు గడిపాడు. పద్దెనిమిదవ సంవత్సరం పూర్తి అయిన తరువాత సావిత్రి సంతోషించింది. ఆ సావిత్రి దివ్యరూపాన్ని ధరించి, అగ్నిహోత్రం నుండి ఆవిర్భవించి, పరమానందపడుతూ ఆ రాజునకు దర్శనమిచ్చింది రాజా! వరదాయిని అయిన ఆమె నియమవంతుడైన అశ్వపతితో ఇలా అంది. 'రాజా! పవిత్రమైన నీ బ్రహ్మచర్యంతో, యమనియమాలతో పరిపూర్ణమయిన భక్తితో ఆనందించాను. అశ్వపతీ! ఇష్టమయిన వరం కోరుకో. ధర్మనిర్వహణలో ఎప్పుడూ ఎటువంటి పొరపాటు చేయగూడదు'

అశ్వపతి ఇలా అన్నాడు 'దేవీ! ధర్మాచరణకై సంతానాన్ని పొందాలని ఈ హోమాన్ని ప్రారంభించాను. వంశవర్ధనులయిన కొడుకులు చాలామంది నాకు కావాలి. దేవీ! నీవు ప్రసన్నురాలవయితే నేనీవరాన్ని కోరుతున్నాను. సంతానాన్ని పొందటమే పరమధర్మమని బ్రాహ్మణులు నాకు చెప్పారు. సావిత్రీదేవి ఇలా అన్నది 'రాజా! నేను ముందే నీ అభిప్రాయాన్ని గ్రహించి, పుత్రులకొరకై బ్రహ్మకు నివేదించాను. ఆ బ్రహ్మదేవుని అనుగ్రహం

వలన నీకు త్వరలోనే ఈ లోకంలో తేజస్విని అయిన కూతురు పుడుతుంది. ఈ విషయాలు నీవు ఇంక ఏమీ మాటాడకూడదు. బ్రహ్మదేవుని నిర్దేశంతో తృప్తిపడి నేనీమాట చెప్తున్నాను. సావిత్రి మాటను 'అలాగే' అని అంగీకరించాడు అశ్వపతి. 'ఇది త్వరలోనే నెరవేరుతుంది' అని ఆమెను ప్రసన్నురాలిని చేసికొన్నాడు. సావిత్రి అదృశ్యం కాగానే ఆ రాజు తన నగరానికి వెళ్ళిపోయాడు. వీరుడై ధర్మబద్ధంగా ప్రజాపాలన చేస్తూ రాజ్యంలో ఉన్నాడు. కొంతకాలం గడచిన తర్వాత నియతవ్రతుడైన ఆ రాజు ధర్మచారిణి అయిన తన పెద్దభార్యకు గర్భాధానం చేశాడు. అశ్వపతి భార్య మాలవదేశీయురాలు. ఆమె గర్భం ఆకాశంలో శుక్లపక్షచంద్రునివలె దినదిన ప్రవర్ధమానమయింది. నెలలు నిండగానే మాలవి పద్మాలవంటి కన్నులు గల అమ్మాయిని కన్నది. ఆనందించిన ఆ రాజన్యుడు ఆ బిడ్డకు జాతకర్మాది సంస్కారాలు జరిపించాడు. గాయత్రీ మంత్రహోమం చేసినందువలననే ప్రసన్నురా లయిన సావిత్రి వరప్రసాదం కాబట్టి తండ్రి ఆ బిడ్డకు సావిత్రి అని పేరుపెట్టాడు.

ఆ రాజకుమారి రూపుదాల్చిన లక్ష్మివలె వర్ధిల్లింది. కాలం గడిచి ఆమె యుక్తవయస్సు రాలయింది. చక్కని నడుము, బలిసిన నితంబాలు కలిగి బంగారు బొమ్మవలె కనిపిస్తున్న ఆమెను చూచి జనులు దేవకన్యయే సావిత్రిగా వచ్చినట్టు భావించారు. తామరరేకులవలె విశాలమయిన కన్నులు కలిగి, తేజస్సుతో మండుతున్నట్లున్న ఆమెను ఎవ్వరూ వరించలేదు. ఆమె తేజస్సే వారిని నివారించింది. ఒక పర్వదినాన ఆమె శిరఃస్నానం చేసి, గాయత్రీ దర్శనానికి వెళ్ళి, శాస్త్రోక్తంగా అగ్నికి ఆహుతులు ఇచ్చి బ్రాహ్మణులచే స్వస్తివచనాలు పలికించింది. ఆ తరువాత శేషకుసుమాలను ప్రసాదంగా స్వీకరించి రూపుదాల్చిన లక్ష్మీదేవివలె ఆమె మహాత్ము డయిన తన తండ్రి దగ్గరకు వెళ్ళింది. ఆ సుందరి ముందుగా శేషకుసుమాలను తండ్రి కిచ్చి ఆయన పాదాలకు నమస్కరించి, చేతులు జోడించి, ఆ రాజు ప్రక్కన నిలిచింది. యౌవనంలో ఉండి దేవతా స్త్రీవలె ప్రకాశిస్తున్న కూతురును చూచి, ఆమె నెవ్వరూ వరించటంలేదన్న విషయాన్ని తలచుకొని తండ్రి దుఃఖించాడు.

రాజు ఇలా అన్నాడు. 'పుత్రీ ! నీకిది వివాహకాలం. కానీ నన్నెవ్వరూ అడగటం లేదు. నీ గుణాలకు సరిపోయే భర్తను నీవు స్వయంగా వెతుక్కో. నీకు నచ్చిన వానిని గురించి నాకు చెప్పు. నేను పరిశీలించి కన్యాదానం చేస్తాను. నీ ఇష్టం వచ్చిన వానిని వరించు. బ్రాహ్మణులు ధర్మశాస్త్రంలో చెప్పిన మాటలు చెప్పగా నేను విన్నాను. కళ్యాణి! నీకు కూడా చెప్తాను. విను. కూతురుకు పెండ్లి చేయని తండ్రి నిందింపదగినవాడు కాలంలో భార్యను సమీపించని భర్త నిందింపదగినవాడు. భర్త మరణించిన తల్లిని

రక్షించని కొడుకు నిందింపదగినవాడు. ఈ నామాట విని త్వరగా భర్తను వెతుక్కో. దేవతల దృష్టిలో నేను దోషిని కాకుండేటట్లు ప్రవర్తించు.' మార్కండేయుడిలా అన్నాడు. కూతురుతో ఆ రీతిగా పలికి "యాత్రకు తగిన ఏర్పాటు చేసి మీరు కూడా ఆమెతో వెళ్ళండి" అని వృద్ధమంత్రులను ఆదేశించాడు. అభిమానవతి అయిన ఆమె కొంత సిగ్గుపడి, తండ్రి పాదాలకు నమస్కరించి, తండ్రి మాటను పాటిస్తూ నిశ్చింతగా బయలుదేరింది. వృద్ధమంత్రులు చుట్టు నిలువగా ఆమె బంగారు రథాన్ని ఎక్కి, రాజర్షులు నివసించే రమణీయ తపోవనాల వైపు ప్రయాణించింది. నాయనా! మాన్య లయిన అక్కడి పెద్దలకు పాదాభివందనాలు చేస్తూ క్రమంగా తపోవనాలన్నింటికి వెళ్ళింది. ఈరీతిగా ఆ రాజకుమారి సర్వతీర్థాలలోనూ బ్రాహ్మణశ్రేష్ఠులకు ధనదానం చేస్తూ ఆయా ప్రదేశాలు అన్నీ తిరిగింది.

294. సత్యవంతుని వివాహమాడవలెనని సావిత్రి నిశ్చయించుట.

ఒకసారి మద్రరాజైన అశ్వపతి సభాసీనుడై ఉండగా నారదుడు వచ్చాడు వారు సంభాషిస్తున్న సమయంలో... సావిత్రి సర్వతీర్థాలను, సకలాశ్రమాలను తిరిగి మంత్రులతో కలిసి ఇంటికి వచ్చింది. నారదునితో కలిసి కూర్చున్న తండ్రిని చూసి ఆ శుభాంగి ఇరువురి పాదాలకు శిరసువంచి, నమస్కరించింది. నారదుడిలా అన్నాడు. 'రాజా! నీ కుమార్తె ఎక్కడకు వెళ్ళింది? ఎక్కడ నుండి వస్తోంది. యుక్తవయస్సులో ఉన్న ఈమెకు పెండ్లి ఎందుకు జరిపించటం లేదు?' అశ్వపతి ఇలా అన్నాడు. 'దేవర్షీ! ఆ పనిమీదనే వెళ్ళి ఈ రోజే వచ్చింది. ఆమె వరించిన భర్తను గురించి వినండి. 'వివరంగా చెప్పమ్మా' అని అశ్వపతి ఆదేశించగా ఆ శుభాంగి అప్పుడే ఆయనమాటను శిరసావహించి ఇలా అన్నది. శాల్వదేశంలో ద్యుమత్సేనుడనే ధర్మాత్ముడు, క్షత్రియుడు రాజ్యం చేస్తూండేవాడు. తర్వాత ఆయన అంధు డయ్యాడు. ఆయన ధీమంతుడే కానీ గ్రుడ్డివాడు కొడుకు బాలుడు. ఈ విపత్సమయంలో గతవైరాన్ని మనస్సులో నుంచుకొని పొరుగురాజు ఆయన రాజ్యాన్ని అపహరించాడు. ఆ ద్యుమత్సేనుడు చిన్నబిడ్డతో, భార్యతో కలిసి వనవాసానికి వెళ్ళిపోయాడు. తీవ్రవ్రతుడైన ఆయన అరణ్యానికి వెళ్ళికూడా తపస్సు చేశాడు. ఆయన కొడుకు నగరంలో పుట్టి, తపోవనంలో పెరిగాడు పేరు సత్యవంతుడు. ఆయన నాకు తగిన భర్త అని మనసా వరించాను. నారదుడిలా అన్నాడు. అయ్యో! పాపం రాజా! సావిత్రి ఎంత పని చేసింది విషయం తెలియక గుణవంతుడని సత్యవంతుని వరించింది. అతని తండ్రి సత్యమే పలుకుతాడు తల్లి సత్యమే మాటాడుతుంది ఆ రీతిగా

బ్రాహ్మణులు అతనికి సత్యవంతు డని పేరు పెట్టారు. ఆ బాలునకు గుర్రాలంటే ఇష్టం. మట్టితో గుర్రాలబొమ్మలు చేస్తుంటాడు. గుర్రాల బొమ్మలు వేస్తుంటాడు. అందుకే అతనిని చిత్రాశ్వ డని కూడా అంటారు.

రాజు ఇలా అన్నాడు అయితే రాజుకొడుకు తేజస్వి, బుద్ధిమంతుడు, సహనశీలుడు, శూరుడు, సత్యవంతుడు, పితృవత్సలుడు కాదా? నారదుడిలా అన్నాడు. సూర్యునివలె తేజస్వి. బుద్ధిలో బృహస్పతి. మహేంద్రుని వంటి వీరుడు. భూమివలె సహనశీలి. అశ్వపతి ఇలా అన్నాడు. రాజకొడుకైన ఆ సత్యవంతుడు దాతయేనా? బ్రహ్మణభక్తి గలవాడేనా? రూపవంతుడేనా? ఉదారుడేనా? అందగాడేనా?' నారదుడిలా అన్నాడు. శక్తిననుసరించి దానంచేయటంలో సంకృతి కొడుకైన రంతిదేవుడితో సమానం. ఉశీనరసుతుడైన శిబివలె బ్రాహ్మణ భక్తుడు, సత్యవాది కూడా. యయాతివలె ఉదారుడు. చంద్రునివలె చూడముచ్చటైనవాడు. బలవంతుడైన ఆ సత్యవంతుడు రూపంలో మరొక అశ్వినీ దేవత. అతడు జితేంద్రియుడు. మృదుస్వభావుడు. శూరుడు. సత్యస్వరూపుడు. నియతేంద్రియుడు స్నేహశీలి. అసూయలేనివాడు. బిడియపడేవాడు. తేజస్వి. శీలవృద్ధులు, తపోవృద్ధులు సత్యవంతుని గురించి సంక్షిప్తంగా ఇలా చెపుతారు. సత్యవంతుడు ఎప్పుడూ ఋజువర్తనుడు. ఆ గుణంలో నిశ్చలంగా నిలిచేవాడు. అశ్వపతి ఇలా అన్నాడు. స్వామీ! సత్యవంతుని గుణాలన న్నింటినీ చెప్తున్నారు. దోషాలు కూడా ఏమైనా ఉంటే చెప్పండి ' 'అతనిలో ఒకే దోషముంది. గుణాలనన్నిటినీ కొట్టివేయగలది. ప్రయత్నించినా కూడా ఆ దోషాన్ని తొలగించలేము. అతనిలో ఒకటే దోషం. మరేమీ లేదు. నేటినుండి సంవత్సరం లోపు ఆయువు తీరి అతడు మరణిస్తాడు.' రాజు ఇలా అన్నాడు. 'కళ్యాణీ! సావిత్రి! రా! వెళ్ళి మరొక వరుణ్ణి వెతుక్కో. అతనిలోని ఆ ఒక్క దోషం పెద్దది గుణాలనన్నిటినీ మించిపోతోంది. పూజ్యుడయిన నారదుడు 'ఆ సత్యవంతుడు సంవత్సరంలో మరణిస్తా'డని చెప్తున్నాడు కదా

సావిత్రి ఇలా అన్నది. 'ఒక్కసారే పంచుకొంటారు. ఒక్కసారే కన్యాదానం చేస్తారు. 'దానం చేస్తాను' అని దాత ఒక్కసారి చెపితే చాలు ఈ మూడూ ఒక్కొక్కసారే జరగాలి. సత్యవంతుడు దీర్ఘాయు వయినా, అల్పాయు వయినా, గుణవంతు డయినా, గుణహీనుడైనా నేను భర్తగా వరించాను ఒకసారి వరించిన తర్వాత మరొకరిని నేను వరించను. మనస్సులో నిశ్చయించుకొని మాట చెప్పి తర్వాత క్రియారూపంలో పెడతాము. నాకు నా మనస్సే ప్రమాణం.' నారదుడిలా అన్నాడు. 'నరోత్తమా! నీ కుమార్తె సావిత్రి నిశ్చలబుద్ధి గలది ఈ ధర్మమార్గం నుండి ఈమెను ఏరీతిగానూ వారించలేము సత్యవంతునిలో ఉన్న

గుణాలు మరే పురుషునిలోనూ లేవు. కాబట్టి నీ కుమార్తె నతనికివ్వటమే నాకు మంచిదనిపిస్తోంది. రాజు ఇలా అన్నాడు. స్వామీ! మీ మాట యధార్థం. జవదాటరానిది. ఆ విధంగానే చేస్తాను. నాకు మీరే గురువు కదా! నారదుడిలా అన్నాడు. నీ కుమార్తెను సత్యవంతునికిచ్చి వివాహం చేయటం నిర్విఘ్నంగా జరుగును గాక. నేను వెళ్ళివస్తాను. మీకందరికీ మేలు జరుగుతుంది.' ఆ రీతిగా పలికి, లేచి, నారదుడు స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు. రాజు కూడా కుమార్తె వివాహానికి ఏర్పాట్లు చేయసాగాడు.

295. సావిత్రీ సత్యవంతుల పరిణయము.

మార్కండేయుడిలా అన్నాడు. 'ఆ తరువాత కన్యాప్రదాన విషయంలో నారదుడు చెప్పినదాన్ని గూర్చి ఆలోచిస్తూ అశ్వపతిరాజు వివాహసామగ్రిని సమకూర్చాడు. ఆ తరువాత వృద్ధులను, బ్రాహ్మణులను, ఋత్విజులను, పురోహితులను పిలిపించి, శుభదినాన కుమార్తెతో కూడా బయలుదేరాడు. ఆ అశ్వపతి మేధ్యారణ్యానికి పోయి, కాలినడకతో ద్యుమత్సేనాశ్రమాన్ని సమీపించి, బ్రాహ్మణులతో సహా ద్యుమత్సేనుని కలిశాడు. అక్కడ శాలవృక్షం క్రింద దర్భాసనంపై కూర్చొనియున్న ఆ మహానుభావుని ద్యుమత్సేనుని చూశాడు. ఆయన అంధుడు. అశ్వపతి రాజర్షి అయిన ద్యుమత్సేనుని తగినరీతిగా అర్చించి, జాగ్రత్తగా మాటాడుతూ తనను తాను పరిచయం చేసికొన్నాడు. ధర్మవేత్త అయిన ద్యుమత్సేనుడు అశ్వపతికి అర్ఘ్యాన్నీ, ఆసనాన్నీ, గోవును నివేదించి 'తమరాకకు కారణ మేమిటి?" అని అడిగాడు. అప్పుడు అశ్వపతి సత్యవంతుని గూర్చిన తన అభిప్రాయాన్నీ, ఏది ఎలా చేయాలన్న విషయాన్ని పూర్తిగా నివేదించాడు. అశ్వపతి ఇలా అన్నాడు. 'రాజర్షీ! అందమైన ఈ అమ్మాయి నా కుమార్తె. పేరు సావిత్రి. ధర్మజ్ఞా! ఈమెను ధర్మబద్ధంగా నీవు కోడలుగా స్వీకరించాలి.' ద్యుమత్సేను డిలా అన్నాడు. 'రాజ్యాన్ని కోల్పోయి మేము వనవాసం చేస్తున్నాం. యమనియమాలతో తపోధర్మాన్ని పాటిస్తున్నాం. నీ కుమార్తె ఈ కష్టాలు ఎలా సహిస్తుంది? వనవాసానికి ఆమె తగదు.' అశ్వపతి ఇలా అన్నాడు. 'రాజా! సుఖదుఃఖాలు వస్తుంటాయి, పోతుంటాయి. ఈ విషయం నాకూ, నా కుమార్తెకూ తెలుసు. నావంటి వారితో ఇటువంటి మాట లనకూడదు. నేను నిశ్చయం చేసికొనియే వచ్చాను. సుహృద్భావంతో నీ శరణుకోరి వచ్చాను. నాకు ఆశాభంగం కలిగించవద్దు. ప్రేమపూర్వకంగా నీ దగ్గరకు వచ్చిన నన్ను తిరస్కరించవద్దు. నాకు నీవు తగినవాడవు. నేను నీకు తగినవాడను. సజ్జనుడైన సత్యవంతునకు భార్యగా నీకోడలుగా నా కూతురును స్వీకరించు.' ద్యుమత్సేనుడిలా అన్నాడు. నేను మీ సంబంధాన్ని ఇంతకు ముందే కోరుకొన్నాను.

కానీ ఇప్పుడు రాజ్యాన్ని కోల్పోయాను కాబట్టి ఈ రీతిగా ఆలోచిస్తున్నాను. నేను గతంలోనే ఆకాంక్షించిన నా అభిప్రాయం నేడు జరుగుతోంది. అలాగే కానీ ! నీవు నేను కోరుకొన్న అతిథివి.' ఆ తర్వాత ఆ రాజులిద్దరూ ఆశ్రమవాసులయిన బ్రాహ్మణులను అందరినీ పిలిపించి, యథావిధిగా వివాహాన్ని జరిపించారు.

అశ్వపతి తగినరీతిగా నూత్నవస్త్రాలతో కన్యాదానం చేసి పరమానందంతో తన నివాసానికి వెళ్ళిపోయాడు. సర్వగుణసమన్విత అయిన సావిత్రిని భార్యగా పొంది సత్యవంతుడు సంతోషించాడు. తాను కోరుకొన్న భర్త లభించినందున సావిత్రి కూడా సంతోషించింది. తండ్రి నిష్క్రమించగానే సావిత్రి నగల నన్నింటినీ విడిచి నారచీరలను, కాషాయవస్త్రాలను ధరించ నారంభించింది ఆమె తన సేవలతో అందరికీ నచ్చినట్లు పనిచేయటంతో అందరికీ ఆనందాన్ని కల్గించింది. శారీరకసేవలతో, వస్త్రాభరణాలను కట్టబెట్టడంతో అత్తనూ, మాటలను నియంత్రించుకొనటంతో, దేవసత్కారాలతో మామను ఆనందింపజేసింది. అట్లే ప్రియంగా మాటాడటంతో, నేర్పుతో, ఓర్పుతో ఏకాంతంలో ఉపచర్యలు చేయటంతో భర్తను సంతోషపెట్టింది. భారతా! ఆ సజ్జనులు ఆ రీతిగా ఆ ఆశ్రమంలో నివసిస్తూ తపస్సు కొనసాగిస్తుండగా కొంతకాలం గడిచింది. సావిత్రి మాత్రం రోజు రోజుకూ విషాదానికి లోనవుతోంది. పగలు, రేయి కూడా నిలిచినా, నిదురించినా నారదుడు చెప్పిన మాటయే మనస్సులో మెదులుతోంది.

296. అత్తమామల అమమతితో సావిత్రి సత్యవంతునితో కలిసి వనమున కేగుట.

మార్కండేయుడిలా అన్నాడు. రాజా! ఇలా చాలారోజులు గడిచిన తర్వాత సత్యవంతుడు మరణించవలసిన రోజు రానే వచ్చింది. గడచిన ప్రతిదినాన్ని సావిత్రి లెక్కపెడుతూనే ఉంది. నారదుడు చెప్పిన మాట ఎల్లప్పుడు ఆమె మనస్సులో మెదులుతోంది. సత్యవంతుడు ఇక నాలుగురోజులలో మరణిస్తాడని భావించి, సావిత్రి త్రిరాత్రవ్రతాన్ని స్వీకరించి పగలు రేయి వ్రతదీక్షలోనే నిలిచింది. సావిత్రి వ్రతదీక్షను గురించి విని ద్యుమత్సేనుడు ఎంతో బాధపడ్డాడు. ఆమెను ఓదారుస్తూ ఆమెతో ఇలా అన్నాడు. 'రాజకుమారీ! నీవు చాలా తీవ్రమయిన వ్రతాన్ని ప్రారంభించావు. మూడురోజులు ఉపవాసదీక్ష చాలా కష్టం.' సావిత్రి ఇలా అన్నది. 'నాయనా! బాధపడనవసరం లేదు. వ్రతాన్ని పూర్తి చేస్తాను. దృఢనిర్ణయమే వ్రతానికి అవసరం. ఆ నిర్ణయంతోనే నేను వ్రతాన్ని చేస్తున్నాను.' ద్యుమత్సేనుడిలా అన్నాడు. 'వ్రతాన్ని భంగం చేసుకొమ్మని ఏ రీతిగాను నేను చెప్పలేను.

నా వంటివాడు వ్రతాన్ని పూర్తి చేసుకో అని మాత్రమే చెప్పగలడు.' మహామనస్వి అయిన ద్యుమత్సేనుడు ఆ మాట చెప్పి ముగించాడు. సావిత్రి కట్టెలాగా ఒకచోట నిలిచిపోయింది. మరునాడే భర్తమరణం సంభవించబోతోందన్న దుఃఖంలో ఉన్న సావిత్రికి ఉన్నపాటుగా ఆ రాత్రి గడచిపోయింది. మరునాడు నేడే ఆ రోజని తలచి సూర్యుడు పూర్తిగా ఉదయించకముందే పూర్వాహ్ణంలో చేయవలసిన పనులన్నీ ముగించి అగ్ని ప్రజ్వలింపజేసి ఆహుతుల నిచ్చింది. ఆ తరువాత సమస్తబ్రాహ్మణులకు, వృద్ధులకు, అత్తకు, మామకు యథాక్రమంగా నమస్కరించి నియమపూర్వకంగా చేతులు జోడించి నిలిచింది. ఆశ్రమవాసులయిన తాపసు లందరూ సుమంగళీత్వాన్ని ఆశిస్తూ, హితాన్నీ శుభాన్నీ కోరుతూ సావిత్రిని ఆశీర్వదించారు. ధ్యానయోగంలో నిలిచి ఉన్న సావిత్రి తాపసుల ఆశీర్వచనాలను "అలాగే జరగాలి" అనుకొంటూ మనసా స్వీకరించింది. రాజకుమారి – సావిత్రి భర్త మరణించబోయే సమయానికీ, ముహూర్తానికీ ఎదురుచూస్తూ నారదుని మాటలను తలచుకొంటూ తీవ్రవేదనకు గురి అయింది. ఆపై అత్తమామలు ఎకాంతంగా ఉన్న సావిత్రితో ప్రీతితో ఇలా అన్నారు. 'శాస్త్రనిర్దేశాన్ని అనుసరించి నీవు తలపెట్టిన వ్రతాన్ని ముగించావు. పారణకు వేళ అయినది. అనంతర కర్తవ్యం కొనసాగించు.' సావిత్రి ఇలా అన్నది. 'సూర్యు డస్తమిస్తే నా కోరిక తీరుతుంది. అప్పుడే భుజిస్తాను. ఇది నా మనస్సంకల్పం. అలా జరగాలనే ప్రతిజ్ఞ పూనాను. భోజనాన్ని గురించి సావిత్రి అలా మాటాడుతున్నప్పుడే సత్యవంతుడు భుజాన గొడ్డలి పెట్టుకొని వనానికి బయలుదేరాడు.' సావిత్రి భర్తతో ఇలా అన్నది. 'నీవు ఒంటరిగా పోవద్దు. నేను కూడా నీతో వస్తాను. నిన్ను వదలి ఉండాలనిపించటం లేదు.' సత్యవంతుడిలా అన్నాడు. 'నీవెప్పుడూ అరణ్యానికి రాలేదు. దారిలో ఇబ్బందు లుంటాయి. వ్రతోపవాసాలతో చిక్కి ఉన్నావు. ఎలా నడవగలవు' సావిత్రి ఇలా అన్నది. 'ఉపవాసంతో నేను బలహీనపడలేదు. అలసిపోలేదు కూడా. రావాలని ఉత్సాహపడుతున్న నన్ను నిషేధించదగదు.' సత్యవంతుడిలా అన్నాడు. 'నీకు రావాలని అంతముచ్చటగా ఉంటే నీ కోరిక తీరుస్తా. అమ్మానాన్నలను అడుగు. అప్పుడు నా తప్పు ఉండదు.' మార్కండేయుడిలా అన్నాడు. మహావ్రతశీల అయిన సావిత్రి అత్తమామలకు నమస్కరించి ఇలా అన్నది – 'నా భర్త పండ్ల కోసం వనానికి వెళ్తున్నాడు. అత్తమామల అనుమతితో ఆయనవెంట వెళ్ళా లనుకొంటున్నాను ఈ రోజు నేను ఆయనను వీడి ఉండరాదు నీ కుమారుడు గురుజనుల ప్రయోజనంకోసం అగ్నిహోత్రప్రయోజనం కోసం అడవికి బయలుదేరాడు. కాబట్టి అడ్డగించరాదు మరే కారణం చేతనైనా బయలుదేరి ఉంటే ఆపవచ్చు. దాదాపు సంవత్సరం గడచిపోతోంది. నేనెప్పుడు ఆశ్రమం వీడి వెళ్ళలేదు.

కుసుమించిన అరణ్యాన్ని చూడాలని నాకెంతో కుతూహలంగా ఉంది.' ద్యుమత్సేనుడిలా అన్నాడు 'సావిత్రిని ఆమెతండ్రి నాకు కోడలుగా అప్పగించిననాటి నుండి నన్ను ఏ కోరికా కోరలేదు. నాకు బాగా గుర్తు. కాబట్టి నా కోడలు కోరిక ఈరోజు తీరాలి. వెళ్ళు. అప్రమత్తంగా సత్యవంతుని మార్గంలోనే పయనించు.' మార్కండేయుడిలా అన్నాడు. 'అత్తమామలిద్దరి అనుమతి పొంది ఆ యశస్విని మనస్సులో బాధపడుతున్నా పైకి నవ్వుతూ భర్తతో బయలుదేరింది. ఆ విశాలాక్షి అంతటా నెమళ్ళగుంపులతో నిండి విచిత్రంగా రమణీయంగా కనిపిస్తున్న వనాలను చూసింది. 'పుణ్యజలాలు ప్రవహించే నదులను, నిలువెల్లా పూసిన మహాపర్వతాలను చూడు' అని సత్యవంతుడు సావిత్రితో మధురంగా పలికాడు. పతివ్రత అయిన సావిత్రి సత్యవంతుని చర్య లన్నింటిని పరికిస్తోంది. నారదుని మాటను తలచుకొని భర్తమరణం తప్పదని నిశ్చయించుకొన్నది. సావిత్రి మనస్సును రెండుగా విభజించుకొని ఒకవైపు భర్తను అనుసరిస్తూ, మరొకవైపు రాబోయే క్షణానికై నిరీక్షిస్తోంది.

297. సావిత్రీ యమ సంవాదము ; సత్యవంతుడు మరల బ్రతుకుట.

మార్కండేయుడిలా అన్నాడు. 'అప్పుడు శక్తిశాలి అయిన ఆ సత్యవంతుడు భార్య సహకారంతో పండ్లను ఏరి, పాత్రను నింపాడు. తరువాత కట్టెలు కొట్టసాగాడు. కట్టెలు కొడుతున్న సత్యవంతునకు చెమటపట్టింది. ఆ శ్రమతో అతనికి శిరోవేదన కలిగింది. శ్రమతో అలసిపోయిన అతడు ప్రియపత్ని దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. సత్యవంతుడిలా అన్నాడు. కట్టెలు కొట్టిన శ్రమతో నాకు తలనొప్పి వచ్చింది. 'సావిత్రీ! ఒళ్ళంతా నొప్పులు పుడుతున్నాయి. మనస్సు దహించుకొని పోతోంది. మితభాషిణీ! తలను శూలాలతో గ్రుచ్చుతున్నట్టుంది. కళ్యాణీ! కొంచెంసేపు నిదురించాలి. నాకిక నిలిచే శక్తి లేదు.' అది విని సావిత్రి భర్త దగ్గరకు వచ్చి, ఆయన తలను తన ఒడిలోనికి తీసికొని, నేలపై కూర్చున్నది. అప్పుడు ఆ తపస్విని నారదవచనాన్ని తలచుకొంటూ ఆ ముహూర్తాన్ని క్షణాన్ని, సమయాన్ని, దినాన్ని పోల్చి చూచుకొన్నది. ముహూర్తకాలంలోనే ఒక దివ్యపురుషుడు ఆమెకు కనిపించాడు. రక్తవస్త్రాలు, తలపై కిరీటం, సూర్యతేజస్సు, శ్యామ శరీర కాంతి, ఎఱ్ఱటి కళ్ళు చేతిలో పాశం ధరించి భయంకరంగా ఉన్న ఆ పురుషుడు సత్యవంతుని ప్రక్కన నిలిచి ఆతనినే చూస్తున్నాడు ఆ పురుషుని చూసి, భర్తశిరస్సును మెల్లగా ప్రక్కకు జరిపి, వెంటనే లేచి, చేతులు జోడించి మనస్సు అదురుతుండగా దీనస్వరంతో ఇలా అన్నది. సావిత్రి ఇలా అన్నది. తమ శరీరం అమానుషంగా

ఉన్నది. తమరెవరో దేవతయే అయి ఉండాలి. దేవేశా! తమకు అభ్యంతరం లేకపోతే ఎవరో, ఎందుకు వచ్చారో చెప్పండి.'

యముడిలా అన్నాడు. 'సావిత్రీ! నీవు పతివ్రతవు. తపస్వినివి! అందుకే నీతో మాటాడుతున్నాను. కళ్యాణీ! నేను యముడను. ఈ నీ భర్త, రాజకుమారుడు అయిన సత్యవంతుని ఆయుస్సు ముగిసింది. అతనిని బంధించి తీసికొని పోతాను. అదే నేను చేయదలచినది. గ్రహించు.' సావిత్రి ఇలా అన్నది. 'స్వామీ! మానవులను కొనిపోవటానికి తమ దూతలు వస్తారని వింటుంటాం. ప్రభూ! తమరు స్వయంగా ఎందుకు వచ్చారు?' మార్కండేయుడిలా అన్నాడు. 'ఆమె అలా అనగానే పితృరాజు అయిన యముడు ఆమె ముచ్చట తీర్చడానికి తాను చేయదలచినదంతా యథాతథంగా చెప్పనారంభించాడు. "ఈ సత్యవంతుడు ధర్మాత్ముడు, రూపవంతుడు, గుణసాగరుడు. కాబట్టి నాదూతలు ఇతనిని కొనిరావటం యోగ్యం కాదు. అందుకని నేనే స్వయంగా వచ్చాను." ఆ తరువాత యముడు సత్యవంతుని శరీరం నుండి పాశబద్ధుడై తనకు వశమైన బొటనవ్రేలంత జీవుని బలంగా లాగాడు. అప్పుడు ప్రాణాలను లాగగానే సత్యవంతుని ఊపిరి ఆగిపోయింది. శరీరం చేష్ట లుడిగి పోయింది. దేహకాంతి నశించింది. శరీరం చూడ వీలు కానట్లయింది. ఆపై యముడు ఆ జీవుని బంధించి దక్షిణంవైపు బయలుదేరాడు. సావిత్రి కూడా దుఃఖార్తయై యముని అనుసరించింది. ఆమె సౌభాగ్యవతి, పతివ్రత, వ్రతసిద్ధిని పొంది ఉన్నది. కాబట్టి వెళ్ళగలిగింది. యముడిలా అన్నాడు. 'సావిత్రీ వెనుదిరిగి పో! ఇతనికి ఔర్ధ్వదైహిక క్రియలు జరిపించు. పతివెంట రాగలిగినంత దూరం వచ్చావు. ఋణం తీరిపోయింది.' సావిత్రి ఇలా అన్నది. 'నా భర్త ఎక్కడకు వెళ్ళినా, ఎక్కడకు కొనిపోబడినా నేను కూడా అక్కడకు వెళ్ళాలి. ఇది సనాతన ధర్మం. తపస్సువలనా, గురుభక్తివలనా, భర్తృప్రేమవలనా, వ్రతసిద్ధివలనా, నీ అనుగ్రహం వలనా కూడా నా దారి అడ్డగింపబడదు. తత్త్వార్థద్రష్టలయిన పండితులు ఏడడుగుల నడకతో మైత్రి కలుగుతుందంటారు. ఆ మైత్రిని పురస్కరించుకొని నేను చెప్పేది ఈ కొంచెం విను. జితేంద్రియులు కాని వారు వనంలో నివసిస్తూ, ధర్మపాలన చేస్తూ, గురుకులవాసాన్ని శ్రమను భరించలేరు విజ్ఞానంతో ధర్మసిద్ధి అని పెద్దలంటారు. కాబట్టి సజ్జనులు ధర్మాన్నే ప్రమాణమన్నారు. సజ్జనసమ్మతమయిన ఒక ఆశ్రమ ధర్మాన్ని శ్రద్ధగా పాటిస్తే అందరూ ఆ మార్గాన్ని అనుసరించి జ్ఞానం పొందుతారు. నైష్ఠిక బ్రహ్మచర్యం, సన్యాసం అక్కరలేదు. కాబట్టి సజ్జనులు ఆశ్రమధర్మాన్ని ప్రధానమన్నారు.'

యముడిలా అన్నాడు. 'అనిందితా! వెళ్ళు. నీ ఈ మాటలతో సంతోషించాను.

ఈ మాట స్వర, అక్షర, వ్యంజన హేతుబద్ధమై ఉన్నది. నీ భర్తజీవితాన్ని తప్ప మరేదయినా వరం కోరుకో. ఇస్తాను.' సావిత్రి ఇలా అన్నది. 'నా మామగారు రాజ్యాన్ని కోల్పోయారు. వనవాసం చేస్తున్నారు. కళ్ళు లేవు. నీ అనుగ్రహం వలన ఆయనకు చూపు రావాలి. సూర్యాగ్ని సమానుడై వెలుగొందాలి.' యముడిలా అన్నాడు. 'అనిందితా! ఈ వరాన్ని నీకిస్తున్నాను. నీవు అడిగినదంతా అలాగే జరుగుతుంది. బాటలో నడిచి అలసిపోయినట్లున్నావు. తిరిగివెళ్ళు. శ్రమపడట మెందుకు?' సావిత్రి ఇలా అన్నది. 'భర్త దగ్గర ఉంటే నాకు శ్రమ ఏమిటి? భర్త ఎక్కడుంటే అక్కడే నేను. భర్తను ఎక్కడకు తీసికొనిపోతే అక్కడకే నేను కూడా! సురేశా! మరొక్కమాట చెపుతా విను. సజ్జనులతో ఒక్కసారి కలవటం కూడా చాలా ఇష్టంగా ఉంటుంది. వారితో మైత్రి అంతకన్న గొప్పది. సజ్జన సమాగమం ఎప్పుడూ నిరర్థకం కాదు. అందుకే ఎప్పుడూ సజ్జనసాంగత్యంలో నిలవాలి.' యముడిలా అన్నాడు. 'భామినీ! నీవు చెప్పిన హితోక్తి నాకు బాగా నచ్చింది. అది పండితుల బుద్ధికి కూడా పదును పెట్టగలది. సత్యవంతుని ప్రాణాలు కాకుండా మరేదయినా రెండోవరం కోరుకో.' సావిత్రి ఇలా అన్నది. 'ధీమంతుడైనా నా మామగారి రాజ్యాన్ని అపహరించారు. ఆయన తన రాజ్యాన్ని మరలా పొందాలి. పూజ్యులైన నా మామగారు ఎప్పుడూ స్వధర్మాన్ని విడువ కూడదు. ఇది నేను కోరుకొనే రెండో వరం.' యముడిలా అన్నాడు. 'రాజకుమారీ! వెంటనే ద్యుమత్సేనుడు తన రాజ్యాన్ని పొందుతాడు. ఎప్పుడూ స్వధర్మపరిత్యాగం చేయడు. నీ కోరిక తీరిందిగదా! ఇక వెనుదిరిగి వెళ్ళు. ఎందుకు శ్రమపడతావు?'

సావిత్రి ఇలా అన్నది. 'దేవా! ఈ ప్రజలందరినీ నియమంగా ఉంచుతున్నావు. నీ ఇష్టానుసారం వారిని కొనిపోతున్నావు. అందుకే నిన్ను యముడన్నారు. మరొక్కమాట చెపుతాను. ఇది కూడా విను. సర్వప్రాణులకూ మనసా, వాచా, కర్మణా కూడా ద్రోహం చేయకుండటం, అనుగ్రహం చూపటం, దానం చేయటం ఇది సత్పురుషుల సనాతనధర్మం. ఈ లోకులు అల్పాయుష్కులు మనుష్యుల శక్తి కూడా గట్టిది కాదు. తమవంటి సజ్జనులు శరణుకోరితే శత్రువులపై కూడా దయ చూపుతారు.' యముడిలా అన్నాడు. 'దప్పిక గొన్నవానికి నీళ్ళవలె నీవు చెప్పినమాట ఆనందకరం కళ్యాణీ నీకిష్టమయితే సత్యవంతుని ప్రాణాలు తప్ప మరేదయినా వరం కోరుకో.' సావిత్రి ఇలా అన్నది. 'మా నాన్నకు కొడుకులు లేరు. ఆయనకు ఔరస పుత్రులు వందమంది కలగాలి. వారు వంశపరంపరను కొనసాగించగలగాలి. ఇది నీనుండి కోరుతున్న మూడవ వరం ' యముడిలా అన్నాడు 'రాజకుమారీ! కళ్యాణీ! నీ తండ్రికి వంశపరంపరను కొనసాగించే తేజస్వంతులైన కొడుకులు వందమంది పుడతారు. నీ కోరిక తీరినది గదా! చాలా దూరం వచ్చావు. ఇక మరలిపో.

సావిత్రి ఇలా అన్నది. 'నా భర్తసన్నిధిలో ఇది నాకు దూరమేమీ కాదు. నా మనస్సు ఇంకా దూరం వెళుతోంది. తమరు నడుస్తూనే మరొకసారి నా మాట నాలకించండి. దేవేశ్వరా! తమరు సూర్యుని తనయులు కాబట్టి పండితులు తమరిని వైవస్వతు డంటారు. ప్రజలను సమానధర్మంతో నడుపుతారు కాబట్టి తమరికి ధర్మరాజత్వం తగినదే. మనుష్యులకు మంచివారిపై ఉన్నంత నమ్మకం తమ మీద కూడా ఉండదు. అందుకే మంచివారి నందరూ ప్రేమిస్తారు. సర్వప్రాణులకు సౌహార్దం వలననే విశ్వాస మేర్పడుతుంది. కాబట్టియే ప్రజలు మంచివారినే విశేషించి నమ్ముతారు.' యముడిలా అన్నాడు. 'కళ్యాణి! నీవన్నమాట ఇంతవరకు మరెవ్వరి నోటా నేను వినలేదు. ఆనందించాను. సత్యవంతుని ప్రాణాలను తప్ప మరేదైనా నాలుగో వరం కోరుకో. వెళ్ళు.' సావిత్రి ఇలా అన్నది. 'నాకూ, సత్యవంతుడికీ వంశవర్ధనులూ, బలవీర్యసంపన్నులూ అయిన వందమంది ఔరసపుత్రులు కావాలి. ఇదే నేను కోరుకొనే నాల్గవవరం.' యముడిలా అన్నాడు. 'అబలా! బలవీర్యసంపన్నులై ఆనందాన్ని కల్గించే కొడుకులు వందమంది నీకు పుడతారు. రాజకుమారీ! ఎందుకీ శ్రమ. చాలా దూరం వచ్చావు. ఇక వెళ్ళు.' సావిత్రి ఇలా అన్నది. 'సజ్జనులు ఎప్పుడూ ధర్మబద్ధంగానే ప్రవర్తిస్తారు. సత్పురుషులు బాధపడరు. కలత పడరు. సజ్జనులతో కలయిక నిష్ఫలం కాదు. సత్పురుషుల వలన సజ్జనుల కెప్పుడూ భయం లేదు.

సత్పురుషులు సత్యబలంతో సూర్యుని నడిపించగలరు తపస్సుతో భూమిని భరించగలరు. రాజా! భూతభవిష్యత్తులకు సత్పురుషులే గతి. సజ్జనులకు సజ్జనుల మధ్య దుఃఖముండదు. ఇది సజ్జనులు సేవించిన సనాతనధర్మం. ఇది గ్రహించి సజ్జనులు ఎప్పుడూ పరోపకారం చేస్తారు. ఒకరినొకరు స్వార్థదృష్టితో చూడరు. సత్పురుషుల అనుగ్రహం వ్యర్థం గాదు. అది ఎవ్వరి ప్రయోజనాన్ని భంగపరచదు. అభిమానాన్ని దెబ్బతీయదు. అనుగ్రహమూ, అర్థ మానాలు సజ్జనులతో నిత్యమూ నిలుస్తాయి. అందుకే వారు సర్వరక్షకులు.' యముడిలా అన్నాడు. 'పతివ్రతా! నీవు ధర్మసమ్మతంగా, అర్థవంతంగా, మనోనుకూలంగా, చక్కగా మాటాడుతున్న కొద్దీ నాకు నీపై ఉత్తమభక్తి పెరుగుతోంది. సాటిలేని వరమేదైనా కోరుకో.' సావిత్రి ఇలా అన్నది. 'మానదా! ఇతరవరాలవలె గాక తమరు నాకిచ్చిన నాలుగవ వరం దాంపత్యజీవనం లేకుండా అసాధ్యమైనది. కాబట్టి సత్యవంతుని బ్రతికించు. భర్త లేకుంటే నేను బ్రతుకను. భర్తలేకపోతే నాకు సుఖం అక్కర లేదు. స్వర్గమక్కర లేదు. సంపద అక్కర లేదు. భర్త లేకుండా బ్రతకాలని కూడా లేదు. నాకు నూర్గురు కొడుకులు పుడతారని వరమిచ్చారు. కానీ తమరు నాభర్తను కొనిపోతున్నారు. ఈ సత్యవంతుడు బ్రీవించాలని కోరుకొంటున్నాను. అప్పుడు తమరివరమే యధార్థమవుతుంది.' 'అలాగే'

అని యమధర్మరాజు పాశాన్ని విడిపించి ఆనందంగా సావిత్రితో ఇలా అన్నాడు. 'కళ్యాణీ! నీ భర్తను పాశవిముక్తుని చేశాను. ధర్మార్థాలతో కూడిన నీ మాటలతో ఆనందించాను. సాధ్వీ! సత్యవంతునకు క్షేమం, మనోరథ సిద్ధి కలుగుతాయి. తీసికొనిపో. నీతో కలిసి నాలుగువందల సంవత్సరాలు జీవిస్తాడు సత్యవంతుడు. యాగాలు చేసి, ధర్మబద్ధంగా జీవించి లోకంలో ప్రసిద్ధి పొందగలడు. సత్యవంతునకు నీ ద్వారా వందమంది కొడుకులు పుడతారు. ఆ రాజకుమరులు రాజులై పుత్రపౌత్రులతో వర్ధిల్లుతారు. నీపేరుతోనే వారికి శాశ్వతకీర్తి లభిస్తుంది. నీ తండ్రికి నీ తల్లియందు నూర్గురు కొడుకులు పుడతారు. నీ తల్లి మాలవి కాబట్టి నీ సోదరులు మాలవులని ప్రసిద్ధికెక్కి, పుత్రపౌత్రులను పొందుతారు. ఆ నీ సోదరులు దేవతాతుల్యులైన క్షత్రియులు కాగలరు. ప్రతాపవంతుడైన యమధర్మరాజు సావిత్రికి ఆ రీతిగా వరమిచ్చి, ఆమెను వెనుకకు మరల్చి, తాను తన లోకానికి వెళ్ళిపోయాడు.

యముడు వెళ్ళగానే సావిత్రి భర్తను పొంది భర్తదేహ మున్న చోటికి వెళ్ళింది. ఆమె నేలపై పడియున్న భర్తను చూసి దగ్గరకు వెళ్ళి, కూర్చొని, భర్తతలను తన ఒడిలో పెట్టికొన్నది. సత్యవంతుడు చైతన్యాన్ని పొంది, పొరుగూరికి వెళ్ళి తిరిగివచ్చిన వానివలె ఆమెను ప్రేమగా ఆదేపనిగా చూస్తూ ఆమెతో ఇలా అన్నాడు. 'అరే! చాలాసేపు నిద్రించాను. ఎందుకు లేపలేదు? నన్ను పట్టి లాగిన ఆ నల్లటి మనిషి ఎక్కడ?' 'పురుషోత్తమా! నా ఒడిలో చాలాసేపు నిదురించావు. పూజ్యుడు, ప్రజానియంత అయిన ఆ యమధర్మరాజు వెళ్ళిపోయారు. మహాభాగా! చాలాసేపు విశ్రమించావు. నిద్రనుండి మేల్కొన్నావు. రాజకుమారా! లేవగలిగితే లే. చూడు! ప్రొద్దుక్రుంకి చీకట్లు క్రమ్మాయి.' మార్కండేయుడిలా అన్నాడు. 'అప్పుడు చైతన్యాన్ని పొంది, గాఢ నిద్ర పోయినవానివలె లేచి, అరణ్యప్రాంతంలో అన్నివైపులా దృష్టిసారించి సత్యవంతుడిలా అన్నాడు. "సుమధ్యమా! పండ్లు తెచ్చేందుకు నీతో కలిసి బయలుదేరాను. ఆపై కట్టెలు కొడుతుంటే తలనొప్పి వచ్చింది. తలనొప్పితో బాధపడుతూ ఎక్కువసేపు నిలువలేక నీ ఒడిలో నిదురించాను. కళ్యాణీ! అంతా గుర్తుకు వస్తోంది నీ శరీర స్పర్శ తగులగానే నా మనస్సు నిద్రావశమైంది అప్పుడు గాఢాంధకారాన్నీ, మహాతేజస్వి అయిన పురుషునీ చూచాను. సుమధ్యమా! అదేమిటో నీవెరుగుదువా? నాకు చెప్పు. నేను చూచినది కలా? నిజమా?'

అప్పుడు సావిత్రి ఆతనితో ఇలా అన్నది. 'రాజకుమారా! రేయి గడచిపోతోంది. రేపు జరిగినదంతా నీకు వివరంగా చెపుతాను. లేలే! అంతా మేలే జరిగింది. సువ్రతా! వెళ్ళి నీ తల్లిదండ్రులను చూడు. రేయి గాఢమవుతుంది సూర్యుడెప్పుడో అస్తమించాడు. క్రూరంగా మాటాడే నిశాచరులు ఆనందంగా తిరుగుతున్నారు. అరణ్యంలో మృగాల

సంచారంతో కదిలే ఆకులసవ్వడులు వినిపిస్తున్నాయి. అదిగో! నక్కలు నైఋతికి చేరి ఘోరంగా, భీకరంగా అరుస్తున్నాయి. నామనస్సు వణుకుతోంది. సత్యవంతుడిలా అన్నాడు. అరణ్యం గాఢాంధకారంతో భయంకరంగా ఉంది. దారి కనిపించదు. వెళ్ళటం కష్టం. సావిత్రి ఇలా అన్నది. ఇదిగో. అడవిలో ఈ రోజు తగులబడిన ఎండుచెట్టు ఇంకా మండుతోంది. గాలితాకిడికి అక్కడక్కడ అగ్ని కనిపిస్తోంది. అక్కడ నుండి నిప్పుతెచ్చి ఇక్కడ కట్టెలున్నాయి గదా, అన్నీ తగులబెడతాను. నీవు చింతించ నవసరం లేదు. నీవు ఇంకా అస్వస్థతలో ఉన్నావు. వెళ్ళాలనిపించటం లేదా? అంధకారబంధురమైన అరణ్యంలో దారికూడా కనిపించేటట్లు లేదు. అనఘా! నీకిష్టమయితే రేపు ఉదయం వనం కనిపించేటప్పుడే వెళదాం. ఈ రాత్రి ఇక్కడే గడుపుదాం.' సత్యవంతుడిలా అన్నాడు. 'నా తలనొప్పి తగ్గిపోయింది. ఒళ్ళు స్వస్థంగానే ఉన్నట్టుంది. నీ అనుగ్రహం వలన కలిగిన మాతాపితృసందర్శనాన్ని కోరుకొంటున్నాను. ఎప్పుడూ కూడా ఆశ్రమాన్ని వీడి ఇంతకాలముండలేదు. చీకటి పడబోయేముందే అమ్మ నన్ను ఎక్కడకు వెళ్ళకుండా వారించేది. పగలయినా నేను వెళ్ళగానే అమ్మానాన్న బాధపడేవారు. ఆశ్రమవాసులతో కలిసి నాన్న నాకై వెదుకుతాడు. గతంలో చాలాసార్లు అమ్మా, నాన్నా బాగా బాధపడి "ఆలస్యంగా వస్తున్నా"వని నన్ను కోపగించారు కూడా. నా కోసం వారిద్దరు ఇప్పుడు ఏ అవస్థలో ఉన్నారో? వారు కనిపించకపోతే నాకు ఎంతో దుఃఖం కలుగుతుంది. ఇంతకుముందొకసారి ఎంతో బాధపడుతూ, కంటతడిపెడుతూ ఆ వృద్ధులు ఎంతో ప్రేమతో నాతో ఇలా అన్నారు.

నాయనా! నీవు లేకుండా క్షణం కూడా మేము బ్రతుకలేము. నీవు బ్రతికినంతకాలం నిశ్చయంగా మేమూ బ్రతికి ఉంటాం. మేము ముసలివారమూ, గ్రుడ్డివారమూ. మాకు చూపు నీవే. వంశప్రతిష్ఠ నీ మీద ఆధారపడి ఉన్నది. మాకు పిండమూ, కీర్తి, వంశవృద్ధి అన్నీ నీ మీద ఆధారపడి ఉన్నాయి. అమ్మ వృద్ధురాలు. నాన్న వృద్ధుడు. వాళ్ళకు ఊతకర్ర నేను. ఈ రాత్రి నేను కనిపించక వారు ఎటువంటి స్థితికి లోనవుతారో? నిద్రమీదే నాకు కోపం వస్తోంది. దీనివలన నా తండ్రిని గురించి, నాకెప్పుడూ బాధ కలిగించని నా తల్లిని గురించి ఆందోళన కలుగుతోంది. నేను కూడా తీవ్రమైన ఆపద నెదుర్కొని ప్రాణసంకటస్థితిలో ఉన్నాను. తల్లిదండ్రులు లేకపోతే నేను బ్రతుకలేను. ప్రజ్ఞాచక్షువయిన నా తండ్రి వ్యాకులహృదయంతో ఆశ్రమవాసుల నందరినీ విడివిడిగా నాగురించి అడుగుతుంటాడు. కళ్యాణి! నా గురించి బాధపడటం లేదు. నా తండ్రిని గురించి, ఆయననే అనుసరించే దీనురాలు నా తల్లిని గురించి బాధపడుతున్నాను.

నాకోసమే వారిప్పుడు ఎంతో బాధపడుతుంటారు. వారు బ్రతికి ఉన్నారు కాబట్టి నేనూ బ్రతుకుతున్నాను. వారిని పోషించవలసినది నేనే గదా! వారికి ఆనందాన్ని కల్గించటమే నా కర్తవ్యమని నాకు తెలుసు.'

గురుభక్తుడు, గురుప్రియుడు, ధర్మాత్ముడూ అయిన ఆ సత్యవంతుడు అలా అని చేతులు రెండూ పైకెత్తి బాధతో పెద్దగా ఏడువసాగారు. శోకతప్తుడైన భర్తను చూచి, కన్నీరు తుడిచి ధర్మచారిణి అయిన సావిత్రి ఇలా అన్నది. "నేను ఏదైనా తపస్సు చేసి ఉంటే, ఎప్పుడైనా అగ్నికి ఆహుతులను అర్పించి ఉంటే తత్ఫలంగా ఈరాత్రి నా ఆత్తమామలకూ, నాభర్తకూ, నాకూ శుభంగా జరిగిపోవుగాక! నేను క్రీడావినోద సమయంలో కూడా అసత్యమాడినట్లు నాకు గుర్తులేదు. ఆ సత్యఫలం వలన నా ఆత్తమామలు ఈ రాత్రి జీవించి యుందురు గాక!" సత్యవంతుడిలా అన్నాడు. "సావిత్రీ! అమ్మానాన్నలను చూడాలనుకొంటున్నాను. బయలుదేరు. ఆలస్యం చేయవద్దు. ఆనందంగా ఉన్న వాళ్లను నేను చూడగలుగుతానో? లేదో? నా శరీరాన్ని తాకుతూ సత్యంమీద ఒట్టువేసి చెపుతున్నాను. అమ్మానాన్నలకు ఏదైనా జరగకూడనిది జరిగితే నేను బ్రతుకలేను. నీకు ధర్మం మీదనే బుద్ధి ఉంటే, నేను బ్రతకాలనుకొంటే, నాకిష్టమైనట్టు చేయాలనిపిస్తే ఇప్పుడే ఆశ్రమందగ్గరకు వెళదాం " మార్కండేయుడిలా అన్నాడు. 'భావిని అయిన సావిత్రి అప్పుడు లేచి, జుట్టు సవరించుకొని, చేతులతో పట్టి భర్తను లేవదీసింది. సత్యవంతుడు కూడా లేచి, చేతితో ఒళ్ళంతా తుడుచుకొని, అంతటా కలియజూచి పండ్లగంపపై దృష్టిపెట్టాడు. అప్పుడు సావిత్రి సత్యవంతునితో ఇలా అన్నది – 'పండ్లు రేపు తేవచ్చు నీ యోగక్షేమాలకోసం గొడ్డలిని ఇప్పుడు తీస్తున్నాను. ఆమె పండ్లగంపను చెట్టుకొమ్మను వ్రేలాడదీసి, గొడ్డలి పట్టుకొని భర్తదగ్గరకు మరల వచ్చింది. సావిత్రి ఎడమభుజంపై భర్త చేతిని ఉంచుకొని, కుడిభుజంతో భర్తను పట్టుకొని మెల్లగా బయలుదేరింది. సత్యవంతుడిలా అన్నాడు. 'పిరికిదానా! ఎన్నిసార్లు వచ్చానో! దారి నాకు గుర్తే. చెట్లమాటు నుండి పడుతున్న వెన్నెలలో దారి కనిపిస్తోంది. కళ్యాణి! మనం వచ్చి పండ్లు ఏరుకొన్న దారి ఇదే వచ్చిన బాటనే వెళదాం. దారిని గురించిన ఆలోచన వద్దు పలాశవృక్షాలు గల ఈ చోట బాట రెండుగా చీలుతుంది. ఉత్తరం వైపు తిరిగిన దారిలో వెళ్ళు. త్వరగా నడు. అమ్మానాన్నలను చూడాలన్న తహతహతో నాకు బాగానే ఉంది. శక్తి కూడా వచ్చింది' ఇలా అంటూనే త్వరత్వరగా ఆశ్రమంవైపు నడిచాడు.

298. సావిత్రి సత్యవంతులు ఆశ్రమమునకు వచ్చుట.

మార్కండేయుడిలా అన్నాడు. 'అదే సమయంలో మహాబలుడైన ద్యుమత్సేనునకు చూపు వచ్చింది. చూపులోని లోపం తొలగిపోవటంతో అంతా చూడసాగాడు. ద్యుమత్సేనుడు తన భార్య శైబ్యతో కలిసి సత్యవంతునికై అన్ని ఆశ్రమాలు తిరిగాడు. అతనిని గూర్చి తీవ్రవేదనం పొందాడు. ఆ దపంతులు ఆ రాత్రి సత్యవంతుని వెదకుతూ ఆశ్రమాలు, నదులు, వనాలు, సరస్సులు అన్నీ తిరిగారు. ఏ చప్పుడు వినిపించినా కొడుకే అనుకొని, అటుతిరిగి 'సావిత్రితో కలిసి సత్యవంతుడు వస్తున్నాడు' అని ఒకరికొకరు చెప్పుకొనసాగారు. కాళ్ళు పగిలి కఠినంగా ఉన్నాయి. పరుగెత్తటంతో గాయమై నెత్తురు కారుతున్నాయి. దర్భలు, ముళ్ళు వాళ్ళ శరీరంలో గ్రుచ్చుకొంటున్నాయి. అయినా సరే వాళ్ళు పిచ్చివాళ్ళవలె అటు ఇటు పరుగెత్తుతూనే ఉన్నారు. అప్పుడు ఆశ్రమవాసు లయిన విప్రు లందరూ వచ్చి, చుట్టూ చేరి, వాళ్ళను ఓదార్చి ఆశ్రమానికి తీసికొనివచ్చారు. తపోధను లయిన వృద్ధులు శైబ్యాద్యుమత్సేనుల చుట్టూ చేరి చిత్రార్థాలు గల ప్రాచీనరాజకథలను చెప్పి వారిని ఓదార్చారు. అయినా ఆ వృద్ధులు శైబ్యాద్యుమత్సేనులు కుమారుని చూడాలన్న తహతహతో సత్యవంతుని బాల్యవృత్తాలను తలచుకొంటూ మరీ దుఃఖించారు. మాటిమాటికి దీనంగా విలపిస్తూ "హా కుమారా! హా సాధ్వి - కోడలా ! ఎక్కడున్నావు" అంటూ రోదించసాగారు. అప్పుడు సత్యవచనుడైన ఒక బ్రాహ్మణుడు వారితో ఇలా అన్నాడు. సువర్చసుడు ఇలా అన్నాడు. 'సత్యవంతుని భార్య సావిత్రి తపస్సు, ఇంద్రియనిగ్రహమూ, సదాచారమూ గలది. ఆ శక్తితో సత్యవంతుడు జీవించియే ఉంటాడు.' గౌతముడిలా అన్నాడు. 'నేను వేదాంగాలతోపాటు వేదాలను అభ్యసించాను. ఎంతో తపస్సు చేశాను. కౌమారంలో బ్రహ్మచర్యంతో గురుజనులను అగ్నిని సంతోషపెట్టాను. ఏకాగ్రచిత్తంతో వ్రతాల నన్నింటిని పూర్తిచేశాను. గతంలో శాస్త్రోక్తంగా వాయుభక్షణ చేస్తూ ఉపవాసాలు చేశాను. ఈ తపశ్శక్తితో నేను పరులచేష్టల నన్నింటినీ గ్రహించగలను. సత్యవంతుడు బ్రతికియే ఉన్నాడు. ఇది సత్యం. తెలుసుకోండి.'

శిష్యుడిలా అన్నాడు. 'మా గురువుగారి నోటినుండి వెలువడిన మాట ఎప్పుడూ మిథ్య కాదు. కాబట్టి సత్యవంతుడు బ్రతికియే ఉంటాడు.' ఋషులు ఇలా అన్నారు. 'సత్యవంతుని భార్య సావిత్రి, సుమంగళిగా నిలువటానికి అవసరమయిన మంచిలక్షణాలన్నీ కలది. కాబట్టి సత్యవంతుడు జీవించేయుంటాడు.' భారద్వాజుడిలా అన్నాడు. 'సత్యవంతుని భార్య తపస్సు, ఇంద్రినిగ్రహం, సదాచారాలతో కూడినది. కాబట్టి సత్యవంతుడు జీవించియుంటాడు.' దాల్భ్యుడిలా అన్నాడు. 'నీకు చూపు వచ్చింది. సావిత్రి వ్రతాన్ని

పూర్తి చేసింది. నేడు ఆహారం తీసికోకుండానే వనానికి వెళ్ళింది. వీటిని బట్టి సత్యవంతుడు జీవించియే ఉంటాడు.' ఆపస్తంబుడిలా అన్నాడు. 'ప్రశాంతంగా ఉన్న దిక్కులో మృగాలు, పక్షులు సూచనలిస్తూ అరుస్తున్నాయి. నీవు రాజధర్మాన్ని పాటిస్తున్నావు. కాబట్టి సత్యవంతుడు జీవించియే ఉండాలి.' ధౌమ్యుడిలా అన్నాడు. 'నీ కుమారుడు సర్వసద్గుణాలు గలవాడు. చిరకాలం జీవించే లక్షణాలు గలవాడు. జనులకిష్టమైనవాడు. కాబట్టి సత్యవంతుడు బ్రతికియుంటాడు.' మార్కండేయుడిలా అన్నాడు. 'సత్యవచనులయిన తాపసులు ఈ రీతిగా తనను ఊరడించగా ఆయా మాటలను పరిగణిస్తూ ద్యుమత్సేనుడు కుదుటబడినట్లు అయ్యాడు. తరువాత రెండు ఘడియలలోనే సావిత్రి సత్యవంతునితో కూడా వచ్చి రాత్రివేళలోనే ఆనందంగా ఆశ్రమంలో ప్రవేశించింది.

బ్రాహ్మణులిలా అన్నారు. 'రాజా! నీకొడుకు వచ్చి చేరాడు. నీకు చూపు వచ్చింది. ఇది చూచి మేము నీ అభ్యుదయాన్ని భావిస్తున్నాం. నీ అదృష్టం కొద్దీ కొడుకు వచ్చాడు. కోడలు కనిపించింది. చూపు వచ్చింది. ఈ మూడు నీ అభ్యుదయాన్ని తెలుపుతున్నాయి. మేము చెప్పినదంతా అలాగే జరిగింది. నిస్సందేహంగా త్వరలోనే నీకు ఇంకా ఇంకా అభివృద్ధి కలుగుతుంది.' ఆ తరువాత ఆ బ్రాహ్మణులంతా అగ్నిని ప్రజ్వలింపజేసి ద్యుమత్సేన నరపతి ప్రక్కనే కూర్చున్నారు. శైబ్య, సత్యవంతుడు, సావిత్రి ఒకప్రక్క నిలిచి ఆ అందరి అనుమతితో బాధనంతా మరచిపోయి కూర్చున్నారు. రాజా! అప్పుడు రాజుతో కలిసి ఆసీనులయిన ఆ వనవాసులందరూ కుతూహలంతో రాజకుమారుని ప్రశ్నింపసాగారు. ఋషులు ఇలా అన్నారు. 'ప్రభూ! నీవు నీ భార్యా ఇంతకుముందే ఎందుకు రాలేదు? అపరరాత్రిలో ఎందుకు వచ్చారు? మీకు ఏ ఆడ్డంకి కలిగింది? రాజకుమారా! మీ అమ్మ, నాన్న ఎంతో బాధపడ్డారు. మాదీ అదే స్థితి. ఎందుకు ఆలస్యమవుతోందో మాకు తెలియదు. అదంతా చెప్పు. సత్యవంతుడిలా అన్నాడు. 'నాన్న అనుమతితో సావిత్రితో కలిసి నేను వెళ్ళాను. అరణ్యంలో కట్టెలు కొడుతుంటే నాకు తలనొప్పి వచ్చింది. ఆ బాధతో నేను చాలాసేపు నిదురపోయినట్లుంది. ఇంతకు ముందెప్పుడూ నేను అంతసేపు నిదురించలేదు. మీరంతా బాధపడకూడదని అపరరాత్రి అయినా వచ్చాం. మరే కారణమూ లేదు.' గౌతముడిలా అన్నాడు. 'నీతండ్రి ద్యుమత్సేనునకు అకస్మాత్తుగా చూపు వచ్చింది. దీనికి కారణం నీవెరుగవు. సావిత్రియే చెప్పాలి. సావిత్రీ! దీనిగురించి నీద్వారా వినగోరుతున్నాను. ముందువెనుకలు నీకు తెలుసు. తేజస్సులో నీవు సావిత్రీదేవి వంటి దానవని నాకు తెలుసు. దీనికి కారణం నీకు తెలుసు. సత్యం చెప్పు. ఇది చెప్పరాని రహస్యమేమీ కాకపోతే మాకు తప్పక చెప్పాలి.'

సావిత్రి ఇలా అన్నది. 'మీరనుకొంటున్నది నిజమే. మీ సంకల్పం మరొక రీతిగా జరుగదు. రహస్యమేమీ లేదు. జరిగినదంతా చెపుతా వినండి. మహాత్ముడైన నారదుడు నా భర్తమరణాన్ని గురించి ముందే చెప్పాడు. నేడే ఆ రోజు. అందుకే సత్యవంతుని నేను విడిచియుండలేదు. సత్యవంతుడు నిదురిస్తుంటే కింకరులతో సహా యముడే వచ్చాడు. ఈయనను బంధించి దక్షిణదిశగా కొనిపోయాడు. ఆ దేవదేవుని సత్యవచనాలతో నేను స్తుతించాను. ఆయన నాకు ఐదువరాలు ఇచ్చాడు. వాటిని వినండి. మా మామగారికి సంబంధించి నేత్రప్రాప్తి, రాజ్యలాభం - ఈ రెండు వరాలు. నాతండ్రికి వందమంది కొడుకులు, నాకూ వందమంది కొడుకులు. నా భర్త సత్యవంతునకు నాలుగువందల సంవత్సరాల ఆయుస్సు లభించింది. నాకు కల్గిన తీవ్రదుఃఖం సుఖోదర్కమయింది. మేము ఆలస్యంగా రావటానికి ఏర్పడిన కారణాన్ని ఉన్నదున్నట్టుగా వివరంగా చెప్పాను. అది నాకు చాలా దుఃఖాన్ని కలిగించినా సుఖాంతమే అయినది.' ఋషులు ఇలా అన్నారు. 'సాధ్వీ! ద్యుమత్సేనుని వంశం బాధలకు లోనై అంధకార మనే ఊబిలో మునగబోతుంటే కులీన వయిన నీవు సౌశీల్యవ్రతపుణ్యంతో దాన్ని పునరుద్ధరించావు.' మార్కండేయుడిలా అన్నాడు. 'అక్కడ కూడియున్న ఋషులు స్త్రీ రత్నమయిన సావిత్రిని ఆ రీతిగా ప్రశంసించి, సత్కరించి, ద్యుమత్సేన సత్యవంతుల అనుమతితో సుఖంగా, ఆనందంగా తమ తమ ఇండ్లకు వెళ్ళిపోయారు.'

299. ద్యుమత్సేన రాజ్యాభిషేకము.

మార్కండేయుడిలా అన్నాడు. 'ఆ రాత్రి గడచి మరునాడు సూర్యోదయం తర్వాత ప్రాతఃకాలానుష్ఠానాలు ముగించుకొని తపోధను లందరూ గుమిగూడారు. మహర్షులు సావిత్రి మహాభాగ్యమంతా ద్యుమత్సేనునితో మరలామరలా చెప్పినా కూడా వారికి తృప్తి కలుగలేదు. రాజా! అంతలో శాల్వ దేశం నుండి ప్రజలు వచ్చి శత్రువు తమ అమాత్యునిచే వధింపబడ్డాడు అని ద్యుమత్సేనునకు చెప్పారు. ద్యుమత్సేనుని శత్రువు అనుచరబంధుగణాలతో సహా మంత్రిచేతులలో మరణించినట్లు మిగిలిన శత్రుసేనలు పారిపోయినట్లు విని, ప్రజలు అందరూ ఒక్కటై ద్యుమత్సేనునివైపు మొగ్గారు. కళ్ళున్నా, లేకపోయినా ద్యుమత్సేనుడే తమ రాజుకావాలని నిర్ణయించుకొన్నారు. రాజా! ఆ నిర్ణయంతో మమ్ము ఇక్కడకు పంపాడు. వాహనాలు, చతురంగబలాలు తమ సేవకై వచ్చి ఉన్నాయి. రాజా! బయలుదేరు. తమకు మేలు జరుగుతుంది. నగరంలో జయఘోష వినిపిస్తోంది. చిరకాలం వంశపరంపరగా వచ్చిన స్థానాన్ని అలంకరించండి. చూపును పొంది నూత్నతేజస్సుతో నున్న రాజు రూపాన్ని

చూసి ఆశ్చర్యంతో విప్పారిన కన్నులుగల ఆ ప్రకృతులు అందరూ రాజుపాదాలపై తలలు వాల్చారు.

అప్పుడు ద్యుమత్సేనుడు ఆశ్రమవాసు లయిన వృద్ధబ్రాహ్మణులకు నమస్కరించి, వారి సత్కారాలు పొంది నగరంవైపు బయలుదేరాడు. శైబ్య, సావిత్రి సేనలు చుట్టు నడవగా పల్లకిలో బయలుదేరారు. ఆ పల్లకి కాంతిమంతమైనది. మంచి పరుపులు గలది. మనుష్యులు మోస్తున్నది. అప్పుడు పురోహితులు ప్రీతితో ద్యుమత్సేనుని అభిషేకించారు. మహాత్ముడైన సత్యవంతుని యువరాజుగా అభిషేకించారు. ఆ తరువాత చాలాకాలానికి సావిత్రికి కీర్తివర్ధనులు, శూరులై, యుద్ధంలో వెనుకంజవేయని నూర్గురు కొడుకులు కలిగారు. మద్రరాజయిన ద్యుమత్సేనునకు మాలవియందు బలశాలు రయిన వందమంది కొడుకులు పుట్టారు. దానితో సావిత్రికి సహోదరశతం పుట్టినట్టయింది. ఈ రీతిగా సావిత్రి తనను, తండ్రిని, తల్లిని, అత్తను, మామను, భర్తకులాన్ని కూడా ఆపదనుండి గట్టెక్కించింది. ఆ సావిత్రి వలె కులకాంత, కళ్యాణి, శీలవతి అయిన ద్రౌపది కూడా మిమ్మందరినీ గట్టెక్కిస్తుంది. వైశంపాయనుడిలా అన్నాడు. రాజా! ఈ రీతిగా మహాత్ముడైన మార్కండేయుడు అనునయించగా అప్పుడు ధర్మరాజు శోకాన్నీ, చింతనూ వీడి కామ్యకవనంలో నివసించసాగాడు. ఉత్తమమైన ఈ సావిత్र్యుపాఖ్యానాన్ని భక్తితో విన్నవాడు సర్వకార్యసిద్ధిని పొంది సుఖంగా ఉంటాడు. దుఃఖాన్ని పొందడు.

300. సూర్యుడు కర్ణునకు స్వప్నములో సాక్షాత్కరించుట.

జనమేజయుడిలా అన్నాడు. బ్రహ్మస్వరూపా! లోమశుడు ఇంద్రుని మాట ననుసరించి పాండుకుమారుడైన యుధిష్ఠిరునికి ఒక గొప్ప విషయమిలా చెప్పాడు – "నీలో తీవ్రమైన భయమొకటుంది. దానిని నీవు ఎవ్వరికీ చెప్పటం లేదు. అయినా అర్జునుడు ఇక్కడ(స్వర్గలోకం) నుండి వెళ్ళిన తరువాత దానిని కూడా తొలగిస్తాను. తాపసశ్రేష్ఠా! ధర్మాత్ముడయిన యుధిష్ఠిరునకు ఎవ్వరికీ చెప్పుకొనలేనంత భయం కర్ణునివలన ఏం కలిగింది?' వైశంపాయనుడిలా అన్నాడు. 'భరతశ్రేష్ఠా! నీవు అడిగావు కాబట్టి ఈ కథనంతా చెపుతాను. నామాటను సావధానంగా విను. పండ్రెండవ సంవత్సరం ముగిసి పదమూడవ సంవత్సరం ప్రారంభం కాగానే పాండవులకు మేలుచేస్తూ ఇంద్రుడు కర్ణుని యాచించటానికి సిద్ధమయ్యాడు. మహారాజా! కుండలాలను యాచింపదలచిన మహేంద్రుని అభిప్రాయాన్ని గ్రహించి సూర్యభగవానుడు కర్ణుని దగ్గరకు వెళ్ళాడు. ఆ సమయంలో సత్యవాది, బ్రాహ్మణభక్తుడు, వీరుడు అయిన కర్ణుడు అందమైన పరుపులు పరిచిన విలువయిన శయ్యపై నిశ్చింతగా

నిదురిస్తున్నాడు. సూర్యుడు పుత్రస్నేహంతో పరమదయాళువై ఆ రాత్రి కర్ణునకు కలలో కనిపించాడు. యోగసమృద్ధి సంపన్నమైన రూపంగల సూర్యుడు వేదవేత్త అయిన బ్రాహ్మణరూపాన్ని ధరించి కర్ణుని మేలుకోరి అనునయపూర్వకంగా ఇలా అన్నాడు నాయనా! కర్ణా! ప్రేమతో నీకు పరమహితమైన మాట ఈ రోజు చెప్తున్నాను. విను.

కర్ణా! పాండవులకు మేలు చేయదలచి దేవేంద్రుడు నీ కుండలాలను అపహరించగోరి, బ్రాహ్మణవేషంతో రాబోతున్నాడు. నీ స్వభావం ఆయనకు తెలుసు లోకాని కంతటికీ తెలుసు. మంచివాళ్ళు నిన్ను యాచిస్తే ఇచ్చేస్తావే కానీ నీవు దేనినీ అడగవు. డబ్బు అయినా మరేదయినా సరే బ్రాహ్మణులు యాచించినది నీవు తప్పక ఇస్తావు ఎవ్వరినీ లేదని నిరాశపరచవు. నీవు ఇటువంటివాడవని తెలిసి స్వయంగా దేవేంద్రుడే కుండలాలనూ, కవచాన్నీ యాచించటానికి రాబోతున్నాడు యాచించినా సరే ఆయనకు నీవు కుండలాలను ఇవ్వవద్దు. ఏదో రీతిగా ఆయనను అనునయించి పంపాలి. ఇది నీకు చాలా శ్రేయస్కరం. నాయనా! కుండలాలను అడిగినప్పుడల్లా ఏవేవో కారణాలు చెప్పి, బహువిధాలయిన ఇతరధనాలను ఆశచూపి ఆయనను కుండలాల నడుగకుండా నివారించాలి. కుండలాలు కోరిన దేవేంద్రుని రత్నాలు, స్త్రీలు, గోవులు, బహువిధ ధనాలు ఇచ్చి, వివిధ దృష్టాంతాలను వినిపించి నివారించాలి. కర్ణా! శుభప్రదమైన ఈ సహజకుండలాలను నీవు దానంచేస్తే ఆయుస్సు క్షీణించి మృత్యువునకు లొంగిపోగలవు. మానదా! నీవు కవచకుండలాలను ధరించినంత కాలం యుద్ధంలో శత్రువులు నిన్ను చంపలేరు. నామాటనర్థం చేసికో. రత్నమయాలయిన ఈ కవచకుండలాలు అమృతం నుండి పుట్టినవి. కాబట్టి కర్ణా! నీకు బ్రతకాలనుకొంటే వీటిని కాపాడుకో.' కర్ణుడిలా అన్నాడు. 'స్వామీ! తమరెవరు? నాపై పరమసౌహార్దాన్ని ప్రదర్శిస్తూ మాటాడుతున్నారు. ఇష్టమయితే చెప్పండి. ద్విజరూపాన్ని ధరించిన తమ రెవరు?' బ్రాహ్మణుడిలా అన్నాడు. 'నాయనా! నేను సూర్యుడను. నీమీది ప్రేమతో నీముందు ప్రత్యక్షమయ్యాను. నామాటను పాటించు. ఇది నీకు గొప్ప మేలు చేస్తుంది.'

కర్ణుడిలా అన్నాడు నాహితాన్ని కోరి సూర్యభగవానుడే నేడు బోధచేస్తుంటే ఇదే నాకు పరమశ్రేయస్సు. నామాట కూడా వినండి. వరదాత అయిన మిమ్ములను వేడుకొంటున్నాను. స్నేహభావంతో చెప్తున్నాను. నామీద తమకు ఇష్టముంటే నావ్రతం నుండి నన్ను నివారించకండి. సూర్యదేవా! నావ్రతమేమిటో ఈ లోకానికంతటికీ తెలుసు. బ్రాహ్మణప్రవరులకై నాప్రాణాల నయినా ఇచ్చి తీరుతాను. పాండవుల మేలుకోరి దేవేంద్రుడు బ్రాహ్మణవేషంతో నన్ను యాచించటానికి వస్తే ఉత్తమకవచాన్ని, కుండలాలను ఇస్తాను.

దేవతాశ్రేష్ఠా! మూడు లోకాలలో ప్రసిద్ధికెక్కిన నాకీర్తి నశించకూడదు. నావంటివాడు ప్రాణాలనిచ్చి అయినా కీర్తిని కాపాడు కోవాలే కానీ ప్రాణాలను కాదు. కీర్తిమంతుడై మరణించటం తగినదీ, లోకసమ్మతమైనది కూడా. అందువలన దేవేంద్రుడు భిక్షకై నా దగ్గరకు వస్తే ఆ ఇంద్రునకు కవచంతో పాటు కుండలాల నిస్తాను. పాండవుల హితానికై నా కుండలాలను యాచించటం లోకంలో నాకు కీర్తిహేతువే. ఆ ఇంద్రునకే అపకీర్తి కలుగుతుంది. సూర్యా! లోకంలో జీవితానికన్న కీర్తినే నేను కోరుకొంటాను. కీర్తిమంతుడు స్వర్గాన్ని పొందుతాడు. కీర్తిలేనివాడు నశిస్తాడు. **కీర్తి తల్లివలె మనుజుని లోకంలో బ్రతికిస్తుంది. అపకీర్తి బ్రతికి ఉన్న వాడి జీవితాన్ని కూడా నశింపజేస్తుంది.** లోకనాథా! కీర్తియే మనుష్యుని ఆయుస్సని సాక్షాత్తు బ్రహ్మదేవుడే పూర్వకాలంలో ప్రస్తుతించి యున్నాడు. **పురుషునకు పరలోకంలో కీర్తియే దిక్కు. ఇహలోకంలో విశుద్ధకీర్తి ఆయుస్సును పెంపొందిస్తుంది.** కాబట్టి నేను శరీరంతోపాటు పుట్టిన కవచకుండలాలను దానం చేసి శాశ్వతకీర్తిని పొందుతాను. బ్రాహ్మణులకు శాస్త్రోక్తంగా దానం చేసి, దుష్కరపరాక్రమాన్ని ప్రదర్శించి, రణరంగంలో శరీరాన్ని ఆహుతి చేసి, శత్రువులను యుద్ధంలో జయించి, కీర్తిని మాత్రమే పొందుతాను. రణభూమిలో భయపడి జీవితాన్ని యాచించే వారికి అభయాన్ని ఇచ్చి; వృద్ధులను, బాలురను, బ్రాహ్మణులను మహాభయం నుండి విడిపించి, లోకంలో ఘనకీర్తినీ, అనుత్తమమయిన స్వర్గాన్ని పొందుతాను. ప్రాణాలనిచ్చి అయినా కీర్తినే కాపాడుకోవా లన్నదే నా వ్రతం. గ్రహించండి. కాబట్టి సూర్యదేవా! నేను బ్రాహ్మణవేషంతో వచ్చిన ఇంద్రునకు భిక్షపెట్టి ఇహపరలోకాలలో ఉత్తమగతులు పొందుతాను.'

301. కుండలముల దానము చేయవలదని సూర్యుడు ప్రబోధించుట.

సూర్యు డిలా అన్నాడు. 'కర్ణా! నీకు, నీమిత్రులకు, పుత్రులకు, భార్యలకు, తల్లికి, తండ్రికీ కీడు చేయవద్దు. నరోత్తమా! ప్రాణులు శరీరాన్ని సంరక్షించుకొంటూనే ఇహలోకంలో యశస్సును స్వర్గలోకంలో స్థిరకీర్తిని కోరుకోవాలి. అయితే నీవు ప్రాణాలను పోగొట్టుకొంటూ శాశ్వతకీర్తిని పొందగోరుతున్నావు. ఆ కీర్తి నీ ప్రాణాలను తీసికోనిపోతుంది. సందేహమే లేదు. పురుషోత్తమా! తల్లి, తండ్రి, బిడ్డలు, ఇతర బంధువులు బ్రతికియున్న వారిద్వారానే ఏదైనా ప్రయోజనాన్ని పొందగలుగుతారు. నరశ్రేష్ఠా! రాజులయినా జీవించియుంటేనే పౌరుషంతో కీర్తిని పొందగలిగేది. ఇది గ్రహించు. తేజస్వీ! బ్రతికియున్నవానికే కీర్తి ఉపయోగపడుతుంది మరణించి దేహం బూడిద అయిన తరువాత కీర్తి ఎందుకు? చనిపోయిన వానికి కీర్తి తెలియదు. బ్రతికియుంటేనే కీర్తిని అనుభవించగలిగేది మరణించిన

మనుష్యునకు కీర్తి శవానికి పూలమాలవంటిది. నీవు నాభక్తుడవని నీ హితాన్ని కోరుతూ నేనిది చెప్తున్నాను. నేను నాభక్తులను రక్షించాలన్న కారణంతో ఇది చెప్తున్నాను. మహాభుజా! ఇతడు నా భక్తుడు. పరమభక్తితో నన్ను సేవిస్తున్నావన్న భావంతో నాలో నీపై ప్రేమ కలిగింది. కాబట్టి నామాటను పాటించు. ఇక్కడ దేవహితమైన ఆధ్యాత్మిక రహస్యం కూడా ఒకటుంది. అందువలననే నీకు చెప్తున్నాను సందేహించక చెప్పినట్టు చేయి.

పురుషశ్రేష్ఠా! ఇది దేవరహస్యం. నీవు తెలియలేవు. కాబట్టి ఆ రహస్యాన్ని చెప్పటం లేదు. తగిన సమయంలో నీవే గ్రహిస్తావు. రాధేయా! పునరుక్త మయినా మరల చెప్తున్నా. గ్రహించు. దేవేంద్రుడు అడిగితే నీవు కుండలాలను ఇవ్వకూడదు. మహాతేజస్వీ! నిర్మలాకాశంలో విశాఖా నక్షత్రాల రెండింటి మధ్య చంద్రునివలె నీవు అందమైన కుండలాలతో ప్రకాశిస్తున్నావు. బ్రతికియున్నవానికే కీర్తి గొప్పగా ఉంటుంది. అని తెలిసికో. నాయనా! కుండలాలను యాచించే దేవేంద్రుని నిరాకరించి పంపాలి. అనఘా! దేవేంద్రుడు కుండలాలకై చేసే అభ్యర్థనను నీవు హేతుసహితంగా వివిధవాక్యాలతో ఎప్పటికప్పుడు త్రోసివేయాలి. కర్ణా! హేతుయుతంగా, మధురంగా మాటాడుతూ దేవేంద్రుని కుండలాభ్యర్థన బుద్ధిని నీవు నెట్టివేయాలి. నరశ్రేష్ఠా ! నీవు నిత్యమూ సవ్యసాచితో పోటీపడుతుంటావు. కాబట్టి యుద్ధంలో శూరుడైన అర్జునుడు ఎప్పుడైనా తలపడవచ్చు. అయితే దేవేంద్రుడే సహాయంగా వచ్చినా నీవు కుండలాలు ధరించి యున్నంతకాలం అర్జునుడు యుద్ధంలో నిన్ను జయించలేడు. కాబట్టి కర్ణా! యుద్ధంలో అర్జునుని ఓడించాలని నీవనుకొంటే శుభప్రదాలయిన ఈ కుండలాలను నీవు ఇంద్రునకు ఇవ్వకూడదు.'

302. దేవేంద్రుని మండి శక్తివి గ్రహించి కవచకుండలముల నిచ్చుటకు కర్ణుడు అంగీకరించుట.

కర్ణు డిలా అన్నాడు. 'సూర్యదేవా! నేను తమ భక్తుడను. అది తమరెరిగినదే. తమకివ్వరానిది ఏ రీతిగానూ నా దగ్గరలేదు, నాకు భార్య కానీ, పిల్లలు కానీ, మిత్రులు కానీ, నా శరీరం కానీ తమవలె ఇష్టమైనవి కావు. నా భక్తికి సదా ఆశ్రయస్థానం తమరే. మహాత్ములు తమ ప్రియభక్తులమీద ప్రీతిని ప్రదర్శిస్తారు. ఇందులో సందేహంలేదు. ఇది తమరెరుగనిదీ కాదు. "కర్ణుడు నా ప్రియభక్తుడు. స్వర్గలోకంలో కూడా అతనికి మరొక దేవుడు లేడు" అని తెలిసియేగా తమరు నా మేలుకోరి చెప్తున్నది. చండకిరణా! మరొకసారి తలవాల్చి, ప్రసన్నులను చేసికొని పలుమార్లు క్షమను కోరుతున్నాను. నేను చెప్పబోవు మాటలకు నన్ను క్షమించాలి. నేను అసత్యానికి భయపడినట్లు మృత్యువుకు

కూడా భయపడను. విశేషించి ఎల్లప్పుడూ సజ్జనులయిన విప్రుల కందరకూ భయపడతాను. వారికై ప్రాణాల నివ్వవలసి వచ్చినా నేను ఆలోచించను. దేవా! తమరు అర్జునుని దృష్టిలో పెట్టుకొని చెప్పారు. భాస్కరా! సంతాపంవలన పీర్వడిన మనోదుఃఖాన్ని తొలగించుకోండి. కార్తవీర్యుని వంటి పరాక్రమంగల అర్జునుని అయినా యుద్ధంలో గెలుస్తాను. దేవా! నాదగ్గరున్న అస్త్రబలమెంతో తమకు తెలుసు. పరశురాముని నుండి, మహాత్ముడైన ద్రోణుని నుండి అస్త్రవిద్యాబలాన్ని పొందాను. సురోత్తమా! నా వ్రతాన్ని కొనసాగించటానికి అనుమతించండి. ఇంద్రుడు యాచిస్తే నా జీవితాన్ని అయినా ఇస్తాను. సూర్య డిలా అన్నాడు – 'నాయనా! శుభప్రదాలైన కుండలాలను ఇంద్రునకు ఇవ్వాలనే నిర్ణయమైతే, నీ గెలుపుకోసం, మహాబలుడయిన ఇంద్రునితో ఒకనియమం మేరకు కుండలాలను ఇస్తానని చెప్పు. కుండలాలు ధరించిన నిన్ను ఏ ప్రాణికూడా చంపలేదు. నాయనా! దేవేంద్రుడు అర్జునుడి ద్వారా యుద్ధంలో నిన్ను చంపించగోరి నీ కుండలాలను అపహరింపదలచాడు.

కాబట్టి నీవు పదే పదే మంచి మాటలతో దేవేంద్రుని ఆరాధించి, ఆ పురందరుని నుండి అమోఘశక్తిని అభ్యర్థించు. సహస్రాక్షా! నాకు శత్రుసంహారంచేయగల అమోఘశక్తినిస్తే కుండలాలను ఉత్తమకవచాన్ని ఇస్తాను. ఆ నియమంతోనే నీవు దేవేంద్రునకు కుండలాల నిమ్ము. కర్ణా! ఆ శక్తితో నీవు రణరంగంలో శత్రువులను చంపవచ్చు మహాబాహా! దేవేంద్రుడు ఇచ్చే ఆ శక్తి వందలు, వేలుకొలదిగ శత్రువులను చంపకుండా తిరిగి నీ చేతికి రాదు.' ఆ రీతిగా చెప్పి సూర్యుడు వెంటనే అదృశ్యమయ్యాడు.

(రాజా కల చెదిరిపోగానే కర్ణుడు పలవరిస్తూ మేల్కొన్నాడు. భారతా మేల్కొన్న తర్వాత వాగ్మి అయిన రాధేయుడు ఆలోచించి, శక్తికి సంబంధించి ఇలా నిర్ణయించుకొన్నాడు. 'వరంతవుడైన ఇంద్రుడు నా దగ్గరకు కుండలాలు కోరివస్తే శక్తికి బదులుగానే కుండలాలను, కవచాన్ని ఇస్తాను.' భరతశ్రేష్ఠా తెల్లవారి లేచి ప్రాతఃకాల కృత్యాలు ముగించి బ్రాహ్మణుల స్వస్తివచనాలు స్వీకరించి సమయోచితకార్యాలు శాస్త్రోక్తంగా ముగించాడు. రాజశార్దూలా ఆ పై రెండుఘడియలు జపం చేశాడు)

జపావసానంలో కర్ణుడు తన కలను సూర్యునకు నివేదించాడు తాను చూసినదీ, ఆ రాత్రి తామిరువురూ మాటాడుకొన్నదీ అంతా యథాతథంగా, యథాక్రమంగా కర్ణుడు సూర్యునకు చెప్పాడు. అది విని సూర్యభగవానుడు నవ్వుతూ అదంతా సత్యమే' అని కర్ణునితో అన్నాడు. ఆపై పరవీరసంహారకుడైన కర్ణుడు అదంతా సత్యమని గ్రహించి, శక్తిని అభిలషిస్తూ, దేవేంద్రునికై ఎదురుచూడసాగాడు.

303. కుంతిభోజుని ఇంటికి దుర్వాసుడు వచ్చుట. తత్సేవకై పృథను నియోగించుట.

జనమేజయు డిలా అన్నాడు. 'సజ్జనశ్రేష్ఠా! సూర్యుడు కర్ణునకు చెప్పని ఆ రహస్య మేమిటి? కర్ణుని కవచకుండలాలు ఎటువంటివి? అవి కర్ణునకు ఎక్కడ నుండి లభించాయి? ఇది వినాలని ఉంది. నాకు చెప్పవలసినది.' 'రాజా! ఇదిగో సూర్యుడు రహస్యమని దాచిన విషయాన్నే చెప్పబోతున్నాను. కవచకుండలాలు ఎటువంటివో కూడా వివరించబోతున్నాను. రాజా! ఒకప్పుడు కుంతిభోజుని కొలువులోనికి తీక్ష్ణ తేజస్సుగల్గి, దీర్ఘబాహువై, గడ్డం, మీసం, జటలు, దండం ధరించిన ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. ఆ బ్రాహ్మణుడు రూపవంతుడు, నిర్దోషశరీరుడు. జ్వలిస్తున్న తేజస్సు గలవాడు. తేనె రంగువాడు. మధుర వచనుడు. తపస్సు, స్వాధ్యాయం ఆభరణాలుగా గలవాడు. మహాతపస్వి అయిన ఆ బ్రాహ్మణుడు కుంతిభోజునితో ఇలా అన్నాడు. మాత్సర్యరహితా! నీ ఇంట భిక్షను స్వీకరింప గోరుతున్నాను. అనఘా! నీవు కానీ, నీ అనుచరులు కానీ నాకు అప్రియ మైన దేదీ చేయరాదు. అలా ఇష్టమయితేనే నేను నీ ఇంట ఉంటాను. రాజా! నా ఇష్టం వచ్చినప్పుడు వెళతాను. ఇష్టం వచ్చినపుడు వస్తాను. నా శయ్యపై లేదా ఆసనంపై కూర్చోవటం తప్పు. అలా ఎవ్వరూ చేయకూడదు.' కుంతి భోజుడు "అలాగే" అని ప్రీతిపూర్వకంగా ఆ బ్రాహ్మణునితో చెప్పి మరలా ఇలా అన్నాడు. 'మహాప్రాజ్ఞా! నా కుమార్తె పృధ. మంచిశీలం, మంచి నడవడి కలది. సాధ్వి. నియమబద్ధంగా వ్యవహరిస్తుంది. ఆలోచన కలది. ఆమేరకు ప్రసిద్ధికెక్కినది కూడా. ఆమె నీ సేవకై ఉంటుంది. ఎప్పుడూ మిమ్ము అవమానించదు. ఆమె శీలంతో, సదాచారంతో మీకు సంతోషం కలుగుతుంది.' ఆ రీతిగా పలికి ఆ విప్రుని యథావిధిగా పూజించి, కుమార్తెను పృధను పిలిపించి ఇలా అన్నాడు.

అమ్మా! మహాభాగుడైన ఈ బ్రాహ్మణుడు మన ఇంట ఉండగోరుతున్నాడు. నేను అలాగే అని అంగీకరించాను. అమ్మా! నీమీది విశ్వాసంతో ఈ బ్రాహ్మణారాధనను నేను అంగీకరించాను. నా మాట వమ్ము కాకుండా ఎలాగైనా నీవే చూడాలి. తపస్వి, మహాతేజస్వి, తపస్సంపన్నుడు, స్వాధ్యాయ నిరతుడు అయిన ఈ విప్రుడు ఏది అడిగితే అది శ్రద్ధగా ఇవ్వాలి బ్రాహ్మణుడే పరమ తేజస్సు. బ్రాహ్మణుడే పరమ తపస్సు. బ్రాహ్మణులనమస్కారాల చేతనే సూర్యుడు గగనతలంపై ప్రకాశిస్తాడు. పూజింపదగిన బ్రాహ్మణులను పూజించనందువలననే మహాసురుడైన వాతాపి, తాలజంఘుడు బ్రహ్మదండంతో మరణించారు. అందువలన అమ్మా! నీ పయి ఇప్పుడు పెద్దబరువు ఉంచాను. నీవు ఎప్పుడూ నియమబద్ధంగా ఈ బ్రాహ్మణుని ఆరాధించాలి. చిన్ననాటినుండి

నీ ఏకాగ్రత నాకు తెలుసు. సర్వబ్రాహ్మణులయందు, గురుబంధుజనులయందు, సేవకులపై, మిత్రులపై సంబంధుల విషయంలో, తల్లిపై, నాయందు కూడా తగిన రీతిగా ప్రవర్తించి అందరినీ ఆకట్టుకొనగలిగావు. అనవద్యాంగీ! ఈ నగరంలో గానీ, అంతఃపురంలో కానీ, నీ సేవకులలో కానీ నీ ప్రవర్తనతో ఆనందించని వాడు ఎవ్వడూ లేడు. ఈ బ్రాహ్మణుడు కోపిష్ఠి కాబట్టి, నీవు ఇంకా చిన్నపిల్లవే కాబట్టి, నా కుమార్తెవు కాబట్టి నీకు కొన్ని విషయాలు చెప్పాలి. నీవు వృష్ణివంశంలో పుట్టిన దానవు. శూరసేనుని ప్రియపుత్రికవు. నీ చిన్నతనంలోనే నీ తండ్రి స్వయంగా ఆనందంగా నిన్ను నా చేతిలోపెట్టాడు వసుదేవుని సోదరివి. 'నా పిల్లల్లో పెద్దదానవు. 'నా తొలిబిడ్డను నీకిస్తాను' అని ముందు నాకు మాట ఇచ్చాడు కాబట్టి నీ తండ్రి నిన్ను నా దత్తపుత్రికను చేశాడు. అటువంటి వంశంలో పుట్టి ఇటువంటి వంశంలో పెరిగావు. ఒక సరస్సునుండి మరొక సరస్సులోనికి ప్రవహించిన నీటివలె ఒక సుఖస్థానం నుండి మరొక సుఖస్థానానికి నీవు చేరావు దుర్వంశంలో పుట్టి ఎదో రీతిగా అదుపులో నున్న స్త్రీలు సాధారణంగా అవివేకంతో తప్పులు చేస్తారు. పృధా! నీవు రాజవంశంలో జన్మించిన దానవు నీ రూపం అద్భుతమైనది శీలసదాచారాలతో సంపన్నురాలవు. ఆలోచనగల దానవు. అటువంటి నీవు దర్పాన్ని, దంభాన్ని, అభిమానాన్ని వీడి వరదుడైన విప్రుని ఆరాధించి మేలు పొందగలవు. కళ్యాణీ! ఈ రీతిగా నీవు తప్పక శుభాలు పొందగలవు. ఈ బ్రాహ్మణోత్తముడు కోపిస్తే మన వంశమే తగులబడుతుంది.'

304. కుంతి బ్రాహ్మణువకు పరిచర్యలు చేయుట.

'రాజేంద్రా! నియంత్రణలో నీ ప్రతిజ్ఞానుసారం ఈ బ్రాహ్మణుని సేవకై సన్నిధిలోనే నిలుస్తాను. నేను పొల్లుమాటలు పలకటం లేదు. బ్రాహ్మణులను పూజించాలి అన్నది నా స్వభావం కూడా. ఇది నీకు ఇష్టమయిన పని. నాకు పరమ శ్రేయోదాయకమైన పని. ఈ పూజ్యవిప్రుడు సాయంకాలం వచ్చినా, ప్రాతఃకాలమందే వచ్చినా, అర్ధరాత్రియందు వచ్చినా నాపై కోపపడకుండునట్లు సేవిస్తాను. ఇది నాకు కూడా లాభదాయకమే. ద్విజుల నర్చిస్తూ, నీ ఆజ్ఞను పరిపాలిస్తూ హితాన్ని కలిగిస్తాను. రాజేంద్రా! నమ్మకంతో నిలు. ఈ బ్రాహ్మణుడు నీ ఇంట నివసిస్తూ ఎప్పుడూ అప్రియాన్ని చవిచూడడు. ఈ సత్యాన్ని నీకు చెప్తున్నాను. ఈ ద్విజునకు ఏది ప్రియకరమో, నీకు ఏది హితకరమో దానికై ప్రయత్నిస్తాను నీ మనస్సులోని చింత తొలగిపోవుగాక! మహాభాగులైన బ్రాహ్మణులను పూజిస్తే వారు తరింపజేయ సమర్థులు. దానికి భిన్నంగా ప్రవర్తిస్తే వారు చంపటానికి కూడా సమర్థులే. నాకు అది తెలుసు. కాబట్టి ఈ ద్విజోత్తముని సంతోషపెడతాను రాజా! నా కారణంగా

ఈ బ్రాహ్మణోత్తముని వలన నీకు వ్యధ కలుగదు. అపరాధం చేసినా కూడా రాజులకు బ్రాహ్మణులు కీడు చేస్తారు. పూర్వం సుకన్య తప్పు చేస్తే చ్యవనుడు శర్యాతికి కీడు చేయతలపెట్టాడు గదా! నీవు చెప్పినట్లుగా బ్రాహ్మణునితో ప్రవర్తించవలసిన పద్ధతిని పరమనియమంతో పాటిస్తూ నేను ఈ ద్విజోత్తముని సేవిస్తాను.' ఈ రీతిగా మాటాడుతున్న పృధను మాటిమాటికి దగ్గరకు తీసికొని, ఆమె మాటను సమర్థించి రాజు ఎలా ఎలా చేయాలో ఆమెకు పూర్తిగా ఆదేశించాడు

రాజు ఇలా అన్నాడు. కళ్యాణీ! నాకూ నీకూ మనవంశానికీ మేలు జరగటానికై నీవు ఇదంతా ఈ పద్ధతిలో నిస్సందేహంగా చేయాలి. ద్విజవత్సలుడు అయిన కుంతిభోజుడు కుమార్తెకు ఆ రీతిగా చెప్పి పృధను సేవకై బ్రాహ్మణున కర్పించాడు 'బ్రహ్మస్వరూపా! ఈమె నా కుమార్తె. చిన్నపిల్ల. సుఖంగా పెరిగింది. ఏదైనా తప్పుచేస్తే దానిని మనస్సులో పెట్టుకొనవలదు. మహాభాగులయిన బ్రాహ్మణులు వృద్ధులు, బాలురు, తాపసులు తప్పు చేసినా వారిపై ఎప్పుడూ కోపపడరు. ఎంతపెద్ద తప్పు జరిగినా బ్రాహ్మణులు సహనాన్నే ప్రదర్శించాలి. యథాశక్తిగా, యథోత్సాహంగా జరిగే పూజను స్వీకరించాలి. ఆ బ్రాహ్మణుడు 'అలాగే' అన్నాడు. ఆ రాజు ఆనందించాడు. హంసవలె, చంద్రకిరణాలవలె ప్రకాశిస్తున్న గృహాన్ని ఆ బ్రాహ్మణునకు నిర్దేశించాడు ఆ ఇంట అగ్నిహోత్రగృహంలో కాంతిమంతమైన ఆసనం ఆ ద్విజునకై ఏర్పాటు చేయబడింది. ఆహారసామగ్రి అంతా కూడా అక్కడే సమకూర్చబడింది. రాజకుమారి పృధ అలసట, అభిమానం లేకుండా పరమప్రయత్నంతో బ్రాహ్మణసేవలో లగ్నమయింది బాహ్యాంభంతరాల్లో పరిశుద్ధమయిన పృధ బ్రాహ్మణుని దగ్గర దేవతలను వలె ఆయనను యథావిధిగా సేవిస్తూ సంతోషపెట్టింది.

305. సేవాసంతుష్టుడైన బ్రహ్మర్షి పృథకు మంత్రము నుపదేశించుట.

నియమంగా వ్రతపాలన చేస్తూ ఆ పృధ పరిశుద్ధ హృదయంతో వ్రత నిష్ఠుడైన ఆ బ్రాహ్మణుని ఆనందింపజేసింది. ఒక్కొక్క సమయంలో ఆ ద్విజసత్తముడు మరునాడుదయం వస్తానని వెళ్ళి ఆ సాయంకాలానికో, రాత్రికో తిరిగి వచ్చేవాడు. ఆ కన్య సర్వవేళలలోనూ అంతకుముందు కన్న ఎక్కువగా భక్ష్యభోజ్యాది సామగ్రిని శయ్యాసనాదులనూ సమకూరుస్తూ ప్రతిదినమూ సేవిస్తోంది. ఆహారాది సత్కారాలతో, శయ్యాసనాది పరిచర్యలతో ఆమె ఆయనకు చేస్తున్న సేవ రోజురోజుకూ పెరుగుతోందే కానీ తగ్గటం లేదు ఆ బ్రాహ్మణుడు ధిక్కరించినా, దోషారోపణచేసినా, అప్రియంగా మాటాడినా కూడా పృధ ఆయనకు అప్రియమైన పని ఎమీ చేయలేదు. ఆ ద్విజుడు

ఒక్కొకసారి వెళ్ళినవాడు మరేపనికీ వ్యవధి ఇవ్వకుండానే తిరిగి వచ్చేవాడు. ఒక్కొకసారి కొన్నిరోజులవరకు కనిపించే వాడు కాదు. అత్యంతదుర్లభమైన ఆహారపదార్థాలను అడిగేవాడు. కానీ పృధ శిష్యునివలె, పుత్రునివలె, సోదరివలె అత్యంత నిగ్రహంతో అదంతా సిద్ధంగానే ఉందని ఆయనతో చెప్తూ సేవిస్తూండేది. దోషం లేని కన్యారత్నమైన ఆ పృధ ఆ బ్రాహ్మణోత్తముని అభిరుచి ననుసరించి ప్రవర్తిస్తూ ఆయనకు ప్రీతిని కలిగించింది. ఆమె స్వభావంతో, నడవడితో, ఏకాగ్రతతో ఆ ద్విజోత్తముడు ఆనందించాడు. ఆమెకు హితం కలగాలని ఎంతో ప్రయత్నించాడు. ఉదయమూ, సాయంకాలమూ కూడా ఆమె తండ్రి 'వత్సా! బ్రాహ్మణుడు నీ సేవతో సంతోషపడుతున్నాడా?' అని అడిగేవాడు. చాలా ఆనందిస్తున్నాడు" అని ఆ యశస్వినీ తండ్రికి సమాధానమిచ్చేది దానితో మహామనస్వి అయిన కుంతిభోజుడు పరమానందపడేవాడు.

అలా సంవత్సరం గడచిపోయింది. మునివరుడైన ఆ బ్రాహ్మణునకు పృధపరిచర్యలో ఏలోపమూ కనిపించలేదు. దానితో ఆనందించిన ఆయన ఆమెపై వాత్సల్యంతో ఇలా అన్నాడు. భద్రా! నీ పరిచర్యతో ఎంతో ప్రీతిని పొందాను. కళ్యాణీ! మానవులకు పొందసాధ్యం కాని వరాలను కోరుకో! ఇస్తాను. దానితో నీవు కీర్తిలో స్త్రీలనందరినీ మించిపోగలవు.' కుంతి ఇలా అన్నది. 'వేదవిత్తమా! నాసేవలకు తమరు, నాతండ్రి సంతసించారు. నా కోరికలన్నీ తీరినట్లే. బ్రాహ్మణా! నాకు వరాలతో పనిలేదు' బ్రాహ్మణు డిలా అన్నాడు. కళ్యాణీ! నానుండి నీకు వరం అవసరం లేకపోతే ఈ మంత్రాన్ని స్వీకరించు. దీనితో దేవతలను ఆహ్వానించవచ్చు భద్రా! ఈ మంత్రంతో నీవు ఏ దేవతల నాహ్వానిస్తే ఆ దేవతలు నీ అధీనంలో ఉండవలసి వస్తుంది ఇష్టమున్నా, లేకపోయినా ఆ దేవుడు మంత్రప్రభావంతో శాంతుడై వినయవంతుడైన సేవకుని వలె నీకు అధీను డవుతాడు' వైశంపాయను డిలా అన్నాడు. 'అనిందిత అయిన పృధ అప్పుడు శాపభయంవలన బ్రాహ్మోణోత్తముని మాటను రెండవసారి నిరాకరించలేకపోయింది. రాజా! అప్పుడు ఆ బ్రాహ్మణుడు నిర్దుష్టశరీరావయవాలు గల ఆ పృధకు అధర్వోపనిషత్తులోని ఆ మంత్రసముదాయాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రాన్ని పృధకు.ఉపదేశించి ఆ బ్రాహ్మణుడు 'రాజా! నీ ఇంట సుఖంగా నివసించాను. నీ కుమార్తె నిరంతరాయంగా చూపిన ఆదరణతో సంతోషించాను. ఇక నేను వెళ్ళివస్తాను" అని కుంతిభోజునితో పలికి అదృశ్య డయ్యాడు. అప్పుడు కుంతిభోజుడు అప్పుడే అదృశ్యమైపోయిన ఆ ద్విజుని తలచుకొని, ఆశ్చర్యానికి లోనయి పృధను అభినందించాడు.

306. కుంతి సూర్యుని ఆవాహన చేయుట - కుంతీ సూర్యసంవాదము.

ఆ ద్విజశ్రేష్ఠుడు వెళ్ళిపోయిన తరువాత ఏదో కారణంచేత ఆ పృథ మంత్రబలాబలాలను గురించి ఆలోచించింది. ఆ మహాత్ముడు నా కిచ్చిన ఈ మంత్ర మెటువంటిదో! వెంటనే దాని బలమెంతో తెలిసికోవాలి. ఈవిధంగా ఆలోచిస్తున్న ఆమె హఠాత్తుగా తనలో ఋతులక్షణాలు గమనించింది. కన్యావస్థయందే రజస్వల కావటంతో ఆమె సిగ్గుపడింది. తరువాత ఒకరోజు మేడపై విలువైన శయ్యపై శయనించియున్న ఆమె తూర్పుదిక్కున ఉదయిస్తున్న ఆదిత్యమండలాన్ని చూసింది. ఆమె దృష్టి, మనస్సు సూర్యునిపై లగ్న మయ్యాయి. ప్రాతస్సంధ్యలో సూర్యుని చూస్తున్నా ఆమె దృష్టికి అవి గ్రుచ్చుకొనలేదు. ఆమె దివ్యదృష్టిని పొందింది. దివ్యదర్శనాన్ని చూసింది. ఆ సూర్యుడు కవచాన్ని ధరించి కుండలాల నలంకరించుకొని ఉన్నాడు. రాజా! మంత్రవిషయంలో ఆమెకు కుతూహలంగానే ఉంది. అప్పుడు ఆ సూర్యదేవుని ఆహ్వానించింది. అప్పుడు ప్రాణాయామం చేసి దివాకరుని ఆవాహన చేసింది. ఆపై సూర్యుడు త్వరపడుతూ వచ్చాడు. తేనెవన్నెతో, దీర్ఘబాహువులతో, శంఖంవంటి మెడతో నవ్వుతూ కనిపించాడు సూర్యుడు. అంగదాలు, తలపై కిరీటం ధరించి దిక్కులను వెలిగింపజేస్తున్నాడు. యోగశక్తితో తనను రెండుగా చేసికొని ఒక శరీరంతో వచ్చాడు. రెండవశరీరంతో గగనంలో తపిస్తున్నాడు. మధురమైన సామవచనంతో కుంతితో ఇలా అన్నాడు.

'భద్రా! నీ మంత్రబలం వలన ఆకర్షింపబడి నీ అధీనంలోనికి వచ్చాను. రాజకుమారీ! నీ వశంలో ఉండి నేనేం చేయాలి? చెప్పు? ఆ పని చేస్తాను.' 'స్వామీ! తమరు వచ్చిన చోటుకే వెళ్ళండి. కుతూహలం కొద్దీ ఆవాహన చేశాను. భగవాన్! ప్రసన్నులుకండి.' సూర్యుడిలా అన్నాడు. 'నీవు చెప్పినట్లు వెళ్ళిపోతాను. కానీ దేవుని ఆవాహనచేసి వ్యర్థంగా పంపించటం న్యాయసమ్మతం కాదు. సహజ కవచకుండలాలతో లోకంలో సాటిలేని పరాక్రమంగల కొడుకు సూర్యుని ద్వారా కలగాలని నీ మనస్సంకల్పం. కాబట్టి నీవు నీ శరీరాన్ని నాకు సమర్పించుకో. నీ సంకల్పానికి అనుగుణంగా నీకు కొడుకు పుడతాడు. భద్రా! నీతో సంగమించి నా దారిన నేను పోతాను. నామాట మన్నించి నేడు నా ముచ్చట తీర్చకపోతే కోపంతో నిన్ను ఆ బ్రాహ్మణుని, నీ తండ్రిని కూడా శపిస్తాను. నీ కారణంగా వారి నందరినీ నిస్సంశయంగా దహించివేస్తాను. నీ అవినీతి నెరుగక మూఢుడైన నీతండ్రిని, నీ శీలవృత్త నియమాల నెరుగక మంత్రప్రదానం చేసిన ఆ బ్రాహ్మణుని పూర్తిగా దహిస్తాను. దేవేంద్రుడు మొదలుగా గల దేవతలంతా ఆకాశంలో నిలిచి నీచే మోసగింపబడిన నన్ను చూచి నవ్వుతున్నారు. నీకు నేను ఇంతకు ముందే దివ్య దృష్టినిచ్చాను. ఆ దృష్టితోనే

నన్ను చూడగలిగావు. ఆ దృష్టితోనే ఆ దేవగణాలను కూడా చూడు' అన్నాడు. అప్పుడు రాజకుమారి గగనంలో తమ తమ విమానాలలో కూర్చొనియున్న దేవగణాలను చూచింది. కాంతికిరణాలతో గొప్పగా వెలుగుతున్న సూర్యునివలె వారు కనిపిస్తున్నారు. వారినందరినీ చూచి సిగ్గుపడి, భయపడి పృధ సూర్యునితో ఇలా అన్నది. "స్వామీ! తమరు తమ విమానంలోనికి వెళ్ళండి. నా కన్యాభావం వలన ఈ దుఃఖదాయకమైన అపచారం జరిగింది. నా తండ్రి, తల్లి, ఇతరగురుజనులు మాత్రమే నన్ను ప్రదానం చేయదగినవారు. నేను ధర్మలోపం చేయలేను. ఈ లోకంలో స్త్రీల నడవడి దేహాన్ని పవిత్రంగా రక్షించుకొంటేనే ప్రశంసార్హ మవుతుంది సూర్యదేవా! మంత్రబలాన్ని తెలిసికోవాలని నేను తమరిని ఆవాహించాను. స్వామీ! అమాయక బాలికగా నన్ను భావించి క్షమించవలసినది.' సూర్యుడిలా అన్నాడు. 'కుంతీకుమారీ ! బాలికవని భావించియే నిన్ను ఇంతగా అనునయిస్తున్నాను. మరొక స్త్రీనెవ్వరినీ ఇట్లు అనునయించను. పిరికిదానా! నీవు నీ శరీరాన్ని నాకు సమర్పించు. అలా చేసినప్పుడే నీకు ప్రశాంతి. భావినీ! అనవద్యాంగీ! నీవు నన్ను మంత్రాలతో ఆవాహన చేశావు. నీతో సంగమింపక నేను వెళ్ళటం ఆ ఆవాహనను వ్యర్థం చేయటమే. అలా జరిగితే నేను లోకంలో పరిహాసాస్పదుడను కాగలను. శుభా! దేవతలందరిలో నేను ఎత్తిచూపబడతాను అందువలన నాతో సంగమించు నావంటి కొడుకు పుడతాడు. లోకంలో విశిష్టస్త్రీవి కాగలవు సందేహం లేదు.'

307. కుంతి గర్భవతి అగుట.

మనస్వినియైన ఆ కన్య అనేకవిధాలుగా మధురంగా మాటాడినా కూడా సూర్యుని ఒప్పించలేకపోయింది. సూర్యుని తిరస్కరించటానికి శక్తిలేక ఆ బాల శాపానికి భయపడి, చాలాసేపు జరుగబోయే దానిని గూర్చి ఆలోచించింది. నా కారణంగా కోపించిన ఈ సూర్యునివలన నిరపరాధి అయిన నా తండ్రికి, ఆ బ్రాహ్మణునకు శాపం తప్పిపోయే మార్గమేది? సజ్జన బాలు డయినా సరే తీవ్రమోహంతో పాపరహితమైన తేజస్సునకూ, తపస్సునకూ దగ్గరగా వెళ్ళకూడదు. కానీ నేను చాలా భయపడుతున్నాను. సూర్యదేవుని చేతికి చిక్కాను అయినా సరే స్వయంగా ఆత్మప్రదాన మనే అకృత్యాన్ని ఎలా చేయగలను? ఆ పృధ శాపానికి భయపడుతూ మనస్సులో పరిపరివిధాలుగా ఆలోచించింది ఆమె శరీరమంతా మోహం క్రమ్మింది. మాటిమాటికి విస్మయానికి లోనవుతోంది. ఒకవైపు శాపభయం. మరొక వైపు బంధువులను గూర్చిన భయం. రాజా! ఈ స్థితిలో ఆమె సిగ్గుతో తడబడుతున్న మాటలతో సూర్యునితో ఇలా అన్నది.

'దేవా! నాతండ్రి జీవించియున్నాడు. నాతల్లి, ఇతర బంధువులూ బ్రతికియున్నారు. వారు జీవించియుండగా ఈ ధర్మలోపం జరుగకూడదు. దేవా! తమరితో సమాగమం ధర్మహీన మయితే నా కారణంగా మావంశానికి కీర్తిలోపం కలుగుతుంది. సూర్యదేవా! బంధువులు కన్యాదానం చేయకపోయినా మన సమాగమాన్ని తమరు ధర్మసమ్మతమని భావిస్తే తమకోరిక తీరుస్తాను. దుర్దర్షా! దేహార్పణం చేసికూడా నేను సాధ్విగానే ఉండగలనా? ప్రాణుల ధర్మం, యశస్సు, కీర్తి, ఆయుస్సు అన్నీ నీయందే ప్రతిష్ఠితమై ఉన్నాయి.' సూర్యుడిలా అన్నాడు. 'శుచిస్మితా! నీకు మేలు జరుగుతుంది. నామాటవిను. నీ తండ్రి కానీ, తల్లి కానీ, ఇతరగురువులు కానీ దీనిని ఆపలేరు. కమ్ ధాతువు నుండి కన్యాశబ్దం పుట్టింది. తనకు నచ్చినవానిని స్వతంత్రంగా కోరుకొంటుంది. అందువలననే ఆమె కన్య. నా సమాగమంతో నీవు అధర్మం చేసినట్టు కాదు. లౌకిక కామానికై నేను అధర్మాన్ని ఎలా స్వీకరిస్తాను? నాకు సంబంధించి స్త్రీపురుష లందరూ ఆవరణశూన్యులే. ఇతరవికారాలన్నీ లౌకికమానవ స్వభావానికి సంబంధించినవి. కాబట్టి నాతో సంగమించినా మరల కన్యగానే మిగలగలవు. మహాబాహువు, మహాయశస్వి అయిన కొడుకు నీకు పుడతాడు.' కుంతి ఇలా అన్నది. 'చీకట్లు తొలగించే సూర్యదేవా! తమ వలన నాకు పుట్టే కొడుకు సహజకవచకుండలాలతో మహాబాహువు, మహాబలుడు అయి ఉండాలి.' సూర్యుడిలా అన్నాడు. 'కళ్యాణీ! నీకొడుకు దివ్యకవచాన్నీ, కుండలాలను ధరించి మహాబాహువు కాగలడు. ఆ కవచకుండలాలు అమృతమయాలుగా అతని కుంటాయి.'

కుంతి ఇలా అన్నది. 'తమవలన నాకు కలుగబోయే కొడుకుకు అమృతంనుండి పుట్టిన కుండలాలు, ఉత్తమకవచమూ ఉండేటట్లయితే దేవా! భగవాన్! తమరు చెప్పినట్లు తమతో సంగమిస్తాను. ఆ కొడుకు నీ పరాక్రమ, రూప, సత్త్వ, తేజస్సులతో ధర్మాత్ముడు కావాలి.' సూర్యుడిలా అన్నాడు. 'రాజకుమారీ! అదితి నాకు కుండలాల నిచ్చింది. వాటినీ, ఈ ఉత్తమ కవచాన్నీ నీ కొడుకున కిస్తాను.' కుంతి ఇలా అన్నది. 'స్వామీ! సూర్యదేవా! ఇది చాలు. తమరు చెప్పిన లక్షణాలతో కొడుకు పుట్టేటట్లయితే తమతో నేను సంగమిస్తాను.' 'అలాగే' అని సూర్యుడు యోగరూపంతో కుంతిలో ప్రవేశించి ఆమె నాభిని స్పృశించాడు. అప్పుడు ఆ రాజకన్య సూర్యతేజస్సుతో కంపించిపోతూ స్పృహకోల్పోయినట్లు పక్కపై పడిపోయింది. సూర్యుడిలా అన్నాడు. 'సుశ్రోణి! సర్వయోధులలో శ్రేష్ఠుడైన కొడుకును కంటావు. అయినా కన్యగానే ఉంటావు. దానికి తగినట్లు నేను ప్రవర్తిస్తాను.' సంగమసన్నద్ధుడైన మహాతేజస్వినిని సూర్యుని చూసి ఆ కన్య సిగ్గుపడి "అలాగే కానీ" అని సూర్యునితో అన్నది. అలా పలికి కుంతీకుమారి కుమారునికై సూర్యుని యాచిస్తూ సిగ్గుతో, మోహంతో

వ్రాలిన తీగవలె పవిత్రశయ్యపై పడిపోయింది. సూర్యుడు తన తేజస్సుతో ఆమెను మోహింపజేసి, యోగశక్తితో ఆమెలో ప్రవేశించి వీర్యస్థాపన చేశాడు. ఆమె కన్యాభావం కలుషితం కాలేదు. అప్పుడు ఆ పృథ చైతన్యాన్ని పొంది లేచింది.

308. కర్ణపరిత్యాగము.

'రాజా! అప్పుడు పృథ గర్భవతి అయినది. ఆకాశంలో చంద్రుడు ఉదయించినట్లు పదకొండవనెల శుక్లపక్షప్రతిపత్తున ఆమె గర్భాన్ని ధరించింది బంధువుల భయం వలన సుశ్రోణి అయిన ఆ పృథ గర్భాన్ని కప్పిపుచ్చుకొంటూ ధరించింది. జనులు దానిని గమనించలేదు. ఒక దాది తప్ప మరే స్త్రీ కూడా ఆ గర్భాన్ని గుర్తించలేదు. ఆమె ఎప్పుడూ కన్యల అంతఃపురంలోనే గడుపుతూ నేర్పుగా రహస్యాన్ని కప్పిపెట్టేది. కొంతకాలానికి ఆ సుందరి సూర్యదేవుని అనుగ్రహంవలన కన్యగా ఉంటూనే దేవతలవలె తేజస్వి అయిన కొడుకును కన్నది. ఆ శిశువు తండ్రివలె కవచాన్ని ధరించియున్నాడు. చెవులపై బంగారు కుండలాలు ప్రకాశిస్తున్నాయి. ఆ శిశువు కళ్ళు సింహం కళ్ళవలె ఉన్నాయి. భుజం ఎద్దుమూపురంలా ఉన్నది. విచారణశీల అయిన పృథ శిశువు పుట్టగానే దాదితో సంప్రదించి ఒకపెట్టెలోపల లంతా చక్కగా పక్కపరచి, నీరు ప్రవేశించకుండా లోపల మైనాన్ని పూసి, సుఖాస్పదంగా తయారుచేసి, శిశువును పడుకొనబెట్టి, సున్నితమైన మూతను బిగించి ఏడుస్తూ ఆ పెట్టెను అశ్వనదిలో విడిచింది. కన్య గర్భాన్ని ధరించటం నిషిద్ధమని తెలిసి కూడా పుత్రస్నేహంతో ఆమె దీనంగా విలపించింది.

అప్పుడు అశ్వనదీ జలంలో ఆ పెట్టెను వదలుతూ, విలపిస్తూ కుంతి పలికిన మాటలను విను. 'బిడ్డా! జలచర, భూచర గగనచర, దివ్యప్రాణుల ద్వారా నీకు శుభం కలుగుగాక! దారి నీకు శుభప్రదం అగుగాక! నీకు శత్రువులు లేకుందురుగాక! ఒకవేళ ఉన్నా వారు నీకు ద్రోహం చేయకుందురు గాక! జలాధిపతి అయిన వరుణుడు నీటిలో నిన్ను కాపాడుగాక! ఆకాశంలో అక్కడున్న సర్వతోగతి అయిన వాయుదేవుడు నిన్ను రక్షించుగాక! బిడ్డా! దివ్యవిధానంలో నిన్ను నాకిచ్చిన నీతండ్రి - సూర్యుడు నిన్ను సర్వత్ర కాపాడుగాక! ఆదిత్యులు వసువులు, రుద్రులు, సాధ్యులు విశ్వేదేవతలు, మరుత్తులు, ఇంద్రుడు, దిక్కులు, దిక్పాలురు, సమస్తదేవతలు నిన్ను సమవిషమస్థానా లన్నింటా రక్షించుదురుగాక నీవు ఎక్కడున్నా సహజకవచం కారణంగా నిన్ను గుర్తించగలను. భువనభాస్కరుడైన నీ తండ్రి భానుదేవుడు ధన్యుడు. నీవు నదిలో ఉన్నా దివ్యనేత్రంతో నిన్ను చూడగలడు. బిడ్డా! దేవకుమారా! నిన్ను పుత్రునిగా కల్పించుకొనబోయే ఆ తల్లి

ధన్యురాలు. నీవు దప్పికతో ఆ తల్లి స్తన్యాన్నే గ్రోలుతావు. ఆమె ఎంత మంచి కలలు గన్నదో! సూర్యతేజస్సు గలిగి, దివ్యకవచంతో కూడి, దివ్యకుండలాలచే అలంకరింపబడి, తామరవలవంటి విశాలనేత్రాలతో, ఎర్రతామరరేకులవంటి కాంతితో, మంచి నుదుటితో, చక్కని జుట్టుతో నున్న నిన్ను కుమారునిగా కల్పించుకొనగలదు. నీవు నేలపై ప్రాకుతున్న సమయంలో, అవ్యక్తమధురంగా మాటాడుతున్న సమయంలో, మట్టిలో ఆడుకొంటూ దుమ్ముకొట్టుకున్న సమయంలో నిన్ను చూసేవారు ఎంత ధన్యులో! బిడ్డా! యౌవనంలో హిమాలయప్రాంతాల అరణ్యంలో పుట్టిన కేసరి అయిన సింహంవలె కనిపిస్తున్న నిన్ను చూసేవారెంత ధన్యులో" ఆ విధంగా పలురీతుల దీనంగా విలపించి, పృధ అప్పుడు అశ్వనదీజలంలో ఆ పెట్టెను విడిచింది. ఆ పృధ పుత్రశోకంతో దీనురాలై ధాత్రితో పాటు చాలాసేపు ఏడ్చింది. తండ్రి ఎప్పుడైనా పిలవవచ్చునన్న భయంతో పెట్టెను వదలి శోకాతురయై మరల రాజభవనంలో ప్రవేశించింది. ఆ పెట్టె అశ్వనది నుండి చర్మణ్వతీనదిలోనికి, దానినుండి యమునలోనికి, యమున నుండి గంగలోనికి చేరింది. పెట్టెలోని ఆ శివువు అలల మీద తేలుతూ గంగాతీరంలోని చంపాపురికి దగ్గరగానున్న సూతరాజ్యానికి చేరింది. అమృతం నుండి పుట్టిన దివ్యకవచం, కుండలాలు విధాత సృష్టి అయిన ఆ దైవకుమారుని రక్షించాయి.

309. కర్ణుడు రాధేయుడుగా ఎదుగుట; కర్ణుని దగ్గరకు దేవేంద్రుడు వచ్చుట.

అదే సమయంలో ధృతరాష్ట్రుని మిత్రుడైన సూతుడు – అధిరథుడు – భార్యతో కలిసి గంగకు వెళ్ళాడు. అధిరథుని భార్య పేరు రాధ. ఆమె లోకంలో సాటిలేని సౌందర్యవతి. సౌభాగ్యవతి. కానీ ఆమెకు సంతానం లేదు. సంతానంకోసం విశేషప్రయత్నాలు ఎన్నో చేసింది. అనుకోకుండా ఆలలపై కదులుతున్న పెట్టెను ఆమె చూసింది. ఆ పెట్టె చుట్టూ రక్షణకై చుట్టిన లత లున్నాయి. సింధూర లేపనంతో అది అందంగా ఉంది. గంగాతరంగాలచే అది ఆ తీరానికి కొనిరాబడింది. భావిని అయిన రాధ దగ్గరకు వచ్చిన పెట్టెను కుతూహలంతో పట్టుకొంది. వెంటనే అధిరథునకు ఆ విషయం చెప్పింది. అధిరథుడు నీటినుండి దానిని బయటకు తీయించి యంత్రసహాయంతో పెట్టె తెరిపించాడు. దానిలో బాలకుని చూచాడు ఆ బాలకుడు ఉదయసూర్యుని వలె ఉన్నాడు. సువర్ణకవచాన్ని ధరించాడు చెవులకు తగిలించిన కుండలాలతో ఆ ముఖం విరాజిల్లుతోంది. అధిరథునకు రాధకు ఆశ్చర్యంతో కళ్ళు వికసించాయి. అధిరథుడు ఆ బాలకుని తొడ మీద కూర్చుండ బెట్టుకొని భార్యతో ఇలా అన్నాడు. 'భామినీ! నేను పుట్టిననాటినుండి ఈ రోజే ఇంత అద్భుతమైన రూపాన్ని

చూచాను ఎవరో దేవతాబాలకుడే మన దగ్గరకు వచ్చాడనుకొంటున్నాను. 'సంతానం లేని నాకు తప్పక దేవుడిచ్చిన బిడ్డయే' అంటూ ఆ బాలకుని రాధకు ఇచ్చాడు అధిరధుడు. తామరబొడ్డువలె కాంతిమంతుడై, దివ్యరూపంతో ఒప్పారుతున్న ఆ దేవబాలకుని రాధ విధిపూర్వకంగా పుత్రునిగా స్వీకరించింది. దైవికంగా ఆమె రొమ్ముల నుండి పాలు స్రవించాయి. రాధ ఆ బాలకుని యధావిధిగా పోషించింది. ఆ బాలకుడు కూడా బలవంతుడై వృద్ధిపొందాడు అప్పటినుండి ఆమెకు చాలామంది పిల్లలు పుట్టారు. బంగారు కవచాన్ని, బంగారు కుండలాలను ధరించియున్న ఆ బాలకుని చూసి బ్రాహ్మణులు వసుషేణుడని పేరు పెట్టారు. అమితవిక్రముడైన ఆ ప్రభువు ఈ రీతిగా సూతపుత్రు డయ్యాడు. వసుషేణుడని ప్రసిద్ధికెక్కాడు శ్రేష్ముడు, పరాక్రమశాలి అయిన ఆ సూతపుత్రుడు అంగదేశంలో వృద్ధిపొందాడు. దివ్యకవచధారి అయిన అతనిని గురించి చారులద్వారా పృధకు తెలిసింది.

సూతుడైన అధిరధుడు తన కుమారుని ఎదుగుదలను గమనించి తగిన సమయంలో అతనిని హస్తినాపురికి పంపాడు. అక్కడ కర్ణుడు అస్త్రవిద్యాశిక్షణకై ద్రోణుని శిష్య డయ్యాడు. పరాక్రమశాలి అయిన వసుషేణుడు అక్కడే దుర్యోధనుని మైత్రి పొందాడు. కర్ణుడు ద్రోణుని నుండి, కృపుని నుండి, పరశురాముని నుండి నాలుగువిధాలయిన అస్త్రవిద్యను పొంది లోకంలో మేటివిలుకాడుగా గణుతికెక్కాడు. దుర్యోధనునితో స్నేహం చేసి, పాండవులకు కీడు చేయటంలో ఆసక్తుడై, మహాత్ముడైన అర్జునునితో పోరాడాలని ఎప్పుడూ కోరుకొనేవాడు. కర్ణార్జునులు ఒకరికంట ఒకరు పడిన నాటినుండి కర్ణునకు. ఎప్పుడూ అర్జునుడితో పోటీ. అర్జునుడికి కూడా కర్ణునితో పోటీ. తన వలన కుంతికి పుట్టిన కొడుకు – కర్ణుడు, సూతకులంలో పెరిగాడన్న విషయం సూర్యుని దగ్గర కూడా రహస్యంగానే ఉండిపోయింది. సందేహం లేదు. సహజకవచకుండలాలతో నున్న కర్ణుని చూసి, యుద్ధంలో అతనిని చంపటం కష్టమని భావించి యుధిష్ఠిరుడు ఎప్పుడూ బాధపడేవాడు కర్ణుడు మధ్యాహ్నకాలంలో నీట నిలిచి, చేతులు జోడించి, కిరణమాలి అయిన సూర్యుని ప్రస్తుతించేటప్పుడు బ్రాహ్మణులు ధనాన్ని యాచించటానికి కర్ణుని దగ్గరకు వచ్చేవారు. ఆ సమయంలో బ్రాహ్మణులు ఏది అడిగినా కర్ణుడు ఇచ్చేవాడు. ఇంద్రుడు బ్రాహ్మణవేషం ధరించి "దేహి" అంటూ కర్ణుని కడకు వచ్చాడు అప్పుడు రాధేయుడు "స్వాగత' మని ఇంద్రునకు బదులిచ్చాడు

310. ఇంద్రుడు శక్తినిచ్చి కర్ణుని కవచకుండలముల గైకొనుట.

బ్రాహ్మణవేషంతో తనను తాను కప్పిపుచ్చుకొని, తనవద్దకు వచ్చిన ఇంద్రుని చూచి కర్ణుడు స్వాగత'మన్నాడు. ఇంద్రుని మనస్సును గ్రహించలేకపోయాడు. అప్పుడు

అధిరథసుతుడు కర్ణుడు మెడలో బంగారం ధరించిన వనితలనా? గోగణాలు సమృద్ధిగా ఉన్న గ్రామాలనా? వేటినివ్వమంటావు" అని ఆ బ్రాహ్మణునితో అన్నాడు. బ్రాహ్మణుడిలా అన్నాడు 'బంగారునగలు దాల్చిన స్త్రీలను కానీ, ఆనందాన్ని పెంచే మరేదైనా కానీ నీవు ఇచ్చినా అవసరంలేదు. వాటిని కోరేవారికి వాటినివ్వు. నీవు సత్యవ్రతుడవయితే నీ సహజ కవచాన్నీ కుండలాలను కోసి నాకిమ్ము. నీవు వాటిని దానం చేస్తే నేను తీసికొని వెంటనే వెళ్తాను. సర్వలాభాలలో అదే నాకు గొప్ప లాభం. కర్ణుడిలా అన్నాడు. విప్రా! భూమిని, స్త్రీలను, గోవులను, భవనాలను, సంవత్సరాల పర్యంతం సాగే జీవన భృతిని ఇస్తాను. కవచకుండలాలను మాత్ర మివ్వను. ఈ రీతిగా ఎన్నిరకాలుగా చెప్పినా ఆ బ్రాహ్మణుడు కర్ణుని నుండి వేరొకవరాన్ని కోరలేదు. యథాశక్తి అనునయించినా, యథావిధిగా అర్చించినా కూడా ఆ బ్రాహ్మణోత్తముడు వేరొక వరాన్ని ఇష్టపడలేదు. సహజకవచకుండలాలను తప్ప మరొక వరాన్ని ఆ ద్విజసత్తముడు కోరలేదు. అప్పుడు రాధేయుడు నవ్వుతూ మరలా ఇలా అన్నాడు. 'విప్రా! కవచం నాశరీరంతో పుట్టినది. కుండలాలు అమృతం నుండి పుట్టినవి. కాబట్టి లోకంలో నన్నెవ్వరూ చంపలేరు. అందుకని వాటిని వీడను. బ్రాహ్మణశ్రేష్ఠా! నిష్కంటకమై క్షేమంగా ఉన్న ఈ విశాలసామ్రాజ్యాన్ని నానుండి స్వీకరించుయుక్తంగా ఉంటుంది. ద్విజసత్తమా! నేను కుండలాలను సహజకవచాన్ని కోల్పోతే శత్రువులు నామీదికి తేలికగా వస్తారు. పూజ్యుడైన ఇంద్రుడు వేరొకవరాన్ని కోరకపోవటంతో కర్ణుడు నవ్వి, మరల ఇలా అన్నాడు. 'ప్రభూ! నీవెవరో నాకు ముందే తెలుసు. శక్రా! నిష్ఫలవరాన్ని నేను నీకివ్వటం న్యాయం కాదు. నీవు సాక్షాత్తు దేవేంద్రుడవు సర్వప్రాణులకు కర్తవు, పాలకుడవు కాబట్టి నీవే నాకు వరమివ్వటం ధర్మం.

దేవా! నీకు కవచాన్నీ, కుండలాలనూ ఇస్తే నన్ను శత్రువులు సంహరిస్తారు. నీవు నవ్వులపాలవుతావు. కాబట్టి వాటికి బదులు మరేదైనా ఇచ్చి కుండలాలను ఉత్తమకవచాన్ని యథేచ్ఛగా తీసికొనిపో లేకపోతే నేను కవచకుండలాల నివ్వను.' శక్రుడు ఇలా అన్నాడు. 'సూర్యుడు ముందే నీ దగ్గరకు వచ్చాడని నాకు తెలుసు. ఆయనే నీ కంతా చెప్పాడు. సంశయం లేదు. నాయనా! కర్ణా! అలాగే కానీ నీవు కోరినట్లుగానే బదులు ఇస్తాను. నా వజ్రం తప్ప మరేది కావాలన్నా కోరుకో. అప్పుడు కర్ణుడు ఆనందపడి ఇంద్రుని దగ్గర నుండి పరిపూర్ణహృదయంతో అమోఘమయిన శక్తిని కోరుకొన్నాడు కర్ణుడిలా అన్నాడు. 'ఇంద్రా! కవచకుండలాలకు బదులు సేనాముఖంలో శత్రుసంఘాలను సంహరించగల అమోఘశక్తిని నాకిమ్ము. అప్పుడు ఇంద్రుడు శక్తిప్రదానవిషయాన్ని గురించి ముహూర్తకాలం ఆలోచించి, కర్ణునితో ఇలా అన్నాడు. 'కర్ణా! కుండలాలను సహజకవచాన్ని ఇచ్చి శక్తిని

స్వీకరించు. అయితే ఒక్క నియమం. నేను దైత్యులను సంహరించేటప్పుడు నా చేతినుండి వెలువడిన ఈ శక్తి అమోఘమై వంటలకొలది శత్రువులను చంపి మరల నా చేతికి వస్తుంది. సూతజా! అయితే ఇది నీ చేతికి వచ్చిన తరువాత బలవంతుడై గర్జిస్తూ, ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్న శత్రువును ఒక్కని మాత్రమే చంపి, మళ్ళీ నా దగ్గరకు వస్తుంది.' కర్ణుడిలా అన్నాడు 'నన్ను ఎప్పుడూ భయపడుతూ మహారణరంగంలో గర్జిస్తూ ప్రతాపాన్ని ప్రదర్శించే ఒకే ఒక్క శత్రువును చంపాలనుకొంటున్నాను.'

ఇంద్రు డిలా అన్నాడు 'యుద్ధంలో గర్జించే బలవంతుడైన శత్రువును చంపుతుంది. అయితే నీవు చంపదలచుకొన్న వ్యక్తిని పరమాత్మ రక్షిస్తున్నాడు వేదవేత్తలు పురుషోత్తముడనీ, అపరాజితుడనీ, అచింత్యరూపుడనీ, నారాయణుడనీ చెపుతుంటారో ఆ కృష్ణుడు ఆ వీరుని రక్షిస్తున్నాడు.' కర్ణుడిలా అన్నాడు. 'భగవానుడా! అలా అయినా సరే, ఒక్కరినే చంపగల ఆ అమోఘశక్తిని నాకిమ్ము. దానితో ప్రతాపశాలి అయిన శత్రువును చంపుతాను. నాకవచాన్ని, కుండలాలను కోసి నీకిస్తాను. అయితే నా శరీరావయవాలను కోసినపుడు నేను బీభత్సంగా కనిపించకూడదు.' ఇంద్రుడిలా అన్నాడు. 'కర్ణా! నీ శరీరం ఏరీతిగానూ బీభత్సంగా ఉండదు. నీవు అసత్యాన్ని ఇష్టపడవు కాబట్టి నీకు గాయాలు కూడా కావు వాగ్మిశ్రేష్ఠా! కర్ణా! నీతండ్రి రంగూ, తేజస్సు ఎటువంటివో ఆటువంటి రంగు, తేజస్సు నీకు మరలా లభిస్తాయి. నీ దగ్గర మరొక ఆయుధ మున్నప్పుడూ, ప్రాణసంకటస్థితి లేనపుడు ఎమరుపాటుతో ఈ అమోఘశక్తిని ప్రయోగిస్తే అది నీ మీదనే పడుతుంది.' కర్ణుడిలా అన్నాడు. 'దేవేంద్రా! నీవు చెప్పినట్టు తీవ్రప్రాణసంకటస్థితి ఏర్పడినప్పుడే ఈ వాసవీశక్తిని ప్రయోగిస్తాను. ఈ వాస్తవం నీకు చెప్తున్నాను.' రాజా! ఆపై ప్రజ్వలించే శక్తిని స్వీకరించి కర్ణుడు వాడి అయిన ఆయుధాన్ని పట్టి శరీరాన్ని కోయనారంభించాడు. అప్పుడు దేవతలు, మానవులు, దానవులు, ఆ రీతిగా శరీరాన్ని కోసుకొంటున్న కర్ణుని చూసి, సింహనాదాలు చేశారు. కర్ణుని ముఖంలో ఏ వికారమూ లేదు.

అప్పుడు శరీరాన్ని శస్త్రంతో కోసుకొంటూ కూడా నవ్వుతూనే ఉన్న ఆ నరవీరుని – కర్ణుని – చూసి దివ్యదుందుభులు మ్రోగాయి. దివ్యపుష్పవృష్టి కూడా పెద్దగా కురిసింది. ఆపై శరీరంనుండి దివ్యకవచాన్ని ఛేదించి నెత్తురు తడిసిన దానిని అలాగే ఇంద్రున కిచ్చాడు. అలాగే కుండలాలను కూడా చెవినుండి కోసి ఇచ్చాడు. అందుకే కర్ణుడయ్యాడు. ఆ తరువాత ఇంద్రుడు కర్ణుని మోసగించి, లోకంలో కర్ణునకు కీర్తిని కల్గించి, పాండవులకు మేలు చేకూరినట్లే భావించాడు. నవ్వుతూ స్వర్గానికి ఎగిరిపోయాడు కర్ణుడు మోసగింపబడినట్లు విని ధార్తరాష్ట్రులు దీనులై పాగరణగిపోయారు. ఆ స్థితికి వచ్చిన కర్ణుని గురించి విని

అరణ్యంలో ఉన్న పాండవులు ఆనందించారు. జనమేజయుడిలా అడిగాడు స్వామీ ఆ రోజుల్లో పాండవులు ఎక్కడున్నారు? వారికి ఆ ప్రియవార్త ఎలా వినిపించింది. పండ్రెండవ సంవత్సరం గడిచిన తర్వాత పాండవులు ఏం చేశారు? అదంతా నాకు వివరించండి.' వైశంపాయను డిలా అన్నాడు. 'ద్రౌపదిని కాపాడుకొని, సైంధవుని కామ్యకవనం నుండి పారద్రోలి పాండవులు బ్రాహ్మణులతో కలిసి మార్కండేయమహర్షి ద్వారా పురాణాలను, మహర్షి చరితలను వివరంగా విన్నారు

(ఈరీతిగా వనవాసాన్ని పూర్తిచేసి నరవీరులయిన పాండవులు తమరథాలు అనుచరులు సూతులు వంటివారు అందరితో కలిసి మరల ద్వైతవనానికి చేరారు)

311. బ్రాహ్మణుని అరణిమంథనకాష్ఠాలకై పాండవులు మృగము వెంటబడుట.

జనమేజయు డిలా అన్నాడు. 'ఆ రీతిగా ద్రౌపది అపహరింపబడగా ఎంతో కష్టపడి పాండవులు తిరిగి ఆమెను పొందగలిగారు. ఆపై ఏం చేశారు?' వైశంపాయనుడిలా అన్నాడు. 'ద్రౌపది అపహరింపబడగా ఎంతో కష్టపడి తిరిగి ఆమెను పొంది నిశ్చలుడైన యుధిష్ఠిరుడు సోదరులతో సహా కామ్యకవనాన్ని వీడి, మరల ద్వైతవనానికి వచ్చాడు. ద్వైతవనం రమణీయ మైనది. రుచికరమైన ఫలమూలాలు గలది విచిత్ర వృక్షగణాలతో ప్రకాశించేది. అక్కడ పాండవులు అందరూ మితాశనులై ఫలాహారాన్ని మాత్రమే స్వీకరిస్తూ ద్రౌపదితో కలిసి ఉన్నారు. యుధిష్ఠిరమహారాజు, పాండుకుమారులు, భీమార్జునులు, మాద్రేయులు నకులసహదేవులు – వీరంతా పరంతపులు, సంయమపరాయణులు, ధర్మాత్ములై ద్వైతవనంలో నివసిస్తూ ఒక బ్రాహ్మణుని కోసం పరాక్రమించి ఎన్నో కష్టాలు పడ్డారు. కానీ అది సుఖాంత మైనది. ఆ వనంలో నివసిస్తూ కురుసత్తములు సుఖాంతమైన కష్టాన్ని ఎలా పొందారో వివరంగా చెప్తాను. విను. తపస్వి అయిన ఒక బ్రాహ్మణుని అరణి, మంథన కాష్ఠం – వాటిని ఒరుసుకొన్న ఒక జింకకొమ్ములలో ఇరుక్కుపోయాయి కొమ్ములలో చిక్కుకొన్న వాటిని అలాగే ఉంచుకొని ఆ పెద్దజింక త్వరపడుతూ మహావేగంతో గెంతుతూ, ఆశ్రమంలో నుండి వెంటనే వెళ్ళిపోయింది. కురుసత్తమా! జింక వాటిని కొనిపోవటం చూసి ఆ విప్రుడు అగ్నిహోత్ర పరికరాలను పొందాలని కోరుతూ వెంటనే ధర్మరాజు దగ్గరకు వచ్చాడు. సోదరులతో పాటు కూర్చొనియున్న అజాతశత్రువు దగ్గరకు వేగంగా వచ్చి ఆ బ్రాహ్మణుడు బాధపడుతూ ఇలా అన్నాడు. చెట్టుకు ఆనించిపెట్టి ఉన్న అరణి మంథనకాష్ఠం వాటిని ఒరుసుకొన్న జింక కొమ్ములో చిక్కుపడ్డాయి. వాటిని అలాగే ఉంచుకొని ఆ పెద్దజింక మహావేగంతో గెంతుతూ, ఆశ్రమంలో నుండి వెంటనే

వెళ్ళిపోయింది. రాజా! దాని స్థావరానికి వెళ్ళి, ఆ మహామృగాన్ని పట్టుకొని, ఆ అరణిని, మంథనకాష్ఠాన్ని మీరు తెచ్చి ఇవ్వాలి. లేకపోతే అగ్నిహోత్ర లోపం జరుగుతుంది.

బ్రాహ్మణుని మాట విని, బాధపడుతూ కౌంతేయుడైన యుధిష్ఠిరుడు వింటిని చేతబట్టి సోదరులతో కలిసి పరుగెత్తాడు. నరపుంగవు లయిన పాండవు లందరూ వింటిని సన్నద్ధం చేసికొని బ్రాహ్మణకార్యప్రయత్నం మిగ వేగంగా జింకవెంట పడ్డారు. దగ్గరలోనే జింక కనిపించింది. వారు కర్ణి, నాలీక, నారాచాలనే బాణాలను విడువసాగారు. అయినా దానిని కొట్టలేకపోయారు. వారు ప్రయత్నిస్తున్నా ఆ మహామృగం కనిపించటం లేదు. జింక కనిపించకపోవటంతో అలసిపోయి మనస్వినులయిన వారు ఎంతో దుఃఖించారు. దట్టమైన ఆ అరణ్యంలో చల్లని నీడగల ఒక మర్రిచెట్టు క్రింద ఆ పాండవులు కూర్చున్నారు. వారు ఆకలిదప్పులతో అలమటిస్తున్నారు. వారంతా కూర్చోగానే నకులుడు బాధపడుతూ, అసహనంతో కురునందనుడైన తన సోదరునితో (ధర్మరాజుతో) ఇలా అన్నాడు. 'రాజా! మన వంశంలో ఎప్పుడూ ధర్మం లోపించలేదు. అలసత్వం కారణంగా అర్థలోపం కూడా జరగలేదు. సర్వప్రాణులకు ఏది కోరినా ఇచ్చే మనం మరల ధర్మసంకటానికి లోనవుతున్నామా?'

312. నీటిని తెచ్చుటకయి వెళ్ళిన పాండవులు వలుగురు మూర్ఛిల్లుట.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'ఆపదలకు హద్దులుండవు. కారణమూ ఉండదు, ప్రయోజనమూ ఉండదు. పుణ్యపాపాల ఫలరూపమైన సుఖదుఃఖాలను విభజించడంలో ప్రారబ్ధమే ప్రమాణ మవుతుంది.' భీము డిలా అన్నాడు. 'నాడు సభలోనికి ద్రౌపదిని దాసినివలె తెచ్చిన ప్రాతికామిని అక్కడే నేను చంపలేదు. అందుకే మనకు కష్టం కలిగింది.' అర్జునుడిలా అన్నాడు. 'సూతపుత్రుడు ఎముకలను కూడా బ్రద్దలు చేసే తీక్ష్ణమైన కఠోరవచనాలను పలికినా నేను సహించి ఊరుకొన్నాను. అందువలననే ధర్మసంకటంలో పడ్డాం.' సహదేవుడిలా అన్నాడు. 'భారతా! పాచికలాటలో శకుని నిన్ను జయించినప్పుడే నేను అతనిని చంపవలసినది. అలా జరగలేదు. కాబట్టి మనమీ ఆపదలో పడ్డాం' అప్పుడు యుధిష్ఠిరరాజు నకులునితో ఇలా అన్నాడు. 'మాద్రేయా! చెట్టెక్కి అన్ని దిక్కులా కలయచూడు. ఎక్కడైనా నీరు కానీ, నీటిమీద బ్రతికే చెట్లు కానీ ఉంటాయేమో చూడు. నాయనా! ఈ నీ సోదరులందరూ అలసిపోయి దప్పికగొని ఉన్నారు.' 'అలాగే' అని నకులుడు వెంటనే చెట్టునెక్కి, అంతటా చూసి అన్నతో ఇలా అన్నాడు 'రాజా! జలాధారంగా బ్రతికే చెట్లు ఉన్నాయి. బెగ్గురుపక్షుల కూతలు వినిపిస్తున్నాయి. నిస్సంశయంగా ఇక్కడ

నీరుంటుంది.' అపుడు సత్యధీరుడైన ధర్మరాజు "సౌమ్యా త్వరగా వెళ్ళు. అంబులపొదులతో నీటిని తీసుకొనిరా" అని నకులునితో అన్నాడు 'అలాగే' అని నకులుడు అన్న శాసనాన్ని అనుసరించి నీరున్నవైపుకు పరుగెత్తి వెంటనే అక్కడకు చేరాడు. నకులుడు బెగ్గురుపక్షులు చుట్టిముట్టి ఉన్న ఆ నిర్మలోదకాన్ని చూచి త్రాగా లనుకొనగానే ఆకాశం నుండి ఒకమాట వినిపించింది.

యక్షు డిలా అన్నాడు. మాద్రేయా! తొందరపడవద్దు. ఈ సరస్సుపై నాకు ఇప్పటికే అధికారముంది. నా ప్రశ్నలకు బదులిచ్చిన తరువాత నీటిని త్రాగవచ్చు, తీసికొనిపోవచ్చు.' బాగా దప్పికతో ఉన్న నకులుడు ఆ మాటను లెక్కచేయకుండా చల్లని నీటిని త్రాగాడు. త్రాగి పడిపోయాడు. నకులుడు ఎప్పటికీ రాకపోవటంతో కుంతీనందనుడైన ధర్మరాజు సోదరుడయిన సహదేవునితో ఇలా అన్నాడు. 'సహదేవా! మా తమ్ముడు, నీ అన్న – నకులుడు – వెళ్ళి చాలా సేపయింది. నీవు వెళ్ళి అన్నను పిలుచుకొని, నీళ్ళు తీసికొని రా!'

'అలాగే' అని సహదేవుడు ఆ దిక్కుపట్టిపోయాడు. అక్కడ నేలపై పడిఉన్న సోదరుని – నకులుని చూశాడు. భ్రాతృశోకంతో బాధపడుతూ దప్పికతో అలమటిస్తూ సహదేవుడు నీటివైపు పరుగెత్తాడు అప్పుడు మరల మాట వినిపించింది. 'బిడ్డా! తొందరపడవద్దు. ఈ సరస్సుపై నాకు ఇప్పటికే అధికారముంది. నా ప్రశ్నలకు బదులిచ్చి స్వేచ్ఛగా నీటిని త్రాగవచ్చు. తీసికొనిపోవచ్చు.' దప్పికతో ఉన్న సహదేవుడు ఆ మాటను లెక్కచేయకుండా చల్లని నీటిని త్రాగాడు. త్రాగి పడిపోయాడు. అప్పుడు కౌంతేయుడైన యుధిష్ఠిరుడు అర్జునునితో ఇలా అన్నాడు 'బీభత్సూ! నీ సోదరులు వెళ్ళి చాలాసేపయినది. నాయనా! వారిని తీసికొనిరా! నీటిని కూడా తీసికొనిరా! మా అందరి దుఃఖాలను పోగొట్టేవాడవు నీవే. నీకు మేలు జరుగుతుంది"

ధర్మజుడు అలా అనగానే మేధావి అయిన అర్జునుడు ధనుర్బాణాలను చేతబట్టి, ఖడ్గాన్ని, ధరించి ఆ సరస్సు దగ్గరకు చేరాడు. అప్పుడు అక్కడ పురుషశ్రేష్ఠు డైన అర్జునుడు నీటికోసం వచ్చి పడి ఉన్న సోదరులను చూచాడు. నిదురిస్తున్నట్లుగా పడి ఉన్న సోదరులను చూసి నరసింహుడైన అర్జునుడు బాధపడి, ధనుస్సు నెక్కుపెట్టి, ఆ వనాన్ని పరిశీలించాడు ఆ మహావనంలో ఏ ప్రాణికూడా అర్జునునకు కనిపించలేదు. అప్పుడు అలసిపోయిన అర్జునుడు నీటివైపు పరుగెత్తాడు. పరుగెత్తుతూ అర్జునుడు గగనవాణిని ఇలా విన్నాడు. కౌంతేయా! నీటి దగ్గరకు వస్తున్నావా? బలవంతంగా నీటిని త్రాగలేవు. భారతా! నేను అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తే అప్పుడు నీటిని

త్రాగవచ్చు. తీసికొనిపోవచ్చు కూడా.' ఆ గగనవాణి తనను ఆపగానే అర్జునుడు "ఎదురుగా వచ్చి ఆపు నా బాణాల తాకిడికి బ్రద్దలవుతావు. మరెప్పుడూ ఇలా మాటాడవు" అన్నాడు ఇలా అని అర్జునుడు తన శబ్దవేధవిద్యను ప్రదర్శిస్తూ అస్త్రాలతో అభిమంత్రించిన బాణాలను అన్ని దిక్కులలో కురిపించాడు. భరతర్షభా! కర్ణి, నాలీక, నారాచాలనే బాణాలను విడిచాడు. దప్పికతో అలమటిస్తూ అమోఘ బాణాలను వదిలాడు. వివిధ బాణసమూహంతో అంతరిక్షంలో వాన కురిపించాడు. యక్షుడిలా అన్నాడు. 'అర్జునా! ఈ విఘాతమెందుకు? ప్రశ్నలకు బదులిచ్చి ఆపై నీటిని త్రాగు. బదులివ్వకుండా త్రాగితే త్రాగినవెంటనే చనిపోతావు.' గగనవాణి అలా వినిపించినా పార్థుడు, సవ్యసాచి అయిన అర్జునుడు దానిని లెక్కచేయక నీటిని త్రాగి, వెంటనే పడిపోయాడు.

అప్పుడు కౌంతేయుడైన యుధిష్ఠిరుడు భీమసేనునితో ఇలా అన్నాడు. 'పరంతపా! నకులుడు, సహదేవుడు, అర్జునుడు నీటికోసం వెళ్ళి చాలాసేపయింది. కానీ మరలి రాలేదు. వారిని తీసికొనిరా! నీటిని కూడా తీసికొనిరా! జాగ్రత్త.' అలాగే అని భీమసేనుడు పురుషశ్రేష్ఠులైన తన సోదరులు పడి ఉన్న చోటికి వచ్చాడు. వారిని చూసి బాధపడ్డాడు. దప్పిక కూడా బాధిస్తోంది. మహాబాహువయిన భీముడు 'ఇది యక్షులో, రాక్షసులో చేసిన పని" అని భావించాడు. "నేడు వారితో పోరాడక తప్పదు. ముందు నీళ్ళు త్రాగుదాం" అని నిశ్చయించుకొని పార్థుడు, పురుషశ్రేష్ఠుడు అయిన వృకోదరుడు నీటివైపు పరుగెత్తాడు. యక్షు డిలా అన్నాడు. 'నాయనా! కౌంతేయా! తొందరపడవద్దు. ఈ సరస్సుపై ఇప్పటికే నాకధికారముంది. నా ప్రశ్నలకు బదులిచ్చిన తర్వాత నీటిని త్రాగవచ్చు తీసికొనిపోవచ్చు.' యక్షుడు అలా చెప్పినా ఆ ప్రశ్నలకు సమాధాన మివ్వకుండానే నీటిని త్రాగాడు. వెంటనే పడిపోయాడు. అప్పుడు ధర్మరాజు ఆలోచించి లేచి, మనస్సు మండిపడుతుండగా మహావనంలో ప్రవేశించాడు. అక్కడ జనుల చప్పుడు కూడా లేదు. రురుజాతిమృగాలూ వరాహాలూ, పక్షులూ అరణ్యాన్ని ఆశ్రయించి ఉన్నాయి నీలవర్ణంతో ప్రకాశిస్తున్న చెట్లతో, తుమ్మెదల ఝంకారాలతో, పక్షుల ఆరుపులతో శోభిస్తున్న ఆ వనంలో ధర్మజుడు ప్రవేశించాడు. ఆ అడవిలో నడుస్తూ ధర్మరాజు బంగారువన్నెగల కుసుమకేసరాలతో అలంకరింపబడి ఉన్న ఆ సరస్సును చూశాడు. అది విశ్వకర్మ నిర్మాణ మనిపిస్తోంది. ఆ సరస్సు తామరతీగెల సమూహాలతో శోభిస్తోంది. చట్టూ సింధువార, వేతస, కేతక,కరవీర పిప్పలవృక్షా లున్నాయి. ధర్మరాజు సోదరులను చూడాలన్న తహతహతో అలసిసోయి, ఆ సరస్సు దగ్గరకు వచ్చి దానిని చూచి, ఆశ్చర్యానికి లోనయ్యాడు.

313. యక్షప్రశ్నలు : యుధిష్ఠిర సమాధానాలు.

ధర్మరాజు మరణించిన తన సోదరులను చూశాడు. ఇంద్రునితో సాటిగా గౌరవాన్ని పొంది, యుగాంతకాలంలో నేలకు జారిన లోకపాలకులవలె వారున్నారు. అర్జునుడు మరణించాడు. ధనుర్బాణాలు చెల్లాచెదరై ఉన్నాయి. భీమసేనుడు నకులసహదేవులు ప్రాణాలు పోయి నిశ్చేష్టులై ఉన్నారు. వారినందరినీ చూసి ధర్మరాజు వేడి నిట్టూర్పు విడిచాడు. కన్నీరు పొంగి వచ్చింది. సోదరులందరూ పడి ఉండటాన్ని చూసి మహాబాహువైన ధర్మసుతుడు చింతించి, ఎంతో విలపించాడు. 'వృకోదరా! యుద్ధంలో సుయోధనుడి తొడలను గదతో విరగగొడతానని ప్రతిజ్ఞ చేశావు గద్దా! వీరా! కురువంశకీర్తివర్ధనుడవు, మహాత్ముడవు, మహాబాహువువు అయిన నీవే పడిపోతే నాకు ఇక ఇదంతా ఎందుకు? మనుష్యుల మాటలు తప్పిపోయినట్లు వింటుంటాం. కానీ మీవి దివ్యవాక్కులు అవి ఎలా వ్యర్థమవుతాయి. ధనంజయా! నీవు పుట్టినప్పుడు దేవతలు ఏమన్నారు? 'కుంతీ! ఈ నీ కుమారుడు దేవేంద్రునికన్న తక్కువవాడేమీ కాదు.' ఉత్తరపారియాత్రపర్వతం మీద కూడా ప్రాణులన్నీ నీగురించి ఏమన్నాయి? పాండవులు కోలుపోయిన రాజ్యలక్ష్మిని వేగంగా తిరిగితేగలవాడు. యుద్ధంలో ఇతనిని గెలిచేవాడుండడు. ఇతడు ఓడించలేనివాడు కూడా ఎవడూ ఉండడు'. అటువంటి జయశీలుడు, మహాబలుడు నేడు మృత్యువుకు చిక్కాడు. ఈ ధనంజయుడు నా ఆశను చంపి, నేలపై శయనించాడు. ఎవరిని ఆశ్రయించి ఎవరిరక్షణలో మేమీ దుఃఖాలు పోగొట్టుకోగలం? కుంతీపుత్రులు, మహాబలులు అయిన ఈ భీమార్జునులు యుద్ధంలో ఏమరుపాటు లేనివీరులు. ఎప్పుడూ శత్రువులను అణచేవారు. ఏ అస్త్రాలకూ లోబడినవారు. శత్రువుల చేతికి ఎలా చిక్కారు? నా మనస్సు చెడ్డది. అది రాతితోనో, లోహంతోనో తయారయినది. కాకపోతే నేలగూలియున్న ఈ నకులసహదేవులను చూసి ఎందుకు బ్రద్దలు కాదు.

పురుషోత్తములారా! మీరు శాస్త్రజ్ఞులు, దేశకాలజ్ఞులు, తపోయుక్తులు ఆచరణశీలురు. అటువంటి మీరు మీకు తగినపని చేయకుండా ఎందుకు నిదురిస్తున్నారు? శరీరాలపై గాయాలు లేవు. ధనుర్బాణాలను పట్టినట్లే లేదు. అయినా నేలగూలి నిశ్చేష్టులుగా ఎందుకు పడి ఉన్నారు? నేలగూలిన పర్వతశిఖరాలవలె తనసోదరులు సుఖంగా నిదురిస్తూన్నట్టుండటం చూచి ధీమంతుడైన ధర్మరాజు ఖిన్నుడై తనువంతా చెమటలు-పట్టి దీనదశకు లోనయ్యాడు "ఇది ఇలా జరగాలి కాబోలు" అనుకొని ధర్మాత్ముడైన ధర్మరాజు శోకసాగరంలో నిలిచి కలతపడుతూ మరణకారణాన్ని ఆలోచించసాగాడు. మహాబాహువూ, మహామతి అయిన ధర్మజుడు దేశకాలతత్త్వజ్ఞుడు. అయినా ఎంత ఆలోచించినా కర్తవ్యం స్ఫురించలేదు. ధర్మాత్ముడు, ధర్మపుత్రుడు అయిన యుధిష్ఠిరుడు ఆ రీతిగా విలపించి, ఆపై మనస్సుని

నియంత్రించుకొని బుద్ధితో ఇలా ఆలోచించసాగాడు "ఈ వీరులను చంపినదెవరు? వారి శరీరాలపై ఆయుధాల గాట్లు లేవు. ఇక్కడ ఎవ్వరి అడుగు జాడలూ లేవు. ఏదో పెద్దభూతం నా సోదరులను చంపి ఉండాలి. ఏకాగ్రతతో ఆలోచించాలి పోనీ మంచినీళ్ళు త్రాగి తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. బహుశ దుర్యోధనుడే చాటుమాటుగా ఏదో చేసి ఉంటాడు. ఎప్పుడూ వక్రబుద్ధిగల గాంధారరాజు శకుని ఏదైనా చేసి ఉండవచ్చు. అతనికి కార్య మయినా అకార్య మయినా సమానమే తనమీద తనకు అదుపులేని ఆ పాపాత్ముని ఎ వీరుడు నమ్మగలడు? లేదా ఆ దురాత్ముడు దుర్యోధనుడే గూఢచారులద్వారా ఏదైనా ప్రయోగం చేసి ఉండవచ్చు. మహాబుద్ధిగల ధర్మరాజు 'ఇలా జరిగి ఉండవచ్చు' నంటూ రకరకాలుగా ఆలోచించాడు. పరీక్షించి చూసి ఆ నీరు విషదూషితం కాలేదని నిశ్చయించుకొన్నాడు. నా సోదరులు మరణించినా వారి ముఖాలు వికృతిని పొందలేదు. ప్రసన్నంగానే ఉన్నాయి అని కూడా ఆలోచించాడు పురుషశ్రేష్ఠ లయిన వీరు ఒక్కొక్కరూ ఒక్కొక్కప్రవాహమంత బలం గలవారు. కాలాంతకుడైన యముడు తప్ప మరెవ్వరు వీరి దగ్గరకు రాగలరు? అని నిశ్చయించుకొంటూ ధర్మరాజు ఆ సరస్సులోని నీటిలోనికి దిగాడు దానిలో ప్రవేశించబోతుండగా ఆకాశవాణి వినిపించింది.

యక్షుడిలా అన్నాడు. 'నేను నాచును, చేపలను తినే కొంగను నీ తమ్ములను యమలోకానికి పంపినది నేనే. రాజకుమారా! నాప్రశ్నలకు సమాధానమివ్వకపోతే నీవు కూడా అయిదవవాడుగా యమలోకానికి పోతావు. నాయనా! తొందరపడవద్దు. ఈ సరస్సుపై నాకిప్పటికే అధికార మున్నది. కొంతేయా! నా ప్రశ్నలకు సమాధానమిచ్చి నీరు త్రాగు. నీరు తీసికొని వెళ్ళు యుధిష్ఠిరు డిలా అన్నాడు. నీవెవరో చెప్పు ! రుద్రులలో, వసువులలో, దేవతలలో ఎవరో ప్రధాన దేవతవు నీవు ఒక పక్షి ఇంత పనిచేయలేదు. మహాతేజస్వులయిన నా నలుగురు సోదరులు హిమాలయ పారియాత్ర వింధ్య మలయ పర్వతాల వంటివాళ్ళు. వారిని చంపగలిగిన దెవ్వరు? బలవంతులలో శ్రేష్ఠుడా! నీవు చాలాపెద్దపనిచేశావు. దేవతలు, గంధర్వులు, అసురులు, రాక్షసులు అయినా మహారణంలో నాతమ్ములను సహించలేరు. వారిని పడగొట్టి నీవు మహాద్భుతకర్మ చేశావు. నీవేం చేస్తున్నావో, నీకేం కావాలో నాకు అర్థం కావటం లేదు. నాకు చాలా కుతూహలంగా ఉన్నది. కొంచెం భయం కూడా కలుగుతోంది. అందువలన మనస్సు ఉద్వేగానికి లోనవుతోంది తలవేడెక్కింది అందుకని అడుగుతున్నాను. స్వామీ! తమరెవరు?' యక్షు డిలా అన్నాడు 'నేను యక్షుడును. జలచరపక్షిని కాను. నీకు మేలు కల్గుగాక! మహాతేజస్వులయిన నీ తమ్ములను నేను చంపాను. ఈ రీతిగా పలుకుతున్న యక్షుని అమంగళకరమైన ఆ పరుషవాక్కును విని, ధర్మరాజు ఆయన దగ్గరకు పోయి నిలిచాడు. అక్కడ ధర్మరాజు

చెట్టు నాశ్రయించుకొని ఉన్న యక్షుని చూశాడు. కళ్ళు వికృతంగా ఉన్నాయి. తాటి చెట్టంత ఎత్తు ఉన్నాడు. అగ్నివలె, సూర్యునివలె తేజోవంతుడు. పర్వతమంత ఆకారం. ఎదరించవీలుకానివాడు. మేఘం వంటి గంభీరనాదంతో పెద్దగొంతుతో బెదిరిస్తున్నాడు. యక్షు డిలా అన్నాడు. 'రాజా! ఈ నీ తమ్ములు నేను వారిస్తున్నా వినకుండా మొండిగా నీటిని త్రాగబోయారు అందుకని నేను వారిని చంపాను. రాజా! ప్రాణాలు కావాలంటే ఈ నీటిని త్రాగరాదు పార్థా! తొందరపడవద్దు. ఈ సరస్సుపై నాకిప్పటికే అధికారముంది. కొంతేయా! నా ప్రశ్నలకు సమాధానమిచ్చి, ఆపై నీటిని త్రాగవచ్చు. తీసికొనిపోవచ్చుకూడా.' యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'యక్షా! నీ అధికారంలోనున్నది, నాకు అవసరం లేదు. తనును తాను ప్రశంససించుకోవడం సత్పురుష లెప్పుడూ అభిసంధించరు. నా బుద్ధిమేరకు నీ ప్రశ్నలకు సమాధానమిస్తాను. అడుగు.' యక్షు డిలా అడిగాడు. 'సూర్యుని ఉదయింపజేస్తున్న దేది? ఆయన చుట్టూ తిరిగేవారెవరు? ఆయనను అస్తమింపజేసేదెవరు? ఆయన దేనిలో ప్రతిష్ఠింపబడతాడు?' యుధిష్ఠిరు డిలా చెప్పాడు. 'సూర్యుని ఉదయింపజేసేది బ్రహ్మ. ఆయనచుట్టూ తిరిగేవారు దేవతలు. ఆయనను అస్తమింపజేసేది ధర్మం. ఆయన సత్యమందు ప్రతిష్ఠింపబడతాడు

యక్ష : రాజా! మనిషి దేనితో శ్రోత్రియుడు కాగలడు? దేనిద్వారా మహత్పదాన్ని పొందగలడు? దేనితో ససహాయుడు అవుతాడు? దేనితో బుద్ధిమంతు డవుతాడు.

ధర్మ : వేదంతో శ్రోత్రియుడు కాగలడు. తపస్సుతో మహత్పదాన్ని పొందగలడు. ధైర్యంతో ససహాయుడు కాగలడు. వృద్ధసేవద్వారా బుద్ధిమంతుడు అవుతాడు

యక్ష : బ్రాహ్మణులకు దేవత్వ మేది?

ధర్మ : స్వాధ్యాయమే బ్రాహ్మణులకు దేవత్వం.

యక్ష : వారిలో సత్పురుషులకు ధర్మ మేది?

ధర్మ : తపశ్చరణమే సద్బ్రాహ్మణ ధర్మం.

యక్ష : వారి మానవత్వ మేది?

ధర్మ : మరణమే మానుషత్వం.

యక్ష : వారిలో అసత్పురుషుల మార్గ మేది?

ధర్మ : ఇతరులను నిందించటమే అసత్పురుష మార్గం

యక్ష : క్షత్రియులకు దేవత్వ మేది?

ధర్మ : అస్త్రవిద్యయే క్షత్రియులకు దేవత్వం.

యక్ష : వారిలో సత్పురుషులకు ధర్మ మేది?

ధర్మ : యజ్ఞమే వారిలో సజ్జనుల ధర్మం.

యక్ష : వారికి మానుషత్వ మేది?

ధర్మ : భయమే వారికి మానుషత్వం.

యక్ష : వారిలో అసత్పురుషుల మార్గ మేది?

ధర్మ : పీడితులను విడిచిపెట్టటమే వారిలో అసత్పురుషులమార్గం.

యక్ష : యజ్ఞసంబంధమైన ఒకే ఒక సామ మేది?

ధర్మ : ప్రాణమే యజ్ఞసంబంధమైన ఒకే ఒక్క సామం.

యక్ష : తత్సంబంధమైన ఒకే ఒక యజుస్సు ఏది?

ధర్మ : మనస్సే యజ్ఞసంబంధమైన యజుస్సు.

యక్ష : ఎ ఒక్కటి యజ్ఞాన్ని వరిస్తుంది?

ధర్మ : ఋక్కు ఒక్కటే యజ్ఞాన్ని వరిస్తుంది.

యక్ష : యజ్ఞం దేని నతిక్రమించదు?

ధర్మ : యజ్ఞం ఋక్కు నతిక్రమించదు.

యక్ష : వ్యవసాయదారులకు శ్రేష్ఠమైన దేది?

ధర్మ : వ్యవసాయదారులకు వర్షం శ్రేష్ఠమైనది.

యక్ష : విత్తేవాళ్ళకు శ్రేష్ఠమైన దేది?

ధర్మ : విత్తేవారికి విత్తనమే శ్రేష్ఠం.

యక్ష : ప్రతిష్ఠగలవారికి శ్రేష్ఠమైన దేది?

ధర్మ : ప్రతిష్ఠగలవారికి గోవు శ్రేష్ఠం.

యక్ష : సంతానవంతులకు శ్రేష్ఠమైన దేది?

ధర్మ : సంతానవంతులకు పుత్రుడు శ్రేష్ఠం.

యక్ష : బుద్ధిమంతుడై లోకపూజితుడై, ఇంద్రియార్థాలను అనుభవిస్తూ సర్వభూతసమ్మతుడై ఊపిరితీస్తూ కూడా జీవించనివాడెవడు?

ధర్మ : దేవతలను అతిథులను, కుటుంబీకులను, పితరులను, తనను పోషింపలేనివాడు ఊపిరి ఉన్నా జీవించనట్లే లెక్క.

యక్ష : భూమి కన్న బరువైన దేది? ఆకాశం కన్న ఉన్నతమైన దేది? గాలికన్న వేగవంతమయిన దేది? గడ్డి కన్న తఱుచుగా ఉన్న దేది?

ధర్మ : తల్లి భూమికన్న బరువైనది. తండ్రి ఆకాశం కన్న ఉన్నతమైనవాడు. మనస్సు గాలికన్న వేగంగలది. చింత గడ్డికన్న తఱుచైనది అందుకే విడువదగినది.

యక్ష : నిదురిస్తూ కూడా కన్ను మూయని దేది? పుట్టికూడా కదలనిది ఏది? హృదయం లేనివా డెవడు? వేగంగా పెరిగేది ఏది?

ధర్మ : చేప నిదురిస్తూ కూడా కన్ను మూయదు. గ్రుడ్డు పుట్టికూడా కదలదు రాతికి హృదయం లేదు. నది వేగంతో పెరుగుతుంది

యక్ష : ప్రవాసంలో మిత్రు డెవరు? గృహస్థునకు మిత్రు డెవరు? రోగికి మిత్రు డెవరు? మరణించేవానికి మిత్రు డెవరు?

ధర్మ : కూడా ప్రయాణించేవాడే ప్రవాసికి మిత్రుడు. గృహస్థునకు భార్య మిత్రుడు. రోగికి వైద్యుడే మిత్రుడు. మరణించేవానికి దానమే మిత్రుడు

యక్ష : సర్వప్రాణులకు అతిధి ఎవ్వరు? సనాతన ధర్మ మేది? అమృత మేది? ఈ జగత్తంతా ఏది ?

ధర్మ : సర్వప్రాణులకు అతిధి అగ్ని నిత్యధర్మమే సనాతన ధర్మం. ఆవుపాల రూపాన ఉన్న సోమమే అమృతం. ఈ జగత్తంతా గాలియే

యక్ష : ఒంటరిగా తిరిగేది ఏది? పుట్టి మరల పుట్టేది ఏది? శైత్యానికి మందు ఏది? మహాపాత్ర ఏది.

ధర్మ : ఒంటరిగా తిరిగేవాడు సూర్యుడు. పుట్టి మరల పుట్టేవాడు చంద్రుడు. శైత్యానికి మందు అగ్ని. భూమియే మహాపాత్ర.

యక్ష : ధర్మానికి ప్రధానస్థాన మేది?

ధర్మ : ధర్మానికి ప్రధానస్థానం దక్షత.

యక్ష : కీర్తికి ప్రధానస్థాన మేది?

ధర్మ : కీర్తికి ప్రధానస్థానం దానం.

యక్ష : స్వర్గానికి ప్రధానస్థాన మేది?

ధర్మ : స్వర్గానికి ప్రధాన స్థానం సత్యం.

యక్ష : సుఖానికి ప్రధానస్థాన మేది?

ధర్మ : సుఖానికి ప్రధాన స్థానం శీలం.

యక్ష : మనుష్యునకు ఆత్మ ఏది? వానికి దేవు డిచ్చిన మిత్రు డెవరు? వానికి జీవనమార్గ మేది? వానికి పరమాశ్రయ మేది?

ధర్మ : మనుష్యునకు పుత్రుడే ఆత్మ. భార్యయే దేవుడిచ్చిన మిత్రుడు జీవనమార్గం మేఘుడు. వానికి పరమాశ్రయం దానం

యక్ష : ధన్యులలోని ఉత్తమగుణ మేది?

ధర్మ : ధన్యులలోని ఉత్తమగుణం దక్షత.

యక్ష : ధనాలలో ఉత్తమధన మేది?

ధర్మ : పాండిత్యం ధనాలలో ఉత్తమ ధనం.

యక్ష : లాభాలలో ఉత్తమమైన దేది?

ధర్మ : ఆరోగ్యం లాభాలలో శ్రేష్ఠం.

యక్ష : సుఖాలలో గొప్పది యేది?

ధర్మ : సంతృప్తియే గొప్ప సుఖం.

యక్ష : లోకంలో శ్రేష్ఠధర్మ మేది? నిత్యమూ ఫలితాల నిచ్చే ధర్మ మేది? దేనిని అదుపుచేస్తే దుఃఖ ముండదు? ఎవరితో మైత్రి నశించదు?

ధర్మ : లోకంలో దయయే శ్రేష్ఠధర్మం. వేదధర్మమే నిత్యఫలం ఇస్తుంది. మనస్సును అదుపుచేస్తే దుఃఖంపొందరు సజ్జనులతోడి మైత్రి నశించదు.

యక్ష : దేనిని వదిలితే మనిషి ఇష్ట డవుతాడు? దేనిని విడిస్తే బాధపడడు? దేనిని వీడితే అర్థవంతుడు కాగలడు? దేనిని పరిత్యజిస్తే సుఖవంతు డవుతాడు?

ధర్మ : అభిమానాన్ని వీడితే ఇష్టుడు కాగలడు. క్రోధాన్ని విడిస్తే బాధపడడు. కామాన్ని వదిలితే అర్థవంతుడు కాగలడు. లోభాన్ని పరిత్యజిస్తే సుఖవంతు డవుతాడు.

యక్ష : బ్రాహ్మణులకు దాన మెందుకు?

ధర్మ : ధర్మంకోసమే బ్రాహ్మణునకు దానం.

యక్ష : నటనర్తకులకు దాన మెందుకు?

ధర్మ : కీర్తికోసమే నటనర్తకులకు దానం.

యక్ష : సేవకులకు దాన మెందుకు?

ధర్మ : సేవకులకు పోషణకోసమే దానం.

యక్ష : రాజులకు దాన మెందుకు?

ధర్మ : భయంవలననే రాజులకు దానం.

యక్ష : లోకాన్నంతా కప్పి ఉన్నదేది? దేనివలన అది ప్రకాశించదు? మిత్రులను ఎందుకు విడిచిపెడతాడు? దేని వలన స్వర్గం పోలేరు ?

ధర్మ : లోకాన్ని అజ్ఞానం కప్పి ఉంటుంది. అజ్ఞానంవలన అది ప్రకాశించదు. లోభం వలన మిత్రులను విడిచిపెడతాడు. విషయాసక్తివలన స్వర్గానికి వెళ్ళలేరు

యక్ష : మనిషి మృతు డెట్లు అవుతాడు? రాష్ట్రం ఎలా మృత మవుతుంది? శ్రాద్ధం ఎలా మృత మవుతుంది? యజ్ఞమెలా మృత మవుతుంది?

ధర్మ : మనిషి దరిద్రు డయితే మృతుడే. రాజులేని రాజ్యం మృతం. శ్రోత్రియుడు లేని శ్రాద్ధం మృతం. దక్షిణలు లేని యజ్ఞం మృతం.

యక్ష : దిక్కు ఏది? ఉదక మేది? అన్న మేది? విష మేది? శ్రాద్ధయోగ్యమైన కాలమేది? చెప్పు. ఆ తర్వాత నీరు త్రాగవచ్చు. తీసికొనిపోవచ్చు.

ధర్మ : సజ్జనులే దిక్కు. ఆకాశమే జలం. గోవే అన్నం. కోరికయే విషం. బ్రాహ్మణుని రాకయే శ్రాద్ధానికి తగిన కాలం. యక్షా! నీవేమనుకొంటున్నావో!

యక్ష : తపస్సుకు లక్షణ మేది? దమ మంటే ఏది? పరాకోటికి చెందిన క్షమ ఏది? సిగ్గంటే ఏది?

ధర్మ : స్వధర్మాచరణమే తపస్సు. మనస్సును అదుపుచేయటమే దమం. ద్వంద్వాలను సహించగలగటమే క్షమ. చెడ్డపనులు చేయకుండుటయే సిగ్గు.

యక్ష : రాజా! జ్ఞాన మంటే ఏది? శమ మంటే ఏది? పరాకోటికి చెందిన దయ ఏది? ఋజుత్వ మంటే ఏది?

ధర్మ : పరతత్త్వజ్ఞానమే జ్ఞానం. చిత్తప్రశాంతతయే శమం. అందరూ సుఖంగా ఉండాలని కోరటమే దయ. సమచిత్తతయే ఋజుత్వం

యక్ష : మనుష్యులు జయించలేని శత్రువు ఎవరు?

ధర్మ : క్రోధం జయింపరాని శత్రువు.

యక్ష : అనంతమైన వ్యాధి ఎది?

ధర్మ : లోభం అంతంలేని వ్యాధి.

యక్ష : ఎటువంటి వానిని సాధువంటారు? ఎటువంటి వానిని అసాధు వంటారు?

ధర్మ : సర్వప్రాణుల హితాన్ని కోరేవాడు సాధువు. దయారహితుడే అసాధువు.

యక్ష : రాజా! మోహమంటే ఏమిటి? దేనిని మానమంటారు? దేనిని ఆలస్యంగా తెలిసికోవాలి? ఏది శోకం?

ధర్మ : ధర్మమూఢత్వమే మోహం. ఆత్మాభిమానమే మానం ధర్మాన్ని పాటించకపోవటమే ఆలస్యం. అజ్ఞానమే శోకం.

యక్ష : దేనిని స్థైర్యమని ఋషు లన్నారు? ధైర్య మని దేని నన్నారు? ఉత్తమస్నాన మేది? ఉత్తమదానమని దేని నంటారు?

ధర్మ : స్వధర్మంలో నిశ్చలంగా నిలవటమే స్థైర్యం. ఇంద్రియనిగ్రహమే ధైర్యం. మనోనైర్మల్యమే ఉత్తమస్నానం. భూతరక్షణమే ఉత్తమదానం.

యక్ష : ఎవనిని పండితు డని భావించాలి?

ధర్మ : ధర్మజ్ఞుడే పండితుడు

యక్ష : నాస్తికు డెవడు? కామ మంటే ఎమిటి? మత్సర మంటే ఏమిటి?

ధర్మ : పరలోకం లేదనేవాడు నాస్తికుడు నాస్తికుడే మూర్ఖుడు. సంసారహేతు వయినది కామం. హృదయతాపమే మత్సరం.

యక్ష : అహంకార మంటే ఏమిటి? దంభ మంటే ఏమిటి? పరదైవ మెవరు?

పిశునత్వమంటే ఏమిటి?

ధర్మ : తీవ్రమైన అజ్ఞానమే అహంకారం. ధర్మాత్ము డనంటూ ప్రకటించుకొనటమే దంభం దానఫలమే పరమదైవం. పరదూషణమే పిశునత్వం.

యక్ష : ధర్మం, అర్థం, కామం పరస్పర విరోధం కలవి. నిత్యవిరుద్ధా లయిన ఇవి ఒకేచోట ఎలా కలుస్తాయి.

ధర్మ : ధర్మం, భార్య పరస్పరం విరోధించకుండా మనుష్యునకు వశమై నప్పుడు ధర్మార్థకామాలు మూడూ ఒకేచోట నిలుస్తాయి.

యక్ష : భరతర్షభా! అక్షయనరకాన్ని ఎవడు పొందుతాడు? నా ఈ ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పాలి.

ధర్మ : ఏమీలేక యాచనకు వచ్చిన బ్రాహ్మణుని స్వయంగా ఆహ్వానించి, ఆపై లేదు పొమ్మనే వాడు అక్షయనరకాన్ని పొందుతాడు. వేదాలపై, ధర్మశాస్త్రాలపై, బ్రాహ్మణులపై, దేవతలపై, పితృధర్మాలపై మిథ్యాబుద్ధి గలవాడు అక్షయనరకాన్ని పొందుతాడు. ధనమున్నా లోభం వలన దానభోగాలను పరిత్యజించి, లేదని పలుకుతుండేవాడు అక్షయనరకాన్ని పొందుతాడు.

యక్షు డిలా అన్నాడు. 'రాజా! బ్రాహ్మణత్వం కుల, వృత్త, స్వాధ్యాయ, పాండిత్యాలలో దేనివలన సిద్ధిస్తుంది. నిశ్చితంగా చెప్పు.'

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'నాయనా! యక్షా! విను. కులంగానీ, స్వాధ్యాయం కానీ, పాండిత్యం కానీ బ్రాహ్మణత్వానికి కారణాలు కావు. వృత్తమే దానిని కారణం. సందేహం లేదు. బ్రాహ్మణుడు ప్రత్యేక ప్రయత్నంతో ఆచారాన్ని కాపాడుకోవాలి. ఆచారం క్షీణించనివాడు క్షీణించడు. ఆచారం నశిస్తే ఆచారి నశించినట్లే. చదివేవారు కానీ, చదివించేవారు కానీ శాస్త్రవిచారం చేసేవారు కానీ అంతా వ్యసనపరాయణులూ, మూర్ఖులే. ఆచరించేవాడే పండితుడు. నాల్గువేదాలు చదివిన వాడైనా ఆచరణ సరిగా లేకపోతే శూద్రునికన్నా హీనుడే. అగ్నిహోత్రతత్పరుడైన, జితేంద్రియుడే బ్రాహ్మణుడు.'

యక్ష : ప్రియంగా మాటాడేవాడు ఏం పొందుతాడు? ఆలోచించి పనిచేసేవాడు ఏం పొందుతాడు? చాలామంది మిత్రులున్న వాడు ఏం పొందుతాడు? ధర్మపరుడు ఏం పొందుతాడు? చెప్పు.

ధర్మ : ప్రియంగా మాటాడేవాడు అందరికీ ఇష్టు డవుతాడు. ఆలోచించి పనిచేసేవాడు ఎక్కువ విజయాలు పొందుతాడు. బహుమిత్రులు గలవాడు సుఖపడతాడు. ధర్మాసక్తి గలవాడు సద్గతులు పొందుతాడు.

యక్ష : ఎవడు ఆనందిస్తాడు? ఆశ్చర్యకరమైన దేది? ఏది దారి? ఏది వార్త?

నాకీ నాలుగు ప్రశ్నలకూ సమాధానమిచ్చి నీళ్ళు త్రాగు.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. జలచరా! తన ఇంటిలో, అయిదారురోజులకొకసారి శాకపాకాలు చేసికొన్నా అప్పులేనివాడు, పరదేశంలో లేనివాడు ఆనందిస్తాడు. **ప్రతిదినమూ ప్రాణులు యమాలయానికి వెళుతూనే ఉంటాయి. అయినా మిగిలినవారు స్థిరంగా ఉండా లమకొంటారు. అంతకన్న ఆశ్చర్యకర మేముంది?*** తర్కం నిలవదు. శ్రుతులు విభిన్నాలు. ఋషులు చాలామంది. ఎవరిని ప్రమాణంగా భావించాలి? ధర్మతత్త్వం నిగూఢ మయినది కాబట్టి మహాపురుషులు చనినమార్గమే మనకూ మార్గం. మహామోహమయ మయిన ఈ బ్రహ్మాండభాండంలో కాలం సూర్యుని అగ్నిగా, రేబవళ్ళు ఇంధనంగా మాసర్తువులను గరిటెలుగా చేసి ప్రాణులను పక్వం చేస్తోంది. ఇలా జనులు అనుకొంటారు.

యక్షు డిలా అన్నాడు. 'పరంతపా! నేను అడిగిన ప్రశ్నలన్నింటికీ సరిగ్గా సమాధానాలు ఇచ్చావు. ఇప్పుడు పురుషు డంటే ఎవరో, సర్వధనవంతుడైన నరు డెవడో చెప్పాలి.'

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'ఎవని పుణ్యకర్మలను కీర్తించే శబ్దం స్వర్గాన్ని, భూమినీ స్పృశిస్తుందో ఆ శబ్దం వినిపించినంతకాలం అతడు పురుషు డనబడతాడు. **ప్రియాప్రియాలను సమంగా స్వీకరించేవాడు, సుఖదుఃఖాలనూ, భూతభవిష్యత్తులనూ సమానంగా భావించేవాడు అందరికంటే ధనికుడు.'****

(భూతవర్తమాన భవిష్యత్కాలాలకు సంబంధించి ఏవిధమైన కోరికలూ లేకుండా శాంతహృదయుడై ప్రసన్నుడై, నిత్యయోగిగా నున్నవాడు ధనవంతులందరిలో గొప్పవాడు)

యక్షు డిలా అన్నాడు. 'రాజా! పురుషు డంటే ఎవరో, సర్వధనవంతు డెవరో చక్కగా వివరించావు. నీ సోదరులలో ఒక్కడిని బ్రతికిస్తా. ఎవడు కావాలో కోరుకో.' యుధిష్ఠిర డిలా అన్నాడు. 'యక్షా! శ్యామవర్ణుడు, రక్తనేత్రుడు, మద్ధిచెట్టువలె ఉన్నతుడు, విశాలవక్షఃస్థలుడు, మహాబాహువు అయిన నకులుడిని బ్రతికించు.' యక్షు డిలా అన్నాడు. 'రాజా! నీకు భీముడంటే ఇష్టం. అర్జునుడు మీకు అండ. కానీ నీవు నీ సవతితల్లికి పుట్టిన నకులుని బ్రతికించమని ఎందుకు కోరుతున్నావు? పదివేల ఎనుగుల బలం గల భీమసేనుని విడిచి నకులుడు బ్రతకాలని ఎందుకు కోరుతున్నావు? ప్రజలందరూ నీకు భీమసేను డంటే ఇష్టమంటే నీవు ఏ కారణంగా సవతితల్లి కొడుకును – నకులుని –

---

* అహన్యహని భూతాని గచ్ఛంతీహ యమాలయమ్ ।
శేషాః స్థావరమిచ్ఛంతి కిమాశ్చర్యమతః పరమ్ ॥ 116

** తుల్యే ప్రియాప్రియే యస్య సుఖదుఃఖే తథైవ చ ।
అతీతానాగతే చోభే స నై సర్వధనీ నరః ॥ 121

బ్రతికించ మంటున్నావు? పాండవులందరూ అర్జునుని బాహుబలాన్ని ఆశ్రయించి ఉంటారు గదా! అటువంటి అర్జునుని వదలి నకులుని బ్రతికించమని ఎందుకు కోరుకొంటున్నావు?' యుధిష్ఠిరు డిలా అన్నాడు. **'ధర్మాన్ని చంపితే అది చంపుతుంది. ధర్మాన్ని రక్షిస్తే అది రక్షిస్తుంది. కాబట్టి ధర్మాన్ని వీడను. దెబ్బతిన్న ధర్మం మమ్ము దెబ్బతీయకూడదు.*** బాగా ఆలోచిస్తే ఆనృశంస్యం(కరుణ) పరమధర్మ మని నాకనిపిస్తోంది. ఆ కరుణను(సర్వసమదృష్టిని) ప్రదర్శిస్తున్నాను. యక్షా! నకులుని బ్రతికించు. ప్రజలంతా 'సదా ధర్మశీలుడైన రాజు' అని నన్ను అంటుంటారు స్వధర్మాన్ని వీడను. యక్షా! నకులుని బ్రతికించు నా తండ్రికి కుంతి, మాద్రి ఇద్దరూ భార్యలు. ఇద్దరి బిడ్డలూ బ్రతికి ఉండాలి అని నా ఆలోచన. నాకు కుంతి ఎంతో మాద్రి కూడా అంతే. ఏ తేడా లేదు. ఇద్దరు తల్లుల విషయంలో సమానత్వాన్ని కోరుతున్నాను · యక్షా! నకులుని బ్రతికించు.' యక్షు డిలా అన్నాడు. 'భరతర్షభా! నీవు అర్థకామాలకన్న ఆనృశంస్యాన్ని గొప్పగా భావించావు. కాబట్టి నీ సోదరుల నందరినీ బ్రతికిస్తాను.'

314. నలుగురిని బ్రతికించి యక్షుడు ధర్మరాజుకు వరమిచ్చుట.

అప్పుడు యక్షుడు పిలవగానే పాండవులంతా లేచారు. అందరి ఆకలిదప్పులూ క్షణంలో తొలగిపోయాయి. యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'ఓటమిలేకుండా ఒంటికాలిపై సరస్సులో నిలిచియున్న తమ రెవరు? యక్షులని నాకనిపించటం లేదు. అడుగుతున్నాను చెప్పండి. వసువులలో నొకరా? రుద్రులలో నొకరా? దేవతలలో నొక్కరా? లేక వజ్రధారు లయిన దేవేంద్రులా? ఈ నా సోదరులు లక్షలమందితో యుద్ధం చేయగలవారు. వీరిని పడగొట్టగల యోధుని ఇంతవరకు చూడలేదు. వీరి శరీరేంద్రియాలను చూస్తుంటే సుఖంగా నిదురించి, లేచి నట్లనిపిస్తోంది. మాకు తమరు మిత్రులా? లేక జనకులా?' యక్షు డిలా అన్నాడు. 'భరతర్షభా! ప్రచండపరాక్రమా! నాయనా! నేను నీ తండ్రిని యమధర్మరాజును. నిన్ను చూడాలనుకొని వచ్చాను. తెలిసికో. యశస్సు, సత్యం, దమం, శౌచం, ఆర్జవం, సిగ్గు, అచంచలత్వం, దానం, తపస్సు, బ్రహ్మచర్యం – ఇవన్నీ నా శరీరాలే. అహింస, సమత, ఆనృశంస్యం, అమత్సరం ఇవన్నీ నన్ను చేరటానికి ద్వారాలు. నీవంటే నాకెప్పుడూ ఇష్టం. నీవు శమ, దమ, ఉపరతి, తితిక్ష, సమాధానా (అయిదు) లయందు అనురక్తుడవు. ఆకలిదప్పులు, శోకమోహాలు, జరామృత్యువు (షట్పది)లను జయించావు ఈ ఆరింటిలో

* ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః ।
తస్మాద్ ధర్మం న త్యజామి మా నో ధర్మో హతోఽవధీత్ ॥ 128

మొదటిరెండు పుట్టుకతో వచ్చేవి. మధ్యవయస్సులో వచ్చేవి నడిమి రెండు. చరమావస్థలో వచ్చేవి చివరి రెండు. నేను ధర్ముడను. నీగురించి తెలిసికోవాలని ఇక్కడకు వచ్చాను. నీకు మేలు జరుగుతుంది. నీ సమదృష్టితో తుష్టి పొందాను. అనఘా! నీకు వరమిస్తాను. కోరుకో! నా భక్తులకు ఎవ్వరికీ దుర్గతి ఉండదు.'

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'ఒక బ్రాహ్మణుని అరణిని మంధనకాష్ఠాన్ని మృగం తీసికొనిపోయింది. ఆయనకు అగ్నిహోత్రలోపం లేకుండా చూడు. ఇదే నాకు మొదటివరం.' యక్షు డిలా అన్నాడు. కొంతేయా ! ఆ బ్రాహ్మణుని అరణిని, మంధనకాష్ఠాన్ని మృగరూపంలో నిన్ను పరీక్షించటానికై నేను తీసికొనిపోయాను.' 'అరణిమంధన కాష్ఠాలను ఇస్తాను. అమరోపమా! నీకు మేలు జరుగుతుంది. మరొకవరం కోరుకో' అని సమాధానమిచ్చాడు. యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'అరణ్యంలో పండ్రెండు సంవత్సరాలు గడచిపోయాయి. పదమూడవ సంవత్సరం అజ్ఞాతంగా గడపవలసియుంది. ఆ సమయంలో ఎక్కడా, ఏ మనుజులూ మమ్ము గుర్తించకూడదు.' అలాగే వర మిస్తానని ధర్ముడు సమాధాన మిచ్చాడు. సత్యవిక్రముడైన ధర్మరాజును ఇంకా ఇలా అనునయించాడు. 'భారతా! మీరు మీ రూపాలతోనే ఈ భూమిపై తిరుగుతున్నా మూడులోకాలలోని వారెవ్వరూ మిమ్ము గుర్తించలేరు. కురూద్వహులారా! ఈ పదమూడవ సంవత్సరాన్ని విరాటనగరంలో రహస్యంగా గడపండి. నా అనుగ్రహంవలన మిమ్మెవ్వరూ గుర్తించరు. మీ మీ మనస్సులలో మీరు ఏ రూపాన్ని సంకల్పించుకొంటే దానికి అనుగుణమైన రూపాన్ని స్వేచ్ఛగా ధరించగలరు. ఈ అరణి, మంధనకాష్ఠాలను బ్రాహ్మణున కివ్వండి. నిన్ను పరీక్షించటానికై నేను మృగరూపంలో వీటిని తెచ్చాను.

సౌమ్యా! నరశ్రేష్ఠా! నీకిష్టమైనవరం మరొకటి కోరుకో. ఇస్తా. నీకు ఎన్ని వరాలిచ్చినా తృప్తి కలగటం లేదు. కుమారా! మహారాజా! మూడవది సాటిలేని గొప్పవర మేదైనా కోరుకో. నీవు నా కుమారుడవు. విదురుడు నా అంశలో పుట్టినవాడు.' యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'తండ్రీ! సనాతనదేవాధిదేవుడవు, సాక్షాత్తుగా దర్శనమిచ్చావు. ఆనందంగా నీవు ఏ వరమిస్తే దానినే స్వీకరిస్తా. **ప్రభూ! నేను ఎల్లప్పుడూ లోభమోహాలను, క్రోధాన్ని జయించగలిగాలి. నా మనస్సు ఎప్పుడూ దానం మీదా, తపస్సు మీదా, సత్యం మీదా నిలవాలి.**' యమధర్మరాజు ఇలా అన్నాడు. 'పాండుకుమారా! నీకు ఈ లక్షణాలన్నీ స్వభావసిద్ధాలు. నీవు ధర్మస్వరూపుడవు. సరే నీవడిగినట్లే జరుగుతుంది.' ఆరీతిగా చెప్పి లోకరక్షకుడైన భగవంతుడు ధర్ముడు మాయమయ్యాడు. సుఖనిద్రతో అలసటను పోగొట్టుకొన్న మనస్సులు ఆ వీరపాండవులంతా కలిసి ఆశ్రమానికి వచ్చారు.

తాపసి అయిన బ్రాహ్మణునకు అరణిని, మంథనకాష్ఠాన్నీ ఇచ్చారు. ఇది భీమార్జున నకుల సహదేవుల పునర్జీవనానికి సంబంధించినది. తండ్రికీ, కొడుకుకూ కీర్తిని పెంచినది. దీనిని చదివినవాడు జితేంద్రియుడై, సంయమియై పుత్రపౌత్రాదులతో నూరుసంవత్సరాలు జీవిస్తాడు. ఈ చక్కని కథను గ్రహించిన వారికి అధర్మమందు కానీ, మిత్రభేదమందుకానీ, పరులసొమ్మును అపహరించటంలో పరస్త్రీగమనంలో కానీ, పిసినారితనంలో కానీ మనస్సు ప్రవర్తించదు.

315. ధౌమ్యోపదేశము : అజ్ఞాతవాస సమాలోచనము.

యమధర్మరాజు అనుమతిని పొంది సత్యపరాక్రము లయిన పాండవులు పదమూడవసంవత్సరంలో రహస్యంగా అజ్ఞాతవాసాన్ని గడపగోరి, ఒకచోట చేరి, దగ్గరగా కూర్చొని, ఆలోచించసాగారు. వారు విద్వాంసులు, వ్రతశీలురు. వనవాసంలో భక్తిభావంతో తమతోబాటు నివసించిన తాపసుల దగ్గర అజ్ఞాతవాసానికి అనుగుణంగా వీడ్కోలు తీసికొనదలచి ధృతవ్రతులూ, మహాత్ములూ అయిన పాండవులు చేతులు జోడించి, నిలిచి, ఇలా అన్నారు. 'ఇది మీకందరకూ తెలిసిన విషయమే. ధార్తరాష్ట్రులు వంచనతో మా రాజ్యాన్ని అపహరించటమే కాక మాపై చాలాసార్లు నీతిరహితంగా ప్రవర్తించారు. మేము పండ్రెండుసంవత్సరాలు కష్టపడుతూ వనవాసం చేశాం. ఇక మిగిలిన పదమూడవ సంవత్సరం అజ్ఞాతవాసం. కాబట్టి మేము అజ్ఞాతంగా నివసించాలి. అనుమతించండి. సుయోధనుడు, కర్ణుడు, శకుని దురాత్ములు. మాపై తీవ్రశత్రుత్వం కలవారు. మా ఉనికిని తెలిసికొనటంలో నిమగ్నులై గూఢచారులను కూడా నియమించారు. పౌరులతో తనవారితో కూడా విషమంగా ప్రవర్తిస్తారు. మేమంతా మరల బ్రాహ్మణులతో కలిసి మా దేశంలో, మా రాజ్యంలో సుప్రతిష్ఠల మయ్యేరోజు మాకు వస్తుందంటారా?' అని పలికి పవిత్రుడైన ధర్మసుతుడు యుధిష్ఠిరుడు దుఃఖశోకార్తుడై కంట తడిపెట్టి మూర్ఛిల్లాడు. బ్రాహ్మణు లందరూ ధర్మజుని సోదరులతో కలిసి ఆయనను ఊరడింపజేశాడు. అప్పుడు ధౌమ్యుడు ధర్మరాజుతో అర్థవంతమైన వచనాలను ఇలా పలికాడు.

'రాజా! నీవు విద్వాంసుడవు. సత్యసంధుడవు. మనస్సును, ఇంద్రియాలనూ అదుపులో నుంచుకొన్నవాడివి. ఇటువంటి మనుజులు ఏదో ఆపద వచ్చిందని మోహవశులు కారు. దేవతలకు కూడా ఎన్నో ఆపదలు వస్తాయి. చాలాసార్లు మహాత్ము లయిన ఆ దేవతలు శత్రువులను అణచటానికి అజ్ఞాతంగానే ఉన్నారు. దేవేంద్రుడు శత్రువులను అణచటానికై నిషధదేశానికి వెళ్ళి అక్కడ గిరిప్రస్థాశ్రమంలో అజ్ఞాతంగా ఉండి, తన పని ముగించుకొన్నాడు.

విష్ణుమూర్తి కూడా దైత్యసంహారార్థం హయగ్రీవుడై, అదితిగర్భంలో చాలాకాలం అజ్ఞాతంగా ఉన్నాడు. విష్ణువు బ్రాహ్మణవేషంలో వామనరూపాన్ని ధరించి, త్రివిక్రముడై బలిచక్రవర్తి రాజ్యాన్ని అపహరించిన విషయం నీకు తెలుసు. అగ్ని నీటిలో ప్రవేశించి, అక్కడే అజ్ఞాతంగా ఉండి, దేవతలకు కార్యసిద్ధిని కలిగించాడు. అదంతా నీవు విన్నావు గదా! ధర్మజ్ఞా! శత్రుదమనానికై విష్ణువు అజ్ఞాతంగా ఇంద్రుని వజ్రంలో ప్రవేశించి కార్యసిద్ధిని కలిగించిన విషయం నీవెరుగుదువు. నాయనా! అనఘా! బ్రహ్మర్షి అయిన ఔర్వుడు తల్లితొడలో అజ్ఞాతంగా నివసించి దేవకార్యాన్ని సాధించిన విషయం నీవెరుగుదువు. నాయనా! అదే రీతిగా ఉత్తమతేజస్వి అయిన సూర్యుడు కూడా రహస్యంగా భూమిలో ఉండి, శత్రువుల నందరినీ దహించివేశాడు. భీమపరాక్రముడైన విష్ణువు కూడా దశరథుని ఇంట అజ్ఞాతంగా నిలిచి యుద్ధంలో దశకంరుని చంపాడు. ఇదేవిధంగా మహాత్ము లెందరో అక్కడక్కడ అజ్ఞాతంగా ఉండి యుద్ధంలో శత్రువులను జయించారు. అదేవిధంగా నీవు కూడా గెలవగలవు.' ఆ రీతిగా ధౌమ్యుడు తగినమాటలతో ధర్మజుని ఆనందింపజేయగా యుధిష్ఠిరుడు శాస్త్రబుద్ధితో, స్వబుద్ధితో ఆలోచించి నిశ్చలంగా నిలిచాడు.

అప్పుడు మహాబలుడు, బలవంతులలో శ్రేష్ఠుడు, మహాబాహువు అయిన భీమసేనుడు తన మాటలతో యుధిష్ఠిరుని ఆనందాన్ని పెంపొందింపజేస్తూ ఇలా అన్నాడు. 'మహారాజా! గాండీవధారి అయిన అర్జునుడు నీ వలనా, తన ధర్మబుద్ధివలనా ఇప్పటివరకూ ఏ సాహసమూ చేయలేదు. శత్రువులను నాశనం చేయగల భీమపరాక్రములైన నకులసహదేవులను నేను నిత్యమూ నివారించాను. మమ్ములను నీవు నియోగిస్తే ఏ పనీ నవ్వులపాలు కాదు. వ్యూహమంతా నీవు చేయి. శత్రువులను గెలుస్తాం. భీమసేను డలా అనగానే బ్రాహ్మణులు పాండవులకు పరమాశీస్సుల నిచ్చి, అనుమతి పొంది, భరతవంశీయులైన వారిని వీడ్కొని తమ తమ ఇండ్లకు వెళ్ళారు. వేదవేత్తలూ, ముఖ్యులు, సన్యాసులు, మహర్షులు మరల పాండవులను చూడగోరుతూ తమ న్యాయసమ్మతమైన స్థానాలకు వెళ్ళి నిలిచారు. వీరులు, విద్వాంసు లయిన ఆ పంచపాండవులు ద్రౌపదితో, ధౌమ్యునితో కలిసి అక్కడనుండి లేచి ధనుర్ధారులై వెళ్ళిపోయారు. అక్కడనుండి క్రోసెడు దూరం నడచి, ఏదోకారణం చూపి, అక్కడ ఆగిపోయారు. మరునాడుదయం ఆ నరోత్తములు అజ్ఞాతవాసానికి సంసిద్ధులై ఆలోచనకు కూర్చున్నారు. వారంతా శాస్త్రవేత్తలు, మంత్రశాస్త్రవిశారదులు. సంధి, విగ్రహసమయాన్ని ఎరిగినవారు.

ఇది వనపర్వం

96355 No..

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా మెలగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుక్రింద తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.